

చైతన్య పాంచజన్యం





చైతన్య పాంచజన్యం





చైతన్య పాంచజన్యం

చైతన్య పాంచజన్యం
స్వామి సుందర చైతన్యానంద
ప్రథమ ముద్రణము: మే, 2002......... 5000 కాపీలు.

ప్రతులకు:
1. సుందర చైతన్యాశ్రమం
దుండిగల్ రోడ్,
హైదరాబాద్ - 500 043.
☎: 08418 - 55777
ఫాక్స్: 08418 - 55355

2. చైతన్య వానప్రస్థాశ్రమం,
ధవళేశ్వరం - 533 125.
☎: 0883 - 417378

3. సుందర చైతన్యాశ్రమం
శాంతిపురం,
విశాఖపట్టణం - 530 016.
☎: 0891 - 630176

టైప్ సెట్టింగ్: ప్రసాద్ } సుందర చైతన్యాశ్రమం,
ఫోటో డిజైనింగ్: రాఘువ } హైదరాబాద్
ముద్రణ: శ్రీ లక్ష్మీ గణపతి బైండింగ్ వర్క్స్, కొవ్వూరు.

స్వామి సుందర చైతన్యానంద

మనసైన మాట

ఎంత మందితో నాకు పరిచయాలు ఉన్నాయి; ఎవరెవరు నాకు తెలుసు అనే ఆలోచనల కన్నా, నాతో నాకు ఎంత వరకు పరిచయం? అనే ప్రశ్న వేసుకోగలిగితే, ఆ క్షణమే జీవితం ఒక అందమైన మలుపు తిరుగుతుంది. సదవగాహనకు మనస్సు సిద్ధ పడుతుంది. ఆ నిముషం నుండి బ్రతుకు సరళంగా, సజావుగా సాగుతుంది.

నేను ఒక్కణ్ణే. కాని, నాలో నేను తొంగి చూసినపుడు తెలుస్తుంది నేను ఒక్కడిగా లేనని. నాలో నేను ఇద్దరుగా ఉన్నానని. రెండుగా ఉన్నానని.

(1) నాలో వాంఛలు ఉన్నాయి; వ్యథలు ఉన్నాయి; బాధలు ఉన్నాయి; అపజయాలు ఉన్నాయి. గాయాలు ఉన్నాయి. చెప్పుకోలేని గాథ లున్నాయి. ఇలా నేను ఒకణ్ణి. ఇలా ఉండాలని ఎవరైనా ఎందుకు అనుకుంటారు? కాని అలా ఉన్నారు. మరోలా ఉండలేకపోతున్నారు అంటే, ఈ విధమైన జీవనము వెనుక బలమైన కారణా లున్నాయి. ధర్మా లున్నాయి. నియతి ఉంది.

నేను ఇలా ఉండటానికి ఏది కారణమో, నా జీవితం ఇలా ఉండటానికి ఏ నియతి కారణమో, అదే నా పరిసరాల్లో ఉంది. ప్రపంచంలో ఉంది. వ్యక్తులలో ఉంది. వారి ప్రవర్తనల లోనూ ఉంది.

ఆ సమయంలో అలా ప్రవర్తించకుండా ఉంటే బావుండేది. అక్కడ అలా చేసి ఉంటే బావుండేది అనే మాటలు పలికేది మనమే.

చేయకూడని దానిని ఎవరు చేయమన్నారు? చేయవలసిన దానిని ఆపమని చెప్పిం దెవరు? మానుకున్నది మనమే. పూనుకున్నదీ మనమే.

అంతా తెలిసే చేశాం. అప్పుడు మరోలా చేయటం, మరో విధంగా ఉండటం సాధ్య మయ్యేది కాదు అని ఇప్పుడు కూడా తెలుసుకోలేక పోతున్నాం.
చేయవలసింది ఎంతైనా ఉండవచ్చు. చేయగలిగిందే మనం చేయగలం. ఉండవలసినవే మన వద్ద ఉంటాయి. లేనివి రావచ్చు. మన కొరకు లేనివి రమ్మన్నా రావు.

పోయేందుకు వచ్చినవి ఉండమన్నా ఉండవు.
ఉండటానికి వచ్చినవి పొమ్మన్నా పోవు.
మనకు ఇష్టం లేనివి ఎన్నో మనం చేస్తున్నాము. ఇతరులు చేసే వాటిని ప్రశ్నించే హక్కు మనకు ఎక్కడుంది?
నా జీవితంలో అయినా,
పరుల జీవితంలో అయినా,
ప్రపంచంలో అయినా జరుగవలసినవియే జరుగుతున్నాయి. జరుగకూడనివి అయితే ఎందుకు జరుగుతాయి?

గతంలో ఇలాగే జరిగాయి.
వర్తమానంలో కూడా ఇదే రాగం.
భవిష్యత్తులో కూడా ఇదే పాట. ఇదే బాట.

ఇదే జీవితంలో ఘర్షణ. జీవిలో సంఘర్షణ.
మనిషిలో అంతా ఇంతేనా? బ్రతుకంతా బాధలేనా? నాలో ఇంకేమైనా ఉందా? ఉంది.
అదే ఆ రెండో నేను.

(2) నాలో తృప్తి ఉంది. విశ్రాంతి ఉంది. హాయి ఉంది. సాధించినవి ఉన్నాయి. ప్రేమ ఉంది. దయ ఉంది. సానుభూతి ఉంది. ఇలా నేను మరొకణ్ణి.

ఏదీ అవసరం లేనివాణ్ణి; ఎవరూ అవసరం లేనివాణ్ణి.

దేనినీ కాదనలేని వాణ్ణి; ఎవరినీ కాదనలేని వాణ్ణి.

సుఖాన్ని కోరనివాణ్ణి; సుఖమై ఉండేవాణ్ణి.

ఉండాలి అనుకోని వాణ్ణి; ఎప్పుడూ ఉండేవాణ్ణి.

అందగాణ్ణి కాను; అందంగా ఉంటాను.

మాటలు లేవు; మాట్లాడుతాను.

పాటలు రావు; పాడుతాను.

పోవాలి అనుకోను; ఉండాలి అని భావించను.
పోయినా ఉండేవాణ్ణే; పోకుండా ఉండేవాణ్ణే.

రమ్మని పిలవని వాణ్ణి; పొమ్మని చెప్పని వాణ్ణి.

అదిగా ఇదిగా ఉండనివాణ్ణి
ఏదోగా ఉండని వాణ్ణి
నేనుగా ఉండేవాణ్ణి.

చలికి చెలికాణ్ణి. వానకు నేస్తాన్ని. ఎండకు మిత్రుణ్ణి. కాలంతో కలసి తిరుగుతాను.
గాలితో చేతులు కలిపి షికారు కెళ్తాను. వెన్నెలను వాటేసుకొని ఊరేగుతాను.
ఇదే జీవితంలో సరళత్వం. జీవికి సమత్వం.
మనిషి తనలో తాను ఇలా లేడా? ఈ జీవన కళ తనకు లేదా? తనది కాదా? అవును.
తనదే. నీదే. నాదే. ఇదే ఆ రెండో నేను.
నీవు ఒక్కడివే.
ఎలా ఉంటావు రెండుగా?
రెండు ఉన్నా, ఉన్న దొక్కటే. నీవుగా ఉన్న దొక్కటే. అదేదో మనం తేల్చుకోవాలి.

నీవు, మొదటి నీవే అయితే, ఇక జీవితంలో కాంతి మిగలదు.
నీవు, రెండవ నీవే అయితే, ఇక జీవితంలో అశాంతి నిలవదు.
ఇది తేలాలి. అప్పుడే, బ్రతుకు తేలిక పడుతుంది. తేలిపోతుంది.
లేదా అమాంతం, ఆసాంతం మునిగిపోతుంది.

శనిని వలచి మునిగిపోవడమా?
మునిని తలచి తేలిపోవడమా? తరించిపోవడమా?
ఇదే నిర్ణయం కావాలి. ఇదే బుద్ధిలో స్పష్టత. బ్రతుకులో పరిష్కృత.

అందమైనవి
అమోఘమైనవి
అద్భుతమైనవి - ఎన్నో ఉన్నాయి ఈ ప్రపంచంలో.

వినీలాకాశము
పచ్చని పొలము
సాగర జలము - అందంగా ఉంటాయి.

వాల్మీకి కవిత్వం
నారదుని సంగీతం
విశ్వకర్మ నిర్మాణం - అమోఘంగా ఉంటాయి.

రవీంద్రుని గేయాలు
రవివర్మ చిత్రాలు
తిక్కన పద్యాలు
పోతన పలుకులు - అద్భుతంగా ఉంటాయి.

అన్నీ ఆకర్షణలే. అన్నీ అందాలే. ఆనందాలే. అద్భుతాలే.
అన్నిటికన్నా,
అందమైనది, ఆకర్షణీయమైనది, అద్భుతమైనది ఏదయినా ఒక్కటి చెప్పండి అని మీరెవరన్నా నన్ను అడిగితే,
"స్పష్టత" అని సమాధానం చెబుతాను.

స్పష్టత అంటే ఏ సంశయం లేకుండా ఉన్నది ఉన్నట్లు స్వచ్ఛంగా తెలియటం. అందుకేనేమో, "జ్ఞానానికి సమమైన పవిత్ర వస్తువు లేదు" అన్నది భగవద్గీత.

ఈ విషయంలో
మన శాస్త్రాలు విలక్షణంగా శోభిస్తాయి.
మన మహర్షులు వైభవంతో ప్రకాశిస్తారు.

బుద్ధిలో స్పష్టంగా వెలిగే జ్ఞానము హృదయంలో వెన్నెలను కాయిస్తుంది.
మనస్సులో మల్లెలను పూయిస్తుంది.

మనం ఏదో చేయాలని ప్రపంచానికి రాలేదు.
ఏదో కావాలని ప్రారబ్ధంతో కలసి వచ్చాము.

మనం ఏమీ కాలేకపోయామని, ఏదీ చేయలేకపోయా మని కాలం చూస్తూ కూర్చోదు. పరుగు లెత్తే కాలాన్ని మనం కూర్చోబెట్టలేము. మనం శాంతిలో పవ్వళించే దెలాగో అర్థం చేసుకోవాలి. పరమార్థాన్ని పొంది తరించాలి. అందుకే పుస్తకాలకు గుడి కట్టిన సుందర చైతన్యాశ్రమం మరీ మడి కట్టుకొని ఈ పుస్తకాన్ని ప్రపంచానికి సమర్పిస్తోంది.

"నిక్కమైన మంచి నీల మొక్కటి చాలు"

అన్నట్లు, ఈ ఒక్క పుస్తకం మస్తకంలో స్పష్టతను కలిగించి, నిష్ఠను పెంచుతుందని, బ్రహ్మనిష్ఠ వైపు మనిషిని త్రిప్పుతుందని ప్రగాఢంగా విశ్వసిస్తున్నాను. సంతోషంతో మీ చేతుల్లో పెడుతున్నాను. నేను శ్రమించినా, మీకు ఈ గ్రంథము శాంతాన్ని, విశ్రాంతాన్ని, ప్రశాంతాన్ని ప్రసాదిస్తుంది అనే భావన రాగానే శ్రమ కూడా ఆశ్రమ జీవనమంత హాయిగా ఉంది.

నిజం చెప్పాలంటే,
రచనలో నాకు ఏవేవో తెలిసి ఉండవచ్చు. కాని, శ్రమ మాత్రం ఎప్పుడూ తెలిసి రాలేదు.
నేను శ్రమించి ఉండొచ్చు. శ్రమ పడలేదు.
నాది రచన కాదు. నేను రచించలేదు.
నాది అర్చన. రచన నాకు అర్చన. అర్చనలో 'నేను' ఎలా ఉంటాను? నేనే లేను. ఇక శ్రమ ఎవరికి?
అర్చించటం అదృష్టం. అదృష్టఫలం.
పూజారి నేనే అయినా, ఆలయాన్ని కొందరు చిమ్ముతారు. కొందరు పూలుకోసి పెడతారు. కొందరు దీపారాధన చేస్తారు. కొందరు పూజలో ప్రత్యక్షంగా పాల్గొని తృప్తి చెందుతారు.

పూజా ఫలము నీకే ఉండనీ
పూజే ఫలముగ మాకు మిగలనీ

సలిలము నిండిన మా నయనాలలో
కదలక నీ రూపు మిగిలిపోనీ

అని, చైతన్య గానాన్ని పాడుకొంటూ తన్మయత్వం చెందుతారు.

ఇది చైతన్య పాంచజన్యం

'హరహర మహాదేవ' - అంటూ 'భంభం అని మ్రోగిన శంఖారావం.

ఆశ్రమం ప్రచురించిన ఎన్నో గ్రంథాలు రికార్డు స్థాయిలో పాఠకుల చేతుల్లోకి వెళ్ళాయి. ఎందరికో, ఎంతగానో స్ఫూర్తి నిచ్చాయి. తృప్తి నిచ్చాయి.

కాని, "చైతన్య పాంచజన్యం" గ్రంథం వేరు. ఈ గ్రంథం నాకే ఎనలేని తృప్తి నిచ్చింది.

దీపాన్ని దర్శించినంతగా తృప్తిపడ్డాను. ఎన్నో గ్రంథాలకు తల్లినైన నాకు ఈ గ్రంథం ముద్దుబిడ్డ అయింది.

ఈ గ్రంథం పాఠకులకు ఎనలేని స్ఫూర్తిని ఇస్తుందని భావిస్తున్నాను.

ముముక్షువులకు అమృతపానం లాంటిదని నా అభిప్రాయం.

ఎక్కువ పుటలున్న ఈ గ్రంథం తక్కువ కాలంలో వెలువడింది. సమయం అట్టే లేదు. అయినా సుందరంగా తయారైంది. శారదా మందిరంగా కళకళలాడింది.

ఈ పవిత్ర కార్యంలో ఎందరో తమ వంతు సేవలను అందించి పుణ్యాన్ని చేదుకున్నారు.

ఆశ్రమవాసులు, సత్సంగ్ సభ్యులు కంప్యూటర్ టైప్ సెట్టింగ్‌లోను, ఫోటో డిజైనింగ్, ప్రూఫ్ రీడింగ్ తదితర సేవలలో తృప్తి చెందారు.

ఒకటిన్నర దశాబ్దంగా ఆశ్రమ గ్రంథాలను ముద్రిస్తున్న శ్రీ లక్ష్మీ గణపతి ప్రింటింగ్ ప్రెస్ యజమాని చి॥ నాగబాబు ఎంతో శ్రద్ధ తీసుకొని సర్వాంగ సుందరంగా ముద్రించాడు.

అందరికీ నా మనసైన ఆశీస్సులు.

ముఖ్యంగా,


మా సుకన్యా రెడ్డి. మనుగడ అమెరికాలో అయినా, మనస్సును ఆశ్రమంలోనే ఉంచుకొని, నిరంతర సాధనలో బ్రతుకును భవ్యంగా మలచుకొంటున్న పుణ్యజీవి. భక్తి ప్రేమలతో, ఆశ్రమ సేవలకు డా॥ సుకన్యా రెడ్డి (చికాగో) ఉదారంగా పంపిన విరాళాన్ని ఈ గ్రంథ ముద్రణకు ఉపయోగిస్తూ ఆమెను మనసారా ఆశీర్వదిస్తున్నాను.

ఇక చివరగా,

స్పష్టతకు ప్రతిరూపంగా శోభిస్తూ, పరమాత్మ ప్రసాదంగా అందిన ఈ గ్రంథము ముముక్షువులకు సుస్పష్టంగా అర్థమయ్యేలా ఆశీర్వదించమని మురళీకృష్ణ స్వామిని వేడుకొంటున్నాను.

ఆశ్రమం,
హైదరాబాద్,
2-5-2002.

ఓం స్వామి సుందర చైతన్యానంద



చైతన్య పాంచజన్యం



శ్రీ శంకరాచార్య స్వామి ఏ ధర్మం కొరకు పాటుపడ్డారో సుందర చైతన్యానంద స్వామి కూడా ఆ ధర్మం కొరకే శ్రమిస్తున్నారు. శంకర సిద్ధాంతాన్ని, వేదాంత వైభవాన్ని విని పించేందుకు కంకణం కట్టుకున్నారు. మా పీఠము తరపున వారికి "సత్సంగ ప్రచారమణి" అనే బిరుదును ఇచ్చాము.

స్వామి జయేంద్ర సరస్వతి
కంచి కామకోటి పీఠాధిపతులు



భగీరథుడు ఆకాశగంగను భూలోకంలో ప్రవహింప చేసినట్లు, శ్రీ సుందర చైతన్యానంద స్వామి అపర భగీరథులై వారు వెళ్ళిన చోటల్లా జ్ఞానగంగను ప్రవహింప చేశారు. సంసార జీవన యాత్రలో విసిగి వేసారిన మానవ హృదయాలపై భక్తి అనెడి అమృతాన్ని చిందింప చేసి వారిని కడతేర్చిన మహానుభావులు శ్రీ సుందర చైతన్యానందుల వారు. ఒక మహాసభలో వారికి "జ్ఞానబ్రహ్మ" ప్రశస్తిని మేమే ఇచ్చినాము.

స్వామి విశ్వేశ తీర్థులు
పెజావరు పీఠాధిపతులు



సుందర చైతన్యానంద స్వామి అఖండత, ఆధ్యాత్మికత మేళవించిన పవిత్రమూర్తి. మన ప్రతిభావంతులలో ఒకరు. ప్రజలను ఆత్మజ్ఞానము వైపు, శాంతి వైపు నడిపిస్తున్నారు. సనాతన ధర్మానికి అద్భుతమైన సేవలందించారు.

స్వామి శుద్ధానంద భారతి
యోగ సమాజ్ స్థాపకులు

విషయ సూచిక

దైవ దర్శనం

జ్ఞాన ప్రదీపము

సాధన సౌరభం

భక్తి వైభవము

ప్రార్థనా ప్రసూనాలు

కర్మయోగము - ధర్మ జీవనము

అనివార్యములు - అవగాహనలు

విలువలు - వెలుగులు

బాధలు - బోధలు

సాధు జీవనం

ధ్యాన దీపం

శాస్త్ర దర్పణం

ఇతిహాసములు- పురాణములు

రామాయణము

మహా భారతం

శ్రీమద్భాగవతము

ప్రస్థానత్రయము

ఉపనిషత్తులు - శ్రుతిప్రస్థానము

శ్రీమద్భగవద్గీత - స్మృతిప్రస్థానము

బ్రహ్మ సూత్రములు - న్యాయప్రస్థానము

భావ సుమాలు




స్వామి సన్నిధిలో సుకన్య (చికాగో)





జీవితము - వేదాంతము

ఇందులో...



జీవితము - వేదాంతము

శ్రీకారం

ఉన్నదానిని లేనిచోట వెతకటంలో ఉత్సాహం ఎవ్వరికీ ఉండదు. అలా వెతకటమే వేడుకగా, వాడుకగా మారితే, ఎవ్వరికైనా నిరుత్సాహం తప్పదు. నిరుత్సాహంలోదించే ఉత్సాహ పల్లకీలో ఎవరైనా ఎంతకాలం ఊరేగుతారు?

"నాకు ఏవో ఏవో ఉన్నాయి; ఉండవలసింది లేదు"; అనేదే అందరిలో ఉంది. ఈ విషయం స్పష్టంగా అందరికీ అర్థం కాకపోయినా, అస్పష్టంగా నైనా ఈ అనుభవం అందరిలో ఉంది. అందరికీ ఉంది. వెలుగుకు దగ్గర కాలేక, వెలితిని దూరం చేసుకోలేక ప్రతి ఒక్కరు గుండె భారంతో జీవితాన్ని సాగిస్తూ ఉన్నారు.

కిం అస్మాభిః దీనైః కరణీయం?

"ఈ దీన స్థితి నుండి బయట పడేందుకు మేము ఏమి చేయాలి?" అని అందరూ ఆవేదన చెందుతూ ఉన్నారు.

ఎందుకని మనిషి ఇలా ఆలోచిస్తూ ఉన్నాడు? 'ఇలా' ఉండటం ఇష్టం లేకనే కదూ అలా ఉండాలి అనుకోవటం. అలా ఉండటం "ఇల"లో సాధ్యమా?

సాధ్యం కానపుడు, ఆశించింది సాధించ లేనపుడు మిగిలింది నిరాశే కదూ? నిరాశలో ఎంత కాలం నిలబడగలం? ఎంత దూరం నడువగలం? దేనిని పట్టుకొని జీవించగలం?

జీవించలేము. అలాగని జీవించకుండా ఉండలేము. మరణించటం ఎవరికీ ఇష్టం లేదు. చావును ఎవ్వరూ ఇష్టపడరు. "జీవించడ మెందుకు?" అని ప్రశ్నించే వాళ్ళను చూస్తామే గాని, "ఎందుకు మరణించలేము?" అని ఆలోచించే వారిని చూడ లేము.

కిం నో రాజ్యేన గోవింద! కిం భోగైః జీవితేన వా!

"రాజ్యముతో మాకు ఏం ప్రయోజనం? భోగములతో ఏమి లాభం? అసలు జీవించి ఏమి ఉపయోగం?" అని ప్రశ్నించాడు శ్రీకృష్ణుని అర్జునుడు.

జీవించట మెందుకు అంటాడే గాని, మరణిస్తే పోలేదా? అని అనుకోడు ఎందుకని? అదే విచిత్రం. జీవితంలో సుఖం లేకపోయినా జీవించాలనే ఆశ ఉంది. ఇదే జీవితంపై ఆశ. ప్రేమ. ఈ ప్రేమకు పూర్ణత్వ మెక్కడో మనిషికి తెలియాలి. అప్పుడే జీవికి తృప్తి. జీవితంలో సంతృప్తి.

తృప్తః భవిష్యామి

"నేను తృప్తుడ నవుతాను. తృప్తి చెందుతాను" అనే సంకల్పంతోనే మనిషి ఈ ప్రపంచంలో కర్మలు ఆచరిస్తూ ఉన్నాడు.

"తృప్తి చెందుతాను" అంటున్నా డంటే, ప్రస్తుతం అసంతృప్తిలో ఉన్నాడని అర్థము. ఈ అసంతృప్తియే తృప్తిని పొందాలి అనే ఆలోచనకు, అన్వేషణకు పునాది.

వెలుగు ఎక్కడ? వెలితే ఎక్కడైనా!

ఎవరిని ఎవరూ తృప్తి పరచలేని జగత్తులో జల్లెడ చేత పట్టుకొని మనం తిరుగుతూ ఉన్నాం. ఎవరు లేకపోయినా వెలితే. ఎవరు ఉన్నా వెలితే. ఏది లేకపోయినా వెలితే. ఏది ఉన్నా వెలితే. పోవాలి అనుకున్న చోటికి పోయినా వెలితే. పోకపోయినా వెలితే. ఫిర్యాదులు ఎదురుకాని పరిస్థితులే లేవు. అభియోగాలు అడ్డగించని మనుషులే లేరు. అన్నీ అవరోధాలే. అందరివీ అగచాట్లే.

వేసవి నిండార వెలుగుల్ని ఆరబోయవచ్చు. ఆంతర్యం మనిషిని ఉడకబెట్టి ఉతికేసింది అనే సత్యాన్ని కాదనగలమా? లేకపోతే, "అబ్బ! మండించే ఈ ఎండల కన్నా వర్షాకాలమే నయం"; అని మనిషి ఎందు కంటాడు?

వేసవి కాలంలో వెలితి ఉంది కనుక వర్షాకాలం మనస్సులో వెలుగుతుంది. వర్షా కాలం వస్తే, అప్పుడు వెలుగు ఎలాగూ ఉండదు కనుక, "ఉడికించినా వేసవి కాలమే నయం. వానల్లో సంపాదించలేము, మంచం మీద నుండి కాళ్ళు దించలేము" అంటాడు మనిషి. ఇంతకీ ఏ కాలంలో సుఖపడేది? పోయే కాలమా? ఉన్నది సుఖపెట్టలేనపుడు పోయేది తరిగించే దేముంటుంది? ఒరిగించే దేముంటుంది? పోయేది ఏదైనా కరిగించేందుకే.

ఋతువులే కాదు; వాతావరణమే కాదు; వ్యక్తులే కాదు; వస్తువులే కాదు; విషయాలే కాదు; ఏవీ జీవితంలో సదా అనుకూలంగా ఉండవు. నేడు ఉండినా, రేపు ఉంటాయని చెప్పలేము. ఎందుకని? నిన్న అనుకూలంగా లేనివే నేడు అనుకూలంగా ఉన్నాయి కనుక, నేడు అనుకూలంగా ఉన్నవి రేపు ప్రతికూలమైనా ఆశ్చర్యం లేదు. అన్నీ మారుతూ ఉంటాయి. వాటితో పాటు మనస్సు కూడా మారుతూ ఉంటే, ఇక సుఖ మెలా ఉంటుంది? తృప్తి ఎలా వస్తుంది?

పెళ్ళితో తృప్తి చెందుతాము అనుకుంటారు. జీవిత భాగస్వామి లేదా భాగస్వామిని బాగుండాలి, అందంగా ఉండాలి అనుకుంటారు. అన్వేషణ ఆరంభం. ఎక్కిన బస్సు, దిగిన బస్సు - ఎట్టకేలకు కొలంబస్‌లై ఒక దశలో 'బస్' - చాలు, అని తృప్తి పడినట్లే కనిపిస్తారు. మూడు ముళ్ళు పడతాయి. ఇంకేమి? మళ్ళీ మామూలే. మూడు ముళ్ళు పడినా ముప్పు తిప్పలు తప్పటం లేదు. "బ్రతుకులో అందమే ముఖ్యం కాదు - ఆనందం కూడా కావాలి" అని ఒక సందేశాన్ని వినిపిస్తారు. ఇవన్నీ అసంతృప్తి ఆదేశాలే.

ఇల్లు అనుకూలం కాదని కొందరు, ఇల్లాలు అనుకూలం కాదని మరి కొందరు, భర్త అనుకూలం కాదని ఇంక కొందరు, బంధువులు కొందరికి భారాలు, కొందరికి మిత్రులు మ్రింగుడు పడరు, ఉద్యోగం కొందరికి రుచించదు, ఉద్యోగం రుచించినా కొందరికి ఆదాయం రుచించదు; కొందరికి కన్నవారు గిట్టరు, కొందరికి తాము కన్న వారు పట్టరు, కొందరికి ప్రదేశాలు నచ్చవు, కొందరికి తమ శరీరాలే తమకు నచ్చవు. చెంప అందంగా లేదని కొందరు, చెవి అందంగా లేదని కొందరు, పళ్ళు బాగలేవని కొందరు, పలుకు బాగలేదని కొందరు - అన్నీ బాగుండే దెవరికి? అంతా బాగుండే దెప్పుడు? ఇక మన బ్రతుకుల్లో బాగేమిటి? వెలుగెక్కడ? వెలితి లేని దెక్కడ?

మనస్సు ఎన్నో తెలుసుకోవాలని ఉంటుంది. ఏదీ తెలిసి రాదు. అవకాశా లుండవు. వసతు లుండవు. వనరు లుండవు. కాలం అనుకూలించదు. తెలిసినవి తృప్తి నివ్వవు. తెలియనివి తృప్తి నివ్వవు. తెలిసీ తెలియనివి ఇక తృప్తి నెలా ఇస్తాయి?

ఆర్థికంగా ఇబ్బందు లున్నాయి. వ్యాపారంలో నష్ట మొచ్చింది. లేదా ఆశించి నంతగా లాభం రాలేదు. ఒకవేళ వచ్చింది అనుకుందాం. నాతో పాటు నా ప్రక్క ఇంటి వారికి కూడా లాభ మొచ్చింది. ఏం చేద్దాం? ఇవి కూడా అసంతృప్తిని పెనవేస్తే ఇక తృప్తికి అర్థ మెక్కడుంది?

పంటలు పాడయ్యాయి. ఆరోగ్యం చెడింది. పరిసరాలు బాగలేవు. కొడుకులు చెప్పిన మాట వినడం లేదు. కొడుకులు వింటారు గాని కోడళ్ళు విననివ్వరు - ఈ విధమైన ఆలోచనలు తృప్తిని మిగిల్చే దెపుడు?

ఈ అసంతృప్తికి ఆర్థిక ఇబ్బందులే కారణ మని భావించిన వారు ఆర్థిక పరిస్థితిని చక్కబరచు కొనేందుకు ప్రయత్నిస్తారు. పరిస్థితులు చక్కబడితే చక్కబడవచ్చు కాని వారు మాత్రం చక్కబడరు. బ్రతుకులో చుక్కెదురును తప్పించుకోలేరు.

ఇతరుల ప్రవర్తనే మన అసంతృప్తికి కారణ మని భావించేవారు కుటుంబాన్ని, సమాజాన్ని సరిచేసే ప్రయత్నంలో తలమునక లవుతారు. తమ అసంతృప్తికి కుటుంబ వ్యవస్థే కారణ మని కొందరు భావిస్తే, సామాజిక వ్యవస్థే కారణ మని మరి కొందరు భావిస్తారు. సంసారాన్ని, సమాజాన్ని సదా నిందించే వారు ఇలాంటి వారే.

నోరు తెరిస్తే చాలు. "ఈ సమాజం బాగుపడదు" అనే ఊత పలుకును పలుకుతూ ఉంటారు. బాగుపడని వారు తామే నని గ్రహించలేరు. కనుకనే, తాము చెడినా సమాజాన్ని బాగు చేయాలని నడుము బిగించి నడి సముద్రంలో దూకుతూ ఉంటారు.

ప్రయత్నాలు - ఫలితాలు

ప్రయత్నించి లేని దానిని మనం పొందుతాము. లేనిది పొందుతామే గాని, 'లేదు' అనే దానిని పోగొట్టుకోలేము. లేనిది వచ్చినా, మరొక టేదో లేదు అనేది స్ఫురితికి వస్తూనే ఉంది. 'లేదు' అనేది మనస్సులో ఉన్నప్పుడు ఏది ఉండి ఏమి ప్రయోజనం?

కొందరికి కొన్ని ఉండవచ్చు. మరి కొందరికి అవి లేకపోవచ్చు. ఏది ఉంది - ఏది లేదు అనే విషయంలో మనిషికి మనిషికి తేడా ఉండవచ్చు. కాని, అసంతృప్తి విషయంలో అందరూ ఒక్కటే.

మన ప్రయత్నంలో ఏదైనా రావచ్చు. సుఖం మాత్రం రాదు. ఏదైనా పోవచ్చు. దుఃఖం మాత్రం పోదు.

దుఃఖాలు తెలియని సుఖాలు ప్రపంచంలో లేవు. నష్టాలు తెలియని లాభాలు కాగడా పెట్టి వెతికినా కనిపించవు. ఇంతెందుకు? ఒక్క మాటలో చెప్పాలంటే జీవితంలో అన్నీ నష్టాలే నేమో? అన్నీ పోగొట్టుకోవడమే నేమో! ఈ ప్రపంచంలో రాబట్టుకొనే వన్నీ పోగొట్టుకొనేందుకే నేమో!

జన్మ నిచ్చిన తల్లిదండ్రుల్ని పోగొట్టు కొంటున్నాము. కొందరు భార్యలు భర్తలను పోగొట్టుకొంటూ ఉంటే, కొందరు భర్తలు భార్యల్ని పోగొట్టు కొంటున్నారు. తల్లిదండ్రులు బిడ్డల్ని పోగొట్టు కొంటున్నారు. కొందరికి ఉద్యోగాలు ఊడిపోతున్నాయి. కొందరికి పదవులు పారిపోతున్నాయి. ధనం పోతూ ఉంది. ఆరోగ్యం పోతూ ఉంది. వెంట్రుకలు రాలిపోతున్నాయి. పళ్ళు ఊడిపోతున్నాయి. చూపు జారిపోతోంది. ఆయుషు కారి పోతోంది. ఇవన్నీ ఏమిటి? నష్టాలు కావా? ఇవే కదా ఒకనాటి లాభాలు?

ఉన్నవి సుఖాలు అయితే, అవి ఉన్నప్పుడు మనం సుఖంగా ఉండాలి. పోయినవి దుఃఖాలు అయితే, అవి పోగానే దుఃఖం కూడా పోవాలి. అలా జరగటం లేదు.

దేనిని పొందా లనుకున్నా శ్రమించాలి. పరిశ్రమించాలి. ప్రయత్నించకపోతే ఏదీ రాదు; చావు తప్ప. ఇష్టమైన వాటిని పొందాలని శ్రమిస్తాం. ఇష్టం లేని వాటిని పోగొట్టుకొనేందుకు పరిశ్రమిస్తాం.

పొందాలి అనుకున్న వాటిని శ్రమించి పొందవచ్చు. కాని, వాటిని పోగొట్టుకోకుండా నిలుపుకోలేము. పొందటం ఎంత కష్టమో నిలబెట్టుకోవటం అంత కన్నా కష్టం. పోగొట్టు కోవటం సులభం.

మన కున్న వన్నీ ఉన్నాయి అనుకుంటామే గాని, పోయేందుకే ఉన్నాయని గ్రహించలేము. ఆరోగ్యం ఉంది. రోజురోజుకు తగ్గిపోతూ ఉంది బావిలో నీళ్ళలాగ. ఆయుషు ఉంది. అయినా క్షణక్షణానికి కారిపోతూ ఉంది వర్షించే మేఘం లాగ; చిల్లి కుండలో నీరులాగా **(భిన్న కుంభోదకవత్).**

ఇష్టం లేని వాటిని దూరం చేసుకుంటాం. అయినా దగ్గరవుతూనే ఉంటాయి. కత్తిరిస్తున్నా జుట్టు పెరుగుతూనే ఉంటుంది. స్నానంతో మురికిని దూరం చేసుకుంటున్నా, తిరిగి దేహం మలినపడుతూనే ఉంటుంది. కలుపు తీస్తున్నా వస్తూనే ఉంటుంది.

ఇరవై సంవత్సరాలుగా మనం పెంచి పెద్ద చేసిన చెట్టు రెండు నిముషాల్లో గాలి వానకు ఊగి కూలిపోతుంది. కొన్ని సంవత్సరాలు ప్రాణతుల్యంగా చేసిన స్నేహం అపార్థాల కారణంగా క్షణంలో పాడైపోతుంది. శత వసంతాలు జీవించినా శ్మశానంలో కాయం కాలడానికి క్షణ కాలం పట్టదు.

స్వప్రయత్నాలు విఫలం

పరుల ప్రయత్నాలు సఫలమా?

మన ప్రయత్నాలతో మనం తృప్తి చెందలే మని అర్థమైపోయింది. పరుల ప్రయత్నాలతో సుఖించగలమా? తృప్తి లేని మనల్ని అన్యులు తృప్తి పరచగలరా?

ఇతరులు మనల్ని సుఖపెట్టగలరా? అంటే, వాళ్ళు సుఖంగా ఉన్నారా? సుఖ పెడితే ఎంత కాలం సుఖపెట్టగలరు? వారే ఎంతో కాలం ఉండరు. మనల్ని ఎంత కాలం సుఖంలో ఉంచుతారు?

ఉన్నంత కాలం సుఖపెడతారు అనుకుందాం. ఎంతవరకు సుఖపెట్ట గలరు? వారు పెట్టగలిగినంత వరకా? నేను పట్టగలిగినంత వరకా? ఆ పెట్టడం ఎంత చక్కగా? అందించ గలిగింది అందించటమా? ఆశించ గలిగింది అందించటమా?

మంచి భర్త మంచిగా చూసుకోవచ్చు. మంచి మంచి వస్తువులు కొనిపెట్టలేక పోవచ్చు. సౌకర్యాలను కల్పించేవారు సుఖపెట్టలేక పోవచ్చు.

మనం సుఖ పడట మనేది పరులపై కనుక ఆధారపడి ఉండేట ట్లయితే, మన సుఖాన్ని నిర్ణయించేవారు ఇతరులు అవుతారు. ఇదే నిజమైతే, మన సుఖం మాకుల నీడయే అవుతుంది.

మనం తెలివిగల వాళ్ళం కావచ్చు. మనకు వివేకం ఉండవచ్చు. ఎవరు ఏది తెలుసుకున్నా, ఎంత తెలుసుకున్నా, జీవితంలోనే తెలుసుకున్నాం. జీవిస్తూనే తెలుసు కున్నాం. తెలుసుకుంటున్నాం.

ఇంతకీ, జీవితం మనకు నేర్పిం దేమిటి? ఒకరు మరొకర్ని సుఖపెట్ట లేరని, ఒక వస్తువు సదా సుఖాన్ని పంచలేదని, ఒక పరిస్థితి సదా మనల్ని ఆనందంగా ఉంచలేదని. దీనికి ఋజు వేమిటి? మన జీవితమే. ఇదే ఇంతవరకు మనం గ్రహించింది.

అభీష్టం - ఆంతర్యం

ఏదో చేయాలి అనేది మనిషి అభిమతం కాదు. ఏదో పొందాలి అనేది మనిషి అభీష్టం. పొందవలసింది, పొందదగింది ఏదో జీవితంలో తెలియకపోతే, ఆ తరువాత ఏదో ఏదో చేయటం, ఏదో ఏదో పొందటం, పొందినది పొందవలసినది కాదని, పొంద వలసిన దానిని పొందలేకపోయా మని నైరాశ్యంతో కుమిలిపోవటమే జరుగుతుంది.

తక్కువగా చేసి ఎక్కువగా రమ్మంటే రాదు. అల్పజ్ఞానంతో అనంతసుఖం రాదు. మేధస్సు అయితే అందరికీ కొద్దో, గొప్పో ఉంది. అది సరిపోదు. జ్ఞానం అంతో,

ఇంతో అయితే, ఫలం ఎంతో అంత వస్తుంది. అనుకున్నంత రాదు. ఒకవేళ అనుకున్నంత వస్తే రావచ్చు. అది అనంతం కాలేదు.

అన్తవత్తు ఫలం తేషాం తద్భవ త్యల్ప మేధసామ్

"వివేకం ఎవరికి అల్పంగా ఉంటుందో వారు పొందే ఫలం కూడా అల్పంగానే ఉంటుంది".

మన ప్రయత్నాల ద్వారా పొందే ఫలాలన్నీ అల్పంగానే ఉంటాయి. ఒక కాలంలో లభించింది మరొక కాలంలో లభించక, ఒక ప్రదేశంలో లభించింది మరొక ప్రదేశంలో లభించక, పరిమితంగా ఉండి నశిస్తూ ఉంటాయి. ఇలాంటి ఫలితాలే ప్రపంచంలో ఉన్నాయి. కనుక మనం ఆశించే అనంత ఫలం ప్రయత్నాల వలలో చిక్కదు. ఈ కారణంగా ఆంతర్యంలోని అసంతృప్తి దూరం కాదు.

అసంతృప్తి రెండు కోణాల్లో నుంచి తొంగి చూస్తోంది. **(1)** కోరింది లభించటము వలన **(2)** కోరింది లభించకపోవటం వలన. ఏ మనసైనా, ఎవరి మనసైనా రాగద్వేషాలు కొట్టే దెబ్బలతో గాయపడి ఉంటుంది. పచ్చి పుండుగా మారే ఉంటుంది. పుండుపై కారం చల్లితే మండుతుంది. వెన్న రాస్తే చల్లగా ఉంటుంది. అందుకే అది మనిషికి ఇష్టం. కారం చల్లించుకోవటం బాధ కనుక అయిష్టం.

అందుకనే, ప్రతి మనిషికి ఇష్టమైనది జరిగితే ప్రియంగా ఉంటుంది. అయిష్ట మైనది అప్రియంగా ఉంటుంది. ఇవే సుఖదుఃఖాలు. నీరు గుంటల్లో నిలిచినట్లు సుఖ దుఃఖాలు మనస్సులో నిలుస్తాయి.

ఎవరినైనా మనం ద్వేషిస్తున్నాము లేదా అసహ్యించు కుంటున్నాము అంటే, అతని వల్ల లేదా ఆమె వల్ల మనం గాయపడి ఉంటాము. మనస్సుకు గాయాలు తప్పవు. మనిషికి బాధలు తప్పవు.

మనస్సుకు గాయాలు కావచ్చు. లేదా, తాయాలు దొరకవచ్చు. అలాంటి సమయాల్లో మనస్సు పొంగిపోవచ్చు. లేదా, కృంగిపోవచ్చు. కాని, ఇక్కడ మనకు అర్థం కావలసింది ఒక్కటే. హర్ష శోకాలలో స్పందించేది మనస్సు కాదు. మనస్సును అంటిపెట్టుకున్న నీవు. మనస్సు కేవలం ఒక పరికరం. జడం.

ప్రియమైన వస్తువులో సుఖం ఉంటుంది. మనకు ఏది ప్రియ వస్తువో మనకే తెలియదు. ఒక కాలంలో ప్రియమైనది మరొక కాలంలో ప్రియం కాదు. ఒక ప్రదేశంలో ఇష్టమైనది మరొక ప్రదేశంలో ఇష్ట ముండదు.

పోనీ, ఒకప్పుడు ఒకచోట ఉంది కదా! అంటే, అది కూడా అందరికీ ప్రియంగా లేదు. ప్రియమైన దానిలో అప్రియం ఉండదు. మనకు ఏది ప్రియమో, ఏది అప్రియమో చెప్పలేక పోయినా మనకు మనం ఎప్పుడూ అప్రియంగా లేము. **(కదాచి న్నాహం అప్రియః)**. నేను సదా నాకు ప్రియమే. ఏదైనా నాకు ప్రియంగా గోచరించింది అంటే ప్రియ కారణం నేనే అయి ఉంటాను. **(ఆత్మనస్తు కామాయ సర్వం ప్రియం భవతి).** ఇది అర్థమైతే ఇంకెక్కడి అసంతృప్తి? అర్థం కాకపోతే ఎలా వస్తుంది తృప్తి?

ఈ జ్ఞానం వస్తే తృప్తి చెందాలి అని గాక తానే తృప్తి అని అర్థమవుతుంది. తృప్తికి బాహ్య పరిస్థితులు అనుకూలించ నవసరం లేదని తెలుస్తుంది. మనస్సులో ఏది నడిచినా దాని ప్రభావం తనపై ఉండదు.

సుఖాన్నిచ్చేవి హితం కాకపోవచ్చు. అందుకనే, ఒకరు నచ్చింది మరొకరు మెచ్చరు. హితమైనది అందరికీ సుఖాన్నిస్తుంది. ఆనందాన్నిస్తుంది.

సుఖ మున్న చోట దుఃఖం లేకపోవచ్చు. కాని, శాంతి ఉంటుందని చెప్పలేము. శాంతి లేని వారికి సుఖమెలా ఉంటుంది? **(అశాంతస్య కుతః సుఖమ్?)** కాని, శాంతి ఉన్నచోట మాత్రం సుఖం ఉండి తీరుతుంది. తానే శాంతి అని తెలిసినవానికి అసంతృప్తి ఉండదు.

మనస్సుకు గాయాలు ఉండొచ్చు. తనకు గాయాలు ఉండవు. మనస్సుకు సుఖాలు ఉండవచ్చు. తనకు లేవు. తానే సుఖ స్వరూపుడు. తన సుఖం తనపై ఆధారపడి లేదని తనకు తెలుసు.

ఏది ఎలా ఉన్నా, ఎవరు ఎలా ఉన్నా తనలో మార్పు ఉండదు. అతని వైభవంలో అందరూ ఇమిడి పోతారు. తనను తాను పొంద నవసరం లేదు. తనకు సంబంధించిన జ్ఞానాన్ని పొందాలి. ఇదే ఆత్మజ్ఞానం. ఆత్మ నీవే.

నీవే ఆత్మ అని తెలియక ఆత్మను తెలుసుకోవాలి అంటున్నావు. ఆత్మ ఆనంద స్వరూపము. నీవూ ఆనందాన్నే ఆశిస్తున్నావు. ఆత్మ ఆనంద స్వరూప మైనపుడు నీవూ ఆనంద మయ్యే ఉన్నావు. తెలియక ఆనందం కావాలనుకుంటున్నావు. కాని, వాస్తవానికి అది నీవు అయ్యే ఉన్నావు. ఇది తెలియటమే జ్ఞానం.

జ్ఞాన జ్యోతి

తేజం తిమిరాన్ని తరుముతుంది. జ్ఞానం అజ్ఞానాన్ని అదృశ్యం చేస్తుంది. రాత్రంతా రాజ్య మేలిన చీకటిని సూర్యోదయం తరిమేసింది. ఇది విశ్వంలో జరుగు తుంది. బుద్ధిలోని అజ్ఞానాన్ని జ్ఞానం అదృశ్యం చేస్తుంది. ఇది వ్యక్తిలో జరుగుతుంది.

ఇంటిలోకి ప్రవేశించిన కుక్కను మనం తరుముతాం. అందుకనే "నేను కుక్కను తరిమాను" అంటాము. ఇది కర్తవ్యం.

చీకటిని వెలుగు తరిమేసింది. ఇది ప్రకాశానికి కర్తవ్యమా? కానే కాదు. నేను చీకటిని తరిమాను అని వెలుగు అనదు. ప్రకాశించటం వెలుగు యొక్క స్వభావము. వెలుగులో చీకటి నిలవలేదు. అది చీకటి యొక్క అశక్తత.

జ్ఞానం అనే ప్రకాశం రానంతవరకే అజ్ఞానం అనే అంధకారం ఉంటుంది. జ్ఞానం కలిగితే అజ్ఞానం ఉండలేదు. ప్రపంచంలో ఏ జ్ఞానమైనా ఇలాగే ఉంటుంది.

జీవితంలో అజ్ఞానంతోనే మనం బాధలు పడుతున్నాం. అజ్ఞానము అంటే కేవలం జ్ఞాన అభావం అని చెప్పుకుంటే సరిపోదు. జ్ఞాన అభావ మంటే జ్ఞానం లేదు అని అర్థం. లేనిది ఎలా బాధపెడుతుంది? కనుక అజ్ఞాన మంటే జ్ఞాన అభావమే కాదు. అజ్ఞానము జ్ఞాన విరోధి.

అజ్ఞానం పోవాలి అంటే, జ్ఞానం కలగాలి. ఎలాంటి జ్ఞానం కలగాలి? ఏ వస్తువుకు సంబంధించిన జ్ఞానం కలిగితే, ఆ వస్తువుకు సంబంధించిన అజ్ఞానమే పోతుంది. ఏ శాస్త్రమైనా అంతే.

వాస్తు శాస్త్ర ముంది. నాకు వాస్తు శాస్త్రానికి సంబంధించిన జ్ఞానం లేదు. అంటే, నా వద్ద వాస్తు శాస్త్రానికి సంబంధించిన అజ్ఞాన ముంది. వాస్తు జ్ఞానము కలిగితే, వాస్తు అజ్ఞానము పోతుంది. **(వాస్తు అజ్ఞాన మస్తి, వాస్తు జ్ఞానేన వాస్తు అజ్ఞానం నశ్యతి).**

మనకు అన్ని శాస్త్రాలు తెలియవు. ఏ శాస్త్రాన్ని తెలుసుకుంటే ఆ శాస్త్రానికి సంబంధించిన జ్ఞానమే కలుగుతుంది. అంటే, ఆ శాస్త్రానికి సంబంధించిన అజ్ఞానమే పోతుంది.

ఏ జ్ఞానమూ ప్రపంచంలో పూర్ణంగా లేదు. కనుకనే, ప్రతి రంగంలో పరిశోధనలు జరుగుతూ ఉన్నాయి. తెలిసిన వాటిలో కూడా తెలియనివి ఎన్నో దాగి ఉన్నాయి.

తెలియని వాడుగా మిగలటం నాకు ఇష్టం లేదు. కోరేవాడు ఎవడైనా లేనివాడే. పేదవాడే. ఇక, ఈ ప్రపంచంలో ఉన్న వారెవరు? జ్ఞాన మున్న వారే ఉన్నవారు. అనంత జ్ఞాన మున్నవారు. అనంతానికి సంబంధించిన జ్ఞానం ఒకటుందా? ఉంది. అది తెలిస్తే, అన్నీ తెలుస్తాయి. అది తెలిసిన క్షణాన నీవు అనంత జ్ఞానంతో శోభిస్తావు. అనంతుడవై భాసిస్తావు.

ఏక విజ్ఞానేన సర్వ మిదం విజ్ఞాతం భవతి

ఒక్క దానికి సంబంధించిన జ్ఞానం కలిగితే అన్నిటికి సంబంధించిన జ్ఞానం కలుగుతుంది. ఇది ఎక్కడా లేనిది. ఏ మతమూ అందించలేనిది. ఎవరికీ సాధ్యము కానిది. వేదానికే సాధ్యమైనది. ఇదే వేద ప్రయోజనం. శాస్త్ర ప్రయోజనం.

శాస్త్రస్య ప్రయోజనం కిం? స్వయమేవ ఆహ ప్రయోజనం. ప్రయోజనం చ అస్యాః బ్రహ్మవిద్యాయాః అవిద్యా నివృత్తిః తతశ్చ ఆత్యంతిక సంసార అభావః

శాస్త్రము యొక్క ప్రయోజనం శాస్త్రమే. బ్రహ్మవిద్యయే ప్రయోజనము. బ్రహ్మ విద్య అజ్ఞానమును అంతం చేస్తుంది. తత్ఫలితంగా సంసారము సమూలంగా అంత రిస్తుంది.

దాహంతో బాధపడే వ్యక్తికి ధన మిస్తే దాహం తీరదు. పదవి ఇస్తే తీరదు. సన్మానం చేస్తే తీరదు. కారు కొనిపెడితే తీరదు. నీరు త్రాగితేనే తీరుతుంది.

అసంతృప్తితో అలమటించే వ్యక్తికి ఏదిచ్చినా, ఏది వచ్చినా అసంతృప్తి పోదు. జ్ఞానంతోనే అది అదృశ్య మవుతుంది.

అసంతృప్తి అనేది మన మీదనే కేంద్రీకృతమై ఉంది. మనం ఆశించే తృప్తి యొక్క రూపం మనకు తెలియనిది కాదు. అన్నిచోట్ల తృప్తిగా ఉండాలని, అన్ని కాలాలలో తృప్తిగా ఉండాలని, అన్ని పరిస్థితులలో తృప్తిగా ఉండాలని అభిలషిస్తూ ఉన్నాం.

అన్ని చోట్ల తృప్తి ఉండాలి అంటే, **దేశతః** నేను పరిమితుణ్ణిగా ఉండటం నాకు ఇష్టం లేదు. అన్ని కాలాలలో తృప్తిగా ఉండాలి అంటే, **కాలతః** నేను పరిమితుణ్ణిగా

ఉండటం నాకు ఇష్టం లేదు. అన్ని సన్నివేశాలలో తృప్తిగా ఉండాలి అంటే, **వస్తుతః (నిమిత్తతః)** నేను పరిమితుణ్ణిగా ఉండటం నాకు ఇష్టం లేదు. అంటే నేను ఆశించే తృప్తి ఏదో కాదు. నిత్యతృప్తి. ఇదే సదానందము.

ఇటువంటి తృప్తి అనగా నిత్యతృప్తిని ప్రపంచంలో మనం పొందగలమా? పొందలేము. పొందలేము కనుక నిత్యతృప్తి అనేది లేనిది అని చెప్పగలమా? లేనిదే అయితే, దానిని పొందాలి అని నీకు ఎందుకు అనిపిస్తుంది? **తృప్తః భవిష్యామి** అనే భావన ఎందుకు కలుగుతుంది? కనుక నిత్య తృప్తి ఉన్నదే. అది నీవే.

మరొక కారణంగా వచ్చే తృప్తి నిత్యతృప్తి కాలేదు. నీవే నిత్యతృప్తి. నీవే నిత్యానందము. ఇది ఉన్నదే కాని కానున్నది కాదు. దీనిని నమ్మమని చెప్పేందుకు శాస్త్రం లేదు. నిరూపించేందుకే ఉంది.

ఇప్పుడు చెప్పండి. నిత్య తృప్తులమై ఉండేందుకు ఏం చేయాలి? ఏమీ చేయ నవసరం లేదు. తెలుసుకోవాలి. ఇది కర్తవ్యం కాదు. జ్ఞాతవ్యం. మరో మార్గం లేనే లేదు. **(నాన్యః పంథా విద్యతే అయనాయ).**

మనం ప్రస్తుతం అదే చేస్తున్నాం. 'నేను' ఎవరు? **(జీవః).** నాతో సంబంధం కలిగి యున్న ఈ ప్రపంచ మేమిటి? **(జగత్).** మేము మాత్రమేనా! లేక, మాకు అతీతమైనది ఏదైనా ఉందా? **(పరమాత్మ).** ఈ మూడు విషయాలను సమగ్రంగా చర్చించ గలిగితేనే తత్త్వ శాస్త్రము. ఏవేవో నమ్మకాలను క్రుమ్మరించేవి అతత్త్వ శాస్త్రాలు.

మన మున్న ప్రపంచం చాలా విశాలమైంది. ఎందుకో మనలో హృదయం అంత విశాలంగా లేదు. పైగా సంకుచితంగా ఉంది. పరిమితంగా ఉంది. ప్రపంచంలో అంద ముంది. సౌందర్య ముంది. వనరు లున్నాయి. నియతి ఉంది. సిరి సంపదల మధ్య సరిపడి హాయిగా జీవించే పరిస్థితి ఉన్నా, సరిపెట్టుకోలేని మనిషి అశక్తత విశాలమైన ఈ ప్రపంచాన్ని చాలా చిన్నదిగా, అల్పంగా, స్వల్పంగా మలచుకొంటూ పోతూ ఉంది. మన జీవితం మీద మనకే పట్టు లేకుండా చేస్తోంది. అనుక్షణము బ్రతుకును అయోమయంగా మార్చేస్తుంది.

ఈ క్షణం మనం సుఖంగా ఉంటే మరుక్షణం ఇలాంటి సుఖమే ఉంటుందని చెప్పలేము. ఊహించని వన్నీ జరిగిపోతూ ఉంటాయి. ఆశించినవి నెరవేరవు సరిగదా, భరించలేని వన్నీ వచ్చి బ్రతుకులో చేరిపోతూ ఉంటాయి. ఇలా మనిషి బ్రతుకు ప్రతిక్షణము దుర్భరంగా మారుతూ ఉంది.

కాని, ఈ ప్రపంచంలో మనిషిని మించిన అద్భుతం లేదు. ఆనంద ముండదు. ఈ దృశ్యమాన జగత్తులో ఎన్ని పరిశీలించినా, మనిషిలో ఏముందో అర్థమైనపుడే అన్ని పరిశోధనలకు పూర్ణత్వము. మనిషి కన్నా అన్యంగా ఏమున్నా, ఏదున్నా అది సత్యం కాదు. సత్యం మనిషిలోనే ఉంది. మనిషే సత్యము.

జీవుడు

అనుభవాలు - అవగాహన

మన ప్రయత్నాల ద్వారా ఈ ప్రపంచంలో కొన్నిటిని సాధిస్తున్నాము. అలా సాధించటానికి మార్గాలు, పద్ధతులు ఉన్నాయి. మనం దేనిని సాధించాలి? ఎలా సాధించాలి? ఒకవేళ మనకు ఇష్టము లేనివి అయితే, లేదా ఇష్టం గానే ఉంటూ ఒక క్షణంలో అయిష్టంగా మారేవి అయితే అలాంటి వాటిని వదిలించుకుంటాం. అయితే, వాటిని ఎలా వదిలించుకోవాలి? ఎందుకు వదిలించుకోవాలి? ఇవన్నీ మనకు తెలుసు. వీటన్నిటిని ఈ ప్రపంచంలోనే తెలుసుకుంటూ ఉన్నాం.

ప్రపంచంలో దేనిని సాధించినా మనకన్నా వేరైన దానినే సాధిస్తున్నాము. వేరు అంటే, **దేశతః, కాలతః, వస్తుతః** మనకన్నా అన్యమైన దానినే మనం సాధిస్తూ ఉన్నాము. ఇవన్నీ జీవితంలో సాధ్యాలైతే, సాధ్యాలు అనేకములుగా ఉంటాయి. సాధ్యాలు అనేకములు కనుక సాధనలు కూడా అనేకంగా ఉంటాయి. ఏవిధమైన సాధన నాచరిస్తే (కర్మ) తత్సంబంధమైన సాధ్యమునే పొందుతాము (ఫలం).

అలా చూచినపుడు సాధ్యాలు అనేకములుగా తెలుస్తున్నాయి. అనేకములు అంటే, ఒకటి మరొకటి కాదు అని అర్థము. ఒకటి మరొకటి కానపుడు దేనిని పొందినా, దేనికి సంబంధించిన జ్ఞానం మనకు కలిగినా, అవన్నీ అంతం కలిగినవి గానే ఉంటాయి. కనుకనే ఒకరు వాంఛించింది మరొకరు వాంఛించరు. అగమ్యాలుగా తెలుస్తున్న ఈ సాధ్య విషయాలను ఎన్నిటిని సాధించినా మనిషిలో ఉండే అసంతృప్తి పోయేందుకు అవకాశం లేదని ఇప్పటికే మనకు అర్థమై పోయింది. ఇంతకీ మన గమ్య మేమిటో మనకు సాధ్యవస్తువు ఏదో అర్థం కావాలి. అప్పుడే జీవితంలో స్పష్టత, స్వచ్ఛత ఉంటుంది.

దేనిని పొందినా, దేనిని పోగొట్టుకున్నా నాలో ఉండే అసంతృప్తిలో ఏవిధమైన మార్పు లేనపుడు ఏది ఉండినా, ఏది ఊడినా జీవితంలో పెద్ద మార్పు ఏమీ ఉండదు. నా అసంతృప్తిని ఏవీ తొలగించలేవు. నా అసంతృప్తి ఒక సమస్య అయితే, దానికి పరిష్కారం ప్రపంచంలో లేదని తేలిపోయింది. అసంతృప్తి కేవలం నా మీదనే కేంద్రీకృతమై ఉంది. నేను అసంతృప్తితో ఉన్నాను. ఇది ఎవరూ చెప్ప నవసరం లేదు. మన అనుభవాలను విశ్లేషిస్తే మనకే అర్థమవుతుంది.

మన అనుభవాలను విశ్లేషించి అర్థం చేసుకుంటే, ఇక్కడ కూడా వైరుధ్యం తెలుస్తూ ఉంది. ఏవో ఏవో పొంది తృప్తి చెందాలని నేను ప్రయత్నిస్తున్నాను అంటే, నేను అసంతృప్తిలో ఉన్నాను అని నాకే అర్థమవుతూ ఉంది. ఇది నా అనుభవమే. మరెవరిదో కాదు.

నేను అసంతృప్తితో ఉన్నా, తృప్తిగా ఉన్న క్షణాలు కూడా లేకపోలేదు. కోరింది దొరికినపుడు, రావాలనుకున్నది వచ్చినపుడు, పోవాలనుకున్నది పోయినపుడు నేను

తృప్తితో ఉన్నాను. ఇది నా అనుభవమే. అంతే కాదు. గాఢనిద్రలో కూడా నాకు అసంతృప్తి లేదు. తృప్తిగా నిద్రపోతున్నాను. ఈ విధమైన సుఖ నిద్రానుభూతి కూడా నాకు ఉంది. కనుక, నా అనుభవాలలో తృప్తి ఉంది; అంతే కాదు. అసంతృప్తి కూడా తెలుస్తూ ఉంది.

ఈ రెండూ నా అనుభవాలే అయినపుడు, ఈ రెండు అనుభవాల మధ్య వైరుధ్యం గోచరించే టప్పుడు, ఇంతకీ ఏది సత్యానుభవం? ఏది కల్పితానుభవం? అనే ప్రశ్న ఉదయించకపోదు.

నేను అసంతృప్తితో ఉండవచ్చు. లేదా, అప్పుడప్పుడు తృప్తి చెందుతూ ఉండవచ్చు. ఈ రెండిటిలో ఏది నా స్వభావము? ఏది నా స్వరూపము? ఈ ప్రశ్నలకు సులభంగా ఎవరికి వారు సమాధానాలు ఇచ్చుకోవచ్చు.

తృప్తి మాట దేవుడెరుగు. అసంతృప్తి మాత్రం నా స్వభావం కానే కాదు. ఎందుకని? అసంతృప్తి నాకు బాధగా ఉంది. అసౌకర్యంగా ఉంది. దాని నుండి నేను విడిపడాలి అనుకుంటూ ఉన్నాను. స్వభావము బాధించదు. అసంతృప్తియే నా స్వభావము అయితే దాని నుండి విడిపడాలి అని నేను ఎందుకు అనుకుంటాను? కనుక, అసంతృప్తి నాకు ఉండవచ్చు నేమో గాని తృప్తియే నా స్వభావము. సుఖమే నా స్వరూపము.

నా స్వరూపమే సుఖం. ఇది తెలిస్తే, ప్రపంచంపై నేను నా సుఖానికి ఆధారపడి లేను అనేది స్పష్టంగా అర్థ మవుతుంది. ఈ ప్రపంచంలో సుఖించటానికి కోరికలు తీర నవసరం లేదు అనే అద్భుతమైన సత్యం కూడా బుద్ధికి అందుతుంది.

మరి, కోరికలు తీరినపుడు సుఖం కలుగుతూ ఉంది కదా? అనే సందేహం రావచ్చు. ఆ సుఖం కూడా కోరికలు తీరటం వలన కలిగింది. కోరిక లేనివాడివిగా నీవు ఉన్నావు కనుకనే కలిగింది.

కోరిక కదలక ముందు నీవు సుఖం గానే ఉన్నావు. ఎందుకని? కోరిక లేదు కనుక. కోరిక తీరిన తరువాత, ఇక కోరిక లేదు కనుక సుఖంగా ఉన్నావు. సుఖ మనేది కోరికకు సంబంధించింది కాదు. కోరిక లేనివాడివిగా ఉండినప్పుడే సుఖానుభూతి కలుగుతూ ఉంది.

గాఢనిద్రలోని సుఖానుభూతికి కూడా కారణం అదే. గాఢ నిద్రలో నీవు సుఖాను భూతిలో ఉన్నావు అంటే, అక్కడ కోరిక తీరి కాదు. కోరిక లేకపోవటం వల్లే నీవు సుఖిస్తున్నావు.

అసంతృప్తి మన అనుభవం. తృప్తి కూడా మన అనుభవమే. ఈ రెండిటికి పరస్పర వైరుధ్యము. కాని, రెండూ నా అనుభవాలే. తృప్తి నా స్వరూపమైతే, అసంతృప్తి ఎలా ఉంటుంది? నా స్వరూపమే అసంతృప్తి అయితే నేను ఎలా తృప్తి చెందగలను? ఇలాంటి చోటే విచారము. ఈ విచారంలో నేను ఏమిటో, నేను కానిది ఏమిటో

తెలుస్తుంది. ఇదే ఆత్మవిచారము. కేవలం వేదాంత శాస్త్రం ద్వారానే అందే పవిత్ర విషయం.

ఆత్మవిచారము

బంధ మనేది జీవితంలో అందము కాదు. బంధమును ఎవరూ భరించలేరు. దుఃఖాన్ని కలిగించేది ఏదైనా బంధమే. కనుక, నా కున్న అసంతృప్తి కూడా బంధమే.

అయితే, ఈ బంధము సత్యమా? బంధమే కనుక సత్యము అయితే, సత్యము అంటేనే అన్ని కాలాలలో ఉండేది కనుక బంధము నాకు ఎన్నటికీ దూరం కాదు.

ఒకవేళ బంధము అసత్యమే అయితే, అసత్యము అంటే లేనిదే కనుక లేనిది పోనవసరం లేదు.

అలాగాక, బంధము లేనిదే అయిననూ, ఉన్నట్లు గోచరించే టప్పుడు అట్టిది అర్థం చేసుకోదగిందే గాని, ప్రయత్నంతో దూరం చేసుకోవలసింది కాదు. అలా అర్థం చేసుకోవటమే విచారము.

బంధంలో ఉన్నట్లు భావించటానికి బంధం ఉండ నవసరం లేదు. బంధ మున్న దనే భావన చాలు. ఒక విధంగా చెప్పాలంటే ఈ భావనే బంధము. మన వన్నీ భావనా బంధాలే.

తానేమిటో తనకు తెలియనందున "నేను అసంతృప్తితో ఉన్నాను. నేను దుఃఖిని" అని భావిస్తాడు. ఇది బంధము. వాస్తవానికి ఇది కల్పించుకున్న బంధమే. కరిపించుకున్న బంధమే. తగిలించుకున్న బంధమే. తగిలించుకున్నదే కనుక తొలగించుకుంటే పోతుంది.

అజ్ఞానము బంధము కనుక జ్ఞానమే మోక్షము. తానేమిటో తెలియకపోవటము అజ్ఞానమైతే, తానేమిటో, తన స్వరూప మేమిటో తెలియటమే జ్ఞానము. ఆత్మజ్ఞానము. విచారము ద్వారా లభ్యమయ్యే స్వరూప జ్ఞానము.

కనుక మోక్షము అనేది జ్ఞానరూపంలో ఉంది. జ్ఞానం కలిగితే మోక్షం లభిస్తుంది. మోక్షాన్ని కోరేవాడు ముముక్షువు. జ్ఞానాన్ని పొందాలనుకునే వాడు జిజ్ఞాసువు. అందరూ ముముక్షువులే. ముముక్షువులైన వారికి జ్ఞానమే ప్రధానము కనుక తాను జిజ్ఞాసువు కావలసిన అవసర ముంది అనేది ముముక్షువుకు అర్థం కావాలి.

ఈ సత్యం అర్థం కాని ముముక్షువు కర్మలలో పడి ఉంటాడే గాని విచారం వైపు తిరగడు. విచారం జరగనిదే విజ్ఞానం రాదు. జ్ఞానం లేని ముముక్షువు ముముక్షువుగా మిగిలిపోతాడే గాని ముక్త పురుషుడు కాలేడు.

జ్ఞానం ఎలా కలుగుతుంది? శాస్త్రం నుండే జ్ఞానం వస్తుంది. మరొక మార్గం లేదు. అందుచేతనే శాస్త్రం ప్రమాణమై శోభిస్తోంది **(ప్రమాకరణం ప్రమాణం)**. ప్రమాణం

ఉంటేనే జ్ఞానం కలుగుతుంది. కనుక ప్రమాణ ప్రవృత్తి కావాలి. ప్రమాణ ఫలమే ఆత్మజ్ఞానం. ఆత్మజ్ఞానం కలిగితే జిజ్ఞాసువు తానే ముక్త పురుషు డని తెలుసుకుంటాడు. ఇదియే మోక్షం.

శాస్త్రం ఎప్పుడు ప్రమాణ మైనదో అధ్యయనం తక్షణ కర్తవ్యమైంది. మరి శాస్త్రాన్ని మనమే అధ్యయనం చేస్తే సరిపోతుంది కదా? జ్ఞానం కలుగుతుంది కదా?

కాదు. కానే కాదు. జ్ఞానము బోధయే కనుక బోధనా విధి లేనిదే బోధ అర్థం కాదు. ఏ శాస్త్రమైనా అంతే. మనకు మనంగా కంప్యూటర్ నేర్చుకోలేము. మనకు మనంగా కారు నడపటం తెలుసుకోలేము. మరొకరి సాయం లేకుండా సైకిల్ త్రొక్కటం కూడా నేర్చుకోలేము.

సామాన్య విషయాలే ఇలా ఉన్నాయి. ఇక ఆత్మజ్ఞానం విషయంలో ఎవరి సహాయం లేకుండా ఎలా గ్రహించగలం? పైగా, ఇతర శాస్త్రాలు వేరు. ఆ శాస్త్ర విషయాలు వేరు. ఆత్మ విషయం వేరు.

ఇక్కడ అనగా ఆత్మ విషయంలో ఒక అనిశ్చిత పరిస్థితి ఉంది. గందరగోళంతో బుద్ధి చంచలమై ఉంది. ఏది ఆత్మో, ఏది అనాత్మో అర్థం కాకుండా ఉంది. అస్థిర బుద్ధికి స్థిరమైన జ్ఞానము రాదు. అది మరొకరి సహాయం లేకుండా అందే అవకాశం లేనే లేదు.

అయితే, ఇక్కడ మనకు సహకరించే వ్యక్తి మనలాంటి వాడే అయితే ఉపయోగం లేదు. మనకు సహకరించే వ్యక్తికి జ్ఞానం ఉండాలి. కేవలం జ్ఞాన ముంటే సరిపోదు. బోధించే విధానం తెలిసి ఉండాలి. తెలిసి బోధిస్తేనే వినేవాడికి అర్థ మవుతుంది. తెలిసే లాగ బోధిస్తేనే వినేవాడి బుద్ధి నిండుతుంది. ఇలా బోధించటం సంప్రదాయం. ఇదే సాంప్రదాయక బోధ.

సంప్రదాయం తెలిసి బోధించే వ్యక్తిని గురువు అంటారు. గురువుకు శాస్త్రం తెలిసి ఉండాలి. శాస్త్రం ఎలా ప్రమాణమో తెలిసి ఉండాలి. తాను బోధించే జ్ఞానం తనదై ఉండాలి. తానై ఉండాలి. బోధించే నేర్పే గాక ప్రేమతో బోధించే హృదయం కూడా ఉండాలి.

జ్ఞానం బుద్ధి నుండి బుద్ధికి అందుతుంది కనుక గురువు జ్ఞాన జ్యోతియై మన హృదయంలో జ్ఞాన దీపాన్ని వెలిగిస్తాడు. అదియే ఆత్మజ్ఞాన జ్యోతి.

గురువు అందించే జ్ఞానాన్ని అందుకొనే శిష్యుడు శిక్షణ యోగ్యుడై ఉండాలి. అర్హత లేనివారు అధ్యయనం చేయగలరేమో గాని అజ్ఞానానికి దూరులు కాలేరు. అర్హుడైన శిష్యుడు, జ్ఞానం గల ఆచార్యుడు కూర్చుని ఆత్మవిచారం సాగిస్తే, శిష్యుడైన వానికి జ్ఞానం కలుగకుండా నివారించ గలిగే శక్తి ఎవ్వరికీ లేదు.

గురు సన్నిధి

భాగ్యా లొస్తే సుఖంగా ఉండవచ్చు అని పేదలు భావిస్తూ ఉంటే, బాధలు తీరితే సుఖపడగలం అని ధనికులు భావిస్తూ ఉన్నారు. అందరూ ఇలాగే బాగేమిటో తెలియక బ్రతుకుతూ ఉన్నారు.

బ్రతుకులో అన్నీ బాగున్నాయని చెప్పలేము. బాగలేనివి ఎన్నో ఉన్నాయి. బాగలేని వాటితో మనం సుఖంగా జీవించలేకపోతే వాటిని బాగు చేసుకొని సుఖపడేందుకు ప్రయత్నిస్తూ ఉన్నాం.

బాగలేని వాటిని ఎన్నిటినో జీవితంలో మనం బాగు చేసుకున్నాం. బాగు చేసు కుంటున్నాము. అలాంటి ప్రయత్నాలలో బాగుపడే వాటితో మన బ్రతుకు బాగు పడుతుందని ఊహిస్తున్నాం. ఆశిస్తున్నాం.

ఇల్లు ఉరుస్తూ ఉంది. కప్పుకొని బాగుచేసుకున్నాం.

పంచె చిరిగింది. కుట్టుకొని కట్టుకుంటున్నాం.

కాలు విరిగింది. చికిత్స చేయించుకుంటున్నాం.

చత్వారం వచ్చింది. పరీక్ష చేయించుకొని కళ్ళజోడు ధరిస్తున్నాం.

ఈ విధమైన మార్పులకు, చేర్పులకు, కూర్పులకు మనం చాలకపోతే ఇతరుల సహాయాన్ని అర్థించాము. అలా కొన్నిటిని సాధించాము.

కాని, బాగలేనిది అంటూ ఒకటుండి, దానిని మనం బాగు చేసుకోలేక, ఇతరులు కూడా సహకరించినా బాగుపడే అవకాశం లేనపుడు - అలాంటి విషయంలో ఎక్కడ నుండి సహాయం అందుతుందో ఆ వైపుకు తిరుగుతాము. ఆ చోటునే ఆశ్రయిస్తాం.

ఆత్మజ్ఞానం విషయంలో అదే జరుగుతోంది. మనకు మనంగా తెలుసుకోలేని జ్ఞానము, ఇతరులకు అంతుచిక్కని జ్ఞానము ఎక్కడ మనకు లభిస్తుందో అదే మనకు పెన్నిధి. ఆ పెన్నిధియే ఆచార్య సన్నిధి.

ఆచార్యవాన్ పురుషో వేద

"ఆచార్యుడు ఎవరికి లభిస్తాడో వారికే జ్ఞానం కలుగుతుంది".

ఇక్కడ మనకు అందే జ్ఞానం సామాన్య జ్ఞానం కాదు. విశేష జ్ఞానము. కేవలం మనకు సంబంధించిన జ్ఞానము. సామాన్య జ్ఞానము బుద్ధికి అందుతుంది. విశేషజ్ఞానము అనగా ఆత్మజ్ఞానము బుద్ధికి అందదు. బుద్ధిలో అందుతుంది. ఇది జాగ్రత్తగా అర్థం చేసుకోవలసిన విషయము. దీని వివరణము మున్ముందు చూస్తాము.

ఆత్మజ్ఞానము ఇలా విశిష్టమై, వరిష్ఠమై ఉన్నందున గురు సాన్నిధ్యంలోనే గ్రహించాలి. కనుకనే, గురుశిష్య లిరువురు ఒక్కచోటే ఉండి, శాంతి పాఠమును ఏకంగా పఠించి, ఆత్మవిచారమును కొనసాగిస్తారు.

శాంతి పాఠము

శాంతి మంత్రమును పలుకకుండా మన మహర్షులు అధ్యయనాన్ని ప్రారంభించే వారు కారు. ఉపనిషత్తును ప్రారంభించే ముందు గురుశిష్యులు ఇరువురు కలిసి శాంతి పాఠాన్ని వల్లించేవారు.

ఏ కార్యాన్ని మొదలు పెట్టినా మనస్సును ప్రశాంతంగా ఉంచుకొనే ఆరంభించాలి. శాంతితో ప్రారంభమైన కార్యాలు శాంతితోనే పరిసమాప్త మవుతాయి.

"నేను చెప్పే విషయం కాస్త శాంతంగా వినండి" అంటూ ఉంటారు. అశాంతితో అలమటించే మనస్సు విషయాన్ని చక్కగా అర్థం చేసుకోలేదు. అలాగే శాంతి లేని మనస్సు విషయాన్ని స్పష్టంగా ఎరుక పరచలేదు.

చెప్పేవారి, వినేవారి మనస్సులు ప్రశాంతంగా ఉన్నప్పుడే చెప్పేవారు ఏమి చెప్పాలనుకున్నారో అది వినేవారికి వంటపడుతుంది.

అశాంతి ఉంటే ఉండ నివ్వండి. అశాంతిని గుర్తిస్తే నష్టం లేదు. కాని, అశాంతికి గురి అయితే లాభ ముండదు. మహర్షులు అశాంతి తెలియనివారు కారు. కాని, దానిని వారు దాటి పోయారు.

తమసోమా జ్యోతిర్గమయ

చీకటిని వారు చూశారు. తమస్సును గుర్తించారు. కాని వారి దృష్టి అంతా వెలుగు మీదే ఉండింది. జ్యోతి వైపే సాగింది. అందుకనే చీకటి నుండి వెలుగులోకి నడిపించమని ప్రార్థించారు. అసంతృప్తి నుండి తృప్తి వైపు పయనం సాగించారు. అశాంతి నుండి శాంతి వైపు తిరిగారు.

అశాంతికి కారణాలు ఉంటాయి. శాంతికి కారణ మవసరం లేదు. నీవే శాంతి. అలలు లేని సరోవరంలో ప్రతిరూపము ప్రతిఫలిస్తుంది. అలజడి లేని హృదయంలో ఆత్మస్వరూపం భాసిస్తుంది.

తానే ఆత్మ యని తెలిసినవాడు గురువు. తెలుసుకోబోయే వాడు శిష్యుడు. తెలిసినవాడు ఆత్మయే. తెలియని వాడెవరు? అతడు కూడా ఆత్మయే. అంతే గాని, తెలియనివాడు ఆత్మ అయ్యేది లేదు. తాను ఆత్మ అయ్యే ఉన్నట్లు తెలుసుకోవడమే. ఇది స్వరూప జ్ఞానము. జీవ స్వరూపము.

తెలియనంత వరకు లేనట్లే ఉంటుంది. తెలియగానే లేని దెప్పుడు? అనే ఆశ్చర్యం కలుగుతుంది. ఉన్నదే అనే అనుభూతి మిగులుతుంది.

కట్టినాను నీ కొరకే పూల గూడు నా మదిలో
వచ్చెదవని ఎదురు చూచితిని వచ్చి ఉంటివని ఎరుగనైతిని -

అని చైతన్యగాన రవళి వినదించింది ఇక్కడే.

నేనెవరు?

'అహం అస్మి'. నేను ఉన్నాను. నేను వివేకినా? అవివేకినా? అనేది వేరే విషయం. నేను ఉన్నాను. నేను ముందుగా ఉండాలి. ఆ తరువాతే నాకు వివేక ముందా? లేదా? అనే ప్రశ్నలు.

నేను రూమ్‌లో ఉన్నాను. ఎవరో వచ్చి తలుపు తట్టారు. **కస్త్వం?** నీవెవరు? అని ప్రశ్నిస్తాను. ఆ వచ్చిన వ్యక్తి **"అహం"** నేను అంటాడు. తెలియక మళ్ళీ ప్రశ్నించా ననుకోండి, **"అహమేవ"** నేనే అని జవాబిస్తాడు. అప్పటికీ నాకు అర్థం కాకపోతే, మళ్ళీ అడుగుతాను "నీ వెవరు?" అని.

ఇక ఈ దశలో అతనిచ్చే సమాధానాలన్నీ వింతలుగానే ఉంటాయి. ఇప్పటి వరకు అతనెవరో నాకు తెలియక నేను తికమక పడ్డాను. అతడేమో నిశ్చయంగానే ఉన్నాడు. ఎన్నిసార్లు ప్రశ్నించినా నేను.. నేను.. నేను.. అని చెబుతూనే ఉన్నాడు. సంశయ మేదైనా ఉంటే నాకు ఉన్నదే గాని అతనికి లేదు.

కాని, పదేపదే నేను ప్రశ్నించే సరికి అతడు కూడా నాలాగే ఏదో అవుతాడు. అతడు చెప్పే సమాధానం నాకు ఏమీ తెలుపలేకపోయింది కనుక తనను తాను నిర్వచించుకుంటూ నాకు తెలిపే ప్రయత్నం చేస్తాడు. ఈ ప్రయత్నంలో నాకు ఏమి తెలిసింది అనేది వేరే విషయం. నాకు తెలియచేయా లనే ప్రయత్నంలో తాను తనకు తెలియనివాడుగా మిగిలిపోయాడు అనేది మాత్రం విచారిస్తే ఎవరికైనా అర్థ మవుతుంది.

నేను నామమా? నాకు నామమా?

'కస్త్వం' నీవెవరు? అని నేను ప్రశ్నిస్తే, **'అహమేవ'** నేనే అని అతడు బదులు చెప్పినా, అది నాకు అర్థం కానపుడు తనను తాను నాకు తెలిపే ప్రయత్నంలో నిర్వచనాన్ని వచనంలో పొదిగి తనకు నామం పెట్టుకొన్నాడు.

"నేను కొమరయ్య కొడుకు" అంటాడు. జవాబు ఎలా ఉన్నా, జవాబిచ్చినవాడు బాగానే ఉన్నాడు. అతడు పలికిం దేమిటో అతనికి అర్థమయ్యే ఉంది. కాని, నాకే అర్థం కాలేదు.

నేను అడిగిన ప్రశ్న నీ వెవరు? అని. అతడు ఎవరికి కుమారుడో అది నాకు చెబుతున్నాడు. ఇది అతనికి ఇతరులతో ఉన్న సంబంధం. నేను సంబంధాన్ని గూర్చి అడగలేదు.

అతనికి నేను కుమారుణ్ణి అంటున్నాడు. అతడు ఉంటేనే ఇతడు కుమారుడు. ఇదే సంబంధం అంటే. నేను కుమారుణ్ణి అనటం లేదు. అతని కుమారుణ్ణి అంటున్నాడు. నేను కుమారుణ్ణి అనటానికి అనుగుణంగా నా ప్రశ్న లేదే. నీవు ఎవరి కుమారుడివి? అని నేను అడిగితే కదా! అయితే,

నేను తోకను కాను

"నేను పోస్టుమాస్టర్ని. నేను డ్రిల్ మాష్టర్ని" ఇలాంటి జవాబు లొస్తాయి. ఇది మళ్ళీ మరో విధమైన సంబంధమే. ఉద్యోగ సంబంధము. పోస్టుకు దరఖాస్తు పెట్టి నపుడు నీవు పోస్టుమాస్టర్వి కావు. ఊడిగం చేస్తూ ఉన్నంత వరకే. ఊడిపోతే, ఆ క్షణంలో వేస్ట్ మాస్టరా? పైగా రోజంతా తాను పోస్టుమాస్టరా?

ఒక విధంగా చెప్పాలంటే, అలాగే ఉంది. కొందరు తమ ఉద్యోగాలతో ఎంతగా తాదాత్మ్యం చెందుతారంటే, ఎక్కడున్నా ఉద్యోగం చేస్తూనే ఉంటారు.

బల్ల గుద్ది వాదించే అలవాటు ఉన్న కొందరు ప్లీడర్లు డైనింగ్ టేబిల్ దగ్గర కూర్చున్నా, గ్లాసుతో టేబిల్ను కొడుతూనే ఉంటారు. ఉపాధ్యాయు లైతే, ఎంతటి మేధావులతో మాట్లాడుతున్నా, "నేను చెప్పింది అర్థమైనదా?" అంటూనే ఉంటారు. వ్యాపారస్తులైతే, మాటల మధ్యలో "లాభం లేదు" అనే పదం వాడతారే గాని ఉపయోగం లేదు అని పొరపాటున కూడా అనరు.

హోటల్ సర్వర్ ఇంటికి వెళ్ళా మనుకోండి. "రండి ఏమిటి విషయం?" అనడు. "ఏం కావాలి సార్?" అంటాడు. "మీ వయస్సెంత?" అని అడిగేది మాత్రం ఎల్.ఐ.సి. ఏజంటే.

ఉద్యోగాలు కూడా సంబంధాలే. సంబంధాలు లేకుండా జీవించవచ్చు. కాని, జీవించటానికి సంబంధాలు కావాలి. నీకు సంబంధాలు ఉండవచ్చు నేమో గాని, నీవు సంబంధాలు కావు. సంబంధాలన్నీ తోకలే. తోక ఉంటే ఉండొచ్చు. తోక లేకపోయినా మనం ఉంటాము.

నేనెవరో నాకు తెలిస్తే ఏ సంబంధ్నాయినా నేను సంఘర్షణ లేకుండా కొనసాగించ గలను. నేనే నాకు తెలియనపుడు ఇక సంబంధాలు ఎలా బంధాలు అవుతాయో ప్రత్యేకించి చెప్ప నవసరం లేదు.

దేహము నేను కాను

నాకు దేహము ఉంది. నేను దేహము కాను. దేహములో కొన్ని అవయవాలు లోపించినా నేను ఉన్నాను. దేహమే నేనయితే శవము కూడా నేను కావాలి. నేను శవమైతే, కాల్చేందుకు ఎవరు ముందుకు వస్తారు?

నేను ఏమిటో నేను చూడలేకపోతున్నాను. నేను చూస్తున్న దేమిటో అదే నేను అనుకుంటున్నాను.

దేహం తెల్లగా నాకు కనిపిస్తూ ఉంది. నేను తెల్లగా ఉన్నాను అంటున్నాను. దేహము పన్నగా ఉంది. నేను దానిని చూస్తూ కూడా నేను పన్నగా ఉన్నాను అంటున్నాను.

దేహములో ఉన్న ధాతువు లన్నీ జడాలే. స్వప్నంలో దేహేంద్రియాల స్ఫురణే లేదు. అయినా స్వప్నాన్ని చూచే నేను ఉన్నాను. దేహం లేనపుడు కూడా నేను ఉన్నానంటే, దేహము నేను ఎలా అవుతాను?

నేనుంటే దేహ ముంది. దేహము ఉండటానికి నేను ఆధారంగా ఉన్నాను. దేహంలో ఉన్న వ్యక్తిని ప్రేమిస్తున్నాము గాని దేహాన్ని ప్రేమించలేము. ఒకవేళ దేహాన్ని ప్రేమించినా దేహంలో ఉన్న వ్యక్తి కొరకే. ఆ వ్యక్తి దేహంలో లేనందున శవాన్ని ప్రేమించలేక పోతున్నాము.

దేనిని చూసినా దానిని మన మీద ఆరోపించుకుంటున్నాము. ఇంకొక తమాషా కూడా ఉంది. ఆరోపించుకొనే అగచాట్లు అలవాటుగా మారాలే గాని చూచిన వాటినే కాదు, చూడని, చూడలేని వాటిని కూడా ఆరోపించుకోవటమే.

తలపై ఒత్తుగా జుత్తు పెరిగినవాడు నేను బుట్ట తల వాడిని అని ఆరోపించుకొంటే, తల మీద అసలే వెంట్రుకలు లేని వాడు నేను బట్ట తల వాడ్ని అంటాడు. ఇది ఎంత విడ్డూరము?

బుట్ట తల కనిపిస్తూ ఉంది కనుక ఆపాదించుకోవటం అర్థం చేసుకోగలం. ఏదీ లేని చోటును తానుగా భ్రమించటం ఎంత ఘోరం? స్వరూపం అర్థం కానపుడు అంతా ఆరోపమే.

దేహం జడం. దేహానికి జ్వరం వచ్చినట్లు దేహానికి తెలియదు. నేను తెలుసు కుంటూ ఉన్నాను. 'నాది'గా తెలుసుకుంటూ ఉన్నానే గాని "నేను"గా తెలుసుకోవటం లేదు. అలాంటప్పుడు దేహం నేను ఎలా అవుతాను? దేహ లక్షణాలను నాలో ఆరోపించు కొని నేను దేహము అనటం సరి కాదు. సబబు కాదు. విచారణ చేయకుండా దేనినీ నిర్ణయించకూడదు.

ఇంద్రియాలు నేను కాను

కళ్ళు చూడవచ్చు. చెవులు వినవచ్చు. వినేందుకు చెవులున్నా, చూచేందుకు కళ్ళు ఉన్నా, చెవులు లేకుండా నేను వినగలను. కళ్ళు లేకుండా నేను చూడగలను. దూరంగా ఉండే ఆత్మీయుల్ని చూడా లనుకున్నప్పుడు మనం కళ్ళు మూసుకుంటాం. వారి మాటల్ని వినాలని ప్రత్యేకించి వింటున్నప్పుడు బాహ్యంలో శబ్దాలున్నా చెవులకు వినిపించడం లేదు. వినేందుకు చెవు లున్నాయే గాని వినేవి చెవులు కావు. చూచేందుకు కళ్ళు ఉన్నాయే గాని చూచేవి కళ్ళు గావు.

కళ్ళు లేని గ్రుడ్డివారు చాలా మంది బ్రతుకుతున్నారు. చెవిటి వాళ్ళు బ్రతుకు తున్నారు. ఇంద్రియాలు లేనంత మాత్రాన నేను లేకుండా పోలేదు. నేనుంటే ఇంద్రియాలు ఉంటాయి. ఇంద్రియాలు లేకపోయినా నేను ఉంటాను. కనుక నాకు ఇంద్రియా లున్నాయే గాని నేను ఇంద్రియాలు కాను.

మనస్సు నేను కాను

మనస్సులో ఆలోచనలు కొనసాగవచ్చు. ఆలోచించేవాడు లేనిదే ఆలోచనలు సాగవు. ఆలోచనలు మంచివేనా? కావా? అనే విషయంలో నాకు సందేహాలున్నాయి. ఇలా ఆలోచనలను గూర్చి ఆలోచించే వ్యక్తి ఉన్నాడా? లేడా? అనే సందేహం నాకు లేదు. సందేహాన్ని సందేహించగల నేమో గాని, సందేహించే వానిని నేను సందేహించలేను.

ఆలోచనలు సాగినపుడే గాక, ఆలోచనలు ఆగినపుడు కూడా ఉండే నన్ను సందేహించేవారు ఎవరుంటారు? గాఢ నిద్రలో మనస్సు లేదు. అయినా నేను ఉన్నాను. మనస్సు లేనపుడు కూడా ఉండే నేను మనస్సు నెలా అవుతాను? నాకు మనస్సు ఉండ వచ్చు. మనస్సు నేను గాను.

నేను గాని మనస్సును నేను అని భావించటం చేత మనస్సు కలత చెందినపుడు "నేను కలత చెందినాను" అని, మనస్సు శాంతించినపుడు, "నేను శాంతిగా ఉన్నాను" అని మాట్లాడుతూ ఉన్నాము.

ఇవన్నీ మన అనుభవాలు. అనుభవాలు మనం కాము. మనకు అనుభవాలు తెలియవచ్చు. ఇక్కడ కావలసింది అనుభవాలు కావు. అనుభవాలకు సంబంధించిన జ్ఞానము.

"అనుభవము" అనేదే ఒక విచిత్రమైన పదము. "అను" అంటే తరువాత అని అర్థము. "భవము" అంటే పుట్టుక. అనుభవము అంటే తరువాత పుట్టినది అని అర్థము. ముందు 'నీవు' ఉంటే తరువాత అనుభవము కలుగుతుంది. నీవు లేకుండా అనుభవం కలుగదు. అలాంటి నీవు అనుభవాలకు ఎలా పరిమిత మవుతావు? అనుభవాలు ఎప్పుడు నీవు కావో అనుభవాలకు నిలయమైన మనస్సు కూడా నీవు కావు. మనస్సుకు ఆధారమైన నీవు మనసుకు భిన్నంగా ఉన్నావు.

కనుకనే నా మనస్సు అంటావు. నా సైకిలు అన్నప్పుడు నేను వేరు - నా సైకిలు వేరు అని ఎలా అర్థమవుతున్నదో, అలాగే నా మనస్సు అన్నప్పుడు నేను వేరు - నా మనస్సు వేరు అని తెలుస్తూ ఉంది.

మనస్సు చలిస్తూ ఉంది అని నాకు తెలుస్తూ ఉంది కనుక చలించే మనస్సును నేను ఎలా అవుతాను? మనస్సు నిశ్చలంగా ఉంది అంటే, అలా నిశ్చలంగా ఉండే మనస్సును చూస్తున్న నేను మనస్సు నెలా కాగలను?

ఒక్క మాటలో చెప్పాలంటే ఇప్పటి వరకు మనం చూసినవి అన్నీ మార్పు చెందు తున్నవే. మార్పు చెందేవి ఏవయినా అవి కార్యాలే. కార్యాలు ఉన్నవి అంటే కారణం లేకుండా ఉండలేవు. కనుక దేహేంద్రియ మనోబుద్ధు లనెడి కార్య సంఘాతానికి ఆధారమైన కారణంగా తెలిసే నేను మార్పు లేని వాడను. కనుక నా కారణంగా చలించే కార్యాలు ఏవీ నేను కాను.

ఇంతకీ నేనెవరు? **(కోఽ హం?)** నీ వెవరు? **(కస్త్వం?).** తెలియడం లేదు. తెలియనిది అంటే అజ్ఞానము. అయితే, నేను అజ్ఞానమే నేమో? ఎలా అవుతాను? అజ్ఞానము అంటే తెలియనిది. సరే, అది తెలియనిది అని నాకు తెలుస్తూ ఉంది కదా! అజ్ఞానాన్ని తెలుసుకొనే నేను జ్ఞాన మవుతానే గానీ అజ్ఞానము ఎలా అవుతాను?

మనస్సుకు కొన్ని తెలియవచ్చు. కొన్ని తెలియక పోవచ్చు. మనస్సుకు తెలిసిన వాటిని తెలిసినట్లు, తెలియని వాటిని తెలియనట్లు తెలుసుకొనే నేను తెలిసిన దాని కన్నా, తెలియని దాని కన్నా విలక్షణమైన వాడను. నేను కేవలం జ్ఞానమే.

అఖండాత్మ స్వరూపం

ఇంతవరకు ఆత్మ కానిది ఏమిటో తెలుసుకున్నాం. నేనే ఆత్మ కనుక నేను కాని దేదో తెలుసుకున్నాం. ఇంతవరకు మనకు తెలిసింది ఆత్మ కాదు. అనాత్మ. అనాత్మ తెలియనిదే ఆత్మ తెలియదు. అనాత్మనే ఆత్మ యని భావించాము కనుక అనాత్మను నిషేధించనిదే ఆత్మను నిర్ణయించలేము. ఆత్మ నిర్ధారణ జరిగింది అంటే బంధం విడిపోయిందని అర్థము. ముక్తి ప్రాప్తించినట్లే. కారణం? ఆత్మ నిత్యముక్తం కనుక. **(యత్ విజ్ఞాయ నరః బంధాత్ ముక్తః భవతి).**

బంధము నుండి విడిపడటము మాత్రమే ముక్తి కాదు. నీవే ఆత్మ యనెడి జ్ఞానంతో నిత్యానంద స్వరూపమై శోభించాలి. దీనినే ప్రమాణమైన శాస్త్రము మనకు అందిస్తూ ఉంది.

"అహం అస్మి" "నేను ఉన్నాను"; అని నాకు తెలుసు. ఎలా ఉన్నానో నాకు తెలియదు. నా స్వరూపం నాకు తెలియకపోవుట చేత ఆరోపం జరిగింది. తటస్థ లక్షణం ద్వారా నేను కాని దానిని తెలుసుకున్నాను. ఇప్పుడు స్వరూప లక్షణం ద్వారా నేను ఏమిటో తెలుసుకుంటాను.

సచ్చిదానందమే ఆత్మ యొక్క స్వరూప లక్షణం. స్వరూపమును నిర్ణయించుట **(స్వరూప నిర్ధారణాయ)** లక్షణము ద్వారా జరుగుతూ ఉంది **(లక్షణస్య అభిదానేన).**

ఆత్మ లక్ష్యము. సచ్చిదానందము లక్షణము. లక్షణము ద్వారా లక్ష్యము తెలియ బడుతుంది కనుకనే అది లక్షణం **(లక్ష్యతే అనేన ఇతి లక్షణమ్)** సచ్చిదానంద లక్షణములో సత్, చిత్, ఆనందము అనే మూడు పదము లున్నాయి. ఇవియే లక్షణములు. ఈ సత్, చిత్, ఆనందము అనే మూడు పదము లున్నాయి. ఇదే లక్ష్య పద లక్షణము చేత ఆత్మ యొక్క స్వరూపము నిర్ధారణ చేయబడుతోంది. ఇదే లక్ష్య లక్షణ సంబంధము.

సత్

'సత్' అంటే ఉన్నది. ఉన్నది అంటే లేదు అనేది లేకుండా ఉన్నది అని అర్థము. ఈ ప్రపంచంలో ఏవి ఉండినా అవి లేకుండా కలిగినవే. కనుక లేకుండా పోయేవియే. అంటే, లేకుండా కాలంలో కదలివచ్చి, ఒకనాడు కాలంలో లేకుండా పోయేవియే.

కాని ఆత్మ సద్రూపము. అంటే కాలానికి పరిమితమైనది కాదు. మధ్యలో వచ్చినది కాదు. కనుక మధ్యలో పోయేది కాదు. సృష్టికి ముందు ఏది అఖండ స్వరూపంగా భాసిస్తూ ఉండినదో అదే సద్రూప చైతన్యము.

సదేవ సౌమ్య ఇద మగ్ర ఆసీత్ ఏకమేవాఽ ద్వితీయం బ్రహ్మ

"సృష్టికి పూర్వము సద్రూప చైతన్యము ఒక్కటే ఉండినది. అద్వితీయంగా భాసిల్లినది" అని ఛాందోగ్యోపనిషత్.

సృష్టికి పూర్వము అదే ఉండినది కనుక సృష్టి దాని నుండే జరగాలి. సృష్టి జరిగితేనే దేశకాలాదులు వస్తాయి. దేశకాలాదులు ఉంటేనే వస్తు ప్రపంచం తెలుస్తుంది. కాలంలో కదిలిన వన్నీ కాలంలోనే కరిగిపోతాయి. ఇదియే మార్పు లేదా పరిణామం. కాలంలో కదిలినవి నశిస్తాయి గాని కాలాన్ని కదిలించిన కాలాతీత చైతన్యము కాలంలో నశించేది కాదు కనుక ఆత్మ 'సత్'గా చెప్పబడింది. 'సత్' అనేది ఆత్మ యొక్క కాలాతీత స్థితి. ఈ విధమైన నిర్వచనము మరొక దాని విషయంలో చెప్పలేము కనుక 'సత్' పదము ఆత్మ యొక్క లక్షణము.

నామరూపాలు కూడా సృష్టిలోనివే కనుక నామరూప వివర్జితమైన సద్వస్తువే ఆత్మ. ప్రపంచం నామరూపాత్మకం. కనుకనే ప్రపంచం సత్ కాదు. ప్రపంచం సత్యం కాదు అంటే ప్రపంచంలో ఏదీ సత్యం కాదు. ప్రపంచమే కనుక సత్యమై ఉంటే, సుషుప్తిలో కూడా ఉండేది కదా! కనుక సత్యం కాలేని ప్రపంచం స్వప్నం లాంటిది. అంటే, మేలుకొంటే ఉండదు అని అర్థము.

ఆత్మ ఎప్పుడైతే 'సత్' పద లక్షణంతో తెలుపబడి అద్వయంగా ఉన్నదో దానికి అన్యమైనది మరొకటి ఉండేందుకు అవకాశం లేనందున విజాతీయ భేద రహితమై ఉంది. తన లాంటిదే మరొకటి ఉంటే అనంతత్వానికి, అఖండత్వానికి భంగం వాటిల్లుతుంది కనుక సజాతీయ భేద శూన్యమై ఉంది. తనలో అవయవములు లేనందున స్వగత భేదము లేనిదై ఉంది.

దేశకాలాదులు ఆత్మను పరిచ్ఛిన్నం చేయలేవు కనుక దేశకాలాదులలో ఏవి ఉండినా, వాటికి ఆత్మకు ఏ విధమైన సంబంధము లేదు. అన్నిటిలో 'సత్' ఉంది. అవి లేకపోయినా సదాత్మ ఉంటుంది. అదే సదాత్మ వైభవము. మార్పు చెందేవాటికి ఆధారంగా ఉంటూ తనలో ఏ విధమైన మార్పు లేకుండా ఉంది. అవస్థాత్రయ సాక్షిగా చైతన్యమే ఉంది. సర్వము నిషేధింపబడినా, ఏది నిషేధింపబడక భాసిస్తూ ఉందో అదే సదాత్మ **(నిషేధావధీ సాక్షీ).**

చిత్

'సత్'ను తెలుసుకున్నాం. ఏదైనా తెలిసింది అంటే, జ్ఞానం ఉండాలి. ప్రపంచంలో ఏది ఉన్నదో దానిని మనం తెలుసుకుంటాం. వస్తువు వేరుగా ఉంటుంది. తెలుసుకొనే జ్ఞానము తెలుసుకుంటుంది.

సరే. ఆత్మ సద్రూపంగా ఉంది అన్నప్పుడు అది మనకు ఎలా తెలిసింది? ఎవరు తెలుసుకున్నారు? 'సత్' పదంతో తెలిసిన సదాత్మ చైతన్య స్వరూప మని తెలుసుకున్నాం. చైతన్య రూపమైన సదాత్మను తెలుసుకొనేందుకు మరొక చైతన్యం ఉందా? అదే గనుక జరిగితే, చైతన్యాలు రెండు ఉన్నాయని అంగీకరించవలసి వస్తుంది. ఇది సాధ్యమా?

కనుక సత్తును తెలుసుకొనేందుకు చిత్తు ప్రత్యేకంగా లేదు. చిత్తు ప్రత్యేకంగా ఉండి తెలుసుకుంటే సత్ దృశ్య మవుతుంది. దృశ్య వస్తువు ఏదైనా జడమే కనుక సద్వస్తువు జడ మవుతుంది. జడమైనది సద్వస్తువు ఎలా అవుతుంది? **"సత్పద"** లక్షణమే దెబ్బతింటుంది. కనుక సత్తే చిత్తు. చిత్తే సత్తు. తన ఉనికికి ఎలాగైతే మరొక దానిపై ఆధారపడక ఆత్మ సత్తు అయినదో, అలాగే తన ప్రకాశానికి కూడా మరొక దానిపై ఆధారపడక చిత్తుగా శోభించింది. **(సత్తా స్ఫూర్తి విషయే పరానపేక్షః).**

ప్రపంచంలో ఉన్న వన్నీ ఉన్నవే కాని సత్యంగా ఉన్నవి కావు. ఉన్న సమయాన సత్యాలుగా తెలుస్తున్నాయి. ఒక సమయాన లేకుండా పోతాయి. అప్పుడు లేనివిగా తెలుస్తున్నాయి. ఎవరికి తెలుస్తున్నాయి? ఉన్నదానికా? లేనిదానికా? పోయినట్లు తెలిసేది ఉన్నదానికే. అదే సత్యం. అదే చైతన్యం. అదే ఆత్మ.

ఆత్మ పోయేది కాదు. ఎందుకని? రాలేదు కనుక. ఒకవేళ ఆత్మ పోయేదే అనుకుందాం. ఆత్మ పోతే, అలా పోయిందని తెలుసుకొనే దెవరు? కనుక ఆత్మ **స్వయం అస్తి. స్వయం భాతి.** కనుక అది సచ్చిదాత్మ.

'అహమస్మి' నేను ఉన్నాను అన్నప్పుడు అలా నేను ఉన్నట్లు నాకు తెలిసిందా? లేదు. 'నేను లేను' అనగలనా? నన్ను నేను నిరాకరించలేను. నా జ్ఞానాన్ని మాత్రం ఎలా నిరాకరించగలను? కనుక నేను జ్ఞానమే. చైతన్యాత్మే.

సత్త్వ భాసికా చిత్క్వ వేతరా
సత్తయాహి చిత్ చిత్తయాహ్యహం

"సత్తును ప్రకాశింప చేసే చిత్ సత్తు కన్నా వేరుగా ఉందా? కనుక సత్తే చిత్తు. చిత్తే నేను" అని సచ్చిదాత్మ వైభవాన్ని వర్ణించారు రమణ మహర్షి.

ఆనందః

ఆనందము సర్వులకు సమ్మతము. ఇంతకీ ఆనందానికి మూల మేమిటి? ఏది సుఖమో అదే ఆనందము. సుఖము ఏది? ఏది ప్రియమో అదియే సుఖము.

బావుంది. ఏది ప్రియ వస్తువు? ప్రియ మైనది అంటే, ఎవరికి? అనే ప్రశ్న వెంటనే పడుతుంది. ఎందుకని? ఒకరికి ప్రియమైన వస్తువు మరొకరికి ప్రియం కాదు. వస్తువులో ప్రియత్వము ఉంటే, అట్టి వస్తువు అందరికీ ప్రియంగా ఉండాలి.

పోనీ ఒక్కరికైనా ప్రియంగా ఉంది కదా! అని వాదిస్తే, దానికి ప్రతివాదం ఉంది. నేడు ఒకరికి ప్రియమైనది మరొక కాలంలో ప్రియం కాకుండా పోవచ్చు.

కనుక, ప్రియత్వము అనేది వస్తువుకు సంబంధించింది కాదు. దృశ్య విషయానికి సంబంధించింది కాదు. ఇక మిగిలింది **విషయి.** అదే నీవు. నీవే ప్రియవస్తువు. నీవు నీకు ప్రియం కనుకనే విషయాలు ప్రియంగా గోచరిస్తూ ఉన్నాయి. **(ఆత్మనస్తు కామాయ సర్వం ప్రియం భవతి).**

విషయంలో ఉండే ఆకర్షణ విషయిదే. అన్ని ప్రేమల వెనుక పరమప్రేమే ఉంది. అనుభవంలో ఆనందం లోపించవచ్చు నేమో గాని అనుభవానికి ఆధారమైన నీలో ఆనందం లోపించదు.

గాఢనిద్రలో వస్తు ప్రపంచం లేకపోవచ్చు. కాని, ఆనందము లేదని చెప్పగలమా? ఆనందం ఉండబట్టే త్వరగా లేవాలి అంటే అంగీకరించడు మనిషి. దీనిని బట్టి మనకు ఏమి అర్థమవుతుంది? సుఖించటానికి బాహ్య వస్తువు అవసరం లేదు. ఆత్మే ఆనంద హేతువు. ఆనంద స్వరూపము. అనంతానంద స్వరూపము.

అందుకనే, నీవు ఆనందానుభూతిలో ఉన్నప్పుడు నా వద్ద ఆనందం ఉంది అంటున్నావా? నేను ఆనందంగా ఉన్నాను అంటున్నావు. ఉన్నాను అనేది సత్. అది ఎవరికి తెలుస్తూ ఉంది? నీకే. కనుక సత్ అయిన నీవు చిత్‌గా ఉండి చెబుతున్నావు. ఏమని? ఆనందంగా ఉన్నాను అని. ఇదే సచ్చిదానందం. జీవుని నిజ స్వరూపము.

ఈ ఆనందము అనుభవము కాదు. వృత్తి విశేషము కాదు. పెరిగేది కాదు; తరిగేది కాదు. ఇదే నిత్యతృప్తి. నీవే తృప్తాత్మవు.

ఉన్నది - తెలియనిది

ఆనంద స్వరూపమైన ఆత్మయే ప్రియ హేతువు అని తెలియని కారణంగా వస్తువుల్ని ప్రియ హేతువుగా భావించి వాటిని ప్రియంగా ఆశిస్తున్నాం. ప్రియం గాని వాటిని ప్రియంగా భావించటానికి కారణము ప్రియమైన ఆత్మ తెలియకపోవటమే. ఆత్మ తెలియటం లేదు అంటే ఆత్మ లేదని అర్థమా? లేనిదే అయితే, తెలియటం లేదు అని ఎలా అనగలం? ఉన్నదే; తెలియకుండా ఉన్నది!

ఉండి తెలియకపోవటం అజ్ఞానము. అజ్ఞానము ఎప్పుడైతే ఉందో ఏదైనా తెలియ వచ్చు. ఎలాగైనా తెలియవచ్చు. ఏది ఎలా తెలిసినా అది అజ్ఞాన విషయం గానే ఉంటుంది. మనకు సంబంధించిన జ్ఞానం లేకపోవుటయే అజ్ఞానము. అజ్ఞానంలో ఏ సమస్య తలెత్తినా ఆశ్చర్యపడ నవసరం లేదు. సమస్య అజ్ఞానజనిత మైనపుడు అది బాహ్యానికి సంబంధించినది కాదు.

అజ్ఞానం ఉన్న వ్యక్తి దేనినైనా స్వరూప స్థాయి నుండి చూడలేడు. అజ్ఞాన స్థాయి నుండే చూస్తాడు. ఇక్కడే దోష దర్శనానికి అవకాశం. లేనిదానిని ఆరోపించుకుని చూసే పరిస్థితి ఇక్కడే కలుగుతుంది. ఉపాధి తాదాత్మ్యం అజ్ఞానం వలననే కలుగుతుంది.

'నేను దేహం' అనుకుంటాడు. దేహం పరిమితమైనది కనుక తనను తాను పరిమితుడుగా భావించుకుంటాడు. పుట్టేవాడుగా, చచ్చేవాడుగా ఊహించుకుంటాడు. మార్పుల మధ్య కలత చెందుతూ ఉంటాడు. **(అనాత్మానం శరీరం అహం ఇతి కలయతి).**

ఇదే పరిచ్ఛిన్నత్వం. అంటే, **దేశతః** దేహం పరిమితం. **కాలతః** దేహం పరిమితం. **వస్తుతః** దేహం పరిమితం.

ఒక కాలంలో లేదు. ఇప్పుడుంది. భవిష్యత్తులో ఉండబోదు. ఇది కాల పరిచ్ఛేదం. ఈ ప్రదేశంలో ఉంది. మరొక చోట లేదు. ఇది దేశ పరిచ్ఛేదం. ఈ దేహం కుర్చీ కాదు. చెట్టు కాదు. ఇది వస్తు పరిచ్ఛేదం.

దేహ భేదాలు జాతి భేదాలుగా కూడా తెలుస్తున్నాయి. ఇది మానవ దేహం. అది పశు దేహం. ఇది పక్షి దేహం. ఇది జాతి భేదము. ఇది విజాతీయ భేదము.

మానవ జాతిలోనే చూచినా, నా దేహం వేరు, అతని దేహం వేరు. ఆమె దేహం వేరు. అన్నీ దేహాలే అయినా భేదాలు స్పష్టంగా తెలుస్తున్నాయి. లింగభేదం కూడా ఉంది. ఇది సజాతీయ భేదము.

తన దేహం లోనే భేదాలు తెలుస్తున్నాయి. ఒక చెంప ఉన్నట్లు వేరొక చెంప లేదు. ఒక చేతి కున్న బలం మరొక చేతికి లేదు. ఒక కంటి వైభవము మరొక కంటికి లేదు. రెండు పెదవులు ఒకేలాగ లేవు. ఇదంతా స్వగత భేదము.

ఈ భేదాలన్నీ సచ్చిదానంద స్వరూపమైన ఆత్మ స్థాయి నుండి చూడబడటం లేదు. దేహ స్థాయి నుండే చూడబడుతున్నాయి. అంతవరకు ఫరవాలేదు. ఈ పరిచ్ఛిన్న దోషాలు ఆత్మపై ఆరోపించబడుతున్నాయి.

ఈ కారణం గానే నేను పరిమితుణ్ణి. నేను పరిచ్ఛిన్నుణ్ణి అంటూ ఉంటాము. పరిచ్ఛిన్నత్వం ఎక్కడుంది? దేనికి సంబంధించింది? విషయానికా? విషయికా? ఇక్కడే విచారము లోపిస్తుంది.

మనం ఇప్పుడు చూచినట్లుగా పరిచ్ఛిన్నత్వం దేహానికి సంబంధించింది. **(దేహః పరిచ్ఛిన్నః, దేశతః వస్తుతః కాలతః పరిచ్ఛిన్నః).** అలాగే మనస్సు కూడా పరిచ్ఛిన్నమే. మనస్సుకు హద్దు లున్నాయి. పరిధు లున్నాయి. అవధు లున్నాయి. **(మనః పరిచ్ఛిన్నం).** మరి ఇంద్రియాలు? అవి పరిమితాలే. కళ్ళు వినలేవు. చెవులు చూడలేవు. కళ్ళు చూచినా కొంతవరకే చూస్తాయి. చెవులు వింటాయి. కొంత దూరమే. కనుక ఇంద్రియాలు కూడా పరిచ్ఛిన్నాలే **(ఇంద్రియాణి పరిచ్ఛిన్నాని).**

ఇవన్నీ పరిచ్ఛిన్నంగా ఉండొచ్చు. అలా అని వాటికి తెలుసా? నేను అందంగా లేను అని దేహం భావిస్తూ ఉందా? నేను బాధ పడుతున్నాను. నేను మెల్లను అని కన్ను చెప్పటం లేదు. కన్ను వ్యథ చెందటం లేదు. మెల్లను నేను ఒల్లను అని కలతపడు తున్నాను. మనస్సులో ఆందోళన ఉంటే ఉండవచ్చు. అలాగని, మనస్సు బాధపడుతూ ఉందా? బాధాపూరిత మైన ఆలోచనలు మనస్సులో నడిస్తే నడవవచ్చు గాక. ఇలాంటి

ఆలోచనలు నాలో ఎందుకు నడుస్తున్నాయి? అని మనస్సులో ఆవేదన ఉందా? అలా ఉండ గలిగితే, ఆవేదనా పూరితమైన ఆలోచనలను మనస్సు ఎందుకు చేస్తుంది? మనస్సు విషయంలో మనస్సుకు ఫిర్యాదులు లేవు. నాకున్నాయి. అర్థమైందా?

విషయంలో పరిచ్ఛిన్నత్వం గోచరించటం లేదు. "ఇదం"లో తెలియనిది "అహం"లో తెలుస్తోంది. పరిచ్ఛిన్నత్వం నాపై కేంద్రీకరింపబడి ఉంది. అదే అహం భావన. అహంభావన అజ్ఞానం వలన ఏర్పడింది. అజ్ఞానం తొలగితే, ఏ 'అహం' అయితే అహంభావనగా తెలుస్తూ ఉండినదో అదే అహం స్వరూపంగా ఉంటుంది. సచ్చిదానందంగా శోభిస్తుంది. అఖండాత్మగా అనంతాత్మగా భాసిస్తుంది.

అహంభావన వలన ఇదం భావనలు కదుల్తాయి. కర్త, భోక్త అన్నీ ఇక్కడ నుండే. సంసారానికి సర్వోపద్రవాలకు, జన్మకర్మలకు ఆద్యస్థానం ఇదే. సమస్యలన్నీ 'అహంభావన'తోనే గాని, 'ఇదం'తో కాదు. 'అహం స్వరూపం' తోనూ కాదు.

మెడలో బంగారు నగ ఉంది. బంగారు నగ ఏదో కాదు; బంగారే. నగకు నేను నగను అనే భావన ఏర్పడితే అదే అహంభావన. ఇక నగకు అన్నీ సమస్యలే.

నేను మెడలో ఉన్నాను. అన్ని ఆభరణాల కన్నా నేనే గొప్పదానను. ఎదుటి వారికి ముందుగా నేనే కనిపిస్తాను. అందరి కళ్ళు నాపైనే ఉంటాయి. పలుకు కదిలే చోట నేను కులుకుతున్నాను అనుకుంటుంది. అంతే కాదు. అంతటితో ఆగదు.

మనిషి పలుకుతూ ఉంటే, చేతులు కదుల్తూ ఉంటాయి. చేతులు కదిలించ కుండా మనిషి మాట్లాడలేడు. చేతులు కదుల్తూ ఉంటే, చేతి వేలికి ఉన్న ఉంగరము ఎదుటి వారి కంటబడుతుంది. "ఉన్నచోట ఉండకుండా క్షణక్షణానికి ఈ ఉంగరము పైకి లేస్తోంది. ఎదుటివారి దృష్టిని ఆకర్షిస్తోంది. మాట్లాడేచోట ఉన్నతంగా నేనున్నాను. తన స్థాయి ఏమిటో తెలియకుండా ఉంగరము గంతు లేస్తోంది. తనలో ఉన్న బంగారు ఎంత? నాలో ఎంత బంగారు ఉంది"; ఇలా ఉంగరంపై ద్వేషాన్ని పెంచుకుంటుంది.

ఈ విధమైన సమస్యలు స్వర్ణానికి లేవు. గొలుసు బుద్ధి ప్రమాదం. బంగారు బుద్ధి ప్రమోదం. తాను గొలుసు అని భావిస్తూ ఉన్నంత వరకు గొలుసుకు సమస్యలు తప్పవు. తాను బంగారమే అని తెలియగానే సమస్యలన్నీ క్షణంలో అదృశ్య మవుతాయి. త్రాడు తెలియగానే సర్ప భ్రాంతి, భయం దూరమైనట్లు దూర మవుతాయి.

'అహంభావన' ఉన్నంత వరకు సంసారము, సంతాపము తప్పవు. అహం స్వరూపం తానే నని తెలియగనే అహంభావన, అది సృష్టించే సమస్యలు అన్నీ అంతరిస్తాయి. అహంభావన ఏమిటో విచారిస్తే అది అహం స్వరూపమే నని తేలుతుంది. ఇదియే జ్ఞానము. స్వరూప జ్ఞానము. ఆత్మ స్వరూప జ్ఞానము. కనుక ఆత్మ విచారము ముఖ్య విషయంగా ఉంది. **అతః సర్వానర్థ నివర్తక హేతుత్వాత్ ఆత్మ వస్తునః విచారః కర్తవ్యః.** సర్వానర్థములు తొలగాలి అంటే ఆత్మ విషయంలో విచారమును సాగించాలి.

స్వరూప జ్ఞానము లేకపోవుటే అజ్ఞానము. అజ్ఞానము వలననే పరిచ్ఛిన్నత్వము

ఏర్పడింది. అజ్ఞానము నశిస్తే, పరిచ్ఛిన్నత్వము ఎలా ఉంటుంది? కనుక అజ్ఞానము నశించాలంటే జ్ఞానం కలగాలి. స్వరూప జ్ఞానం కలగాలి. స్వరూప జ్ఞానంలో పరిచ్ఛిన్నత్వము ఉండదు. **దేశతః కాలతః వస్తుతః** స్వరూపము అపరిచ్ఛిన్నమై భాసిస్తుంది. ఇదే అనంత స్వరూపము. అనంత జ్ఞానము. అద్వయ స్వరూపము. ఇదే ఆత్మ. **(ప్రత్యక్ చైతన్యం భాతి).**

ఆత్మ అఖండము, అద్వయము కనుక ఆత్మను నీకన్నా వేరుగా ఎప్పుడూ తెలుసు కోలేవు. నీవే ఆత్మగా ప్రకాశిస్తావు. ప్రకాశాత్మగా శోభిస్తావు. స్వస్వరూప ఆనందంగా భాసిస్తావు. ఇదే స్వరూప సుఖం. నైమిత్తిక సుఖం కాదు. నిర్నిమిత్తానంద స్వరూపము.

స్వానంద భావే పరితుష్టిమన్తః

తన స్వరూపానందంలోనే యతివరేణ్యుడు ఆనందరూపుడై ఉన్నాడు.

(స్వస్య ఆనందభావే పరితః తుష్టిమన్తః)

ఆత్మను ఈ విధంగా తెలుసుకోవాలి. **(తం ఆత్మానం విద్ధి).** ఆత్మ ఉన్నదే. తెలియకుండా ఉన్నది. క్రొత్తగా కలిగేది కాదు. అజ్ఞానం వలన ఉన్నది తెలియటం లేదు. జ్ఞానంలో తెలుస్తుంది. ఆత్మ పుట్టదు. ఆత్మజ్ఞానం పుడుతుంది. ఇదే ప్రధాన మైన విషయం కనుక జ్ఞానం కొరకు శ్రవణం చేయాలి.

ఆత్మవా అరే శ్రోతవ్యః

ఆత్మను గూర్చి శ్రవణం చేయాలి. కనుక శాస్త్రము, గురువు ప్రధానంగా తెలుస్తూ ఉన్నారు. శ్రవణమే ముఖ్య సాధనగా ఉంది. శ్రవణము సాధన కాగా జ్ఞానము ఫలమై ఉంది. ఇదే ప్రమాణ ఫలం. ప్రమాణ ఫలం స్వరూపలాభం. ఆత్మలాభము. అదియే మోక్షము.

జ్ఞేయం యత్తత్ప్రవక్ష్యామి యద్ జ్ఞాత్వా అమృత మశ్నుతే

ఏది తెలియ దగినదో **(యత్ జ్ఞేయం)**, దేనిని తెలుసుకొనినచో **(యద్ జ్ఞాత్వా)** అమృతమును, అనగా మోక్షమును పొందుచున్నాడో **(అమృతం అశ్నుతే)** దానిని చెబుతున్నాను **(తత్ ప్రవక్ష్యామి)** అన్నాడు గీతలో గీతాచార్యుడు. ఏ ఆచార్యు డైనా ఇలాగే చెబుతాడు.

అద్వైతానుభూతి

"అహం అస్మి". నేను ఉన్నాను అని నాకు తెలుసు. **"అహమేవ"** 'నేనే' అంటున్నాను. నేను ఎలా ఉన్నాను అని చూచినపుడు, విచారించినపుడు, సచ్చిదానందంగా భాసిస్తున్నా నని తేలింది. ఇదియే మోక్షము. ఇది ఆత్మజ్ఞానము వలననే ప్రాప్తించింది. కనుక ఆత్మజ్ఞానము లేకుండా మోక్షం రాదు. **(ఆత్మైక్య బోధ వినా మోక్షో న సిద్ధ్యతి).**

ఆత్మజ్ఞానము వలన ఆత్మకు సంబంధించిన అజ్ఞానము నశించింది. అజ్ఞానము ఎప్పుడైతే నశించిందో, అజ్ఞానము సృష్టించిన సంసారము, సంసార దుఃఖములు కూడా నశించాయి. ఇది జ్ఞానఫలము **(ఆత్మ జ్ఞానేన ఆత్మ అజ్ఞానం నశ్యతి, తతః ఆత్యంతిక సంసార దుఃఖ నాశః భవతి, భవిష్యతి ఇత్యర్థః).**

అనాత్మను ఆత్మగా భ్రమించి కొనితెచ్చుకున్న ప్రమాదాన్ని ప్రమ (జ్ఞానం) ద్వారా పోగొట్టుకోవాలి. కనుక విషయముల నుండి (దృశ్య ప్రపంచం నుండి) విషయిని (ఆత్మను) వేరు చేసి అర్థం చేసుకోవాలి. తటస్థ లక్షణం ద్వారా మనం అదే చేశాం. **(దృశ్యవర్గాత్ ఆత్మానం వివిచ్య, పృథక్ కృత్యా ఇతి).**

నేను ఉన్నాను. ఏ సంబంధాలు లేనివాడుగా ఉన్నాను. అద్వయంగా ఉన్నాను. ఇదే అహం స్వరూపము. ఇదే ఆత్మ యొక్క అఖండత్వము. స్వరూపలక్షణం ద్వారా కలిగిన అద్వైతానుభూతి.

ఈ అనుభూతిలో అంతా ఆత్మయే. అన్నీ ఆత్మయే. పరిచ్ఛిన్న దోషాన్ని తొలగించుకొనేందుకు దేహము ఆత్మ కాదు అని నిర్ణయించాము **(దేహః ఆత్మా న భవతి).** మరి అఖండాత్మకు దూరంగా దేహం ఉండగలదా? బంగారును విడిచి నగ మనగలదా?

ఆత్మ చైతన్య స్వరూపము. దేహంలో చైతన్య ముంది. మనస్సులో చైతన్య ముంది. కనుకనే, దేహం కదులుతూ ఉంది. మనస్సు ఆలోచిస్తూ ఉంది. ఇవి లేకపోయినా చైతన్యాత్మ ఉంది. తమ మనుగడకు దేహ మనస్సులు చైతన్యంపై ఆధారపడి ఉన్నాయి. అవి లేకపోయినా చైతన్యాత్మ స్వప్రకాశమై ఉంటుంది. కనుక సర్వాధార మైన చైతన్యాత్మ నిరాధారమై ఉంది.

వృత్తిలో చైతన్యం ఉంది. వృత్తిని ప్రకాశింప చేస్తూ ఉంది. వృత్తి లేకుండా స్వప్రకాశమై తానే ఉంది. ప్రజ్ఞానంగా ఉంది **(తత్ ప్రజ్ఞాన మీరితమ్).** అదే సద్రూప చైతన్యంగా సదా భాసిస్తూ ఉంది. **(తత్ ప్రజ్ఞానం అస్తిత్వేన సదా భాతి).** స్వతస్సిద్ధంగా ఉంది. స్వప్రకాశంగా ఉంది. ఇదే నా స్వరూపం అని ఎప్పుడు తెలుస్తుందో ఆ క్షణమే నేను పరిమితాల నుండి, పరితాపాల నుండి విడిపోతున్నాను. అన్నిటిలో ఉన్నా, అన్నిటిని ప్రకాశింప చేస్తున్నా, వాటికి విలక్షణంగా స్వరూపానుభూతిలో ఉన్నాను. **(అసంగోహం, సచ్చిదానంద రూపోహం).**

రాకపోకలు అర్థం గాని సుఖం నేనై ఉన్నాను. నిత్యతృప్తుడనై ఉన్నాను. అవినాశినై ఉన్నాను. అనంతాత్మనై ఉన్నాను.

సరే. బాగుంది. ఇక అసంతృప్తి లేదు. నేనే తృప్తాత్మను. మరి ఈ ప్రపంచం ఏమిటి? దాని స్వరూప మేమిటి? అది కూడా తెలుసుకుందాం. ఆ తరువాత, దానికి మనకు సంబంధం ఉంటే, అది ఎలా ఉందో కూడా అర్థం చేసుకుంటాం. జీవ స్వరూపం అర్థమైంది. జగత్స్వరూపం చూద్దాం.

జగత్తు (సృష్టి)

ఇదేమిటి? (ఇదం)

ఏదైనా ఉన్నది అంటే, అలా ఉన్నట్లు తెలిసినపుడే "అది ఉన్నది" అనే మాట ఉంటుంది.

'జగదస్తి'. జగత్తు ఉన్నది. తెలిసినపుడే అది ఉన్నట్లు అర్థం. ఇంతకీ జగత్తు ఎవరికి తెలిసింది? తాను ఉన్నట్లు జగత్తు చెప్పిందా? లేక మనం చెబుతున్నామా?

'జగత్తు ఉంది' అని మనిషి చెబుతున్నాడు. అలా ఉంది అని చెప్పే మనిషి జగత్తుకు వేరుగా ఉండి చెబుతున్నాడా? లేక జగత్తులో భాగమై చెబుతున్నాడా?

జగత్తుకు బాహ్యంగా ఉండే చెబుతున్నాడు. బాహ్యంగా లేకపోతే జగత్తును ఎలా అధ్యయనం చేయగలడు? తెలుసుకొనేవాడు తెలియబడే దానికన్నా వేరుగా ఉండే పరిశీలిస్తాడు. పరిశోధిస్తాడు. విశదీకరిస్తాడు.

సరే. జగత్తుకు బాహ్యంలో ఉండి జగత్తును ఎలా అధ్యయనం చేయగలడు? జగత్తులో ఏ పరిశోధనలు జరిగినా జగత్తులోని శాస్త్రజ్ఞులే చేస్తున్నారు. జగత్తులో తాను ఒక భాగం కాకపోతే, విభాగం లేకుండా ఉండకపోతే జగత్తును ఎలా తెలుసుకుంటాడు?

జగత్తుకు బాహ్యంలో ఉండి తెలుసుకోలేడు. జగత్తులో తాను అభిన్నంగా ఉండేటప్పుడు, తనను తెలుసుకుంటే జగత్తు తెలిసినట్లే. అలలో ఉన్న జల స్వరూపము తెలిస్తే, సాగర జలము యొక్క స్వరూపము తెలిసినట్లే.

'అహమస్మి' నేను ఉన్నాను అంటున్న మనిషి స్వరూప స్వభావా లేమిటో 'జీవుడు' అనే విషయ చర్చలో సంపూర్ణంగా తెలుసుకున్నాం. **దేశతః కాలతః వస్తుతః** పరిచ్ఛిన్నం కాని అనంత స్వరూపునిగా గ్రహించాము. తాను అనంతుడే. మరి, ఈ జగత్తేమిటి? ఇది సృష్టి యేనా? అంటే, సృష్టి జరిగిందా? ఇవన్నీ అతి ప్రధానమైన విషయాలు.

ఈ జగత్తు (ఇదం జగత్)

జగత్తు ఉంది. నాకన్నా ముందే ఉంది. మహికి మనుగడ ఉంది. మహిలో మనుగడ ఉంది. మనుగడను సాగించటానికి మనస్సు ఉండ నవసరం లేదు. మనస్సు ఉంటేనే మనుగడ అర్థ మవుతుంది.

ప్రాణం లేకపోయినా గడియారం పని చేస్తుంది. మనస్సు లేకపోయినా మేఘాలు ఊరేగుతాయి. ప్రాణం లేకపోతే మనిషి కదలలేడు.

ప్రాణాన్ని తీసుకొని ఈ జగత్తులోకి మనిషి వచ్చాడు. ప్రాణ దీపం కొడిగట్టకుండా ఉండటానికి తైలాన్ని ఒడిలో కట్టుకొని రాలేదు. ప్రాణవాయువు ఈ జగత్తులో సిద్ధంగా ఉంది.

ఇక్కడే మనిషి జన్మించాడు. ఇక్కడే జీవించాడు. ఇక్కడే తిరిగాడు. ఇక్కడే తిని, ఇక్కడే ఆడుకున్నాడు. చదువుకున్నాడు. ఎన్నో తెలుసుకున్నాడు. తెలియనివి చాలా ఉన్నాయని తెలుసుకున్నాడు.

ఎన్నో సుందరమైన రూపాలు, ఎన్నో అందమైన రంగులు, మరెన్నో శ్రావ్యమైన శబ్దాలు ఈ జగత్తులో ఉన్నాయి. వీటన్నిటినీ చూపేందుకు ఆకాశంలో అద్భుతమైన దీపం, ఆరని దీపం నాకన్నా ముందే వెలుగుతూ ఉంది.

పచ్చని చెట్లున్నాయి. వెచ్చని కాంతి ఉంది. చల్లని నీళ్ళున్నాయి. మెత్తని పువ్వులున్నాయి. చిరునవ్వు లున్నాయి. హోరు గాలు లున్నాయి. విశాలమైన ఆకాశం ఉంది. గంభీరమైన సముద్ర ముంది.

ఇవి ఉన్నాయి. నాకు తెలుస్తూ ఉన్నాయి. ఇవి ఇలా ఉండాలి అని నేను అనుకోలేదు. వీటిని అర్థం చేసుకోవటానికే నా జీవితం సరిపోవటం లేదు. ఇక నేను వీటిని ఎలా సృష్టిస్తాను?

నేను పిలిస్తే ఇవన్నీ వచ్చి ఉంటే, నేను పోవద్దు అంటే ఎందుకు పోతాయి? ఉన్నవి పోతున్నాయి. తెలుస్తూ కొన్ని పోతున్నాయి. పోయి కొన్ని తెలుస్తున్నాయి. అందుకనే, ఉన్నవాటిని "ఇంకా పోలేదా?" అంటూ ఉంటాను. ఏదీ అర్థం కానందున అసలే లేని వాటిని "ఇంకా రాలేదా?" అని అమాయకంగా ప్రశ్నిస్తూ ఉంటాము. ఏమిటి? మీ అమ్మాయికి ఇంకా సంతానం కలగలేదా? అని విచిత్రంగా ప్రశ్నించేది మనమే.

ఇలా అర్థమవుతూ, అర్థం కానట్లే మిగిలిపోయే ఈ ప్రపంచం కార్యరూపంగా మనకు తెలుస్తూ ఉంది. కార్యాన్ని చూస్తున్నాను. కారణాన్ని ఊహించలేక పోతున్నాను.

ఈ గందరగోళానికి శ్రీకారం చుట్టింది నేను కాను. నాకన్నా ముందే చాలా మంది విరివిగా ఆలోచనలు సాగించారు. విచ్చలవిడిగా సిద్ధాంతాలను వితరణ చేశారు. మరీ తెగ ఆలోచించేవారు, తెగించి ఆలోచించేవారు పంచిన గ్రంథాలను ఉంచడం చేత విశాలమైన విశ్వము ఇరుకైందని కొందరి అభిప్రాయము. కాదు కాదు; మురికి అయిందని మరి కొందరి అభిమతం.

ఏది ఏమైనా తీరం చేరి స్నానం చేయకుండా తిరిగిపోలేము. మనం ఉన్న ప్రపంచాన్ని అర్థం చేసుకోకుండా ప్రపంచం నుండి నిష్క్రమించలేము. ఇంతకీ ఇది ఏమిటి? ఎలా వచ్చింది? దీనికి కారణ మంటూ ఉందా? ఈ జగత్తు సృష్టింపబడిన దేనా? కాదా? దీనికి కర్త ఉన్నాడా? లేడా? ఉంటే ఎక్కడ ఉన్నాడు? ఈ సృష్టిని ఎలా చేశాడు? ఇవన్నీ ప్రశ్నలే.

ప్రశ్న లున్న చోట జవాబులు ఉండకపోవు. ప్రశ్న ఒక్కటే అయినా జవాబులు అనేకులు చెబుతారు కనుక అవి అనేకంగా ఉంటాయి. ఎన్నో ఉంటాయి. కొన్ని అర్థ మవుతాయి. కాని, వాటిలో అర్థ ముండదు. కొన్ని అర్థ మైనట్లే ఉంటాయి. కాని, అర్థం కానే కావు.

ఇది అలాగే ఉంటుందని కొందరు. ఇంకా పరిశోధనలు జరగవలసి ఉంది అని మరి కొందరు. "నీకు అర్థం కాదు; నేను చెప్పింది నమ్మేయ్" అని ఇంక కొందరు.

నమ్మకము - జ్ఞానము

జీవితంలో కొన్నిటిని నమ్మాలి. కొన్నిటిని అర్థం చేసుకోవాలి. నమ్మటానికి వివేకం అవసరం లేదు. అర్థం చేసుకోవటానికి వివేకం ఉండి తీరాలి. నమ్మవలసిన వాటిని అర్థం చేసుకోవాలని భావిస్తే ప్రయోజనం ఉండదు. అర్థం చేసుకోవలసిన వాటిని నమ్మి సాధించేదీ ఉండదు.

సముద్ర జలం ఉప్పగా ఉంటుంది అనేది మనం నమ్మ నవసరం లేదు. కాని, పాల సముద్రం అంటే మాత్రం నమ్మవలసిందే. సముద్ర జలం ఉప్పుయేనా? కాదా? అనే సందేహ మొస్తే, పరిశీలించుకోవచ్చు. పాలసముద్రం విషయాన్ని ఎలా పరిశీలించాలి? పరీక్షించాలి? సంవాదీకరణానికి సానుకూలమా?

శాస్త్రం చెబుతూ ఉంది; కనుక నమ్మాలి. అంతే. విమర్శించి, విశ్లేషించి సాధించేది ఉండదు.

ఈ లోకం ఉంది. ఆ లోకం ఉంది అంటే నమ్మవలసిందే గాని, పరిశీలించి చూసుకోలేము. ఈ లోక మున్నట్లే గోలోకం ఉంది. ఇక్కడ బృందావన మున్నట్లే గోలోకంలో బృందావన ముంది అని ఎవరైనా చెబితే ఏం చేయాలి? ఇష్టముంటే నమ్మవచ్చు. వివేకానికి అందని విషయం కనుక నమ్మలేను అనవచ్చు. ఎవరి అభిప్రాయాలు వారివే.

ఆ లోకము ఉంది అని చెప్పే దెవరు? ఈ లోకంలో ఉన్నవాడా? ఆ లోకాన్ని చూచిన వాడా? పోయినవాడు తిరిగి వచ్చి చెప్పడు. ఉన్నవాడు పోయినవాడు కాడు. ఇక నమ్మకం గాక మిగిలే దేముంటుంది?

మరి ఈ సృష్టి నమ్మకం క్రిందికి వస్తుందా? జ్ఞాన పరిధిలో నిలుస్తుందా? చూద్దాం. ముందు ఇది సృష్టేనా? కాదా? అనేది విచారించుకుందాం.

సృష్టం జగత్

ఈ జగత్తు సృష్టియే. ప్రపంచం సృష్టింపబడింది. ఇది సిద్ధాంతము. సృష్టింపబడింది అంటే అంతకు ముందు లేదు అని అర్థము. లేనిది కలిగితేనే సృష్టి. సహజంగా ఉంటే దానిని సృష్టి అంటామా? అనలేము.

గడియారం ఉంది. అది సృష్టి. కుర్చీ ఉంది. అది సృష్టి. కుండ ఉంది. అది సృష్టి. ఇవన్నీ సృష్టి అని ఎందుకు చెబుతున్నాం? లేనివి కలిగాయి కనుక. తయారు చేయక ముందు గడియారం లేదు. కుర్చీ లేదు. కుండ లేదు.

ఏది సృష్టింపబడినా అందులో..........

(1) పద్ధతి ఉంటుంది

(2) ప్రయోజనం ఉంటుంది.

(3) అందం ఉంటుంది.

(4) అర్థం ఉంటుంది. దీనినే నియతి అంటారు.

కుండను చూడండి. మూత ఒక వైపే ఉంది. అది నీళ్ళ కుండ. రెండు వైపుల తూముకు తూట్లు వేసినట్లు వేస్తే నీళ్ళు ఎలా నిలుస్తాయి? కుండ ఆరడుగుల ఎత్తు ఉంటే నీళ్ళు ఎలా ముంచుకొని త్రాగుతాము? దాని పరిమాణాన్ని చూసినా, ఎత్తు చూసినా, చుట్టు కొలత చూచినా అందులో ఒక పద్ధతి తెలుస్తూ ఉంది. ప్రయోజనం అర్థ మవుతూ ఉంది. అర్థవంతంగా ఉంది. ఎలా ఉండాలో అలా ఉంది కనుక అందము ఉంది.

గడియారం కూడా అలాగే ఉంది. చేతి గడియారం గోడ గడియారం లాగ లేదు. చేతికి కట్టుకొనేది కనుక గొలుసు ఉంది. గోడకు తగిలించేది కనుక రంధ్ర ముంది.

కుర్చీ కూర్చొనేందుకే కనుక పదహైదు అంగుళాల ఎత్తు ఉంది. ఆనుకొనేందుకు వెనుక భాగ ముంది. చేతులు పెట్టుకొనేందుకు కుర్చీకి కరము లున్నాయి. ఇలా ఏది చూసినా సృష్టింపబడింది అంటే పద్ధతి, ప్రయోజనం, అందం, అర్థం ఉంటాయి. అలా ఉంటేనే సృష్టి. **(యత్ సృష్టం, తత్ సుకృతం).**

నియతి - నియంత

సృష్టి ఏదైనా, నియతి ఉంటుంది. నియతి ఉన్నచోట నియంత ఉండాలి. కుండ ఎప్పుడైతే సృష్టి అని తెలిసిందో, నియతి ఉన్నందున దానిని సృష్టించిన నియంత ఉండాలి అనేది నిర్వివాదాంశం. అతడే కులాలుడు. కుండను సృష్టించిన సృష్టికర్త.

మట్టి తనకు తానుగా కుండ కాలేదు. కొయ్య తనంతట తాను కుర్చీ కాలేదు. మట్టికి, కొయ్యకి జ్ఞానం లేదు. నియతి తెలుస్తూ ఉంది కనుక అలాంటి నియమ బద్ధ మైన సృష్టి వెనుక జ్ఞానం కలిగినవాడు ఉండాలి అనేది సుస్పష్టం. **(యత్ సృష్టం తత్ సకర్తృకం).**

జగత్తు మంగళకరంగా ఉంది. అందంగా ఉంది. ఆహ్లాదంగా ఉంది. ఆనందంగా ఉంది. అంతే కాదు. నియమాలతో ఉంది. ధర్మాలతో ఉంది. నియతితో ఉంది. ఈ నియతిలో జ్ఞానం తెలుస్తూ ఉంది.

రాయిని పైకి విసిరితే అది తిరిగి క్రింద పడుతుంది. కారణం, భూమ్యాకర్షణ స్థితి. ఇది ధర్మం. నియతి. హైడ్రోజన్, ఆక్సిజన్ కలిసి నీరు తయారైంది. అగ్ని వేడిగా ఉండి పైకి పయనిస్తే, నీరు చల్లగా ఉండి క్రిందికి ప్రవహిస్తుంది.

సూర్యాస్తమయాలు, నదీ ప్రవాహాలు, పుష్పించే చెట్లు, ఫలించే వృక్షాలు, భూభ్రమణం, ఋతుక్రమం - ఇవన్నీ క్రమబద్ధంగా, ఫలవంతంగా, అందంగా, జ్ఞాన పూరితంగా తెలుస్తూ ఉన్నవి కనుక ఇక్కడ నియతి ఉంది అని నిర్ణయిస్తున్నాం.

అర్థమైందా? అంటే తల ఊపుతాము. తలను ఊపాలన్నా శక్తి ఉండాలి. ఈ శక్తి ప్రాణశక్తి నుండి వస్తుంది. ప్రాణశక్తికి నేను ఆహారం తీసుకోవాలి. గాలి పీల్చుకోవాలి. నీరు త్రాగాలి. సూర్యరశ్మిని గ్రహించాలి. నేను తీసుకున్న ఆహారం జీర్ణమై, శక్తి రూపంలో దేహమంతా వ్యాపించి ఉంది. ఇదంతా నాకు తెలియకుండా నా దేహంలో జరిగిపోతూ ఉంది. ఇది నియతి కాదా?

మనిషి ఆలోచించగలడు. జీవితమంతా ఒకే ఆలోచన చేయలేడు. ఎప్పుడు ఎలా ఆలోచిస్తాడో మనిషికి తెలియకపోవచ్చు. కాని, ఆలోచనలన్నీ నియతికి దూరంగా లేవు. తల్లి గర్భంలో తొమ్మిది మాసాలు ఉండి ఈ ప్రపంచంలోకి మనం వచ్చాము. ఇది నియతి. మనం సృష్టించింది కాదు. మార్చగలిగిందీ కాదు. అవగాహనతో అర్థం చేసుకోవలసింది.

భౌతిక ప్రపంచం ఉంది. భౌతిక ధర్మాలూ ఉన్నాయి. వీటిని అర్థం చేసుకొంటూ ఆలోచించాం కనుక భౌతిక శాస్త్రం వచ్చింది. మనస్సు ఉంది. మనస్సు ఆలోచిస్తుంది. ఈ ఆలోచనా విధానంలో ఒక నియతి ఉంది. దానిని అర్థం చేసుకోవటంలో మనస్తత్వ శాస్త్రం వచ్చింది.

చెట్లు పచ్చగా ఉన్నాయి. పల్లవిస్తున్నాయి. పుష్పిస్తున్నాయి. ఫలిస్తున్నాయి. వీటిని అర్థం చేసుకోవటం వలన వృక్ష శాస్త్రం ప్రాప్తించింది. నియమబద్ధంగా ఈ సృష్టిలో గ్రహాలు తాము ఉండవలసినచోట అవి ఉన్నాయి. వాటిని పరిశోధించటం చేత మనకు జ్యోతిషశాస్త్రం వచ్చింది. ఖగోళశాస్త్రం వచ్చింది.

మన దేహంలో ప్రతి కణంలో ఒక నియతి ఉంది. అవన్నీ అలా లేకుండా పోతే ప్రమాదం. వీటిని అధ్యయనం చేయటం వలన వైద్య శాస్త్రం వచ్చింది. నియతి ఉంది కనుకనే ఇన్ని శాస్త్రాలు వెలుగు చూశాయి. ఇంకా అనేక నూతన విషయాలు పరిశోధనల ద్వారా వెలుగులోకి వస్తున్నాయి. ఇదంతా నియమం. ధర్మం. సృష్టిలో క్రమం. ఈ క్రమమే నియతి.

నియతి ఉన్నచోట జ్ఞానం సుస్పష్టంగా ఉన్నందున నియంత ఉండి తీరాలి. ఇది నమ్మకం కాదు; జ్ఞానం. ప్రత్యక్ష జ్ఞానం కాకపోవచ్చు. పరోక్ష జ్ఞానం. విశ్లేషణలో, విచారంలో వివేకం గల వారికి లభిస్తున్న పరోక్ష జ్ఞానం. పవిత్ర జ్ఞానం.

ఒక అందమైన పూలతోటను చూస్తాం. అందులో మొక్కలు అందంగా పెరిగి ఉంటాయి. తీర్చి దిద్దినట్లు ఉంటాయి. కత్తిరించబడిన పూలకంచెలు శోభాయమానంగా గోచరిస్తూ ఉంటాయి. ఈ విధంగా అందమైన క్రమబద్ధమైన, ప్రయోజనాత్మకమైన పుష్ప వనాన్ని మనం ఎప్పుడైతే చూశామో దాని వెనుక వనమాలి ఉండాలి; యజమాని ఉండాలి అని నిర్ణయిస్తూ ఉన్నాం. ఇది నమ్మకం కాదు; జ్ఞానం. తోటమాలి లేకపోతే, యజమాని లేకపోతే అంత అందంగా, తీర్చి దిద్దినట్లుగా ఒక పూలవనం గోచరించే అవకాశం లేదు. ఇది నమ్మకం కాదు; జ్ఞానం. ఎందుకని? నియతితో తెలుస్తూ ఉంది కనుక.

అంచమైన పూలవనంలో నియతి ఉంది. కనుక నియంత ఉన్నాడు. అద్భుతమైన ఈ సృష్టిలో కూడా నియతి ఉంది. అందుకని నియంత కూడా ఉన్నాడు. అతడే సృష్టికర్త. భగవంతుడు. జ్ఞానమయుడు. సర్వశక్తిమంతుడు. సర్వజ్ఞుడు.

కుమ్మరి కుండను మాత్రమే చేయగలడు. వడ్రంగి కుర్చీని మాత్రమే చేయగలడు. అల్పజ్ఞానము కలవారు, అల్పమునే తయారు చేయగలరు. సర్వజ్ఞానము కలవాడు సర్వమును తయారు చేయగలడు. **(అల్పజ్ఞః అల్పం సృజతి, సర్వజ్ఞః సర్వం సృజతి).**

కుండకు సంబంధించిన జ్ఞానం కుండ తయారు కాకముందే కుమ్మరికి ఉంది. కంప్యూటర్‌కు సంబంధించిన జ్ఞానం కంప్యూటర్ తయారు కాకముందే దానిని తయారు చేసిన వానికి ఉంది. లేకపోతే ఎలా తయారు చేయగలడు? అతడి జ్ఞానమే కంప్యూటర్‌లో కనిపిస్తూ ఉంది. కంప్యూటర్ సృష్టింపబడవచ్చు. జ్ఞానం సృష్టింపబడేది కాదు. ఉన్నదే.

అలాగే, సృష్టికి సంబంధించిన జ్ఞానం సంపూర్ణంగా సృష్టికర్తకే ఉంది. అతని జ్ఞానమే సృష్టిలో దోబూచు లాడుతూ ఉంది. అణువణువులో అభివ్యక్త మవుతూ ఉంది.

మానవ దేహము - నియతి

సృష్టి ఎప్పుడయితే నియమబద్ధంగా, ప్రయోజనాత్మకంగా ఉందో, సృష్టిలో ఏ ఒక్కదానిని పరిశీలించినా నియతి స్పష్టంగా తెలుస్తుంది. నియంతను గుర్తించగలిగే సామర్థ్యం బుద్ధికి కలుగుతుంది.

మన దేహాన్ని చూచినా నియతి అందంగా గోచరిస్తుంది. దేహానికి శక్తి అవసరం కనుక ఆహారం తీసుకోవాలి. తినేందుకు మనకు నోరు ఉంది. గట్టి పదార్థాలను నమలాలి కనుక తినే నోటిలోనే దంతా లున్నాయి. రుచి చూచే నాలుక కూడా అక్కడే ఉంది. లాలాజలం కూడా నోటిలోనే ఊరుతూ ఉంది. నమిలిన తరువాత, లాలాజలంతో తడిసిన తరువాత ఆహారం ఆహార నాళము ద్వారా జీర్ణాశయానికి చేరుతుంది. ఇక్కడ మన ప్రయత్నం అవసరం లేదు. భూమికి ఆకర్షణ శక్తి ఉంది. కనుక పైన జారిన వస్తువు క్రిందికి వచ్చి తీరాలి. అందుకని జీర్ణాశయాన్ని క్రింద ఉంచి, పైభాగాన నోరు ఉంచి, ఈ రెంటికి సంబంధించిన ఆహార నాళాన్ని మధ్యలో ఉంచటం జరిగింది. ఇదంతా నియతి.

చూచేందుకు కళ్ళున్నాయి. కళ్ళకు ముందుచూపు ఉంది. నడిచేవి కాళ్ళు. కళ్ళు ముందు కున్నాయి కనుక నడిచే పాదాలు కూడా ముందుకే ఉన్నాయి. ముక్కు శ్వాసించేందుకే కాదు; వాసన చూడటానికి కూడా. కనుకనే నోటికి పైభాగాన ముక్కును ఉంచాడు. అలా నోటిపైన వాసన చూచే ముక్కే గనుక ఉండకపోయి ఉంటే, ఏమి తింటామో! ఏదేది తింటామో! పరమాత్మకే తెలియాలి. ఇదంతా సృష్టిలోని నియతి.

తినే ముందు ఆహారాన్ని కలుపుతాం. చేతికి వేళ్ళు ఉండాలి అని సృష్టికర్తకు తెలుసు. చేతిలో కూడా బొటన వేలు దూరంగా ఉండాలి. అప్పుడే పట్టు దొరికేది. ఒక పట్టు పట్టాలన్నా అప్పుడే సాధ్యం. అయిదు వేళ్ళలో బొటన వేలు దూరంగా లేకపోతే చెంబును కూడా ఎత్తలేము. ఈ మాట వ్రాస్తూ ఉంటే నాకనిపిస్తూ ఉంది "బొటన వేలు దూరంగా, బలంగా లేకపోయి ఉంటే పెన్ను పెట్టి ఈ పుస్తకాన్ని వ్రాయటం నాకు సాధ్యమయ్యే దేనా?" అని. ఇదంతా నియతి గాక మరేమిటి?

చేతితో అన్నం కలపటానికి అనువుగా మణికట్టు వద్ద కీలు ఉంది. ఆ తరువాత మోచేతి వద్ద కీలు ఉంది. కనుకనే ముద్ద నోటిలోకి పోతూ ఉంది. చేతి వేళ్ళు నోటి దగ్గరకు చేరాలంటే కీలు మోచేతి వద్దే ఉండాలి. అలా కాకుండా మణికట్టుకు నాలుగు అంగుళాల పైన మోచేయి పెట్టి ఉంటే చేతిలోని ముద్దను నోటిలోనికి విసిరి వేయాల్సి ఉంటుంది. ఇక మన ఆకలి తీరినట్లే. సంవత్సరాల తరబడి టెస్ట్ క్రికెట్ ఆడుతున్నా బౌలింగ్ సరిగ చేయలేక తాము చతికిల బడి ప్రేక్షకుల మనస్సుల్ని బౌలర్లు చితక బాదుతూ ఉంటే, ఇక చేతిలోని ముద్దను నోటిలోకి విసరడం సాధ్యపడే కార్యమేనా?

ఎంత సేపు కాళ్ళ మీద నిలబడగలం? అలాగని మంచం మీద ఎంత కాలం అలాగే పడుకొని ఉండగలం? కనుక ఎక్కువ కాలం కూర్చొనే ఉండాలి. అందుకై అనువైన చోట, మోకాళ్ళ వద్ద కీలు పెట్టాడు. పద్మాసనంలో కూర్చుంటావా? మడుచుకోవచ్చు. కుర్చీలో కూర్చుంటావా? ఎలాగైనా చాచుకోవచ్చు. లేదా సగం మడుచుకోవచ్చు.

పడుకోవాలి అంటే ఏం చేయాలి? నిలబడి యున్న వ్యక్తి అలాగే వాలితే ముప్పై రెండు అలాగే ఉంటాయా? కనుక, కూర్చొని పడుకోవాలి. కనుకనే నడుము వద్ద కీలు పెట్టాడు. దేహంలో ఈ కీళ్ళ విషయంలో ఉన్న నియతిని రోజుల తరబడి వకీలు లాగా బల్లగుద్ది మరీ వాదించి చెప్పవచ్చు. చూశారా! ఎంత నియతి ఉందో దేహంలో. ఎంత చెప్పినా పోతూనే ఉంటుంది. అనంతుని వైభవమై పోయె! ఇక దీనికి అంత మెక్కడుంటుంది?

పాట

పల్లవి :

భలే భలే సృష్టి - ఇది భలే మంచి సృష్టి ॥ భలే భలే సృష్టి ॥

అనుపల్లవి:

ఎంత తెలిసినా అంతు తెలియని

భగవంతుని సృష్టి - మహా బలవంతుని సృష్టి ॥ భలే భలే సృష్టి ॥

చరణము(1): -

ఏదైనా నమిలి తినేందుకు నోరు సిద్ధమై యున్నా
ఏది తినాలో తెలిపేటందుకు ముక్కు దానిపైన
ముందున్నాయి చూచే కళ్ళు - ముందుకున్నాయి నడిచే కాళ్ళు
ఏది ఎక్కడ ఎందుకున్నదో తెలిసి ఉంచుటే సృష్టి ॥భలే భలే సృష్టి ॥

చరణము (2): -

కుర్చీలున్నా కూర్చునేందుకు కాళ్ళకు కీళ్ళుండాలి
ఎంతున్నా తినే చేతికి దండిగ వేళ్ళుండాలి
నమిలేటందుకు పళ్ళుండాలి వాలేటందుకు నడుముండాలి
ఏవేవి ఎలా ఉండాలో కలిపి ఉంచుటే సృష్టి ॥ భలే భలే సృష్టి ॥

శబ్దాలు వినేందుకు చెవులున్నాయి. శబ్దాలు ఏ దిక్కునుండైనా రావచ్చు. కనుక నోరు ఒక్కటున్నా ఫరవాలేదు. కాని, చెవులు రెండు వైపుల ఉండాలి. ఇదంతా నియతి.

వేసవి కాలంలో చర్మము స్పందించి పని చేస్తుంది. దేహంలోని మాలిన్యాన్ని స్వేద రూపంలో బహిర్గతం చేస్తుంది. కాని, శీతాకాలంలో చర్మం స్వేదాన్ని ఎక్కువగా బహిర్గతం చేయలేదు. అందుకనే, శీతాకాలంలో మూత్ర పిండాలు వేగవంతంగా పని చేస్తాయి. ఇదంతా నియతి.

ఇక నాడీ మండలాన్ని, మెదడు నిర్మాణాన్ని, హృదయ స్పందనను, కాలేయాన్ని గూర్చి ఎంత చెప్పుకోవాలన్నా ఉంది. ఇదంతా నియతి. గొప్ప నియతి. గొప్పవాడైన నియంత అనంత జ్ఞానంలో ఇమిడియున్న నియతి. విశ్వజ్ఞానము లేకుండా విశ్వాన్ని సృష్టించటం అనూహ్యామైన విషయం. **(విశ్వజ్ఞః విశ్వం సృజతి, సర్వజ్ఞః సర్వం సృజతి).**

సంహతి

సృష్టి విషయంలో ప్రధానంగా మనకు రెండు అర్థం కావాలి. (1) నియతి (2) సంహతి.

నియతిని గూర్చి తెలుసుకున్నాం. ఇక సంహతిని తెలుసుకోవాలి. 'సంహతి' అంటే కలయిక. కొన్ని వస్తువులు కలిస్తే సృష్టి. ఇది బాగా బుద్ధికి పట్టవలసిన అతి ముఖ్యమైన విషయం.

సైకిల్ ఉంది. సైకిల్ సృష్టి. ఎందుకని? లేకుండా ఉన్నది వచ్చింది కనుక. అంటే, తయారు కాకముందు లేదు కనుక.

సైకిల్‌లో నియతి ఉంది; అంతే కాదు సంహతి కూడా తెలుస్తూ ఉంది. అందుచేతనే సైకిల్ సృష్టి అంటున్నాము.

సైకిల్‌కి రెండు చక్రాలున్నాయి. సీటు ఎంత ఉండాలో అంత ఉంది. ఎంత ఎత్తులో ఉండాలో, ఎలా ఉండాలో అలా ఉంది. బెల్ ఎక్కడుండాలో, బ్రేక్ ఎక్కడుండాలో, ఫెడల్ ఎక్కడుండాలో ఇవన్నీ అర్థవంతంగా ఉన్నాయి. ఇది నియతి.

కాని, సైకిల్ ఒక వస్తువు అని మనం చెప్పుకోవచ్చు. వాస్తవానికి సైకిల్ ఒక వస్తువు కాదు. సైకిల్‌లో చాలా వస్తువులు కలిసి ఉన్నాయి. ఇదే సంహతి. సైకిల్‌లోని వస్తువులలో ఏ వస్తువూ మరో వస్తువు కాదు.

సైకిల్‌లో ట్యూబ్ ఉంది. గొలుసు ఉంది. బెల్ ఉంది. హేండిల్ ఉంది. అద్దముంది. ప్లాస్టిక్ ఉంది. రెగ్జిన్ ఉంది. రబ్బరు ఉంది. వీటిల్లో ఏది సైకిల్? ఇవన్నీ కలిస్తేనే సైకిల్. ఇదే సంహతి.

సైకిల్ అనే పదానికి ఏది వస్తువు? అని కనుక మనం ఆలోచించడం ప్రారంభిస్తే, అంతా అయోమయంగా ఉంటుంది. అలాగని సైకిల్ లేదు అనలేము. సైకిల్‌కి వ్యవహార యోగ్యత ఉంది. అయితే నియతితో గోచరిస్తున్న సైకిల్‌లో సంహతి ఉంది అనేది మనకు అర్థమైతే ప్రస్తుతానికి సరిపోతుంది.

సైకిల్ ఎలా ఒక వస్తువు కాకుండా సంహతితో తెలుస్తూ ఉందో, దేహం కూడా అంతే. ఏ వస్తువైనా, ఏదైనా సృష్టిలో ఇలాగే ఉంది. ఏదీ ఒక్కటి కాదు.

"ఎందరు పోతున్నారు?" అంటే నలుగురు పోతున్నారు అంటాం. దేనిని బట్టి చెబుతున్నాం? నాలుగు దేహాలను చూచి చెబుతున్నాం. అసలు ఒక దేహమే లేదు. మీకు నాలుగు ఎలా వచ్చాయి? (పోయేటప్పుడు వస్తాయేమో!).

దేహం ఒకటి అని చెప్పగలమా? దేహంలో మాంస ముంది. రక్త ముంది; చర్మ ముంది; ఎముక లున్నాయి; కఫ ముంది; మజ్జ ఉంది; ధాతువు లున్నాయి. వీటిలో ఏది దేహము? ఏ ఒక్కటీ దేహం కాదు. అన్నీ కలిస్తేనే దేహం. మరి ఒక్క దేహం ఎక్కడుంది? ఒక్కటే లేనపుడు నలుగురు పోతున్నారు అనడ మేమిటి?

ఇంకా చెప్పాలంటే, శారీరక శాస్త్రం మనకు బాగా తెలిసి ఉంటే ఇన్ని వందల ఎముకలు పోతున్నాయి. ఇన్ని లీటర్ల రక్తం పోతూ ఉంది. ఇన్ని కేజీల మాంసం పోతూ ఉంది. ఇంత పొడవైన నరాలు సాగిపోతున్నాయి. ఇన్ని కిలోల కఫం కదలిపోతోంది అని చెప్పి ఉండాలి. అలా ఎవ్వరూ చెప్పడం లేదు. నలుగురు పోతున్నారు; ఇద్దరు పోతున్నారు అని అంటున్నారు.

మంచిదే. వ్యవహార యోగ్యత ఉంది కనుక అలా పలకడం తప్పు కాదు. తత్త్వత: దేహ మనేది ఒకటి కాదు. అది సంహతి రూపము.

వాస్తవం చెప్పాలంటే ఒక్కటి అనేది ప్రపంచంలో పదమే గాని పదార్థము కాదు. ఏది ఒక్కటి చెప్పండి. స్వామీజీ కన్ను ఒక్కటి. కుర్చీ ఒక్కటి. గ్లాసు ఒక్కటి అని మీరు అనవచ్చు. వాటిలో అణువు లెన్ని? అంటూ నేను మొదలెడితే, ఒక్కటీ మిగలనే మిగలదు. అన్నీ ఇలాగే ఉన్నాయి.

అన్నీ సంహతియే. ఇదీ సంగతి. సంహతి అంటే కలయిక అని తెలుసుకున్నాము కనుక కలయిక ఉన్నచోట విడిపోవటం తప్పదు. సైకిల్ సంహతి రూపమే కనుక భాగాలు విడిపోయి మూల పడిపోతుంది. దేహము కూడా సంహతే కనుక, కీళ్ళు ఊడి, అవయవాలు వీడిపోతాయి. కూడి విడిపోయినవి శ్మశానంలో కాలి మాడిపోతాయి. మసైపోతాయి.

నియతి - సంహతి

సృష్టిని నిర్ణయించి, సృష్టికర్త వైపు తిరిగే అందమైన కూడలిలో మనం చేరి ఉన్నాం. అటు, ఇటు చూచి ప్రయాణాన్ని సాగించవలసిన సమయం వచ్చింది. సృష్టి అవగాహనకి కేంద్ర బిందువులైన నియతి-సంహతి అనే రెండిటిని ఏకంగా అర్థం చేసుకొని ముందుకు పోతాం. సృష్టికర్త ముందుకు పోతాం.

జగదస్తి. ఈ జగత్తు ఉంది. ఇందులో నియతి ఉంది. కనుక నియంత ఉండాలి. ఉన్నాడు. జగత్తు ఏదయితే ఉందో అందులో అనేక వస్తువు లున్నాయి. ఏదయినా ఒక్కటిగా లేదు. కొన్ని కలసి ఉన్నదే ఒకటిగా చెలామణి అవుతూ ఉంది. ఈ కలయికే సంహతి. సరే. ఇక చూడండి.

ఒక ఇల్లు ఉంది. అదొక నిర్మాణము. సృష్టి. సృష్టి కనుక అందులో నియతి గోచరిస్తూ ఉంది. ఒక పద్ధతిగా ఇల్లు నిర్మింప బడుతుంది. ఇంటికి పునాది ఉంది. స్తంభా లున్నాయి. దూలా లున్నాయి. ద్వారా లున్నాయి. తలుపు లున్నాయి. గోడ లున్నాయి. కిటికీ లున్నాయి. స్నానాల గది ఉంది. వంట గది ఉంది. పూజా గది ఉంది. హాలు ఉంది. వరండా ఉంది. ఏవేవి ఎక్కడ ఉండాలో, ఎలా ఉండాలో అలా ఉన్నాయి. పద్ధతిగా ఉన్నాయి; ప్రయోజనాత్మకంగా ఉన్నాయి. ఇదంతా నియతి.

గృహ నిర్మాణంలో ఎన్నో వస్తువులు, రాళ్ళు, సిమెంటు, ఇసుక, ఇనుము, ఇటుక, కొయ్య, ప్లాస్టిక్, గ్లాసు - ఇవన్నీ పద్ధతిగా కలసి ఉన్నాయి. ఈ కలయికే సంహతి.

ఈ విధమైన సంహతి అర్థవంతంగా కనిపిస్తూ ఉంది కనుక గృహ నిర్మాణం వెనుక ఉన్న వ్యక్తి విషయంలో మనకు ఉన్నది నమ్మకం కాదు; జ్ఞానం.

నియతి ఉన్నచోట నియంత ఉన్నాడని అర్థం. గృహ నిర్మాణం సృష్టి. ఈ ప్రపంచం కూడా సృష్టి. ఎందుకని? గృహం ఎలాగైతే ఉందో ఈ జగత్తు కూడా అలాగే ఉంది. నియతి ఉంది. అందం ఉంది. అర్థం ఉంది. పరమార్థం ఉంది. ఇవన్నీ జ్ఞాన పూరితంగా ఉన్నాయి. అందుచేత ఇది సృష్టి **(సృష్టం జగత్).**

ఈ జగత్తు సృష్టి అని నిర్ధారణ చేశాం. నియతి ఉన్నచోట నియంత కూడా ఉండాలి. సృష్టికర్త ఉన్నా డనేది కూడా సహేతుకంగా వివరించాం. ఇక రెండే విషయాలు మిగిలి ఉన్నాయి. సృష్టికర్త ఎక్కడున్నాడు? సృష్టిని ఏ వస్తువుతో తయారు చేశాడు? ఈ రెండు ప్రశ్నలకు సమాధానాలను పొందే ప్రయత్నంలో సృష్టికర్త వైపుకు తిరుగుతున్నాం. జగదీశ్వరుని పైకి దృష్టిని సారిస్తున్నాం.

పరమాత్మ (సృష్టికర్త)

జగదస్తి - ఈ ప్రపంచం ఉంది. ఊరకే లేదు. రంగులరాట్నంలా తిరుగుతూ ఉంది. శక్తివంతంగా ఉంది. ప్రకాశిస్తూ ఉంది. ఈ శక్తి ప్రపంచానికి సంబంధించిందేనా? ప్రపంచంలోని ప్రకాశక శక్తి ప్రపంచానిదేనా? విద్యుత్ లేకపోతే బల్బు వెలగదు. వెలిగే బల్బులోని వెలుతురు విద్యుత్‌దే. ఆ శక్తి విద్యుత్‌ది. అందుకే అది విద్యుచ్ఛక్తి.

దూరంగా చెట్టు కొమ్మలు కదులుతూ ఉంటే వాయుచలన ముందని ఊహిస్తాము. ఫ్యాన్ తిరుగుతూ ఉంటే కరెంటు ఉంది అని తెలుసుకుంటాము. ఫ్యాన్ తిరగవచ్చు. తనంతట తాను తిరగలేదు. దానిని త్రిప్పే శక్తిపై ఆధారపడి తిరుగుతూ ఉంది. ఈ ప్రపంచంలో అన్నీ అలాగే ఉన్నాయి. ఏదైనా మరొక దానిపై ఆధారపడి ఉన్నదే. మరొకదానిపై ఆధారపడి ప్రకాశించేదే.

మన దేహాన్ని చూచినా అలాగే ఉంది. కళ్ళు చూస్తాయి. కాని కంటిలో చూచే శక్తి వేరు. చెవులు వింటాయి. చెవిలో వినే శక్తి వేరు. వాక్కులో పలికే శక్తి వేరు. మనస్సులో ఆలోచించే శక్తి మనస్సుది కాదు.

అంతఃస్థేన హి చైతన్య జ్యోతిషా అవభాసితస్య మనసః మనన సామర్థ్యం

ఆంతర్యంలో చైతన్య జ్యోతి ప్రకాశిస్తూ ఉంది కనుకనే మనస్సు ఆలోచనల్ని చేయగలుగుతూ ఉంది.

విద్యుత్ లేకపోతే బల్బు వెలగదు; ఫ్యాన్ తిరగదు, ఏదీ సుఖంగా నడవదు. అలాగే, చైతన్యం లేకపోతే కళ్ళు చూడవు, చెవులు వినలేవు, నోరు మాట్లాడలేదు, మనస్సు ఆలోచించలేదు. మనిషికి ఆధారమైన చైతన్యమే ప్రపంచానికి కూడా ఆధారము. ఆ చైతన్యమే పరమాత్మ. ఆయనే ఈశ్వరుడు. ఆయన శక్తి తోనే భూమి తిరుగుతూ నిలిచి ఉంది. నీటిలోనే ఉండి తడిసిపోతున్నా, భూమి కరిగిపోకుండా ఉంది. భయంకర మైన గాలులు వీచినా ఎగిరిపోకుండా ఉంది. అగ్ని పర్వతాలు గుండెలో రగులుతున్నా కాలిపోకుండా చల్లగా ఉంది.

పోషక పదార్థాలన్నీ మనకు భూమి నుండే అందుతాయి. ఇది అందరికీ తెలుసు. పోషకాలలోని పోషణ శక్తి పరమాత్మదే అనేదే తెలియవలసిన విషయం. ఈ కారణం చేతనే, పరమాత్మ స్థితికర్త. సర్వులను, సమస్తాన్ని రక్షించేవాడు. ఆశించేవాళ్ళం మనం. పోషించేవాడు తాను. అందుకే అతడు భర్త. ఈ సత్యం తెలిసిననాడే హృదయాలు భర్తీ అవుతాయి. నిండుతాయి. పొంగుతాయి. ఆనందంతో పండుతాయి.

ఎక్కడ నియతి ఉందో అక్కడ నియంత ఉన్నా డనేది నిర్ధారణ అయింది. కార్యరూపంలో ప్రపంచం చక్కగా తెలుస్తూ ఉంది **(యత్ సృష్టం తత్ సుకృతం).** సుకృతంగా ఎప్పుడు తెలుస్తూ ఉందో జ్ఞానము కలిగిన కర్త ఉన్నట్లు తెలుస్తూనే ఉన్నాడు. **(యత్ కార్యం తత్ సకర్తృకం).**

బాగుంది. మరి అత డెక్కడున్నాడు? ఏ వస్తువుతో ఈ సృష్టిని తయారు చేశాడు?

మన జ్ఞానం పరిమితంగా ఉంది. మన దేహంలో ఏముందో కూడా పూర్ణంగా మనకు తెలియదు. దేహంలో రక్త మెంతుందో తెలియదు. తలపై కేశము లెన్నున్నాయో అర్థం కాదు. ఇక ఈ విశాల ప్రపంచంలో ఏవేవి ఉన్నవో, ఎక్కడెక్కడ ఉన్నవో, ఎందుకు ఉన్నవో, ఎంత వరకు ఉంటాయో తెలిసేం దెవరికి?

మరుక్షణంలో ఏం జరుగబోతుందో తెలియదు. రేపు ఏమి రానున్నదో అర్థం కాదు. అలా కాకుండా, అన్నీ మనకే తెలిస్తే, రోడ్డు ప్రమాదా లెందుకుంటాయి? పడవ లెందుకు మునుగుతాయి? విమానా లెందుకు కూలుతాయి? ఈ ప్రపంచంలో మన మున్నా, మనకు అర్థం గాని రీతిలో ఈ ప్రపంచ ముందని అర్థమవుతూ ఉంది. జ్ఞానశక్తిలో మనం పరిమితంగా ఉన్నామని తేలిపోతుంది. జ్ఞానశక్తిలో మనం ఎలా పరిమితంగా ఉన్నామో, క్రియాశక్తిలోనూ అంతే.

కురిసే వర్షాన్ని ఆపలేము. మెరిసే మబ్బును నిలపలేము. గాలిని బంధించలేము. తిరిగే భూమిని కదలకుండా ఉంచలేము. ఆకాశానికి హద్దును గీయలేము. చుక్కల్ని లెక్క పెట్టలేము. మన శక్తి ఏపాటిది? సాపాటుకు సరిపోతుంది. ఇలాంటి శక్తిమంతులం ప్రపంచాన్ని సృష్టించగలమా? జ్ఞానము లేక, శక్తి చాలక మనం ఏం సృష్టించగలం? అయోమయం తప్ప. కనుక, ఇది పరమాత్మ సృష్టి. సృష్టికర్త భగవానుడే. ఆయనే విశ్వానికి కర్త.

మరి, సృష్టికర్త ఎక్కడున్నాడు? ఈ ప్రశ్న వేసే దెవరు? తెలిసినవారా? తెలియని వారా? అదేమిటి? తెలిసినవారు ఎందుకు అడుగుతారు? తెలియని వారే కదా అడుగుతారు? మరి, ఈ ప్రశ్న వేసే వ్యక్తి తెలియనివాడుగా కనిపించడం లేదా? సృష్టికర్త ఎక్కడ ఉన్నాడు? అంటే, ఇక్కడ లేడు అని అర్థం కదా? ఎక్కడున్నాడో తెలియనపుడు ఇక్కడ లేడు అని చెప్పడం ఎంత సమంజసం?

ఏమో? ఎక్కడున్నాడో తెలియదు గాని అంత గొప్ప వాడిని నా స్థానంలో ఉంచుకోలేను కనుక, నేను ఉన్న లోకం కన్నా ఊర్ధ్వంగా మరో లోకంలో ఉంచుతాను. అంతేనా? అవును. లోకాలు అలాగే వచ్చాయి.

అసలు లోకమంటే ఏమిటి? **లోక్యతే ఇతి లోకః**, ఏది నీ చేత చూడబడుతుందో అది లోకము. ఒక లోకంలో సృష్టికర్త ఉన్నాడు అంటే, మరొక లోకంలో లేడు అని అర్థము. అలాంటివాడు పరిమితుడు అవుతాడు. పరిమితుడైన వానికి మనలాగా పరిమిత జ్ఞానమే ఉంటుంది. సర్వజ్ఞానము ఉండదు. సర్వజ్ఞానం లేనివాడు అల్పాన్ని సృష్టించగలడే గాని సర్వాన్ని సృష్టించలేడు. సర్వజ్ఞాన మున్నవాడే సర్వాన్ని సృష్టించ గలడు. విశ్వజ్ఞానం ఉన్నవాడే విశ్వాన్ని సృష్టించగలడు.

నిమిత్త కారణం

సృష్టికర్తకు సృష్టికి సంబంధించిన జ్ఞానం పూర్ణంగా ఉండాలి. అప్పుడే తాను సృష్టికర్త అవుతాడు. ఎందుకని? అట్టి జ్ఞానం ఉండుట చేతనే సృష్టిని చేశాడు కనుక.

కుండ సృష్టి. కుండ విషయంలో కుమ్మరి సృష్టికర్త. కుండకు సంబంధించిన జ్ఞానం కుండ తయారుకాక ముందే కుమ్మరికి ఉంది. కుండను ఎలా తయారు చేయాలో తెలుసు. కుండ యొక్క ప్రయోజనము ఏమిటో కూడా తెలుసు. అలాంటివాడు కుండ విషయంలో నిమిత్తకారణం **(Efficient cause)** అవుతాడు.

కుండ విషయంలో కుమ్మరి ఎలా నిమిత్త కారణమో సృష్టి విషయంలో పరమాత్మ నిమిత్త కారణం. కుండ విషయంలో కుమ్మరి లాగ, సృష్టి విషయంలో పరమాత్మ సృష్టి జ్ఞానము, సృష్టి ప్రయోజనము తెలిసినవాడు కనుక సృష్టికి సృష్టికర్త నిమిత్త కారణము.

కేవలం జ్ఞానం కలిగిన వ్యక్తి ఉంటే సరిపోతుందా? సృష్టి తయారవుతుందా? కుమ్మరి ఉన్నంత మాత్రాన కుండ తయారవుతుందా? మట్టి అవసరం లేదా? కుండ విషయంలో మట్టి ఉపాదాన కారణం **(Material cause)**.

కుండ విషయంలో జ్ఞానం కలిగిన కుమ్మరి నిమిత్తకారణం. మట్టి ఉపాదాన కారణం. సృష్టి విషయంలో జ్ఞాన స్వరూపుడు, సర్వజ్ఞుడు, సర్వశక్తిమంతు డైన పరమాత్మ నిమిత్తకారణం. బాగుంది. మరి, ఈ సృష్టికి ఉపాదాన మేమిటి? ఏ వస్తువుతో పరమాత్మ ఈ సృష్టిని చేశాడు?

ఏ వస్తువుతో చేసినా, సృష్టికి ముందే ఉన్న ఆ వస్తువు సృష్టిని నిషేధిస్తుంది. సృష్టి కర్తను త్రోసిపుచ్చుతుంది. పరిమితుణ్ణి చేస్తుంది. పరిమితమైన వాడు సృష్టిని ఎలా చేయగలడని నిలదీస్తుంది.

సృష్టికి ముందు ఏది ఉన్నా సృష్టి ఉన్నట్లే. ఇక ప్రత్యేకించి సృష్టిని చేసేది ఏముంటుంది? ఈ సందర్భంలో ఒక ముఖ్య విషయాన్ని విస్మరించకూడదు. ఆకాశం కూడా సృష్టిలోనిదే. సృష్టికి ముందు దేశకాలాదులు కూడా ఉండేందుకు అవకాశం లేదు. ఈ సత్యం తెలియనివారే లోకాలకు శ్రీకారం చుడుతారు.

తతః ఆకాశః సంభూతః. అందుకనే సృష్టికర్త నుండే ఆకాశం వచ్చింది అన్నది వేదం. అంటే సృష్టికి ముందు ఆకాశము లేదు. ప్రదేశము లేనపుడు కాలం ఎలా ఉంటుంది? అలాంటప్పుడు సృష్టి ఒక ప్రదేశంలో ఎలా జరుగుతుంది? ప్రదేశమే లేదు కదా? ఉన్న దనుకుందాం. ఉంటే, సృష్టి లేనట్లే. సృష్టికర్త లేనట్లే. సృష్టికర్త లేకపోతే సృష్టిలో నియతి ఎలా వచ్చింది?

నియతితో ఉన్నది సృష్టి అని నిర్ణయం చేసేశాం. సృష్టికర్త ఉండాలి అనేది కూడా నిర్ధారణమే. ఎక్కడున్నాడు? సృష్టిని దేనితో చేశాడు? అనే ప్రశ్నలే మిగిలి ఉన్నాయి. మరచి పోకండి.

వ్యర్థ ప్రసంగాలు

(1) సృష్టి ఉంది. కాని దేని నుండి రాలేదు. ఇదొక వాదము. లేనిదాని నుండి ఉన్నది ఎలా వస్తుంది? సృష్టికి ముందు ఏదీ ఉండదు కనుక శూన్యం నుండే వచ్చి ఉండాలి **(తస్మాత్ అసతః సజ్జాయత).**

ఈ వాదము వ్యర్థ ప్రసంగము. "వంధ్యా పుత్రుని వివాహానికి మృగతృష్ణలో తెప్పోత్సవం" లాంటి విషయ మిది.

(2) శక్తివంతుడైన దేవుడు ఇన్ని రోజులు సృష్టి చేశాడు. స్వర్గంలో కూర్చొని చేశాడు. ఆ లోకంలో కూర్చొని చేశాడు. ఈ వనంలో విహరిస్తూ చేశాడు.

ఇన్ని రోజుల సృష్టి అనగానే కాలం ముందుకొస్తుంది. సృష్టి జరిగిన తరువాత కాలము వచ్చి రోజు లొస్తాయి కాని, సృష్టికి ముందు కాలం లేదు కనుక రోజు లుండవు. లోకాలు కూడా సృష్టి లోనివే కనుక సృష్టికి ముందు ప్రదేశమే లేదు కనుక లోకాలు ఉండవు. వనాలు ఉండలేవు.

అస్పష్ట సిద్ధాంతాలు

న్యాయశాస్త్ర కర్త గౌతముడు, వైశేషిక దర్శన కర్త కణాదుడు ఇరువురు కూడా సృష్టికర్త ఉన్నాడనే చెప్పారు. అతడే ఈశ్వరుడని, నిమిత్తకారణ మని స్పష్టం చేశారు. కాకపోతే, ఉపాదానం దగ్గరే చిక్కుముడి పడిపోయింది.

కుండకు కుమ్మరి నిమిత్తకారణం కాగా మట్టి ఉపాదానకారణం అనుకున్నాం. అలాగే సృష్టికి ఈశ్వరుడు నిమిత్తకారణం కాగా అణువులు ఉపాదానకారణంగా నయ్యాయికులు నిర్ణయించారు. ఇది మ్రింగుడు పడని విషయం. దీనినే ఆరంభవాదము అంటారు. అసత్కార్యవాదము అని కూడా అంటారు.

లేని కుండ ఉన్న మట్టిలో లేకుండా వచ్చినట్లు, లేని జగత్తు ఉన్న అణువులలో లేకుండా వచ్చింది అనేది నయ్యాయికుల అభిప్రాయము.

న్యాయ వైశేషికుల సృష్టి వాదాన్ని సాంఖ్యులు అంగీకరించరు. ఈశ్వరుని స్థానంలో కపిలుని సాంఖ్యము పురుషుని ప్రవేశ పెట్టింది. పురుషుడు జ్ఞానమయుడు అన్నారు. అయితే పురుషునికి సృష్టితో ప్రమేయం లేదని వీరి వాదము.

పురుషుని సన్నిధిలో ప్రకృతే జగత్తుగా మారుతుంది అనేది సాంఖ్యుల వాదము. సృష్టికార్యంలో పురుషుని ప్రత్యక్ష ప్రమేయం లేదు. అతని శక్తిని పొంది ప్రకృతి జగత్తుగా పరిణమిస్తుంది అంటారు.

సూర్యుని కాంతిలో మొక్కలు తమంతట తాము పెరుగుతూ ఉన్నాయి కదా? చెరువులలో నీళ్ళు ఇంకిపోతున్నాయి కదా? తడిసిన బట్టలు ఆరిపోతున్నాయి కదా? ఇదంతా సూర్యుని ప్రకాశ ప్రతాపమే కదా! సూర్యునికి కర్తృత్వ ముందా? ఈ పనులకు

సూర్యుడు కర్త ఎలా అవుతాడు? పురుషుడు కూడా అంతే అంటారు. వీరిది సత్కార్య వాదము. దీనినే పరిణామవాదము అని కూడా అంటారు.

మట్టి నుండి కుండ వచ్చినట్లు అణువుల నుండి జగత్తు ఆవిర్భవించింది అనేది నయ్యాయికుల ఆరంభవాదము కాగా, కుండ మట్టిలో లేనిది కాదు. మట్టిలో ఉండ బట్టే వచ్చింది. నువ్వులను నలిపితే చమురు వస్తుంది. చమురు నువ్వులలో ఉన్నదే. ఉన్నది కనుకనే పిండితే వచ్చింది. అలాగే మట్టిలో అజ్ఞాతంగా ఉన్న ఘటమే కులాలుని కౌశల్యముతో కుండ రూపాన్ని ధరించింది. కుండలో అణువులే ఉన్నాయి. అణువులను ఏకరూపం చేస్తే ఘటం ఏర్పడింది అనేది పరిణామవాదము.

పరమాత్మ కన్నా అన్యంగా సృష్ట్యాదిలో అణువులు కూడా ఉండేందుకు అవకాశము లేదు కనుక ఆరంభవాదము సరియైనది కాదు.

పరిణామం చెందిన తరువాత అలా పరిణామం చెందినది ఎవరో వారి స్వరూపము లేకుండా పోతుంది కనుక పరిణామవాదం కూడా నిలబడేది కాదు. నిలబడినా గెలిచే అవకాశము లేనే లేదు.

పాలు పెరుగుగా మారటం పరిణామం. పాలు పెరుగు అయిన తరువాత మళ్ళీ పెరుగు పాలయ్యే అవకాశం ఉందా? లేదా, పెరుగుగా మారిన తరువాత కూడా పాలు పాలుగా ఉండే అవకాశం ఉందా? అసలు పరిణామం అంటేనే,

స్వస్వరూప పరిత్యాగేన రూపాంతరాపత్తిః పరిణామం

'తన స్వరూపాన్ని పోగొట్టుకొని మరొక రూపాన్ని పొందటమే పరిణామం. కనుక పరిణామవాదము కూడా సృష్టి విషయంలో నిలబడదు. వివర్తవాదమే నిలుస్తుంది. ఈ విషయాన్ని ముమ్ముందు మనం తెలుసుకుంటాము.

ఇక చాలు లెండి. ఇలా చెప్పుకుంటూపోతే చాలా ఉన్నాయి. చెప్పాలి అని కొన్నిటిని ఉదహరించాను. కొన్ని మరీ ఘోరంగా ఉంటాయి. దారి తప్పితే అంతే మరి. సరే, మనం ఇక దారిలో పడదాం.

ఉపాదాన కారణం

ఈ సృష్టికి పరమాత్మ నిమిత్త కారణం అని అందరూ అంగీకరిస్తారు. ఉపాదానం ఏమిటి? అన్నప్పుడే ఉట్టి కెక్కలేక పడిపోతూ ఉంటారు.

ఏ వస్తువుతో పరమాత్మ సృష్టిని చేసినా అతడు పరిమితుడు అవుతాడు. పరమాత్మ అనంతుడు అయినపుడు ఆయన కన్నా అన్యంగా సృష్టికి పూర్వం మరొకటి ఉండే అవకాశం లేనే లేదు. సృష్టికి పూర్వం పరమాత్మ ఒక్కడే ఉన్నాడు. అందుకనే సామవేదం,

సదేవ సౌమ్య ఇదమగ్ర ఆసీత్ ఏకమేవ అద్వితీయం బ్రహ్మ

ఇదం అగ్రే - సృష్టేః ప్రాక్. ఈ సృష్టికి పూర్వము పరమాత్మ ఒక్కడే ఉన్నాడు అన్నది వేదం. ఉన్నది తానే కనుక ఏది వచ్చినా తన నుండే రావాలి. కనుక సృష్టికి పరమాత్మే నిమిత్తకారణం. పరమాత్మే ఉపాదానకారణం.

ఇది ఎలా సాధ్యం? నిద్రలో వలె సాధ్యం **(యథా నిద్రయా)** అన్నది అథర్వణ వేదం. నీవు నిద్ర పోయావు. నిద్రలో కల గన్నావు. నీ కలకు నిమిత్తకారణం ఎవరు? నీ కలను సృష్టించిన వాడివి నీవే కనుక నీ కలకు నిమిత్తకారణం నీవే.

మరి ఉపాదాన మేమిటి? నీవే. నీ మనస్సే. కలకు ఉపాదానం నీవే కనుక కలలోని రూపాలన్నీ నీవే. వస్తువు లన్నీ నీవే. విషయాలన్నీ నీవే. కలలోని దృశ్యాలు ఏవీ నీకు అన్యంగా లేవు.

నీ కలకు నీవు ఎలా నిమిత్త ఉపాదాన కారణములై ఉన్నావో, అలాగే ఈ సృష్టికి పరమాత్మ అభిన్న నిమిత్త ఉపాదానకారణము. ఇది అర్థమైతే పరమాత్మ ఎక్కడున్నాడో తెలుస్తుంది.

సృష్టి పరమాత్మ కన్నా అన్యంగా ఉంది అనుకుంటే, సృష్టించిన పరమాత్మ ఎక్కడున్నాడు? అనే ప్రశ్న పడుతుంది. ఈ సృష్టికి అభిన్న నిమిత్తకారణం పరమాత్మే అని తెలియగానే, వస్తువు ఉపాదానానికి దూరంగా ఉండలేదు కనుక సృష్టి పరమాత్మకన్నా అన్యంగా ఉంది.

బ్రహ్మైవేదం విశ్వమితి

'ఈ విశ్వము బ్రహ్మమే' అన్నది ఉపనిషత్తు.

సర్వం విష్ణుమయం జగత్

'ఈ జగత్తు అంతయు జగన్నాథుడే'.

కుండకు కారణమైన మట్టి కుండలో లేని దెక్కడ? సృష్టికి కారణమైన సృష్టికర్త సృష్టిలో లేని దెక్కడ?

కుండలో మట్టి కన్నా అన్యంగా ఏదీ లేదు. నీ కలలోని దృశ్యాలలో నీవు తప్ప అన్యులు లేరు. ఈ సృష్టిలో పరమాత్మ కన్నా అన్యంగా రెండవ వస్తువు లేదు. అందుకే ఆయన విష్ణువు. **(వ్యాపనశీలం).** ఇది నమ్మకం కాదు. జ్ఞానం.. పవిత్ర జ్ఞానం.

యచ్చ కించి జ్జగత్సర్వం దృశ్యతే శ్రూయతేపి వా

అంతర్బహిశ్చ తత్సర్వం వ్యాప్య నారాయణ స్థితః

ఏదయితే **దృశ్యతే** - కనిపిస్తుందో, **శ్రూయతే** - వినిపిస్తుందో, అట్టి విశ్వమంతా, లోపలే కాదు, బయటే కాదు, సమస్తంలో నారాయణుడే వ్యాపించి యున్నాడు.

పరమాత్మ ఎక్కడున్నాడు? ఈ ప్రశ్న ఆవిరైపోయింది.

పరమాత్మ ఎక్కడ లేడు? ఈ ప్రశ్న అందల మెక్కింది.

ఎక్కడున్నాడు శ్రీహరి? అని ప్రశ్నించేవాడు హిరణ్యకశిపుడు.

ఎక్కడ లేడు శ్రీహరి? అని ప్రశ్నించేవాడు ప్రహ్లాదుడు.

అంతా భగవంతుడే. అన్నీ భగవంతుడే, సనాతన ధర్మ మార్గంలో అవగాహన కలిగి చరించే వారికి ప్రతిదీ పవిత్రమే. జ్ఞానస్వరూపమే.

నిప్పు దేవుడే; అగ్ని దేవుడు. గాలి దేవుడే; వాయు దేవుడు. నీరు దేవుడే; వరుణదేవుడు. ఆకాశం దేవుడే; చిదంబరేశ్వరుడు. మట్టి కూడా దేవతే; భూమాత.

పంచభూతాల కన్నా అన్యంగా ఈ ప్రపంచంలో ఏమున్నాయి? పంచభూతాలన్నీ పరమాత్మ స్వరూపాలే. ఇక, పరమాత్మ కానిది ఈ ప్రపంచంలో ఏముంది? అన్నీ తానే. ప్రపంచంలో దేదీప్యమానంగా వెలిగే పరంజ్యోతి తానే. సద్రూపమైన పరమాత్మ యొక్క కార్యమైన ఈ జగత్తు వాస్తవానికి పరమాత్మకన్నా భిన్నం కాదు.

సద్బ్రహ్మ కార్యం సకలం సదైవ

సన్మాత్ర మేత న్నతతోఽ న్యదస్తి

సద్రూపమైన బ్రహ్మము యొక్క కార్యరూపమైన సమస్తము సద్రూపమే. సన్మాత్రమే. దానికి అన్యమైనది ఉండలేదు.

ఉపాదేయము, అనగా వస్తువు ఏ ఉపాదానముతో తయారైనదో అది ఉపాదానానికి భిన్నంగా ఉండలేదు. **(తత్తదుపాదేయస్య తదుపాదాన వ్యతిరేకేణ అసత్వాత్!).**

సమస్తమైన ఈ విశ్వానికి బ్రహ్మమే ఉపాదానము కనుక బ్రహ్మమునకు భిన్నంగా ఏదీ ఉండేందుకు వీలు లేదు. **(సర్వోపాదానత్వాత్ బ్రహ్మణః తద్వ్యతిరేకేణ కిమపి నాస్తి ఇత్యర్థః).**

శాస్త్ర తాత్పర్యం

ఈ సృష్టికి పూర్వము **"సదేవ ఆసీత్"** సద్రూప చైతన్యమే ఉండినది. పరమాత్మ నుండే ఈ సృష్టి ఆవిర్భవించినది. **(స్వప్నవత్).** మేలుకుంటే స్వప్నం లేదు. జ్ఞానం కలిగితే **(ప్రబోధ సమయే) స్వాత్మానం ఏవ అద్వయం.** అదే ఏకం - అద్వితీయం.

బ్రహ్మము కన్నా అన్యంగా జగత్తు లేదు. జగత్తు యొక్క అర్థం ఎక్కడుందో అర్థమైనదా? జగత్తు యొక్క అర్థం పరమాత్మలో ఉంది.

జగత్తు ఏమిటో తెలిసిపోయింది. ఇక నీ వెవరు? జీవుడు. జీవుని స్వరూపము ఏమిటి? బ్రహ్మమే.

జగత్తు బ్రహ్మమే అయినప్పుడు, నీవూ బ్రహ్మమే అయినపుడు జగత్తు నీకన్నా అన్యంగా ఎలా ఉంటుంది. జగత్తు కూడా నీవే.

'ఆత్మై వేదం విశ్వమితి'

ఈ ప్రపంచము అంతయు ఆత్మయే. ఇదే ఏకవాక్యతా. ఇదే అఖండానుభూతి. అద్వైతానుభూతి. మోక్ష స్వరూపం ఇదియే. ఈ జ్ఞానమే.

వ్యక్తివికాసం - విశ్వకళ్యాణం

విశ్వస్య కళ్యాణ మస్తు - లోక కళ్యాణం జరుగు గాక!

విశ్వంలో కళ్యాణము ఎప్పుడొస్తుంది? విశ్వంలో ఉన్నది విశ్వనాథుడే అని తెలిసినపుడే. ఇదే లోకకళ్యాణము. శుభము. మంగళము. అదే శివం. శివమే అద్వైతం.

అద్వైతం ఎలా శివ మైంది? మంగళకరమైనది? ఈ ప్రశ్నను శ్రీ ఆది శంకరాచార్య స్వామి తమ మాండూక్యకారికా భాష్యంలో తామే వేసుకొని తామే సమాధాన మిచ్చారు.

కుతశ్చ అద్వయతా శివా?

నానా భూతం పృథక్త్వం అన్యస్య అన్యస్మాత్ యత్ర దృష్టం తత్ర అశివం భవేత్!

ప్రశ్న:- అద్వయమునకు మంగళత్వం **(శివత్వం)** ఎలా వచ్చింది?

జవాబు:- ఎక్కడ ఒకరు మరొకరి కన్నా వేరుగా, విడివిడిగా తెలియుట జరుగుచున్నదో అది అమంగళము **(అశివం).**

పృథక్త్వం అమంగళం కనుక సమత్వం మంగళం. సమమే శివం. అద్వయం. అద్వైతం. భేదభావాలు తెలియని అభేద జ్ఞానస్థితి.

ఈ జ్ఞానము విశ్వంలో ఉండే వ్యక్తులకు కలగాలి. అప్పుడే విశ్వకళ్యాణం జరుగుతుంది.

సర్వస్య సద్భావనాస్తు - అందరిలో సద్భావములు కలుగు గాక!

ఉన్నది అఖండమైన పరమాత్మయే అనే వేదాంత జ్ఞానము అర్థమైంది. ఇక ఆ దృష్టితో జీవించటమే. ఇదే జీవితము - వేదాంతము. వ్యక్తు లందరిలో ఈ అవగాహన ఏర్పడిత్తే విశ్వకళ్యాణం జరుగుతుంది. వ్యక్తికళ్యాణం లోనే విశ్వకళ్యాణం దాగి ఉంది. విశ్వంలో విష్ణువే ఉన్నాడు. అందుకనే వేయి నామాల దేవుణ్ణి ముందుగా, ముద్దుగా "విశ్వం" అని పిలిచింది విష్ణుసహస్రనామం.

విశ్వస్య జగతః కారణత్వేన విశ్వ మిత్యుచ్యతే బ్రహ్మ

విశ్వానికి కారణ మైనందున సత్య జ్ఞానానంద స్వరూపుడైన పరమాత్మ 'విశ్వం' అని కీర్తింపబడ్డాడు.

కారణ కార్యాలు

కార్య రూపంలో ఏది గోచరించినా దాని వెనుక కారణం ఉండాలి. కారణం నుండి ఉత్పన్నం కావడం చేత కార్యం కారణం కన్నా వేరుగా ఉండలేదు.

కుండ కార్యం. మట్టి కారణం. ఇది మనకు తెలుసు. ఈ విధమైన కార్య కారణాలలో సత్య మేది? **మృత్తికేత్యేవ సత్యమ్.** మట్టియే సత్యము.

కుండ సత్యం కాదా? కాదు. ఎందుకని? మరొక దాని మీద ఆధారపడి ఉండేది ఏదీ సత్యం కాదు. మట్టి లేనిదే కుండ లేదు. కనుక కుండ సత్యం కాదు. కాని, కుండ లేకపోయినా మట్టి ఉంటుంది. కనుక మట్టి సత్యం.

కుండలో తల దూర్చితే మట్టిలో తేలుతాం. విశ్వం తల కెక్కితే తలపులలో విష్ణువే కదుల్తాడు.

విశ్వం విష్ణువు కన్నా వేరు కాదని తెలిసింది. జగత్తులో ఉన్నది జగన్నాథుడే. ఇక ఎక్కడి తగాదాలు? ఇంకెక్కడ విభేదాలు?

మట్టి పాత్రలలో ఉన్నదంతా మట్టే. బావుంది. మరి, కుండ, కూజా, మూకుడు ఇవన్నీ ఏమిటి? అవి కూడా మట్టే. కార్య రూపంగా గోచరించే మట్టి పాత్రలలో ఉన్నదంతా కారణమైన మట్టే. కాని, మట్టి పాత్రలలోని నామరూపాలు కారణమైన మట్టిలో లేవు. ఈ విషయాన్ని ఛాందోగ్యోపనిషత్ అత్యంత వైభవోపేతంగా వివరించింది.

యథా సౌమ్య! ఏకేన మృత్పిండేన సర్వం మృణ్మయం విజ్ఞాతం స్యాత్ వాచారంభణం
వికారో నామధేయం మృత్తికేత్యేవ సత్యమ్

మట్టి పాత్రలలో ఉన్నదంతా మట్టే. నామరూపాలన్నీ కేవలం వాచారంభణం. నామధేయం మాత్రమే. దేనికి నామధేయం? రూపానికే.

రూపం ఉంది కనుక నామం ఉంది. కుండ అనే రూపం ఉంది కనుక కుండ అనే నామం ఉంది. వాస్తవానికి మట్టే సత్యము. ఈ సత్యము అర్థం కాకపోతే అన్నీ జగడాలే. ఆగడాలే.

"నేను కుండను. నీ కన్నా పెద్ద దానినే కూజా!"

"నేను కూజాను. అంద ముండాలి గాని కండబల మెందుకే కుండా?"

ఇదీ వరుస. ఇదీ జగడం. జగత్తులో గండం. కుండలో, కూజాలో రెండిట్లో ఉండేది మట్టేనని తెలిస్తే తేడా లెలా ఉంటాయి? విభేదా లెందుకు వస్తాయి?

పాట

పల్లవి: ఎన్నో ఎన్నో రూపాలు
అన్నీ ఆరే దీపాలు

అనుపల్లవి:
మారని రూపం - ఆరని దీపం
భువిలో దివిలో నీవే సకలం ॥ ఎన్నో ॥

చరణములు:
1. ముంత మూకుడు బానలు కుండలు నామ రూపాల పోకడలే
మట్టి పాత్రలకు మన్నే అండ జగమంతటికి నీవే నిండా ॥ ఎన్నో ॥

2. దూరము గాని దేశములో సమయము రాని కాలములో
రూపాలన్నీ ఒకటే దౌడు అందరికీ నీవే తోడు ॥ ఎన్నో ॥

3. రూపాలకు రూపము నీవే రూపము లేని స్వరూపము నీవే
ఊరు పేరు ఉనికి ఏల? ఊపిరి నీవై నిలిచిన వేళ ॥ ఎన్నో ॥

మట్టి పాత్రలలో అంతా మట్టే. ప్రపంచంలో అంతటా పరమాత్మే. విశ్వం విష్ణువు కన్నా అన్యం కాదు కనుక విష్ణు వేమిటో తెలిస్తే విశ్వమంతా విష్ణుమయంగా గోచరిస్తుంది.

పురుష ఏ వేదం విశ్వం

ఇదం విశ్వం - సర్వం - పురుష ఏవ. ఈ ప్రపంచ మంతయు పరమాత్మే.

ఇలలో కళ

ఈ ప్రపంచం పరమాత్మ నిలయం. ఆలయం. ఇది ఆయన ఇల్లు. అందాల హరివిల్లు. ప్రభాత వేళ, సూర్యోదయానికి ముందే అరుణోదయంలో కెంపు వర్ణంతో ఆకాశం అందాన్ని పులుముకుంటుంది. సూర్యోదయంలో ఉదయ భానుని అరుణ కిరణ జాలం కదలి ఆకాశాన్ని నులి వెచ్చగా స్పృశిస్తూ ఉంటే, పచ్చని చెట్లు హాయిగా, చల్లగా, మెల్లగా వీస్తూ ఉంటే, గాలులతో పాటు గువ్వలు ఎగురుతూ వెళ్తూ ఉంటే, ఓహ్ ....ఎంత శోభ? కాని, దురదృష్టం-కళ్ళు లేని వారు ఈ సౌందర్యాన్ని వీక్షించలేరు కదా?

ఇది పరమాత్మ ఇల్లు. అందాల హరివిల్లు. ఈ ఇంటిని గాలులు ఊడుస్తున్నాయి. వానలు తడుపుతున్నాయి. చెట్ల ఆకుల్లోంచి చందమామ తొంగి చూస్తూ రంగవల్లులు దిద్దుతున్నాడు. అంతే కాదు; ఈ ఇంటిలో దోగాడే పాప లున్నారు. వచ్చిపోయే చుట్టాలు ఉన్నారు.

మనస్సు ఉంటే విశ్వంలో అన్నీ సౌందర్యాలే. పువ్వులో నవ్వుంది. నవ్వులో రంగు లున్నాయి. సువాసనా పొంగు లున్నాయి. మేఘంలో పలుకుంది. ఉరిమే మబ్బు ఉరుస్తుంది. కుండపోతగా కురుస్తుంది. ఆ నీళ్ళు తియ్యగా ఉంటాయి. చల్లగా ఉంటాయి. మెత్తగా ఉంటాయి. అందుచేతనే సున్నితమైన ముఖాన్ని సునాయాసంగా కడుక్కో గలుగుతున్నాం. ఉరిమే మబ్బులు, తియ్యని నీళ్ళు, నవ్వే పువ్వులు - ఇవన్నీ ఈ సృష్టి లోనివే. సాహిత్యానికి ప్రతిరూపంగా, సంగీతానికి ప్రతిధ్వనిగా శోభిస్తున్నవే.

ఈ సృష్టిలోని వైభవాలన్నీ పరమాత్మ విభూతులు. మనం మనసారా దర్శించి ఆనందించేందుకు విశేషాలు. ఇదంతా పరమాత్మ స్వరూపం. నాదంటూ ఇక్కడ ఏదీ లేదు. ఆయన అనుగ్రహించినవే నావద్ద ఉన్నాయి. కనుక, నా వద్ద ఉన్నవన్నీ నాకు ప్రసాదాలయ్యాయి.

రాత్రి సమయం. నేను గృహంలో పడుకుంటాను. గువ్వ గూటిలో పడుకుంటుంది. తెల్లవారితే, ఇద్దరమూ లేచి సూర్యోదయాన్ని చూస్తాము. పక్షి సూర్యోదయాన్ని చూస్తుంది. నేను చూడటమే కాదు; అర్థం చేసుకుంటాను. ఆనందిస్తాను. ఇలా అర్థం చేసుకొని ఆనందించే శక్తిని కూడా పరమాత్మ నాకు ప్రసాదించాడు. ఆ శక్తితోనే మాట్లాడుతున్నాను. ఆ శక్తితోనే చేతిని ఇలా కదిలిస్తున్నా. ఆవుకు చేతుల్లేవు. కాని, నాకున్నాయి. రెండు చేతులుండటం పుణ్యం కాదు. ఇన్ని ప్రసాదించిన పరమాత్మకి చేతులెత్తి నమస్కరించ గలిగినపుడే పుణ్యం, పురుషార్థం.

ఇదంతా జ్ఞానం. అర్థం చేసుకుంటూ పోవలసిన జ్ఞానం. వివేక ముంటే ఇవన్నీ మనకు లభిస్తాయి. ఇలా వివేకంతో అర్థం చేసుకొనే శక్తిని కూడా పరమాత్మ నాకు ప్రసాదించాడు. అందుచేత, ఆయన ముందు నేను తల వంచి నిలబడుతున్నాను.

నా కాళ్ళను ఎక్కడైనా పెట్టగలను. చంద్రమండలంలో పెట్టవచ్చు; ఇంద్రభవనంలో పెట్టవచ్చు. కాని, నా తలను పెట్టడానికి ఈ ప్రపంచంలో చోటెక్కడుంది? పరమాత్మ పాదపద్మాలు తప్ప.

హే భగవాన్! **'ఈశావాస్య మిదం సర్వం'. ఇదం సర్వం ఆచ్ఛాదనీయం పరమాత్మనా.** ఈ ప్రపంచం అంతా నీదే. ఈ ప్రపంచం అంతా నీవే. నీకన్నా అన్యంగా రెండవది ఇక్కడ లేదు. ఇలలో కళ నీవే. ఇల ఏదో కాదు నీ ఇల్లు. అందాల హరివిల్లు.

పాట

పల్లవి: అందాల హరివిల్లు నీ ఇల్లు
చూచేందుకు నోచుకోవు మా కళ్ళు ॥ అందాల ॥

అనుపల్లవి: సొంపైన ఊరేగింపు నిరంతరము
కనలే దెందుకో మా నేత్రము ॥ అందాల ॥

చరణములు:

1. ఊడుపులన్నీ గాలుల కార్యము
తడుపులన్నీ వానల క్రమము
ముగ్గుల ముత్యాలు నెలరాజు పుణ్యము
మురియని మనసు ఏనాటి పాపము ॥ అందాల ॥

2. కిలకిల నవ్వుచు ఎగిరే గువ్వలు
నీ సదనమున దోగాడు పాపలు
చుట్టే ఋతువులే నీ ఇంటి చుట్టాలు
విరియని చూపులు మా కంటి శాపాలు ॥ అందాల ॥

3. పూచిన పువ్వులే చిరుచిరు నవ్వులు
ఉరుముల రవములే కమ్మని పలుకులు
సెలయేటి గలగలలు తియ్యని రాగాలు
మానవ బ్రతుకులు మాయని గాయాలు ॥ అందాల ॥

అనుగ్రహ ప్రసాదం

మన వద్ద ఏవైతే ఉన్నవో అవన్నీ పరమాత్మ మనకు ప్రసాదించిన అనుగ్రహాలు. అందుకే అవి ప్రసాదాలు. పరమాత్మ మన కెన్నెన్నో ఇచ్చాడు. వాటికి మనం అర్హులమో కాదో అది వేరే విషయం. దేహాన్నిచ్చాడు. అది పెరిగేందుకు అవకాశాలిచ్చాడు. అవసరాలు తీర్చాడు. తల్లిదండ్రులను ఇచ్చాడు. బిడ్డల్ని అనుగ్రహించాడు. భార్య నిచ్చాడు. స్నేహితుల్ని ఇచ్చాడు. తోబుట్టువుల నిచ్చాడు. తిను బండారాలు సృష్టించాడు. తినేందుకు నాలుకను ప్రసాదించాడు. చూచేందుకు కళ్ళిచ్చాడు. మన ప్రమేయం లేకుండా అవి తెరుచుకొనేలా అమర్చాడు. ఇదంతా అందమైన నియతి.

కళ్ళిచ్చాడు. కళ్ళు చూచేందుకు అందమైన ప్రపంచాన్ని రంగులతో, రూపాలతో ముస్తాబు చేశాడు. నేను ఈ ప్రపంచానికి ఒంటరిగా వచ్చాను. నేను ఇక్కడ ఏదీ సృష్టించలేదు. నేను తీసుకొని వచ్చింది ఏదీ లేదు. ఒంటరిగా వచ్చాను. వస్తూ వస్తూ మధ్యలో తల్లి గర్భంలో తొమ్మిది మాసాలు విడిది చేసి ఈ దేహాన్ని పొందాను. ఈ దేహం కూడా పాంచభౌతికమే. కనుక ఇది కూడా ప్రపంచం కన్నా వేరు కాదు. అంతా ఈశ్వరుడే ప్రసాదించాడు. నేను ఇక్కడ సృష్టించింది ఏదీ లేదు. దీనిని అర్థం చేసుకొనేందుకు నేనున్నాను. ఏమని? అంతా ఈశ్వర మయమని. ఈశ్వర విభూతులని. ఇదంతా పరమేశ్వరుని ఐశ్వర్యమే అని గ్రహించేందుకు నేనున్నాను.

ఈ ప్రపంచం చాలా విశాలమైంది. ఏ దారి ఎటు పోతుందో తెలియదు. ఏ క్షణాన ఏ దుస్థితి ఎదురవుతుందో అర్థం కాదు. ఆపదలు ఎదురు కావచ్చు. యెద చూపి ఆదుకొనే వారెవరు? ఎవరి ఆపదలు వారికున్నాయి. కాల ఊబిలో అందరూ మెల్లమెల్లగా జారిపోతున్నవారే. మనం మొరపెట్టుకున్నా వినేవారు ఎవరున్నారు? అందరి మొరను ఆంతర్యంలో ఉండి వింటూ, ఆదుకొనే ఆపద్బాంధవుడు పరమాత్మ. సర్వులకు ఆయనే శరణ్యం. పూర్వం ఎందరినో సహాయం అర్థించాము. అర్థించ వలసింది, ప్రార్థించవలసింది పరమాత్మనే గాని అన్యులను కాదని బోధపడితే మార్గం మరోవైపు తిరుగుతుంది. ఆశా సుడిగాలి ఆగుతుంది. కోరికల జడివాన తగ్గుతుంది. జ్ఞానగమ్యం వైపు దృష్టి నిలుస్తుంది. భక్తి మార్గంలో ప్రయాణం మొదలౌతుంది. మనస్సు తేలిక పడుతుంది. జ్ఞానంతో బుద్ధి వెలుగుతుంది. సున్నితమైన భావాలతో హృదయం సంతసిస్తుంది. అభ్యర్థనలు ఆరంభమవుతాయి. ప్రార్థనలు కదులుతాయి.

హే భగవాన్! నేను చెట్టెక్కాను. చెట్టెక్కింది పడాలని కాదు. కాయలు కోయాలని ఎక్కానేగాని, కాలు జారుతుందని తెలియదు. పట్టు తప్పి, కాలు జారిపోయింది.

పడిపోతున్నాను. కాని, క్రింది కొమ్మను పట్టుకొని పడకుండా ఆగాను. కాళ్ళు జారితే చేతులు సహాయం చేశాయి. క్షేమంగా ఉన్నాను. భగవాన్! పడకుండా ఆపిన చేతుల్ని నాకిచ్చింది నీవే. అందుకే చేతు లిచ్చిన నిన్ను మరువలేక రెండు చేతులెత్తి నమస్కరిస్తున్నా.

పాట

పెట్టుట కేమి లేదురా
పెట్టే దండమె నాదిరా
రా రా రేపల్లె బాలుడా
వచ్చి పోకురా గోపాలుడా ॥ నా మనసొక చిన్న గది ॥

నా మనసొక చిన్నగది
అది నీకే సరిపోతది
నీ పాదము మోపగనే
అది బ్రహ్మాండమం తౌతది ॥ నా మనసొక చిన్న గది ॥

అని పరవశించింది చైతన్యగాన లహరి.

సాధనలోనే సాధ్యం

ఏవేవి ఎందుకున్నాయో, దేనికొరకున్నాయో తెలిసి అలా వినియోగించుకుంటూ పోతే బ్రతుకులో అందం నిండుతుంది, ఆనందం పండుతుంది. జీవితంలో మనకున్న వన్నీ దేని కొరకున్నాయో వాటి అవసరాలేమిటో ముఖ్యంగా మనం గుర్తిస్తూ పోవాలి. చేతులు ఇచ్చుకునేందుకు ఉన్నాయి. ఇది మరచి పుచ్చుకునేందుకే ఉన్నాయి అని చేతుల్ని చాస్తూపోతే అలాంటి చేతులు యాచనకు పనికొస్తాయేమో గాని అర్చనకు మాత్రం పనికి రావు. ఎవరికీ ఏమీ పెట్టక మిగిలిపోయిన ఈ చేతులు రేపు పూజాగదిలో హారతి పళ్ళాన్ని పట్టుకోవడానికి పనికొస్తాయా? ఆలయంలో పూల దోసిళ్ళై శోభిస్తాయా? మంచి మాటలు మాట్లాడేందుకు నోరుంది. సాత్త్వికమైన ఆహారాన్ని భుజించేందుకు, నిర్మల మైన పానీయాన్ని గ్రహించుటకు నోరుంది. భగవంతుడిని స్తుతించేందుకు ఉంది, ప్రార్థించేందుకు ఉంది, కీర్తించేందుకు ఉంది. ఇదంతా మానేసి చెడు మాట్లాడేందుకు, చాడీలు చెప్పేందుకు, ఇతరులను తిట్టేందుకు, వాగేందుకు, ఇలా కనుక మనసు తయారైతే ఆ మనసు ఎందుకున్నట్లు? ఎవరికోస మున్నట్లు? ఆ నోటి యొక్క ఉపయోగమేమిటి? ఏమో! దాని ఉపయోగం ఏదైనా కావచ్చు నేమో గాని, 'అలాంటి నోరు మాత్రం మాకు లేదు' అని పశుపక్ష్యాదులు మాత్రం చాలా తృప్తి చెందుతాయి.

కళ్ళల్లో పరమాత్మ నీళ్ళెందుకు పెట్టాడు? కలతలతో కుమిలిపోతూ కన్నీళ్ళను కార్చుతూ దుఃఖించేందుకు మాత్రం కానే కాదు. భావ స్పందనతో హృదయం చలిస్తే దానితో కలిసి చరించేందుకు కన్నీళ్ళున్నాయి. దివ్యమైన పారవశ్యంతో హృదయం

స్పందిస్తే, ప్రేమతో, ఆనందంతో పులకరించి ఆనందాశ్రువులు రాల్చితే, అవి చెక్కిళ్ళను తడిపేందుకు మాత్రమే ఉన్నాయి. ఇది స్పందన. భావ స్పందన. ఇది సాధన. ఆధ్యాత్మిక సాధన. భక్తియోగ సాధన. జ్ఞానయోగ సాధన. వేదనల్ని అంతం చేసే సాధన. రోదనల్ని రూపుమాపే సాధన. అందుకే, పవిత్రాత్ముడైన పరమాత్మ సాధ్యరూపుడు కనుక ఆయన పవిత్రుడు. అంతే కాదు, పవిత్రమైనటువంటి సాధన కూడా తానే అయి ఉన్నాడు.

పాట

పల్లవి: సత్యమైన నీ కథ విని
విని పించింది మనసు మనవిని ॥ సత్య ॥

అనుపల్లవి: పోయిన పున్నమి వచ్చిందని
చేసిన పున్నెము తెచ్చిందని ॥ సత్య ॥

చరణములు:

1. చెప్పుటకేమి లేదని
చెప్పక మన సుండలేదని
మనసారా నీకిచ్చిన మనసు
ఏనాటికి తిరిగి రాదని
నిన్నొదలి ఎన్నడు రాలేదని ॥ సత్య॥

2. యెందరెందరో ఉన్నారని
అందరిలో నీవున్నావని
యెన్నో మహిలో ఉండినా
మదిలో నీవే ఉంటావని
నా మదిలో నీవే ఉంటావని ॥ సత్య ॥

అని తన్మయమైంది చైతన్యగాన లహరి.

ఈశ్వర భావన

విశ్వాన్ని సృష్టించిన భగవంతుడు విశ్రమించలేదు. ఇందులోనే ఉన్నాడు. ఈ విశ్వంలోనే ఉన్నాడు. ఎలా ఉన్నాడు? బల్బులో విద్యుచ్ఛక్తి లాగ. బల్బును ప్రకాశింప జేసే విద్యుచ్ఛక్తి బల్బులోనే ఉంది. ఈ లోకాన్ని ప్రకాశింప చేసే సూర్య భగవానుడు ఈ లోకంలోనే ఉన్నాడు. అలాగే, ఈ సృష్టిని ప్రదీపింప జేసే పరమాత్మ ఈ సృష్టిలోనే ఉన్నాడు, ఈ విశ్వంలోనే ఉన్నాడు. ఎలా ఉన్నాడు? ధర్మరూపంలో ఉన్నాడు. ధర్మమే భగవంతుడు. **రామో విగ్రహవాన్ ధర్మః** రాముడు ధర్మ స్వరూపుడు. ధర్మం పోత పోసినటువంటి విగ్రహమే శ్రీరామచంద్ర మూర్తి. కనుక ఈ సృష్టిలో ఏ ధర్మాలైతే ఉన్నాయో ఇవన్నీ కూడా భగవంతుని యొక్క స్వరూపం. ఈ సృష్టి నడవడానికి ఆధారమైనటువంటి నియమాలు, నియతి, ధర్మం - ఇవన్నీ కూడా భగవంతుని యొక్క స్వరూపం. ఇది తెలిసి ధర్మ జీవనాన్ని గడిపితే అది తప్పకుండా దైవారాధనే అవుతుంది.

ఇక్కడే పని పూజగా మారుతుంది. అర్చనగా శోభిస్తుంది. మనం చేసే పనిలో పరమాత్మ ఎప్పుడైతే ప్రవేశిస్తాడో, పరమాత్మ భావన ఎప్పుడయితే చోటు చేసుకుంటుందో ఆ పని పూజగా మారుతుంది. ఈ విషయాన్నే భగవద్గీత కూడా ధృవపరచింది.

యతః ప్రవృత్తిః భూతానాం యేన సర్వమిదం తతం
స్వకర్మణా తమభ్యర్చ్య సిద్ధిం విందతి మానవః ॥

ఎవరినుండైతే ఈ సమస్తమైన భూత జాలం కదలి వచ్చిందో ఎవరిలో ఉంటూ ఉందో, ఈ ప్రపంచంలో ఏ ఈశ్వర చైతన్యం పరివ్యాప్తమై ఉందో, అటువంటి పరమాత్మని చేసే కర్మల ద్వారానే అర్చించి ఈ ప్రపంచంలో మనుష్యులు సిద్ధిని పొందుతూ ఉన్నారు. కనుక, కర్మలను మార్చవలసిన అవసరం లేదు. మనం చేసే కార్యక్రమాల్లో ఈశ్వర భావన మనకు ఏర్పడి పరమాత్మ స్వరూపంగా కనుక ఆచరించ గలిగితే ఆ కర్మలన్నీ యజ్ఞ స్వరూపంగా మారుతాయి. నేను నా సోదరుని దగ్గరకు వెళతాను. ఒక్క పువ్వు అతనికి ఇస్తాను. అతడు చాలా సంతృప్తిపడతాడు. ఇంతకీ నేను అతనికి ఇచ్చింది ఏమిటో తెలుసా? పువ్వును కాదు, ప్రేమను. నా ప్రేమకు ప్రతిరూపంగా ఆ సమయంలో ఆ పువ్వు దివ్యంగా వెలిగిపోతుంది. శోభిస్తుంది. ఈ వైభవం పువ్వులో ఉన్నది కాదు, దాని రంగులోనూ కాదు. సౌందర్యంలోనూ కాదు. అది కేవలం ఆ పుష్పాన్ని సమర్పించిన వ్యక్తి యొక్క హృదయ సౌందర్యం. ఇదే భక్తి. ఇదే ఈశ్వరారాధన. ఇదే ఈశ్వర భావన. ఎప్పుడైతే మనం సమర్పించేవన్నీ ఇలా పరమాత్మకు నైవేద్యంగా మారుతూ ఉన్నాయో, మనం చేసే ప్రతి పని పూజగా మారుతూ ఉందో, ఈ కర్మలకు ఫలం ఏదైతే ఉందో అది ప్రసాదంగా అందుతూ ఉంది. కనుకనే ప్రతి కర్మ యజ్ఞకర్మగా మారుతూ ఉంది. కారణం, పరమాత్మ ధర్మరూపంలో, యజ్ఞరూపంలో ఈ ప్రపంచంలో ఉన్నాడు.

సాధన సౌలభ్యం

సాధన విషయంలో ఆధ్యాత్మిక సాధకులకు అనేక విషయాలు తెలిసి ఉండినా, "సాధన కష్టమైన కార్యము కాదు" అనే ముఖ్య విషయము మాత్రము చాలా మందికి తెలియదు. ఇక్కడే సాధకులు తెలియకుండానే బండబరువును సాధనలో మోస్తూ ఉంటారు.

ఇష్టమైన వ్యక్తిని మనం ప్రేమిస్తూ ఉన్నాము. ఇష్టమైన వారిని గూర్చి ఎవరైనా చెబుతూ ఉంటే శ్రద్ధగా వింటున్నాం. లేదా, మనమే ప్రేమతో పలుకుతున్నాం. ఇష్టమైన కార్యాలను శ్రద్ధతో, ఉత్సాహంతో చేస్తున్నాం. ఈ విషయాల్లో ఎక్కడ కూడా కష్టం తెలిసిరావటం లేదు.

ఉదయించే సూర్యుని అందాన్ని చూస్తున్నాం. సముద్రంలో లేచిపడే అలలను చూస్తున్నాం. ఎత్తైన ఆలయ గోపురాన్ని చూస్తున్నాం, పచ్చని పొలాలను, పర్వత శ్రేణులను చూచి ఆనందిస్తున్నాం. ఈ కార్యాలలో కష్టం ఉందా?

లేదు. అయితే పరమాత్మ కొరకు మనం ఆచరించే సాధనలలో కూడా లేనట్లే. పువ్వులోని అందాన్ని చూడటానికైనా నేను కొద్దిగా ప్రయత్నించాలేమో గాని పరమాత్మను దర్శించటానికి ఆ మాత్రం ప్రయత్నం కూడా అవసరం లేదు. పరమాత్మ ఎవరో కాదు; మన స్వరూపమే. ప్రాణానికి ప్రాణమైనవాడు. మనసుకు మనసైన వాడు. మనసు వెనుక మహిమ తానై శోభించువాడు.

తూర్పున సూర్యోదయం జరుగుతూ ఉంటుంది. అభిముఖంగా బాటసారి నడుస్తూ ఉంటాడు. అతడు నడుస్తూనే ఉంటాడు. పుణ్యకాలం కాస్త కారిపోతుంది. ఏదో ఆలోచిస్తూ ముందుకు పోతూ ఉంటాడే గాని అందమైన సూర్యోదయాన్ని వీక్షించడు. కళ్ళ ముందే కాంతులు దివ్యంగా పరచియున్నా, దర్శించి ఆనందించే భాగ్యానికి నోచుకోడు.

ఉన్నది ఏదైనా తెలియకుండా ఉన్నంత వరకు ఆ ఉన్నది ఉండినా ప్రయోజనం ఉండదు. "ఉన్నది - తెలియకుండా ఉన్నది". అన్నీ జీవితంలో ఇలాగే ఉన్నాయి.

కష్టాలు లేనివారు ఎవరు ఈ ప్రపంచంలో? అలా ఉన్నట్లు తెలిసినవారు ఎందరున్నారు? కష్టాలు పడటం వేరు. వాటి పూర్వాపరాలను అర్థం చేసుకోవటం వేరు. "ఎన్ని కష్టాలొచ్చినా అతడికి కనువిప్పు కలుగలేదు. బాధలు చుట్టుముట్టినా అతడి మనసు భగవంతుని వైపు మరలటం లేదు" అని చాలా మంది అంటూ ఉండటం మీరు వింటూనే ఉంటారు.

బాధలున్నవారు బాధల నుండి విడిపడేందుకు అన్యులను ఆశ్రయిస్తారు కాని భగవంతుని వైపు ఎందుకు తిరుగుతారు? ఆకాశాన్ని మేఘాలు క్రమ్మినట్లు మనిషిని కష్టాలు చుట్టేస్తే, దిక్కు తోచక మనిషి దుఃఖించగల డేమో గాని ప్రార్థించగలడా? బోరున విలపించగల డేమో గాని తన హృదయావేదనను పరమాత్మకు వినిపించగలడా?

బాధలున్నంత మాత్రాన భగవంతుడు తెలిసిరాడు. బాధలను గుర్తించాలి. అర్థం చేసుకోవాలి. మన ప్రయత్నంతో గాని, ఇతరుల సహకారంతో గాని బ్రతుకులో బాధలు దూరం కావు అనే గొప్ప సత్యాన్ని బుద్ధి దర్శించగలగాలి. అంతే కాదు. జీవితంలో ఎదురయ్యే ఉపద్రవము లన్నిటినీ తొలగించి, అనంతానందమును ప్రసాదించే శక్తి పరమాత్మకే ఉంది అనే సత్యవిషయం అర్థం కావాలి. అప్పుడే మనసు భగవంతుని వైపు తిరుగుతుంది. అంతవరకు కష్టాలు ఉంటాయి. కాని అర్థం కాకుండా ఉంటాయి.

అర్థమైతే, సాధన కష్టం కాదు. ప్రేమ కార్యాలలో కష్టా లుండవు. మనం ప్రేమించే వారికి, వారిపై మనకున్న ప్రేమకి పెద్ద తేడా లేదు. సాధ్యరూపుడైన పరమాత్మకు, పరమాత్మకు సంబంధించిన సాధనకు మధ్య కూడా పెద్ద తేడా లేదు. అది గ్రహించిన మరుక్షణం నుండి సాధన గాలిలాగ తేలిపోతూ ఉంటుంది. తేలికగా ఉంటుంది. ప్రతి క్షణం మనస్సులో పరమాత్మే తేలుతూ ఉంటాడు. ప్రపంచం మునుగుతూ ఉంటుంది.

"భావగ్రాహి జనార్దనః". మన భావాన్ని గ్రహించేవాడు భగవంతుడు. కాదు కాదు; మన భావాన్ని భగవంతుడే గ్రహించగలడు. తనకంటూ పరమాత్మకు భావాలు

లేవు. కనుక నీ భావాలను అర్థం చేసుకుంటాడు. ఇతరుల పరిస్థితి వేరు. వాళ్ళు తమ భావాలను జోడించి మనల్ని అర్థం చేసుకొనే ప్రయత్నం చేస్తారు. అందుచేతనే ఈ ప్రపంచంలో ఎవరూ ఎవరికీ అర్థం కాకుండా మిగిలిపోతారు.

పరమాత్మ నీ భావాల్ని గ్రహిస్తాడు. నీ మొర వింటాడు. నీ మాటల్ని ప్రేమతో ఆలకిస్తాడు. ఎలా పిలిచినా పలుకుతాడు. పరమాత్మ మెచ్చుకొనే టంతటి గొప్ప భాష మన వద్ద లేదు. మనం భావ స్ఫూర్తితో ఏది పలికినా, అది పరమాత్మకు ప్రియంగా ఉంటుంది. నీ పలుకుల్లో వ్యాకరణ దోషాలున్నాయని పరమాత్మ నీకు దూరంగా పోడు. మనలోని వ్యాకరణ వైభవాన్ని చూచి మనల్ని గుర్తించటానికి పరమాత్మ మేష్టారు కాదు. పరమాత్మకు కావలసింది భాషావేత్తలు కారు; భక్తులు. భక్తులలో భాషా వైభవం తొంగి చూడవచ్చు. భాష ఉన్నవారందరూ భక్తులు కాలేరు.

మనం భక్తులం కావాలి. ఏం చేయాలి? భక్తి చేయాలి. ఇంకేం చేస్తాం? మరేదో చేస్తే మరొకర మవుతా మేమో గాని భక్తులం ఎలా అవుతాము? ఒక నిర్జన ప్రదేశంలో నడచి వెళ్తున్నాము. మార్గమధ్యంలో ఒక చెట్టు క్రింద కూర్చుని కళ్ళు మూసి భగవంతుని ప్రార్థిస్తున్నాం. అప్పుడు మన మెక్కడున్నాం? చెట్టు క్రింద లేము. ఆలయంలో ఉన్నాం. పరమాత్మ మన మనస్సులో కదిలిన క్షణాన మన దేహం దేవాలయం అవుతుంది. **"దేహో దేవాలయః ప్రోక్తః"**. దేహము దేవాలయంగానే ఉంది. కాని, తెలియకుండా ఉంది. భక్తి చేయగనే తెలియనిది తెలుస్తుంది. దేహ మున్నంత మాత్రాన అది దేవాలయం కాలేదు. భావన చేరితేనే, భక్తి భావన చేరితేనే దేహం ఆలయంగా శోభిస్తుంది.

శుద్ధి కొరకు చేస్తే స్నాన మవుతుంది. బుద్ధిని జోడించి, భావనను కలిపితే, స్నానమే పరమాత్మకు అభిషేక మవుతుంది. స్నానానికి ఉపయోగించే జలం శుద్ధోదక మవుతుంది. గంగాజలం అవుతుంది.

ఈ దేహంలో పరమాత్మ వైభవంగా శోభిస్తూ ఉన్నాడు. "పరమాత్మను అభిషేకిస్తున్నాను" అనే భావంలో బ్రతుకు భవ్యంగా ప్రకాశిస్తుంది. భవంలో విభవం తొంగి చూస్తుంది. వైభవం పొంగివస్తుంది.

కాలం నాకు అనుకూలం కాకపోవచ్చు. భగవంతునికి ప్రతికూలం కాగలదా? కాలరూపంలో ఉన్నది కూడా తానే. ఇది అర్థమైన క్షణాన ఏ కాలమైనా అనుకూలమే. ప్రస్తుతం ఈ కాలంలో నా మనస్సులో రాముడున్నాడు. ఈ కాలం నాకు రాహు కాలం కాదు; రామ కాలం. రామానుకూల కాలం. రాహువు రాణించని, కేతువు కనిపించని కమనీయ కాలం. పుణ్యకాలం. పవిత్రమైన కాలం. పరమాత్మ కాలం. యమగండం తెలియని కాలం. సుడిగుండం అర్థం గాని కాలం. దైవం అండగా దండిగా, నిండుగా నిలిచిన పండు వెన్నెలల కాలం. పండే నవ్వుల కాలం.

పువ్వు అందంగా అగుపిస్తుంది. భావనతో దానిని పరమాత్మకు నివేదిస్తే అది ఆరాధనగా మారుతుంది. **"వేద్యం"** తెలిసివస్తే, ఏది ఇచ్చినా **"నైవేద్యం"** అవుతుంది.

ఫలపుష్పాలే కావు; పత్ర తోయాదులు కూడా నైవేద్యాలు. అవి కూడా చేతికి అందకపోతే, ఉన్న చేతుల్ని ఏకం చేసి **"నమః"** అనటమే. అది కూడా సమర్పణమే.

చేతులు కూడా లేనివారు చాలా మంది ఉన్నారు ఈ ప్రపంచంలో. అప్పుడేం చేయాలి? చిత్తాన్నే చేతులుగా మలచుకొని, "ప్రభూ! చేతులకు నోచుకోని అదృష్టహీనుణ్ణి. నా మనసుతోనే అర్పిస్తాను. గ్రహించు!" అని పలికితే, ఈ మాటను పరమాత్మ వినలేడా? నీ మనస్సిచ్చే పువ్వును గ్రహించేందుకు పరమాత్మ మనస్సు లేని వాడా? **శ్రోత్రస్య శ్రోత్రం మనసో మనః.** తాను నీ చెవిలో చెవిగా, నీ మనస్సులో మనస్సుగా ఉన్నాడు. భావించు. సంభావించు. భక్తిభావనా పటిమతో బ్రతుకును భగవన్మయం చేసుకుందాం.

దేహము - దేవాలయము

సృష్టికన్నా దూరంగా సృష్టికర్త ఉండే అవకాశం లేనందున సృష్టిలో ఏదైనా పరమాత్మ రూపమే. భగవంతుడు ఈ సంస్కృతిలో మనిషికి దూరంగా ఉండలేడు.

'దేహో దేవాలయః ప్రోక్తః'. మానవ దేహం చలించటానికి అంతర్యామిగా శోభిస్తున్నది పరమాత్మే కనుక దేహం దేవాలయంగా కీర్తించబడింది. దేవునికి ఆలయంగా దేహము ఉంది అని భావించే హిందువు ఆలయంలాగ దేహాన్ని పవిత్రంగా ఉంచుకుంటాడు. చందన తిలకాదులతో దేహాన్ని అలంకరిస్తాడు. ఆహారాన్ని పరమాత్మకు అర్పణ చేస్తున్నట్లు భావిస్తాడు. పరమాత్మకు సమర్పించేది కనుక ఆహారం పవిత్రంగా ఉండాలని భావిస్తాడు. రుచికి ప్రాధాన్యత నివ్వడు. శుచికే ప్రాముఖ్యం.

ఏది లభించినా కర్మఫలమే కనుక ప్రసాదంగా భావిస్తాడు. లభించిన దానిలో పరమాత్మ వైభవాన్ని దర్శిస్తాడు. పంట పండి ధాన్యం ఇంటికి వస్తే, **హారతి పట్టి** నమస్కరిస్తాడు. ధాన్యాన్ని ధాన్యంగా చూడడు. ధాన్యలక్ష్మిగా దర్శిస్తాడు. **ఇదంతా** సంస్కృతి అనుగ్రహించిన అవగాహన.

ధనాన్ని కళ్ళ కద్దుకుంటాడు. అన్ని ఇంద్రియాలలో ప్రధానమైనది, పవిత్రమైనది నేత్రము. ధనాన్ని పవిత్రంగా భావించి కళ్ళ కద్దుకుంటాడు. అతడు విలువ నిచ్చేది ధనానికి కాదు; ధనలక్ష్మికి.

ఏ భాగ్యమైనా అది పరమాత్మ ప్రసాదమే కనుక అతనికి సౌభాగ్యమే. ఏ జ్ఞానమైనా సరస్వతీ స్వరూపమే.

పరమాత్మకు దూరంగా ఏ పనీ చేయలేడు హిందువు. అతడి కళ్ళ ముందు పరమాత్మ కదుల్తూనే ఉంటాడు. భూమిపూజ లేకుండా గృహ నిర్మాణం చేయలేడు హిందువు. పరమాత్మ లేకుండా గృహప్రవేశం చేయలేడు. పరమాత్మను ముందు పెట్టుకొనే వివాహం చేసుకుంటాడు. పుట్టిన బిడ్డకు పరమాత్మ నామం పెట్టుకుంటాడు. కట్టిన గృహాన్ని "కేశవ నిలయం" అంటాడు. పుట్టిన బిడ్డకు మాధవ నామం పెడతాడు.

జీవితమంతా పరమాత్మను ప్రక్కన బెట్టుకొని జీవించిన హిందువు చనిపోయినా, అతని దేహానికి తల ప్రక్కన జ్యోతి రూపంలో పరమాత్మను ఉంచుకుంటాడు.

ఈ విధమైన మంగళకర దృష్టిని వేద సంస్కృతి ప్రసాదిస్తుంది. భగవంతుడు సర్వాంతర్యామి యైనా, ఆయనను దర్శించటానికి వేద సంస్కృతినే ఆశ్రయించాలి. కారణం, పరమాత్మ జ్ఞానమును వేదమే అందిస్తూ ఉంది కనుక.

భగవానుడు మన మనస్సులో భావన కాదు. సాగరంలో లేచిపడే అలలాగ మన బుద్ధిలో ఎగిసిపడే సంకల్పం కాదు. పవిత్రమైన ఈ వేద సంస్కృతిలో, ఆర్ష సంస్కృతిలో అతడు సత్య స్వరూపము. ఎక్కడో ఉన్నవాడు కాదు; ఇక్కడ ఉన్నవాడే. ఏదోగా ఉండే వాడు కాదు; ఏదైనా తానుగానే ఉండేవాడు.

ఈ అవగాహనను వేద సంస్కృతి ప్రసాదిస్తుంది. సదా పరమాత్మ వైభవంతో శోభించే దివ్యస్థితిని అనుగ్రహిస్తుంది. ఇక్కడ జీవన విధానము, కళలు, వేషభాషలు, ఆహారపు టలవాట్లు అన్నీ అలౌకికంగానే అలరారుతున్నాయి. కనుక, భారతీయ సంస్కృతి లౌకికవాద సంస్కృతి కాదు. అలౌకిక జ్ఞాన సంపదే ఈ సంస్కృతిలో ప్రధానమైన విషయము.

సంస్కృతి - సంప్రదాయము

చేతనం - అచేతనం :- "ఆయన నడచిపోతున్నాడు" అని ఒక వ్యక్తిని గూర్చి మనం ప్రస్తావించి నపుడు మన ఉద్దేశ్యం మనిషి నడుస్తున్నాడు అనేదే గాని కాళ్ళు నడుస్తున్నాయి అని మాత్రం కాదు. కాళ్ళు లేకపోతే నడవటం మనిషికి సాధ్యం కాదు. కాని, నడిచేటప్పుడు కర్తృత్వ మనేది మనిషికి సంబంధించిందే గాని కాళ్ళకు సంబంధించింది కాదు.

యంత్రము నడుస్తుంది. కాని, అది జడం. నడిపేవాడు ఉంటేనే నడుస్తుంది. తాను నడుస్తున్నట్లు తనకు జ్ఞానం లేదు.

మానవుని ప్రక్కన బెడితే, మిగిలిన జీవరాశు లన్నియు నడుస్తూ ఉన్నాయి. అవి జడాలు కావు. చేతనములే. కాని, చేతన కర్తృత్వం వాటిలో గోచరించటం లేదు. కేవలం సహజాతాలతో చరిస్తూ ఉన్నాయి. వర్తనే గాని ప్రవర్తనకు వాటిలో అవకాశం లేదు. ప్రవర్తన లేనపుడు పరివర్తనను ఊహించటం హాస్యాస్పదము. కనుక పశుపక్ష్యాదులలో అలవాట్లను దించగలమే గాని అవగాహనను ఉంచలేము.

మనిషి యంత్రములా నడుపబడేవాడు కాదు. పశుపక్ష్యాదులకు మల్లే వివేకము లేనివాడు కూడా కాదు. తాను నడిచేవాడు. బుద్ధితో ఆలోచించి నడిచేవాడు. అతనిది చేతన కర్తృత్వం. ఈ కారణంగానే విశ్వంలో మానవునికి మాత్రమే సంస్కృతి ఉంది. ఇది తెలిసిన క్షణం నుండే మనిషి నాగరికుడు. పశుపక్ష్యాదులకు జీవన మున్నదే గాని సంస్కృతి లేదు.

మానవులందరూ ఒక్కటే. కాని, అందరి సంస్కృతులు ఒకేలాగ లేవు. మానవ సంస్కృతి ఒక్కటే అని చెప్పలేము.

సంస్కృతి :- సంస్కృతి అనేది చాలా విశాలమైన దృక్పథమును సూచించే పదము. సంస్కృతి అనేది ఒకే పదమైనా అందులో అనేకాంశాలు చోటుచేసుకొని ఉంటాయి. 'వేపచెట్టు' అన్నప్పుడు, అందులో కాండము, కొమ్మలు, రెమ్మలు, ఆకులు, పువ్వులు, కాయలు, పండ్లు, చేదుగుణము - ఇవన్నీ ఉన్నవనే అర్థము. అప్పుడే అది వేపచెట్టు అవుతుంది.

సంస్కృతి అనగానే "ఏ దేశ సంస్కృతి?", "ఏ ప్రజల సంస్కృతి?" అనే ప్రశ్నలు పడుతూ ఉంటాయి. అంటే, ఒకొక్క దేశానికి ఒకొక్క సంస్కృతి, ఒకొక్క ప్రాంతానికి ఒకొక్క సంస్కృతి ఉంటాయి అని అర్థము.

ఏ దేశమైనా, ఆ దేశంలోని ప్రజలు ధరించే దుస్తులు, వారు మాట్లాడే భాష, తినే ఆహారము, జీవన విధానము, ఆచార వ్యవహారాలు, కళలు - ఇవన్నీ కలిసి ఆ దేశ సంస్కృతిగా శోభిస్తూ ఉంటాయి. ఇక్కడే, ప్రపంచంలో భిన్న సంస్కృతులు గోచరించటానికి కారణం అర్థమవుతూ ఉంది.

మతము - సంస్కృతి :- ఏ దేశమైనా, ఏ ప్రాంతమైనా వాటికి సంబంధించిన సంస్కృతితో అవి జీవిస్తూ ఉన్నాయి. అయితే, ఇక్కడ మత ప్రమేయం ఉందా? సంస్కృతికి, మతానికి సంబంధం ఉందా? మతం ఉంటేగాని సంస్కృతి ఉండదా? మతమే లేని ప్రాంతంలో సంస్కృతి లేనట్లేనా?

మతానికి, సంస్కృతికి సంబంధం లేదు. మతమున్నా, లేకపోయినా సంస్కృతి ఉంటుంది. ఇదే లౌకిక వాదము. బాగా అర్థం చేసుకోండి. లౌకిక వాదము అనేది ప్రధానంగా సంస్కృతిని అంటిపెట్టుకొని ఉంటుందే గాని మతంతో చేయి కలపదు. ఈ కోణంలో విచారిస్తే, ప్రపంచంలోని ఎక్కువ దేశాలు ఇలా లౌకికవాద ధోరణిలోనే కొనసాగుతున్నాయి.

లౌకికవాదం ప్రధానంగా కొనసాగే అనేక దేశాలలో మతం యొక్క ప్రమేయం లేనేలేదని చెప్పలేము. కొన్ని దేశాలలో మత విషయాలు, మత విలువలు సంస్కృతీ ప్రవాహంలో కలిసిపోయి ఉన్నాయి. ఎంత కలిసినా, దేని దారి దానిదిగానే ఉంది. ఏది ఏమైనా, పాశ్చాత్య దేశాలలో లౌకికవాదమే ప్రధానంగా ఉంది. ఇది కేవలం సంస్కృతికి సంబంధించిన విషయం. మతం ఉండవచ్చు. లేకుండా ఉండవచ్చు. లేకుండా పోవచ్చు. ఉండి కూడా పోయి ఉండవచ్చు.

భారతీయ సంస్కృతి :- అన్ని దేశాలకు సంస్కృతి ఉన్నట్లే భారతదేశానికి కూడా సంస్కృతి ఉంది. అయితే, అన్ని దేశాలకు మల్లే భారతదేశంలో లౌకికవాద సంస్కృతి లేదు. భారతీయ సంస్కృతి వేద సంస్కృతి. అంటే, భారతీయ సంస్కృతిలో వేద సంప్రదాయము పెన వేసుకొని ఉంది. ఇక్కడ ధరించే దుస్తులు, మాట్లాడే భాషలు,

ఆహార వ్యవహారాలు, ఆచారాలు, జీవన విధానము, కళలు అన్నీ సంప్రదాయంతో ముడిపడి ఉన్నాయి.

లౌకిక మేదైనా అది పారలౌకికమే, అలౌకిక ఆనందము కొరకే అనే అవగాహన భారతీయ సంస్కృతిలో గుండెలాగ కొట్టుకుంటోంది. శ్వాసలాగ కదుల్తూ ఉంది.

వేదము - వేదపురుషుడు :- వేద సంస్కృతిలో లోకేశ్వరుడైన భగవంతుడే కేంద్ర విషయము. కనుక వేద సంస్కృతి లోకంలో గోచరించే అలౌకిక వైభవం.

ప్రపంచం ఒక సృష్టి. ఇక్కడ నియతి ఉంది. నియతి నియంతను సూచిస్తుంది. నియతిగా తెలిసే జ్ఞానము నియంతదే. కనుక జ్ఞానము ఉన్నదే గాని సృష్టింపబడేది కాదు.

లోకంలో ఉన్న ఏ జ్ఞానమైనా పరమాత్మ జ్ఞానానికి దూరంగా లేదు. పరమాత్మ జ్ఞానంలో సర్వ జ్ఞానము ఇమిడి ఉంది. ఇది పూర్ణ జ్ఞానము. పూర్ణ జ్ఞానము కలిగిన వారు పూర్ణ పురుషులై శోభిస్తారు.

వేద సంస్కృతి పూర్ణత్వం వైపే నడక సాగిస్తోంది. వేష భాషలు, ఆచారాలు, ఆహారపుటలవాట్లు, జీవన విధానము, కళలు - అన్నీ పరమాత్మను గుర్తు చేసేందుకే ఉన్నాయి.

కనుక మనది వేద సంస్కృతి. వేద సంప్రదాయము. ఈ సంప్రదాయమును ఋషులు, గురువులు కాపాడుకుంటూ వచ్చారు.

వేదాన్ని ఋషులు సృష్టించలేదు.

వేదాన్ని బోధించే సంప్రదాయాన్ని సృష్టించారు.

ఋషిభిః నప్రమాణ కర్తారః

ఋషిభిః సంప్రదాయ కర్తారః

ఋషులు ప్రమాణ కర్తలు కారు. సంప్రదాయ కర్తలు.

జ్ఞానం సృష్టింపబడేది కాదు. అందించబడేది. వెలిగే దీపము మరొక దీపాన్ని వెలిగించినట్లు, జ్ఞానం కలిగిన గురువు మరొకరికి జ్ఞానాన్ని ప్రసాదిస్తాడు.

గురుః

గుకారః అంధకారః

రుకారః తేజః ఉచ్యతే

'గు' అనే అక్షరము చీకటిని సూచిస్తుండగా, 'రు' వెలుగుకు ప్రతిరూపంగా ఉంది.

ఈ ప్రపంచంలో శక్తి లేని వస్తువంటూ లేదు. ఇసుక రేణువులో కూడా అణుశక్తి పుష్కలంగా ఉంది. చీకటికి కూడా శక్తి ఉంది. ఉన్న దానిని కనబడనివ్వకుండా చేసే శక్తి చీకటికుంది. ఇంట్లో కరెంటు పోతుంది. మనకు కావలసిన వస్తువు ఎక్కడుందో

తెలియదు. టార్చిలైటు వేశాం. వస్తువు కనిపిస్తుంది. వస్తువు అక్కడే ఉంది. కాని, దానిని కంటబడకుండా చేసింది చీకటి. అంతేగాని, ఊడ్చి బైట పడేయలేదు.

టార్చిలైటు వెలిగించాం. వెలుతురు వచ్చింది. ఇంతకీ వెలుతురు చేసిందేమిటి? చీకటి ఊడ్చి పారేసిన దానిని వెలుగు బుట్టకెత్తి తీసుకురాలేదు. చీకటిని తొలగించి ఉన్న వస్తువును ఉన్నట్లు చూపింది. గురువు అదే చేస్తాడు.

సర్వజ్ఞః ఈశ్వరః అస్తి

ఉన్నదంతా ఈశ్వరుడే. ఈ ప్రపంచం ఈశ్వరమయం. కాని, ఈ సత్యాన్ని దర్శించే అవకాశాన్ని నిరోధిస్తూ చీకటి అడ్డుగోడలా నిలిచింది. **'సర్వం విష్ణుమయం జగత్'** అనే జ్ఞాన వెలుగు ద్వారా గురువులు అజ్ఞాన చీకట్లను చెదరగొట్టి సత్య దర్శనం చేయిస్తారు. కనుకనే, జ్ఞానప్రదాతయైన గురువును "పరమాత్మ" స్వరూపంగా భావించి, **"గురుస్సాక్షాత్ పరంబ్రహ్మ"** అని కీర్తిస్తున్నాం.

భావనే పావనం

అందంగా ఉన్నవి ఈ ప్రపంచంలో అదృశ్య మవుతున్నాయి. కాని, అందం అదృశ్యం కావడం లేదు. గాయకులు కనుమరు గవుతున్నారు. గానం వినిపిస్తూనే ఉంది. చెట్లు పడిపోతున్నాయి. గాలులు వీస్తూనే ఉన్నాయి. జలాశయాలు ఇంకి పోతున్నాయి. జలాలు పొంగుతూనే ఉన్నాయి. ఇదంతా వైభవం. పరమాత్మ వైభవం.

ఈ వైభవం తెలిసిన వారిలో అవగాహన నూతన చిగుళ్ళను తొడిగి శోభిస్తుంది. ఒక విధంగా చెప్పాలంటే, జీవితమే ఒక అందమైన మలుపు తిరుగుతుంది. ఆశించ వలసింది అదృశ్యమయ్యే వాటిని కాదని తెలుస్తుంది. నిత్యవస్తువు వైపుకు మనస్సు మరలుతుంది.

ఏ తత్త్వము గొప్ప తేజో రూపమో, ఏది గొప్ప తపోమయమో, ఏది సత్య జ్ఞానానంద స్వరూపమో, ఏది తిరిగి రాని ధామమో, ఆ తత్త్వమే ఏకైక గమ్యము.

ఈ ప్రపంచంలో వెలుగు లెన్నో ఉన్నాయి. అవన్నీ కాలంలో వెలవెల పోతున్నాయి. కారణం? తమ వెలుగుకు మరొక కారణం కలిగి ఉండటమే. మరొక దానిపై ఆధారపడి ప్రకాశించటమే. కాని, పరమాత్మ తేజము స్వప్రకాశ చైతన్యము. కనుక అది వెలుగులకు వెలుగు. ఆరని వెలుగు, మారని వెలుగు. మరొక దానిపై ఆధారపడని వెలుగు. కాలంలో అన్నీ కరిగిపోతాయి. కనుమరు గవుతాయి. కూలిపోతాయి. కాలిపోతాయి. కాలాన్ని కూడా ప్రకాశింప చేసే వెలుగు పరమాత్మ తేజము.

మనలో ఏ లోపాలూ లేవు అనుకోవడం ఎంత అనుచితమో పరమాత్మలో ఏవో కొన్ని లోపా లుంటాయని భావించటం అంతకన్నా అనుచితం. మన లోపాల్ని లోపాలుగా గుర్తించి, పరమాత్మ వైభవాలను అర్థం చేసుకొనే దిశగా మన ఆలోచనలు సాగిన క్షణం నుండి మనలో పవిత్రత చోటు చేసుకుంటుంది. ప్రసన్నత మొలక లెత్తుతుంది. ఇక్కడ నుండే స్తుతులు - స్తోత్రాలు ప్రారంభ మవుతాయి. ఇవన్నీ పొగడ్తలు కావు, ప్రశంసలు

కావు - అనంతుడైన పరమాత్మను స్తుతించడం ఎవరి తరం? ఇవన్నీ సాధనలు, అనంత రూపుడైన పరమాత్మ దివ్యవైభవాన్ని దర్శించే మంగళకర వీక్షణాలు. అందుచేత స్తుతి పవిత్రమైంది. శుభప్రదమైంది.

తమేవ చార్చయన్నిత్యం
భక్త్యా పురుష మవ్యయం
ధ్యాయన్ స్తువన్ నమస్యంశ్చ
యజమానస్త మేవచ

అవ్యయం - నాశరహితుడైన పరమాత్మకు నిత్యము **భక్త్యా** - భక్తితో, **ధ్యాయన్** - ధ్యానించి, **స్తువన్** - స్తుతించి, **నమస్యన్** - నమస్కరించి, **అర్చయన్** - పూజించి - ఈ విధమైన సేవల ద్వారా మానవుడు తరిస్తున్నాడు. శుభమును పొందుతాడు. శుభకరుడై శోభిస్తాడు.

సర్వదా, సర్వేషు కాలేషు భక్తిర్భజనం తాత్పర్యం - ఇత్యభిప్రాయః

మనం ఎంత పరిమిత శక్తులతో ఉన్నామో మనకు తెలుసు. మన జ్ఞానం పరిమితం. మన శక్తి పరిమితం. మన యుక్తి పరిమితం. భక్తి ఒక్కటే ఈ పరిమిత జీవనాన్ని మరిపిస్తుంది. భక్తి సాధన అందుకే పవిత్రమైంది.

భక్తి కార్యంలో నీతో పాటు ఉండేది ఎవరో కాదు, భావన. ఏ భావన? ఈశ్వర భావన. పరమాత్మ భావన. ఈశ్వర భావన నీ తోడుంటే, ఈశ్వరుడు నీకు నీడగా నిలిచి యున్నట్లే. తోడు నీడ పరమాత్మే అయినపుడు ఇక జీవితంలో మనకు లోటేమిటి? చేటేమిటి?

పరమాత్మ సృష్టిలోని పండును నీ భక్తికి ప్రతిరూపంగా ప్రేమతో సమర్పిస్తావు పూజా సమయంలో. అది ప్రాప్తించకపోతే, పుష్పం, పుష్పం కూడా లభించకపోతే, పత్రం, పత్రం కూడా దొరకక పోతే - నీరు, నీరు కరువైతే - కన్నీరు, కన్నీరు కూడా ఇంకిపోతే? అవును - ఇంకిపోవచ్చు కాని, కన్నీళ్ళు ఇంకిపోయాయని తెలుసుకొనే మనస్సుంది. ఆ మనస్సులో భావా లున్నాయి. భౌతికంగా నాకు దారిద్ర్య ముండవచ్చు. అంతమాత్రాన, భావ దారిద్ర్యంతో నేనెందుకు కొనసాగాలి? లేనివన్నీ నా భావనలో ఉన్నట్లు చిత్రించుకుంటాను. పరమాత్మకు సమర్పిస్తాను. ఇదీ అర్చనే. పూజే. మానసపూజ. కనుకనే భక్తి సాధనలన్నీ పవిత్రాలు. భక్తి కలిగితే పాటలు, మాటలు, తలపులు, చూపులు అన్నీ పరమాత్మ కార్యంలోనే ఉంటాయి.

పాట

పల్లవి: పాడినా నీ పాటలే
మాటాడినా నీ మాటలే
ఎన్ని జన్మల పుణ్య ఫలమో
యెద నిండా నీ తలపులే ॥ పాడినా ॥

చరణం (1): చూడాలని నా కనులు
నిను చూపాలని కనుపాపలు
అసువులు బాసే వేళ లోగా
నీ రూపే చూపు కావాలని॥ పాడినా ॥

చరణం (2): నేలపై మనసు నేను
నింగిలో మహిమ నీవు
భానుడున్నది గగనమైనా
పేద కమలము నోచుకోదా ॥ పాడినా ॥

భగవంతుడు ఎంత ప్రధానమో భక్తి అంత ప్రధానము. భక్తి ఎంత ప్రధానమో, భక్తి సాధన అంత ప్రధానము. భక్తి సాధనలో ప్రేమ మొలక లెత్తుతుంది. ప్రేమ పెరిగితే, అవగాహన చిగురిస్తుంది. ఆంతర్యం సుగుణాలతో పుష్పిస్తుంది. ఆ తరువాత, ఆరాధన అమృత ఫలాన్నిస్తుంది. కనుక, భగవంతునితో మన సంబంధాలను సుస్థిర పరచే భక్తి కార్యాలన్నీ పవిత్రాలే.

భక్తి జ్ఞానాలు

మనం చేసే ప్రతి కర్మలో పరమాత్మను దర్శించడమే భక్తియోగ సాధనలో ఉండే అద్భుతమైన, పవిత్రమైన విషయం. "భగవాన్! నీకు నేను నైవేద్యం సమర్పిస్తూ ఉన్నా. ఈ నైవేద్యం నాకెక్కడిది భగవాన్? నీ సృష్టిలోనిది. నేను తయారు చేయలేదు. నీవు ఇచ్చిందే. నే నివ్వడానికి నా దగ్గర ఏముంది తండ్రీ? ఉంది భగవాన్! 'నాది' అనే మమకార ముంది, దానిని తయారు చేసిన అహంకార ముంది. ఇది, నేను చేసిన తప్పు. ఇది, నాలో ఉండే దోషం. కనుక 'నాది నాది' అని నేను చేసిన తప్పుకు ఈ రోజు. నైవేద్య స్వరూపంలో 'నీదే నీదే' అంటూ నా అహంకార మమకారాల్ని సమర్పిస్తున్నాను భగవాన్! ఇటువంటి అజ్ఞాన చీకట్లు మళ్ళీ నా హృదయ మందిరంలో ప్రవేశించకుండా, నా హృదయ గుడిలో కన్నీటితో దీపారాధన చేస్తున్నాను భగవాన్! వెలుగుల్ని ఆరబోసుకుంటూ ఉన్నాను. నన్ను తరింపజేయమని నీకు మొరపెట్టుకుంటూ ఉన్నాను. హే భగవాన్! ఇదంతా నీ వైభవం. నాదంటూ ఏదీ లేదిక్కడ. కర్పూరం వెలిగితే ఏమీ మిగలదు. నేను కూడా అదే కావాలి అని అనుకుంటూ ఉన్నాను. నీ యొక్క దివ్యమైన ఆరాధనలో నేను, నాది అనే అహంకార మమకారా లేవీ మిగలకుండా కర్పూరంలా అదృశ్యమైపోవాలి అని అనుకుంటూ ఉన్నాను. కనుక నాలో 'నేను' అదృశ్యం కావాలి. నాలో నీవు నేనుగా మిగిలిపోవాలి, వెలిగిపోవాలి. ఇదే భగవాన్! నేను ఆశించేది. ఇదే నేను కోరుకునేది". ఇది, భక్తునిలో ఉండే స్పందన, అద్భుతమైన స్పందన, పవిత్రమైన స్పందన. కనుక జ్ఞానసాధన, భక్తిసాధన రెండు కావు. అవగాహన కలిగినటువంటి భక్తునిలో, జ్ఞానయోగ సాధనలు నడిచే వ్యక్తి యొక్క బుద్ధిలో యోగవృత్తి ఉంది. అంతే గాని భోగవృత్తి కాదు. యోగ వృత్తి మనస్సులో ఎప్పుడైతే ఉందో, పరమాత్మ మనస్సులో

ఉన్నట్లే. పరమాత్మ ఎప్పుడైతే బుద్ధిలో చేరిపోయాడో, భగవంతుని యొక్క భావన మన బుద్ధిలో ఎప్పుడైతే ఉందో, మన బుద్ధిని నడిపేవాడు పరమాత్మే. మన బ్రతుకును నడిపేవాడు కూడా పరమాత్మే. అలాగే తనను ఆశ్రయించిన అర్జునుడి యొక్క బుద్ధిని నడిపాడు, బ్రతుకును నడిపాడు, ఆయన బ్రతుకు బండినీ నడిపాడు. ఈ భక్తి కలిగితే, ఈ జ్ఞానం మనకు అలవడితే ఆ తరువాత మన హృదయంలో కదిలేది ఎవరో కాదు, మెదిలేది ఎవరో కాదు, నల్లని వాడే! పద్మనయనంబుల వాడే!

పరమ ప్రేమ రూపం

పరమాత్మ దృష్టి జ్ఞాన దృష్టి. ప్రేమ దృష్టి. అందుకే, "భగవాన్! నీ దృష్టిని నాపై సారించు. నీ కరుణా కటాక్షము నాకు లభించనీ" - అని ప్రార్థిస్తాము. బిడ్డకు తల్లిపై మనస్సు మరలిందంటే, ఎన్ని అందమైన వస్తువుల్నిచ్చినా, ఆట బొమ్మల్ని అందించినా ఏడుపును మాత్రం బిడ్డ మానదు. తల్లే కావాలని తల్లడిల్లుతుంది. ఎందుకో తెలుసా? అమ్మ కళ్ళల్లో మెరిసే దయ ఈ తల్లి చూపుల్లో ఉండే ప్రేమ వస్తువుల్లో కనిపించదు. ప్రపంచంలో మరోచోట బిడ్డకు దొరకదు. భక్తుడు కూడా భగవంతుని దర్శించేందుకు ఆయన దయామయ దృష్టిని దర్శించేందుకు సదా పరితపిస్తూ ఉంటాడు. ఆ దయా దృష్టిలో, ఎడారులు పచ్చిక బయళ్ళవుతాయి. విషాలు విరిగి అమృతాలు అవుతాయి. దైన్యం దూర మవుతుంది. దారిద్ర్యం నశిస్తుంది. వెలితి అర్థం కాదు. వెలుగు దూరం కాదు. శత్రువు ఎదురైనా మనస్సులో పరమాత్మ ముఖారవిందం గోచరిస్తే చాలు. శత్రువు ప్రసన్నంగా కనిపిస్తాడు. ఇదంతా పుష్కరాక్షుడు ప్రసాదించిన పవిత్ర దృష్టి. ఈ సత్యాన్ని భక్తులే గుర్తించగలరు.

తండ్రి బిడ్డకు బొమ్మలు కొనిపెడ్తాడు. ఆ తరువాత బిడ్డను ఒడిలో కూర్చో బెట్టుకొని, - 'నాన్నా! నీకు బొమ్మలు కొనిపెట్టిం దెవరమ్మా?' అని ప్రశ్నిస్తాడు. బిడ్డ తలనెత్తి తండ్రి కళ్ళల్లోకి సూటిగా చూస్తూ 'మా నాన్న కొనిపెట్టాడు' అంటాడు. ఆ క్షణంలో తండ్రి కళ్ళు వెలిగిపోతాయి. ఇలా తండ్రి ఎందుకు అడుగుతాడో తెలుసా? నానా ఆట లాడుతూ నాన్నను మరచిపోతా డేమో నని.

పరమాత్మ కూడా తండ్రిలాగే మనకు సమస్తాన్ని ప్రసాదించాడు. అన్నీ అనుభవిస్తూ ఇచ్చిన వాణ్ణి మనం మరచిపోతూ ఉంటాం. మనస్సుండేది జ్ఞాపకం పెట్టు కొనేందుకు - అని భావిస్తే, అలా జ్ఞాపకం పెట్టుకోదగినవాడు పరమాత్మ ఒక్కడే. కళ్ళు చూచేందుకు ఇవ్వబడ్డాయి. కాని చూడదగిం దేదైనా ఉంటే అది పరమాత్మ ఒక్కడే. మరి లోకం? లోకం లోకేశ్వరుని కన్నా అన్యంగా లేదు. లోకం గోచరిస్తే, అది లోకేశ్వరుడుగానే తెలియాలి. ఇది జ్ఞానదృష్టి. ప్రేమదృష్టి.

పరమాత్మ విశ్వాన్ని భరించేవాడు. ధరించేవాడు. ఇచ్చేవాడు. ఇచ్చి రక్షించేవాడు. పరమాత్మ మనకు ఇచ్చేది మన కర్మఫలమే. ఇవ్వట మనేది

ఆషామాషీ విషయం కాదు. మనకు ఎక్కువైతే ఇతరులకు ఏదైనా ఇస్తాము. అదీ ఇష్టముంటే. కొన్ని విషయాల్లో, ఇతరులకు అవసరం లేకపోయినా ఇస్తాము. అర్హత లేకపోయినా ఇస్తాము. ఇవ్వవలసి వచ్చినా ఇవ్వము కొందరికి. ఇదంతా మన ఇష్టాయిష్టాలపై ఆధారపడి ఉంటుంది. పరమాత్మ అలా ఇచ్చేవాడు కాడు. అలా ఇస్తే, ఆయన పరమాత్మ కాడు. ఏ కర్మకు ఏ ఫలమో అతనికి స్పష్టంగా తెలిసి ఉండాలి. ఇవన్నీ ధర్మాలు. ఈ ధర్మాలు విశ్వమంతా వ్యాపించి ఉండాలి. లేకపోతే విశ్వానికంతా ఫలా లెలా అందుతాయి? ధర్మాలు విశ్వమంతా వ్యాపించి ఉన్నాయి అంటే ధర్మాల రూపంలో పరమాత్మే వ్యాపించిఉన్నాడని భావము.

ఆయన దృష్టిని ఏ కర్మ దాటిపోలేదు. ఎవరూ కర్మ ఫలాల నుండి జారిపోలేరు. ఒక ఫలితము ఇవ్వబడిందంటే - తత్సంబంధమైన కర్మ ముందుగా ఉందనే అర్థం. కర్మాచరణ వెనుక ధర్మాలున్నాయి. కర్మఫలాలలోను ధర్మాలున్నాయి. ఈ ధర్మాల రూపంలో పరమాత్మే ఉన్నాడు.

ధర్మం తన పని తాను చేసుకుంటూ పోతుంది. దారి తప్పేది ధర్మం కాదు. ధర్మం దారిలో మనం నడక సాగించాలి. దారి తప్పితే, దగా పడేది మనమే. ధర్మము భగవంతుని చట్టం. భగవంతుని ఆకారం. ధర్మంలో అవగాహనకే స్థానం. ఆవేదనకు కాదు. మనం ఈ క్షణాన ఈ ప్రపంచంలో ఉన్నాం. ఒకనాడు ఉండము. నేడు ఉండటానికి ఏ ధర్మము కారణమో, ఒకనాడు ఉండక పోవటానికి ఆ ధర్మమే కారణము. లేనివి వస్తాయి. దాని వెనుక కారణాలున్నాయి. ఈ రాకపోకల్ని మనం ఆపలేము. వీటిని అర్థం చేసుకుంటూ, వీటి మధ్య సుఖంగా ఎలా జీవించాలో మనం నేర్చుకోవాలి.

ఈ ప్రపంచము రాకపోకల నిలయం. అందుకే ఇది జగత్తు. **"జాయతే గచ్ఛతి ఇతి జగత్"** - వస్తూ, పోతూ ఉండేదే ప్రపంచం. ద్రష్ట నష్ట స్వభావం కలది. కనుక ప్రపంచంలో స్థిరత లేదు. అంతా అస్థిరతే. ఇలా తెలుసుకుంటే బాధలు, భయాలు ఉండవు. ఒకవేళ నాకు స్థిరత్వం కావాలి, అని భావిస్తే? అలా భావించటం తప్పు కాదు. స్థిరత్వం ఎక్కడుందో, దాని స్వరూప మేమిటో తెలుసుకోవాలి. అప్పుడే దానిని పొందగలం. జగత్తులో స్థిరత్వం లేదు. జగదీశ్వరుడే స్థిరం.

పరమాత్మ దృష్టి జ్ఞానదృష్టి. సమదృష్టి. ఆయన కృప మనకు స్థిరత్వాన్ని ప్రసాదిస్తుంది. శాంతిని అనుగ్రహిస్తుంది. జీవితంలో అందాన్ని నింపుతుంది. జీవికి ఆనందాన్ని ప్రసాదిస్తుంది.


పరమాత్మ చల్లని నీడలో మన జీవితం తరించిపోవాలి. వేదాంత వెన్నెల వాడలో మనకు స్థిర నివాసం ప్రాప్తించాలి. అస్తు!

లోకా స్సమస్తా స్సుఖినో భవన్తు.



దైవ దర్శనం

ఇందులో...



గణేశ వైభవం

సర్వుల నుండి ప్రథమ వందనం అందుకొనే గణేశుడు విశ్వానికి తొలివేలుపు. మేలుకొలిపి, మేలు చేసే ఇలవేలుపు. ఇలలో సర్వులకు ఏకైక వేలుపు. ఏకదంతంతో శోభించే అంతకాంత కాత్మజుడు.

పిలిచిన 'ఓ' అని పలికే ఓబొజ్జగణపయ్య అక్షరాలలో 'ఓ' ప్రథమ మైనట్లు, అక్షయనిధిని ప్రసాదించుటలో 'న' అనే రెండవ పలుకు తెలియనివాడై ప్రథము డైనాడు. బుద్ధిగలవారికి సిద్ధిని, ప్రసిద్ధిని ప్రసాదించు సిద్ధివినాయకు డయ్యాడు.

అవిఘ్నం కురు మే దేవ సర్వకార్యేషు సర్వదా!

"దేవా! సర్వకార్యాలలో సదా మాకు విఘ్నములు లేకుండా చెయ్యి" అని వినాయకు డికి కొబ్బరికాయను కొడతాము.

ఆదిదేవుడైన వినాయకుడు తుష్టి గల దేవుడు. పుష్టి గల దేవుడు. ఆకారపుష్టి, ఆహారపుష్టి రెండూ గల దేవదేవుడు. ఆశ్రయించిన వారిని కూడా ఈ రెండు విషయాలలో ఆశీర్వదించే దేవుడు. అందుకే,

అనేకదం తం భక్తానామ్ ఏకదంతం ఉపాస్మహే!

"భక్తులను అనేక విధాలుగా అనుగ్రహించే ఏకదంతుని ఉపాసిస్తాను" అంటారు భక్తులు.

పంతుళ్ళు భయపెట్టి గుంజిళ్ళు తీయిస్తారు. పిల్లలకు భయపడి పెద్దలు గుంజిళ్ళు తీస్తారు. చిన్నపిల్లలు ఎక్కడ కూర్చోమంటే పెద్దలు అక్కడ కూర్చుంటారు. ఎలా అభినయించమంటే అలా అభినయిస్తారు. ఇలాంటి సన్నివేశాలు చూచినప్పుడు నాకు అనిపిస్తూ ఉంటుంది కదా, రాగద్వేషాలు తెలియని, కోరికలు లేని బిడ్డలు విశ్వాన్ని ఎంత చక్కగా శాసిస్తున్నారా అని!

లేకపోతే ఈ పిల్లల పిళ్ళారిదేవుని ముందు చూశారా! ఎంతవారైనా గుంజిళ్ళు తీయకపోరు. అది కూడా కుడిచెవిని ఎడమచేత్తో, ఎడమ చెవిని కుడిచేత్తో పట్టుకొని. అంతటితో ఆగితేనా? రెండేసి మొట్టికాయలు కాయించుకోవడం. ఇదంతా పిలిస్తే పలికే ఈ పిళ్ళారిదేవుని ఆలయంలోనే.

ఈ గుంజిళ్ళ పర్వం ముందుగా పిళ్ళారి మేనమామ పెరుమాళ్ళుతో ఆరంభ మైందట. ఎంతోసేపని పట్టుకుంటాడు ఎంత వైకుంఠు డయినా? తన సుదర్శన చక్రాన్ని కొంతసేపు అలా ప్రక్కన పెట్టాడట. అంతే. మన పిళ్ళారి చూశాడు. క్షణంలో సుదర్శనాన్ని కుడుమును మ్రింగినట్లు మ్రింగి బొజ్జను కదపకుండా, పెదవిని మెదపకుండా

విష్ణుమూర్తి వైకుంఠ మంతా వెతికాడు. "ఎటు పోతుంది?" అని రమాదేవి రచ్చ కెక్కింది. అంతా గాలించా నని గరుత్మంతుడు. నాకు కనిపించలే దని నాగరాజు. కొండదేవుని కోవెలలో ఎక్కడ చూచినా కోలాహలమే.

విషయం అర్థమైంది విష్ణుదేవునికి, పసిగట్టిన పద్మనాభుడు కమలవాసినిని కేకేసి "కనిపెట్టేశాను" అన్నాడట.

"ఓరి పిడుగా! పిళ్ళారీ! మేనల్లు డైనందుకు నా చక్రాన్ని కూడా మేసేశావా? మా తండ్రి గదూ! ఊసేయ్!" అన్నాడట ఆదినారాయణుడు. తొండముతో బొజ్జను తడుము కొంటున్నట్లు "ఊ-హూ" అంటూ తలను అటూ ఇటూ త్రిప్పాడట గణపతి.

ఏం చేయాలో ఏకాంత రామయ్యకు అర్థం కాలేదు. అందులోను అసురారి. ఒకప్పుడు చక్రం తిప్పినవాడు. ఇప్పుడు ఒంటరిగా ఎక్కడికీ వెళ్ళలేడు. పదే పదే అడిగాడట పిళ్ళారిని. ససేమిరా ఇవ్వనంటాడు బుజ్జి బుజ్జిగా బొజ్జదేవుడు. ఇక లాభం లేదనుకున్నాడు ఇందిరారమణుడు. కుడిచేత్తో ఎడమ చెవిని పట్టుకొని, ఎడమ చేత్తో కుడిచెవిని పట్టుకొని టపటప మని ఒకే పట్టున విడువకుండా వెయ్యి గుంజిళ్ళు తీసాడట.

అది చూచి నవ్వును ఆపుకోలేక క్రిందపడి చక్రంలా దొర్లినాడట గజవదనుడు. అలా నవ్వుతూ దొర్లేటప్పటికి సుదర్శనచక్రం నోటినుండి క్రిందపడిందట.

"అమ్మయ్య" అంటూ పుట్టుకలేని పురాణపురుషుడు ఒకేసారి అమ్మను, అయ్యను తలచుకొని చక్రాన్ని చేజిక్కించుకున్నాడట.

"మా బుజ్జితండ్రీ! అంటూ బొజ్జగణపయ్యను ముద్దెట్టుకున్నాడట ముకుందుడు. పాపలంటే పరమాత్మకు కూడా ప్రేమే. పాపలు నిజానికి భగవానుని కనుపాపలు. ప్రపంచం అనే అరవిందంలో పసికందులు మరందాలు. మధుర మకరందాలు.

గణపతికి సిద్ధి, బుద్ధి అను భార్యలు, లాభుడు, క్షేముడు అనే కుమారులు గల రని పురాణప్రసిద్ధి. బుద్ధి సిద్ధులే గాక, యోగ క్షేమాలు కూడా గణపతి అధీనంలో యున్నందున ఆయన సర్వలోక వంద్యు డైనాడు. సురపూజితు డైనాడు.

కార్యానికి అనుకూలించేది బుద్ధి. ఫలితమై భాసించేది సిద్ధి. లేదనుకున్న దానిని పొందడం లాభము. లభించినది జారిపోకుండా చూసుకోవడం క్షేమం. తనను నమ్మిన భక్తుల విషయంలో ఇవన్నీ పార్వతీతనయుడే చూసుకుంటాడు. కనుక వినాయకుని ఎవ్వరూ విడిచిపెట్టరు.

గణేశుడు సాక్షాత్తు పరబ్రహ్మమే. పరమాత్మయే.

సర్వం జగదిదం త్వత్తో జాయతే సర్వం జగదిదం తత్త స్తిష్ఠతి సర్వం జగదిదం త్వయి లయమేష్యతి

"ఈ సమస్త జగత్తు నీ యందే ఆవిర్భవించినది. సమస్తమైన ఈ విశ్వము నీ యందే నిలిచియున్నది. సమస్తమైన ఈ ప్రపంచము నీయందే లయించుచున్నది" అని అథర్వణీయ గణపత్యుపనిషత్తు ప్రవచించి, గణేశుని అగణిత పారమార్థిక వైభవాన్ని కీర్తించింది.

ఆదిదేవుడైన గణపతి లేని ఆలయ ముండదు. వినాయక పూజ ఆరంభం కాకుండా ఏ ఆరాధనా జరుగదు. మాతంగవదనుని స్మరించనిదే ఏ మంగళ కార్యానికి శ్రీకారముండదు. గణేశునికున్న ఆలయాలు ప్రపంచంలో మరొక దేవునికి లేవు. కనుక విఘ్నేశ్వరుడు జనప్రియుడు. వయోభేదం లేకుండా సర్వులూ వినాయకుని పూజిస్తారు.

"కమ్మని నెయ్యి, కడుముద్దపప్పును కలగాపులగం చేసి కడుపునిండా తిని త్రేపమని" గొడవచేస్తూ పిల్లలు గణపతి చుట్టూ చేరుతారు.

బొజ్జనిండా బుద్ధులున్న ముద్దుల దేవుడు గణపతి. పప్పు ముద్దల దేవుడు గణపతి; మన గతి.

విచిత్రమైన ఆ దివ్యాత్ముని రూపంలో ఎన్నో విశిష్ట విషయాలు దాగి ఉన్నాయి. శాస్త్రాన్ని శ్రద్ధగా శ్రవణం చేయాలంటూ పెద్ద పెద్ద చెవులు, శ్రవణం చేసిన దానిలోని సూక్ష్మతత్త్వాన్ని మననంలో గ్రహించాలని తెలుపుతూ సున్నిత వస్తువును కూడా గుర్తించి ఎత్తుకొనే తొండము, సత్యము ఒకటేగాని రెండు గాదని ఏకదంతము, చిన్నదిగనే కనిపించినా సమస్తాన్ని పాడు చేసే కామాన్ని అదుపులో ఉంచుకోవాలని సూచిస్తూ మూషిక వాహనము, శ్రవణము చేసిన విషయాన్ని విశేషంగా లోన దాచుకోవాలని పెద్దదైన బొజ్జ'.....

ఇంకా,

మాట వినేవానికి సర్వశుభములు అంటూ ఒక చేతిలో కుడుము, రెండవ చేతిలో అభయము, మాట వినని మూర్ఖులకు మరణము, యమపాశమే నంటూ పై రెండు చేతులలో త్రాడు, గొడ్డలి.....,


ఇలా వినాయకమూర్తి విశేషమూర్తి. అరూప చైతన్యాన్ని అవగతం చేసుకొనేందుకు మన ముందు దివ్యంగా ప్రకాశించిన దేవరూపం గజవదనుడు. గణేశ నవ రాత్రులు సమాప్తం కాగానే గణేశుని గంగలో నిమజ్జనం చేస్తారు. నదులన్నీ సాగరంలో విలీన మగునట్లు రూపాలన్నీ అరూప చైతన్యంలో అంతర్హిత మౌతాయని తెలిపేందుకే.

ఏకదంతుని సేవలలో ఎలుకల మయ్యెదము గాక! మృత్యుమార్జాలము నుండి తప్పించుకొని తన్మయుల మయ్యెదము గాక!





















శివ శివ

బంధువులు బహు విధాలు. ఆపద్బాంధవుడు ఏకరూపుడే. బంధువుల నుండి బాధలు రాకపోతే రాకపోవచ్చు. సుఖా లొస్తాయని భ్రమించడం మాత్రం బాధా కరమైన విషయం.

ఆపదలు ఎదురైనపుడు మనం బంధువుల్ని సమీపిస్తే, తీర్చలేకపోయినా నానా ప్రశ్నలతో విసిగించి బాధిస్తారు. లేదా నీ శ్రుతికి నా లయ అన్నట్లు వాళ్ళ కష్టాల్ని ఏకరువు పెడతారు.

ఏకరూపుడైన పరమాత్మకు చెప్పుకుంటే అతడు ప్రశాంతంగా వింటాడు. ఎదురు చెప్పకుండా యెద బాధ నివారిస్తాడు. అశుభాన్ని నివారించి శుభాన్ని ప్రసాదిస్తాడు. కనుకనే అతడు శివుడు. మంగళ స్వరూపుడు.

ఈశానః సర్వవిద్యానాం ఈశ్వరః సర్వభూతానాం
బ్రహ్మాధిపతిః బ్రహ్మణో౽ ధిపతిః బ్రహ్మ శివో మే అస్తు సదా శివోమ్ ॥

"సమస్తమైన విద్యలకు నియామకుడు, సర్వభూతములకు ప్రభువు, వేదములకు అధిపతి, హిరణ్యగర్భునకు ప్రభువు, పరమేశ్వరుడు నాకు మంగళకరుడు అగుగాక! నిత్యమంగళకరుడు అగుగాక! అతడే నే నగుదును (ఓమ్)" అని తైత్తిరీయం.

లలాట లిఖితా రేఖా పరిమాష్టుం న శక్యతే

"బ్రహ్మదేవుడు నొసటన లిఖించిన గీతను తప్పించడం ఎవరికీ సాధ్యం కాదు" అంటారు.

ఈ వాక్యం పూర్ణసత్యం కాదు. బ్రహ్మ లిఖించినాడు అన్నపుడే దానికి ఆది ఉన్నదని చెప్పడం జరిగిపోయింది. ఆది ఉన్నదానికి అంతం ఉండదు అనడం అహేతుకం. కాకపోతే, దానిని అంతం చేయడం ఎలా? అనేది తెలుసుకోవాలి. నొసటన గోచరించే అజ్ఞాన రూప ప్రారబ్ధాన్ని నొసటన జ్ఞాననేత్ర మున్నవాడే తుడిచివేయగలడు. అతడే ఫాలలోచనుడు. ముక్కంటి. ముక్కంటికి మన మొరను వినిపిస్తే, ప్రక్కింటికి తెలియకుండా బాధలు పారిపోతాయి. భవరోగాలు తొలగిపోతాయి.

సంసార సర్పదష్టానాం జంతూనా మవివేకినామ్
చంద్రశేఖర పాదాబ్జ స్మరణం పరమౌషధమ్ ॥

"సంసార సర్పముచే కరువబడిన వారికి, అజ్ఞాన వ్యాధిచే బాధపడు వారికి చంద్ర శేఖరుని పాదపద్మ స్మరణమే పరమౌషధము".

పరమేశ్వర స్మరణముచే సంసార పాశములు ఖండింపబడుతాయి. జీవుడు విముక్తుడై శివుడవుతాడు.

పాశబద్ధ స్తథా జీవః పాశముక్త స్సదాశివః

"పాశముచే బంధింపబడి యున్నంతవరకు జీవుడుగా ఉంటాడు. పాశము వీడితే నిత్యమంగళుడై శివుడుగా ఉంటాడు" అని ఉపనిషత్తు.

అందరి జీవితాలలో అమంగళం దూరం కావాలి. బ్రతుకులు బాధల నుండి విడిపడాలి. వసుధ అంతయు ఒకే కుటుంబం కావాలి. అప్పుడే నిత్యకళ్యాణం పచ్చ తోరణం.

ఇలా జరగాలంటే వ్యక్తి విశ్వంలో ఐక్యం కావాలి. వ్యక్తి కుటుంబం విశ్వ కుటుంబంలో విలీనం కావాలి. అప్పుడు అది శివకుటుంబ మవుతుంది. సదాశివ సంసార మవుతుంది. ప్రతి ఇల్లు కైలాస మవుతుంది. ప్రతి గుండె వెండికొండై వెలుగు తుంది.

మాతా చ పార్వతీదేవీ పితా దేవో మహేశ్వరః
బాంధవా శ్శివభక్తాశ్చ స్వదేశో భువనత్రయమ్ ॥

"పార్వతీదేవి మా తల్లి, మహేశ్వరుడు మా తండ్రి. శివభక్తులే బంధువులు. ముల్లోకాలు నా స్వదేశము" అన్నారు ఆచార్యులైన శ్రీ శంకరులు.

ఈ విశ్వకుటుంబంలో, పరమేశ్వర కుటుంబంలో చేరిపోతే ఇక కొరత ఏముం టుంది?

డబ్బు లేకుంటే శ్రీమంతుల్ని ఆశ్రయిస్తాము. జబ్బు పోవాలంటే వైద్యుని ఆశ్రయించాలే గాని డబ్బున్న వాళ్ళని కాదు. ఇలా ఈ లోకంలో ఆపద లెన్నున్నాయో ఆశ్రయస్థానాలు అన్ని ఉన్నాయి.

ఎన్ని బాధ లనుభవిస్తాం? ఎందరిని ఆశ్రయిస్తాం? ఎన్ని కష్టాలను కౌగిలించు కుంటాం? ఎన్ని కన్నీళ్ళు పానం చేస్తాం?

ఆవేదనలన్నీ అంతరించే ఆశ్రయస్థానం శివస్థానం. కష్టాలన్నీ శాశ్వతంగా కనుమరుగయ్యే కళ్యాణధామం శంకరనామం.

శంకలకు తావివ్వకుండా, భ్రమలకు తిలోదకాలిచ్చి, పరమేశ్వరుని పాదారవింద స్మరణముచే ఎందరో గతంలో తరించిపోయారు. శివసన్నిధిని చేరి మంగళ స్వరూపు లయ్యారు.

శివుడు విరాగి. గజచర్మాంబరధారి. విభూతిసుందరుడు. శ్మశానమే అతని నివాసము. శివుని వైరాగ్యము ఎవరినైనా కదిలించి వేస్తుంది. కాని, ఇక్కడ ఒక్క విషయం అర్థం చేసుకోవాలి. శివుడు సన్యాసిలాగా, సాధకునిలాగా విరాగి అయితే అతడు భగవంతుడు ఎలా అవుతాడు?

అంతటా ఉన్నవాడు దేనిని విస్మరించి విరాగి అవుతాడు? దేనిని విస్మరించినా తాను కాని దానినే విస్మరించాలి. తాను కానిది మరొకటి ఉంటే తన పూర్ణత్వానికే భంగం వాటిల్లుతుంది. కనుక మనము ఊహించే వైరాగ్యమే పరమశివునిలో ఉంటే ఆయన పరమాత్మ కాలేడు. పరమేశ్వరుడే అని నిర్ణయిస్తే మాత్రం అతని వైరాగ్య మేమిటో నూతన భాష్యం చెప్పుకోవలసి వస్తుంది.

ఈ విశ్వంలో సమస్తమూ శివునితో ముడిపడి ఉన్నాయి. ఈ సత్యం తెలిస్తే వస్తువుల వెంట పరుగులెత్తి రాగమును తయారు చేసుకోనవసరం లేదు. ఈ సత్యం అవగతమైతే వస్తువుల నుండి దూరమై విరాగమును కూడా పొందనవసరం లేదు. మొదటివారు సాధారణ వ్యక్తులు. రెండవవారు సాధకులు. పరమశివుడు వీరిరువురి కోవకు చెందడు. చెందితే పరమాత్మ కాలేడు.

పరమాత్మ రాగి కాడు. విరాగి కాడు. తనకన్నా అన్యంగా ఏదీ లేదని తెలిసి ప్రశాంతంగా ఉండేవాడు. తనలో తాను ఉండేవాడు. ఇదియే పరమాత్మ వైరాగ్యము. ఈ స్థాయిని చేరేందుకు రాగి విరాగి కావాలి. విరాగి యోగి కావాలి. యోగి యోగీశ్వరుడు కావాలి. ఇలా తరించమని తెలిపేందుకే శివుడు బాహ్యాడంబరాలు లేని నిర్మల నిరాడంబర శోభతో గోచరిస్తాడు. సదా ధ్యానమగ్నుడై కనిపిస్తాడు. పరమేశ్వరుని మార్గంలో పరమ వైరాగ్యవంతులై చరించిన ఎందరో మహాత్ములు జ్ఞాననేత్రమును పొంది తరించారు.

మంచివాళ్ళు మంచి చేయకుండా ఎలా ఉంటారు? విరబూసిన మల్లెలు సుగంధాన్ని దాచుకోగలవా? పండిన మామిడిపళ్ళు మధుర పరిమళాలను తమలోనే నిలుపుకోగలవా?

"నేను ఎంతో చేశాను. ఎవరూ అర్థం చేసుకోలేదు" అనే మాటకు అర్థముందా? నీవు చేసిన మంచి ఎంతో, అంతా నీకే జ్ఞాపకం లేదు. మరెవరికో ఎలా ఉంటుంది? అందరూ పరిమిత జ్ఞానంతోనే ఈ ప్రపంచంలో ఉన్నారు. మల్లెను అందించటమే గాని మళ్ళీ ఆలోచించదు మల్లె. తీపిని పంచటమే గాని, ఎవరు తీసుకున్నారా అనే ఆలోచనా వడి లేనిది మామిడి.

పరిమిత జ్ఞానం కలవారు తెలుసుకోలేరు. అనంత జ్ఞానం కల పరమాత్మకి తెలియనిది లేదు. ఇది తెలియకపోవటమే మంచివాళ్ళలో లేని మంచితనం.

ఆది దేవుడు - అనామయుడు

శ్లో॥ విత్తేశస్య కుబేరతా న విరతా నీహారభానుః క్షయీ
హేరంబస్య మహోదరం న గళితం దైత్యారి రుచ్చైర్గదః
అంగం భృంగిరిటేశ్చ పాండు భృశమి త్యాస్తా మమీషాం కథా
త్వం శూలీతి విగీయసే కథ మహో భక్త స్తవాఽ_నామయః ॥

భావము:- పరమశివా! నిన్ను ఆశ్రయించిన కుబేరుని కుబేరత్వము పోలేదు. చల్లని కిరణములు గల చంద్రుని క్షయవ్యాధి నయం కాలేదు. వినాయకుని పెద్ద బొజ్జ కరగలేదు. దైత్య నాశకుడగు శ్రీహరి గొప్పవ్యాధిని కలిగియే యున్నాడు. భృంగి యొక్క పాండువ్యాధి అలాగే ఉంది. నీవేమో కడుపు నొప్పితోనే ఉన్నావు. ఇక నీ భక్తుడు ఏ వ్యాధి లేకుండా అనామయుడుగా ఎట్లుండగలడు?

ఆమయము అంటే వ్యాధి. అనామయము అంటే వ్యాధి లేని స్థితి. అట్టి స్థితి గలవాడు పరమశివుడు. కనుక అనామయుడు.

తాను అనామయుడై, తన నాశ్రయించిన వారి భౌతిక, భవరోగములను నిర్మూలించువా డైనందున శివుడు అనామయు డయ్యాడు.

'కు' అంటే వికారము, బేరము అంటే శరీరము. కుబేరుడు అంటే వికారమైన దేహము కలవాడనే అర్థాన్ని కవి గ్రహించి, దీనిని వ్యాధిగా చమత్కరిస్తున్నాడు.

చంద్రకళలు మారుతూ ఉంటాయి. కృష్ణపక్షమునందు చంద్రుడు క్షీణిస్తూ ఉంటాడు. ఇది చంద్రునిలోని క్షయవ్యాధిగా బిల్హణుడు చమత్కరిస్తున్నాడు.

వినాయకుడు వ్రేలాడు బొజ్జతో ఉన్నందున లంబోదరు డయ్యాడు. వికారంగా కనిపిస్తున్న విఘ్నరాజు బొజ్జ శివసాన్నిధ్యంలో కరిగిపోలేదని కవి అభియోగము.

విష్ణుదేవుడు శివునికి సన్నిహితుడు. మిత్రుడు. కాని ఆయన ఉచ్చైర్గదాధారి. ఉచ్చైర్గదు డంటే పెద్ద గద కలవాడని అర్థము. గద మంటే వ్యాధి అని అర్థముంది. కనుక గొప్ప వ్యాధిని విష్ణువు కలిగియున్నట్లు కవి చమత్కరిస్తున్నాడు.

శివసేవకుడైన భృంగి తెల్లగా ఉన్నాడట. ఇది పాండుత్వము అంటాడు బిల్హణుడు. పాండుత్వమనగా తెల్లనిది అని ఒక అర్థము. పాండురోగము అని మరొక అర్థము.

అందరి విషయం ఎలా ఉన్నా పరమశివుడే శూలీ అని స్తుతించబడినాడు. శూలమును ధరించి యుండుటచేత శివుడు శూలీ అని పిలువబడినాడు. కాని, 'శూల' అనే పదానికి కడుపునొప్పి అనే అర్థము కూడా ఉంది. కనుక పరమేశ్వరుని శూల బాధతో ఉండేవాడుగా బిల్హణుడు అభివర్ణిస్తూ చమత్కరిస్తున్నాడు. పైగా, ఇలాంటి శివుడు ఇతరుల బాధలను ఎలా నివారించగలడు? అని ప్రశ్నిస్తున్నాడు.

"అనామయః" - అనే పదమును **'నామయః నభవతి ఇతి అనామయః'** - అంటే నామరూపాలకు అతీతుడు అని అర్థము. అలాగే, **'నామ - న - యాతి - ఇతి - అనామయ'**, నామమును పొందనివాడు. అంటే నామాతీతుడు. రూపాతీతుడు అని అర్థం.

ఆది భిక్షువు

సర్వులకు భిక్షం పెట్టే సదాశివుడు దేహమంతా విభూతి రాసుకొని, జడలు చుట్టిన తలతో, ఒక చేతిలో త్రిశూలం, మరొక చేతిలో అక్షయపాత్రగా కపాలం ధరించి, మనిషి మనిషిని భిక్షం పెట్టమని అర్థిస్తున్నాడు.

నీ హృదయ గుమ్మం ముందు రాత్రనక పగలనక, ఎండనక వాననక నిలబడి ప్రేమభిక్షను అర్థిస్తున్నాడు.

"నాయనా! అలసిపోతున్నావు. ఆస్తుల్ని, అంతస్థుల్ని, ఆత్మీయుల్ని, పదవుల్ని ప్రేమించి ప్రేమించి అలసిపోతున్నావు. కాలం క్షీణిస్తూ ఉంది. ఆయువు గతించిపోతుంది. నీవు ఈ ప్రపంచంపై ఉంచుకున్న ప్రేమలు చేదు అనుభవాన్ని నీకు అందిస్తాయి. నీ ప్రేమకు పూర్ణత్వం నా వద్దే లభిస్తుంది. నాకివ్వు. నీ ప్రేమను నాకివ్వు" అని అక్షయ నిధి అక్షయపాత్రను పట్టుకొని ఆదిభిక్షువుగా దర్శనమిచ్చాడు.

పరమశివుని కాదని, ప్రపంచాన్ని ప్రేమించి ఓడిపోయినవారు చివరి మజిలీగా వల్లకాటికి చేరినపుడు అక్కడ మళ్ళీ తానే దర్శనమిస్తాడు.

"నాన్నా! చూశావా! ప్రపంచాన్ని నమ్మి మోసపోయావు. నీ ప్రేమను అందుకున్న వారు ఇప్పుడు ఏమయ్యారు? ఒంటరిగ నిన్ను మట్టిలో పడేసి వెళ్ళారు. బాబూ! నేను విశ్వనాథుణ్ణి. నీ తండ్రిని. నేను నీకు తోడుగా ఉంటాను. నేను శ్మశానవాసినని తులువలు తూలనాడనీ! నా బిడ్డకొరకు ఏదైనా చేస్తాను. ఎక్కడైనా ఉంటాను" - ఇది పరమశివుని ప్రేమ.

దుఃఖాలు, విషాదాలు నిండిన ఈ ప్రపంచంలో తనను ఆశ్రయించిన వారి కన్నీళ్ళను వెంటనే తుడిచే కరుణామయుడు నీలకంఠుడు.

అట్టి ఆదిభిక్షువుకి ఈ శివరాత్రి పర్వదినాన నీవు అభిషేకం చేస్తావు. ఆయన అభిషేక ప్రియుడు. అందుకని పవిత్ర గంగాజలంతో అభిషేకం చేస్తావు. మంచిదే. కాని ఒక్క విషయం మరచిపోయావు. ఆ దివ్యాత్ముని తలమీదే గంగమ్మ ఉంది అనే సత్యాన్ని మరచిపోతున్నావు. చూడు! శివుడికి గంగ ఉండనే ఉంది. ఆయనకి కన్నీటి అభిషేకం అంటే చాలా ఇష్టం. భక్తి పారవశ్యంలో నీ కన్నీటిని క్రుమ్మరించి, ఆ కన్నీటి జలాలతో గంగాధరుని అభిషేకించు.

రజోగుణంతో చలించే కామక్రోధాదులను, ఇంద్రియ ప్రకోపాలను నియమించేందుకు పగటిపూట ఉపవాసం, తమోగుణము నుండి విడిపడేందుకు రాత్రిపూట జాగరణ - రజస్తమో గుణాలను అంతం చేయాలని సాధనను ఎరుకపరచే పుణ్యదినమే శివరాత్రి పర్వదినము.

బుద్ధిలేనివారైనా, శుద్ధిలేనివారైనా తనను ఆశ్రయించిన వారు లోకపూజితు లవుతారని తెలిపేందుకు ఎద్దును ఎన్నుకొని ముందుంచుకున్నాడు. నంది పశువైనా పశుపతిని ముందుంచుకున్నది. కనుకనే శివునికన్నా ముందు పూజలందుకుంటున్నది. సంసారాలు మోయడం అందరికీ ప్రీతి. శివుణ్ణి మోయడం నందికి ప్రీతి. సత్యము బుద్ధికి పట్టినవారికి అసత్యాలు రుచించవు.

సర్పాలు భయరూపాలు. పాముల్ని చూసి అందరూ దూరంగా పరుగెత్తిపోతారు. కాని వాటినే ఆభరణములుగా ధరించి శివుడు నాగాభరణు డయ్యాడు.

ఈ ప్రపంచంలో దుష్టుల్ని చూసి అందరూ ఏవగించుకుంటూ దూరమవుతారు. కాని, పరమాత్మ దుష్టుల్ని కూడా ప్రేమిస్తాడు. "నాయనా! నీవూ నా బిడ్డవే. నిన్ను నేను దూరం చేయను. నీవు ఎవరికీ అవసరం లేకపోయినా నాకు నీవు కావాలి. నేను సర్వేశ్వరుణ్ణి. సర్వజ్ఞుణ్ణి. ఏదీ నానుండి దూరం కాదు. ఎవరూ నాకు దూరంగా పోలేరు" అంటాడు ప్రేమమూర్తి సాంబమూర్తి.

ఈశానః సర్వవిద్యానాం - సర్వ విద్యలకు అధిపతి ఆయనే.

ఈశ్వరః సర్వభూతానాం - సర్వజీవులకు నియామకుడు ఆయనే.

పదవిలో ఉన్నవారికి నమస్కరిస్తాము. అది వ్యక్తి వైభవం కాదు. స్థాన వైశిష్ట్యం. పదవిలో ఎవరున్నా గౌరవాలు అందుతూనే ఉంటాయి. పదవి ఉన్నంత వరకు గౌరవాలు అందుతూనే ఉంటాయి.

భక్తుడు అందరినీ గౌరవిస్తాడు. అందరికీ నమస్కరిస్తాడు. అతని పూజకు అందరూ అర్హులే. ఎందుకని? అందరిలో పరమాత్మే ఉన్నాడు అతనికి. పదవు లున్నవారే గొప్పవారైనపుడు పరమాత్మను పొందినవారు గొప్పవారు కాకపోతారా? పూజార్హులు కాకుండా ఉంటారా?

పదవిలో నీచుడు ఉండొచ్చు. పదవికి నీచత్వము లేదు. వ్యక్తిలో దోషం ఉండొచ్చు. వ్యక్తిలో భాసించే పరమాత్మ నిర్దోషి. సముడు. శాంతుడు.

శివం

ఉన్నవాళ్ళు, లేనివాళ్ళు అని ప్రపంచంలో రెండు తెగలు.

ధనమున్న వాళ్ళు; లేనివాళ్ళు

సంతానమున్న వాళ్ళు; లేనివాళ్ళు

ఉద్యోగమున్న వాళ్ళు; లేనివాళ్ళు

ఆరోగ్యమున్న వాళ్ళు; లేనివాళ్ళు

కాని,

తృప్తి విషయంలో రెండు తెగలవారు లేరు. ఒకే తెగ ఉంది.

తృప్తి లేని తెగ. అసంతృప్తి తెగ.

లేనివారికి ఉన్నవాడు శివుడు. ఉన్నవాళ్ళలో ఊరేగేవాడు శివుడే. మంగళ రూపుడు. సర్వాశ్రయుడు. సర్వదేవ మయుడు. అందుకే, ఏ అమంగళం చెవిని పడినా "శివశివ" అంటూ ఉంటాము. అమంగళాలన్నీ శివ స్మరణలో మంగళకరంగా మారుతాయి.

ఉన్నది శివుడే.

మన మున్నది - మనకున్నది శివుడే.

ఈ భావం స్థిరపడిన వారికి ప్రతి భావము శివుడే. ప్రతి భావన భవుడే.

అస్మిన్ సర్వే కామాః సమాహితాః

సర్వ కామములు అతనిలోనే ఉన్నాయి అన్నది వేదమాత.

ఎప్పుడు, ఏ అల ఎలా కదలినా అది కదిలేది సముద్రంలోనే.

చైతన్యానికి దూరంగా ఏ ఆలోచన కదుల్తుంది?

భక్తుల దేహాలు ఎక్కడైనా ఉండవచ్చు.

వారి మనస్సు లుండేది పరమాత్మ చెంతే.

వారి భావాలు కదిలేది పరమాత్మ లోనే.

ఆ భావస్ఫూర్తి వెనుక స్ఫురణ పరమాత్మే.

శివ పరమాత్మే.

శ్రీకాళహస్తీశ్వరుడు

సాలెపురుగుకు సామీప్యమూ

పన్నగానికి పరమార్థమూ

సారంగానికి సాలోక్యమూ

చెంచువానికి చైతన్యమూ.... ఎవరు ఇవ్వగలరు? ఎవరికి సాధ్యమది?

మృగరాజు నెక్కిన నగరాజు పుత్రికను చేపట్టి, ఫణిరాజును మెడలో వేసుకొని, రేరాజును ముడిలో తురుముకొని, సురరాజు పూజలందుకున్న విఘ్నరాజు తండ్రి నటరాజుకే సాధ్యం.

మట్టిలో మట్టిగా, కట్టెలో కట్టెగా కలిసి కాలిపోయే దేహాన్ని తైలాలతో తడుపుతూ, అత్తర్లతో అద్దుతూ, వల్లమాలిన విషయ సంపర్కంతో మనం ఊగిపోతూ ఉంటే, ఏదో ఓనాడు ఈ శరీరం గుప్పెడు బూడిదగా మారేదేననే నగ్నసత్యాన్ని ప్రకటించేందుకు ఒడలంతా బూది పూసుకున్న విభూతి సుందరునికే అది సాధ్యం.

మండుటెండల్లో ఎందరు మాడిపోయినా పండు వెన్నెలలో మేము విహరించ గలిగితే చాలు అని తమను తాము సమాధాన పరచుకొనే మానవాళికి త్యాగమయ జీవన సరళిని నేర్పేందుకు అందరికీ అమృతాన్ని పంచి కాలకూట విషాన్ని కంఠంలో దాచుకున్న కరుణామయుడు నీలకంఠునికే అది సాధ్యం.

ఉన్నపళంగా ఊడిపడేది ఏదైనా ప్రమాదమేనని, పద్ధతులు, ప్రక్రియలు తెలిసినపుడే మార్గాలు సక్రమంగా సాగి గమ్యాన్ని చేరగలుగుతాయనే జ్ఞాన జీవన నడకను నేర్పేందుకు ఆకాశము నుండి పిడుగులా దూకుతున్న గంగమ్మను తలపై దించుకొని, చల్లగా, మెల్లగా, ప్రశాంతంగా, ప్రమోదంగా భాగీరథిని ప్రపంచంలో ప్రవహింపచేసిన గంగాధరునికే అది సాధ్యం.

విశ్వయంత్రాంగంలో అణువు మొదలు ఆకాశం వరకు, సాగరఘోష నుండి మేఘ గర్జనము వరకు, పసిపాప నవ్వు నుండి పరమహంస చిద్విలాసం వరకు, మన్ను పాడి నుండి మేరు నగము వరకు, నత్త మొదలు నగధరుని వరకు, పారావారము నుండి తారాపథము వరకు ఎన్ని ఉన్నా, మరెన్నో ఉన్నా, అన్నిటిని అధీనంలో ఉంచు కున్న సభాపతికే అది సాధ్యం.

పుస్తకాల మూటల్ని తలలకి చుట్టబెట్టుకొని, శబ్దాడంబరముతో, శిర కర భుజాభినయాలతో, మాటలను ముడివేస్తూ, వాక్యాలను విసురుకుంటూ, చెమటోడ్చి ప్రవచించినా, కూసే గాడిద కనిపించడం లేదంటూ బోధకులు బిగిసిపోతుంటే, జ్ఞానముద్రనభినయించి, వటవృక్ష నీడలో కూర్చుని, నిరంజన స్వరూపాన్ని మౌనంతో వర్ణించిన దక్షిణామూర్తికే సాధ్యం.

జడమైన ప్రకృతి చలనమెరుగదని, చైతన్యము చలించేందుకు అవకాశము లేదని, లేనిది పుట్టదని, ఉన్నది పుట్టుక ఎరుగదని, పుట్టి గిట్టే దెవరని? పుట్టక, గిట్టక ఉండేదేదని అర్థరహిత వాదాలు ఆకాశాన్నంటుతూ ఉంటే, శక్తియే శివమని, శివమే శక్తి యని, విడదీయలేని, విడిపోని, బంధము గాని సంబంధము, బంధమెరుగని అందము ఏకమేనని అర్ధనారీశ్వరునిగా అవతరించిన ఆదిదేవునికే సాధ్యం.

ఆద్యపురుషుడు, సాధ్యరూపుడు అయిన సిద్దేశ్వరుడే శ్రీకాళహస్తిలో పావనాత్ముడైన పవనరూపుడు. గాలిలో ఆరని దీపరూపుడు. గాలియే తానైన జ్యోతిరూపుడు. మృత్యుంజయుడైన జ్యోతిర్మయుడు.

అవాఙ్మానస గోచరుడైన శ్రీకాళహస్తీశ్వరుని వైభవాన్ని అష్టదిగ్గజ కవులలో ఒకరైన ధూర్జటి మనోహరంగా వర్ణిస్తూ, వాయుర్లింగ ప్రభువుకి నూట పదహారు సమర్పించారు. అదియే శ్రీకాళహస్తీశ్వర శతకము. ఆంధ్రదేశమున కొన్నివందల సంవత్సరాలు శివ భక్తుల హృదయాలలో నిలిచి వెలిగిన, వెలుగుతున్న మహిమాన్వితమైన శతకరాజము.

మధువులొలికే పద సుమాలతో, కవితా మకరంద సంపదలతో, బండరాతి గుండెలను కూడా కరిగిస్తూ, బ్రతుకు సంద్రము నీదుటకు భవ్యమైన, దివ్యమైన పరమేశ్వర నామ నౌకను ఈ శతక రూపంలో అందించారు ధూర్జటి. శివభక్తి సాహిత్య కాంతారమున జగజ్జట్టి.

- **నీరన్నుంపుము పాలముంపు మిక నిన్నే నమ్మినాడం జుమీ!** అంటూ లోకోక్త్యలంకార చ్ఛాయను విరజిమ్ముతాడు.

- **నీ సేవ చేసి హతక్లేశులు గారు గాక మనుజుల్** అని అర్థాంతరన్యాసాన్ని సమర్థంగా ప్రయోగిస్తాడు.

పరమేశ్వరుని తప్ప, పురుగుల వంటి రాజులను ఆశ్రయించుట తన చేతకాదంటూ

- **మేక మెడ చంటం తల్లి కారుణ్య దృష్టి విశేషంబున నిచ్చు చంట వలెనో** అంటూ ఉపమాలంకారమును అర్థాంతరన్యాసముతో జోడించి జాడించిన తీరును చూస్తే ధూర్జటికి ధూర్జటే సరిపోరు.

ఆత్మబంధువులారా!

ఈ అనంత జీవన యాత్రలో మనసున్న వారి నుండి, మహిమున్న వారి నుండి కదిలేవన్నీ సత్రయాగాలే. సమాజ యోగాలే. అనాదిగా ఈ పుణ్య భారతావనిలో సత్పురుషులు సమాజ అభ్యుదయాన్ని, వ్యక్తి శ్రేయస్సును కాంక్షించి శ్రమించారు. పరిశ్రమించారు. మంచిని విరివిగా పంచారు.

నోరున్న వారు మాట్లాడారు. చేతులున్న వారు వడ్డించారు. గళమున్న వారు పాడారు. డబ్బున్న వారు ధర్మం చేశారు. మంచి మనసుండి చేసిన మంచివారి కార్యాలు మానవాళి మనుగడనే మలుపు త్రిప్పాయి. అహంకారుల అర్థరహిత చర్యలు దురదృష్టవంతులకు తలభారా లయ్యాయి.

సతాం ధనం సాధుభిరేవ భుజ్యతే దురాత్మభి ర్దుశ్చరితాత్మనాం ధనం
శుకాదయ శ్చూత ఫలాని భుంజతే భవన్తి నింబాః ఖలు కాకభోజనాః

"సత్పురుషుల సంపద సాధువులకు ఉపయోగపడుతుంది. దుష్టుల ధనము దుర్జనులకే ఉపకరిస్తుంది. మామిడిపండ్లు చిలుకలకు ఉపయోగపడుతాయి. వేప పండ్లు కాకులకు వినియోగపడుతాయి".

సన్మార్గంలో నడిచేవారి కొరకే సద్గ్రంథా లున్నాయి. దేహాలు అనిత్యాలు. గుణములు చంచలములు. సంపదలు అశాశ్వతాలు. చుట్టరికాలన్నీ మాయలే. ఈశ్వరుడే నిత్యం. పరమేశ్వరుడే సత్యం.

పరమాత్మను ధ్యానించండి. కొంతసేపు కీర్తించండి. కొంతసేపు స్మరించండి. సద్గ్రంథాలను రోజూ కొంతకాలం చదవండి. సరళభావాలు సదా కదిలేలా చూసుకోండి. ఫలితాలు కళ్ళముందే దోగాడుతాయి. నిరాశలను, నిస్పృహలను భక్తి నిరోధిస్తుంది. మన కృషి మనం చేస్తే పరమేశ్వరుని కృప సదా తోడుగా ఉంటుంది.

కాష్ఠా దగ్ని ర్జాయతే మథ్యమానాత్ భూమి స్తోయం ఖన్యమానా దదాతి
సోత్సాహానాం నాస్త్యసాధ్యం నరాణాం మార్గారబ్ధాః సర్వయత్నాః ఫలన్తి॥

"మథిస్తే కొయ్యనుండి నిప్పు పుడుతుంది. త్రవ్వితే భూమినుండి నీళ్ళు పుడుతాయి. ఉత్సాహవంతులకు అసాధ్యమనేది లేనేలేదు. పట్టుదలతో ప్రయత్నిస్తే అన్ని ప్రయత్నాలు ఫలిస్తాయి".

ఇది అనుభవసత్యం. సత్యానుభవం. ఉమానాథుని సేవలో మనం కూడా ఉత్సాహంతో ఊరేగుదాం. మన ఊరేగుదాం. సొంత ఊరేగుదాం.

సర్వం శివార్పణమస్తు.

శివ కుటుంబం

మానవ దేహము ఈ లోకంలో పట్టున పదిపదులైనా ఉండదు. ఈ మధ్య కాలంలో సంసారము ఉండేదెంతసేపు? ఊడేదెంతసేపు?

ఉన్నంతకాలం తోడుగా ఉండదు

పోయేనాడు నీడలా వెంబడించదు.

కాలప్రవాహంలో కూడేదెప్పుడో తెలియదు. వీడేదెప్పుడో అర్థం కాదు.

ఈలోగా - సంసారం ...... సంసారం

మహాసాగరం - దుస్తరం - అంటూ అరుస్తూ అలసిపోతుంటాము.

సంసారాలు బంధహేతువులు కావు

సంసార భావనే బంధహేతువు.

ఈ సత్యం అవగతమైతే, సంసారంలో కూడా సారమే ఉంటుంది. సారరూపుడైన పరమాత్మే ఉంటాడు. పరమాత్మ ఉండేచోటు మంగళకరంగా ఉంటుంది. శివప్రదమై, శుభప్రదమై ఉంటుంది.

ఈ సత్య నిరూపణకే భగవంతుడికి కూడా కుటుంబం తయారైంది.

అదే **'శివ కుటుంబం'**

చిక్కులు లేని కుటుంబం. చింతలు లేని కుటుంబం. స్పర్థలు తెలియని కుటుంబం. వ్యర్థం గాని కుటుంబం.

మన కుటుంబాలు కూడా శివ కుటుంబాలు కావాలి.

అవగాహన ఉంటే,

సంసారాలు కైవల్యా లవుతాయి. కైలాసా లవుతాయి.

పరిస్థితులు దుఃఖానికి కారణం కావు, ప్రవర్తనే కారణం.

ఈ సత్యం తెలిస్తే, సంసారం కోఱలు తీసిన పాములా మనముందే ఆడుతూ ఆనందాన్ని పంచుతుంది.

ఇది సాధ్యమా? సాధ్యమే.

ఇలాంటి కుటుంబము ఎక్కడైనా ఉందా? ఉంది.

ఎవరిది? శివునిది. మహేశ్వరునిది.

చూడండి. శివకుటుంబం ఎలా ఉందో!

ఒక ఇల్లాలు. ఇద్దరు పుత్రులు గల కుటుంబం శివునిది.

ఆయన వాహనం నంది.

భార్య వాహనం సింహం........ ఈ రెండు జంతువులకు బద్ధ శత్రుత్వమనే విషయం వేరే చెప్పక్కర్లేదు.

ఒక కుమారుడి వాహనం మూషికం

మరొక కుమారుడి వాహనం మయూరం.

తండ్రి మెడలో ఆభరణం సర్పం......... సరిపోయే, వీటిలో ఒకటి మరొకటితో సరిపడి ఉండవు.

కుటుంబమంతా ఒకే చోటికి ప్రయాణమైనా,

అందరూ ఒకే కాలంలో చేరలేరు.

ఎవరి గమనం వారిదే. ఎవరి గమ్యం వారిదే. వారి వాహనాలు అలాంటివి.

ఇది **శివ కుటుంబం.**

కానీ, ఈ కుటుంబ సభ్యులందరూ ఎంత హాయిగా ఉన్నారో చూశారా!

రూపాలు వేరుగా ఉన్నా,

స్వరూపం ఒకేలా ఉంది.

అనేకములున్నాయే గాని అనేకత్వం లేదు.

భిన్నత్వముందే గాని భేదం లేదు.

ఇదే శుభానికి సంకేతం. శివ కుటుంబ సందేశం.

ఒక కుటుంబంలో ఎందరో ఉంటారు.

అందరి ప్రారబ్ధాలు ఒకేలా ఉండవు.

ఎవరెవరి పరిమితాలు వారికి ఉంటాయి.

ప్రవర్తనా సరళిలో వ్యత్యాసాలుంటాయి.

ఆలోచనలు వేరుగా ఉంటాయి.

అభిరుచులు వేరుగా ఉంటాయి.

అవసరాలు వేరుగా ఉంటాయి.

ఆశలు వేరువేరుగా ఉంటాయి.

ఎవరు, ఎందుకు, ఎలా ఉన్నారో - అర్థం కాకపోయినా, అంతకన్నా మరో విధంగా ఉండటం వారిచేత కూడా కావటం లేదు - అనే సత్యాన్ని సహృదయతతో అర్థం చేసుకున్ననాడు,

ద్వేషాలు, సంతాపాలు దూరమై

ప్రేమలు, సానుభూతులు చిగురిస్తాయి.

వైకల్యాలు అదృశ్యమై కైవల్యాలు దర్శనమిస్తాయి.

పుట్టింట అన్నీ ఉన్నాయి.

అత్తగారింట్లో అక్షయపాత్రే ఆస్తి. దానినే అక్షయ సంపదగా భావించింది హైమవతి.

అత్తగారింట్లో ఏమీ లేకపోవచ్చు. ఆత్మీయతను, ప్రేమను పంచే భర్త ఉన్నాడు అనే భావనే పార్వతీదేవి ఆనందానికి మూలం.

ఏదో కావాలని శివుడు పరితపించలేదు.

అంతర్ముఖుడై ఉన్నదానితో తృప్తి చెందాడు.

ఏదో లేదని

మరేదో రాలేదని సంసారులు అలమటిస్తుంటారు.

ఏదో ఉందని

మరేదో పోలేదని సదా కుటుంబాలలో ఆందోళన చెందుతూ ఉంటారు.

ఉండేందుకు వచ్చింది పొమ్మన్నా పోదని

పోయేందుకు వచ్చింది ఉండమన్నా ఉండదని...... గ్రహించిన మహేశ్వరుడు

ఓ బొజ్జ గణపయ్యను

ఆ బుజ్జి ఎలుకమ్మను,

ఆరు ముఖాల కుమారుని

తుర్రుమనే తోకమ్మను

మరొకరికి తల వంచని మృగరాజును

దించిన తల ఎత్తని వృషభరాజును

ఓ ప్రక్కన

కళ్ళెర్ర జేసే కాళీని

మెడలో బుసలుకొట్టే కాళమును - తోడుగా పెట్టుకున్నా,

శివుడు సదా ధ్యానమయుడే

శాంతి మయుడే

సార రూపుడే, సంసార రూపుడే.

వైకుంఠ వాకిళ్ళు

అవి వైకుంఠ వాకిళ్ళు.

వ్యాస వాల్మీకాదులు వైభవోపేతంగా కవితా రంగవల్లులతో అలరించిన అసమాన అద్భుత వాకిళ్ళు.

సనక సనందన నారద సనత్కుమారాదులు పారాడిన, దోగాడిన దివ్య వాకిళ్ళు.

ముగ్గురమ్మలు ముచ్చటగా గొబ్బెమ్మలై కొలువుదీరిన వాకిళ్ళు.

త్యాగయ్య, అన్నమయ్య, పురందరదాసాది హరిదాసులు జోలెపట్టిన వాకిళ్ళు.

కడగండ్లను తొలగించి, అనుగ్రహ వడగళ్ళను వర్షించే వాకిళ్ళు. రాళ్ళను కరిగించే వాకిళ్ళు. రతనాలను కురిపించే వాకిళ్ళు. బాధల్ని శాశ్వతంగా మరిపించే వాకిళ్ళు. బోధలతో హృదయాలను మురిపించే వాకిళ్ళు. ముకుందుని ముచ్చట్లతో మైమరపించే వాకిళ్ళు. వైకల్యాలను తొలగించి, వైభవాలను ఆరబోసే వాకిళ్ళు. ఆత్మానందము విరబూసే వాకిళ్ళు.

పదండి; దారిన పడి పోదాం. వైకుంఠ ద్వారముకడ పడిఉందాం. నిత్య కళ్యాణాలైన సుప్రభాతాలతో శిథిల బ్రతుకులను మధుర ప్రభాతాలుగా మార్చుకుందాం. తరించే విధంగా తీర్చుకుందాం. మానవజన్మ నిచ్చినంధుకు ఋణం తీర్చుకుందాం.

క్షేమ స్థైర్య వీర్య విజయాదులను అనుగ్రహించే విష్ణుదేవుని వైభవం రమణీయం. రసమయం. అసమానం. అద్భుతం. శంఖ చక్ర గదా పద్మాలతో శోభించే ఖగరాజ వాహనుని ఆనంద మోహన రూపం అలౌకిక ఆధ్యాత్మిక సమన్వయ స్వరూపం.

పరంధామానికి చేరుకోవడమే జీవుల పరమ పురుషార్థమని శంఖాన్ని పూరిస్తూ మేలుకొలిపే శంఖపాణి దివ్య శంఖారావం.

యెదను సరిచేస్తూ, మదిని సరిచూస్తూ, హృదిలో జ్ఞాన సిరిని నిలిపేందుకు, నింపేందుకు, శిక్షల రూపంలో శిక్షణనిచ్చే గదాఘాతం.

జడిపించి అయినా నడిపించేందుకు అనివార్య కాలచక్రభ్రమణాన్ని కళ్ళముందు సుదర్శనంలా ప్రదర్శిస్తూ, కనువిప్పును కలిగించే చక్రకాంతివలయం,

కన్నీళ్ళను తుడిపించి, సంకెళ్ళను విడిపించి, వైకుంఠానికి నడిపించి, శాంతి వెన్నెలలూరు చలువ చరణకమలాలవద్ద ప్రసాదింపబడిన ముక్తి పద్మం - వైభవం. వైకుంఠ వైభవం.

శేషశేషీ భావముతో, ఇంద్రియ మనోబుద్ధులు ఏమి చేసినా, ఏది చేసినా జీవుని కొరకే అయినట్లు, ప్రతి వ్యక్తి తన వ్యక్తిత్వమును వైకుంఠునికి సమర్పించి వైభవంలో

వెలిగిపోవాలి. శేషశాయి లీలా విలాసానికి మాత్రమే వితరణ చేయబడిన దేహేంద్రియ మనోబుద్ధులను విష్ణుదేవుని వైభవంలో రంగరించగలిగితే బ్రతుకు చైతన్య చకచ్ఛకిత మౌతుంది. ఇక్కడే అనంతుడు శేషుడై శోభించాడు.

నివాస శయ్యాసన పాదుకాంశుకోపధాన వర్షాతప వారణాదిభిః

పరమాత్మకు తన దేహమును ఒకప్పుడు గృహముగా, మరొకప్పుడు పడకగా, ఆసనముగా, పాదుకలుగా, వస్త్రముగా, తలగడగా, గొడుగుగా సమర్పించి శేషుడై భాసించిన అనంతుడు సకల భక్త జనావళికి ఆదర్శప్రాయుడు. ప్రాతఃస్మరణీయుడు. స్తవనీయుడు.

ఇదియే శేష భావము. 'నాది-నేను' అనేది అర్థంకాని శేషుని భావము. స్వార్థ మెరుగని కైంకర్య వైభవము.

తెల్లని, చల్లని సాత్త్విక భావాలతో హృదయాన్ని పాలకడలిగా మార్చుకోవాలి. పరార్థ భావనతో శేషునివలె సమస్త సేవల నందించుటకు అంతఃకరణమును సిద్ధం చేసుకోవాలి. ఆ తరువాత విష్ణుదేవుని అర్థిస్తూ ఆహ్వానించాలి. ప్రార్థిస్తూ పిలవాలి. అరుదెంచిన అచ్యుతుని యోగనిద్రలో మనం కూడా సమరసమైపోవాలి. ఇదే సమాధి.

"దేవా! ఆదిదేవా! నాలుగు చేతులున్నా, ఒక్క చేయికూడా నీలో ఖాళీగా లేదు. స్థితి కారకా! మా గ్రహస్థితిని మార్చి, అనుగ్రహమును ప్రసాదించే కార్యంలో నీవు మరో రెండు చేతులు పెంచుకున్నావా? నీ వైభవాన్ని మా బ్రతుకులలో కూడా వెలగనీ. నీ విభవం మా సర్వ కార్యాలలో ప్రభవించనీ. పలవరించనీ, పలకరించనీ".

పవిత్ర పలుకులతో 'వైభవం' కులుకుతోంది. మనమూ పలుకుదాం. పాడుదాం. పరవశిస్తాం. వైభవ వైకుంఠంలో వసిస్తాం. సిద్ధితో శోభిస్తాం.

అవినయ మపనయ విష్ణో! దమయ మనః శమయ విషయ మృగతృష్ణామ్
భూతదయాం విస్తారయ తారయ సంసార సాగరతః ॥

విష్ణో=ఓ సర్వవ్యాపీ! అవినయం=వినయము లేనితనమును, అపనయ= పోగొట్టుము, మనః=మనసును, దమయ=నియమింపుము, విషయ= విషయము లనెడి, మృగ తృష్ణామ్ =ఎండమావులను, శమయ=ఇంకిపోయేలా చేయుము, భూతదయాం= భూతదయను, విస్తారయ=వృద్ధిచేయుము, సంసార సాగరతః=భవసాగరము నుండి, తారయ= ఉద్ధరింపుము!

ఓ సర్వవ్యాపీ! నా అవినయమును నిర్మూలించు. మనసును నిగ్రహించు. విషయాలనే ఎండమావులను ఇంకిపోనీ. భూతదయను వృద్ధిపరచు. సంసార సాగరము నుండి ఉద్ధరించు.

రామకృష్ణులు

భువిని వెలిగించే దివిదీపాలు రెండు. వారే సూర్యచంద్రులు.
భువికి భుక్తినిచ్చే శక్తిదీపాలు రెండు. అవే ఎండవానలు.
భువికి ముక్తినిచ్చే వేదదీపాలు రెండు. అవే ప్రవృత్తి నివృత్తులు.
కళ్ళు రెండయినా చూపు ఒక్కటే
చెవులు రెండయినా వినికిడి ఒక్కటే
పెదవులు రెండయినా నవ్వు ఒక్కటే
కాళ్ళు రెండయినా నడక ఒక్కటే
మార్గాలు రెండయినా గమ్య మొక్కటే.

ద్వివిధో హి వేదోక్తో ధర్మః ప్రవృత్తి లక్షణో నివృత్తి లక్షణశ్చ, జగతః స్థితి కారణమ్, ప్రాణినాం సాక్షాత్ అభ్యుదయ నిశ్శ్రేయస హేతుః

"వేదాలలో రెండు ధర్మాలు చెప్పబడ్డాయి. ఒకటి ప్రవృత్తి. రెండవది నివృత్తి. ఈ రెండూ జగత్తుయొక్క మనుగడకు హేతువులు. ప్రాణుల అభ్యుదయానికి, నిశ్శ్రేయసకు కారణాలు" అని శ్రీ శంకర భగవత్పాదులు గీతాభాష్యాన్ని ప్రారంభిస్తూ పలికారు.

ప్రవృత్తి కర్మమార్గము. అది సమాజానికి అభ్యుదయాన్ని ప్రసాదిస్తుంది. నివృత్తి జ్ఞానమార్గము. అది వ్యక్తిలో పరిపూర్ణతను నింపుతుంది. ప్రవృత్తి ధర్మయుతము. ధర్మము నెలా ఆచరించాలో తెలిపేందుకు రాముడు. నివృత్తి మోక్షరూపము. స్వరూపంలో ఎలా ఆనందించాలో చూపేందుకు కృష్ణుడు.

రాముడు హస్త దేవత. కృష్ణుడు పాద దేవత.

చేసే పనులన్నీ పూజలు అయ్యేలా ధర్మాచరణము చేయిస్తాడు రాముడు. వేసే ప్రతి అడుగు ముక్తి ధామం వైపు సాగేలా నడకను నేర్పిస్తాడు కృష్ణుడు.

ఈ రెండూ జత కలిస్తేనే జీవితం.

అందుకే కాళ్ళు చేతులు అంటూ సంయుక్తంగా పలుకుతారు.

ఇవి బండి చక్రాల వంటివి. దేనిని విస్మరించినా విపత్తే.

అలాగే ప్రవృత్తి నివృత్తులు కూడా. **జగతః స్థితి కారణమ్.** ఈ ప్రపంచ మనుగడకు ముఖ్య కారణాలు.

ఈ రెండూ పరస్పర విరుద్ధంగా గోచరిస్తాయి. కాళ్ళు చేతులు వేరైనా ఎలా సంయుక్తంగా తెలుస్తున్నాయో, అలాగే ప్రవృత్తి నివృత్తులు కూడా సంయుక్త ధర్మాలే. వాటిని ప్రతిపాదించే రామ-కృష్ణులు కూడా సంయుక్త రూపాలే.

వర్కారీ సంప్రదాయంలో **రామకృష్ణ హరి** అనేది తారకమంత్రము. తుకారాముకు స్వప్నదర్శన మిచ్చి పాండురంగ భగవానుడు ఉపదేశించినది ఈ మంత్రమునే. 'రాముడు-కృష్ణుడు సంయుక్త రూపంగా తెలుస్తున్న శ్రీహరియే' అని ఈ మంత్రము ధ్రువపరుస్తూ ఉంది. అదే హరే రామ - హరే కృష్ణ.

రామ రామో రామకృష్ణః
కృష్ణ రామ ఇతి క్రమాత్

అని యోగదీపిక. ఇది సంయుక్త మూర్త్యోపాసన. సంయుక్త రూపోపాసన. సంయుక్త రూపార్చన.

దివికి, భువికి నిచ్చెనలను వేసిన ఈ రామ-కృష్ణ అవతార వైశిష్ట్యమును రామాయణ, భాగవత, భారత గ్రంథములే గాక అనేక పురాణాలు దివ్యంగా వర్ణించాయి. భిన్న మార్గాలలో పయనిస్తున్నట్లు గోచరించే ఈ రెండు అవతారములలో అభిన్నతను చూడగలిగే వారికే లభిస్తుంది బ్రతుకులో పరిపూర్ణత. ఇంతకీ, వారిరువురి మధ్య భిన్నత్వం ఎలా ఉంటుందో, వైరుధ్యం ఎలా కనిపిస్తుందో వారి ద్వారానే విందాం.

రామః :- నన్ను రామః అంటారు. నేను సూర్యవంశానికి చెందిన వాణ్ణి. ఆదిశేషుడు లక్ష్మణుడు అనే పేరుతో నాకు తమ్ముడుగా జన్మించాడు. నేను మా సోదరులలో పెద్ద వాణ్ణి. నా జననం అయోధ్యానగరంలో చాలా వైభవంగా జరిగింది. మధ్యాహ్నం 12 గంటలకు నేను జన్మించాను.

కృష్ణః :- నన్ను కృష్ణః అంటారు. నేను చంద్రవంశానికి చెందిన వాణ్ణి. ఆదిశేషుడు బలరాముడు అనే పేరుతో నాకు అన్నగా జన్మించాడు. నేను మా సోదరులలో చిన్నవాణ్ణి. నా జననం మధురలో కారాగృహంలో భయాందోళనల మధ్య జరిగింది. రాత్రి 12 గంటలకు నేను జన్మించాను.

రామః :- నా బాల్యము చాలా ఆనందంగా వేడుకగా గడిచింది. పదహారేళ్ళు వచ్చేసరికి ఒక విషబాణాన్ని ప్రయోగించి తాటక అనే రాక్షసిని వధించాను.

కృష్ణః :- నా బాల్యము గండాలతో, భయాలతో సాగింది. ఆరురోజుల వయసులో నేను పూతన అనే రాక్షసి ఇచ్చిన పాలు త్రాగుతూ ఆ రాక్షసి ప్రాణాలు కూడా పీల్చేశాను.

రామః :- నేను ఏకపత్నీవ్రతుణ్ణి. నా భార్యను రావణుడు అనే రాక్షసుడు అపహరించాడు. అతణ్ణి వధించి సీతను రావణ చెరనుండి విడిపించాను.

కృష్ణః :- నేను బహుభార్యా సమేతుణ్ణి. నేను నా భార్య రుక్మిణిని అపహరించి తెచ్చుకున్నాను. అడ్డొచ్చిన శిశుపాలుడు లాంటి వారిని నామమాత్రం కూడా లేకుండా చేసి వారి శత్రుత్వం నుండి విడిపడ్డాను.

రామః :- నన్ను వాంఛించి వచ్చిన శూర్పణఖకు ముక్కు చెవులను దూరం చేసి వికృత స్వరూపంగా మార్చేశాను. సదా ధనుర్బాణాలతోనే శోభించేవాణ్ణి. అందుకే నన్ను కోదండరాముడు అంటారు.

కృష్ణః :- నన్ను అభిలషించి దగ్గరైన కుబ్జ యొక్క వికారమును పోగొట్టి అందమైన సుందరిగా తీర్చిదిద్దాను. నేను ఆయుధాలు ధరించను. పిల్లనగ్రోవితో ప్రకాశిస్తూ ఉంటాను. అందుకే నన్ను వేణు గోపాలుడు అంటారు.

రామః :- ధర్మమే నాకు ప్రాణం. మానవులకు ధర్మాచరణను ఆచరించి చూపాను. అందుకే నన్ను **"రామో విగ్రహవాన్ ధర్మః"** అని శ్లాఘించారు. నేను మార్గ దర్శకుణ్ణి.

కృష్ణః :- ప్రేమయే నాకు ఊపిరి. జ్ఞానమే నా ప్రాణం. జ్ఞానంతో శోభించే దెలాగో మానవులకు బోధించాను. నన్ను **"కృష్ణస్తు భగవాన్ స్వయం"** అని కీర్తించారు. నేను లక్ష్యసిద్ధిని.

రామః :- నా భార్యను రావణుడు అపహరించిన వార్త నా గుండెను కుదిపేసింది. సీత లేనిదే నా బ్రతుకు ఎందుకని విలపించాను. సీత నన్ను చేరిన తరువాతే నా హృదయం శాంతించింది.

కృష్ణః :- నేను దూరమైతే ఆ వియోగము గోపికల హృదయాలను నలిపేసేది. కృష్ణుడు లేనిదే మా బ్రతుకు ఎందుకని వారు ఏడ్చేవారు. నేను మళ్ళీ వారికి కనిపిస్తే శాంతించేవారు.

రామః :- నేను ఒక్క అబద్ధం చెప్పలేదు. దొంగతనం నాకు తెలియదు. హాస్య భాషణం నేను ఎరుగను. నన్ను మర్యాద పురుషోత్తముడు అనేవారు. నన్ను సమీపించాలంటేనే అందరికీ భయం.

కృష్ణః :- నాకు అబద్ధాలు మంచినీళ్ళు త్రాగినట్లే. దొంగతనం నా గుణం కాదు; వృత్తి. నాదంతా హాస్య భాషణమే. పొట్ట చెక్కలయ్యేలా నవ్వేవారు నా సహచరులు. నన్ను ప్రేమమూర్తి అంటారు. నన్ను సమీపిస్తే, తిరిగి ఎవరూ విడిచి వెళ్ళరు.

రామః :- నా గుండెలో అంతా కరుణే. ఎవరికి ఏ బాధ వచ్చినా వాళ్ళకన్నా ముందుగా నేను ఏడ్చేవాణ్ణి. నాది జాలిగుండె.

కృష్ణః :- నా గుండెలో అంతా జ్ఞానమే. నా జీవితంలో ఉప్పెనలాగ బాధ లొచ్చిపడినా నేను చలించేవాణ్ణి కాదు. నాది జ్ఞానహృదయం.

రామః :- సూర్యుని కుమారుడైన సుగ్రీవుడు నా స్నేహితుడు. అతని కొరకు ఇంద్రుని కుమారుడైన వాలిని నేను వధించాను. వాస్తవానికి వారిద్దరు సోదరులే.

కృష్ణః :- ఇంద్రుని కుమారుడైన అర్జునుడు నా సఖుడు. అతని కొరకు సూర్యుని కుమారుడైన కర్ణుని వధకు నేను కారణమయ్యాను. నిజానికి వీరిద్దరు కూడా అన్నదమ్ములే.

రామః :- నేను ఏకపత్నీవ్రతుణ్ణి. కాని, ఏం ప్రయోజనం? జీవితమంతా బాధలే. దుఃఖాలే. ఏడుపులే.

కృష్ణః :- నేను బహుభార్యా సమేతుణ్ణి. అయితే నేమి? జీవితమంతా ఆటలే. పాటలే. మాటలే. ప్రేమ బాటలే.

రామః :- నా భార్య ఉత్తమురాలు. ఆదర్శమహిళ. అందుకని గౌరవంతో ఆమె పేరును నా పేరుకు జోడించి "సీతారాం" అని కీర్తిస్తారు భక్తులు.

కృష్ణః :- నా భార్యలు కూడా ఉత్తములే. ఆదర్శమహిళలే. కాని, నా పేరుకు ముందు వాళ్ళ పేర్లుండవు. 'రాధ' అని మరొకరి భార్య ఉంది. ఆమె పేరును నా పేరుకు తగిలించి "రాధేశ్యాం" అంటూ తల లూపేస్తూ, తబలాలు వాయించేస్తూ, తన్మయత్వంతో గంతులేస్తూ సంకీర్తనలు చేస్తారు భక్తులు.

రామః :- నేను యుద్ధంలో భయంకరంగా పోరాడేవాణ్ణి. రామబాణానికి ఎదురులేదని చెప్పుకొనేవారు. దిక్పాలకులు కూడా జడిసి పోయేవారు.

కృష్ణః :- నేను యుద్ధంలో చూసేవాణ్ణే గాని, చేసేవాణ్ణి కాను. మురళియే నా ఆయుధం. దాని ద్వారా జీవనరాగాన్ని ఆలపిస్తాను. అది విని దిక్కులే కాదు; దివి కూడా ద్రవించిపోతుంది.

రామః :- కాంచన మృగాన్ని తీసుకొని రావాలని వెళ్ళి కాంతను పోగొట్టుకున్నాను. కాంతను తృప్తి పరచాలనుకున్నానే గాని రెండూ లేకుండా పోతాయనుకోలేదు.

కృష్ణః :- నేను కూడా శ్యమంతకమణిని తీసుకురావాలని అన్వేషిస్తూ వెళ్ళి మణిని తెచ్చుకున్నాను. దానితో పాటు "జాంబవతి" అనే భార్యామణిని కూడా వెంట తెచ్చు కున్నాను.

రామః :- నన్ను దేవుడని చాలామంది విశ్వసించారు. నేను అంగీకరించలేదు. **"ఆత్మానం మానుషం మన్యే రామం దశరథాత్మజమ్"**. నేను మానవ మాత్రుణ్ణి. దశరథ కుమారుణ్ణి అని చెప్పేవాణ్ణి.

కృష్ణః :- నన్ను దేవుడుగా అంగీకరించుటకు చాలామంది సందేహించారు. నేను అవన్నీ లెక్క చేయలేదు. **"లోకే వేదే చ ప్రథితః పురుషోత్తమః"**. లోకమునందును, వేదము నందును ప్రకాశించు పురుషోత్తముడను నేనే అని ఢంకా బజాయించి మరీ చెప్పాను. నేనే పరమాత్మను అని శంఖారావం చేసేవాణ్ణి.

రామః :- అయోధ్యను సురక్షితంగా ఉంచి నేను నా పరంధామం చేరాను. ఆ తరువాత చాలాకాలం నా అయోధ్య శోభాయమానంగా రాణించింది.

కృష్ణః :- నేను నిష్క్రమించక ముందే ద్వారక నీళ్ళలో కలిసిపోయింది. ఆ తరువాతే నేను నా పరంధామం చేరాను. ద్వారక ఎక్కడుందో, ఎలా ఉందో ఇప్పటికీ అంతు పట్టడం లేదు. పరిశోధకులు ఈరోజుకీ వాళ్ళ పాట్లు వాళ్ళు పడుతూనే ఉన్నారు.

సరే! ఇంతటితో ఆపి, మన బాటకు మనం వస్తాం. చూశారా! ఇది రామకృష్ణుల సంభాషణము. ఎంత వైరుధ్యంతో గోచరిస్తున్నారు? పైకి వైరుధ్యముగా తెలిసినా అంతరంగమున అంతా వైభవమే. వీరిలో ఎవరిని కలిసినా ప్రయాణం వైకుంఠానికే. మార్గాన్ని రాముడు సుగమం చేస్తే, గమ్యమై శ్రీకృష్ణుడు భాసిస్తాడు. ఒకే నాణెమునకు బొమ్మ బొరుసులాగా బ్రతుకు చెలామణి కావాలంటే అభ్యుదయ నిశ్శ్రేయసలు బొమ్మ బొరుసులాగా విడిపోకుండా ఉండాలి. కనుకనే రామకృష్ణులు కూడా విడిపోకుండా సంయుక్తమై మనచేత సంయుక్త నామార్చన చేయించుకొంటున్నారు. ఈ అర్చనలో సిద్ధించే ప్రసాదమే రామ-కృష్ణ స్వరూపము.

వెన్న మనసు

మువ్వల చిన్ని చరణాలతో కులుకుతూ ముద్దు ముద్దుగా వెన్నముద్దలను దొంగిలించిన మోహన గోపాలుని మధుమయ హృదయం రసమయం. సమరసమయం.

ఓ గోపికను తలచి మరో గోపికను వలచి, సర్వులను ప్రేమధామానికి మలచి మరలించిన మురళీమనోహరుని వెన్న మనసు రసమయం. నవరసమయం.

పూచిన పున్నమి రాత్రిలో యమునా సుందర తీరములో జలజలమని యమునా తరగలు, గలగలమని కదంబ తరువులు కలకలమని కదులుతుండగా, బుడిబుడి అడుగులతో బ్రతుకు నడవడి నేర్పిన బాలముకుందుని పాలమనసు ప్రేమమయం. పరమ ప్రేమమయం.

వేదనలో నివేదన ఉందని, నివేదనలో నీ వేదన ఉండాలని, మూత పడేనాడు దాచుకున్నవి దారి కుండవని దాగుడుమూతల క్రీడలలో చిక్కని గోవిందుడు వెలిబుచ్చే చక్కని సందేశం యోగమయం. మహా త్యాగమయం.

కిరీటి రథమెక్కి, ఉభయ సేనల రణగొణ ధ్వనులమధ్య కులుకుల కృష్ణుడు వేద తళుకుల శోభతో ప్రవచించిన ఫలుకులు జ్ఞానమయం. విజ్ఞానమయం.

నారాయణుడు నరుడుగా ప్రేమతో క్రిందికి దిగడము అవతారము. భగవదవ తారములలో పూర్ణశోభతో దిగిన అవతారము శ్రీకృష్ణావతారము. కనుకనే బాల్యము నుండి అవతార సమాప్తి వరకు ఆ దివ్యాత్ముని ప్రతి అడుగులో, ప్రతి పలుకులో, ప్రతి పనిలో పూర్ణత్వము పొంగి పొరలుతూ వచ్చింది. ఆ అమృత హృదయుని, రాసవిభుని ఆశ్రయించిన పవిత్రాత్ముల జీవితాలు కూడా అమృతమయ మయ్యాయి. రసస్వరూపాలై శోభించాయి.

శృంగార రస సర్వస్వం శిఖిపిఞ్ఛ విభూషణమ్
అఙ్గీకృత నరాకార మాశ్రయే భువనాశ్రయమ్

"శృంగారరస సారమై, నెమలి పింఛమును అలంకారముగా ధరించి, లీలా మానుష విగ్రహుడై ముల్లోకాలకు ఆధారమై శోభించు శ్రీకృష్ణ పరమాత్మను ఆశ్రయించెదను" అన్నాడు కృష్ణ కర్ణామృతంలో లీలాశుకుడు.

శ్రీకృష్ణుని అర్థం చేసుకోవడం శ్రీకృష్ణునికే సాధ్యం. సామాన్యులు అవాఙ్మానస గోచరుడైన పరమాత్మను అర్థం చేసుకోలేరు. ఆయన ప్రవచించిన మార్గంలో నడిచి, శ్రీకృష్ణ స్వరూపములో ఒదిగిపోయిన వారికే ఆ దివ్యాత్ముని యెద సౌందర్యం అర్థ మవుతుంది.

"మధురం" అనగా తియ్యనిది. ఈ ప్రపంచంలో 'తీపి' అనేది ఏది? ఎక్క డుంది. తియ్యనివి ఈ లోకంలో ఏవి ఉన్నవో అవన్నీ ఒక దశలో చేదుగా మారేందుకే ఉన్నాయి. నిత్య తీపి ఎందులోనూ లేదు. ఉంటే, అది మధురమే.

నిత్యమైన ఈ మధుర పదార్థము ప్రతి మానవ హృదయంలో నిక్షిప్తమై ఉంది. కనుక ప్రతి మానవ హృదయము మధురానగరమే. ఈ మధురాధిపతి పరమాత్మయే. శ్రీకృష్ణ పరమాత్మయే.

మధురం మధురం వపు రస్య విభో ర్మధురం మధురం వదనం మధురం
మధు గన్ధి మృదుస్మిత మేత దహో మధురం మధురం మధురం మధురం

"ఈ శ్రీకృష్ణమూర్తి దేహము మధురాతి మధురము. మిక్కిలి సుందరము. అతని దివ్యమైన వదనము ఎంత చూచినను ఇంకా చూడాలి అనే ఆశ పుట్టించే మకరందము గలదై, మందహాసము కలదై యున్నది. ఈ శ్రీకృష్ణుని తేజము మధురము. మధురము. మధురాతి మధురము".

మధురాధిపతియైన మధుసూదనుని ఆశ్రయించిన మొండి బండలు కూడా వెండికొండలై శోభించాయి. పతనమైన బ్రతుకులలో పండు వెన్నెలలు విరబూసాయి.

"భగవంతుడికి నా మీద ఇంకా దయ రాలేదు"; అంటూ ఉంటారు. దయ అనేది వచ్చేది కాదు. వచ్చి ఉన్నదే. పరమాత్మ దయ ప్రతిక్షణం మన మీద పడుతూనే ఉంది. తల్లి గర్భంలో ఉన్న మనం ఆయన దయతోనే భూమి మీద పడ్డాం. మనం పీల్చే గాలి ఆయన దయ కాదా! జలము, సూర్యరశ్మి, వెలుగు, పోషక పదార్థాలు అన్నీ పరమాత్మ కరుణా కిరణాలే. ఆయన దయతోనే కళ్ళు చూస్తున్నాయి. గుండె కొట్టుకుంటోంది. మనం బ్రతికేదే ఆయన దయతో. ఇక, దయ వచ్చేదేమిటి? దయ వచ్చే ఉంది అనే జ్ఞానమే మనకు రావాలి.

కష్టాలను కరిగించే అష్టమి *

పుట్టేవారికి మరో పుట్టుక లేకుండా చేసేందుకు, పుట్టనివాడు పుట్టినట్లు గోచరించటమే గోకులాష్టమి. కష్టాలను కరిగించి, కన్నీళ్ళను తుడిచేందుకు యెదలో కొలువైయున్న మాధవుడు యాదవుడుగా అవతరించిన కృష్ణాష్టమి.

ఏ ఆరంభానికి శ్రీకారం చుట్టాలన్నా, "అష్టమినాడు అన్నీ కష్టాలే" అనే నానుడితో భీతి చెందే మానవాళిని, భుజం తట్టి కార్యోన్ముఖుల్ని చేసేందుకు, అభయప్రదాత తన ఆరంభానికి అష్టమినే ఎంచుకున్నాడు.

అవగాహనతో అపార్థాలను అంతం చేసుకోమని, బోధలతో బాధలను అదృశ్యం చేయాలని, 'ఏమున్నది' అని కాకుండా 'ఎలా ఉన్నాము?' అని ఆలోచించుకోమని, మనకేది జరిగినా ఒరిగేదేమీ లేదని - పరులకు జరిగే మేలులోనే మనలో గడ్డకట్టిన కశ్మలము కరిగే అవకాశ ముందని గ్రహించమని, అమరానికి సమర్థం సహకరించదనే సత్యాన్ని వంట పట్టించుకోమని, వెంట నడిచే పుణ్యధనాన్ని పారేసుకోవద్దని, 'చూపు ఉంటేనే రూపు - జ్ఞానం ఉంటేనే గమ్యం' అనే సత్యాన్ని జీర్ణించుకోమని తెలిపేందుకు, జీవనతీరును అందమైన మలుపు త్రిప్పేందుకు, ఏలేవాడు ఎంచుకొన్న అష్టమి తిథి, విధిని తుడిచేందుకు సిద్ధమై యున్న పుణ్యనిధి. పుణ్యశ్లోకుని సన్నిధి.

మన ఎడదలను ఎటుకో పట్టుకుపోయేందుకు, ఏటేటా పనిగట్టుకొని ఉట్టి కొట్టించేందుకు, గుట్టు తెలిపే చప్పుడు చేసేందుకు, ఎద్దడిని తొలగించి యెదలను పండించేందుకు వెన్నెల వంశంలో అవతరించిన వంశీధరుడు పుట్టుక తెలియని వాడైనా, మన కొరకు అదే పనిగ పుడుతూ ఉన్నాడు. గిట్టే అలవాటుకు స్వస్తి పలికేందుకు పుట్టు పండుగను గట్టిగ పట్టుకోమంటున్నాడు.

జీవించింది పాతికకు ముందు వందేళ్ళే అయినా, యుగాంతరాలలో ఏర్పడిన అగాధాలను పూడ్చిన కృషీవలుడు,

ప్రతి క్షణానికి ప్రాణం పోసి, జీవన జ్యోతిని ఆరకుండా కాపాడుకొని ఋషులయ్యెదెలాగో మనకు చాటి చెప్పిన హృషీకేశుడు,

ప్రేమకు పెన్నిధి, శాంతికి సన్నిధి, అపార కృపానిధి భగవాన్ శ్రీకృష్ణుడు, తన మాసం మార్గశిరమైనా, మన మార్గాన్ని సుగమం చేసేందుకు మాసాన్ని ఎంచుకొని మన మధ్యకు వస్తున్నాడు.

తలుపులు తెరిచి ఉంచుదాం. హృదయ కవాటాలను తెరిచి ఆహ్వానిద్దాం. గోవిందుని నిలుపుకొనేందుకు గుండెను గుడిగా మార్చుకుందాం.

* ("కృష్ణాష్టమి"కి పూజ్య స్వామీజీ ప్రత్యేకంగా అందించిన సందేశం)

జగన్మాత

మడి, మైల తెలియని పసిడి బిడ్డకు తల్లి ఒడి; చల్లని తల్లి వెచ్చని ఒడి మరువలేని, మరపురాని మధురానుభూతిగా ప్రతి మనిషి హృదయంలో బ్రతుకంతా నిలిచిపోతుంది. తెల్లని గంగమ్మకన్నా, నల్లని యమునమ్మకన్నా చల్లని కన్నమ్మ మదిలో మధురంగా నిలిచి ఉంటుంది.

జన్మ నిచ్చిన తల్లి సన్నిధియే ఇలా ఉంటే, జన్మ జన్మలకు తోడుగా నిలిచి పాలిచ్చే, పాలించే పరమ పావని, జగజ్జనని, జగన్మాత సన్నిధి ఎలా ఉంటుంది? అవును. ఆమెది అక్షయ నిధి. అవ్యయ నిధి. ఆనంద నిధి. అవ్యయానంద సన్నిధి.

సర్వ సుఖాలకు ఆమెయే ఆది. కనుక ఆమె ఆదిశక్తి. అంతమెరుగని అనంత శక్తి. ఆశ్రితులను ఆప్యాయతతో అనుగ్రహించే అనురాగశక్తి. అప్రమేయ శక్తి.

'శక్తి' అంటే బలము అని అర్థము. అందరికీ శక్తి, అందరిలోని శక్తి అమ్మయే. జగజ్జననియే. పరమాత్మ స్వరూపమును అమ్మగా అర్చించడం, ఆరాధించడం ఒక్క భారతీయ సంస్కృతికే దక్కింది. అమ్మల గన్న అమ్మగా తల్లి గళసీమకు సురభిళ భక్తి సుమహారాలు అలంకరించే అదృష్టం సనాతన ధర్మాన్నే వరించింది.

ముఖ్యంగా నవరాత్రి మహోత్సవాలలో ఈ సుమగాత్రిని అర్చించడం విశిష్టమైన ఆచారం. దుర్గగా, లక్ష్మిగా, సరస్వతిగా మూడు రూపాలలో, త్రిసంధ్యలుగా ఒక పగలు తెలియునట్లు, గోచరించే జగన్మాతను తాత్త్విక దృష్టితో అర్చించడం జరుగుతుంది.

నవరాత్రి ఉత్సవాలలో మొదటి మూడు రోజులు దుర్గపూజ, తరువాత మూడు రోజులు లక్ష్మీపూజ, చివరి మూడు రోజులు సరస్వతీ పూజ.

దుర్గను ప్రత్యేకంగా దుర్గాష్టమి నాడు, లక్ష్మిని ప్రత్యేకంగా మహర్నవమి నాడు, శారదను ప్రత్యేకంగా విజయదశమి నాడు అర్చిస్తాము.

దురితములను దూరం చేసేది దుర్గమ్మ. ఐశ్వర్యప్రదాయిని లక్ష్మమ్మ, జ్ఞానప్రదాయిని శారదమ్మ, ముగ్గురమ్మల మూలశక్తి ఒక్కటే. అదియే ఆత్మశక్తి. అనంత శక్తి.

పామున్న ఇంటిలో పడుకొని నిద్రపోలేము. పాపాలున్న మనసుతో సుఖపడి ఉండలేము. పాపాలు, లోపాలు తొలగినపుడే జీవితంలో శోభ. దుర్గ పూజలో ప్రధానాంశము ఇదే. దశేంద్రియముల ద్వారా మనం ఆచరించి సాధించిన దశవిధ పాపాలను దుర్గాదేవి అనుగ్రహంతో నిర్మూలించుకోవడమే దసరా. కామక్రోధాది శత్రువులను హృదయ సీమ నుండి తరిమి విజయోత్సాహంతో మ్రోగించే నగారా.

మ మాపర్ణా పూర్ణా నిరవధి సుఖై రస్తు సుముఖీ!

"అమ్మా! అపర్ణా! సుముఖీ! నాకు పూర్ణమైన అపార సుఖములు ప్రసాదింప బడుగాక" అని ప్రార్థించారు ఆనందలహరిలో ఆది శంకరులు. మనమూ దుర్గాదేవిని అలాగే ధ్యానిస్తున్నాము.

దుర్గపూజ ద్వారా దుర్గుణాలు నశిస్తాయి. దురితాలు దూరమవుతాయి. మళ్ళీ తిరిగి రావని నమ్మకమేమిటి? ఖాళీ కొంప ఎప్పుడైనా, ఎక్కడైనా పిశాచాలకే. మనస్సు పరిస్థితి కూడా అంతే. దురితములు దూరమైనా, మనసును ఖాళీగా ఉంచకూడదు. సుగుణాలతో నింపుకోవాలి. జ్ఞానాన్ని దింపుకోవాలి. అమానిత్వాది జ్ఞాన లక్షణాలను వంట పట్టించుకోవాలి. ఇదే ఐశ్వర్యము. జ్ఞానైశ్వర్యము. లక్ష్మీదేవిని సేవించి పొంద వలసిన మహద్భాగ్యము.

సిద్ధి బుద్ధి ప్రదే దేవి భుక్తి ముక్తి ప్రదాయిని
మంత్రమూర్తే సదా దేవి మహాలక్ష్మి నమోఽస్తుతే

"సిద్ధిబుద్ధులను అనుగ్రహించునది, భక్తి ముక్తులను ప్రసాదించునది, మంత్ర మూర్తి యగు మహాలక్ష్మికి నమస్కారము" అంటూ లక్ష్మీదేవిని హృదయంలో నిలుపు కొంటున్నాము.

దారిద్ర్యాలు అంతరించి, ఐశ్వర్యాలు అంతఃకరణలో నిండగానే స్వరూప జ్ఞానము దీప్తిమంత మౌతుంది. ఆ దివ్యమూర్తియే సరస్వతి. స్వస్వరూపానుభూతి. రెండు తెలియని మహోన్నత స్థితి. మహదానంద ప్రాప్తి.

స్తోత్రేణానేన తాం దేవీం జగద్ధాత్రీం సరస్వతీమ్
యే స్మరన్తి త్రిసంధ్యాయాం పర్వాం విద్యాం లభన్తితే!

"విశ్వధాత్రి యగు సరస్వతీ దేవిని మూడు వేళల ఎవ్వడు స్మరించునో అట్టి వాడు పరతత్త్వమును పొంది తరించును".

నీవు తృప్తిగా లేనపుడు ఏది వచ్చినా, ఎవరు వచ్చినా నీవు తృప్తి చెందలేవు. తృప్తి అనేది వ్యక్తికి సంబంధించినదే గాని విషయానికి సంబంధించినది కాదు. ఎప్పుడూ ఉండేవాడివి నీవు. ఇది అర్థమైతే, ఏది ఉన్నా, ఏది లేకపోయినా జీవితంలో పెద్ద తేడా ఉండదు. సౌకర్యాలు లేకపోవచ్చు నేమో గాని, సుఖం లేకుండా పోదు. మరి, నీవు ఉన్నావు. ఎందుకని తృప్తి లేకుండా ఉన్నావు? కొద్దిగా విచారం చేస్తే విషాదం దూరమవుతుంది.

జననీ! పరమ పావనీ!

జననీ! పరమ పావనీ!
నిత్య కళ్యాణ జననీ!
ఆదర్శ భారతావనీ!
ఆచార్యుల గన్న తల్లీ! ఆనంద కల్పవల్లీ!
వందన మమ్మా! అందుకోవమ్మా!

అమ్మా!
అందునా వీనుల విందుగా నేను "హిందూ" నని!
'హిం'సకు **'దూ'**రుడే హిందువని మందబుద్ధుల కందునా?
'సర్వేజనా స్సుఖినో భవంతు'
అనే పలుకు నందించిన హిందువు
విశ్వ తలుపులు తెరిచిన బంధువు.
అందుగల డిందులేడను సందేహము నీకెందు కెందుకని
అందము నంతా దేవుని యందే చూచెను హిందువు కందోయి!
వందనమును ముందుగ నేర్పిన
సదాచార సింధువు హిందువు
అపర దయా సింధువు హిందువు.
సంద్రమంత అందగాడు హిందువు
అంబరమంత అనంతుడు హిందువు
ఆధ్యాత్మిక గగన సీమన నిండు చందురుడు హిందువే.
అందాలకు అందము హిందువు
బృందావనమే డెందముగా గల
అందరివాడు హిందువు
అసురనీతికి అందనివాడు హిందువు.
వేద ధరిత్రీ! ఓ జనయిత్రీ!
సుందరనేత్రీ! సుమగాత్రీ
మంచుకన్నా మెత్తని తల్లీ! వెన్నెలకన్నా చల్లని తల్లీ!
తేనెలకన్నా తియ్యని తల్లీ! మహిలో మహిమలు నిలిపిన తల్లీ!

అమ్మా! భారతీ!
అందుకో నీ బిడ్డల హారతి!
తల్లీ! అమృతవల్లీ!
పుట్టుట క్షణికం, గిట్టుట క్షణికం
ఆకలి క్షణికం, ఆవేశం క్షణికం
అన్నీ క్షణికాలే! అన్నిచోట్ల శని కాలే!
కాలే దెప్పుడూ బూదియే! నిలిచి వెలిగేది వేదమే!
అమ్మ ఒక్కటే అమరం
వేదమ్మ ఒక్కటే అమరం
లేదమ్మ మరొక్కటి అమరం
కాదమ్మ వేరొక్కటి అమృతం.
అన్నిచోట్ల మరణాలే! ఏ చోటి కేగినా రణాలే!
అందరి మనసులు వ్రణాలే! మోయలేని భరణాలే!
భారాలన్నీ భరణాలేనని
కా వెన్నడూ అవి ఆభరణాలని
బోధించి బోధించి ప్రబోధించి
అసుర జీవనము నంతంచేసి, దురితములన్నీ దూరంచేసే

దుర్గమ్మా!

మా దేవతవు నీవేనమ్మా! మా తొలి తల్లివి నీవేనమ్మా!
అష్టమి అయినా కష్టము అయినా
నష్టము లేదు దుర్గాష్టమినాడు.
ధనము సంపాదనము
ఆచంద్రార్కము అంటిరావని
సంపదలన్నీ ఆపదలేనని
తరగని ధనము చెరగని వనము
సుగుణ కుసుమాల సంపదయేనని - సత్యము తెలిపిన

లక్ష్మమ్మా!

మా లక్ష్యమంతా నీవే నమ్మా!
మహిలో మహిమలు దించిన తల్లీ!
మము కరుణించు మహార్ణవమి మళ్ళీ!

కోటి విద్యలు కూటివిద్యలు
కాటి బాధను కాల్చలేవని
సాటిలేనిది మేటియైనది
నిత్యమైనది ఆత్మ విద్యయని - సారము నిచ్చిన

శారదమ్మా!

మా బ్రతుకుకు నీవే సారథి వమ్మా!
జయము జయము ఓ జనయిత్రీ!
విజయము నీదే శుభగాత్రీ!
దశ దిశల ఇదే సందేశం!
విజయదశమి శుభ సందేశం!
తల్లీ! అనురాగవల్లీ!
శివుడు కదిలాడు నీ ఒడిలో
శివాజీ పెరిగాడు నీ బడిలో
ఎందరో అర్చకులు నీ గుడిలో
అందరూ పువ్వులే నీ జడలో
అందరూ పాపలే నీ చావడిలో
బాధలు తీర్చే బాదరాయణుడు
యాతన బాపే యాజ్ఞవల్క్యుడు
శంకలు దీర్చే గురు శంకరుడు
మరణ మెరుగని రమణదేవుడు
యెద సౌందర్యంతో ఎదిగిన బిడ్డలు
ఎందరెందరో నీ ఒడిలో
ఎందరెందరో ఈ గుడిలో
ఎందరికో చోటిచ్చిన మాతా!
నా కంత చోటివ్వను కాదా నీచేత!
అందలమెక్కను! చిందులు వేయను!
విందు లడగను! మందు లడగను!
అంత చోటిస్తే చాలు
అమ్మ అడుగుల కడ పడి ఉంటాను
అడుగున పడి ఉంటాను - ఏదీ
అడగకుండా ఉంటాను.

సూర్య నారాయణుడు

ప్రత్యక్ష దైవమైన సూర్యభగవానుని ఋగ్వేదములో **"పూషా!"** అని పిలిచాడు ఘోరపుత్రుడగు కణ్వుడను ఋషి.

జగత్పోషకు డైనందున సూర్యుడు పూషా! అని పిలువబడినాడు. జనుల హృదయ పద్మాలను వికసింపజేయు దినేశుడు పరమేశుడుగా స్తుతించబడినాడు. పరమాత్మ విభూతిగా విశ్వంలో విస్తరించాడు.

దీపం సర్వ తమోపహం - సమస్త చీకటిని పోగొట్టేది దీపం. చీకట్లో మనము సాధించేదంటూ ఏదీ ఉండదు. ఏది సాధించినా వెలుతురులోనే. కనుకనే,

దీపేన సాధ్యతే సర్వం సంధ్యా దీప నమోస్తుతే

అని సాయం సంధ్యా సమయాన దీపాన్ని వెలిగించి నమస్కరిస్తాము. సాయంత్రాలలో ఎవరి గృహాలలో వాళ్ళు దీపాలను వెలిగించుకుంటాం. కాని ఉదయ సమయాన, విశాలమైన చీకటి విశ్వంలో పరమాత్మ సూర్యదీపాన్ని వెలిగిస్తున్నాడు.

అందరి కొరకు పరమాత్మ చేసిన ఈ పవిత్ర యజ్ఞకార్యక్రమాన్ని తిలకించి, మేను పులకించి, మనస్సు పరవశించి, చేతులు జోడించి సూర్యునికి నమస్కరిస్తున్నాము. ఇదే సూర్యోపాసన. అనాదిగా ఈ పవిత్ర భారతావనిలో సాగుతున్న నిత్యదేవతారాధన.

సర్వాంతర్యామి యైన పరమాత్మను మనం వీక్షించలేము. ఆయన దివ్య విభూతులను వీక్షించటమంటే పరమాత్మ వైభవాన్ని దర్శించటమే. ఇది సుస్పష్టంగా సూర్యుని ఆరాధించుటలో గోచరమవుతుంది. కనుకనే,

సూర్యః ప్రత్యక్షదేవతా - సూర్యుని ప్రత్యక్షదైవంగా కీర్తించారు. సూర్యుడు కేవలం వెలుతురును, వేడిని ఇచ్చే అగ్నిగోళం కాదు. జీవనాన్ని ప్రసాదించే అమృత భాండము.

వెలుగు, వేడి అనేవి విద్యుత్తు నుండి కూడా లభిస్తాయి. జీవశక్తి సూర్యుని నుండే లభిస్తుంది.

భూమినుండి ఆహారము, నీరు లభిస్తే, సూర్యుని నుండి జీవశక్తి లభిస్తున్నది. భూమి కూడా సూర్యకుటుంబము లోనిదే.

ఆ సూర్యుని లోని శక్తి పరమాత్మయే. ప్రకాశం లేకపోతే సూర్యుడు లేడు. రవి లేనిచో చంద్రుడు లేడు. భూమిలేదు. ఏ శక్తి ఉండుటచేత సూర్యుడు సూర్యుడుగా ఉన్నాడో, ఏ సూర్యుడు ఉండుటచేత చంద్రుడు చంద్రుడుగా, భూమి భూమిగా మిగిలి యున్నవో - అట్టి దివ్యప్రకాశము తానేనని శ్రీకృష్ణ పరమాత్మ గీత - విభూతి యోగంలో తెలిపారు.

ఆదిత్యానాం అహం విష్ణుః జ్యోతిషాం రవిః అంశుమాన్

ద్వాదశాదిత్యులలో తాను విష్ణువట. వెలిగేవాటిలో తాను రవియట.

కనుక సృష్టి స్థితిలయాలు పరమాత్మ కార్యాలైతే స్థితికి ప్రధానంగా గోచరిస్తున్న సూర్యభగవానుడు పరమాత్మ ప్రతిరూపంగా, ప్రతిమగా పూజ లందుకుంటున్నాడు.

పరమాత్మ దివ్యవిభూతులను ప్రదర్శించే పవిత్ర రూపాలలో అదితి పుత్రుడైన సూర్యదేవుడు ఆదియై ఆదిత్యుడని పిలువబడి, వారం ప్రారంభమైన ఆదివారము నాడు మన అర్చన లందుకొంటున్నాడు.

పోషకుడై వెలితిని తొలగించేవాడు, ప్రకాశకుడై వెలుగు నిచ్చేవాడు సూర్య భగవానుడు. తన దివ్య కిరణాలతో లోకాన్ని కరుణించి లోకబంధు వయ్యాడు. అందుకేనేమో భూలోకమున జనులు భాస్కరుని మరచినా, అందరి ప్రతినిధిగా భూదేవి సూర్యుని చుట్టూ తిరిగి నమస్కరిస్తూ ఉంది.

నిద్రించే వారిని లేపేది సూర్యుడే. వ్యాధులను నిర్మూలించే భిషగ్వరుడు అతడే. అతని కిరణాలు ప్రవేశించని చోటు లేదు. కనుక అతని చూపు నుండి ఎవ్వరూ తప్పుకోలేరు. అతనికి తెలియకుండా ఏ పనీ ఈ విశ్వంలో జరగదు. ప్రాణులకు జీవన ప్రదాత తానే. భయాలను దూరం చేసే ప్రజాబంధు తానే. ఆయుష్షును పెంచేది, ఆరోగ్యమును ఉంచేది ఆదిత్యుడే.

సూర్యుని ఉపాసించు మతాన్ని సౌరమతము అంటారు. కొందరు సూర్యుని ప్రత్యక్ష దైవంగాను, మరికొందరు దేవుని ప్రతినిధిగాను ఉపాసించారు.

త్వమేవ ప్రత్యక్షం బ్రహ్మాసి, త్వమేవ ప్రత్యక్షం విష్ణురసి త్వమేవ ప్రత్యక్షం రుద్రోఽసి..

సూర్యుడు బ్రహ్మ, విష్ణు, రుద్ర దేవతల త్రిమూర్త్యాత్మక స్వరూపుడుగా కూడా వేదంలో స్తుతించబడినాడు.

సూర్యోపాసన కేవలం భారతదేశానికి మాత్రమే పరిమితం కాదు. 'మిత్ర ఇజం' అనే పేరుతో సూర్యోపాసన పాశ్చాత్య దేశములయందు కూడా ఉంది. ఈజిప్టులో సూర్యుని 'రే' అని పిలుస్తారు. ఉపాసిస్తారు. మన దేశములో సూర్యోపాసన అనాదిగా ఉంది. ఒకే సూర్యుడు పండ్రెండు మాసములలో పండ్రెండు నామములతో పిలువబడినాడు. ద్వాదశాదిత్యులు అని స్తుతించబడినాడు. సూర్యుని ఎందరో స్తుతించారు. ఉపాసించారు. అనేక గ్రంథాలు రచించారు. కీర్తనలు రచించి పఠించారు. సూర్యుని కీర్తిస్తూ రచింపబడిన గ్రంథాలలో భాస్కరశతకం ఒకటి. ఈ భాస్కర శతకమును మారన వెంకయ్య అనే కవి రచించాడని, ఆయన సూర్యోపాసకు డైనందున ప్రతి పద్యమునకు చివర "భాస్కరా!" అని తన ఇష్టదైవానికి నివేదించుకున్నాడని అంటారు.

మారన వెంకయ్య అనేది ఒకని నామం కాదని, మారన మరియు వెంకయ్య అను ఇరువురు ఈ శతకమును రచించారని మరి కొందరు చెబుతారు.

ఏది ఎలా ఉన్నా యెదను పరవశింపచేసే శతకమిది. ఆంధ్రంలో అనేక గ్రంథాలు శతక రూపంలో వచ్చాయి. కొన్ని గ్రంథాలు నైతిక విలువల్ని ప్రబోధిస్తూ సమాజాభ్యుదయాన్ని కాంక్షిస్తే, మరికొన్ని శతకాలు భక్తిరస బంధురమై మానవాళిని ముక్తి మార్గం వైపు పయనింప చేశాయి.

భాస్కర శతకము సుమతి, వేమన శతకముల వలె నీతి శతకము. ఇందులో ప్రతి పద్యము చక్కని దృష్టాంతముతో పరిమళించడం ఒక విశేషం.

- నదులు పొంగుతున్నా కుక్క గతుకుట మాననట్లు, ఐశ్వర్యాలు కుప్పలు తిప్పలుగా వచ్చి పడినా లోభి అనుభవించ లేడు అంటూ లోభము నుండి విడిపిస్తాడు.

- రసము నంతయు గానుగలో కార్చుకొని పిప్పిగా నేలపై పడినా చెరకును చీమలు వదలనట్లు దయామయుడైన దాత బాధల్లో ఉండినా ప్రజలు అతనిని విడిచిపెట్టరు అంటూ దాతృత్వము వైపు నడిపిస్తాడు.

- తియ్యని నదీజలాలు సాగరాన్ని చేరగానే ఉప్పు నీరుగా మారుతాయి. దుష్టులైన వారిని సేవించు వారికి దుష్టత్వమే మిగుల్తుంది అంటూ దుష్ట మార్గానుయాయుల్ని జడిపిస్తాడు.

మదపు టేనుగు అయినా మావటి వానికి లొంగిపోవునట్లు, విధి వక్రించినపుడు శక్తివంతుడైనా నీచుని చేతిలో చిక్కి దుర్భర బాధల ననుభవిస్తాడు అంటూ విధివంచితుల కన్నీళ్ళు తుడిపిస్తాడు.

ఈ కవి పోకడలో ఒక నవత్వం ఉంది. మానవత్వం పూర్ణతను సంతరించు కోవాలనే తపనేదో వెంకయ్యలో ఉంది. విధి బలీయమని విశ్వసించే ఈ వెంకయ్య కవి గుండెల్లో సానుభూతిని నిండుగా దాచుకొని పలుకుతాడు. ఇతని వచనాలన్నీ ఓదార్పులే.

చైతన్యగాన లహరి

పల్లవి:- సూర్యనారాయణ - తిమిర హరణ
ఉద్దర మాం దేవ - దీన శరణ్య ॥ సూర్య ॥

చరణములు :-

1. ప్రత్యక్షదేవా! పాపసంహార!
జ్యోతి స్వరూప! సర్వలోక స్వామి! ॥ సూర్య ॥

2. నమో భూతనాథ! నమో దివ్యతేజ!
నమో స్వప్రకాశ! మహాపాపనాశ! ॥ సూర్య ॥

3. సర్వభూతపతిం - అప్రమేయ తేజం
లోక నివాసినం - స్మరామి లోకనాథం ॥ సూర్య ॥

4. పావన చరిత - పాపవిదార!
నమో భక్తపాల - చైతన్యలోల! ॥ సూర్య ॥

శరణం

నదిలో నిలబడి "ఓ నదీ! నన్ను తడపకు" అని ప్రార్థించి పొందే దేముంటుంది? యుద్ధంలో శత్రుసైనికుని ముందు నిలిచి "నాతో పోరాడకు" అని అర్థించి సాధించే దేముంటుంది?

"మాది కాని పనిని మేము చేయలేము" అనేదే పై విన్నపాలకు లభించే సమా ధానం. నిగ్రహం సాధ్యం కానపుడు అనుగ్రహానికి ఐదు పది చేయడమే అందం. ఆనందం. అరిషడ్వర్గాలు అందల మెక్కినపుడు ధర్మం అడవుల పాలవుతుంది. అదే భారతంలో వనపర్వం. అక్కడ కూడా అధ్యయనం సాగనపుడు ధర్మం అజ్ఞాతవాసం చేస్తుంది. ఈ దశలో పోరాటము సాధ్యము కాదు. ఆరాటము ఆదర్శమూ కాదు. ఆరాటాలు, పోరాటాలు చీకట్లో తారాడే సమయాన అధర్మమనే తారకాసురుని, అజ్ఞాన మనే సింహాముఖుని సంహరించడం సులభసాధ్యం కాదు. దేవతల పరిస్థితి అదే అయింది. ప్రయత్నాలు పలించనిచోట ప్రార్థనలు ఫలితాల నిస్తాయి.

తారకాసురుని ఎదిరించలేని సురులు శివుని ప్రార్థించారు. శివశక్తి స్కందుడై అవతరించింది. పరమాత్మకు అసంభవము లేదు. అది నిరూపించింది కుమార సంభవము. దేవసేనాధిపతి ఆవిర్భావము. దైవబలము ధర్మరక్షణకు అవతరించిన సుదినము. కనుకనే శక్తి స్కందుని ఆయుధము.

స్కందుడు షణ్ముఖుడు. ఆరు ముఖములు గలవాడు. ఆరువైపుల దృష్టి సారించగలవాడు. కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యములనెడి ఆరుగురు శత్రువులను ఎదిరించి జయించగలవాడు. అసమాన సమరవీరుడు. కనుకనే, **సేనానీనా మహం స్కన్దః.** 'సేనాధిపతులలో నేను స్కందుడను' అన్నాడు గీతాచార్యుడు. పరమాత్మ సేనాధిపతిగా నిలిచినపుడు ఎదిరించే శక్తి ఎవరికుంటుంది?

కామాన్ని జయించాలి అనుకోవడం కామం కాదా? క్రోధాన్ని జయించాలంటే క్రోధము కోపగించుకోకుండా ఉంటుందా? ఇదీ వచ్చిన బాధ. యెద జీర్ణించుకోలేని వ్యథ. కనుక కృషి సరిపోనపుడు కృప తోడు నిలవాలి. దేవసేనకు అధిపతిగా స్కందుడు నిలవాలి. దైవబలం దైన్యాన్ని తొలగిస్తుంది. ధైర్యాన్ని ప్రసాదిస్తుంది. దేవతలకు కుమారసంభవములో అదే ప్రాప్తించింది.

దేవసేనాధిపతి స్కందుని దివ్యమయ దృష్టి పడితే జీవులు అమృతరూపు లవుతారు. **దృశిస్కందమూర్తిః శ్రుతౌస్కందకీర్తిః** - నా నేత్రాలలో స్కందుడే వెలుగు గాక! నా చెవులలో స్కందుని కీర్తియే వినిపించుగాక! అని శ్రీసుబ్రహ్మణ్య భుజంగ స్తోత్రములో శ్రీ శంకర గురుదేవులు స్తుతించారు.

ఆరు ముఖములు గల కార్తికేయునికి పంద్రెండు నేత్రాలు శోభిస్తున్నాయి. జ్ఞానేంద్రియ, కర్మేంద్రియ, మనోబుద్ధు లనెడి పంద్రెండు కరణములపై స్కందుని దృష్టి ప్రసరించగనే కరణములు జ్ఞానకిరణములై శోభిస్తాయి. ఇదియే స్కందషష్ఠి. అజ్ఞాన నష్టి. జ్ఞానపుష్టి.

మారుని జయించిన హరునికి కుమారుడైన స్కందుని వాహనము మయూరము. కాముని జయించడం శివునికే సాధ్యం. శివుని కుమారుడు శివశక్తియే కనుక స్కందుడు కామరూపుడైన తారకాసురుని వధించాడు. ఇదియే అవిద్యానాశము. కుమారస్వామి వాహనమైన మయూరము కాళ్ళతో సర్పాన్ని పట్టుకొని ఉంటుంది. పాముకు నెమలి మృత్యువు. మృత్యువు పట్టుకున్నా భుజంగము భవ్యంగా జీవించే ఉంది. మృత్యువును జయించినవారు మృత్యుంజయు లవుతారు. కనుకనే కుమారస్వామిని సుబ్రహ్మణ్య మని, మృత్యుంజయుడని కీర్తించడం జరిగింది. ఈ కారణంగానే కార్తికేయుని భుజంగ వృత్తములో స్తుతించారు శ్రీ శంకరాచార్య స్వామి.

న జానామి శబ్దం న జానామి చార్థం
న జానామి పద్యం న జానామి గద్యం
చిదేకా షడాస్యా హృది ద్యోతతే మే
ముఖా న్నిస్సరంతే గిర శ్చా౽పి చిత్రమ్ ॥

'పద' మేమిటో నాకు తెలియదు; పదానికి భావమూ నే నెరుగను. పద్యమంటే ఏమిటో, గద్యమంటే ఏదో నాకు తెలియనే తెలియదు. తేజోమయమైన ఆరు ముఖములు గల దివ్యరూపము నా హృదిలో భాసించు చున్నది. అంతే! నోటినుండి వరదలా పొంగు కొస్తున్నాయి సుందర స్తోత్రాలు. ఎంత ఆశ్చర్యకరం!

మయూరాధిరూఢం మహావాక్యగూఢం
మనోహారిదేహం మహచ్చిత్తగేహమ్
మహీదేవదేవం మహావేదభావం
మహాదేవబాలం భజే లోకపాలమ్ ॥

నెమలి నెక్కి విహరించువాడు, 'తత్త్వమసి' మొదలైన మహావాక్యముల ద్వారా సూచించబడే వాచా మగోచరుడు, మైమరపించు సుందర రూపము గలవాడు, మహాత్ముల మనములనే తన ఇంటిగా చేసుకొని వసించువాడు, భూసురులచే పూజింపబడువాడు, శ్రుతుల సారమే తన స్వరూప మైనవాడు, పరమశివుని కొమరుడు అగు జగత్ప్రభుని భజించెదను.

నందీశ్వరుడు

అందుకొనేవాడు నరుడు. అందించేవాడు నందీశ్వరుడు. అందేవాడు మహేశ్వరుడు.
శివాలయానికి వెళ్తాం.
ముందు నందీశ్వరునికి నమస్కరిస్తాం.
ఆ పిదప పరమేశ్వరునికి ప్రణమిల్లుతాం.

నందతి ఇతి నంది

ఆనందముగా ఉండునదియే నంది. భక్తునికి, భగవంతునికి అతడే సంధి.
కావాలా? మహేశ్వరుని పొందు? అయితే, అర్చించాలి నందీశ్వరుని ముందు.
ముందుంచుకుంటాడు భగవంతుని నంది
జీవిత లక్ష్యముగా అతనినే పొంది.
సత్సంగ మబ్బనిదే సారూప్య మలవడదు.
సద్భక్తి కలగనిదే సామీప్య మరుదెంచదు.
సదాశివుని మోయు నంది వాహనమూర్తి. జీవన కళతో శోభించు మోహనమూర్తి.
పరమేశ్వరుని దర్శించు నంది కొమ్ముల మధ్య మహేశ్వరుని దర్శిస్తారు భక్తజనులు.
వివేకవైరాగ్యములు అటు నిటు నిలువ మధ్యలో మహిమను దర్శిస్తారు పావనాత్ములు.
సత్సంగాన్ని గ్రహించు. దుస్సంగాన్ని దహించు.
భక్తిని పెంచుకో. ప్రేమను పంచుకో.
బ్రతుకు వనంలో విరబూయాలి సుగుణాల పూలతోట
హృదయ గుడిలో వినిపించాలి ఓంకార జోలపాట.
పొగడ్తలకు పొంగడు ఆనందంతో నంది.
విస్మరిస్తే క్రుంగడు ఆవేదనతో కలతచెంది.
పరమేశ్వర దర్శనమును వీడడు క్షణమైనా.
పరుల పంచన చేరడు బ్రతుకులో ఏమైనా.
నందిని మరువకు. భక్తిని తప్పకు. సమయము లేదని చెత్త 'సారీ' చెప్పకు.
గురువు మాట మీరకు. గ్రుడ్డి వెంట నడవకు.
అవిద్యకు గోడకట్టు. విద్య నెపుడూ జేకొట్టు.

హనుమంతుడు

రాజుల్ని జయిస్తే రాజ్యాలు లభిస్తాయి. నిన్ను నీవు జయిస్తే సుఖశాంతులు ప్రాప్తిస్తాయి. ఈ సత్యాన్ని చాటిచెప్పడమే గాక, చేసి చూపిన మంగళ మహనీయ మూర్తి హనుమంతుడు.

రామాయణంలో రమణీయమూర్తి ఆంజనేయస్వామి. కిష్కింధ కాండములో ప్రథమంగా ఆయన దర్శనమవుతుంది. **సంభ్రమః త్యజ్యతాం....** 'భయాన్ని విడిచిపెట్టండి' అనే అభయ వాక్యంతో హనుమంతుడు గోచరిస్తాడు. కనుకనే, భయాలలో, బాధలలో చిక్కుకుపోయిన వారందరూ,

హనుమంతా! నీదే భారమంతా!

అని సమస్తాన్ని వాయుపుత్రుని పాదములవద్ద సమర్పించి, రక్షణ లభించిందని హాయిగా గాలి పీల్చుకుంటారు.

ఆశోకవనంలో సీతమ్మ కూడా ఆ పనే చేసింది. తన భారాన్ని మోయమని, బాధను తొలగించమని ఆంజనేయస్వామిని అర్థించింది.

త్వమస్మిన్ కార్యనిర్యోగే ప్రమాణం హరిసత్తమ

హనుమన్ యత్న మాస్థాయ దుఃఖక్షయ కరోభవ!

హనుమంతా! నీదే భారమంతా! ఈ కార్యాన్ని నిర్వహించే బాధ్యత నీదే. నీవే ఆలోచించాలి. నీ ప్రయత్నముతో నా దుఃఖాన్ని పోగొట్టు అన్నది సీతమ్మ. **తథేతి -** అలాగే అన్నాడు హనుమంతుడు. అలాగే చేశాడు. సీతమ్మ దుఃఖాన్ని పోగొట్టాడు. మనమూ ఆంజనేయుని ఆశ్రయిద్దాం. అవగాహనతో భక్తిలో చరిద్దాం. ముక్తి ధామాన్ని అలంకరిద్దాం.

ఆంజనేయుని ఆరాధించడమంటే ఆ దివ్యాత్మని లోని అసమాన వైభవమును చక్కగా దర్శించి, దానిని మన బ్రతుకులలో ప్రదర్శించడమని అర్థము:

హనుమంతుడు రామభక్తుడు. రామకార్యంలో అలుపెరుగనివాడు. అభిరుచులను ఆతిథ్యాలను మరచినవాడు. భయమెరుగనివాడు. సముద్రాన్ని దాటడానికి కూడా వెనుకాడనివాడు. అంతటి వాడైనా అహంకారము తెలియనివాడు. వినయమును వదలనివాడు. నిర్వేదమును పొందనివాడు. ఇంద్రియ నిగ్రహముతో అకుంఠిత కార్యదీక్షతో జీవితమును సాగించి భక్తలోకానికి ఆదర్శమై భాసించాడు.


హనుమంతుడు వానరుడు. అయినా నరులకు, సురులకు కూడా పూజనీయుడయ్యాడు. ఆ మహితాత్ముని బాటలో మనమూ చరించి తరించెదము గాక! **మహాజనో యేన గత స్స పన్థాః** మహాత్ములు పోయిన మార్గమే మార్గము - ఈ మహావాక్యాన్ని నిరంతరం మదిలో పదిలపరచుకొని, హనుమంతుని పవిత్ర బాటలో సదా పయనించెదము గాక!

పవనసుత హనుమాన్ కీ జై!



జ్ఞాన ప్రదీపము

ఇందులో...



సుఖం చిరునామా

ప్రతి మనిషి సుఖాన్ని కోరుకుంటాడు. కాదు కాదు; సుఖాన్నే కోరుకుంటాడు. సుఖం అల్పంగా ఉంటే, అధిక సుఖం వస్తే బాగుండునని భావిస్తాడు. అది రాకపోతే, అది ఎక్కడుందో అన్వేషిస్తూ తానే ఎక్కడి కెక్కడికో పోతాడు, ఏదేదో చేస్తాడు.

ఈ విధమైన ప్రయత్నాలు ఫలిస్తే సుఖం పెరగవచ్చు. ప్రయత్నం విఫలమైతే ఆశించిన సుఖం రాకపోవటమే గాక, అయిష్టమైన దుఃఖం ప్రాప్తించవచ్చు. అల్పమో, స్వల్పమో సుఖాన్ని మనిషి భరించగలడు గాని దుఃఖాన్ని భరించలేడు. దుఃఖము మనిషికి బంధము. బంధములో ఆనందముండదు. అందుకే బంధవిముక్తికి ప్రయత్నిస్తాడు.

బంధము వలన దుఃఖం కనుక, సుఖప్రాప్తియే బంధ విముక్తి అని భావిస్తాడు. సుఖానికి ప్రయత్నిస్తాడు. సుఖాన్ని పొందుతాడు. ఇంకా ఎక్కువ సుఖం కావాలని ఆశిస్తాడు. మరొక దానిని ఆశించేటప్పుడు ఉన్నది సుఖాన్నివ్వలేదు. లేనిది వస్తేగాని సుఖం రాదు. వచ్చింది ఏదైనా పోయేదే కనుక అదీ అల్పమే. అల్పమైనది ఏదయినా అధికమైన దానిని గుర్తు చేస్తూనే ఉంటుంది. దుఃఖానికి గురి చేస్తూనే ఉంటుంది. అసౌకర్యాలు సుఖస్థానాలు కాలేవు.

ఒక చోట సుఖం లభించవచ్చు. కాని సదా అక్కడ సుఖం లభిస్తుందని చెప్పలేము. ఈ కారణంగానే మనిషి ఇల్లు మారుస్తాడు. ఊరు మారుస్తాడు. ఉద్యోగం మారుస్తాడు. క్లబ్బులు మారుస్తాడు. హోటళ్ళు మారుస్తాడు.

ఒక వ్యక్తి వలన సుఖం ప్రాప్తించవచ్చు. కాని, నిరంతరము ఆ వ్యక్తి నుండి సుఖమే వస్తుందని భావించేందుకు వీలు లేదు. అందుకే, మనిషి మిత్రుల్ని మారుస్తాడు. సహచరుల్ని మారుస్తాడు. విడాకులిచ్చి మరో పెళ్ళి చేసుకుంటాడు. ఉమ్మడి వ్యాపారాల్లో విడిపించుకొంటూ, కరిపించుకొంటూ తికమక పడుతూ ఉంటాడు.

సుఖం ఈ సమయంలో వస్తుంది, లేదా ఉంటుంది అని చెప్పలేము. ఆదివారం సెలవు కనుక సుఖమొస్తుంది అని భావిస్తే, ఆ రోజే జ్వరమొచ్చి సుఖం దూరం కావచ్చు. లేదా, ఇష్టం లేని బంధువులు ఆ రోజే పెద్ద సంఖ్యలో వచ్చి దేహంలో ఉష్ణోగ్రతను పెంచవచ్చు.

ప్రాతః కాలము ప్రశాంతంగా, పవిత్రంగా ఉంటుంది. ధ్యానం చేసుకొని సుఖ పడతాము అని ఒక వ్యక్తి ఉదయం 4 గంటలకి నిద్ర లేస్తే ఆ సమయానికే 'టాప్' నుండి నీళ్ళు రాకపోవచ్చు. లేదా, పవర్ కట్ కారణంగా దీపాలు, ఫాన్లు లేక, ధ్యానం విషయం దేవుడెరుగు. చెమటలు పోస్తూఉంటే ఏమి చేయలేని స్థితిలో ధ్యానం చేయలేక, నిద్రపోలేక ఉట్టికి, స్వర్గానికి రెంటికీ లేక రెండు చింతలతో తెల్లవారేలా చేసుకోవచ్చు.

అబ్బాయి ఉద్యోగానికి వస్తే చాలు. అక్కడ నుండి సుఖం ప్రారంభ మవుతుందని తల్లిదండ్రులు ఊహిస్తే, ఉద్యోగం రాగానే అబ్బాయి పరుగు లెత్తుకుంటూ పాట్నాకి వెళ్తే, పొకాలలో మనకు ఎవరు కాపలా అని తల్లిదండ్రులు ఊపిరాడని పరిస్థితిలో పడిపోవచ్చు.

ఉద్యోగ విరమణ చేయగానే, అంతా విరామమే కనుక ఆత్మధ్యానంలో కాలాన్ని హాయిగా నెట్టుకొని పోవచ్చు అని చాలామంది ఆలోచిస్తూ ఉంటారు. విరమణ అయితే జరుగుతుంది కాని, ఆరోగ్యం చాలక, మోకాళ్ళు వంగక ధ్యానాన్ని వాయుదేవునికి అప్పగించి "ఆరోగ్యమే మహాభాగ్యము" అనుకొంటూ, వైద్యుడే నారాయణుడు, ఆసుపత్రే ఆలయమని తిరుగుతూ ఉంటారు.

ఇలా ఎన్నయినా చెప్పవచ్చు. ఒక విధంగా చూస్తే అన్నీ ఇలాగే ఉన్నాయేమో! అనుభవ సుఖాలు ఏవయినా, ఎప్పుడూ అనుకూలంగా ఉంటాయని చెప్పలేము. వస్తువు దగ్గరగా ఉన్నప్పుడు, అనుభవించటానికి అనుకూల పరిస్థితులు లేకపోవచ్చు. ఈ రెండూ ఉండినా ఆసక్తి మనస్సులో లేనపుడు ఉన్నవి వృథాగానే ఉంటాయి.

విషయ సుఖాలు

ప్రపంచంలో విషయాలున్నాయి. విషయాల కారణంగా సుఖపడుతున్నట్లు అనిపిస్తూ ఉంది. అన్ని విషయాలు అందరికీ సుఖాన్ని ప్రసాదించలేకపోవచ్చు. కాని, ఆ విషయాలపై రాగముండే వారికి అవి సుఖంగా తాళం వేయకపోవు. ఆ సుఖ మేమిటి? అదీ సుఖమే. కాని, నిత్య సుఖం కాదు; అనిత్య సుఖం.

అనిత్య సుఖమంటే ఏమిటి? వచ్చి పోయేది అని అర్థం. మనం అభిలషించింది చేతికి అందితే ఆ క్షణాన సుఖం పుడుతుంది. అది దూరమైనా, నశించినా, లేదా మన మనస్సు మరొక వస్తువు మీదికి మరలినా సుఖం దూరమవుతుంది.

మనిషి వస్తువును వాంఛించేది వస్తువు కొరకు కాదు; సుఖం కొరకు. వస్తువు ద్వారా సుఖాన్ని, ఆనందాన్ని వాంఛిస్తాడు. పదవి ద్వారా ఆనందం వస్తుందని పదవిని ఆశిస్తాడు. సంతానం ద్వారా సుఖం వస్తుందని సంతానాన్ని అభిలషిస్తాడు. ధనం ద్వారా సుఖం వస్తుందని ధనాన్ని కోరుకుంటాడు.

ఆశించినవి అందితే తాత్కాలికంగా సుఖం కలగవచ్చు. వాటి వలన నూతన సమస్యలు తలెత్తవని చెప్పేందుకు వీలులేదు. ఇలా విషయ సుఖాలు నిత్య సుఖం కావని తేలుతూ ఉంది.

నిత్య సుఖం

నీవే నిత్య సుఖం. నీవే నిత్యానందం. విషయ ప్రపంచం నుండి లభించే ఆనందం కూడా నీ స్వరూపానందమే. భోక్త, భోజ్యము రెండూ ఏకమైన దశలో మెరుపులా గోచరించే సుఖము కూడా స్వరూప సుఖమే.

మనం ఆనందంగా ఉండేటప్పుడు మన మనస్సులో ఏముంది? ఆనంద ముందే గాని ఆనంద హేతువు లేదు. అందుకనే "నేను సుఖంగా ఉన్నాను" అని అంటామే గాని "సుఖం నాలో ఉంది" అని అనలేము.

కనుక నీవే ఆనందం. ఆత్మయే ఆనంద స్వరూపము. విషయ సుఖాభిలాషలో ఆత్మకు దూరంగా పరుగులెత్తుతున్నాం. విషయానుభవంలో అభిలాష అదృశ్యమై ఆత్మానుభూతి కలుగుతూ ఉంది. ఈ విధంగా ప్రపంచంలో ఆనందం లభ్యమవుతూ ఉంది.

ఆత్మనస్తు కామాయ సర్వం ప్రియం భవతి. ఏది మనకు ప్రియమైనా, ఏది మనకు సుఖాన్ని పంచినా దాని వెనుక ఆత్మ సుఖమే ఉంది.

ఆత్మ అనంతానంద స్వరూపము. ప్రపంచము అనంతమైన ఆత్మకన్నా అన్యంగా ఉండలేదు. కనుక అనిత్య సుఖమని మనం దేనిని అంటున్నామో అది కూడా ఆత్మ సుఖమే. దానికన్నా భిన్నమైనది కాదు.

దుఃఖ స్పర్శ లేని ఆనంద స్వరూపము ఆత్మయే గనుక అది జీవుడు లోకములో అనుభవించే సుఖానికి భిన్నంగా లేదు **(దుఃఖ అస్పృష్ట నిత్యసుఖ స్వరూపం జీవాభిన్నం);** భేదము లేనిది కనుక అఖండమై ఉంది. అఖండము కనుక సర్వములో ఉంటూ, సర్వమును అతిశయించి, అధిగమించి, అద్భుతంగా స్వప్రకాశంలో శోభిస్తోంది **(నిర్భేదం అఖండ బ్రహ్మ సర్వోత్కర్షేణ వర్తత ఇత్యర్థః).**

కనుక, నీవు నీకు తోడు కానపుడు ఏది తోడున్నా, ఎవరు తోడున్నా, అదంతా తోడు కాదు; అది కేవలం నీడయే. ఛాయయే. మాయయే. బయటి కెళ్ళేది తిరిగి ఇంటికి చేరేందుకే. సుఖాన్ని పొందాలని విషయాల మధ్య కెళ్ళేది, తిరిగి ఆత్మను చేరేందుకే. ఈ కారణం చేత ఈ విశ్వంలో ఏ ఆనందమైతే ఉందో అది కూడా ఆత్మా నందమే. ఆత్మానంద సాగరంలో ఒక తరంగ రూపంలో ఈ విషయానందము ప్రపంచంలో గోచరిస్తూ ఉంది **(యదానంద లేశైః తత్ విశ్వం ఆనంది).**

మార్పు బాధాకరం. అందుకనే మార్పును అందరూ వాంఛిస్తారు. మారేందుకు ఎవరూ సిద్ధపడరు.

మార్పు బాధాకరం. అలాగని, మారకుంటే అది మరీ దుఃఖకరం. మారాలనుకున్నా, మారకున్నా బాధ మాత్రం తప్పదు.

మారకపోతే బాధ స్థిరంగా తోడైఉంటుంది. కష్టమైనా, శ్రమించి మారిపోతే, ఆ క్షణం నుండి బాధలు శాశ్వతంగా కరిగిపోతాయి. కన్నీళ్ళు ఇంకిపోతాయి.

పురుషార్థములు

తనలో ఒక వెలితిని, అసంపూర్ణతను, అవసరాన్ని మోసుకుంటూ మనిషి చరించ లేడు. వాటి నుండి విడిపడేందుకు, తనలో వాటిని దూరం చేసుకొనేందుకు మనిషి సదా ప్రయత్నిస్తూ ఉంటాడు. ఈ ప్రయత్నంలో అనేకమైన వాటిని అవసరాలుగా నిర్ణయించుకొని వాటిని పొందేందుకు యత్నిస్తూఉంటాడు. అవి ఎన్నోగా కనిపించవచ్చు. కాని విశ్లేషించి విభజిస్తే అవి నాలుగు విధాలుగా తెలుస్తాయి. ప్రతి పురుషుడు ప్రయత్నించి పొందాలనుకొనే ఈ ప్రయోజనములను పురుషార్థములు అంటారు. అవియే ధర్మార్థ కామ మోక్షములు. చతుర్విధ పురుషార్థములు అంటారు. వీటిని మళ్ళీ రెండు భాగాలుగా విభజిస్తే (1) అర్థకామాలు (2) ధర్మమోక్షాలు. అర్థకామాలు అన్ని ప్రాణులలో గోచరి స్తుండగా, ధర్మమోక్షాలు మానవులకే సంబంధించి ఉన్నాయి.

అర్థం:-

తమ మనుగడకు ఏది అవసరమని జీవులు భావించడం జరుగుతుందో, ఏది లేకపోతే తమ జీవితం కొనసాగదనే అభిప్రాయం కలుగుతూ ఉందో, దేనివలన భద్రత లేని తమ బ్రతుకుకు రక్షణ లభించడం జరుగుతుందని తలంచుచున్నారో అది 'అర్థ' మనే పురుషార్థంగా ఉంది.

దేహం నిలబడేందుకు ఆహారం కావాలి. దేహం వసించేందుకు ఇల్లు కావాలి. దేహాన్ని కప్పుకునేందుకు వస్త్రం కావాలి. ఇదంతా రక్షణలేని తన జీవితానికి రక్షణగా మనిషి భావిస్తాడు. వాటిని పొందేందుకు యత్నిస్తాడు.

ఈ పనిని పశుపక్ష్యాదులు కూడా చేస్తున్నాయి. మనిషి ఇల్లు నిర్మించుకొంటే, పక్షి గూడు కట్టుకుంటూ ఉంది. ఎలుక బొరియలు చేసుకుంటూ ఉంది. పాము పుట్టను నిర్మించుకుంటూ ఉంది. వండిన ఆహారాన్ని మనిషి తింటూ ఉంటే, వంటబట్టే ఆహారాన్ని జంతువులు తింటున్నాయి.

వీటికై మానవునితో పాటు పశుపక్ష్యాదులు కూడా అన్వేషిస్తూ ఉన్నాయి. సాధిస్తూ ఉన్నాయి. అయితే ఇక్కడ ఒక్కటే తేడా. నిలువ చేసుకొని జంతువులు తాత్కాలికంగా తృప్తి చెందుతున్నాయి. ఎంత నిలువ జేసుకున్నా మనిషి తృప్తి నెరుగడు.

ఈ అర్థమనే పురుషార్థ సాధన ద్వారా మనిషి అభద్రత నుండి బయట పడలేక పోతున్నాడు. ఒంటికి భద్రత కావాలని ఇంటిని నిర్మించుకున్నాడు. ఇంటికి ఒంటికి రెంటికి భద్రత లేదని తేలిపోగానే మళ్ళీ నిరాశలో కూరుకుపోతున్నాడు.

అర్థాన్ని మనిషి సంపాదించవచ్చు. కాని దానివలన జీవితము సమర్థవంతము కాదని పశుపక్ష్యాదులకు తెలియదు. మనిషి తెలుసుకుంటాడు.

కామం:-

'రక్షణ' అనేది 'అర్థం' అనే పురుషార్థానికి సంబంధించిన విషయం కాగా, 'సుఖం' అనేది 'కామం' అనే పురుషార్థానికి సంబంధించిన విషయం. ఈ సుఖం ఇంద్రియాలకు సంబంధించింది కావచ్చు. లేదా మనసుకు సంబంధించింది కావచ్చు. లేదా హృదయానికి సంబంధించినది కావచ్చు.

దేహాన్ని రక్షించుకోవడానికి ఆహారాన్ని సంపాదించుకుంటారు. ఇది అర్థం. ఎలాంటి ఆహారము కావాలి అనేది కామం. పడుకోవటం కూడా దేహానికి విశ్రాంతి నివ్వడమే కనుక అదీ రక్షణయే. అర్థమే. లేకపోతే దేహం పాడైపోతుంది. కాని, ఎలాంటి పడకపై పడుకోవాలి అని ఆలోచించటం కామం అవుతుంది.

మనకు రుచులున్నాయి. అభిరుచు లున్నాయి. అభీష్టాలు చిత్ర విచిత్రంగా ఉన్నాయి. కేవలం ఆహారం, నిద్ర, వస్త్రము, గృహముతో మనిషి భద్రతను పొంది తృప్తి చెందలేకపోతున్నాడు. ఉల్లాసాలు, విలాసాలు, సుఖాలు, వినోదాలు, వికాసాలు ఎన్నో వాంఛిస్తున్నాడు. అవన్నీ 'కామం' అనే పురుషార్థం క్రిందికి వస్తాయి.

అందాలు కావాలి. విహారం కావాలి. సాహిత్యం కావాలి. సంగీతం కావాలి. ప్రేమ కావాలి. శృంగారం కావాలి. లైంగిక తృప్తి కావాలి. బాంధవ్యాలు కావాలి. క్రీడలు కావాలి. పువ్వులు కావాలి. నవ్వులు కావాలి. నృత్యం కావాలి. సఖ్యం కావాలి. ఇవన్నీ భద్రత కొరకు కావు కనుక అర్థం క్రిందికి రావు. సుఖం క్రిందికి వస్తాయి. ఇదంతా కామం.

ఇధి కూడా మనుషులకే పరిమితం కాదు. కొద్దో గొప్పో ప్రాణులలో గోచరిస్తూ ఉంది. నెమలి నృత్యం చేస్తుంది. కోయిలమ్మ పాడుతుంది. నక్క ఈల వేస్తుంది. పక్షి మెత్తని గూడు నిర్మిస్తుంది. కోతి ఆడుతుంది. ప్రసవించగనే బిడ్డ మాలిన్యాన్ని గోవు శుభ్రం చేస్తుంది. వాటికీ ఆటలున్నాయి. పాటలున్నాయి. అనుకున్నవి పాడైనపుడు కన్నీళ్ళున్నాయి.

ఈ కామం అనే పురుషార్థ సాధన ద్వారా మనిషి పూర్ణంగా సుఖపడలేక పోతున్నాడు. సుఖాన్నిచ్చే వస్తువు ఎప్పుడూ సుఖాన్ని పంచలేకపోగా, సుఖాన్ని కోరే మనిషి ఒకే వస్తువును అన్ని కాలాలలో, అన్ని ప్రదేశాలలో, అన్ని దశలలో సుఖకారణంగా భావించలేకపోతున్నాడు. ఈ ప్రపంచంలో సుఖ స్థానాలన్నీ క్షయములే. క్షరములే.

ధర్మం:-

ఈ ధర్మం అనే మూడవ పురుషార్థంలో నైతికమైన అవగాహన నిండిఉంది. ఇది వివేకానికి సంబంధించిన విషయం. పశుపక్ష్యాదులు వివేకము లేక, కేవలం సహజాతాలపై ఆధారపడి యాంత్రికమైన జీవనాన్ని కొనసాగిస్తున్నందున అవి ఈ ధర్మమనే పవిత్రమైన పురుషార్థానికి నోచుకోవు.

కామం గాని, అర్థం గాని ప్రాణులలో తలెత్తినపుడు తమ సుఖానికి, లేదా తమ రక్షణకి అన్య ప్రాణులను ఉపయోగించుకోవడం కనిపిస్తూ ఉంటుంది. ఇలా ఇతరులను తమ సుఖాలకు ఉపయోగించుకొనే వాంఛ తీవ్రమైనపుడు అది హింసగా పరిణమిస్తుంది.

ఇలాంటివి జంతు ప్రపంచంలో చూస్తూ ఉంటాము. అలాగని వాటిని తప్పు పట్టలేము. వాటికి వివేకము లేదు. అందుచేత అంతకన్నా భిన్నంగా, గొప్పగా జీవించలేవు.

ఇక్కడే మనిషియొక్క విశిష్టత. మనిషి తన సుఖానికై యత్నించవచ్చు. కాని, అది మరొకరి సుఖాన్ని పాడుచేయకూడదు. నేనెలా సుఖించా లనుకుంటున్నానో ఇతరులు కూడా అలాగే సుఖపడాలి అని అనుకుంటున్నాను. కనుక, నేను సుఖపడతాను. అంతేకాదు. ఇతరుల సుఖానికి అడ్డు నిలవను. ఇది ధర్మం.

నా ఆస్తిని ఇతరులు అపహరిస్తే నేను భరించలేను. కనుక, ఇతరుల ఆస్తిని నేను అపహరించకూడదు. ఇది ధర్మం. ఒకరు నన్ను శారీరకంగా, లేదా మానసికంగా గాయపరిస్తే నేను వ్యథ చెందుతున్నాను. నా విషయంలో వాళ్ళు అలా ప్రవర్తించి ఉండకూడదు అని భావిస్తున్నాను. ఒకవేళ నా పరిస్థితిలో ఎవరున్నా అలాగే ఆలోచిస్తారు. నా విషయంలో ఇతరులు ఎలా ప్రవర్తించకూడదని నేను భావిస్తున్నానో ఇతరుల విషయంలో నేను అలా ప్రవర్తించకుండా ఉండాలి. ఇది ధర్మం.

ఈ విధమైన ధర్మబద్ధమైన జీవనం వలన వ్యక్తికి, సమాజానికి న్యాయం జరుగుతుంది. ఈ ప్రవర్తనను క్రమపరచేందుకు చట్టాలున్నాయి. ప్రభుత్వా లున్నాయి. సెక్యులర్ వ్యవస్థ సరిపోతుంది. కాని, మత ధర్మాలెందుకు? అనే ప్రశ్న ఉద్భవిస్తుంది.

దారి తప్పిన వారిని సంస్కరించేందుకే చట్టాలున్నాయి. ఇవి మానవనిర్మితాలు. కాని, దారి తప్పిన మనిషి చట్టాన్ని కూడా తప్పించుకొనేందుకు ప్రయత్నిస్తాడు. చట్టం కన్ను కప్పేస్తే తాను ఎవరికంట పడకుండా సుఖించవచ్చు అనుకుంటాడు.

చట్టాన్ని తప్పుకోవచ్చు. ధర్మాన్ని, దైవాన్ని తప్పుకోలేవు అంటూ మతం ప్రవేశిస్తుంది. ఈ ప్రపంచంలో స్థూలంగా కర్మలు చేస్తాం. ఆ కర్మలు చేయాలి అనే సంకల్పం మొదట సూక్ష్మంగా ఉంటుంది. ఈ విధంగా ప్రతి కర్మకు స్థూల సూక్ష్మ రూపాలుంటాయి.

స్థూల కర్మకు స్థూల ఫలితమున్నట్లు, సూక్ష్మ కర్మకు సూక్ష్మ ఫలితముంటుంది. ఈ సూక్ష్మ ఫలితాలే పాపపుణ్యాలు. ఇవి మానవుల చేతిలో ఉండవు. దైవాధీనములు. కనుక చట్టాన్ని మనిషి తప్పించుకోవచ్చు. పాపాన్ని తప్పించుకోలేడు. అలాగే చట్టం ద్వారా మనిషికి న్యాయం జరుగకపోవచ్చు. కాని, పుణ్యఫలం నిరీక్షిస్తూనే ఉంటుంది.

కనుక, పశుపక్ష్యాదుల వలె కాకుండా ధర్మబద్ధంగా మానవులు చరించాలి. దైవమే ధర్మాల రూపంలో ఉన్నందున ధర్మాన్ని రక్షించినవారు దైవంచేత రక్షింపబడతారు.

ధర్మజీవనం మనిషికి సుఖాన్ని ప్రసాదిస్తుంది. ఒక పేదవాడు ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడని తెలిసి, అతనికి సాయం చేసి అతడిని బ్రతికించగలిగా మనుకోండి. ఆ క్షణంలో మన మనసు ఎంత సంతోష పడుతుంది? ఇది సుఖం కాదా? అయితే, ఇది కామం లాంటి సుఖం కాదు. అర్థం లాంటి సుఖం కాదు. తనకు వ్యక్తిగతంగా ఏమి లభించకున్నా సుఖించే ఆంతరంగిక స్థితి. ఇది ధర్మం పెట్టిన భిక్ష.

ధర్మం నీడలో నిలిచి సుఖించే పుణ్యాత్ములకు కష్టాలు కూడా సుఖాలుగానే తెలుస్తాయి. ధర్మం కొరకు రాముడు కానలకేగాడు. ధర్మం కొరకు పాండవులు అష్ట

కష్టాలు పడ్డారు. ధర్మం కొరకు శిబిచక్రవర్తి తన దేహాన్నే కోసి పెట్టాడు. ధర్మం కొరకు దధీచి తన శరీరాన్ని దగ్ధం చేశాడు. ధర్మ కార్యాచరణలో తనకు ప్రత్యేక సుఖం అవసరం లేదు. అందరూ సుఖపడే కార్యం కనుక అందరి సుఖంలో తన సుఖం కూడా నిలిచి ఉంది. ఒకవేళ ఆ ధర్మాచరణం వలన తాత్కాలికంగా తనకు అసౌకర్యం ఏర్పడినా, అది పదిమందికి సౌకర్యాన్ని కల్పిస్తున్నదనే భావనలో తన అసౌకర్యం సౌకర్యంగా మారిపోతుంది. సుఖంగా మారిపోతుంది.

రాత్రింబవళ్ళకు తేడా తెలియకుండా, లోకకళ్యాణానికి కంకణం కట్టుకొని మహాత్ములు ధర్మ ప్రచారములో నిమగ్నమై ఉంటారు. ఆహార నిద్రాదులు కూడా మరచిపోతారు. వారి దేహం సహజధర్మాలకు లోబడి అనారోగ్యానికి గురి అయినా వారి హృదయం నిత్యానందంతో పరవళ్ళు త్రొక్కుతూ ఉంటుంది.

ఈ విధంగా అర్థ, కామ, ధర్మాలనే మూడు పురుషార్థములలో ధర్మము విశిష్ట మైనందున దానికి అగ్రస్థాన మిచ్చి ధర్మార్థ కామములనెడి త్రివర్గములలో ధర్మానికే ప్రథమస్థాన మిచ్చారు.

అర్థకామాలను పొందాలనుకొనేవారు ధర్మానికి మొదటిస్థానం ఇవ్వాలి. అప్పుడు అర్థకామాలు మనిషిని బంధించవు. ధర్మంతో కూడిన కామం, ధర్మబద్ధమైన అర్థం సుఖశాంతుల్ని పెంపొందిస్తాయి. ధర్మం తోడుగా ఉన్నది కనుక దైవం తోడుగా ఉన్నట్లే.

ధర్మా విరుద్ధో భూతేషు కామోఽస్మి భరతర్షభ

'ధర్మమునకు విరుద్ధము కాని కామము నేనే' అని శ్రీకృష్ణ పరమాత్మ భగవద్గీత - 7వ అధ్యాయము విజ్ఞాన యోగంలో తెలిపారు.

మోక్షం :-

ఇదొక ప్రత్యేకమైన స్వేచ్ఛ. ప్రతి వ్యక్తి కోరుకునే స్వేచ్ఛ. అందరూ కోరుకునే విడుదల. పంజరంలో బంధింపబడియున్న పక్షి యాతన లాంటిది. ఈ స్వేచ్ఛ లభించడమే మోక్షం, లేదా ముక్తి. అయిష్టమైన దానినుండి విముక్తి.

దుఃఖాన్ని మనం భరించలేము. ఒంటరితనాన్ని భరించలేము. పరిమిత జీవనాన్ని భరించలేము. వాంఛలను భరించలేము. కాలాన్ని భరించలేము. దేశాన్ని భరించలేము. నశింపును సహించలేము. వీటన్నిటి నుండి విడిపడా లనుకుంటాం. ఇదే నిజమైన సుఖంగా భావిస్తాం. అలాంటి సుఖక్షణాలు మన అనుభవంలో ఉన్నాయి. కోరికలు తీరినపుడు మెరుపులా తొంగి చూస్తున్నాయి. నిద్రలో దోబూచులాడుతున్నాయి. ఆ క్షణాలు శాశ్వతంగా నిలిచిపోవాలనే ప్రతి ఒక్కరూ ఆశిస్తున్నారు. ఇదొక ప్రగాఢమైన కాంక్ష. మోక్ష కాంక్ష.

మోక్షమనేది పరిస్థితి కాదు. స్థితి. మరో లోకానికి సంబంధించినది కాదు. ఎప్పుడో ఊడిపడేది కాదు. ఇప్పుడున్నదే. ఇక్కడున్నదే. అది మన స్వరూపము. సచ్చిదానంద స్వరూపము. సాధ్యము, సాధకుడు ఒక్కరేననే సత్యోదయంలో విరజిమ్మబడే ప్రకాశైక స్వరూపము. అదియే ఆత్మ.

న హ్యాత్మా నామ కస్యచిత్ అప్రసిద్ధః ప్రాప్యోవా ఉపాదేయో వా

'ఆత్మ అనేది ఏ కాలములో కూడా ఎవరికి కూడా తెలియనిది కాదు. ప్రయత్నించి పొందదగినది కాదు. అలాగని విడిపడేది కాదు. పొందేదీ కాదు," అని శ్రీ శంకరాచార్య స్వామి గీతాభాష్యంలో తెలిపారు.

స్వతః సిద్ధమై, స్వతః ప్రమాణంగా భాసించే ఆత్మ తానేనని గ్రహించిన చిదానంద స్వరూపునకు ఈ చతుర్విధ ఫల పురుషార్థములకై సంకల్పం చేయవలసిన అవసర మేముంది? అలా సంకల్పించి ఏమి పొందాలి? పొందవలసినది ప్రత్యేకంగా ఏముందని?

తాను సుఖ స్వరూపుడు. అన్యసుఖాలు తన కవసరం లేనందున కామమనే పురుషార్థం అతనికి లేదు. అతడు నిరవయవ సత్తా రూపుడైనందున అభద్రత తెలియని వాడై శోభించుచున్నందున అర్థమనే పురుషార్థం లేనివాడై యున్నాడు. దేశకాలాదులలో చిక్కి పరిణామం చెందే ధర్మమూసలో అనంతుడైన తాను ఒదగలేడు కనుక ధర్మమనే పురుషార్థం తనకు లేదు. ఇక తానే మోక్షరూపు డైనందున మోక్షాపేక్ష కలిగేందుకు అవకాశము లేనందున మోక్షకామి కూడా కాలేడు. కనుక చిదానంద రూపుడైన జ్ఞానికి చతుర్విధ పురుషార్థములు కూడా లేవు. మోక్షము ఉన్నదే గాని యత్నించి పొందేది కాదు.

కర్తవ్యేన సాధ్యశ్చేత్ మోక్షః అభ్యుపగమ్యతే అనిత్య ఏవ స్యాత్

"కర్మ యొక్క ఫలితంగా మోక్షమును సాధించుటకు వీలుపడుతుంది అని భావించేటట్లయితే ఆ మోక్షము అప్పుడు అనిత్యమని తేలుతుంది" అని శ్రీ శంకరాచార్య స్వామి బ్రహ్మసూత్ర భాష్యంలో తెలిపారు.

నీవు శివుడవు. నేను శివుడను. చిదానంద రూపుడను. పూర్ణుడను. ఒకసారి పూర్ణుడ నని తెలిసిన తరువాత ఇక అది కాకుండా మరోవిధంగా ఎలా ఉండగలను? కనుక నేను సదా పూర్ణుడను.

నాకు బంధ మెలావస్తుంది? దుఃఖ మెలావస్తుంది? నాకు బంధాన్ని, దుఃఖాన్ని ఇచ్చే దెవరు? అన్నీ నా మీదనే ఆధారపడి ప్రకాశిస్తున్నాయి. నాపై ఆధారపడి ప్రకాశించేవి నన్ను ఎలా బాధిస్తాయి? నేను సదా ప్రకాశిస్తున్నాను (భాతి). నాకు అన్యంగా తెలిసేవి అన్నియు నాపై ఆధారపడి, నన్ను అనుసరించి ప్రకాశిస్తున్నాయి (అనుభాతి).

ఇది తెలియనంత వరకు బంధము. తెలిస్తే మోక్షము. తెలిసీ తెలియకుండా ఉంటే ముముక్షత్వము. జ్ఞానస్థితిలో తెలియదు అనేది ఉండదు. తెలియదు అనేది లేనపుడు తెలిసింది అనేది మాత్రం ఎలా ఉంటుంది? కనుక మోక్షము కూడా ఆత్మ జ్ఞాన స్థితిలో తెలియనిదే అగుచున్నది.

ముముక్షువు - జిజ్ఞాసువు

కారాగారం నుండి ఖైది విముక్తిని అభిలషించునట్లు ప్రతి వ్యక్తి బంధము నుండి విముక్తిని వాంఛిస్తాడు. ఖైదీకి చాలా అవసరాలు ఉండొచ్చు. ఖైదీ మనసు అనేక ప్రయోజనాలను ఆశించవచ్చు. కాని, అతని మనసులో కదిలే ముఖ్యావసరము, ముఖ్యప్రయోజనము విముక్తియే.

జీవికి అవసరాలు చాలా ఉండొచ్చు. జీవులందరికి అవసరాలు ఉన్నాయి. అభిరుచులు ఉన్నాయి. అందరి మనస్సులలో ఆశలున్నాయి. బంధ విముక్తి వాంఛ అందరిలో ఉంది. ఇదే ప్రధాన వాంఛ. జీవులు ఆశించే ముఖ్య ప్రయోజనము. పరమ పురుషార్థము.

బంధమేమిటి?

(1) నేను చాలా చిన్నవాణ్ణి. పరిమితుణ్ణి. అందరితో ఉన్నాను. అందరి నుండి విడిపడి ఉన్నాను. నా దేహాన్ని మించి నేను లేను. ఇది "అహం" బుద్ధి.

'అహం' - నేను, దేహమైనందున నశిస్తాను. భవిష్యత్తులో ఒకనాడు నశించబోయే నేను గతంలో ఒకనాడు పుట్టినవాణ్ణి. నేను ఉన్నా, పోయేందుకే ఉన్నాను. నేనొక చిన్న గూడు. చిన్నబోయేందుకే ఉన్నాను.

ఇది 'అహం' బుద్ధి. నాలో 'అహం' బుద్దే కాదు. "మమ" బుద్ధి కూడా ఉంది. నేనేమిటో తెలియని నాకు 'నాది' అనేది కూడా ఉంది. 'నేను' దేహాన్ని దాటిపోలేను. "నాది" దేహాన్ని దాటిపోతుంది. నా పొలము, నా కలము, నా ఇల్లు, నా ఇల్లాలు, నా జనం, నా ధనం - ఇదంతా 'అహం' బుద్ధి కాదు. 'మమ' బుద్ధి.

'అహం' గా నేను అల్పం. 'మమ'గా నాకున్నది కూడా అల్పమే. ధనం ఉంది; కావలసినంత లేదు. ఇల్లు ఉంది; ఉండాలనుకున్నట్లు లేదు. తిండి ఉంది; తినాలనుకున్నట్లు లేదు. పెళ్ళయింది; పిల్లలు లేరు. పిల్లలున్నారు; వాళ్ళు చదవరు. పెద్ద చదువులు అభ్యసించారు; గొప్ప ఉద్యోగాల నాశించి దూరమయ్యారు. సౌకర్యాలన్నీ ఉన్నాయి; సుఖాలు లేవు. ఇదంతా ఏమిటి? బ్రతుకులో అందమా? కాదు. బంధము. మనస్సును పిండేది ఏదైనా బంధమే. దుఃఖాన్నందించేది ఏదైనా బంధమే. ఈ బంధాన్ని ఎవరూ భరించలేరు. భరించలేని దాని నుండి విడుదలను వాంఛించటం సహజం. ఇదే బంధ విముక్తి. జీవులందరు ఆశించే బంధ విముక్తి.

(2) నేను చాలా విషయాలు తెలియని వాణ్ణి. అజ్ఞానిని. నాకు తెలిసింది చాలా తక్కువ. అంతకు మించి చూచే శక్తి లేనివాణ్ణి. తెలిసిన దానితో తృప్తి చెందలేను. తెలియని దానిని తెలుసుకోలేను. తెలుసుకోవలసింది ఎంతో ఉంది. నేను జన్మించి చాలా కాలమైంది. ఇంకెంతో కాలం జీవించలేను.

తెలియనివి నాకు ఎలాగూ తెలియదు. తెలిసిన వాటిలో మళ్ళీ తెలియనిది ఎంతో ఉంది. ఒకవ్యక్తి నాకు తెలుసు. అతని వ్యక్తిత్వం నాకు అర్థం కాదు. మనిషి నాకు పరిచితుడే. అతని మనసు నాకెప్పుడూ అపరిచితమే. నలభై సంవత్సరాల కుటుంబ జీవితంలో ఒకనాడు భార్యయొక్క విచిత్ర భాషణము, ప్రవర్తనము భర్తకు విస్మయాన్ని కలిగిస్తుంది. ఇలాంటి ప్రవర్తన కూడా ఉంటుందని ఈ నలభై సంవత్సరాలలో నేను ఊహించలేక పోయాను అనుకుంటాడు. భర్త ప్రవర్తన చూచి భార్య కూడా అలాగే అనుకుంటుంది.

మన కళ్ళముందే పుట్టిన పిల్లల్ని గూర్చి మనకంటే బాగా తెలిసిన వారు ఎవరున్నారు అనుకుంటాం. ఉన్నపళంగా ఒక క్షణాన వారి వింత ప్రవర్తనకు విస్మయము చెంది నా బిడ్డలేనా? అనుకుంటాం. చిన్న చిన్న వాటిలో కూడా మనకు తెలియని విషయాలు చాలా ఉంటాయి. ఇంతకీ మన దేహాన్ని గురించే మనకు క్షుణ్ణంగా తెలియదు.

మబ్బులు కనిపిస్తూనే ఉంటాయి. అవి ఎప్పుడు కురుస్తాయో తెలియదు. ఆహారం తింటూనే ఉంటాం. వాటిలో ఏఏ పదార్థాలున్నాయో తెలియవు. జ్వరంతో ఉన్నట్లు తెలుస్తుంది. అది మలేరియానో, టైఫాయిడో, మరొకటో తెలియదు. తలపై వెంట్రుకలు ఉన్నాయి. ఎన్నున్నాయో తెలియదు. దంతాలున్నాయని తెలుసు. అవి ఊడిపోతాయనీ తెలుసు. ఎప్పుడు ఊడుతాయో తెలీదు.

ఇలా నాకు ఎన్నో తెలియవు. ఇంతకీ వీటన్నిటిని తెలియనివిగా గుర్తించే నేనెవరో కూడా నాకు తెలియదు. ఇదంతా ఆంతర్యంలో అలజడి. ఆవేదన. బాధ. అదియే బంధము. ఈ బంధము నుండి కూడా విడిపడాలని మనిషి వాంఛిస్తూ ఉంటాడు.

(3) నేను ఆనందంగా లేనని నాకు తెలుసు. ఒక క్షణాన ఆనందంగా ఉన్నా మరొక్షణాన ఆనందంగా ఉండను. ఉండలేను. ఒక ప్రదేశములో హాయిగా ఉంటే మరో ప్రదేశములో ఉండలేను. హాయిగా ఉన్న ప్రదేశములో కూడా అన్నికాలాల్లో హాయిగా ఉండలేను.

సుఖపడేందుకు ఏవేవో కావాలనుకుంటాము. వాటిని పొందేందుకు ప్రయత్నిస్తాము. పొందలేకపోతే, సుఖం చేయి జారిపోయిందనుకుంటాము. పొందితే, సుఖాన్ని చేజిక్కించుకోలేకపోగా, సుఖ కారకములు ఇవి కావు, మరేవో ఉన్నాయని నిర్ణయిస్తాం.

ఇప్పటి వరకు పొందిన వాటితో సుఖాన్ని పొందలేకపోయాం. ఇకమీదట పొందే వాటితో కూడా సుఖపడలేము అని తెలుస్తూనే ఉంది. ఇదొక అసంతృప్తి. దుఃఖము. బంధము. ఈ బంధము నుండి కూడా విముక్తిని పొందాలని ప్రతి మనిషి అభిలషిస్తూ ఉంటాడు.

బంధము - ముక్తి

ఇంతకీ జీవికి బంధమున్నట్లేనా? ఉన్నది అంటే బంధమున్నదని అర్థము. ఉన్నది అంటే సత్యము. బంధము సత్యమైతే, సత్య వస్తువు ఎప్పుడూ నశించదు కనుక బంధము

మనిషికి దూరం కాదు. ఇక బంధ విముక్తి ఏమిటి? కాని, విముక్తులైన ఆప్తకాములు ఎందరో ఉన్నారు. వారందరూ మహాత్ములే.

కనుక బంధమును సత్యమని అంగీకరించలేము. సత్యము కానిది అసత్యమై ఉండాలి. అసత్యమైనది అంటే, లేనిది అని అర్థము. లేని దానిని తొలగించ నవసరం లేదు. ఉన్నదైతే తొలగించాలి గాని గగన కుసుమములా లేని దానిని తొలగించే ప్రసక్తి ఉండదు. లేనిది ఉన్నట్లు గోచరించింది. ఉన్నదానిని తెలుసుకొంటే లేనిది లేనట్లే పోతుంది.

ఒకటి ఉన్నది అంటే దానికి సంబంధించిన జ్ఞానం కూడా ఉండాలి. వస్తువుకు సంబంధించిన జ్ఞానం కలిగితే వస్తువేమిటో తెలిసిపోతుంది. ఆత్మ సత్యము. అది నీవే. ఆత్మకు బంధము లేదు. అది నిత్యముక్తము. కనుక నీవు సదా బంధరహితుడవే. నిత్యముక్తుడవే.

ఆత్మ ఉన్నదే. కానున్నది కాదు. కనుక పొందదగినది కాదు. పొందే ఉన్నట్లు తెలియదగినది. ఇదియే జ్ఞానము. ఈ జ్ఞానంతో ఆత్మ తెలుస్తుంది. కనుక ఇది ఆత్మ జ్ఞానము. వేదాంత శాస్త్రము ద్వారా లభ్యము. గురుబోధతో సిద్ధము. సిద్ధాత్మను పొందగోరువాడు ముముక్షువు. మోక్షకామి.

ఫలత్వ ప్రసిద్ధిరపి మోక్షస్య బంధ నివృత్తి మాత్రాపేక్షా న అపూర్వ జననాపేక్షా !

"మోక్షము అనెడి ప్రసిద్ధ జ్ఞాన ఫలము బంధ విముక్తియే గాని నూతనమైన దానిని సృష్టించుట కాదు" అని శ్రీ శంకరాచార్య స్వామి బ్రహ్మసూత్ర భాష్యంలో స్పష్టం చేశారు.

జిజ్ఞాస

'జిజ్ఞాస' అంటే 'జ్ఞాతుం ఇచ్ఛ' - అంటే తెలుసుకొనే కోరిక. ప్రతి విషయంలోను మనకు జిజ్ఞాస ఉంది. ప్రపంచంలో ఏం జరుగుతున్నదో తెలుసు కోవాలనే జిజ్ఞాస మనలో ఉంది. అందుకే ప్రతి దినము పత్రిక చదవటం అవసరంగా పెట్టుకున్నాం. కొత్త విషయాలను తెలుసుకోవాలని అభిలషిస్తాం. అన్వేషిస్తాం. అభ్యసిస్తాం. పాట వింటే పాడాలని ప్రయత్నిస్తాం. నాలుగు పుస్తకాలు చదివిన తరువాత ఒకటి వ్రాయాలని ప్రారంభిస్తాం. ఆ పుస్తకం ఎందరి మస్తకాలను పాడు చేస్తుందా? అని కూడా ఆలోచించం. జిజ్ఞాస అలాంటిది. అదొక దురద. ఏం జరుగుతుందనే ఆలోచనే లేకుండా గోకడమే ప్రధానంగా కలది.

జిజ్ఞాస కలవాడు జిజ్ఞాసువు. మరి, ప్రపంచంలో జిజ్ఞాస లేనివారెవరు? అందరూ జిజ్ఞాసువులే. కొందరిది సత్య జిజ్ఞాస. మరి కొందరిది మిథ్యా జిజ్ఞాస. ఇది చాలా జాగ్రత్తగా అర్థం చేసుకోవలసిన విషయము.

సత్య మిథ్యలు

ఉన్నది సత్యం. ఉన్నట్లున్నది మిథ్య. మిథ్య సత్యము కాదు. మిథ్యకు సత్యము ఆధారము. సత్యము లేనిదే మిథ్య ఉండదు. మిథ్య లేకపోయినా సత్యం ఉంటుంది.

ఉన్నది రజ్జువు. ఉన్నట్లున్నది సర్పము. సర్పము సత్యము కాదు. సర్పానికి రజ్జువు ఆధారము. రజ్జువు లేనిదే సర్పము ఉండదు. సర్పము లేకపోయినా రజ్జువు ఉంటుంది.

సత్యం తెలిస్తే, మిథ్య సత్యం కాదని తెలుస్తుంది. మిథ్య తెలిస్తే, మిథ్య తెలుస్తుందే గాని సత్యం తెలియదు. సత్యం తెలిసినపుడు మిథ్య ప్రత్యేకంగా లేదు. మిథ్య కూడా సత్యమే. కాని సత్యం మిథ్య కాదు.

రజ్జువు తెలిస్తే, సర్పము రజ్జువు కాదని తెలుస్తుంది. సర్పము తెలిస్తే, సర్పం తెలుస్తుందే గాని రజ్జువు తెలియదు. రజ్జువు తెలిసినపుడు సర్పం ప్రత్యేకంగా లేదు. సర్పము కూడా రజ్జువే. కాని రజ్జువు సర్పము కాదు.

సత్యము తెలిస్తే సర్వం తెలుస్తుందా?

ఇదొక గందరగోళం. ఆత్మజ్ఞానము అంటే సర్వానికి సంబంధించిన జ్ఞానము కనుక కాశ్మీరులో విదేశీ దుండగులు ఎందరున్నారో ఆత్మజ్ఞానిని చెప్పమనండి అనేది ఒక వాదన.

ఆత్మ సత్యము. సత్యమే సర్వము. కనుక ఆత్మే సర్వము. ఆత్మ వేరుగా సర్వము వేరుగా తెలియటం ఆత్మజ్ఞానము కాదు. ఆత్మయే సర్వము అనేది ఆత్మజ్ఞానము.

కనుక, మిథ్యా జ్ఞానికి ఆత్మజ్ఞానము ఉండదు. ఆత్మజ్ఞానికి ఆత్మజ్ఞానమే ఉంటుంది. ఆత్మజ్ఞానికి నామ రూపాలు ప్రత్యేకంగా లేవు. నామరూపాలు కూడా అతనికి ఆత్మయే. కాని, ఆత్మ నామరూప రహితం.

నిరాకృత సర్వ నామరూప కర్మ పరమార్థాత్మ వస్తు విషయం జ్ఞానం అమృతత్వ సాధనమ్.

"పరమాత్మ వస్తువునందు సమస్తములైన నామ రూపములు, కర్మలు నిరాకృతములు. అట్టి నిర్విశేష ఆత్మజ్ఞానమే మోక్ష హేతువు" అని శ్రీ శంకరాచార్య స్వామి ఐతరేయోపనిషద్భాష్యంలో ప్రవచించారు.

కంప్యూటర్ జ్ఞానము లేనంత మాత్రాన ఆత్మజ్ఞాని జ్ఞానము బాధితం కాదు. సర్ప జ్ఞానము లేదని రజ్జు జ్ఞానాన్ని శంకింప పనిలేదు. సావధానంగా అర్థం చేసుకోవాలి.

ప్రమాణ సిద్ధం – స్వతః సిద్ధం

"ప్రమాకరణం ప్రమాణం" జ్ఞానమును కలిగించునది ప్రమాణము. ప్రమాణం ఉంటే ప్రమ (జ్ఞానం) కలుగుతుంది. ఆత్మజ్ఞానము విషయంలో శాస్త్రము ప్రమాణము. అంటే శాస్త్రము వల్ల ఆత్మ ప్రాప్తిస్తుంది అని కాదు.

ఆత్మ స్వతఃసిద్ధము. స్వతఃసిద్ధాత్మ అన్య ప్రమాణాలచేత పొందబడదు. శాస్త్రాధ్యయనము చేయకముందు ఆత్మ లేకుండా ఉండి, శాస్త్రాధ్యయనము తరువాత క్రొత్తగా పుట్టలేదు.

న హ్యాత్మా ఆగంతుకః కస్యచిత్ స్వయం సిద్ధత్వాత్

"ఆత్మ ఎవరికి ఆగంతుకము కాదు; స్వతః సిద్ధమైనదియే" అని శ్రీ శంకరాచార్యస్వామి బ్రహ్మసూత్ర భాష్యంలో ప్రబోధించారు.

ఆత్మ ఉన్నదే. అంతే గాదు. ఆత్మకు సంబంధించిన అజ్ఞానము మనకు ఉంది. అజ్ఞానము వలన అధ్యాస కలుగుతుంది (రజ్జు సర్పవత్). అధ్యాస అనర్థాలను సృష్టిస్తుంది.

ఆత్మజ్ఞానము అధ్యాసను తొలగించేందుకు లేదు. అజ్ఞానమును నివృత్తి చేసేందుకుంది. జ్ఞానవృత్తి అజ్ఞానవృత్తిని ధ్వంసం చేస్తుంది. స్వతః సిద్ధాత్మ స్వప్రకాశమై శోభిస్తుంది. ఈ విధంగా శాస్త్రము ఆత్మ విషయంలో ప్రమాణము. కనుక ప్రమాణమును అపేక్షించే ముముక్షువు జిజ్ఞాసువు అవుతాడు.

జిజ్ఞాసువు ముముక్షుత్వాన్ని కోల్పోతాడా?

మోక్షాన్ని వాంఛించేవాడు ముముక్షువు. సర్వబంధ విముక్తియే మోక్షము. ఆత్మ నిత్యముక్తము. ఈ విషయంలో జ్ఞానమును వాంఛించువా డైనందున ముముక్షువు జిజ్ఞాసువు అయ్యాడు.

నేను జ్ఞానాన్ని పొందాలి అనుకొనే వ్యక్తికి ఆత్మ జ్ఞానమే అవసరము కాదు. కాని, ముముక్షువుకు ఆత్మ జ్ఞానమే ప్రధానం కాని అన్య జ్ఞానములు కావు. ఈ భేదాన్ని మనం అర్థం చేసుకున్నట్లేనా?

కాని, దురదృష్టం ఎలా ఉంటుందో తెలుసా? "నేను జిజ్ఞాసువును. జ్ఞానమే నాకు ప్రధానం. కర్మలు బంధహేతువులు. పూజలెందుకు? జపమెందుకు? మనో వ్యాపారమైన ధ్యానమెందుకు? ధ్యానం చేసే మనసుకు ఆధారమైన ఆత్మయే నేను." ఇలా మారుతుంది మాయా జీవితం.

ఇప్పుడు ఒకవేళ అతనిలో ఉంటే (అదీ సందేహమే) జిజ్ఞాస ఉండొచ్చు. ముముక్షుత్వం మరుగున పడిపోయింది. ముముక్షుత్వం లేని జిజ్ఞాస వలన కలిగే జ్ఞానం ఏదైనా కావచ్చు. కాని మోక్ష జ్ఞానం మాత్రం కాదు. బంధ విముక్తి మోక్ష జ్ఞానము వలన కలుగుతుందే గాని మరో విధంగా కలగదు.

నీవు ముముక్షువు వై జిజ్ఞాస సాగించినపుడే నీవు వేదాంత విద్యార్థివి. ఈ విషయాన్ని నీవు మరవకూడదు. నీవు ముముక్షువు వనే స్మృతి నీకు సదా ఉండాలి.

విస్మృతి మనస్సుకు సహజం. కనుక స్మృతి మనస్సుకు అవసరం. ఈ దివ్య స్మృతిని మదిలో సదా నిలిపేందుకే శ్రుతులతో పాటు స్మృతి పురాణాదులు ఆవిర్భవించాయి. ఆ వైభవాలను దర్శింప చేసేందుకు శ్రీ శంకరాచార్య స్వామి కరుణా హృదయం ఆలయమై భాసించింది.

అనాచారం అనంగీకారం

ఆచారహీనుడు ఆధ్యాత్మిక రంగానికి అనర్హుడు. జగత్కారణమైన పరమేశ్వరుని జగత్తుకన్నా వేరుగా భావించే భావ దారిద్ర్యం దూరం కావాలంటే అనుక్షణము మనస్సు పరమేశ్వర చైతన్యమునకు దూరం కాకుండా ఉండాలి.

ఆలయాలకు వెళ్ళాలి. పూజ చేయాలి. జపం చేయాలి. ధ్యానం చేయాలి. సంకీర్తన చేయాలి. స్వాధ్యాయం సాగించాలి. విచారము కొనసాగించాలి. ఇవన్నీ నీకు పరమాత్మను జ్ఞాపకం చేస్తాయి.

నీవు ప్రతిమను దర్శిస్తావు. ఆ ప్రతిమ ఎవరిదో కాదు. పరమాత్మది. నీవు "ఓం నమో భగవతే వాసుదేవాయ" అనే ద్వాదశాక్షరీ మహామంత్రాన్ని జపిస్తావు. ఆ మంత్రము ఎవరిదో కాదు. భగవంతునిది. ఇది ముముక్షువైన జిజ్ఞాసువుకు మాత్రమే తెలుసు. అహంకార ప్రేరితుడై తనలో ముముక్షువును మాయం చేసుకున్న దురదృష్ట జిజ్ఞాసువుకు అర్థం కానేకాదు. అయినా అలవాటు ప్రకారం, మరో మార్గం తోచక అలాంటి వాడు కూడా వేదాంతం పలుకుతాడు. ఇది నిజవేదాంతం కాదు. దీనికి చాలా ముద్దు పేర్లున్నాయి. అసలు పేరు మెట్ట వేదాంతం. దక్షిణాంధ్రలో దీనిని కలవాయి వేదాంతం అంటారు. కోస్తాంధ్రలో గునుపూడి వేదాంతం అంటారు. ఏమీ చేయనవసరం లేదు అనే వ్యర్థప్రసంగి నిష్క్రియత్వ చైతన్యమై భాషించటం కాదు. వాగుడుకాయ అని ప్రదర్శించుకోవటమే. ఏమీ చేయకుండా ఉండటానికి మనిషెందుకు? శవం స్థితి అదే కదా!

సాము మరువకు – నేల విడవకు

బ్రహ్మజిజ్ఞాస జ్ఞానప్రదం. పవిత్రం. సదా ఆత్మజిజ్ఞాసను కొనసాగించాలి. కాని ముముక్షుత్వాన్ని కోల్పోకూడదు. జ్ఞానమార్గంలో చరించే పుణ్యాత్ముడు ముక్త పురుషుడయ్యే వరకు భక్తిని విస్మరించకూడదు. ఇది శాస్త్రీయ దృక్పథం. శాస్త్రోక్తం. శాస్త్రప్రమాణం. బ్రహ్మనిష్ఠుల ఆదేశం.

ప్రాగాత్మ జ్ఞానాత్ ప్రవృత్త్యుపపత్తేః

"ఆత్మజ్ఞానోదయానికి పూర్వము కర్మానుష్ఠానము సమంజసము" అన్నారు బృహ దారణ్య కోపనిష ద్భాష్యంలో శ్రీ శంకరాచార్య స్వామి.

తీపి తోడుండాలి

పిండిలో తీపి కలిస్తే పదార్థం మధురంగా ఉంటుంది. శక్తి పిండివల్లనే వస్తుంది. చక్కెర పిండిని మధురంగా మార్చుతుంది. పిండి తినగలం. తియ్యగా తినటంలో హాయి ఉంటుంది. ఆహ్లాద ముంటుంది. ఆనందం ఉంటుంది. ఈ మాధుర్యాన్ని చవిచూచిన వారు కనుకనే మహాత్ములందరు జ్ఞానంతో పాటు భక్తిని జోడించి బోధించారు. ఈ విషయంలో శ్రీ శంకరాచార్య స్వామి మహోత్కృష్టంగా శోభిస్తారు.

భక్తి ఏదో కాదు. పరమోత్కృష్టమైన ప్రేమ. స్వరూపాను సంధానం. స్వాత్మానుభవ తన్మయత్వం. ఈ పవిత్ర బుద్ధి అధ్యయనంలో తోడుగా ఉండాలి. ఆలోచనలతో కలిసి నడవాలి. ధ్యానంలో నీడగా నిలవాలి. సంకీర్తనములో సమరసం కావాలి. దృగ్దృశ్య నావకు చుక్కాని కావాలి. ఊరేగే మనసుకు ఊపిరై ఉండాలి. ఆరాధనా హృదయంతో దర్శిస్తూ ఆరాధించండి. ఆ దివ్యారాధనలో ఆప్తకాములై శోభించండి.

సర్వేజనా స్సుఖినో భవన్తు !

తరువు - బ్రతుకు తెరువు

అలసిన బాటసారికి చెట్టు నీడ నిస్తుంది. పూలు రాల్చి అతిథిని గౌరవిస్తుంది. పండ్లు పెట్టి విందు చేస్తుంది. ఇది చెట్టు యొక్క దానగుణము. ఒకరి బాధను తీర్చేందుకే బ్రతుకు ఉంది అంటుంది తరువు. ఇదియే తరువు నేర్పిన బ్రతుకు తెరువు.

"స్వామిజీ! మీ బోధలతో మా బాధల్ని మరచి పోయాం. హాయిగా ఉన్నాం;" అని కొందరు పలికినపుడు పిలిచినట్లు వచ్చి చెట్లు నా కళ్ళముందు నిలుస్తాయి. మెల్లగా ఊగుతాయి. నా హృదయాన్ని చల్లగా ఊపుతాయి.

జ్ఞానమే మోక్షము

ఎన్నో కోరికలను పట్టుకొని వ్రేలాడేవారు మనుష్యులు. ఒకే కోరికను విడువకుండా పట్టుకొని ఉండేవారు ముముక్షువులు. ఇక్కడే శ్రేయోమార్గము ప్రేయో మార్గమునుండి దూరమై నడక సాగిస్తున్నది.

మోక్షాపేక్ష ఒక్కటే గలవారు ముముక్షువులు. సాధకులమైన మనం ఆలోచించ వలసింది భగవంతునికన్నా ముందుగా ఒక విషయముంది. అది ప్రశ్నార్థకం. మనం ముముక్షువుల మేనా? 'కాము' అనే సమాధానం వస్తే, ఆ తరువాత భగవంతుడు అనే పదానికి మన జీవితంలో అర్థం లేదు. ఒకవేళ పుణ్యము తోడై 'అవును' అనే అంతరంగ ధ్వని వినిపిస్తే, మరి, మోక్షమనేది ఏమిటి? అనేది తరువాత ప్రశ్న.

జీవబ్రహ్మైక్యమే మోక్షమని, అది పరమాత్మ కృపతో సాధ్యపడుతుందని చాలా మంది మనకు వంటబట్టించారు. ఇది వెంట నడిచే నీడలాంటి నిజమే గాని వంటబట్టే వెలుగులాంటి సత్యము కాదు.

జీవుడు బ్రహ్మముతో ఐక్యం కావడమంటే, జీవుడు బ్రహ్మముకన్నా వేరుగా ఉన్నాడని అర్థము. ఇక, వీరిరువురి మధ్య కలయిక ఏమిటి? ఒకవేళ, కలయిక అంటేనే రెండిటి మధ్య జరిగేదే కదా! అనే తర్కాన్ని ప్రయోగించినా ఇక్కడ ఉపయోగము కన్పించడం లేదు. సంయోగములో వియోగ మున్నదనే సత్యాన్ని ఎవరూ విస్మరించ లేరు. కనుక జీవబ్రహ్మైక్య మనేది ముముక్షువు వాంఛించదగింది కాదు. వాంఛించినా దానివలన ముఖ్య ప్రయోజనము సిద్ధించదు.

నీవు పరమాత్మకన్నా వేరుగా లేవు. ఒకవేళ ఉంటే, నీవు ఉంటావు. అంతే. పరమాత్మ అనే పదానికే అర్థం మిగలదు. నీకన్నా వేరుగా పరమాత్మ ఉంటే అతడు పరిమితు డౌతాడు. పరిమితుడు పరమాత్మ అని మనం ముద్దుగా పిలుచుకున్నా, అది మొద్దులకు, ఎద్దులకు అర్థం కావలసిందే గాని శుద్ధబుద్ధులకు వ్యర్థమే.

నీవు పరమాత్మకన్నా వేరుగా ఎప్పుడూ లేవు. ఈ సత్యాన్ని గుర్తించి జీవించడమే మోక్షము. ఇది ఉన్నదే. ఉన్నదానిని ఎవ్వరూ ఇవ్వలేరు. ఈ విషయంలో పరమాత్మ కూడా నిస్సహాయుడే. ఇది చాలా జాగ్రత్తగా అర్థం చేసుకోవలసిన విషయం. తొందర పడితే తొంగి చూచేది ముందర ఆందోళనే.

మోక్షము ఉన్నదా? లేనిదా? లేనిది వచ్చినా ఉండదు కనుక అలాంటిది మోక్షము కాలేదని గుర్తించాము. గ్రహించాము. ఇక ఉన్నదేనని అంగీకరించినపుడు ఉన్నదానిని ఇవ్వడమేమిటి? అనేది మీమాంస.

నా ముఖాన ముక్కు ఉంది. ముక్కు లేదేమోనని నేను భావించి, నాసిక మివ్వమని ప్రార్థించితే నారాయణుడైనా ఏం చేయగలడు? ముక్కును మాత్రం ఇవ్వ లేడు. ఎందుకని? అది ఉన్నదే కనుక. కాకపోతే, అది అలా ఉన్నది అని తెలియజేయ గలడు. ఇది జ్ఞానము. జ్ఞానము కలిగితే మోక్షము సిద్ధించినట్లే. ఉన్నదానిని 'లేదు' అని అజ్ఞానదశలో భావించినా, జ్ఞానము ద్వారా ఉన్నది ఉన్నట్లు తెలిసినపుడు 'లేదు' అని ఇంతవరకు భావించిన అయోమయస్థితి నుండి విడిపడడము జరుగుతోంది. ఇదే మోక్షము. కనుకనే

జ్ఞానా దేవ తు కైవల్యం

'జ్ఞానము ద్వారానే మోక్షము' అని శాస్త్రము ధ్రువపరచింది. మరి,

ఈశ్వరానుగ్రహా దేవ పుంసా మద్వైత వాసనా

'పరమాత్మ అనుగ్రహంతోనే అద్వైత వాసన కలుగుతుంది' అని శాస్త్రము ప్రవచించింది కదా! అలాంటప్పుడు మోక్షమును పరమాత్మ అనుగ్రహించడమే కదా! అని చాలామంది పలుకుతుంటారు. పలుకుల కేముందిలెండి! అవి చిలుకలకు కూడా సాధ్యాలే.

ఇక్కడ ఒక్క విషయాన్ని జాగ్రత్తగా పరిశీలించాలి. ఈశ్వరానుగ్రహం వలన అద్వైత వాసన కలుగుతుంది అన్నారే గాని మోక్షము సిద్ధిస్తుంది అని చెప్పలేదు.

పరమాత్మను పూజించాలి. ధ్యానించాలి. కీర్తించాలి. స్మరించాలి. ఇవన్నీ చేయాలి. ఇవి అంతఃకరణ శుద్ధికి ఉపకరిస్తాయి. జ్ఞానమును పొందేందుకు అనుకూల మైన వాతావరణాన్ని ఆంతర్యంలో తయారు చేస్తాయి. ఆ తరువాత, గురుబోధ ద్వారా 'తత్త్వమసి' వాక్యము విశ్వరూపం దాల్చి ముందు నిలుస్తుంది. జ్ఞానం కలుగుతుంది. జ్ఞానము ద్వారా ఉన్న మోక్షము తెలిసివస్తుంది. ఇది స్థితి. కాదెన్నడూ పరిస్థితి. ఈ సత్యము జీర్ణమైన నాడే జీవితంలోని ఏకైక సమస్యకు శాశ్వత పరిష్కృతి. నీడలా వెంబడించిన కల్పిత బంధానికి నిష్కృతి.

జ్ఞానము వలన నీవే బ్రహ్మము - నీవే మోక్షము అని నీకు ఎరుక పడుతుంది. కాని, జ్ఞానము లేకముందు కూడా నీవు బ్రహ్మమువే అయి ఉన్నావు. జ్ఞానము కలిగితే ఈ సత్యము తెలుస్తున్నది. కనుక జ్ఞానము ద్వారా నీవు మోక్షరూపుడవు కాలేవు. మోక్ష రూపమయ్యే వున్నావని తెలుసుకుంటావు. కనుకనే శ్రుతిమాత 'తత్త్వమసి' నీవు అది అయ్యే ఉన్నావని ప్రబోధించింది.

ఇది తెలియక అజ్ఞానంతో దేహాత్మభావాన్ని స్థిరపరచుకొని, 'నేను - నాది' అనే అహంకార మమకారాలను తయారుచేసుకొని అలమటిస్తున్నాము. ఇదొక్కటే అవరోధము. దీనిని నిర్మూలించడమే సాధకుని ప్రథమ కర్తవ్యము.

ఈశ్వరార్పణ బుద్ధితో జీవించి ఈశ్వరానుగ్రహాన్ని పొందడం - అంతఃకరణ దోషాలను నిర్మూలించుకొని, జ్ఞానమును పొందుటకు అనుకూలమైన నైర్మల్యమును సాధించుటకే. కనుకనే 'అహం' భావన నశించేందుకు 'త్వమేవ' భావనను పట్టు కుంటున్నాం.

పరమాత్మకు మనం ఏది సమర్పించగలం? అతడు పరిపూర్ణుడు అయినపుడు నీవు సమర్పించేందుకు అతనికన్నా అన్యంగా ఏముంది? 'నాది' అని ప్రత్యేకముగా నీవు ఏర్పరచు కొనిన 'అహం' భావనను సమర్పించడమే. ఇదే ఈశ్వరార్పణం. రామార్పణం. కృష్ణార్పణం.

ఇది అర్పణ బుద్ధే గాని తర్పణ బుద్ధి కాదు. కార్పణ్య మున్నంతవరకు ఇది సిద్ధించదు. ద్వైత కాలుష్యములో అర్పణాంకురము మొలకెత్తదు. కార్పణ్య దోషముతో కూడిన కాలుష్యమును ముందుగా కడిగేసుకోవాలి. ఆ తరువాతే జ్ఞానమును గురు దేవుని ద్వారా అందుకోగలము.

కర్మయోగం ద్వారా కల్మషాలను కడిగేసుకుందాం. భక్తియోగం ద్వారా పవిత్రతను సిద్ధించుకుందాం. 'అహం' భావనను త్యజించి, గురుబోధ ద్వారా జ్ఞానాన్ని గ్రహించి తరించిపోదాం.

పదండి. ముందుకు కాదు. ముందువెనుకలు అర్థంగాని చోటికి.

మనిషికి తృప్తి ఎందుకు లేదో తెలుసా? ఏదో తాను పొందవలసింది ఉంది కనుక. అది ఏమిటి? అది తెలియటమే జ్ఞానం. పోగొట్టుకొనే దానిని పొందినా తృప్తి ఉండదు. ఏది ఈ ప్రపంచంలో పొందినా దానిని పోగొట్టుకోవలసిందే.

కనుక, మనిషి పొందాలనుకుంటున్నది తననే. అంటే, తనకు సంబంధించిన జ్ఞానాన్ని. అదియే ఆత్మ జ్ఞానము. ఈ ఆత్మజ్ఞానంలోనే అసంతృప్తి ఆవిరై పోతుంది.

గురుశిష్యులు

ఆత్మజ్ఞానము అనేది సమాచారం కాదు. సదాచారమూ కాదు. ఆత్మ స్వరూపానికి సంబంధించిన జ్ఞానము. కనుక ఆచార్యుని ద్వారానే పొందాలి. కనుక ఈ దశలో శ్రద్ధ ప్రముఖ స్థానాన్ని వహిస్తూ ఉంది.

శ్రద్ధావాన్ లభతే జ్ఞానం

అనేది ప్రశస్తమైన వచనం. జ్ఞానార్జనలో ప్రధానమైంది. గురుబోధను అందరూ వింటారు. శ్రద్ధావంతులే గ్రహించగలరు. **(శ్రద్ధయా వస్తు ఉపలభ్యతే).**

అంతఃకరణ శుద్ధి కలిగిన శిష్యునికి గురువు ప్రమాణాన్ని అందిస్తున్నాడు. 'గు' అంటే చీకటి. 'రు' అంటే నిరోధించువాడు. అజ్ఞాన చీకట్లను పోగొట్టేవాడు అయినందున ఆచార్యుడు 'గురు' శబ్దవాచ్య డయ్యాడని గురుగీత నిర్ణయించింది.

చీకట్లో ఉన్న వస్తువు లేనిది కాదు. ఉన్నట్లు తెలియనిది. ప్రకాశంలో స్పష్టంగా ఉన్నట్లు తెలిసేది. అలాగే జ్ఞాన ప్రకాశంలో ఆత్మకు సంబంధించిన అంధకారం దూరం కాగా, ఆత్మ స్వప్రకాశమై శోభిస్తుంది. ఇట్టి జ్ఞానాన్ని గురువు అందిస్తాడు.

ప్రత్యక్షాది ప్రమాణాలకు ఉపమానాది ఉపాయాలకు ఆత్మ అందేది కాదు అని ఇప్పటికే గ్రహించాము. సువర్ణ హారంలా, సముద్ర తీరంలా ఆత్మ మనకు తెలిసింది కాదు.

ఆత్మ అనంతం అంటుంది శాస్త్రం. ఈ ప్రపంచంలో అనంతమనేది ఎక్కడుంది మనం అర్థం చేసుకోవటానికి? కనుక ఈ పదాన్ని గురువు వివరిస్తేనే మనకు అర్థమవుతుంది. దానిని అర్థమయ్యేలా ఎలా బోధించాలో ఆచార్యునికి తెలుసు. అందుకే ఆయన గురువు.

సర్వార్థాన్ గృణాతీతి గురుః

సర్వ అర్థములను వచించి శ్రోతను ఉద్ధరించేవాడు కనుక ఆచార్యుడు గురువు. దేవుడు ఆయనకన్నా వేరు కాడు కనుక ఆయన గురుదేవుడు.

ముముక్షువు శిష్యుడై గురువును సమీపిస్తాడు. అర్థిస్తాడు. ప్రార్థిస్తాడు. గురువు బోధిస్తాడు. గురువులో జ్ఞానమే కాదు దయ కూడా ఉండాలి. శిష్యులపై దయలేని గురువు శ్రమించి బోధించలేడు.

ఆయన దయకు కారణం లేదు. అహేతుకంగా ఉంది. గురువు పూర్ణ పురుషుడు. మన నుండి ఏమి ఆశించి దయ చూపాలి? కనుక ఆచార్యుడు **'అహేతుక దయా సింధువు'** అని కీర్తిస్తూ ఉంటాము. అదే ఆచార్యుని దయ. గురుకృప.

ఆచార్యుడు జ్ఞానరూపుడు. దయామయుడు. బ్రహ్మనిష్ఠుడు. బ్రహ్మవిదుడు బ్రహ్మనిష్ఠుడే. కాని, దయ, గురుత్వమనే రెండు విశేషణాలు ఉపయోగించటం బ్రహ్మవిదుని విషయంలోనే జరుగుతుంది.

దయాలుం - గురుమ్ (దయాసింధుత్వ - గురుత్వే) ఏత ద్విశేషణ ద్వయం

యత్ర సంభవతి తం ఆహ బ్రహ్మ విదుత్తమః ఇతి!

బ్రహ్మనిష్ఠుడు, దయామయుడైన గురుదేవుడు రాగద్వేషముల నుండి పూర్తిగా విడిపడి యున్నాడు. కనుక ఆయన శాంతమూర్తి. ప్రశాంతమూర్తి. కనుక గురునిలయం ప్రశాంత సదనం.

గురువును సేవించాలి. మన సేవలు గురువుకు అవసరమని కాదు. మనలో అహంకారము తలెత్తకుండా ఉండటానికి గురుసేవ అమృతమయము. అట్టి గురువును **సమారాధ్య - సమ్యక్ ఆరాధ్య ఇతి,** చక్కగా సేవించి ఆత్మ స్వరూపమును ఆ పవిత్ర సన్నిధిలో విచారం చేయాలి. **(స్వరూపం మత్వా విచార్య).** తన స్వరూపమును బుద్ధిచే చింతన చేయాలి. ఇలా విచారించిన పిదప ఏ తత్త్వమును తన స్వరూపముగా తెలుసు కొంటున్నాడో అది పరం. నిత్యం. బ్రహ్మము. అదియే నీవు. అదియే నేను.

గురువులు బోధించవచ్చు. బోధించేవా రందరు గురువులు కారు. గురువులు బోధించినా వినేవా రందరు శిష్యులు కారు. శ్రోతలు కావచ్చు. శిష్యులు శ్రోతలే. కాని, శ్రోతలందరు శిష్యులు కారు.

శిష్యులకే ఆచార్యుడు గురువు. తన బిడ్డలకే వ్యక్తి తండ్రి. ఉపాధ్యాయుడు కూడా విద్యార్థులను తండ్రిలాగ చూసుకోవచ్చు. కాని, వాస్తవానికి వారు తన బిడ్డలు కారు. బిడ్డల లాంటివారు కావచ్చు.

గురుశిష్యుల మధ్య ఉండేది అజ్ఞాన బంధం కాదు. పవిత్ర సంబంధం. అది ఇరువురిలోను స్పష్టంగా తెలుస్తుంది. బోధించటంలో గురువులో పవిత్రత తెలుస్తుంది. సేవించటంలో శిష్యునిలో స్పష్టంగా కనిపిస్తుంది.

గురుసేవలో ఉన్నాం. ఆచార్య సేవలో తరించిపోతున్నాం అని అందరూ అంటూ ఉంటారు. దీనికి కొలతబద్ద ఎక్కడుంది? ఎవరికి వారే ప్రమాణం. ఎవరి మనస్సు వారికే కొలతబద్ద.

(1) గురువు బోధించిన విషయం సువిదితంగా ఉండాలి. (2) రజోగుణంతో రాతిబండలా ఉన్న మనస్సు వెన్నలా మెత్తబడాలి. ఈ రెండు ఎవరికి వారిలో గోచరించ గలిగితే, తాము చేస్తున్న గురుసేవ దారి తప్పటం లేదని గుర్తించవచ్చు.

ఏది ఏమైనా గురుసేవ అనేది మనల్ని మనం ఉద్ధరించుకోవటానికే గాని, గురువుకు సేవ చేశామనే అహంకారాన్ని పెంచుకొనేందుకు కాదు అనేది శిష్యులైన ముముక్షువులు గుర్తించాలి.

ఆరోపం - స్వరూపం

'సృష్టం జగత్'. ప్రపంచము సృష్టింపబడింది. కార్యరూపమైనది. **'యత్ కార్యం తత్ సకర్తృకం'.** జగత్తుగా గోచరించునది బ్రహ్మ కార్యమే. బ్రహ్మము సద్వస్తువు కనుక సద్బ్రహ్మ కార్యమైన జగత్తు కూడా సద్రూపమే. సద్వస్తువుకన్నా అన్యమైనది లేదు.

ఉపాదానమునకు భిన్నంగా ఉపాదేయము ఉండలేదు. జగత్తున కంతటికి బ్రహ్మమే ఉపాదాన మైనందున బ్రహ్మము కన్నను భిన్నముగ ఏదియును ఉండుటకు వీలులేదు. **(సర్వోపాదానత్వాత్ బ్రహ్మణః తద్వ్యతిరేకేణ.. కిమపి నాస్తి).**

జగత్తు బ్రహ్మము కన్నను భిన్నంగా లేనపుడు బ్రహ్మ దర్శనానికి జగత్తుకు దూరంగా వెళ్ళనవసరం లేదు. జగత్తును నిరాకరించవలసిన అవసరం లేదు. ప్రపంచమే పరమాత్మ **(బ్రహ్మైవేదం విశ్వం).**

మట్టి దర్శనానికి కుండను భగ్నం చేయనవసరం లేదు. కుండ ఏదో కాదు మట్టే. కుండ నామరూపాలతో ఉంది. నామరూపాత్మకమైన కుండ మట్టికన్నా భిన్నంగా లేదు. మట్టి అధిష్ఠానంగా ఉంది. కుండ ఆరోపితంగా తెలుస్తూ ఉంది. ఆరోపితమైన కుండ అధిష్ఠానమైన మట్టికి భిన్నంగా లేదు **(ఆరోపితస్య అధిష్ఠానాత్ భిన్నతా న).**

కుండ ఎలాగైతే ఆరోపితంగా, కల్పితంగా తెలుస్తూ ఉందో, అలాగే జగత్తు బ్రహ్మమునందు ఆరోపితమై ఉంది. మట్టిపై ఆధారపడి ఉంది కనుక కుండ మిథ్య; మట్టి సత్యము. అలాగే, బ్రహ్మముపై ఆధారపడి యున్నందున జగత్తు మిథ్య; బ్రహ్మము సత్యము.

ఆరోపితమైన వస్తువు అధిష్ఠానానికన్నా వేరుగా ఉండలేదు కనుక కుండ కూడా మట్టే. కాని, మట్టి కుండపై ఆధారపడి లేదు. మట్టి లేకపోతే కుండ ఉండదు. కుండ లేకపోయినా మట్టి ఉంటుంది.

అలాగే, ఆరోపితమైన జగత్తు అధిష్ఠానమైన బ్రహ్మముకన్నా వేరుగా లేదు కనుక జగత్తు కూడా బ్రహ్మమే. **(సర్వం ఖలు ఇదం బ్రహ్మ).** కాని, బ్రహ్మము జగత్తుపై ఆధారపడిలేదు. బ్రహ్మము లేకపోతే జగత్తు ఉండదు. జగత్తు లేకపోయినా బ్రహ్మము ఉంటుంది.

మరి ఈ జగత్తు ఆరోపితం కనుక మిథ్య అని నిర్ణయించే టట్లయితే, ఈ మిథ్యా జగత్తు ఎలా వచ్చింది? ఎక్కడ నుండి వచ్చింది? అనే సంశయం చాలా మందిని పీడిస్తూ ఉంటుంది.

రజ్జు సర్ప న్యాయము

జగత్తు ఎక్కడనుండో ఊడిపడలేదు. ఆరోపితం యొక్క ఆగమనం అనూహ్యం. అధిష్ఠానమే కల్పిత వస్తు రూపంలో గోచరిస్తూ ఉంది.

రజ్జువులో సర్పాన్ని చూడటం అధ్యాస. అది గాని దానియందు అది యనెడి బుద్ధి అధ్యాస **(అధ్యాసో నామ అతస్మిన్ తద్బుద్ధిః).** పాము గాని త్రాటియందు పాము యనెడి బుద్ధి అధ్యాస. ఈ అధ్యాసకు కారణము అజ్ఞానము.

జ్ఞానము లేకపోవటమే అజ్ఞానము. దేనికి సంబంధించిన జ్ఞానము? ఉన్నదానికి సంబంధించిన జ్ఞానము. ఉన్న త్రాడుకు సంబంధించిన జ్ఞానము లేకపోవుట అజ్ఞానము. ఉన్నదానికి సంబంధించిన అజ్ఞానములో లేని దానిని ఉన్నట్లు భావించే ప్రమాదం ఉంది. అదే అధ్యాస. త్రాటిలో పామును చూచే అయోమయ స్థితి.

అధ్యాస వలన భయశోకాదులు కలుగుతున్నందున అధ్యాసను తొలగించాలని చాలామంది అభిప్రాయపడుతూ ఉంటారు. అధ్యాస తొలగితే అజ్ఞానం పోదు. అజ్ఞానం తొలగితే అధ్యాస మిగలదు. అజ్ఞానం తొలగాలి అంటే జ్ఞానం కలగాలి. కనుకనే అధ్యాసను తొలగించే ప్రయత్నం చేయకుండా అజ్ఞానాన్ని నిర్మూలించే ప్రయత్నం వైపు నడక సాగించి వస్తు నిర్ధారణే ప్రధానంగా భావించి శాస్త్రం ప్రమాణమైంది.

(అధ్యాస నివారణార్థం న శాస్త్ర పఠనం - వస్తు నిర్ధారణార్థం శాస్త్ర పఠనం)

రజ్జు నిర్ధారణ జరిగితే రజ్జు జ్ఞానం కలిగినట్లే. రజ్జు జ్ఞానం కలిగితే రజ్జు అజ్ఞానం లేదు. రజ్జువుకు సంబంధించిన అజ్ఞానము లేనపుడు సర్పము ఆరోపించబడే అవకాశమే లేదు. అధ్యాసకు స్థానం లేదు.

కనుక ఆరోపితమైన జగత్తు బ్రహ్మమునందు, రజ్జువులో సర్పము వలె కల్పించబడింది **(రజ్జ్వాం భుజంగమ ఇవ ప్రతిభాసితం వై).** ఆరోపిత జగత్తు అధిష్ఠానమైన బ్రహ్మము కంటె భిన్నంగా లేదు. కనుకనే బ్రహ్మము సత్యము; జగత్తు మిథ్య అని సిద్ధాంతము జరిగినది. **(బ్రహ్మ అధిష్ఠానకం తత్ర - ఆరోపితం తద్వ్యతి రేకేణ నాస్తి ఇతి మిథ్యా ఇత్యేవ ఆవోచత్ - ఇత్యర్థః).**

జ్ఞానోదయంతో అజ్ఞాన చీకట్లు అంతరించాయి. మోక్షం స్వప్రకాశమై భాసిస్తుంది. జ్ఞానం వల్ల మోక్షం రాదు. వాస్తవానికి మోక్షం జ్ఞానరూపంలోనే ఉంది. జ్ఞానం వల్ల అజ్ఞాన నివృత్తి జరుగుతుంది. మోక్షము దేనియొక్క ఫలితమూ కాదు. అది స్వరూప వైభవము. సత్యజ్ఞానానంద స్థితి.

జగత్తు సత్యమా? అసత్యమా?

ప్రపంచము సత్యమా? కాదా? అనేది అనాదిగా నడుస్తున్న జటిలమైన చర్చలలో ఒకటి. ఉన్నది కానిదెలా అవుతుంది? ప్రపంచ మనేది అసలు లేనిదే అయితే, ప్రపంచం సత్యమా? అనే ప్రశ్న ఎలా ఉత్పన్న మవుతుంది? ఇక్కడ ప్రధానంగా ఒక విషయం అర్థం కావాలి. సత్యమనేది ఉంది. అంత మాత్రాన ఉన్నదంతా సత్యం కాదు. ఉన్న దానికి, సత్యంగా ఉన్నదానికి మధ్య గల తారతమ్యం స్పష్టంగా తెలియాలి.

సత్యమంటే ఏమిటి?

జగత్తు సత్యం కాదు అనేవారు అద్వైతులు. జగత్తు సత్యము అని భావించేవారు ఎవరైనను వారు అద్వైతానికి భిన్నమైనవారు. వీరిరువురికి ఎవరి ఆలోచనలు వారి కున్నాయి. ఎవరి వాదాలు వారి కున్నాయి.

జగత్తు సత్యము అని భావించే వారికి ఆధారమేమిటి? (1) ప్రపంచం కనిపిస్తూ ఉండటం (2) అనుభవానికి అందుతూ ఉండటం.

జగత్తు సత్యం కాదని భావించే అద్వైతులకు ఆధారమేమిటి? (1) జగత్తు కనిపిస్తూ ఉండటం (2) అనుభవానికి అందుతూ ఉండటం. ఆశ్చర్యంగా ఉంది కదూ? ఇరువురికి భిన్నాభిప్రాయా లున్నాయి. కాని, వారు చూపే ఆధారాలు ఏకాభిప్రాయంతో తెలుస్తున్నాయి. ఇంతకీ, సత్యమంటే ఏమిటి?

కాలత్రయేపి బాధ రహితం సత్యమ్. మూడు కాలముల యందు ఏదయితే నిషేధింపబడదో అది సత్యము. ఈ నిర్వచనము సక్రమంగా మనస్సు కెక్కితే ఇక్కడికే చాలా సమస్యలు పరిష్కార మవుతాయి. ఒక కాలంలో ఉండి మరొక కాలములో లేనిది బాధితం కనుక సత్యం కాదు. ఒక దేశంలో ఉండి మరొక దేశంలో లేనిది బాధిత మవుతున్నందున అదీ సత్యం కాదు. ఒక వస్తువు మరొక వస్తువు కానందున బాధితం కనుక వస్తువూ సత్యం కాదు. అంటే వస్తువు లేనిదేనా? అలా ఎవరన్నారు? వస్తువు ఉన్నదే. కాని, సత్యంగా ఉన్నది కాదు.

జగత్తు సత్యమా? అసత్యమా?

(1) ప్రపంచం కనిపిస్తూ ఉంది కనుక సత్యము అంటున్నారు అద్వైతులు కానివారు. కనిపిస్తూ ఉంది కనుకనే సత్యము కాదు అనేది అద్వైతుల జ్ఞానం. కనిపించినంత మాత్రాన సత్యము కానవసరం లేదు.

త్రాడులో పాము కనిపించింది; అది సత్యం కాదు. సూర్యుడు కదులుతూ ఉన్నట్లుంది. అది సత్యం కాదు. భూమి అచలంగా, స్థిరంగా ఉన్నట్లు కనిపిస్తూ ఉంది; అది సత్యం కాదు. ఆకాశం నీలివర్ణంతో కనిపిస్తూ ఉంది; అంతమాత్రాన అది సత్యం కాదు. కనుక కనిపించినంత మాత్రాన సత్యం కాదు అనేది నిర్వివాదాంశం.

(2) అనుభవానికి అందుతూ ఉంది కనుక ప్రపంచం సత్యం అంటే సరిపోదు. అనుభవానికి అందకపోతే సత్యం కాదనే దాని భావమా? ఇదే వాస్తవమైతే గాఢనిద్రలో ప్రపంచం అనుభవానికి అందటం లేదు. అనుభవానికి అందటం లేదు కనుక సత్యం కాదని అంగీకరించవలసిందే కదూ!

కనిపించినంత మాత్రాన సత్యం కానవసరం లేదు. మన స్వప్నం కూడా మనకు గోచరమే. అంతమాత్రాన అది సత్యమా?

అనుభవింపబడిన ప్రపంచము సత్యమే అయితే అది గాఢనిద్రలో కూడా అనుభవింపబడి ఉండేది. కనుక, అనుభవానికి అందినది సత్యమా?

విశ్వం సత్యమైతే సుషుప్తిలో ఉండేది. కాని, లేదు. కనుక విశ్వం సత్యం కాదు.

(యది విశ్వం సత్యం భవేత్ తర్హి తత్ విశ్వం సుషుప్తౌ ఉపలభ్యతాం,
తత్ కించిత్ న ఉపలభ్యతే, అతః తత్ అసత్).

స్వప్నంలాగా విశ్వం కనిపిస్తూ ఉంది. మేలుకొంటే స్వప్నం ఎలా ఉండదో, జ్ఞానం కలిగితే విశ్వం లేనిదే **(స్వప్నవత్ మృషా స్యాత్).**

జగత్తు ఇలా సత్యము కాదు అని వాదించేవారు కూడా జగత్తులోనే యున్నారు. వాదించి వాదించి తత్ఫలితంగా దాహం వేస్తే వారు వాంఛించే నీరు కూడా జగత్తులోనే ఉంది. ఇంతగా వినియోగపడుతు న్నప్పుడు జగత్తు సత్యం కాకుండా ఏమవుతుంది?

ఇది వ్యవహార యోగ్యత్వము. దీనినే శాస్త్రంలో 'అర్థక్రియా' అంటారు. జగత్తు యొక్క వ్యవహార యోగ్యత్వాన్ని, వినియోగాన్ని అద్వైతం కాదనటం లేదు. వ్యవహారం ఉంది కనుకనే బోధ జరుగుతూ ఉంది.

జగత్తు ఉంది. జగ ద్వ్యాపారము నడుస్తూ ఉంది. కాని, ఇలా ఉన్నది సత్యంగా లేదు. సత్యమే అయితే కాలం చేత బాధితం కాకుండా ఉండాలి. కాని, ఈ దృశ్యమాన జగత్తు బాధిత మవుతూ ఉంది కనుక ఇది ఉన్నదే గాని సత్యంగా ఉన్నది కాదు.

ఆధార ఆధేయ అభిన్నత్వం

మట్టి కుండ ఉంది. ఈ వాక్యంలో కుండ మధ్యలో వచ్చింది. కుండకు ముందు మట్టి ఉంది. కుండలో మట్టే ఉంది. కుండ అదృశ్యమైన పిదప, ఉంది అనేది ఏదైనా ఉంటే అది మట్టే.

కుండకు వ్యవహార యోగ్యత్వం లేదని ఎవరూ చెప్పరు. కాని, కుండకు సత్యత్వం లేదు. తయారు కాకముందు కుండ లేదు. పగిలిన తరువాత కుండ ఉండదు. కనుక కుండ బాధితం. బాధితం కనుక సత్యం కాదు.

కార్యమైన కుండకు మట్టి కారణము. కుండ మట్టికన్నా వేరుగా లేదు. కుండలో ఉన్నదంతా మట్టే **(మృత్స్వరూపాత్)**. కుండ ప్రత్యేకంగా లేదు. ఆకారముతో గోచరిస్తున్న మట్టే కుండ **(మృదేవ కుంభః)**.

వాచారంభణం వికారో నామధేయం మృత్తికేత్యేవ సత్యమ్, ఇతి శ్రుతేః. 'కుండ' అనెడి పేరు కేవలం వాచారంభణము. అంటే వాక్కు యొక్క వికారమే గాని, సత్యమైనది మట్టియేనని శ్రుతి నిర్ణయము **(కుంభః ఇతి శబ్దః పరం కల్పితః)**.

మట్టికన్నా వేరుగా కుండకు అస్తిత్వము లేదు కనుక, కుండ అనునది కేవలము ఆరోపితము. కుండ మట్టిపై ఆధారపడి యున్నది. ఆధారము మట్టి. ఆధేయము కుండ. ఆధేయమైన జగత్తు సత్యం కాలేదు. సత్యం కాదు అంటే అసత్యమని కాదు. వ్యవహార యోగ్యత ఉందని చర్చించే యున్నాము. కనుక, ఏదయితే సత్యం కాదో, అలాగని అసత్యమూ కాదో అట్టిది మిథ్య. అంటే మరొక దానిపై ఆధారపడి యున్నదని భావము.

అధిష్ఠానాత్ భిన్నతా ఆరోపితస్య న (భవతి)

ఆరోపితమైనది అధిష్ఠానం కంటే భిన్నము కాదు. ఇది జ్ఞానము. ఇట్టి జ్ఞానము లేకపోవుటయే అజ్ఞానము.

అజ్ఞానము ఉన్నంతవరకు విశ్వం సత్యంగా భాసిస్తుంది **(యదజ్ఞానతః విశ్వం సమస్తం భాతి)**. జ్ఞానము కలిగితే వెంటనే **(సద్యః)** లేనిదే అగుచున్నది **(వినష్టం)**.

బాధలు భరించలేనివి అని అందరికీ తెలుసు. బాధించే బాధలు బ్రతుకును ఎంతగానో బాగుచేస్తాయి అనే సత్యం ఆలోచిస్తే గాని అర్థం కాదు. కారణాన్ని పట్టుకోవడానికి సహకరించేవి కార్యాలే. నొప్పి లేకపోతే రోగమున్నట్లు కూడా తెలియదు. రోగ మున్నట్లే తెలియని వ్యక్తి నివారించుకొనేది దేనిని? నివారణకు అవకాశం లేకుండా పెరిగే రోగము దారితీసేది వినాశానికే కదూ? కనుక బాధలే మనకు బ్రతుకులో సహకారులు. ఈ నిత్యసత్యం వంటబడితే, ఆ క్షణం నుండి బాధాపూరితమైన అనుభవాలు కూడా జీవితానికి నూతన భాష్యం చెబుతాయి. నూతన అందాన్ని ప్రసాదిస్తాయి.

ఆత్మదీపోభవ *

చీకటి దుప్పటిని తొలగించి రాత్రి మేల్కోవాలి. వెలుగులతో నిండి పగలు పకపక నవ్వాలి. ఇది ఏదో ఓనాడు ప్రతి జీవి బ్రతుకులో జరిగి తీరాలి. అది ఈనాడే ఎందుకు కాకూడదు? ఈ మాటను వినిపించేందుకే ఏడాది కొకసారి మన మధ్యకు వస్తుంది దీపావళి.

టపాకాయలో నిక్షిప్తమైన వెలుగుని వెలికి తీయడానికి ఉత్సాహపడే మనిషి తన కాయంలో నిగూఢమై యున్న ఆత్మజ్యోతిని దర్శించేందుకు ప్రయత్నించ డెందుకని?

నిక్షిప్తమైన దానిని బహిర్గతం చేసేందుకే వస్తుంది దీపావళి.

నిద్రాణమైన జీవుడు మేల్కొనిన నాడే నిజమైన దీపావళి.

ఉత్తిష్ఠత! జాగ్రత! ప్రాప్య వరాన్ నిబోధత!

"లే! మేలుకో! గురువును పొంది ఆత్మను తెలుసుకో!" అని ఉపనిషత్సుప్రభాతం. లేవడం వేరు. మేల్కోవడం వేరు. లేచినవారందరు మేల్కొన్నవారని చెప్పలేము. అందుకే లేచిన వారిని "జాగ్రత!" అంటూ మేల్కొలుపుతున్నారు మహర్షులు.

మేలుకోవడం అంటే బుద్ధి ప్రబుద్ధం కావడమని అర్థం. ఆంతర్యం చైతన్య దీపితం కావడమని భావం.

మేలు తెలిసి జీవించినవాడే, జీవించిన నాడే మనిషి మేల్కొనియున్నాడు. అంతవరకు లేచినా మగతను వీడలేకున్నాడని అర్థం.

త్యక్త్వోత్తిష్ఠ పరంతప!

"అర్జునా! విడిచిపెట్టి లెమ్ము" అన్నాడు శ్రీకృష్ణుడు.

బలహీనతలను విడిచిపెట్టి లెమ్ము. రాగద్వేషాలనుండి పైకి లెమ్ము. అభిమాన అహంకారాలనుండి లెమ్ము. అజ్ఞానమునుండి పైకి లెమ్ము.

లేచినంత మాత్రాన సరిపోదు. మేలుకో. జ్ఞానజాగరణలో నిన్ను నీవు ఏలుకో. జ్ఞాన వెలుగులో కర్మల నావిష్కరించు. కర్మలు నిన్ను బంధించవు. సూర్యునివలె నీవు నిస్సంగుడ వౌతావు. నిర్లిప్తుడ వౌతావు.

నివృత్తి రపి మూఢస్య ప్రవృత్తి రుపజాయతే

ప్రవృత్తి రపి ధీరస్య నివృత్తి ఫలభాగినీ ॥

* దీపావళికి ప్రత్యేక వ్యాసం

అజ్ఞానికి అకర్మ కర్మ అవుతుంది. జ్ఞానికి కర్మ కూడా అకర్మ అవుతుంది. నీవు జ్యోతివి. జ్ఞానజ్యోతివి. ఆత్మజ్యోతివి. చీకట్లలో చిందులేయాల్సిన గతి నీ కెందుకు పట్టింది? విజ్ఞాన వెన్నెలను విరబూయనీ.

నీవు పరంజ్యోతివి. ఆరని దీపానివి. మారేవాటిని, ఆరే వాటిని ప్రకాశింపచేసే ఆత్మదీపానివి.

నృత్యశాలాస్థితో దీపః ప్రభుం సభ్యాంశ్చ నర్తకీమ్
దీపయే దవిశేషేణ తదభావేఽ పి దీప్యతే ॥

"నాట్యశాల యందలి దీపము ఆసీనులైన ప్రభువును, సభాసదులను, నర్తకిని అందరిని సమానంగా ప్రకాశింప జేస్తుంది. వారందరు లేకపోయినను దీపము ప్రకాశిస్తూనే ఉంటుంది" అంటారు విద్యారణ్య స్వాములవారు.

'ఇదం' వృత్తులను, వాటిని గ్రహించే అహంవృత్తిని, అహంవృత్తి లీనమైన దశలో మిగిలిన శూన్యమును - ఇలా సమస్తమును దీప్తిమంతం చేసే ఆత్మదీపానివి నీవు.

సర్వాన్తరః స్వయంజ్యోతిః సర్వాధిపతి రస్మ్యహమ్
సర్వభూతాధివాసోఽ హం సర్వవ్యాపీ స్వరాడహమ్

"నేను సర్వాంతరాత్ముడను. స్వయంజ్యోతి రూపుడను. సర్వాధిపతిని. సర్వజీవులకు నివాసమైన వాడను. సర్వవ్యాపకుడను. స్వయంప్రకాశ స్వరూపుడను. స్వరాట్టును" అని త్రేపింది బ్రహ్మవిద్యోపనిషత్.

బ్రహ్మవిద్య నీ సొత్తు. నీవు బ్రహ్మవిదుడవు. బ్రహ్మమే నీవు.

ఆత్మవై వెలిగిపో.

ఏదో లేదని అనుక్షణం ఆవేదన చెందుతూ యెదను పగులగొట్టుకుంటూ ఉన్నాము. ఏమి లేదని ఈ బాధంతా? పుట్టుకతోనే కొందరు కుంటి వాళ్ళు, కొందరు గుడ్డివాళ్ళు. ఆ విషయంలో మనం ఎంత అదృష్టవంతులం? యౌవనంలోనే నూరేళ్ళు నిండినవారిని ఎందరిని మనం చూడలేదు? అలా చూస్తే, మనమెంత భాగ్యవంతులం? పొట్ట చేతపట్టుకొని తిరిగే ఎందరో నిరక్షరాస్యులున్న దేశంలో, విద్యావంతులమై ఈ పుస్తకాన్ని చేత పట్టుకొని చదివే మనకు ఎంత పుణ్యముందో? ఏదో అర్థం గానిది లేదని చింతించటం కన్నా, ఉన్నదానిని సరిగ అర్థం చేసుకుంటే ఎంతగానో తృప్తితో జీవించవచ్చు.

స్వప్రకాశం

తమసః అంటే చీకటి. పరం అంటే అతీతమైనది. చీకటిలో మనకు ఏదీ కనిపించదు. తెలియదు. కనుక చీకటి అంటే అంధకారము కాదు; అజ్ఞానము. ఆత్మ అంధకారానికి అంటే అజ్ఞానానికి అతీతమైనది. **(తమసః అజ్ఞానాత్ పరం అసంస్పృష్టం ఉచ్యతే)** అజ్ఞానముచే అంటబడనిది. నిత్యప్రకాశవంత మైనది.

ప్రకాశము రెండు విధాలు. (1) స్వప్రకాశము లేదా, నిత్యప్రకాశము. (2) అనిత్య ప్రకాశము. అంటే, మరొక ప్రకాశముపై ఆధారపడి ప్రకాశించేది అని అర్థము.

సూర్యుణ్ణి తీసుకుందాం. సూర్యుడు స్వప్రకాశం అనాలి. ఎందుకని? ఆయన తనకు తానుగా ప్రకాశిస్తున్నాడు కనుక. కాని, చంద్రుడు అలా కాదు. సూర్యుని వెలుగుపై ఆధారపడి ప్రకాశిస్తున్నాడు. కనుక చంద్రునిది అనిత్య ప్రకాశం.

స్వప్రకాశము అంటే తన ప్రకాశానికి మరొక దానిపై ఆధారపడనిది. అందుచేత అది స్వతఃసిద్ధమై ఉండాలి. స్వతఃసిద్ధమై, స్వప్రకాశమైనది చైతన్యమే గాని జడము కాదు. జడము అంటే మరొక దానిపై ఆధారపడి ప్రకాశించేది. కనుక, "జడమస్తి" జడము ఉంది అంటేనే చైతన్యము ఉందని అర్థము. జడము స్వప్రకాశమైనది కానందున, అది దేనిపై ఆధారపడి ప్రకాశిస్తున్నదో అదే చైతన్యము.

ఇంతకీ, ఏది స్వప్రకాశ చైతన్యము? **'తమసః పరం'**. చీకటికి, అంటే అజ్ఞానానికి అతీతంగా భాసిస్తున్న స్వయం జ్యోతి ఎవరు? ఈ ప్రపంచంలో మనకు దృశ్యమైనవి, సూర్యునితో సహ ఏవీ స్వప్రకాశాలు కావు.

సూర్యుడు వెలుగుతున్నాడు. విశ్వం గోచరిస్తూ ఉంది. కాని, గ్రుడ్డివానికి గోచరించటం లేదు. కనుక వస్తువులు ప్రకాశంలో ఉన్నా, అవి అలా ఉన్నవి అనేది తెలియాలి అంటే మన కళ్ళలో ప్రకాశం ఉండాలి.

కళ్ళు కూడా వస్తువును ప్రతిఫలింప చేయగలవే గాని తెలుసుకోలేవు. తెలుసుకొనేది మనస్సు. మనస్సు కూడా స్వప్రకాశం కాదు. మనస్సులో వృత్తులు మారుతున్నాయి. ఇవే **"ఇదం - అహం"** వృత్తులు. ఈ వృత్తులను **"అహం స్వరూపం"** ప్రకాశింప చేస్తూ ఉంది. ఉన్నదానిని ప్రకాశింప చేసేది, ఉన్నవి లేనపుడు స్వప్రకాశమై భాసించేది చైతన్యము. అదియే ఆత్మ. దాని కన్నను అన్యంగా ఉన్నవన్నీ అనిత్య ప్రకాశాలు. అవన్నీ అంధకారాలు. అజ్ఞానరూపాలు. వాటిని ప్రకాశింప చేసే ఆత్మ అంధకారానికి, అజ్ఞానానికి అతీతమైనది **(తమసః పరమ్).**

కాసిన్ని వేడి పాలు తెచ్చిపెట్టండి అంటూ ఉంటాము. 'వేడి పాలు'. ఇందులో 'వేడి', 'పాలు' అని రెండు పదాలు ఉన్నాయి. పాలు చల్లగా ఉంటాయే గాని వేడిగా ఉండవు. ఉష్ణము అగ్ని ధర్మమే గాని పాల ధర్మము కాదు. కాని వేడిపాలు అన్నప్పుడు

అగ్ని యొక్క ధర్మాన్ని పాలయందు ఆరోపించటము జరిగింది. వాస్తవానికి 'వేడి' అనేది అగ్ని ధర్మము.

అలాగే సూర్యప్రకాశములో ఏ ప్రకాశమైతే గోచరిస్తున్నదో అది సూర్యునికి సంబంధించింది కాదు. అది ఆత్మకు సంబంధించింది. కాని, సూర్యునికి ఆపాదించటం జరుగుతూ ఉంది. చూశారా! సూర్యుడే ఎప్పుడైతే స్వయంప్రకాశకుడు కాడో, సర్వము సూర్యుని ప్రకాశంలోనే గోచరమౌతున్నందున ఏవీ ఈ విశ్వంలో స్వప్రకాశాలు కావు. కనుకనే అవి జడాలు.

మన దేహాలు కూడా స్వప్రకాశాలు కావు. స్థూల శరీరాలు సూక్ష్మ శరీరాలపై ఆధారపడి ఉన్నాయి. సూక్ష్మ శరీరాలు ఆత్మజ్యోతిపై ఆధారపడి ఉన్నాయి. ఆత్మ స్వతఃసిద్ధం. కనుక స్వప్రకాశం. చైతన్యము. అన్యంగా ఏవి గోచరించినా అవి స్వప్రకాశాలు కానందున జడములు. ఆత్మ ప్రకాశంపై ఆధారపడి ప్రకాశించేవి. ఈ అనిత్య ప్రకాశాలకు అతీతంగా ఆత్మ ప్రకాశముంది. అంటే, అనిత్య ప్రకాశాలలో ఉన్న ప్రకాశమూ తనదే. వాటికి విలక్షణంగా భాసించే ప్రకాశమూ తనదే. అందుకే ఆత్మ అంధకారానికి అతీతమైనది (తమసః పరం).

ఈ సందర్భంలో శ్రీ శంకరులే ప్రసాదించిన అందమైన ఒక శ్లోకాన్ని చూద్దాం. దీనిని 'ఏక శ్లోకీ' అంటారు. అద్భుతమైన ఈ శ్లోక వైభవాన్ని దర్శించేందుకు శ్లోకంతో పాటు, ప్రతిపదార్థాన్ని కూడా ఇస్తున్నాను.

కిం జ్యోతి స్తవ భానుమా నహని మే రాత్రౌ ప్రదీపాదికమ్

స్యాదేవం రవి దీప దర్శన విధౌ కిం జ్యోతి రాఖ్యాహి మే

చక్షుః తస్య నిమీలనాది సమయే బుద్ధి ర్ధియో దర్శనే

కిం తత్రాహ మతో భవాన్ పరమకం జ్యోతిః తదస్మి ప్రభో!

తవ=నీకు, జ్యోతిః=వెలుగు, కిమ్=ఏది?, మే=నాకు, అహని=పగలు, భానుమాన్=సూర్యుడు, రాత్రౌ=రాత్రి పూట, ప్రదీపాదికమ్=దీపము మొదలైనవి, ఏవం=ఈ విధంగా, స్యాత్=కావచ్చు, రవి దీప దర్శన విధౌ=సూర్యుడు దీపము మున్నగు వానిని చూచునపుడు, కిం=ఏమి, జ్యోతిః =వెలుగు?, మే=నాకు, ఆఖ్యాహి=చెప్పుము, చక్షుః=కన్ను, తస్య= ఆ కంటి యొక్క, నిమీలనాది సమయే=మూసుకొనుట మున్నగు సమయమున, బుద్ధిః= బుద్ధి, ధియః=ఆ బుద్ధి యొక్క, దర్శనే=చూచునపుడు, కిం=ఏమి?, తత్ర=అక్కడ, అప్పుడు, అహం=నేనే, అతః=కనుక, భవాన్=నీవే, పరమకం జ్యోతిః=శ్రేష్ఠమైన జ్యోతివి, ప్రభో=స్వామీ!, తత్ అస్మి=(ఆ॰ తెలిసినది) ఆ జ్యోతిని నేనే.

ఈ శ్లోకము ప్రశ్న - జవాబు రూపంలో ఉంది. జిజ్ఞాసువుకి, ఆచార్యునికి మధ్య సాగిన దివ్య సంభాషణము. నిత్య ప్రకాశాన్ని తెలుసుకోవాలని ఆచార్యుని సమీపించిన ముముక్షువుపై ప్రశ్నల వర్షం కురిపించి అతని నుండే సమాధానమును రాబట్టిన ఒక అద్భుత ప్రక్రియగా ఈ శ్లోకం శోభిస్తూ ఉంది.

గురువు:- నీకు వెలుగు ఏది? **(కిం జ్యోతిః తవ)**

శిష్యుడు: నాకు పగటిపూట సూర్యుడు, రాత్రిపూట దీపము మొదలైనవి **(భానుమాన్ అహని మే రాత్రౌ ప్రదీపాదికమ్)**

గురువు:- కావచ్చు. సూర్యుని ప్రకాశమును, దీప జ్యోతిని చూచుటకు నీకు వెలుగు ఏమిటో నాకు చెప్పు. **(స్యాదేవం, రవి దీపదర్శన విధౌ కిం జ్యోతిః ఆఖ్యాహి మే)**

శిష్యుడు: నేత్రము **(చక్షుః)**

గురువు:- మరి, నేత్రమును మూసినపుడు, ఇంకా ఆయా సందర్భాలలో ఏది వెలుగు? **(తస్య నిమీలనాది సమయే)**

శిష్యుడు: బుద్ధి **(బుద్ధిః)**

గురువు:- ఆ బుద్ధిని చూచే వెలుగు ఏది? **(ధియో దర్శనే కిమ్?)**

శిష్యుడు: అక్కడ, అప్పుడు నేనే **(తత్ర అహమ్)**

గురువు:- కాబట్టి నీవే పరంజ్యోతివి నాయనా! **(అతః భవాన్ పరమకం జ్యోతిః)**

శిష్యుడు:- గురుదేవా! తెలిసినది. ఆ జ్యోతిని నేనే **(తదస్మి ప్రభో)**

గురువు నిత్య వెలుగేమిటో చెప్పకనే చెప్పాడు. "గురుదేవా! నీవు చెప్పింది సత్యమే **(సత్యం ఉక్తం త్వయా)**. నేను నిత్య వెలుగును గూర్చిన సత్యాన్ని గ్రహించాను" అన్నాడు శిష్యుడు.

శిష్యుడు గ్రహించిన నిత్య వెలుగు ఏదోకాదు, తానే నిత్య వెలుగు అని గ్రహించాడు. ఇది బోధ. సంప్రదాయంలో లభించే జ్ఞానం.

సూర్యుడు, చంద్రుడు, దీపాలు, నేత్రాలు, బుద్ధి - ఇవన్నీ ప్రకాశములే. కాని, స్వయం ప్రకాశములు కావు; నిత్య ప్రకాశములు కావు. ఇవన్నీ ఆత్మ ప్రకాశముపై ఆధారపడి ఉన్నాయి. కనుక, ఆత్మే స్వయం ప్రకాశము.

ఈ ప్రపంచంలో ఏ వెలుగులున్నా, అవి అలా వెలుగుతున్నవి అని గ్రహించటానికి మరొక వెలుగు అవసరమై ఉంది. వేరొక వెలుగు ఉంటేగాని ప్రకాశించని వెలుగు నిజానికి వెలుగుతున్నా చీకటి లాంటిదే. ఇలా వెలిగే వాటిని వెలుగులోకి తెచ్చే వెలుగు, వెలుగులకు అతీతమై వెలుగుతూ ఉంది. ప్రపంచంలోని వెలుగులన్నీ చీకట్ల వంటివే కనుక, ఆ వెలుగులకు ఆధారమైన స్వప్రకాశ చైతన్యము చీకటికి అతీతమైన ఆదిత్య తేజముతో అలరారుతూ ఉంది **(తమసః పరం అర్కవర్ణం)**.

సర్వం త్వమేవ

మనకెన్నో కావాలని ఉంది. కావాలనుకున్న వన్నీ కలిసి రావు. కనుక కలిసొచ్చిన వాటినే మనవిగా భావిస్తాము. ఇది **మమత్వం**. మమకారం; నాది అనే భావం.

జీవితంలో ఏది నాది? నా కున్నది నాది అవుతుందేమో గాని, నాది కావాలి అనుకున్నది నాది కాదు. ఆశించి పొందలేనిది నాది కానపుడు, పొంది పోగొట్టుకొనేది మాత్రం నాది ఎలా అవుతుంది?

'నాది కానిది - నాది' అనే రెండిటిలో **(1)** ఏది నాది కాదో అది నా మనస్సులో ఉన్నా నాది కానిదే. **(2)** నాది ఏదో అది నాది కాకుండా పోయేందుకే ఉన్నది కనుక 'నాది' అనుకున్నది కూడా నాది కానిదే. కాకపోతే, నాది కానిది ఏదో అది కానిది అని స్పష్టంగా తెలుస్తూ ఉంది. నాది అనుకున్నది అలా స్పష్టంగా తెలియకపోయినా నాది కాదనే సత్యాన్ని స్పష్టపరచేందుకే నాదిగా ఉంది.

ఇక ఏది నాది? **'మమ'** అనే దెక్కడుంది? మమత్వం అనే పదానికి అర్థ మేమిటి? దేని అర్థం దానిలోనే ఉంటుంది. ఒకదాని అర్థాన్ని మరొక దానిలో వెతకటం అర్థరహితం.

(మమత్వం, మమ - త్వం)

'మమ' అంటే నాది. **'త్వం'** అంటే నీవు. 'నాది' అనేది ఏదున్నా వాస్తవానికి అందులో ఉండేది నీవే **(త్వమేవ)**.

ఈ ప్రపంచంలో 'నాది' అని చెప్పుకోదగింది ఏదీలేదు. మనదైతే, మన కెందుకు దూరమవుతుంది? 'ఈ దేహం నాది' అనవచ్చు. దేహం మనదైతే మన మాట వినదు ఎందుకని? మనల్ని విడిచిపెట్టి వెళ్ళడం దేనికని? మనది కానిది కనుకే మన ఇష్టానుసారం కాకుండా తన దారిన పడి తాను పోతూ ఉంది. ఇలా ఎన్ని పోతున్నా, 'నాది' అనేది పోవటం లేదు. పోయిన తరువాత కూడా 'నాది పోయింది' అంటున్నాము. 'పోయింది నాదే' అని తిరుగ తోడుతున్నాము. నీదైతే ఎందుకు పోతుంది? పోయింది నీదెలా అవుతుంది?

ఈ బంతి నాది అని బాల్యంలో గంతులేశాం. ఈ చొక్కా నాది, ఈ ఇల్లు నాది, ఈ భూమి నాది, ఈ ఆస్తి నాది, ఈ భామ నాది, ఈ బాధ నాది, ఈ ఉద్యోగం నాది, ఈ అజ్ఞానం నాది - నాది, నాది అని ఇలా చెప్పుకున్న వాటి ప్రక్కన 'కాదు - కాదు' అనే పదాన్ని ఏదో ఒనాడు జోడించే పని కూడా నాదే అనే సత్యాన్ని మనిషి గ్రహించే దెపుడో?

మనం ఈ ప్రపంచానికి ఏమీ తీసుకొని రాలేదు. అన్నీ ఇక్కడే లభించాయి. తల్లి గర్భంలో శరీరం దొరికింది. పీల్చుకొనే గాలి ఇక్కడిదే. ఉన్నది పీల్చుకుంటున్నామే గాని సృష్టించి శ్వాసించటం లేదు. అందితే సందడి, అందనినాడు శ్మశానంలో అంగడి.

ఇదంతా నా కెక్కడిది? 'మమ' ఏది? ఎవరో ఇచ్చారు. ఆ ఎవరో నేను కాదు కనుక నీవు **(త్వం)**. ఇలా 'మమత్వం'లో మమ అనేది తొలగితే **'త్వం'** మిగుల్తుంది. అన్నీ నీవే. భగవాన్! **త్వమేవ సర్వం మమ దేవదేవ.**

అన్నీ అతడివే. పరమేశ్వరుడివే. ఊపిరి నిచ్చినవాడే ఉనికిని ప్రసాదించాడు. ఎన్నో ఇచ్చాడు. ఇస్తూ ఉన్నాడు. ఇస్తూ ఉంటాడు. మొదట్లో కేక నిచ్చాడు. ఆ తరువాత, కొంత కాలానికి విద్య నిచ్చాడు, విత్తాన్నిచ్చాడు, వనిత నిచ్చాడు, వ్యవహారం నడిపే చిత్తాన్నిచ్చాడు.

ఆయువు నిచ్చాడు, ఆరోగ్యం ఇచ్చాడు, వ్యాధులు ఇచ్చాడు, మరణా న్నిచ్చాడు. ఎప్పుడు ఏది ఇవ్వాలో అతడికి తెలుసు. అలా జీవిత మంతా అందిస్తూనే ఉంటాడు.

'నాది' అనేది ఏముంది? అన్నీ ఆయన ప్రసాదాలే. కృతజ్ఞతతో బ్రతకటమే మన కర్తవ్యం. హోటల్‌లో కొన్ని నిముషాలు కుర్చీలో కూర్చుంటాము. సినిమాలో కొన్ని గంటలు కుర్చీలో కూర్చుంటాము. ఇంట్లో అయితే, రోజులు, లేదా సంవత్సరాలు. అంతే. ఏది సొంతం? అంతా మనస్సులోనే ఉంది. నిజం చెప్పాలంటే మనస్సు కూడా సొంతం కాదు. అదీ లభించిన ప్రసాదమే.

అహం భావన

నేను పరిమితమైన వాణ్ణి **(పరిచ్ఛిన్నోహం)** అనే భావన ఉన్నంత వరకు **'అహం'** భావన ఉంటుంది. అహంభావన దేహమునందు కల్పించబడగానే నేను దేహము **(దేహోఽహం)** అనే భావము ఏర్పడుతుంది. ఇదే దేహాత్మ భావము. ఇదే జీవత్వము. అహంభావన లేదా జీవభావనయే మమత్వానికి దారి తీస్తుంది.

'మమ' అనేది ఇదం భావన. **'ఇదం'** భావనలు **'అహం'** భావనపై ఆధారపడి ఉంటాయి. **'అహం'** భావన ఉన్నంతవరకు 'మమ' భావన పోదు. ఈ రెండు ఒక విధంగా చెప్పాలంటే అన్యోన్యాశ్రయత్వం కలిగి ఉన్నాయి.

తత్త్వ విచారము ద్వారా తాను దేహం కాదని గ్రహించి, ఆత్మే తాను అని ఎరిగిన తత్త్వవిదుడు నాది - నేను **(మమాహ మితి)** అనెడి భావములను త్యజిస్తాడు.

ఆచార్య దేవోభవ!

స్వయం ఆచరతి పరాన్ ఆచారయతి ఇతి ఆచార్యః

తాను ఆచరించినది పరులు ఆచరించునట్లు చేయువాడు, తాను దర్శించినది పరులు దర్శించునట్లు చేయువాడే ఆచార్యుడు.

ఆచార్యుడు దర్శించినది దేనిని?

'సర్వమాత్మైవ' తల్లక్ష్యం శుద్ధాత్మ దృష్ట్యా వా యః పశ్యతి స ఏవ బ్రహ్మనిష్ఠో భవతి

'సమస్తమును ఆత్మయే' అనెడి వాక్యప్రమాణముతో పరమాత్మనే లక్ష్యముగా దర్శించినవాడే బ్రహ్మనిష్ఠుడు' అన్నది ఉపనిషత్తు.

సమస్తము ఆత్మయేనని నిర్ణయమైనపుడు ఆత్మనుండి దేనినీ వేరుచేయలేము. అన్నీ అన్నిటితో ముడిపడి ఉన్నాయి. కనుక దేనిని నీవు ఆశించినా నీవు ఆశిస్తున్నది ఆత్మనే. ఇది బోధపడే సత్యము కాదు. బోధపడని ఈ సత్యాన్ని ప్రమాణమును చూపి బోధపడేటట్లు చేయువాడే గురువు. కనుక అతడు బోధగురువు.

బోధను అందించే గురువు, గురువు అందించే బోధ రెండూ ఒక్కటే అని గుర్తించి నపుడే బోధను అందించిన గురువు బోధకన్నా అన్యమైనవాడు కాడని తెలుస్తుంది. కనుక గురువును దర్శించడ మంటే బోధను దర్శించడ మని భావం.

ఈ సత్యం తెలియని చాలా మంది గురువును కూడా ఒక వ్యక్తిగా గ్రహిస్తారు. తనకన్నను ఉన్నతమైన వ్యక్తిగా భావిస్తారు. ఫొటోగ్రాఫర్ కెమెరాలో రూపాన్ని నిలిపినట్లు, రెటీనాపై గురువు రూపాన్ని నిలుపుకుంటారు. ఇది చాలా ప్రమాదభరితమైన విషయం.

గురువు నీ ముందు వ్యక్తిగా లేడు. విషయంగా ఉన్నాడు. తత్త్వంగా ఉన్నాడు. గురువు నీ ముందున్నది నీతో పోల్చుకొని అతణ్ణి అర్థం చేసుకొనేందుకు కాదు. అతడి బోధను గ్రహించి, ప్రమాణాన్ని స్వీకరించి నీవు అతడికన్నా భిన్నమైన వాడివి కావని తెలుసుకొనేందుకే.

ఇందుకే గురువును సమీపించాలి. కేవలం ఇందుకే.

సేవాభిః పరితోష్యైనం చిరకాలం సమాహితః
సదా వేదాంత వాక్యార్థం శ్రుణుయా త్సుసమాహితః

"సేవల ద్వారా గురువును తృప్తిపరచి అతనివద్ద చాలాకాలముండి వేదాంత శాస్త్రమును నిరంతరము శ్రవణము చేయాలి" అన్నది ఉపనిషత్తు.

"స్వామిజీ! విన్నంతసేపు, చదివినంత సేపు ఆత్మ విషయము స్పష్టంగా తెలుస్తూ ఉంటుంది. మళ్ళీ కొంతకాల మయ్యేసరికి మరిచిపోతూ ఉంటాను. జ్ఞాపకముండనే ఉండదు" అని నిబద్ధత గల ఒక భక్తుడు నాతో తరుచుగా అంటూ ఉంటాడు.

ఏం చేయాలి? ఆత్మ జ్ఞాపకానికి సంబంధించినది కాదు. నీకు జ్ఞాపకమున్న అనేక విషయాలలో ఆత్మ కూడా ఒకటైతే అట్టి ఆత్మను అన్నిటిలాగే మరచిపోవడంలో

ఆశ్చర్య మేముంది? ఆత్మ నీ స్వరూపము. కనుక పరిమితమైన స్మృతిగా మిగలలేదు. స్మృతి కాదని తెలిసినపుడు విస్మృతి ఎలా వస్తుంది? ఇదంతా బోధ ద్వారానే అర్థం కావాలి.

వేదాంతం కొన్ని గంటల ఉపన్యాసంలో తేలేది కాదు. కొన్ని నెలల సహచర్యంలో సిద్ధించేది కాదు. కాలాన్ని ప్రక్కనపెట్టి జీవితమంతా అన్వేషించదగిన విషయం. ఎందుకని? జీవితంలో పొందదగినది ఇది ఒక్కటే కనుక.

ఉత్తమాత్ తత్త్వచింతైవ

"తత్త్వచింతనమే పరమోత్కృష్టము" అని మైత్రేయోపనిషత్.

తత్త్వచింతనము ద్వారా తత్త్వదర్శనము జరుగుతుంది. అదియే ఆత్మ దర్శనము. ఆత్మానుభూతి. దానివలన ఏమి ప్రయోజనము? "నేను" నేనుగా ఉన్నంత వరకు ఆత్మ తెలిసిరాదు. నేను (అహం) పడిన తరువాతే ఆత్మ స్వరూపంగా తెలుస్తుంది. 'నేను' పోయిన తరువాత ఆత్మదర్శనము కలిగితే మాత్రం ఏం ప్రయోజనం? ఈ ఆత్మానుభూతి ద్వారా ప్రయోజనాన్ని పొందే దెవరు? అని చాలా మంది ప్రశ్నిస్తూ ఉంటారు. వేదాంత జ్ఞానము లేనివాడే ఈ ప్రశ్న వేస్తున్నా డని చెప్పకనే తెలిసిపోతుంది. కాని, ఈ ప్రశ్నకు సమాధానం శాస్త్రజ్ఞానము లేనివాడు కనుక చెప్పడానికి ప్రయత్నిస్తే శ్రోతకు జరిగే ప్రమాదాన్ని ఊహించడం సాధ్యం కాదు.

ఆత్మను తెలుసుకొంటే శాంతి లభిస్తుంది. సుఖం ప్రాప్తిస్తుంది అంటూ చెప్పుకు పోతారు. శాంతి ఏమిటి? సుఖమేమిటి? అని తిరిగి ప్రశ్నించా మనుకోండి! దానికి కూడా అనేక నిర్వచనాలు ఇస్తారు. అయితే ఆ నిర్వచనాలన్నీ వారి అభిప్రాయాలతోనే విభేదిస్తున్నాయనే సత్యాన్ని మాత్రం గ్రహించలేరు. ఎందుకో తెలుసా? శాస్త్రజ్ఞానం లేకపోవడం చేత. ఆత్మ తన స్వరూపమే అని గ్రహించే ప్రమాణము లోపించడంచేత ప్రశ్నలు ఉద్భవిస్తూ ఉంటే, ప్రయత్నము ద్వారా ఏదో పొందాలి అనే సమాధానాలు గుఱ్ఱం ముందు బండిని ఉంచుతాయి.

ఆనందాబ్ధిః యత్పరః సోఽహం అస్మి

"ఏది ఆనంద సాగరమో అది నేనే అయి ఉన్నాను". ఇది ఉపనిషత్తు ప్రతిపాదిస్తున్న సత్యవిషయము. ఇది గురువు ప్రసాదించే శాస్త్ర ప్రమాణముద్వారా తెలిసే స్వరూపానుభూతి. "నేను ఆత్మయే. ఆత్మయే సర్వము".

సర్వము ఆత్మ అయినపుడు ఇక అనాత్మ ఎక్కడుంది? లేని అనాత్మయందు 'అహం' భావన ఎలా పొడసూపుతుంది? అవును. అంతయూ ఆత్మయే. అంత మాత్రము సరిపోదు. ఆత్మ అన్నిటికీ విలక్షణంగా ఉంది అనేది కూడా తెలుసుకోవాలి.

ఉన్నది రజ్జువే. ఒకవేళ సర్పాన్ని అజ్ఞానదశలో దర్శిస్తే మాత్రం రజ్జువు సర్పం కన్నా విలక్షణంగా ఉందని గ్రహించాలి. పాము కూడా త్రాడే. కాని త్రాడు పాము కాదు అనే సత్యాన్ని సునిశితంగా గ్రహించాలి.

జగన్మిథ్యత్వాన్ని కూడా ఏదో విచిత్రంగా గారడిలాగా వర్ణిస్తున్నారు చాలామంది. ప్రపంచం జ్ఞాన ప్రబోధంలో అదృశ్యమై పోతుందని అభిప్రాయపడుతున్నారు. మంచులా కరిగిపోతుందని, మేఘంలా కారిపోతుందని ప్రసంగిస్తున్నారు.

జగన్మిథ్య అంటే ద్వైతానుభూతిని శాస్త్రము అసలే లేనిదానిగా నిరాకరించడం లేదు. ప్రమాణం ద్వారా నిరాకరించబడేది ద్వైతానుభవము కాదు; ద్వైతము సత్యమనే విషయం.

మిథ్య అంటే ఉన్నది అని కాదు; లేనిది అని కాదు. ప్రపంచము ఉన్నట్లు తెలుస్తూ ఉంది. కాని నిరంతరము మార్పు చెందుతూ, మరొకదానిపై ఆధారపడి గోచరిస్తూ ఉంది కనుక సత్యము కాదు. అలాగని లేనిది అని నిర్ణయించేందుకు కూడా లేదు. కనిపిస్తూ ఉంది కనుక అసత్యమూ కాదు. అట్టి ఆరోపిత వస్తువును మిథ్య అన్నారు. విచారణలో లేనిదిగానే తేలిపోతుంది. లేకుండానే ఉన్నట్లు గోచరించిన జగత్తు లేనిదే అని తెలియగానే ఉన్నది ఉన్నట్లు స్వరూపంగా తెలుస్తూ ఉంది. వాస్తవానికి స్వరూపాను భూతిలోనే ద్వైతము ఉపశమించి పోతున్నది.

సర్వప్రపంచోపశమే అద్వైత సిద్ధిః

"మిథ్యారూప ప్రపంచము ఎచ్చట ఉపశమించుచున్నదో అదియే అద్వైతాను భూతి" అని మాండూక్య కారికాభాష్యంలో నిర్వచించారు శ్రీ శంకరాచార్య స్వామి.

ఆత్మ తన స్వరూపమే కనుక అనేక విషయాలను ఈ ప్రపంచములో విషయీక రించినట్లు ఆత్మను వివరించడం సాధ్యపడదు. అజ్ఞానముచే ఏర్పడిన మిథ్యాజ్ఞానము వలన తయారైన అనాత్మలను నిషేధించుటయే గాని, ఆత్మను నిర్ణయించే ప్రయత్నం అవసరం లేదు అనేది శాస్త్ర హృదయము. దీనినే శ్రీ శంకరాచార్య స్వామి

తస్మాత్ అవిద్యాధ్యారోపిత నిరాకరణ మాత్రం బ్రహ్మణి కర్తవ్యం!

న తు బ్రహ్మ విజ్ఞానే యత్నః

అని గీతాభాష్యంలో సుస్పష్టం చేశారు.

ఆత్మ నా స్వరూపమే. అది దేశకాలాదుల వలలో చిక్కదు. పరిచ్ఛిన్నం కాదు. అవస్థలకు పరిమితం కాదు. కోశములు లేనంత మాత్రాన అది లేకుండా పోదు. అది నిత్యము. సత్యము. అనంతము. ఆనందము. అవ్యయము.

బాగానే ఉంది. నా స్వరూపము అనాత్మ కాదు. ఆత్మయే. మరి పరమేశ్వరుడు? ఆయనను తెలుసుకోనిచో నన్ను తెలుసుకొని ఏమి ప్రయోజనము? అనే సంశయము చాలామందిలో తలెత్తుతుంది. ఈ సందేహ నివృత్తికై నీకు (త్వం) ఈశ్వరునికి (తత్) మధ్య భేదము లేదని తెలిపేందుకు గురువు ప్రవేశిస్తాడు. ఆయన బోధ నీకు పూర్ణంగా అందేసరికి నీవు, ఈశ్వరుడు, గురువు - ముగ్గురు ముగ్గురుగా కాకుండా ముచ్చట గొల్పుతూ ఒక్కరై మిగుల్తారు. ఆ ఒక్కరే దక్షిణామూర్తి. "అహం"ను దక్షిణగా సమర్పించిన తరువాత అద్భుతంగా శేషించిన పరమాత్మ స్వరూపము.

ఈశ్వరో గురు రాత్మేతి మూర్తిభేద విభాగినే
వ్యోమవ ద్వ్యాప్త దేహాయ శ్రీ దక్షిణామూర్తయే నమః

"ఈశ్వరుడు, గురువు, ఆత్మ అని మూడు రూపములతో గోచరించుచున్నను, ఆకాశమువలె అనంతమైన వాడెవడో అట్టి దక్షిణామూర్తికి నమస్కారము".

"ఆత్మ తెలిసింది; ఇక ఈశ్వరుడు తెలియాలి." ఇది సత్యము కాదు. ఆత్మ తెలిస్తే, ఇక ఈశ్వరుడు తెలియాలి అనేది ఉండదు. ఈశ్వరుడు తెలియడం లేదు అంటే ఆత్మ కూడా తెలియ దనే అర్థము. ఈశ్వరుడు, ఆత్మ ఒకరే అయినపుడు, ఒకే నాణెంలో బొమ్మ బొరుసుల్లా భాసించేటప్పుడు, ఒకరు లేకుండా మరొక రెలా తెలుస్తారు? ఒకరు తెలిసిన తరువాత రెండవ వారు ఎలా మిగుల్తారు?

సృష్టి విషయంలో ఈశ్వరుణ్ణి **'అభిన్న నిమిత్త ఉపాదాన కారణం'**గా శ్రుతి వర్ణించింది. పరమాత్మ సృష్టికర్తే కాదు. సృష్టిలోని వస్తువు కూడా (ఉపాదానం) తానే. కుండకు కారణమైన మట్టికి కుండ ఎలా వేరుగా ఉండలేదో అలాగే ఈ జగత్తు కూడా జగత్కర్తయైన జగదీశ్వరునికన్నా దూరంగా ఉండలేదు.

కుండ లేకపోయినా మట్టి ఉంటుంది. కాని మట్టి లేకపోతే కుండ లేదు. జగత్తు లేకపోయినా ఈశ్వరుడు ఉంటాడు. ఈశ్వరుడు లేకుండా జగత్తు ఉండలేదు. కుండ ఉన్నపుడు మట్టి ఉన్నట్లు, - అంతేకాదు, కుండలో మట్టికన్నా అన్యము లేనట్లు, జగత్తు ఉన్నచోట జగదీశ్వరుడే ఉన్నాడు. కార్యములో కారణమే ఉన్నప్పుడు కార్యమనేది ఏమిటి? అదియే మిథ్య. నామరూపాలు మిథ్య. నిత్య స్వరూపమైన ఆత్మయే సత్యము. ఈ ఆత్మయే పరమాత్మ.

వాచారంభణం వికారో నామధేయం మృత్తికేత్యేవ సత్యమ్

నామరూపములు వేరుగా తెలియుచున్నను మట్టి పాత్ర లన్నిటిలో మట్టియే సత్యమై భాసించుచున్నది అని ఛాందోగ్యోపనిషత్తు ప్రతిపాదించింది.

కనుక ఈ సృష్టిలో నామరూపములు భేదమును వ్యక్తం చేయుచున్నను సృష్టిలో ఉపాదాన కారణంగా పరమాత్మయే ఉన్నందున తానే అభేదంగా వెలిగిపోతున్నాడు.

సర్వం ఖల్విదం బ్రహ్మ తజ్జలానితి శాన్త ఉపాసీత

"ఈ నామరూప ప్రపంచము వాస్తవానికి బ్రహ్మమే. ఈ జగత్తు (కుండవలె) బ్రహ్మము నుండే పుట్టి, బ్రహ్మమునందే ఉండి, బ్రహ్మమునందే లయించుచున్నది. కనుక శాంతరూపుడవై బ్రహ్మమును ఉపాసించు" అన్నాడు శ్వేతకేతునితో ఉద్దాలక మహర్షి.

ఈశ్వరుడు, జగత్తు రెండిటియొక్క స్వరూపాలు తెలిశాయి. రెండిటిని తెలుసుకోవాలని ప్రయత్నించినా ఉన్నది ఒక్కటేనని తేలిపోయింది. అదే ఈశ్వరుడు. లేదా బ్రహ్మము. ఇక నీ విషయం. మరి, నేను జీవుణ్ణి కదా? అదే అర్థం కావాలి. **ఆత్మైవ సర్వం** అని తేలినపుడు ఇక ప్రత్యేకంగా నీవు ఎక్కడ ఉన్నావు? ఈశ్వరుణ్ణి ప్రత్యేకంగా ఎలా తెలుసుకుంటావు? ఎక్కడ తెలుసుకుంటావు?

జీవుడు ప్రత్యేకంగా లేనేలేడు. నీవు ఈశ్వరుడవే అనే జ్ఞానం లోపించడం చేత, నిన్ను నీవు జీవుడుగా భావించుకున్నావు. కుండ మట్టిని చేరేందుకు ప్రయత్నించినట్లు, అల సముద్రాన్ని అన్వేషించినట్లు నీవు ఈశ్వరుని వెంటబడ్డావు. కుండ మట్టికన్నా అన్యమా? అల సాగరానికన్నా భిన్నమా? మరి, ఉపాదాన కారణమైన ఈశ్వరునికి నీవు అన్యమెలా కాగలవు?

ఈశ్వరుని కర్మఫల ప్రదాతగానే చూడటం చేత (యోగమార్గంలో చెప్పినట్లు) నీవు కర్మ చేసినపుడు మాత్రమే ఫలితాలను అందించేవాడుగా, మిగిలిన సమయాల్లో నీతో సంబంధం లేనివాడుగా పరమాత్మ మిగిలిపోయాడు. ఇది కూడా చాలా ప్రమాద భరితమైన విషయం. పరమాత్మను ఉపాదాన కారణంగా దర్శించినపుడే సర్వసమస్యలు సమసిపోతాయి. సమరూపంలో నీవు వెలిగిపోతావు. శరీరము ఒకచోట ఉండినా (ఘటములోని గగనము వలె) నీవు సర్వత్ర నిండి ఉంటావు.

పిండస్థోఽ పి ప్రత్యగాత్మా సర్వవ్యాపీ భవతి

"దేహమునందే యున్నను ప్రత్యగాత్మ సర్వవ్యాపకమై ఉన్నది" అని పైంగలోపనిషత్తు.

ఈ విధంగా శబ్దప్రమాణం ద్వారా స్వరూపస్థితి నెరిగి తరించాలి. సనాతన ధర్మములోని ఆచార్య పరంపర మనకు జ్ఞానభిక్షను పెట్టింది. మనము అన్వేషించే సద్వస్తువు మనమే అయినందున ఇంద్రియ మనోబుద్ధులకు గాని, ప్రత్యక్ష అనుమానాది ప్రమాణాలకు గాని అందదు. అట్టి దానిని శబ్దప్రమాణము ద్వారానే గ్రహించాలి. ఇక్కడే శాస్త్రము ప్రమాణముగా శోభిస్తున్నది.

శ్రుతిశ్చ నః ప్రమాణం అతీంద్రియ విషయ విజ్ఞానోత్పత్తౌ

"మన ఇంద్రియ మనోబుద్ధులకు అందని సత్యవిషయాన్ని గ్రహించుటకు వేదమే ప్రమాణమై ఉంది" అన్నారు బ్రహ్మసూత్ర భాష్యంలో శ్రీ శంకరాచార్యులు.

ఇట్టి జ్ఞానమును అందించే గురువు మనకు లభించాలి. అంతటితో సరిపోదు. గురువు అనుగ్రహించే జ్ఞానమును, లేదా ప్రమాణమును స్వీకరించే స్థితిలో మనము ఉన్నామా? అనేది కూడా క్షుణ్ణంగా పరిశీలించుకోవాలి. ఈ రెండు విషయాలు సరిపడినపుడు జ్ఞానము కలుగకపోతే ఆశ్చర్యపడాలి. దుఃఖం మాయం కాకపోతే విస్మయమొందాలి. అనిర్వచనీయానందము హృదయంలో నిక్షిప్తం కాకపోతే అబ్బురపడాలి.

ఇక్కడే గురువు సాక్షాత్తు భగవానుడై ప్రకాశించాడు. అట్టి గురువు లభించిన వారికి దేవుడెందుకు? గురువే గోవిందుడు. కనుకనే, **ఆచార్య దేవోభవ** - "నీ ఆచార్యుడే నీకు ఆదిదేవు డగుగాక!" అని శాస్త్రమాత దీవించింది.

తద్విజ్ఞానార్థం సః గురుమేవ అభిగచ్ఛేత్ సమిత్పాణిః శ్రోత్రియం బ్రహ్మనిష్ఠమ్!

"అట్టి జ్ఞానమును పొందుటకు హస్తమునందు సమిధలను పెట్టుకొని శ్రోత్రియుడు, బ్రహ్మనిష్ఠుడు అయిన గురుదేవుని ముముక్షువు ఆశ్రయించుచున్నాడు" అని ముండకోపనిషత్తు.

జై గురుదేవ!

జ్యోతిర్మయం

నీవు సత్యము. ఇది సత్యమైన మాట. నీ నుండి నిన్ను వేరు చేసేది ఏదయినా అది అసత్యపు బాట. దాని నుండి నిన్ను తప్పించేవాడు, వెనుకకు త్రిప్పించేవాడు గురుదేవుడు. గురువు నీతో ఉండడు. తనలో తాను ఉంటాడు. విరజిమ్మబడే అతని వెలుగులో నీవు ప్రకాశిస్తూ ఉంటావు.

గదిలో దీపం వెలిగిన తరువాత కిటికీలు, తలుపులు తెరిస్తే వెలుతురు బాహ్యానికి కూడా ప్రసరిస్తుంది. గురువు గదిలో భాసించే దీపము లాంటివాడు. అతడు అద్భుతమైన జ్ఞానదీపము. ఆ వెలుగు పరిమితంగా ఉండలేదు. విశాలంగా విరజిమ్మబడుతుంది.

"సాధకా! సాగిపో! వెలుగు ఉంది" అని మాత్రమే చెప్పగలడు వెలిగేవాడు. మనం నడవాలి. అడుగులు వేయాలి. ప్రతి అడుగుకి నీలో నవజీవనం స్ఫురిస్తుంది. నూతన తేజము నిన్ను ఆవరిస్తుంది. ఎంత నడిచావో తెలియనంతగా నడుస్తావు. మైలురాళ్ళు వస్తాయి ఎదురుగా. అవి దూరాన్ని, మార్గాన్ని చూపుతాయి. ఆ ప్రకాశం కూడా గురువే.

మార్గము తానే. గమ్యము తానే. గమనమూ తానే. అన్నీ తానే. సర్వము తానైన వానితో తాదాత్మ్యం చెందినవానికి తాను కాని దేముంటుంది? ఇదే అతని వెలుగు వెనుక వైభవం. మెయిన్ స్విచ్‌తో సంబంధం లేకుండా బల్బు వెలుగుతుందా? పరమాత్మతో సంబంధం లేకుండా గురువు శోభించగలడా?

దేహాలన్నీ ఒకే ఆహారం భుజించడం లేదు. కానీ, దేహాలన్నీ శ్మశానంలో ఒకే రంగు గల బూడిదగా కనిపిస్తున్నాయి. నీవు ఏ మార్గంలో పయనించినా, గమ్యము చేరిననాడు అది అద్వైతమే. అదే విభూతి సుందరుని వైభవం.

అక్కడ కూడా గురువు ఉంటాడు. అయితే నీకన్నా వేరుగా కాదు. నీవే తానుగా, తానే నీవుగా. అక్కడ మార్గాలు లేవు. మాటలు లేవు. "**త్వమేవాహం**". "నీవే నేను" అని తాను నీతో పలవరిస్తాడు. "**అహమేవ**" "నేనే" అని నీలో తానే పరవశిస్తాడు.

ఎన్నెన్నో నదులొచ్చి తనలో పడుతూ ఉండినా సముద్రము నిశ్చలంగా, పూర్ణంగా శోభిస్తూ ఉంటుంది. ఆహ్వానం లేకనే నదీజలాలు దొర్లుకుంటూ వచ్చి పడుతున్నాయి. అయినా ఆవేదన లేకుండా సాగరం వెలిగిపోతూ ఉంది. ఊహించని రీతుల్లో బాధలు వచ్చి పడుతున్నా, భరించలేక గుండె బరువెక్కుతున్నా, నన్ను నన్నుగా నిలిపింది సాగరమే. సాగర చైతన్యమే.

సచ్చిదానందం

సత్ - చిత్ - సుఖం

ఇది ఆత్మయొక్క స్వరూప లక్షణము. 'సత్' అంటే సత్యము. 'చిత్' అంటే జ్ఞానము. 'సుఖం' అంటే ఆనందము. ఇది సచ్చిదానందము. ఆత్మయొక్క లక్షణము.

సత్

'సత్' అంటే సత్యము. ఎలాంటి సత్యము? అబాధితం. ఏదయితే ఎప్పుడు, ఎక్కడ నిరాకరింప బడదో అది సత్యము.

'అస్తి' అంటే ఉంది. చెట్టు ఉంది. జింక ఉంది. పుష్పముంది. పక్షి ఉంది. ఇల్లు ఉంది. నావ ఉంది. సైకిలుంది. విమాన ముంది.

పై వాక్యాలలో 'ఉంది' అనేది అన్నిటిలో ఉంది. వస్తువులు మారుతున్నాయి. అన్నీ మారుతూ ఉండినా ఏదయితే మారకుండా ఉందో అదే సత్యము.

ఉన్నవన్నీ ఉన్నవే. కాని, సత్యంగా లేవు. **'అస్తి'** ఒక్కటే సత్యంగా శోభిస్తుంది. ఏవి ఉండినా అవి ఉన్నట్లు తెలియటానికి **'అస్తి'** ఉంది. కనుక **'అస్తి'**కి ఉన్నవన్నీ విషయాలు. తాను విషయి.

విషయాలు ఉన్నాయి. ఉన్నాయి కనుక ఆ సమయాన సత్యంగా తెలుస్తున్నాయి. ఒక సమయంలో లేకుండా పోతాయి. అప్పుడు లేనివిగా తెలుస్తున్నాయి. ఎవరికి తెలుస్తున్నాయి?

పోయిన వాటికి తెలుస్తున్నాయా? లేక ఉన్న దానికి తెలుస్తున్నాయా? పోయినవి లేనివే కనుక పోయినట్లు తెలుసుకోవటానికి ప్రత్యేకంగా ఎక్కడున్నాయి? కనుక ఏవి పోయినా అలా పోయేవి తెలిసేది ఉన్నదానికే.

అదే:అస్తి. అదే సత్యం. ఇది పోయేది కాదు. ఎందుకని? అది పోతే, అది అలా పోయినట్లు ఎవరు తెలుసుకుంటారు? అన్నిటినీ నిషేధించే దానిని నిషేధించటం సాధ్యపడదు. ఇది ఆత్మయొక్క కాలాతీత స్థితి. దీనినే **'సత్'** అని పిలుస్తారు. కాలములో ఉన్నది తానే. కాలానికి అతీతంగా భాసించేదీ తానే.

ఒక కాలంలో ఉన్న వస్తువు మరొక కాలంలో ఉండదు. అందుచేత అవి బాధితాలు. కాని, ఆత్మ అలా కాలానికి పరిమితమైంది కాదు కనుక అబాధితం.

కాలము ఉందంటే, కాలాన్ని తెలుసుకొనే ఆత్మ ఉంది. కాలం లేని స్థితిలో ఆత్మ కాలాతీతంగా భాసిస్తూ ఉంటుంది.

కాలము లేనపుడు దేశము కూడా ఉండదు. దేశము లేనపుడు విషయాలు, వస్తువులు ఉండలేవు. ఇవేవీ లేకపోయినా ఆత్మ సదా ఉంటుంది. కనుక దేశకాలాదులు ఆత్మను పరిమితం చేయలేవు. దేశకాలాదులు ఆత్మలోనే ఉన్నాయి. ఆత్మగానే ఉన్నాయి. కాని, ఇవేవీ లేకపోయినా ఆత్మ స్వతఃసిద్ధంగా భాసించుట చేత ఆత్మ ఇవేవీ కాదు. ఈ విధమైన వివేకము వలన ఆత్మయొక్క అద్భుత అస్తిత్వము అవగత మవుతుంది. అనాత్మ కూడా తెలుస్తుంది. కనుక అనాత్మను ఆత్మగా భ్రమించే ప్రమాదము కూడా తప్పుతుంది. అజ్ఞానం సమూలంగా నశిస్తుంది.

తయో ర్వివేకోదిత బోధవహ్నిః అజ్ఞాన కార్యం ప్రదహేత్ సమూలం

తయోః=ఆ రెండిటి యొక్క (ఆత్మా అనాత్మనోః), వివేక - ఉదిత =వివేకము వలన పుట్టిన, బోధవహ్నిః=జ్ఞానాగ్ని (జ్ఞానరూపాగ్నిః), అజ్ఞానకార్యం=అవిద్యారూప సంసారమును, సమూలం =బీజ సహితంగా (అవిద్యా రూప బీజోపేతం), ప్రదహేత్= చక్కగా భస్మం చేస్తుంది (ప్రకర్షేణ భస్మీకుర్యాత్ - ఇత్యభిప్రాయః)

ఇది ఆత్మయొక్క అస్తిత్వము. **'సత్'**. ఈ సత్ ఎవరో కాదు, నీవే. ఇది నీకు తెలియాలి. నీకు నీవుగా దీనిని తెలుసుకోలేవు. దీనిని శాస్త్రము ద్వారానే తెలుసుకోవాలి. ఎందుకని శాస్త్రం ద్వారానే తెలుసుకోవాలి? దీనిని తెలిపే విధానము **(బోధనావిధి)** శాస్త్రము వద్దనే ఉంది కనుక.

ఆత్మ 'సత్' అని తెలుసుకున్నాం. మరి, ఆత్మ **'సత్'** అని తెలుసుకొనే జ్ఞాన మెవరిది? ఎవరు తెలుసుకొంటున్నారు? సత్తైన ఆత్మను గ్రహించే జ్ఞానము ఆత్మ కన్నా వేరైనది అయితే, ఆత్మ దృశ్యమౌతుంది. దృశ్యము విషయ మవుతుందే గాని **"విషయి"** కాలేదు. కనుక సర్వమును ప్రకాశింప చేసే ఆత్మను తెలుసుకొనేందుకు వేరుగా మరొక ఆత్మ ఉండలేదు. కనుక, ఆత్మ 'ఉంది' **(అస్తి)** అంటే, జ్ఞానరూపంగా ఉంది అని అర్థము. ఇది ఆత్మ యొక్క చిత్స్వరూపము. దీనినే **'చిత్'** అంటారు. ఇంతవరకు ఏ ఆత్మను 'సత్'గా గ్రహించామో అదే ఇప్పుడు **'చిత్'**గా తెలుస్తోంది.

చిత్

'చిత్' అంటే జ్ఞానము. ఎలాంటి జ్ఞానము? అబాధితం. మరొక జ్ఞానంచేత నిషేధించేందుకు సాధ్యపడని అబాధిత జ్ఞానం. స్వప్రకాశ చైతన్యం. ప్రత్యేకంగా పుట్టేది కాదు **(న ఉదేతి)**. అలాగని ఉండి ఆరేది కాదు **(న అస్తమేతి)**.

స్వప్రకాశము అంటే మరొక ప్రకాశముపై ఆధారపడనిది అని అర్థము. మరొకటి ఉన్నదా? లేదా? అనే విషయంలో మనకు సందేహముంటే ఉండవచ్చు. "నేనున్నాను" **(అహమస్మి)** అనే విషయంలో ఎవరికి సంశయం లేదు.

ఏ విషయానికి సంబంధించిన జ్ఞానమైనా దానిని తెలుసుకొనే జ్ఞాతకు సంబంధించి ఉంటుంది. జ్ఞాతపై ఆధారపడి ఉంటుంది. **'చిత్'** విషయం జ్ఞాత తెలుసుకొనే జ్ఞానానికి సంబంధించింది కాదు. జ్ఞాత విషయమే ఇక్కడ జ్ఞానము. విషయాన్ని గ్రహించేటపుడు 'జ్ఞాత' ఉన్నాడు. విషయగ్రహణము జరుగనపుడు జ్ఞాత జ్ఞాతగా లేడు. చైతన్యంగా భాసిస్తున్నాడు. ఇదే చిత్. **(సంవిత్)**

స్వప్రకాశమైన చిదాత్మలో రూపాలు తెలుస్తున్నాయి. రూపాలకు ఆధారమైన జ్ఞానము రూపములు లేకున్నా ఉంటుంది. చిదాత్మ ప్రకాశంలో కాలం తెలుస్తూ ఉంది. కాలం లేకపోయినా, దేశం లేకపోయినా చిదాత్మ సద్రూపంగా ప్రకాశిస్తూ ఉంటుంది. **(కాలత్రయేపి బాధ రహితం, స్వయంప్రకాశం)**

చైతన్యానికి ఆద్యంతాలు లేవు కనుక ఉదయాస్తమయాలు తెలియవు. దేనికైనా ఆది అంటూ ఉంది అంటే, అలా ఉంది అని తెలుసుకొనే జ్ఞానము ఆదికి ముందే ఉండాలి. అలాగే అంతము కూడా. 'అంతమైనది' అని చెప్పేది అంతమైన తరువాత కూడా ఉండాలి. కనుక చైతన్యాత్మ ఆద్యంతముల యందు ఉండి తనకు ఆద్యంతములు లేనిదై ఉంది. తనయొక్క ఉనికికి, జ్ఞానానికి మరొక దానిపై ఆధారపడకుండా ఉంది. **(సత్తాయాం స్ఫూర్త్యాం వా పర నిరపేక్షం)**

చిదాత్మ తప్ప అన్యముగా ప్రకాశించే వన్నీ తమ ప్రకాశానికి పరాపేక్షను కలిగి యున్నాయి. కనుక వాటిలో ప్రకాశము గోచరించినా అది చిదాత్మ జ్ఞానమే కాని మరొకటి కాదు. నిప్పులో కాలిన ఇనుప గుండు ప్రకాశమును వెదజల్లినట్లు, చిదాత్మ ప్రకాశంతో వస్తు ప్రపంచము భాసిస్తోంది. ఇనుప గుండులో గోచరించే ఎర్రని ప్రకాశము ఇనుప గుండుది కాదు. అగ్నిది. అలాగే ఈ ప్రపంచంలో అందుతున్న జ్ఞాన ప్రకాశము ఆత్మదే కాని ప్రపంచానిది కాదు. **(యదగ్నే రోహితం రూపం తేజసః, తద్రూపం)**

సుఖం

సుఖం అంటే ఆనందము. ఆనందమంటే అనంతము. **సత్** అంటే అస్తిత్వ మని తెలుసుకున్నాం. ఏవి ఈ ప్రపంచంలో ఉన్నవో అవి మరొక కాలంలో పోయేందుకే ఉన్నాయి. ఆత్మ అలా కాల పరిచ్ఛేదానికి లోనయ్యేది కాదు. కనుక అది సత్యము. దానిని తెలుసుకొనే జ్ఞానము దానికన్నా వేరైతే అది పూర్ణము కాదు. కనుక సత్యమే జ్ఞానము. వస్తు జ్ఞానములాగా బ్రహ్మజ్ఞానము కలిగేందుకు అవకాశం లేదు. కనుక శాస్త్రము ఆత్మజ్ఞానము అంటున్నదంటే, జ్ఞానమే ఆత్మ యని అర్థము.

ఆనందము అంటే అనంతము. నిత్యమైన ఆత్మ కాల పరిచ్ఛేదానికి పరిమితం కావటం లేదు కనుక అది నిత్యానందము. తన స్ఫురణకు మరొకదానిపై ఆధారపడి లేదు కనుక అది జ్ఞానానందము. ఏ పరిచ్ఛేదానికి లోనుగాని ఏకరసాత్మ కనుక అది అనంతానందము. కనుక ఆత్మ సుఖప్రదము కాదు; సుఖమే. ఆనందదాయకం కాదు; ఆనందమే. అందుకే అది అనంతము. పెరిగేది కాదు; తరిగేది కాదు. అనుభూతిగా ఉన్నదే కాని అనుభవము కాదు. కనుకనే, ఏ వస్తువును మనం ప్రియంగా చూచినా అది ఆ వస్తువు కొరకు కాదు; ఆత్మ కొరకే. అది ఏదో కాదు నీవే. ఆత్మను ఎన్నడూ నీ కన్నా వేరుగా తెలుసుకోలేవు. నీవే ఆత్మగా తెలుసుకుంటావు. ఉంటావు. ప్రియత్వములన్నీ ఆత్మలో విలీనమౌతాయి. ప్రేమలన్నీ ఆత్మానంద సాగరంలో లేచిపడే అలలు.

ఆత్మ అనంతమని అవగతమైతే, సత్యజ్ఞానానంద మనేది.ఆత్మయొక్క స్వరూప లక్షణమని తేలిపోతుంది. అదే నీవు. ఆత్మ ప్రత్యగభిన్నం. నీకన్నా వేరైనది కాదు.

అహంబ్రహ్మాస్మి

"అహం బ్రహ్మాస్మి" అను పదమునందు **"అహం" "బ్రహ్మ" "అస్మి"** అను మూడు పదములు ఉన్నాయి. అహం పదమునకు జీవుడు వాచ్యార్థము. "బ్రహ్మ" పదమునకు ఈశ్వరుడు వాచ్యార్థము. అహం పదమునకు లక్ష్యార్థము కూటస్థుడు. బ్రహ్మ పదమునకు లక్ష్యార్థము పరబ్రహ్మము.

ఉపాధులను తొలగించి చూడగా జీవేశ్వరులు ఒకే చైతన్యముగా తెలియు చున్నారు. జీవుడు అవిద్యోపాధిని కలిగియుండగా ఈశ్వరుడు మాయోపాధిని కలిగి యున్నాడు. ఉపాధి వినిర్ముక్త మైనపుడు ఇద్దరూ ఒకే చైతన్యమై భాసించుచున్నారు.

ఈశ జీవయో ర్వేషధీభిదా సత్స్వభావతో వస్తు కేవలం

"జీవేశ్వరులకు భేదము ఉపాధియందే గాని వాస్తవానికి ఇద్దరును సత్స్వరూపు లయ్యే ఉన్నారు" అని భగవాన్ రమణ మహర్షులవారు తమ ఉపదేశసార గ్రంథమునందు తెలిపియున్నారు.

కనుక "అహం", "బ్రహ్మ" అను ఇరువురి యొక్క అఖండత్వమును "అసి" పదము నిర్ణయించుచున్నది. ఈ విషయమునే శ్రీశంకరులవారు మహావాక్య దర్పణము నందు తెలియజేస్తారు.

అసీత్యేకత్వ మనయో రఖండత్వం ముహుర్ముహుః
తాత్పర్యేణ శ్రుతిర్వక్తి సర్వజ్ఞా సత్యవాదినీ

"సర్వజ్ఞత్వము కలిగినదియు, సత్యము నెరిగినదియునగు ఉపనిషత్తు "అసి" 'అయి ఉన్నావు' అనెడి అర్థము చేత కూటస్థబ్రహ్మలకు అఖండత్వమును, అభేదమును కనబరచుచున్నది. ఈ విషయమును పదే పదే ధ్రువపరచుచున్నది."

అహం బ్రహ్మాస్మి మంత్రోఽయం సర్వ శోకం వినాశయేత్

"అహం బ్రహ్మాస్మి" అను ఈ మంత్రము సమస్త దుఃఖములను నశింపజేయు నదియై ఉన్నది"అని తేజోబిందూపనిషత్తు తెలిపియున్నది. కనుక ఈ మహావాక్యము జీవ బ్రహ్మైక్యమునే ధ్రువపరచుచున్నది. ఇది అద్వయరూపమే అయినందున ద్వైత మును అదృశ్యమొనర్చుచున్నది.

"అహం బ్రహ్మాస్మి మంత్రోఽయం ద్వైత దుఃఖం వినాశయేత్

ద్వైతభావన వలన కలిగెడి అనంతదుఃఖమును ఈ అహంబ్రహ్మాస్మి మంత్రము అంతము చేయుచున్నది.

"ఇదం జగచ్చ సకలం చిన్మాత్ర విస్తారితం" ఈ సమస్త ప్రపంచము చైతన్యము వలననే ప్రకాశించుచున్నది అని శ్రీశంకరులు తెలియజేయుచున్నారు.

ప్రపంచము మనకు తెలియుచున్నది. ప్రపంచమును మనస్సు తెలుసుకొను చున్నది. మనస్సునకు ప్రపంచము తెలియుచున్నది. మనస్సునకు రూపము లేదు. రూపము ఉన్న ప్రపంచమునకు మనస్సు లేదు. ప్రపంచానికి సంబంధించిన ఆలోచన మనస్సులో కలిగినది. అట్టి సంకల్పము జగత్తునకు సంబంధించినది అయినందున అది జగద్రూప సంకల్పము. జగత్తు యొక్క దృశ్యము లేనిచో సంకల్పము కదలదు. సంకల్పము లేనిదే జగద్రూపము అర్థము కాదు. జగత్తును పరిశీలించే వ్యక్తి భౌతిక విజ్ఞాన శాస్త్రజ్ఞుడు. మనస్సును అధ్యయనము చేయు వ్యక్తి మనస్తత్వ శాస్త్రజ్ఞుడు.

మరి వస్తువు సత్యమా? ఒకటి మరియొక దానిపై ఆధారపడి యున్నందున ఈ రెండింటిలో ఏదీ సత్యము అయ్యేందుకు అవకాశము లేదు. సత్యము దేనిపైనను ఆధారపడదు. అది పూర్ణము. అనంతము.

ఏకమైన బ్రహ్మమునందు మాయవలన ద్వైతప్రపంచము తెలియుచున్నది. సర్వ వ్యవహారములు మాయ యందే తెలియుచున్నవి. విచారణ మార్గమున పయనించు వ్యక్తి ద్వైతరూప ప్రపంచముతో కదలి అద్వయాత్మలో నిలిచి పోవుచున్నాడు.

ప్రపంచము ప్రత్యేకముగా తెలియుచున్నందున అది మాయారూపమని చెప్పక తప్పదు. కానీ ఆత్మ దృశ్య విషయముగా తెలియబడునది కానందున సత్యమై ఉన్నది. ద్వైత ప్రపంచము తెలియుటకు అద్వయాత్మ అధిష్ఠానమై ఉన్నది. మరి అద్వయానంద రూపమైన ఆత్మకు ఆధారమేమిటి? అందుచేత అది స్వయంప్రకాశమై తెలియుచున్నది.

తద్దేదం ప్రపంచాఖ్యం మాయా మాత్రం ద్వైతం

"ఏదయితే ప్రపంచముగా తెలియబడుచున్నదో అదియే మాయామాత్రమైన ద్వైతప్రపంచము" అని శ్రీశంకరులవారు ఉపనిషద్భాష్యంలో తెలుపుతారు.

కనుక ద్వైతప్రపంచము ఆరోపిత మైనదియే గాని సత్యమైనది కాదు. సచ్చిదానంద రూపమైన పరబ్రహ్మమే సత్యము. సత్యమైన బ్రహ్మమునందు అసత్యమైన ఈ అనిత్య జగత్తు ఆరోపించబడినది. దీనికి కారణము త్రిగుణాత్మిక మాయయే. ఇదియే ప్రపంచ వైతథ్యస్థితికి కారణముగా తెలియుచున్నది.

ఆధారము, అధిష్ఠానమైన బ్రహ్మమునందు ఎవనికి దృఢభావము స్థిరపడి యున్నదో అతడే జీవన్ముక్తుడు. జీవన్ముక్తుడు వస్తురహిత చైతన్యమే అయినందున అతనికి భేదము అర్థము కాదు.

ఏకవాక్యతా

సుఖ దుఃఖాలకు ప్రత్యేక మనుగడ లేదు. ఒకవేళ ఉన్నట్లు తెలిస్తే, అవి మనిషి మనస్సులోనే ఉంటాయి. వేరుగా ఉండలేవు. కనుక, ఆ రెండిటిలో ఏది కావాలో, ఏది వద్దో మనిషే నిర్ణయించుకోవాలి.

సుఖము మన స్వరూపము. దుఃఖము ఆగంతుకము. కల్పితము. ఆరోపితము. విచారముద్వారా నిషేధించదగింది.

సుఖానికి మార్గాన్ని శాస్త్రం సుస్పష్టం చేసేఉంది. జీవ జగత్పరాత్మల సంబంధాన్ని, అఖండత్వాన్ని సంశయరహితంగా సంప్రదాయమునకు దూరం కాకుండా అర్థం చేసుకుంటే దృష్టే మారిపోతుంది. వ్యవహారికంగా గోచరించే మిథ్య కూడా సత్యంగానే తెలుస్తుంది. అయినా మిథ్యను ప్రకాశింపచేసే చైతన్యం మిథ్యతో సంబంధము లేనిదై స్వరూప వైభవంతో సదా శోభిస్తూ ఉంటుంది.

ఒక ప్రశాంత వనంలోకి నీవు ప్రవేశించావు. ఒక చెట్టుక్రింద కూర్చున్నావు. ప్రశాంతంగా ఉన్నావు. ఈలోగా గుడిగంట వినిపించింది. ఆ శబ్దం వైపు దృష్టిని సారించావు. ఒక ఆలయం కనిపిస్తూ ఉంది. నీ చెవి ఆలయంలో మ్రోగిన గంటను వినింది. నీ కళ్ళు ఆలయాన్ని చూశాయి.

ఆలయం రూపం. గంట శబ్దము. ఈ రెండు నీకు దృశ్యాలే. శబ్దం వినిపించక ముందు ఆలయానికి సంబంధించిన ఆలోచనే నీలో లేదు. శబ్దం వినిపించింది. ఆ వైపు దృష్టి సారిస్తే ఆలయం గోచరించింది.

ఈ దృశ్యాలన్నీ వాస్తవానికి వృత్తులే. నీ ఆలోచనల కన్నా వేరుగా నీకు ఏదీ తెలియదు. దృశ్యము తెలిసింది. అంటే, దృశ్యానికి సంబంధించిన వృత్తి నీలో ఉంది. వృత్తులు మారుతూ ఉంటే, దృశ్యాలు కూడా మారుతూ ఉంటాయి. గుడి వృత్తి ఉన్నప్పుడు గుడి దృశ్యము ఉంది. బడి అనే వృత్తి గుడి వృత్తి స్థానంలో నిలిస్తే, ఆ క్షణాన ఒడిలో బడి ఉంటుందే గాని గుడి ఉండదు.

ఇలా జ్ఞానము మారుతూ ఉంటుంది. ఇది వృత్తి జ్ఞానము. వృత్తులు లేనపుడు దృశ్యాలు లేవు. కాని, నీవు ఉన్నావు. ఎలా ఉన్నావు? వృత్తి జ్ఞానంగా కాదు. ప్రజ్ఞానంగా. ఇంతవరకు వృత్తి జ్ఞానాన్ని ప్రకాశింప చేస్తూ, వృత్తి రాహిత్యంలో స్వరూపంగా భాసించే ప్రజ్ఞానంగా.

శబ్దం వినిపించినపుడు శబ్ద చైతన్యం. శబ్దం ఆగగానే శబ్దం లేదు కనుక అది శుద్ధ చైతన్యం. శబ్దం చైతన్యంలోనే తెలిసింది. శబ్దానికి ఆద్యంతాలు ఉన్నాయి. శబ్దానికి ముందే చైతన్యం ఉంది. శబ్దం ఆగినా చైతన్యం శుద్ధమై సాగుతుంది.

శబ్దం చైతన్యానికి దూరంగా లేదు. శబ్దం లేని స్థితి నిశ్శబ్దం. శబ్దాన్ని, నిశ్శబ్దాన్ని, రెండిటిని చైతన్యమే ప్రకాశింపచేస్తూ ఉంది. ఈ రెండూ లేకపోయినా తాను తానుగా ప్రజ్ఞానం ఉంటుంది.

శబ్దం ఉన్నప్పుడు నిశ్శబ్దం లేదు. నిశ్శబ్దం లేకపోవచ్చు గాని చైతన్యం లేకపోలేదు. నిశ్శబ్దం రాజ్యమేలే సమయాన శబ్దం విదేశాలకు తరలిపోయి ఉండొచ్చు. కానీ చైతన్యం సిద్ధంగానే ఉంది. కనుక ప్రజ్ఞాన స్వరూపమైన చైతన్యం శబ్దాశబ్దాలను, దృశ్యాదృశ్యాలను, జ్ఞానాజ్ఞానాలను ప్రకాశింపచేస్తూ వాటికి అతీతంగా స్వరూప వైభవముతో శోభిస్తుంది.

వృత్తి జ్ఞానంతో ముడిపడియున్న ద్వైత ప్రపంచం మిథ్య. ప్రజ్ఞాన స్వరూపమైన సత్యంపై అది ఆధారపడి యుంది. మిథ్యా ప్రపంచాన్ని ప్రకాశింపచేసే చైతన్యం మిథ్య లేక పోయినా ఉంటున్నది కనుక అది మిథ్య కాదు.

మిథ్య సత్యంకన్నా వేరు కానందున మిథ్య కూడా సత్యమే (అల కూడా సముద్రమే అయినట్లు). మిథ్య లేకపోయినా సత్యం సిద్ధమై తెలుస్తూ ఉన్నందున సత్యం మిథ్య కాదు (అల లేకపోయినా సముద్రమున్నట్లు).

లేచిపడే అలలో అలజడి ఉండొచ్చు. సముద్రాన్ని దర్శించటానికి అల మనకు అవరోధమా? అలను తొలగిస్తేగాని సముద్రం అర్థం కాదా? ఆలోచించండి, అవగాహన ఉంటే దృక్పథం మారిపోతుంది. అఖండత్వం అనుభూతిగా వెలిగిపోతుంది.

మిథ్యాప్రపంచం కూడా అలల రూపంలో లేచి పడుతూ ఉండొచ్చు. వికారములను పొందుతూ ఉండొచ్చు. కాని, అలలో కూడా సముద్రమే ఉన్నట్లు, ఈ ప్రపంచంలో ఉన్నది కూడా పరమాత్మే. జగద్వికారాలు జగన్నాథుని పూర్ణత్వాన్ని భంగపరచలేవు. అలలను ప్రకాశింపచేసే సముద్రము వాటికి అతీతంగా అఖండత్వంతో శోభించునట్లు, దృశ్య ప్రపంచాన్ని ప్రకాశింప చేసే సత్తా స్ఫురణలు అనంతంగా భాసిస్తూనే ఉన్నాయి.

యేనేక్షతే శృణోతీదం జిఘ్రతి వ్యాకరోతి చ
స్వాద్వస్వాదూ విజానాతి తత్ప్రజ్ఞాన ముదీరితమ్॥

యేన=దేనిచేత, ఇదం=ఇది, ఈక్షతే=చూస్తుందో, శృణోతి=వింటుందో, జిఘ్రతి =వాసన చూస్తుందో, వ్యాకరోతి=మాట్లాడుతుందో, స్వాదు అస్వాదు=రుచిని, అరుచిని, విజానాతి= తెలుసుకుంటుందో, చ=మరియు; తత్=అది, ప్రజ్ఞానం= చైతన్యము, ఉదీరితమ్=పిలువ బడింది.

“దేనిచేత ఈ ప్రపంచం చూడబడుతుందో, వినబడుతుందో, వాసన చూడబడుతుందో, పిలువబడుతుందో, రుచిని, అరుచిని గ్రహిస్తూ ఉందో, అదే ప్రజ్ఞానము అని చెప్పబడింది”.

ఇది మన దృక్పథం కావాలి. దృక్చైతన్యంలో దృశ్య మెరుగని ద్రష్టగా ఈ ప్రపంచంలో మనం మిగిలిపోవాలి. దృశ్యాదృశ్యములకు అతీతంగా, విలక్షణంగా ప్రజ్ఞాన రూపంలో వెలిగిపోవాలి. ఇదే శాస్త్రముయొక్క ఏకైక తాత్పర్యము. ఏకవాక్యతా.

విద్యా సమం చక్షుః నాస్తి

ప్రతి మనిషిలో క్షుత్పిపాసలు ఎలా సహజంగా ఉన్నాయో, జ్ఞాన పిపాస కూడా సహజంగా వుంది. ఎంతో తెలుసుకోవాలని మనిషి తహతహ లాడుతూ ఉంటాడు కనుక, ఏ చిన్న విషయం తెలియకపోయినా గట్టున పడేసిన చేపలాగ ఏదో అయిపోతూ ఉంటాడు.

బట్ట కొనడానికి బజారు కెళ్ళేటప్పుడు “మీరు నాతో రండి”. మంచి బట్ట కొని పెట్టగలరు అని బంధువులనో, మిత్రులనో వెంటబెట్టుకొని పోతూవుంటాము. మనం కొనే బట్ట మంచిదో కాదో? మన్నిక ఎలా ఉంటుందో? - ఇలాంటి సందేహాలు, సంఘర్షణలు మనస్సులో ఉంటాయి. చూచే కళ్ళల్లో వెలుగున్నా, వెలుగును వెలిగించేది మనస్సే. మనస్సులో స్పష్టత లోపిస్తే ఆ మనసుతో పాటు, అట్టి మనసును పొంది యున్న మనిషి మనుగడ కూడా భయంకరంగా మారుతుంది.

స్పష్టత చాలా అందమైనది. ఒక విధంగా చెప్పాలంటే, స్పష్టతకన్నా సుందరమైన వస్తువు ప్రపంచంలో లేదు. ప్రకృతి సౌందర్యాన్ని ఒక వాల్మీకి, ఒక కాళిదాసు, ఒక వర్డ్స్ వర్త్ కళ్ళకు కట్టినట్లు చూపగలిగినారంటే వారి మనస్సులో స్పష్టత దర్పణ సౌందర్యముతో సమంగా శోభిస్తున్నది అని అర్థము.

చెవులతో విన్నంత మాత్రాన, కనులతో చూచినంత మాత్రాన స్పష్టత లోపించిన మనస్సును పొందిన మనిషి దేనినీ ఆస్వాదించలేడు. ఆరాధించలేడు. స్పష్టత అనేది జ్ఞానానికి సంబంధించిన విషయం. విద్యకు సంబంధించిన విషయం. ధనంతో లభ్యమయ్యేది కాదు. జనం వలన ప్రాప్తించేది కాదు. పదవుల వలన సంక్రమించేది కాదు.

నది నుండే నీరును తెచ్చుకొనునట్లు విద్యావంతుని నుండే విద్యను పొందాలి. విద్యావంతుడు, విద్య రెండూ లభించే కేంద్రాలు విద్యాలయాలు. అవి పూర్వకాలంలో గురుకులాలు. నేటి కాలంలో పాఠశాలలు. గురుకులాలలో స్పష్టత నందించే విద్య లభించేది. నేడు పాఠశాలల్లో విత్తార్జనకు సరిపడే విద్య మాత్రమే ప్రాప్తిస్తోంది. అందువలన స్పష్టత అగోచరంగా వుంది. ఈ పరిస్థితి అనేక అస్తవ్యస్త ధోరణులకు, సందిగ్ధ మనుగడలకు దారితీసి, బ్రతుకును సమస్యల వలలో పడదోసి, మనిషి ఆంతర్యంలో సంఘర్షణను, సమరాన్ని సృష్టిస్తోంది.

ఆహారము, వస్త్రము, గృహము - ఇవే ప్రధానమైతే, చదువుకొరకు కాలాన్ని ఖర్చు పెట్టనవసరం లేదు. ధనాన్ని ఆర్జించే ఉద్యోగం కొరకు మాత్రమే పనికివచ్చే విద్య నిజానికి విద్య కాదు. తానేమిటో, తాను జీవించే ప్రపంచనైజం ఎలాంటిదో తెలిసి, ఆనందంగా జీవించేందుకు ఉపకరించేదే నిజమైన విద్య. ఇట్టి విద్యయే బుద్ధిలో స్పష్టతనందించుతుంది. బ్రతుకులో శాంతిని నింపుతుంది. ఈ స్పష్టతను కళ్ళు చూడలేవు. కనుక కళ్ళు జ్ఞానంతో సరితూగలేవు. అందుచేతనే

విద్యా సమం చక్షుః నాస్తి

“విద్యతో నేత్రము సమం కాదు” అన్నారు జ్ఞానవంతులైన మన పెద్దలు.

సర్వస్య సద్భావనాస్తు.

పోతే ఒక్కటి - దొరికితే రెండు

నీకు ఎన్నో తెలుస్తున్నాయి. ఉన్నట్లు తెలుస్తున్న వాటిని తెలుసుకొనే నీవు కూడా ఉన్నట్లు నీకు తెలుసు. నీవు తెలుసుకొనేవి, నీకు తెలియబడేవి ఉన్నవేనా? కావా? అనే వాటిలో నీకు సందేహము ఉండవచ్చునేమో గాని, నీవు ఉన్నావు అనే సత్యం నీకు నిస్సందేహంగా, నిశ్చయంగా తెలుస్తోంది.

ఇంతకీ నీ వెవరు? ఈ ప్రపంచంలో వేయదగిన ప్రశ్న ఇదొక్కటే. నీవెవరు? అని నేను వేసిన ప్రశ్నను నీవు వేసుకుంటే **"నేనెవరు?"** అవుతుంది. నన్ను నేను ప్రశ్నించుకున్నా **"నేనెవరు?"** గానే మిగుల్తుంది. ఇదే "కోహం?" నేనెవరు?

'నేనెవరు?' అని ప్రశ్నించేకొలది ప్రశ్న మరీ బిగుసుకుపోతోంది. నేను ఇదిగా, అదిగా, ఏదోగా తెలుస్తున్నానే గాని, నేను నేనుగా తెలియటం లేదు. ఇది అయిన నేను అది కాలేను. అది అయిన నేను ఇది కాలేను. ఇదిగా, అదిగా తెలుస్తూ, ఇది అది కానని తెలిసినపుడు ఏదోగా అనుకుంటున్నానే గాని, ఆ ఏదో తెలిసినపుడు అది మళ్ళీ ఇదిగా, అదిగానే మిగులుతుందని గుర్తించలేకపోతున్నాను.

నేను ఇదిగా ఉన్నాను.....నేను అదిగా ఉన్నాను. ఈ వాక్యాలలో ఇదిగా, అదిగా అనేవి మారుతూ ఉంటాయి. 'నేను ఉన్నాను' అనేది స్థిరంగా ఉంటుంది. స్థిరమైనది సత్యము. మారేవి ఏవయినా అసత్యాలే.

నేను ఉన్నాను అనే సత్యం మిగలటానికి, ఇదిగా, అదిగా అనేవి తొలగించబడాలి. నీవెవరో నీకు తెలియాలి అంటే మొదట నీవు కానివాటిని నీవు తెలుసుకోవాలి. అంత వరకు అదీ, ఇదీ ఉంటుంది. అది, ఇది ఉన్నంతవరకు నీవు నీకు తెలిసిరావు.

అంతవరకు నిన్ను నీవు నిశ్చయించుకోలేవు. అలాగని నిరాకరించుకోనూ లేవు. నిర్ణయించినా, నిరాకరించినా అది జరిగేది మనసులోనే. మనస్సులో నిన్ను నిర్ణయించనూ సాధ్యపడదు. నిరాకరించనూ వీలుపడదు. మనస్సును దాటిన స్థితిలో నిర్ణయించ వవసరం లేదు. నిరాకరింప పనిలేదు. బాగా అర్థంచేసుకో.

ఏది జరిగినా మనస్సులోనే జరుగుతుంది. జరగాలి. నీవు మనసుకు దొరకవు. కనుక నిర్ణయింపబడవు. నిరాకరింపబడవు. కాని, ఇంతకీ మనస్సుకు దొరికింది, దొరికేది ఏమిటి? నీవు కానిదే. కనుక, మనస్సులో నిన్ను నిరాకరించటం సాధ్యపడేదేమో గాని, నీవు కానిదానిని నిరాకరించటం సాధ్యమే. అదంతా మనసులో జరిగిపోతే, ఆ తరువాత మనస్సులో జరుగవలసిందంటూ ఏదీ ఉండదు. జరుగవలసింది ఏదీలేనపుడు మనస్సు ఉండి ఏమి ప్రయోజనం? మనస్సు కూడా తాను నిర్మూలించిన వాటితో పాటు నిరాకరింపబడుతుంది. ఇక అక్కడ మిగిలియున్న దెవరు? నీవే. నేనే. నీకు

నీవే. నాకు నేనే. నీ, నాలు మొలకెత్తని చేనే. నిజానికి తానే. దేశము కానిచోట, కాలము లేనిచోట మేఘములు లేకుండా అమృతమును వర్షించే వానే.

ఆలోచించు. నేను ఇదిగా ఉన్నాను - అదిగా ఉన్నాను అనేది అసత్యము. సమస్యలన్నీ ఈ అసత్యంతోనే ఆరంభమయ్యాయి.

ఇప్పుడు 'నేను ఇదిగా లేను - అదిగా లేను' అనేది సత్యము. అసత్యముతో ఆరంభమైన సమస్యలు సత్యంలో అంతరించాయి.

నేను కాని దానిని నేను అని భావించటము అసత్యమైతే, నేను కాని దానిని నేను కానట్లు తెలుసుకోవటం సత్యమైంది. ఇంతకీ నేనెవరు? అసత్యమా? సత్యమా? రెండూ కాను. అసత్యాన్ని తొలగించుటకు సత్యము ప్రవేశించింది. ప్రవేశించింది ఏదయినా నిష్క్రమించవలసిందే.

అసత్యమే లేకపోతే సత్యము యొక్క అవసరమే లేదు. సత్యోదయంలో అసత్య మస్తమించుట చేత, ఆ తరువాత తన అవసరం లేని సత్యము కూడా అస్తమిస్తుంది. సత్యాసత్యాలు కనుమరుగైనపుడు మేఘము తొలగిన తరువాత సూర్యునిలా నీవు నిత్యకాంతులతో భాసిస్తావు.

నీవు అసత్యము కావు. సత్యమూ కావు. సత్యాసత్యాలకు అతీతుడవు. నీకు అజ్ఞానము లేదు. జ్ఞానముండదు. నీవు జ్ఞానాజ్ఞానములకు అతీతుడవు. నీకు బంధము లేదు. మోక్షము ఉండదు. నీవు బంధముక్తులకు అతీతుడవు!

ఇదియే మోక్షము. నీ స్వరూపస్థితియే మోక్షము. దీనిని అన్వేషించాలా? పొందేందుకు ప్రయత్నించాలా? ప్రయత్నించటం తప్పుకాదు. కాని, అలా పొందేందుకు ఎప్పుడు ప్రయత్నం చేస్తున్నామో, ఆ పొందబడేది మనకన్నా వేరై ఉంటుందని మన ప్రయత్నమే చెబుతూ ఉంది. నీవు కాదని నీవు నిర్ణయించుకొనుట చేతనే మరేదో మోక్షమని భావించి వెతుకుతున్నాము. ఈ అన్వేషణలో మనము దేనిని పొందుతామో నేను చెప్పలేను గాని మనల్ని మనం పోగొట్టుకుంటాము అని నిశ్చయంగా చెప్పవచ్చు.

నగ మెడలోనే ఉండగా లేదని భ్రమించి, ఉన్న నగ పోయిందని భావించి, ఆ నగను వెతికి పొందేందుకు ప్రయత్నిస్తే దానివలన శ్రమే గాని ఫలితముండదు. ఎక్కడయితే వస్తువు ఉందో, ఎక్కడయితే అన్వేషించాలో ఆ వైపు దృష్టిని సారించటానికి మనమే నిరాకరిస్తున్నామని భావము. నీవు అన్వేషించేది నిన్ను కాదని నీవే నిర్ణయించు కుంటే నిన్ను తెలుసుకొనే అవకాశాన్ని నీవే జారవిడుచుకున్నావని ప్రత్యేకంగా చెప్ప నవసరం లేదు.

నీవు సాధకుడివిగా నీ ముందే నిలబడ్డావు. నీవే సాధ్యమని ఇక ఎలా గుర్తిస్తావు? సాధ్యము సాధకుడే అని తెలియనంతవరకు నీ సాధన నడుస్తూనే ఉంటుంది. వేదన వెన్నంటే ఉంటుంది. రోదన గుండెలోనే గూడు కట్టుకొని వసిస్తుంది.

చైతన్యము నీవని తెలియనంతవరకు నీకన్నా వేరుగా చైతన్యము ఉందనే భావిస్తావు. నీకు అన్యంగా ఏముందని నీవు భావిస్తావు? పొందుతావు? నీ దృష్టిలో పడనిది, నీ స్పర్శకు నోచుకోనిది ఏదయినా ఉందా?

ఉంటే, అది ఎలాంటి ఉనికి? జ్ఞానము లేని ఉనికియా? చూడు. ఉన్నదంతా, తెలిసేదంతా నీకు సంబంధించినదే. ఏది ఉండినా అది నీవుగానో, లేక నీ అనుభవంగానో ఉంటుంది. అంతే. అనుభవాలు నిన్ను ఎలా పరిమితం చేస్తాయి? అవి లేకపోయినా నీవు ఉంటావు. వాటికి ముందు నీవు ఉండబట్టే అవి కలిగాయి. అవి పోయినా నీవు మిగిలి ఉంటావు. ఇది అనుభవానికి సంబంధించిన విషయం కాదు. జ్ఞానానికి సంబంధించిన విషయం.

పోయింది తీపి - దొరికేది కారము

అనుభవము అనిత్యము. జ్ఞానము నిత్యము. నిత్యము అంటే మార్పు చెందనిది అని అర్థము. అనిత్యము అంటే మార్పు చెందునది. మార్పు చెందేది తీపి ఎలా అవుతుంది? మారనిదానిలో కారమెందుకుంటుంది? ఒకవేళ లేని కారము భ్రాంతిలో ఉన్నట్లు తెలిస్తే, అది లేదని జ్ఞానముతో తెలుసుకోగానే కారము పోయి తీపి మిగుల్తుంది. **"అహంకారము"**లో కారము పోగానే, **'అహం'** మధురమైన అఖండానంద స్వరూపంగా శోభిస్తుంది. ఇది తెలియని కారణంగా ఉన్నదానిని లేదని భ్రమించి లేనిదానిని వెతుకుతూ ఉంటాము. పోయింది తీపి. వెతికితే దొరికేది కారము. అదే అహంకారము. ద్వంద్వాలకు, ద్వైతానికి శ్రీకారము.

'అహం' స్వరూపము అఖండము. అద్వితీయము. అది నీవే. నీవే సాధ్యానివి. నిన్ను నీవు సాధకునిగా గుర్తించినంత కాలము సాధ్యము నీవే అని గ్రహించలేవు. ఇక్కడే శాస్త్రము ప్రమాణంగా శోభిస్తూ **"తత్త్వమసి"** అనే మహావాక్యోపదేశంతో రంగప్రవేశం చేసింది.

అయితే బోధలో ఒక అతి ముఖ్యమైన అంశం ప్రధానమై ఉంది. బోధించే గురువు శాస్త్ర స్వరూపంగా భాసిస్తూ శ్రోతను సాధ్యంగా నిరూపించుకొంటూ సాగాలి. తాను కాని దానిని తొలగిస్తూ బోధను సాగిస్తే శ్రోత తాను సాధకుడనే విషయాన్ని ప్రక్కకు నెట్టి సాధ్యంగా అర్థం చేసుకొంటూ నడుస్తాడు. ఒక దశలో స్వరూపంగా మిగిలిపోతాడు. ఇలా స్వరూపానుభూతికి శాస్త్రము ప్రమాణమైంది. వేదము ప్రమాణమైంది. ఈ విషయాన్ని గుర్తించకపోతే ప్రయత్నాలే సాగుతూ ఉంటాయి. పోయింది ఒక్కటయితే (ఆత్మ) దొరికేవి రెండై ఉంటాయి (అనాత్మ).

దొరికేవి ఏవయినా అనిత్యాలే. కనుక మృతంగా మిగుల్తాయి. నిత్యమైన ఆత్మజ్ఞానము కలిగినపుడే అమృతత్వము సిద్ధిస్తుంది. అయితే అమృతత్వమనేది జ్ఞానము వలన సిద్ధిస్తుందా? దేనివలన సిద్ధించినా, ఆత్మ తన సహజసిద్ధమైన స్థితిని కోల్పోతుంది.

స్వతఃసిద్ధం కాకుండా పోతుంది. మరి జ్ఞానము యొక్క ప్రయోజనమేమి? అనే ప్రశ్న మీలో ఉదయించవచ్చు. ఈ ప్రశ్నను కూడా శ్రీ శంకరాచార్య స్వామి భాష్యంలో లేవదీసి కూలదోసారు.

ఆత్మజ్ఞానేన కిం అమృతత్వం ఉత్పాద్యతే? న, కిం తర్హి? స్వేనైవ నిత్యాత్మ స్వభావేన అమృతత్వం విన్దతే, న ఆలంబన పూర్వకమ్! యది హి, విద్యోత్పాద్యం అమృతత్వం స్యాత్ అనిత్యం భవేత్ కర్మకార్యవత్! విద్యా అనాత్మ విజ్ఞానం నివర్తయతి!

"ఆత్మజ్ఞానము చేత అమృతత్వం కలుగుతుందా? కలుగదు. ఎలా కలుగుతుంది? ఆత్మయొక్క నిత్యమైన స్వరూపము వలననే కలుగుతుంది. మరొక దాని ఆధారంగా పొందబడదు. జ్ఞానము వలన అమృతత్వము సిద్ధించేటట్లయితే, అది కూడా కర్మ ఫలితమువలె అనిత్యమవుతుంది. అనాత్మకు సంబంధించిన జ్ఞానమును తొలగిస్తుంది"; అన్నారు కేనభాష్యంలో శ్రీ శంకరాచార్య స్వామి. అనాత్మతో తాదాత్మ్యము నివారింపబడగానే ఆత్మ స్వరూపానందంతో భాసిస్తుంది.

"నువ్వు నాకు వద్దు....పో" అని మనం నమ్ముకున్న ప్రపంచం మనల్ని వంచించే రోజు ఒకటుంది. "నన్ను నీవు ఇక పిల్చలేవు..... నీ దారిన నీవు పో" అని జాలి లేకుండా గాలి మనకు దూరమయ్యే క్షణం ఒకటుంది. "ఇక మేము నీకు కనిపించము...వెళ్ళు" అని ప్రపంచంలో రంగులు, దృశ్యాలు కళ్ళను నెట్టేసి తలుపులు మూసేసే నిముషం ఒకటుంది. "ఇక నావల్ల కాదు. నేను గంట కొట్టలేను" అని గుండె చతికిలబడే సమయం ఎప్పుడో తెలియదు గాని, అది మాత్రం ఉంది. వీటి మధ్యే మనం ఉన్నాం. ముందు ఇది అర్థమైతే, ఆ తరువాత ఎటుపోవాలో ఆలోచించవచ్చు.

అపారం

ఆలోచనలు బ్రతుకులో అవరోధాలు కావు. ఆలోచనల్ని అరికట్ట నవసరం లేదు. అర్థం చేసుకుంటే సరిపోతుంది.

సముద్రంలో అలలు లేచినట్లు మనస్సులో ఆలోచనలు లేస్తుంటాయి. లేచిన అలలు పడినట్లు, విజృంభించిన సంకల్పాలు విరమిస్తూ ఉంటాయి. చూచే కళ మనసుకి ఉంటే అలలు చాలా అందంగా ఉంటాయి. వీక్షించే శక్తి బుద్ధికి ఉంటే సంకల్పాలు సుందరంగా ఉంటాయి.

మన స్థాయిలో నేడు భావాలు బంధాలు కావు. శాస్త్రాలన్నీ భావాలే. మహర్షుల ప్రవచనాలన్నీ భావాలే. భగవద్గీత భావసాగరం. ప్రకరణాలన్నీ భావ ప్రకంపనలే.

భావశుద్ధి లేక కర్మశుద్ధి రాదు. భావస్ఫూర్తి వల్ల బ్రతుకులో జ్ఞానదీప్తి ఏర్పడుతుంది.

మనస్సు ఆలోచిస్తుంది. నీకు దూరమై మనస్సు ఆ పని చేయలేదు. నిప్పులేనిదే వంట తయారు కాదు. నీవు తోడు లేకపోతే మనస్సు పంట పండదు.

మనస్సు తన పంటను తాను పండించుకొంటే మనకు నష్టమేమీ లేదు. తన వంటను తాను తయారు చేసుకొంటే మనకు తరిగేదేమీలేదు.

నీవు లేనిదే మనస్సు లేదు.

మనస్సు లేకపోయినా నీవు ఉంటావు.

ఇప్పు డర్థమయిందా! మనస్సు ఉండొచ్చు గాని, నీవు మనస్సు కాదని. నీవు గాని మనస్సు నిన్నెలా బాధపెడుతుంది?

నీవెవరివో నీకు తెలియనపుడు నీవు మనస్సై బాధపడుతున్నావు. ఆ తరువాత బాధనుండి బయట పడాలని ప్రయత్నిస్తున్నావు. మనస్సులో కూర్చొని బాధకు దూరం కాలేవు. మనస్సు నేను అని భావించుటచేత ఏర్పడిన దుఃఖము నేను మనస్సు కాదని గ్రహించటం వల్లనే పోతుంది.

ఇది కూడా అవగాహనే.

ఏ అవగాహన అయినా బుద్ధి జన్యమే. జ్ఞాన గమ్యమే.

దృశ్యా ధీవృత్తయః సాక్షీ దృగేవ న తు దృశ్యతే

మనస్సులోని వృత్తులన్నీ దృశ్యములే. నీవు సాక్షివి. కనుక ద్రష్టవే గాని దృశ్యము కావు అంటారు శ్రీ ఆదిశంకరాచార్య స్వామి.

సాక్షి లేనిదే దృశ్యాలు లేవు. దృశ్యాలలో ఉన్నది సాక్షియే. కాని, సాక్షిలో దృశ్యాలు లేవు. కనుక సాక్షి అసంగమై భాసిస్తోంది. నీవే సాక్షివి.

మనో నర్తకిని ఆడనీ. పాడనీ. ఆటలో నీ అడుగు పడకుంటే సరిపోతుంది. పాటలో నీవు శ్రుతి కలపకపోతే సమస్తము సరిపడుతుంది. లేనిదానితో స్నేహం చేసి, లేమిని కౌగిలించుకొని, కష్టాల్లో కూరుకుపోయిన తరువాత కలిమి కావాలని పరితపించటం కంటె, లేనిదానిని లేనట్లు పోనిస్తే, ఉన్న నీవు ఉన్నట్లే ఊరేగుతావు. ఇది ఉన్న విషయం. కాదెన్నడూ కానున్న విషయం.

ఇది అర్థమైతే, సంకల్పాలన్నీ నీవనే సాగరంలో అందంగా లేచిపడే అలలే. అలలను అలా లేచిపడుతూనే ఉండనీ. వాటిని కలలుగా కదులుతూనే ఉండనీ. నీవు నీవుగా ఉండు. చాలు. నిన్ను అవి అడ్డగించవు. అడ్డుకోవు. నీకు అవి అడ్డురావు. ఒడ్డు తెలియని సాగరరూపుడవైన నిన్ను అడ్డుకొనేవా రెవరుంటారు?

అడ్డు లేదిక నీకు, - సాగిపో!

ఎలా సాగినా నీలోనే సాగాలి, ఇది గుర్తుంచుకో. పో!

చలనం లేకుండా చలించు. చరించు. సంచరించు.

పరస్పర భేదాభిప్రాయాలు తలెత్తినపుడు దోషమంతా ప్రక్కవారిదే అన్నట్లు ఆలోచించటం ఎక్కువ మందికి అలవాటు. ఇక్కడే గుండె భారం పెరిగేది. వారు చెప్పే దానిలో కూడా వాస్తవ ముందేమో ఆలోచిస్తాం అని భావించి, ఆ కోణంలో విశ్లేషించటం మొదలుపెడితే, ఆ క్షణంలోనే మనస్సు తేలికపడటమే గాక, మనకంటూ కొన్ని అవగాహనా ద్వారాలు నాటకీయంగా తెరుచు కుంటాయి.

అద్వైతామృతము

పరమాత్మ విషయాన్ని ప్రక్కన బెట్టి మిగిలిన అనేక విషయాలను చర్చించేందుకు ఈ ప్రపంచంలో అనాదిగా చాలా శాస్త్రాలు ఉన్నాయి. పరమాత్మను గూర్చే ప్రధానంగా చర్చించే శాస్త్రము వేదాంత శాస్త్రము.

పరమాత్మ ఉంటే, అతడు జ్ఞానపూర్ణుడై ఉండాలి. పూర్ణుడై, అనంతుడై ఉండాలి. అనంతుడు కానివాడు నశిస్తాడు కనుక అట్టివాడు పరమాత్మ కాలేడు.

పరమాత్మ పూర్ణుడే. అవును. మరి ఈ ప్రకృతి ఏమిటి? సృష్టి పరమాత్మ కన్నా వేరుగా ఉంటే పరమాత్మ అనంతు డెలా అవుతాడు? కనుక సృష్టిరూపంలో గోచరించేది కూడా పరమాత్మే. సృష్టిలో పరమాత్మను ఎక్కడా వేరు చేయలేము.

ఈ సృష్టికార్యము ఒక విచిత్రమైన విషయము. పరమాత్మ ఎక్కడుండి ఈ సృష్టిని చేశాడు? సృష్టి వెలుపల ఉండి సృష్టించాడా? సృష్టి లోపలే ఉండి సృష్టించాడా?

సృష్టి లోపలే ఉండి సృష్టించా డనుకుందాం. ఇది సాధ్యమేమో ఒక్కసారి ఆలోచించండి. సృష్టి ఉంటేనే కదా ఆయన సృష్టిలో ఉండి సృష్టి చేయాలి? సృష్టి ముందుగానే ఉన్నప్పుడు ఇక ఈయన సృష్టించే దేముంటుంది? పైగా అనంతుడైనవాడు ఒక్కచోట ఎలా ఉండి సృష్టించగలడు?

సృష్టికి వెలుపల ఉండి సృష్టించా డనుకుందాం. సృష్టి జరగకముందు వెలుపల, లోపల అనే తేడా లుంటాయా? లోపల, వెలుపల అనేవి ఉపాధులు ఉన్నప్పుడే కదా? ఆకాశము ఉంటేనే కదా అలాంటివి సంభవములు! మరి సృష్టికి పూర్వము ఆకాశ మెలా ఉంటుంది? ఆకాశము కూడా పంచభూతాలలో ఒకటి కనుక సృష్టికార్యము తరువాతే కనిపించాలి.

అర్థమయిందా? పరమాత్మ సృష్టించటం కాదు; సృష్టిగా గోచరించటం. ఇది తెలిస్తే, సృష్టికర్త సృష్టికన్నా వేరుగా లేడని బోధపడుతుంది. ఇప్పుడు చెప్పండి. పరమాత్మ ఏ రూపంగా ఉన్నాడు? ఇది కాదు ప్రశ్న. పరమాత్మ ఏ రూపంలో లేడు? అన్ని రూపాలు తానే. కనుకనే సనాతన ధర్మం "కాదేదీ పూజ కనర్హం" అని గర్జించింది. పాము మొదలు పంది వరకు, బొమ్మ మొదలు నంది వరకు దేవతలై శోభించాయి.

సర్వం బ్రహ్మమయం ప్రోక్తం సర్వం బ్రహ్మమయం జగత్

"అంతయు బ్రహ్మమేనని చెప్పబడింది. ఈ జగత్తంతయు బ్రహ్మమే" అన్నది తేజోబిందూపనిషత్తు.

జగత్తు, జగదీశ్వరుడు ఏమిటో తెలుసుకున్నాం. ఇక మన విషయానికి వస్తాం. జీవుడు ..?.. చూడు. నీకు అన్నీ తెలుస్తున్నాయి. నీ మీద ఆధారపడి తెలుస్తున్నాయి.

నీవు స్వతస్సిద్ధంగా భాసిస్తున్నావు. నీవు ఏమిటి? నీ వెవరు? **(కస్త్వం)** ఈ విచారములో అన్నీ మిథ్యగా నిషేధింపబడుతాయి. అన్నీ నిషేధింపబడిన పిదప ఏది నిషేధింప బడుటకు వీలుకానిదై శేషించియున్నదో అదే సాక్షీ చైతన్యము. సాక్షీ చైతన్యానికి రూపం లేదు. అది కేవలం చిన్మాత్ర స్వరూపము. బోధానందమయం.

చైతన్యం అభేద స్వరూపము. కనుక నీ చైతన్యము, ఈశ్వర చైతన్యము రెండు కావు. ఒక్కటే. ఇది తెలిస్తే నీవు, ఈశ్వరుడు ఇద్దరూ నిజానికి ఒక్కరే. కనుక నీలో ఆత్మగా ప్రకాశించేది పరమాత్మయే.

తదే వాత్మాన మిత్యేత ద్బ్రహ్మ శబ్దేన వర్ణితమ్

"ఆ ఆత్మయే 'బ్రహ్మ' శబ్దము చేత వర్ణింపబడినది" అని నారద పరివ్రాజకోపనిషత్తు. కనుక జీవాత్మ, పరమాత్మల మధ్య స్వరూపతః అభేదమే గాని భేదము లేదని తేలిపోయింది. అయితే, సృష్టి రూపంలో ఉన్నది పరమాత్మయేనని ముందుగానే గ్రహించినాము కదా! ఇప్పుడు జీవ బ్రహ్మల మధ్య భేదము లేదని గ్రహించినపుడు, జీవజగత్తుల మధ్య సంబంధమెలా ఉంటుంది? పరమాత్మకన్నా జీవాత్మ అన్యము కాదని గ్రహించినపుడు జగద్రూపం జీవునికన్నా వేరుకాదు. జీవుడు జగత్తులో కూడా వ్యాపించియే యున్నాడు.

పిండస్థోపి ప్రత్యగాత్మా సర్వవ్యాపీ భవతి!

"దేహమునందున్న ప్రత్యగాత్మ సమస్తములో వ్యాపించి యున్నాడు" అన్నది పైంగలోపనిషత్తు.

జగత్తు, జీవుడు, బ్రహ్మము - ఈ ముగ్గురు అభేదరూపంగా భాసిస్తున్నారు. భేదము స్వప్నమువలె మిథ్య. అభేదమే సత్యము. అదియే అద్వైతము. అమృతము. అద్వైతామృతము.

వేదాంత సిద్ధాంత నిరుక్తి రేషా బ్రహ్మైవ జీవః సకలం జగచ్చ
అఖండరూప స్థితిరేవ మోక్షః బ్రహ్మాద్వితీయే శ్రుతయః ప్రమాణమ్

వేదాంత సిద్ధాంత నిరుక్తిః=ఉపనిషత్తుల యొక్క సిద్ధాంతముల తాత్పర్యము, ఏషా=ఇదియే, జీవః=జీవుడు, బ్రహ్మ ఏవ=బ్రహ్మమే, సకలం జగత్ చ=మరియు సమస్త ప్రపంచమును, అఖండ రూపస్థితిః ఏవ=ఖండము గాని స్వరూప స్థితియందు ఉండుటయే, మోక్షః=మోక్షమైయున్నది, బ్రహ్మాద్వితీయే=రెండు కాని బ్రహ్మము విషయమున, శ్రుతయః =శ్రుతులు, ప్రమాణమ్=ప్రమాణము.

'జీవుడు', సమస్తమైన జగత్తు బ్రహ్మమే. అఖండమైన స్వరూపస్థితిలో ఉండి పోవుటయే మోక్షము. ఇదియే వేదాంత సిద్ధాంత నిర్వచనము. అద్వితీయమైన ఈ బ్రహ్మము విషయమున వేదములే ప్రమాణములై ఉన్నాయి.

తత్త్వమేవ

ఈ ప్రపంచంలో మనకు చాలా అవసరాలు ఉన్నాయి. ఆశలూ ఉన్నాయి. వాటిని మనకు మనంగా తీర్చుకోలేకపోతున్నాం. ఇక్కడ మరొకరి అవసరం మనకు ఏర్పడింది. ఆ అవసరం భగవంతుడయ్యాడు. అంటే, భగవంతుడు కూడా అనేక అవసరాలలో ఒక అవసరంగా మారాడు.

అవసరాలు, ఆశలు తీరుతున్నాయనుకోండి. అప్పుడు భగవంతుని అవసరం మనకేముంది? కనుకనే భగవంతుడు అలాంటి సమయాల్లో జ్ఞాపకం రాడు.

అవసరాలు తీరేందుకు భగవంతుడు అవసరం అని భావిస్తున్నామే గాని, అవసరాలు తీరినా అసంతృప్తి తీరనపుడు, అవసరాలను భగవంతుడు ఆదుకొంటే మాత్రం మనకు ఒరిగేదేమిటి? అని ఆలోచించలేకపోతున్నాము.

అవసరాలను తీర్చేందుకు భగవంతుడు అవసరం అనే విషయాన్ని విస్మరించి భగవంతుణ్ణే జీవితంలో ఏకైక అవసరంగా గుర్తించాలి. ఆ క్షణంలో అన్యమైన అవసరాలను గుర్తించే అహం ఉండదు. ఉండలేదు. 'అహం' తెలియని హృదయంలో ఉన్నది ఈశ్వరచైతన్యమే.

అహమి నాశభాజి అహ మహం తయా స్ఫురతి హృత్స్వయం పరమ పూర్ణసత్

అన్య అవసరాలతో ఊగిసలాడే 'అహం' భావన ఊడిపోగానే, 'అహం' పరిపూర్ణ సద్రూప చైతన్యంగా హృదయంలో ఊరేగుతుంది.

భగవంతుడే అవసరం అనే భావనే భక్తి. ఈ భక్తి కుదిరినపుడు మన ప్రేమలు భగవంతునికి దూరంగా ఎలా నడుస్తాయి? కనుకనే,

సా త్వస్మిన్ పరమ ప్రేమరూపా!

'భగవంతుని యందలి ఉత్కృష్టమైన ప్రేమయే భక్తి' అని నారద మహర్షి భక్తిసూత్ర ప్రబోధము.

ఈ ప్రేమే గతంలో అర్థంగాక అనేక అవసరాలను వెంబడించింది. ప్రపంచం వెంట పరుగులిడింది. ఆ ప్రేమే ఇప్పుడు పరమాత్మలో స్థిరపడిపోయింది. అన్యమైన అశాశ్వతములను ప్రేమించడం వలన, పొందడం వలన, అసంతృప్తి తొలగకపోవడమే గాక, పరమాత్మ జారిపోతూనే ఉండినాడు. పరమాత్మను ప్రేమించి పొందడము వలన అసంతృప్తి, అశాంతి అదృశ్యం కావడమే గాక, పరమాత్మతో పాటు అన్నీ లభిస్తున్నాయి. ఎందుకని? పరమాత్మకన్నా అన్యంగా ఏదీ లేనందున పరమాత్మ లభించగనే సర్వమూ

సిద్ధించినట్లవుతున్నది. ఒక అలకు దగ్గరైనపుడు మరొక అలకు దూరంగా ఉన్నట్లు భావిస్తాడు. సముద్రానికి చేరువయ్యానని భావించిన వానికి అలల మధ్య తారతమ్యాలు గోచరిస్తాయా?

అల వలె పరమాత్మ పరిమితుడు కాడు. సాగరము వలె అనంతుడు. అనంతుని వద్దకు ప్రయాణం కట్టడం సాధ్యం కాదు. అనంతునితో ఐక్యం కూడా వీలుకాదు. సాగర మధ్యమున నిలిచియున్న అలయందు సముద్రుడు శయనించి యున్నాడని భావించి సముద్రములో దిగినవాడు ఎంత ప్రయత్నించినా సాగరుని చేరలేడు.

సముద్రుడు అంతటా యున్నాడు. సాగరుడు ఎక్కడో ఉన్నాడని భావించిన అల ఎంత అల్లాడినా సాగరుని చేరలేదు. ప్రతి అలలో తానే ఉన్నాడు. అలకు పరిమితం కాకుండా అలలో కలిసి యున్నాడు.

అందరిలోని ఆత్మ పరమాత్మయే. మరి ఆత్మ ఎక్కడికి వెళ్ళి పరమాత్మను కలియాలి? ఇక్కడ కలిసేందుకు, కదిలేందుకు వీలే లేదు. కేవలం కని తరించడమే. ఆ తరువాత శని నశించడమే. ముని పరవశించడమే.

సముద్ర మేమిటో బోధపడిన వానికి తరంగభేదము ఎలా స్ఫురిస్తుంది? సాగరుని గుర్తిస్తే, అన్ని కెరటాలు కడలికన్నా అన్యం కానట్లు భావించడం ప్రయత్నం లేకుండా సిద్ధిస్తుంది. ఇదే సిద్ధత్వం. బ్రహ్మవిద్యాసిద్ధత్వం.

బ్రహ్మవిద్యాయాఃఫలం సర్వభావాపత్తిః

'సమస్తములోని అభిన్నత్వమును దర్శించే ఫలమును బ్రహ్మవిద్య ప్రసాదిస్తుంది' అంటారు బృహదారణ్యకోపనిష ద్భాష్యంలో శ్రీశంకరులు.

కనుక ముముక్షువు అన్య విషయాసక్తిని విడిచి, మోక్షమునే పరమార్థంగా భావించి జీవించాలి. మోక్షమనగా పరమాత్మతో అభిన్నమై ఉండుటయే.

బ్రహ్మభావశ్చ మోక్షః

"బ్రాహ్మీస్థితియే మోక్షము" అన్నారు బ్రహ్మసూత్ర భాష్యంలో శ్రీశంకరాచార్య స్వామి. ఇదియే బ్రహ్మభావము. ఆత్మభావము లేదా ఆత్మస్థితి.

స్వ సంవేద్యం న పర ప్రత్యక్షమ్

తాను దర్శించ దగిందేగాని పరులు దర్శించను వీలుపడనిది.

అనంతానందం

నేను ఒంటరివాణ్ణి.

నాతో కలసి వచ్చినవారు లేరు. కలిసి నడచేవారు లేరు. విడిచేనాడు కలిసి వచ్చేవారూ లేరు.

ఉన్నారు అందరూ. నా వాళ్ళెందరు?

దేశత: నేను పరిమితుణ్ణి.

కాలత: నేను పరిమితుణ్ణి.

కాలః జగద్భక్షకః

కాలం భయంకరమైంది. యావత్ప్రపంచాన్ని ఒక్క గుటకలో మ్రింగేస్తుంది. నన్నూ కాజేస్తుంది. ఈ కాలసర్పం నన్నూ కాటేస్తుంది.

నేను ఒకనాడు ఉండబోను. అలా ఆలోచిస్తూ వుంటే, ఈనాడు ఉండినా బోనులో ఉన్నట్లే ఉంది.

ఇలాగే ఉంటాయి మనందరి ఆలోచనలు. ఇదొక సుడిగుండం. సంకల్ప సుడిగుండం.

బాబూ! సుడులు లేవు. గుండాలు లేవు. నీవు వేసుకొన్న ముడులే సుడులు. నీవు కొనితెచ్చుకొన్న గండాలే గుండాలు.

నేను నీకు అండగా ఉన్నాను. నీతో ఉన్నాను. నీతో ఉంటాను.

నీవు ఒంటరివాడవే.

నేనూ ఒంటరివాడనే.

ఒంటరితనం సత్యం. ఒంటరితనం జ్ఞానం. ఒంటరితనం అనంతం.

నీ ఒంటరితనం అంతమవుతుంది.

నా ఒంటరితనం అనంతంగా భాసిస్తుంది.

మా భైష్ట విద్వన్ తవ నాస్తి అపాయః

'భయపడకు! నీకు అపాయమేమీ లేదు' - అంటూ గురువు శిష్యుని మనసులోకి ప్రవేశిస్తాడు.

సంసార సింధోః తరణే అస్తి ఉపాయః

'భవ సాగరాన్ని దాటుటకు ఉపాయముంది' - అంటూ ప్రమాణాన్ని చేతపట్టుకొని శిష్యుని చిత్తంలో తిష్ఠ వేస్తాడు.

నీవు పూర్ణాన్ని వాంఛిస్తున్నావు. అది లేనిదైతే నీకు ఆశ ఎలా కలిగింది? ఉన్నదే అయితే, ఉన్న పూర్ణంలో నీవు వేరుగా ఎలా ఉండగలవు? పూర్ణముంది. పూర్ణముంటే, పూర్ణానికి సంబంధించిన జ్ఞానము ఉంటుంది. ఆ జ్ఞానము కలిగితే పూర్ణము తెలుస్తుంది. ఏమని?

నీకన్నా పూర్ణము వేరని కాదు. నీవే పూర్ణమని. శూన్యము తెలియని పూర్ణమని.

బాబూ! తెలిసిందా! కలిసివచ్చేందుకు ఉన్నవారెవరు? ఇంతకీ మనం వచ్చిందెపుడు? విడిచి వెళ్ళేదేముంది? విడవడానికి ఏముంది? విచిత్ర నాట్యాలు చేసిన మాయను తప్ప.

దేశకాలాలకు నీవు పరిమితుడివి కావు.

దేశకాల వస్తు అపరిచ్ఛిన్న పరబ్రహ్మవు నీవు.

'కాలః జగద్భక్షకః' అంటావా?

'కాలస్యాపి భక్షకః అయమాత్మా' ఆత్మనైన నేను కాలాన్ని కూడా భక్షిస్తాను అని గర్జించు.

"మూడుమూళ్ళ తొమ్మిది". ఈ జ్ఞానము సత్యమైనదేనా? అయితే, ఏ దేశంలోనైనా ఇది ఇలాగే ఉంటుంది. ఏ ప్రదేశానికి మనం వెళ్ళినా అది ప్రదేశమే కనుక ఆకాశం ఉండి తీరాలి. ఈ విధమైన జ్ఞానం ఎక్కడైనా ఒక్కటే. మేఘాలు ఎక్కడైనా ఆకాశంలో వ్రేలాడుతూ ఉంటాయి. మేఘాలంటూ ఉంటే, వాటిలో నీళ్ళుంటాయే గాని, కిరసనాయిలు, డీజిల్ ఆయిలు ఉండదు. ఇదంతా జ్ఞానం.

మరి భగవంతుడు ఉంటే, ఆయనకు సంబంధించిన జ్ఞానం ఉండాలి. భగవంతుడు సత్యమైతే, ఆయన జ్ఞానం కూడా సత్యమై ఉండాలి. మరి, దేవుణ్ణి గురించి మాట్లాడే వారందరూ ఒక్కటే చెప్పాలికదా, అందరికీ పరమాత్మ జ్ఞానం ఉంటే.

ఎందరు చెప్పినా అన్నీ భిన్నంగా ఉన్నాయి కనుక వీటిలో నిత్యసత్యమేదో మనిషి పట్టుకోవాలి. అది విశ్వసిస్తే దొరకదని, విచారిస్తేనే లభ్యమని ఇక ప్రత్యేకంగా చెప్పడమెందుకు?

ఉగాది - జ్ఞాన పునాది*

ఆరోగ్యము - ఐశ్వర్యము

ఈ రెండు ఉంటే జీవికి సరదా. జీవునికి దేవునికి మధ్య నిజానికి ఈ రెండే దుర్భేద్యమైన పరదా.

ఆరోగ్యముంది; అభిరుచుల్ని తీర్చుకోవాలని ఉంటుంది. ఐశ్వర్యముంది; అభీష్టాలను నెరవేర్చుకోవాలని ఉంటుంది.

ఆరోగ్యం పాడైతే,

"భగవాన్! నన్ను ఉద్ధరించు. నన్ను బ్రతికించు. నన్ను కరుణించు" అని మొరపెట్టు కుంటాము.

పేదరికంలో,

"భగవంతా! తొలగించు నా చింత. ఏమీ లేని నాకు, ఏదీ లేని నాకు నీవే దిక్కు. ఈ చిక్కుముడిని విప్పు"; అని ప్రార్థిస్తాము.

ఆరోగ్యాలు, ఐశ్వర్యాలు భక్తికి అవరోధాలుగా నిలిస్తే, రోగాలు, శోకాలు భక్తికి రహదారిని నిర్మిస్తున్నాయి. గిరిధారిని చూపెడుతున్నాయి.

కలతల్లో కవితలు పుడుతాయి.

గాయాలు గానాన్ని కదిలిస్తాయి.

ఆలాపనలు ఆనందాన్ని కలిగిస్తాయి.

ఆనందాలు విలాపాల్ని తొలగిస్తాయి.

ఇది జ్ఞానజీవన బాట. భక్తి జీవన పాట.

జీవికి అందమైన ఆట. జీవితంలో రతనాల మూట.

అందరికీ అన్నీ అనుకూలంగా ఉండవు. ఒకవేళ నేడున్నా, రేపు ఉంటాయని చెప్పలేము. పరిస్థితులు మారుతూ ఉంటే, వాటితో పాటు మన మనస్సు కూడా మారటం ప్రారంభిస్తే, ఇక సుఖమనేది జీవితంలో కుందేటి కొమ్మే అవుతుంది.

నీకు ఏవైనా ఉండొచ్చు.

అవి "నీవి"గా లేవు. నీ వద్ద ఉన్నాయి. నీ కొరకే ఉన్నాయి. కానీ నీవి కావు. కొంతకాలం నీ వద్ద ఉంటాయి. కొంతకాలం తరువాత నీ వద్ద ఉండవు. నిన్ను వదలి పోయేవి నీవెలా అవుతాయి?

పోనీ, అవి నావి కాకపోవచ్చు. నా వద్ద ఉన్నంతవరకు నేను వాటికి యజమానినే కదా?

ఏమో! **విచారః కర్తవ్యః.** నేను యజమానిని అని చెప్పటానికి నేను ఏమి సృష్టించాను? ఏదీ సృష్టించని నేను యజమానిని ఎలా అవుతాను?

ఉన్నవన్నీ ఉమాపతివే. నా అదృష్టవశాత్తు నాకున్నాయి. ఈశ్వర ప్రసాదంగా నాకు లభించాయి.

* ("ఉగాది"కి పూజ్య స్వామీజీ ప్రత్యేకంగా వ్రాసిన వ్యాసం)

ఏవి ఉండినా నష్టం లేదు.

మనం వాటికి సంబంధించిన వారుగా ఉంటే మాత్రం లాభం లేదు.

అవి నావి అనుకుంటే వాటికి సంబంధించి ఉంటాం.

అవి బాగుంటే, మనం బాగుంటాము. అవి చెడిపోతే, మన మనస్సు పాడైపోతుంది. కోరుకున్నవి రావచ్చు. వచ్చినవి అలాగే ఉంటాయని చెప్పలేము. వచ్చేవి ఏవైనా పోయేందుకే వస్తాయి. ఒకదాని కారణంగా సుఖం వస్తే, ఆ సుఖానికి కారణమైనది దూరం కాగానే సుఖం కూడా దూరమవుతుంది. **(నిమిత్తాపాయే నైమిత్తికాపాయః)** దూరమయ్యే సుఖం ఏదైనా భారమే.

ఈ ప్రపంచంలో సుఖాల్ని ఏరుకొనేది మనమే. పారేసుకొనేది కూడా మనమే. స్నేహం ఉండొచ్చు. మోహం ఉండకూడదు. ఇదే 'అభిస్నేహ' మని గీతాచార్యుని మాట. మమకారం తియ్యని విషంలాంటిది. అది నిలువునా ప్రాణాల్ని తోడేస్తుంది. మంచి చెడులను చూడదు. ద్రోణుడు మంచివాడు. ధృతరాష్ట్రుడు కాడు. కానీ, పుత్ర వ్యామోహంతో ఇద్దరూ పాడైపోయారు.

జీవితంలో ఏం జరుగుతుందో, ఏం జరగదో అనే విషయంలో సందేహం ఉండవచ్చు. చావు విషయంలో సందేహం లేదు.

ఉన్న కాలం విలువైంది.

వినియోగించుకోవటమే జ్ఞానం. ఇదే కావాలి జీవితంలో క్రొత్తదనం.

నేడు ఉగాది.

ఇది జ్ఞానానికి ఆది కావాలి. తపస్సుకు ఆది కావాలి. అధ్యయనానికి ఆది కావాలి. అవగాహనకు ఆది కావాలి. అనాదిగా వస్తున్న అజ్ఞానాన్ని అంతం చేసేందుకు నాంది కావాలి. జ్ఞాన సౌధాన్ని నిర్మించేందుకు పునాది కావాలి. 'నాది'ని ఓడించే వాది కావాలి. న్యాయవాది కావాలి.

ఇది జీవితం.

తియ్యని సుఖాలు ఉంటాయి. చేదు బాధలు ఉంటాయి. మ్రింగలేని వగరులు ఉంటాయి. ముప్పు తెచ్చే ఉప్పులు ఉంటాయి. కారాలు నూరి ప్రయోజనము లేదు. అందనివి పులుపు అంటే సౌందర్యముండదు.

సిద్ధ్య సిద్ధ్యో స్సమో భూత్వా సమత్వం యోగ ఉచ్యతే

ఏది సిద్ధించినా, ఏది సిద్ధించకపోయినా సముడవై యుండు. సమత్వమే యోగము అని అంబ పలుకు. జగదంబ పిలుపు.


ఉగాది పచ్చడి తిన్నాం. పంచాంగం విన్నాం. గీతను ఇక వింటూ ఉంటాం. ఉంటూ వింటాం. విన్నది కంటాం. కన్నదానిలో కరిగిపోదాం.

పచ్చడి ప్రసాదం *


నాది ఏది? ఆది ఎవరిది?
ఇది గ్రహించమని తెలిపేందుకే వస్తూ ఉంది అనాదిగా ఉగాది.
ఆగ్రహిస్తే పాతది. అనుగ్రహిస్తే క్రొత్తది.
ఆగ్రహానుగ్రహాలను నిగ్రహించి గ్రహించమని,
పది కాలాల పాటు పచ్చగా జీవించమని
పసిడి వన్నెతో
పచ్చడి గిన్నెతో
మల్లెపూలతో, మామిడిరసంతో
చింతలో తీపి బెల్లాన్ని కలిపి
చకచక మని కదలి వస్తున్న ఉగాది వసంతలక్ష్మి ఉగ్రవాదాన్ని నిగ్రహించు గాక!
తీవ్రవాదాన్ని, ధన దాహాన్ని, పదవీ వ్యామోహాన్ని, దురవగాహనను
దూరతీరాలకు తరలించు గాక!
అజ్ఞానము పంచే బోధల్ని
అహంకారము దించే బాధల్ని
అసూయా సెగలను, ద్వేష పగలను
సమాజంలో అంతమొందించు గాక!
షడ్రుచులను ఏకం చేసి
అభిరుచులను మాయం చేసే
తీపి చేదుల ఉగాది పచ్చడి
రాగద్వేషాలను సమరసం చేసి
కలతను తొలగించి
సమతను మదిలో కలిపేందుకు, శాంతిని హృదిలో నిలిపేందుకు
కాలం కనికరించి ప్రసాదించిన పసిడి.
ఆడించి పాడించేందుకు
ఊగించి, ఊరించేందుకు
ఉత్సాహాన్ని దింపి ఊరేగించేందుకు
లాలించి పాలించేందుకు, పాలిచ్చేందుకు
మన మధ్యకు పరుగులిడుతున్న ఉగాది
నిజానికి దివి నుండి దిగి వచ్చిన అమ్మ ఒడి. పలుకులమ్మ ఒడి.
అమ్మ ఒడి కావాలి మనకు బడి. అదియే నిజమైన రాబడి
అప్పుడే బ్రతుకులో సందడి.

సర్వేజనాః సుఖినో భవన్తు

* (2002 సం॥ ఉగాది సందేశం)









అ ఆ ఇ ఈ

అ, ఆలతో ప్రారంభ మవుతుంది విద్యారంభం.

బాల్యంలో ఆరంభమైన అ, ఆ లు బ్రతుకంతా పెనవేసుకొనే ఉంటాయి. బ్రతుకు దీపం ఆరేటప్పుడు కూడా అవి అండనే ఉంటాయి.

- - - - పలక క్రిందబడి పగిలిపోయింది...................... అ

నాన్న నీకు బొమ్మలు కొనితెచ్చాడు.................. ఆ } ఇలా బాల్యం

- - - - వ్యాపారంలో నష్టమొచ్చింది...................... అ

జీతం అదనంగా పెరిగింది........................ ఆ

దూర ప్రాంతానికి బదిలీ అయింది.................. అ

కుమారుడు ప్రథమ శ్రేణిలో పాసయ్యాడు.............. ఆ } ఇలా మధ్య జీవితం

- - - - మూత్రపిండాలు చెడిపోయాయట...................... అ

మీ మనుమరాలికి కొడుకు పుట్టాడట........................ ఆ

మీ భార్య ఇక రోజులేనట.................................. అ

సహస్రమాసోప జీవిగా మిమ్మల్ని సన్మానిస్తాం..... ఆ }

'అ' గుండె పగిలినంత ఆవేదనను ముందుంచితే, 'ఆ' హృదయంలో పొంగి పొరలే ఆనందాన్ని నింపుతున్నది.

బాల్యంలో బడిపంతులు దిద్దిచ్చిన 'అ, ఆ' లను బ్రతుకంతా రాసుకొంటూ, రుద్దుకొంటూ నడక సాగించాలి.

బ్రతుకంతా "అ ఆ"లే నిండిపోయాయి. ఇక, "ఇ ఈ"లు ఆరంభమయ్యే దెప్పుడు?

'ఇ' - ఇదం

'ఈ' - ఈశ్వరః

"ఇదం" అంటే ఇది. అంటే, దృశ్య ప్రపంచము. ఇందులో మన దేహేంద్రియ మనోబుద్ధుల సంఘాతముతో పాటు అవిద్య కూడా ఇమిడి ఉంది.

"ఈశ్వరః" అంటే జగత్కారణమైన బ్రహ్మ. శుద్ధ చైతన్యము. సత్యజ్ఞానానంద స్వరూపమైన అఖండ పరబ్రహ్మము. ఇది మన ప్రత్యగాత్మకన్నా అన్యముగాని పరమాత్మ స్వరూపము. అదే ఈశ్వర చైతన్యము.

"ఇదం"ను పరిశీలిస్తే ఈశ్వర వైభవం అవగతమవుతుంది.

ఈశ్వరుని అవలోకిస్తే ఇదం ఈశ్వరమయంగా తెలుస్తుంది.

ఈశావాస్య మిదగ్ం సర్వం యత్కించ జగత్యాం జగత్

"ఈ దృశ్య ప్రపంచమంతయు పరమాత్మ చైతన్యముచే పరివ్యాప్తమై ఉంది" అని ఈశావాస్యోపనిషత్తు.

సర్వం ఖల్విదం బ్రహ్మ

ఇదం సర్వం ఖలు బ్రహ్మ - 'ఈ ప్రపంచమంతయు బ్రహ్మమే' అని ఉపనిషత్తు ఎలుగెత్తి పలికిన ఈ వాక్యము మామూలు వాక్యము కాదు. మహావాక్యముల కోవలోనిదే.

'ఇదం' లో ఉన్నదంతా "ఈశ్వరః" యే అని తేలినపుడు 'ఇదం' కూడా ఈశ్వర చైతన్యం గానే మిగిలిపోతుంది.

'ఇదం' ఈశ్వరత్వమే అని తేలినా ఈశ్వరుడు 'ఇదం' కాకుండా వెలిగిపోతూ ఉంటాడు. అవును.

కుండ మట్టే. మట్టి కుండ కాదు.

సర్పము రజ్జువే. రజ్జువు సర్పం కాదు.

జగత్తు కూడా జగదీశ్వరుడే. జగదీశ్వరుడు జగత్తు కాడు.

ఇదే అద్వైత వైభవం.

'అ, ఆ'లు జీవితాన్ని ఆవేదనా కూపంలో పడదోస్తే 'ఇ, ఈ'లు జీవిని ఆనంద సాగరంలో ముంచుతున్నాయి.

ఇ, ఈ లు మనకు ఎంత ఆప్తులో!

అయితే అ, ఆ లు కూడా ఆప్తులే.

ఎలా?

'అ' - **అక్షరాణాం అకారోస్మి** . . . 'అర్జునా! అక్షరాలలో నేను 'అ' కారమును; అని గీతలో శ్రీ భగవానువాచ.

'అ' ఎవరో కాదు. మన అచ్యుతుడే. మన నాథుడే. ఇక మనం అనాథుల మెలా అవుతాము? అనాథుల మనుకున్నా, 'అ'ని నాథుడుగా కలిగినవాళ్ళం కనుకనే మనం అనాథులం. నిజానికి సనాథులం.

'అ' అంటే ఎవరో తెలిసిందా?

'ఇది' తెలిస్తే, తరువాత 'ఆ' వస్తుంది. అదే ఆనందం. అనంతానందం.

'అ' అనంతం. 'ఆ' ఆనందం. 'అ, ఆ' లు చేరితే అమితానందం.

ఇదే అందరి గమ్యం.

దీనివైపుకే జీవులందరి గమనం.

'అ, ఆ'ల అంతరార్థాలను గ్రహించాం.

'ఇ, ఈ'లలో ఇమిడిన భావాలను సంగ్రహించాం.

ఇంకేమి కావాలి?

ఉవ్విళ్ళూరే ఆనందంతో ఊరేగడమే.

ఏడుపు లేకుండా ఒడలు పులకరించే ఔన్నత్యముతో 'అహ' -

'అహ' - అహ. . . . . . అంటూ

అహమస్మిప్రథమజా ఋతాస్య

పూర్వం దేవోభ్యోయ అమృతస్య నా భా ఇ

"ఈ ప్రపంచము కంటెను ముందే ఆవిర్భవించినవాడను.

దేవతలకు ముందున్న వాడిని. అమృతత్వానికి ఆదియైనవాడిని" అనే తైత్తిరీయ శ్రుతితో శ్రుతి కలిపి, మతి నిలిపి, యతి వైభవముతో శోభించడమే.

ఎన్నో, మరెన్నో ఉన్న ఈ ప్రపంచంలో తృప్తి చెందాలి అంటే ఎన్నో చేయాలి, ఎన్నెన్నో చేయాలి, మరెన్నో చేయాలి. ప్రయత్నాలే మనం చేయగలం. అన్ని ప్రయత్నాలు ఫలిస్తాయా? కొన్ని ఫలిస్తే తృప్తి వస్తుందా? అన్నీ ఫలిస్తే తృప్తి కలుగుతుందా? అన్నీ ఫలించాలి. ఎన్నని? ఎంతకాలమని? కనుక, ఏవో ఏవో పొంది తృప్తిని పొందలేక అలమటించటం కన్నా తానే తృప్తి అని గ్రహించగలిగితే, అన్నిటిని ఏకకాలంలో పొందిన ఆనందానుభూతి కలుగుతుంది. ఇలాంటి అరుదైన అనుభూతి ఉన్నదా? ఉంది (అస్తి), - దీనిని నిరూపించేందుకే ప్రమాణంగా వేదాంతం శోభిస్తోంది.

జీవ స్వరూపము

బుద్ధి యందు ప్రతిఫలించిన ఈశ్వర చైతన్యమే జీవుడు. అనాదిగా ఈ ప్రతిబింబ చైతన్య రూపుడైన జీవుడే పుణ్యపాప ఫలభోక్తగా ఉన్నాడు. కనుక దేహంతో ఆవిర్భవించి దేహంతో జీవుడు అంతరించేవాడు కాడు. లోకాంతర గమనము, అవస్థాత్రయము నందలి భోక్తృత్వము జీవునకు సంబంధించినవే.

ప్రతిబింబ చైతన్యము లేనిచో బుద్ధికి చలనముండదు. బుద్ధి లేనిచో ఈశ్వర చైతన్యము ప్రతిబింబించేది ఉండదు. కనుక ఈ రెండును అన్యోన్య తాదాత్మ్యము చెంది ఉన్నాయి. ఈ అధ్యాసలో ఒకరి లక్షణములు మరియొకరిలో తెలుస్తున్నాయి.

ఉపాధి తాదాత్మ్యం తొలగినచో జీవుడే పరమాత్మగా శోభిస్తున్నాడు. నిర్వికారంగా గోచరిస్తున్నాడు. అంతవరకు అంతఃకరణ దోషముచేత దోషములున్నట్లు తెలుస్తున్నాడు.

యథా దర్పణ మాలిన్యా ద్మృశ్యతే మలినం ముఖమ్
తద్వ దన్తఃకరణగై ర్దోషై రాత్మాపి దృశ్యతే

"అద్దముపై నున్న మలినము వలన అద్దములో ప్రతిబింబించిన ముఖముపై మలిన మున్నట్లు ఎలా తెలియుచున్నదో, అలాగే అంతఃకరణ దోషములు ఆత్మయందు ఆరోపించబడుతున్నాయి.

సుఖదుఃఖాలు అనేవి అంతఃకరణ లక్షణాలే గాని జీవుని లక్షణాలు కావు. ఎడారిలో నీరు లేకున్నను ఎండమావి తెలిసిరాగానే అక్కడ జలమున్నట్లు తెలుస్తూ ఉంది. అది ఆరోపితమే గాని వాస్తవము కాదు. జీవుని కర్తృత్వ భోక్తృత్వాదులు కూడా అంతే.

కామ స్సంకల్పో విచికిత్సాఽ శ్రద్ధా ధృతి రధృతిః హ్రీ ర్ధీ ర్భీరిత్యే తత్సర్వం మన ఏవ!

"కామము, సంకల్పము, సంశయము, శ్రద్ధ, అశ్రద్ధ, ధైర్యము, అధైర్యము, సిగ్గు, బుద్ధి, భీతి - ఇవన్నీ మనసే అయి ఉన్నాయి" అని బృహదారణ్యా కోపనిషత్తు.

ఈ విధమైన మనసుతో తాదాత్మ్యం చెందుటచేత మనోధర్మములు తన యందు ఆరోపించుకొని తానే భోక్త యని జీవుడు భావిస్తున్నాడు.

ఆత్మేంద్రియ మనో యుక్తం భోక్తే త్యాహు ర్మనీషిణః

"మనసుతో కలిసిన ఆత్మ జీవుడుగా పిలువబడుచున్నాడు" అని కఠోపనిషత్తు.

జీవుడు స్థూల దేహము నంతటిని వ్యాపించి హృదయస్థుడై ప్రకాశిస్తున్నాడు. స్థూల దేహముతో తాదాత్మ్యం చెందియుండుట చేత దేహ ధర్మములను తన యందు ఆరోపించుకొనుచున్నాడు. లింగభేదాలకు, జాతి భేదాలకు శ్రీకారం చుట్టాడు.

స్థూల దేహము నుండి సూక్ష్మ శరీరము వేరైనపుడు మృత్యువు సంభవిస్తుంది. అప్పుడు జీవుడు కూడా దేహము నుండి వెళ్ళినట్లు భావించడం జరుగుతోంది. కుండను తీసికొని పోవునపుడు కుండతోపాటు కుండలోని ఆకాశము కూడా పోతున్నట్లు భావించడం ఎలా జరుగుచున్నదో, సూక్ష్మ శరీరము దూరమగునపుడు జీవుడు కూడా దూరమైనట్లు భావింపబడుచున్నది.

జీవుడు వాస్తవానికి నిష్క్రియుడు. అతనికి స్థూల, లింగ శరీరాదులు లేవు. గమనాదులు, అనుభవాదులు ఉపాధి లక్షణాలే గాని జీవునికి సంబంధించినవి కావు. సూర్యుడు కదలకపోయినా ఆయన కిరణములు విశ్వమంతటను వ్యాపించునట్లు జీవుడు నిష్క్రియుడైనను, కర్మానుసారము భోగానుభవము కలుగుటకు బుద్ధియందు ఉత్పన్నమైన వృత్తులు నాడులతో చేరి కర్మేంద్రియముల ద్వారా బాహ్యంలో చరిస్తూ ఉంటాయి.

పూర్వ కర్మానుసారము వృత్తులను కదిలించే ఈ సూక్ష్మ శరీరము మోక్షప్రాప్తి వరకు ఉంటుంది. మోక్షము ఆత్మజ్ఞానము వలననే ప్రాప్తిస్తుంది.

ఆత్మజ్ఞానేన నష్టేఽ స్మి న్నవిద్యే స్వశరీరకే
ఆత్మ స్వరూపావస్థానం ముక్తి రిత్యభిధీయతే

"ఆత్మజ్ఞానముచే అవిద్యతో కూడా సూక్ష్మశరీరము ఇక్కడే నశిస్తుంది. ఆత్మ స్వస్వరూపంలో ఉంటుంది. అదియే మోక్షము".

కుండ పుట్టినపుడు కుండతో పాటు ఘటాకాశము పుట్టినట్లు గోచరించినా కుండ నశించగనే ఘటాకాశము మహాకాశములో విలీనమగునట్లు, సూక్ష్మ శరీర చలనము వలన జీవుడు చలనాద్యవస్థలు ఉన్నవాడుగ తెలియుచున్నను, సూక్ష్మదేహము అంతరించగనే జీవుడు దివ్యచైతన్యమై భాసిస్తున్నాడు.

జాగ్రదవస్థ యందు కర్మానుభవము పూర్తికాగానే జీవుడు స్వప్నగతుడై, తన మాయచే తానే కల్పించుకొనిన సుఖదుఃఖములను అనుభవిస్తున్నాడు. ఇలా జీవుడు స్వప్నగతుడై భోగించుచుండగా, ఆత్మ స్వప్రకాశ చైతన్యమై భాసింప చేస్తూఉంది.

అత్రాంతః కరణాదీనాం వాసనా ద్వాసనాత్మజా
వాసనామాత్ర సాక్షిత్వం తేన తత్ర పరాత్మనః ॥

"పూర్వము ఏవయితే అనుభవించబడి అంతఃకరణమున వాసనారూపమున ఉన్నాయో, అవియే స్వప్నావస్థలో గోచరిస్తున్నాయి. కనుక అవి అన్నియు వాసనారూపాలే. వీటికి సాక్షిగా ఆత్మ భాసిస్తోంది.

శైశవదశ యందు తెలిసే అనుభవాలు ఎక్కువగా గతజన్మకు సంబంధించి ఉంటాయి. చిన్న బిడ్డ కాళ్ళు చేతులు కదలించడం, నిష్కారణంగా నవ్వడము, ఎవ్వరూ శిక్షణ నివ్వకపోయినా తల్లి చనుబాలు త్రాగడం - ఇవన్నియు పూర్వజన్మ స్మృతులే అని అంగీకరించక తప్పదు.

స్వప్నావస్థలో ఎక్కువ శాతం గతానుభవాలే ఉంటాయి. కానీ, భవిష్యత్తులో జరుగబోయేవి స్వప్నంలో గోచరించడం అసంభవమే అయినా యోగుల విషయంలో, భక్తుల విషయంలో అవి సంభవాలు.

ఇయాసుః పరలోకం తు కర్మ విద్యాది సంభృతం
భావినో జన్మనోరూపం స్వప్న ఆత్మా ప్రపశ్యతి

"సత్కర్మలు, ఉపాసనల ద్వారా పరలోకమును పొందాలని భావించి సాధన లాచరించు వారు అట్టి వానిని స్వప్నములో గాంచగలుగుతారు. కొన్ని సమయాలలో రాబోయే జన్మల విషయం కూడా స్వప్నంలో తెలియవచ్చు".

జాగ్రత్స్వప్నములను అనుభవించిన జీవుడు అలసినవాడై, ఇంద్రియ మనస్సులను ఉపసంహరించుకొని విశ్రాంతిలో ఉంటాడు. ఈ అవస్థనే సుషుప్తి అంటారు.

యద్వత్పతనా ఛ్యేన శ్శ్రాన్తో గగనమండలే
ఆకుంచ్య పక్షౌ యతతే నీడే నిశ్చయనాయనే

"ఆకాశంలో అలసిన డేగ రెక్కలను ముడుచుకొని తన గూటిలో ప్రవేశించినట్లు, జీవుడు జాగ్రత్స్వప్నముల యందు తిరిగి తిరిగి అలసిపోయి ఇంద్రియాదులను ఉపసంహరించుకొని సుషుప్తిలో ప్రవేశిస్తున్నాడు".

సుషుప్తిలో జీవుడు బాహ్యవిషయ స్పృహ లేనివాడై ఆనందమయుడై ఉంటాడు. అందుచేతనే జీవుడు అనుభవించు ఈ సుషుప్త్యవస్థను ఆనందమయకోశముగా వేదాంతము అభివర్ణించింది. ఈ జీవుడే మరల జాగ్రదవస్థలో అభివ్యక్త మవుతున్నాడు.

పయఃపూర్ణ ఘటో యద్వన్నిమగ్న స్సలిలాశయే
తైరేవోద్ధృత ఆయాతి విజ్ఞానాత్మా తథైత్యజాత్

నీటిలో ఏ కుండను ముంచుతామో, వెలికి తీయునపుడు అదే బయట కనిపిస్తుంది. అలాగే సుషుప్తిలో ఏ జీవుడు నిద్రించాడో జాగ్రదవస్థలో అతడే బహిర్గతమవుతాడు.

ఒకే సూర్యుడు అనేక నీటికుండలలో అనేకముగా కనిపిస్తున్నాడు. నీటి కుండను తీసికొనిపోతూ ఉంటే సూర్యుడు పయనించునట్లు తెలుస్తుంది. సూర్యునిలో ఏ విధమైన చలనము లేదు. సూర్యుడు రావడము, పోవడము అంతా అసత్యమే. అలాగే దేహములు లేని ఆత్మ అనేక దేహములను ధరించి యున్నట్లు తెలుస్తున్నది. నిర్వికారమైన ఆత్మ సూర్యునివలె వస్తూ ఉన్నట్లు, పోతూ ఉన్నట్లు తెలుస్తూ ఉంది. ఇదే మాయ.

ఏవం జీవస్వరూపం ప్రోక్తం దశరథాత్మజ!

"దాశరథీ! ఇది జీవ స్వరూపము;" అని శివుడు రామునికి ఉపదేశించాడు.

అంతఃకరణలో ప్రతిఫలించిన ఈశ్వర చైతన్యము జీవుడుగా తెలియుచున్నను, స్వరూపతః జీవుడు శివునికన్నా భిన్నంగా లేడు. శివుడే జీవుడు. జీవుడే శివుడు. మాయ తొలగితే మహిమ శోభిస్తుంది.

జీవో దేవ స్సనాతనః

"జీవుడుగా కనిపించేటప్పుడు కూడా అతడు సనాతనుడైన దేవుడే" అని గీతాచార్యుని ప్రబోధము.

దేహములు ఆద్యంతములు కలిగియున్నను జీవుడు చావుపుట్టుకలు లేనివాడైనందున అతడు సనాతనుడు. పురాతనుడు. దేహేంద్రియ మనోబుద్ధులు చలించుటకు తానే కారణమై ఉన్నాడు. తాను ఈశ్వర చైతన్యమే కనుక సమస్త కార్యాలకు కారణమై, వాస్తవానికి నిష్క్రియుడై యున్నాడు. నిగూఢంగా ఉన్నందున వ్యక్తం కాక అవ్యక్తుడుగా శోభిస్తున్నాడు.

ఏష సర్వేషు భూతేషు గూఢో హ్యాత్మా న ప్రకాశతే
దృశ్యతే త్వగ్ర్యయా బుద్ధ్యా సూక్ష్మయా సూక్ష్మదర్శిభిః

"సర్వభూతములయందు నిగూఢముగ ఉన్నందున ఆ పరమాత్మ గోచరించుట లేదు. సూక్ష్మదర్శులైన మహాత్ములు సూక్ష్మబుద్ధిచే దర్శించుచున్నారు.

"రామా! సర్వజీవులు నా స్వరూపమే అని గ్రహించు వారిని శోకమోహాదులు స్పృశించలేవు. నేను ఆనందరూపుడను. అనుభూతి ప్రకాశమును.

ఆనందం బ్రహ్మ మాం జ్ఞాత్వా న బిభేత కుతశ్చన

"ఆనంద స్వరూపమైన బ్రహ్మముగా నన్ను గ్రహించువాడు ఎక్కడా భీతి చెందడు" అని పరమశివుడు జీవ స్వరూప నిర్ణయమును సమాప్తి చేశాడు.

జై జై మహాదేవ

ఓం....ఓం......ఓం

విడిపోకు - విడి ఉండు

"నేను సుఖాన్ని పొందాలి"; అని చాలామంది పలుకుతూ ఉంటారు. అంతే కాదు. అట్టి సుఖాన్ని అన్వేషిస్తూ ఉంటారు. వారు అనుకున్నది లభిస్తే సుఖం లభించిందని తృప్తి చెందుతారు. ఈ తృప్తి ఎంతకాల ముంటుంది? చెప్పలేము. సుఖాన్నిచ్చిన వస్తువు మార్పు చెందితే సుఖం కూడా మారిపోతుంది. ఒకవేళ గతిస్తే, తత్సంబంధిత సుఖం కూడా నశించిపోతుంది. కనుక, "నేను సుఖాన్ని పొందాలి" అనేవారు గాని, "నాకు సుఖం లభించింది" అనేవారు కాని ఈ ప్రపంచంలో సుఖపడలేరు.

సుఖాన్ని పొందడం కాదు. **సుఖమై ఉండడం.** నీవే సుఖం, నీవే శాంతి. నీవే సుఖశాంతులైనపుడు నీకన్నా వేరుగా సుఖాన్ని ఎలా పొందగలవు? ఒకవేళ పొందినా అది దుఃఖాన్ని తగిలించే సుఖమై ఉంటుంది.

ఈ సత్యం అవగతమైతే నీవు సుఖాన్ని పొందడానికి ప్రయత్నించవు. సుఖమై ఉంటావు. హృదయంలో సుఖాన్ని అనుభవిస్తూ బాహ్యంలో కర్మలు ఆచరిస్తావు. లాభాలాభాలు నిన్ను స్పృశించలేవు. మానావమానాలు నిన్ను తాకలేవు. జయాపజయాలు నిన్ను ముట్టలేవు. అవన్నీ బయట జరిగిపోతూ ఉంటాయి. ఆంతర్యంలో నీవు సుఖిస్తూనే ఉంటావు.

ఇప్పుడు చెప్పు. సుఖించడానికి దేనిని పట్టుకుంటావు? ఆనందించడానికి దేనిని వదులుకుంటావు? వదలి పోవాలనుకోవడమే మృత్యువు. దీనిని జయించాలి సాధకుడు. అప్పుడే మృత్యుంజయు డవుతాడు. దీనిని తెలియజేసేదే మృత్యుంజయ మంత్రము.

ఉర్వారుక మివ బంధనా న్మృత్యోర్ముక్షీయ మామృతాత్

"దోసపండు తీగ నుండి విడిపోవునట్లు నన్ను మృత్యువు నుండి విడిపించు" అని ముక్కంటిని ప్రార్థించడం ఈ మంత్రములోని కేంద్ర విషయము.

దివ్యమైన ఈ మృత్యుంజయ మంత్రములో దోసపండునే ఉపమానంగా ఋషి ఎందుకు గ్రహించాడో మనం అర్థం చేసుకుంటే అద్భుతమైన జీవన రహస్యం బయట పడుతుంది. ఒక మామిడిపండో, లేదా బత్తాయిపండో తొడిమను వీడితే వెంటనే తొడిమకు దూరమై నేలపై పడతాయి. కానీ దోసపండు అలా కాదు. దోసతీగ నేలపైనే ప్రాకుతుంది. తీగను వీడిన దోసపండు తీగకు దూరంగా పోదు. ఉన్నచోటే ఉంటుంది. అయితే విడిపోయి ఉంటుంది.

ఇక్కడ విడిపోవడం కాదు. **విడి ఉండడం.** ఇదే తేడా.

చైతన్యానికి దూరంగా ఎక్కడికి వెళ్ళగలం? అసత్తును అంటిపెట్టుకోకపోతే చైతన్యంగానే మిగిలి ఉంటాం. ఇది బంధం లేని, సంబంధం తెలియని ఉనికి. ఈ సత్యాన్ని మనసుకు పట్టించలేము. మనసును జాగ్రత్తగా ఆ వైపు నడిపితే గట్టెక్కుతుందో, గుట్టును గ్రహిస్తుందో చూడాలి.

ఎక్కడిదో, ఎవరు వ్రాశారో వివరాలు తెలియడం లేదు గాని నా పాత డైరీలో ఒక శ్లోకముంది.

న యాహి చేత స్త్వమిత స్తతోఽపి దేహేంద్రి యాద్యైః నకురుష్వ కర్మ
త్వం యత్ర కుత్రా ప్యుపవిశ్య నిత్యం విచారయస్వ స్వనిదాన మంతః ॥

"ఓ చిత్తమా! నీవు ఇటూ అటూ వెళ్ళకు. దేహేంద్రియాదులతో ఏకమై కర్మలు చేయకు. నీవు ఎక్కడో ఒకచోట కూర్చుని నిరంతరం ఆంతర్యములో నీ ఆది ఎక్కడో అన్వేషించు".

తెలియబడేవి 'ఇదం'గాను, తెలుసుకొనేది "అహం"గాను మనకు అనుభవంలో ఉన్న విషయం. మనసు తనకన్నా అన్యమైన వాటిని (ఇదం) గ్రహిస్తున్నది. గ్రహింపబడే విషయాలు అనేకంగా తెలుస్తున్నా గ్రహించే మనసు మాత్రం ఒక్కటిగానే తెలుస్తున్నది. ఈ దశలో మనసు 'అహం'గా పిలువబడుచున్నది.

మనసులో 'ఇదం' భావనలను కదిలించే 'అహం' భావన ఉన్నది. విషయాలు మనసుకు అందనపుడు "ఇదం" భావనలు మనస్సులో లేకపోవచ్చు. ఇలా 'ఇదం' భావనలు లేవు అని గ్రహించే 'అహం' భావన ఉండనే ఉంది. అది ఉన్నంతవరకు మనసు ఉన్నట్లే. మనసు ఉన్నంతవరకు ప్రపంచమున్నట్లే. ప్రపంచమున్నపుడు "అటు ఇటు వెళ్ళకు" అని పై శ్లోకంలో మనసుకు చెప్పింది సాధ్యపడే విషయమేనా? కనుక 'అహం' భావన మనసు అని తెలిసినపుడు దాని మూల మెక్కడో తెలియాలి. అప్పుడే మనసు, దాని నంటిపెట్టుకొని యున్న అసద్రూప ప్రపంచము అదృశ్యమవుతాయి. ఎక్కడో ఒకచోట కూర్చుని మనసు యొక్క మూలాన్ని అన్వేషించమని శ్లోకంలో తెలుపడంలోని అర్థం, కాదు; పరమార్థం ఇదియే.

ఇది విచారణ మార్గము. జ్ఞానయోగము. మనసు మూలాన్ని ఎలా పట్టుకోవాలో భగవాన్ రమణ మహర్షులవారు 'ఉపదేశసారం' అనే గ్రంథంలో చక్కగా తెలియజేస్తారు.

అహమయం కుతో భవతి చిన్వతః అయిపతత్యహం నిజవిచారణం ॥

'ఇదం' భావవలన్నీ అదృశ్యమైన తరువాత 'అహం' భావన మిగిలియుంటుందని చెప్పుకున్నాం. అపుడు ఈ నేను ఎక్కడి నుండి పుట్టింది? **(అహమయం కుతో భవతి)** అని కనుక ఆలోచిస్తే **(చిన్వతః)** ఈ నేను కూడా పడిపోతుంది. **(అయి అహం పతతి).** ఇదే సూటియైన మార్గము **(నిజవిచారణం).**

'అహం' భావన అలా అదృశ్యమైనపుడు ఏముంటుంది? ఏమో! అదృశ్యం చేసి ఎవరికి వారు తెలుసుకోవలసిన విషయమది. లేచిన అల పడి అదృశ్యమైనపుడు ఏముంటుంది? అంటే, ఏం చెప్పాలి?

'అహం' పడిన దశలో, పడిపోయిన దశలో చైతన్య మొక్కటే ఉంది. 'అహం' పోయింది. 'అహం' లేదు కనుక ప్రపంచంగా తెలిసే 'ఇదం' లేదు. లేనిది ఎలా ఉండింది? ఉండింది ఎలా లేకుండా పోయింది? ఇలా ప్రశ్నించే అవకాశం అక్కడ ఉందా? ఒకవేళ, లేని అవకాశం ఉండగలిగితే ప్రశ్నలెన్ని ఉద్భవించినా జవాబు మాత్రము ఆశ్చర్యమే. లేని ప్రశ్నను ఉన్నట్లు ఊహించవలసిన స్థితిలో "ఆశ్చర్యం"గా గోచరించిన జవాబును మాటల్లో మూటగట్టడం ఎవరికి సాధ్యం? ఉపనిషత్తుకు తప్ప.

క్వ గతం కేన వా నీతం కుత్ర లీన మిదం జగత్
అధునైవ మయాదృష్టం నాస్తి కిం మహ దద్భుతమ్ ॥

"ఎక్కడికి పోయింది? ఎవరు ఎత్తుకొని పోయారు? ఎక్కడ లీనమైనది? ఇంత వరకు నేను చూచిన జగత్తు ఇంతలోనే ఎలా మాయమైంది? ఆహా! చాలా ఆశ్చర్యం!".... ఇలా త్రేపింది అధ్యాత్మోపనిషత్తు.

వంట చేసే పని మాది. వంట బట్టించుకొనే పని మీది.

విని తూలడమా? తిని త్రేపడమా? నిర్ణయించుకోండి మీరే!

రూపనామాలను తొలగించి చిరునామాలను తెలుసుకొనేందుకు ప్రయత్నించండి. ఇదే మనందరికి ఏకైక శ్రేయోమార్గము.

మనుషులు పరస్పరం కలుసుకోగానే, క్రొత్తవారైనా, పాతవారైనా రాజకీయాలు, సంపదలు, గిట్టని వ్యక్తులు, అసూయలు - ఇవే చర్చలకు ప్రధానాంశాలుగా వ్యక్తుల ముందు వడ్డించిన విస్తరిలా ఉంటాయి. ఈ నాలుగు అంశాలు ఎవరి సంభాషణలో చోటు చేసుకోలేవో వారే సాధకులు. సత్సంగ ఫలాన్ని పొందిన భాగ్యవంతులు.

ఒకటి...రెండు...మూడు - మూడు మూళ్ళ తొమ్మిది

సత్యము ఒక్కటే.

దానిని విచారించి నిర్ణయించే బుద్ధి కూడా ఒక్కటే.

బుద్ధికి ద్వైతము తెలిసినా జ్ఞానము ద్వారా అద్వైతమును గ్రహించాలి.

నిత్యము - అనిత్యము, సత్యము - మిథ్య....ఈ రెండిటిని బుద్ధి ద్వారా నిశ్చయించుకోవాలి. **(ఏకయా)**

ఉన్నది సత్యము. నిరాశ్రయమైన సత్యముపై ఆధారపడియున్నది మిథ్య. నిత్యానిత్యములు, సత్యమిథ్యలు రెండుగా తెలుస్తున్నా వీటిని విచారించి నిర్ణయించే బుద్ధి ఒక్కటే కనుక, - రెండిటిని ఒక్కదానిచే నిర్ణయించాలి. **(ఏకయా ద్వే వినిశ్చిత్య)**

మనుగడను ముప్పుతిప్పలు పెట్టేందుకు మూడు చుట్టుముట్టే ఉన్నాయి.**(త్రీన్)**

అవియే

కామక్రోధలోభాలు

ఈ మూడు మనకు వశం కావాలి. ఈ మూటిని నాలుగుచే వశపరచుకోవాలి.

(త్రీన్ చతుర్భిః వశే కురు)

ఆ నాలుగే

వివేక వైరాగ్యాలు, శమదమాదులు.

వీటి సహాయంతో అయిదింటిని జయించాలి. **(పంచ జిత్వా)**

ఆ అయిదే

పంచేంద్రియములు. జ్ఞానేంద్రియములు

శమదమాదులతో, వివేక వైరాగ్యాలతో పంచేంద్రియాలను జయించాలి.

అయిదును జయిస్తే లాభం లేదు.

'ఆరు'ను అవగతం చేసుకోవాలి. **(విదిత్వా షట్)**

చేరువలో నున్న భగవంతుడే 'ఆరు'

షడ్గుణైశ్వర్య సంపన్నుడు. ఇదియే పూర్ణజ్ఞానము.

జ్ఞానము వెలుగు. అజ్ఞానము చీకటి. జ్ఞానము రావడమంటే అజ్ఞానము పోవడమని భావము. వచ్చేది జ్ఞానము. ఆపైన పోయేది అజ్ఞానము.

వచ్చింది ఆరు. ఇక సలుపుతుంది ఏడుపై పోరు. ఆరును ఎదుర్కోలేని ఏడు పారిపోతుంది.

ఆ ఏడే

మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము, మలము, విక్షేపము, ఆవరణము.

ఈ ఏడు దూరంగా పోతాయి. ఏడును త్యజించగనే **(సప్తహిత్వా)** సుఖము నీదై ఉంటుంది. నీవుగా ఉంటుంది. అది తెలిసి సుఖపడు. **(సుఖీభవ)**

ఏడును జయిస్తే చాలు.

అష్టైశ్వర్యాలు వరించి వస్తాయి.

బ్రతుకు నవత్వంతో శోభిస్తుంది. 'నవ' అంటే తొమ్మిది. 'త్వం' అంటే నీవు.

తొమ్మిది నీవే. నీవే తొమ్మిది.

అంకెలలో తొమ్మిది చివరిది. జ్ఞానంలో చివరిది నీవే.

తొమ్మిదిని ఎచ్చువేస్తూపోతే తిరిగి తొమ్మిదియే దర్శన మిచ్చునట్లు, నీ స్వరూపాన్ని పట్టుకుంటే గోచరించే దంతా నీవే అయి ఉంటుంది.

పదార్థా లెన్నయినా పళ్ళెం ఒక్కటే.

రుచు లెన్నున్నా రుచి చూచే నాలుక ఒక్కటే.

భక్షించేవి ఎన్నయినా భరించే కుక్షి ఒక్కటే.

పదార్థా లెన్నయినా అవి ప్రసాదించే శక్తి ఒక్కటే.

అంకె లెన్నయినా వాటిలో ఉన్న దొక్కటే.

అదే అద్వయం. అదే అద్వైతం. అదే అద్వితీయం. అదే అనంతం.

ఏకయా ద్వే వినిశ్చిత్య త్రీం శ్చ తుర్థి ర్వశే కురు
పంచ జిత్వా విదిత్వా షట్ సప్త హిత్వా సుఖీభవ!

ఇది అంకెల పంచాంగం కాదు. పంచమ వేదము ప్రసాదించిన పంచామృతము. స్వీకరిద్దాం. స్వాత్మానుభూతిని పొందుదాం.

> ఈ ప్రపంచంలోకి మనం వట్టిచేతులతో రాలేదు. ప్రారబ్ధాన్ని వెంట పెట్టుకొని వచ్చాం. ఏదో చేయాలని విర్రవీగినా చేయగలిగింది మాత్రమే చేయగలం. ఇది అర్థమైతే, ఆ తరువాత ఎంతో, ఎంతెంతో చేయాలనే ఉబలాటం కన్నా ఏ కొంత చేసినా అది అందంగా, అర్థవంతంగా ఉంటుంది. సుఖ సంతోషాలతో బ్రతుకును శోభింపచేస్తుంది.

తొలగిన తిమిరాలు

కొన్ని విషయాలు కొందరికి తెలుసు. అన్ని విషయాలు అందరికీ తెలియవు. తెలియదు అనేది తెలుస్తున్నంత వరకు తెలివికి వెలితి తప్పదు. తెలియదు అనేది తెలియని, తెలిసిరాని, తెలివి తెలియగానే వెలితి అంతరిస్తుంది. వెలుగు వెలుగుతుంది.

ఇదియే పూర్ణం. పరిపూర్ణం. అన్నీ అందరికీ తెలుసు అనే పూర్ణ జ్ఞానం. అందరినీ అందరిలో చూపే జ్ఞానం. ఎవరూ ఎవరికీ వేరుగా లేరని నిరూపించే జ్ఞానం. ఇది ఉన్నదే. మన కున్నదే. మనదై ఉన్నదే. మనంగా ఉన్నదే.

మనం పూర్ణం. ఈ సత్యం తెలిస్తే అపరిపూర్ణం లేదు. మనం మనకు తెలియకుండా ఉండే విచిత్ర మనుగడకు బాహ్యం నుండి ఎవరు అంకురార్పణ చేయగలరు? ఇది సాధ్యమయ్యే కార్యం కాదు. మనల్ని మనకు తెలియకుండా చేసే శక్తి ఏదన్నా ఉంటే, అది మనవద్దే ఉండాలి. ఉంది. ఏమిటది? అవిద్య. లేదా అజ్ఞానము. ఇదియే ఆవరణ. జ్ఞానాన్ని తాత్కాలికంగా మరుగుచేస్తున్న అవిద్యావరణ.

అజ్ఞానే నావృతం జ్ఞానం తేన ముహ్యన్తి జన్తవః

"జ్ఞానము అజ్ఞానము చేత కప్పబడి ఉంది. కనుకనే జనులు మోహమును పొందుచున్నారు" అని శ్రీమద్భగవద్గీత.

జ్ఞానము అజ్ఞానము చేత కప్పబడి ఉంటే, ముసుగు తీసినట్లు, అజ్ఞానపు తెరను తొలగిస్తే జ్ఞానము తెలిసిరావాలి.

ఇంతకీ, అజ్ఞానము అంటే ఏమిటి? జ్ఞానము లేకపోవుటయే అజ్ఞానము. జ్ఞానము లేనపుడు అది అజ్ఞానమే ఎందుకు కావాలి? జ్ఞానము లేని స్థితి అంటే సరిపోతుంది. జ్ఞానము కాకుండా అజ్ఞానమూ కాకుండా విపరీత జ్ఞానము లేదా?

కనుక అజ్ఞానము అంటే జ్ఞానము లేని స్థితి కాదు. జ్ఞానము లేని స్థితి తెలుస్తున్నది అంటే, అట్టిది దేనివలన తెలుస్తూ ఉందో అది అజ్ఞాన మెలా అవుతుంది? జ్ఞానమే. మరి, జ్ఞానము ఉండేటప్పుడు జ్ఞానము లేని స్థితి ఎలా ఉంటుంది? లేనిది అంటే 'అభావం'. ఉన్నది ఏదైనా చేయగలదు; లేదా చేయకుండా ఉండగలదు. లేనిది ఏం చేస్తుంది? కనుక 'అభావం' జ్ఞానాన్ని ఎలా మూస్తుంది? అజ్ఞానము ఉన్నది కాదు. ఎందుకంటే, జ్ఞాన జాగరణలో అదృశ్యమవుతూ ఉంది కనుక. అలాగని లేనిదీ కాదు. లేనిది ఏమీ చేయలేదు కనుక. అజ్ఞానము ఉన్నదీ కాదు; లేనిదీ కాదు. ఇలాంటి దానిని మిథ్య అంటారు.

మిథ్యా వస్తువు వాస్తవానికి లేనిదే అయినా ఉన్నంతవరకు తన ప్రభావాన్ని ఏదో విధంగా చూపుతుంది. సర్పము రజ్జువులో లేదు, కాని లేని సర్పము ఉన్నట్లు గోచరించిన దశలో భయాన్ని, శోకాన్ని కల్గించినట్లు మిథ్యా వస్తువు సమస్యల్ని సృష్టిస్తుంది.

మిథ్యా వస్తువు లేకనే ఉన్నట్లు తెలుస్తూ ఉంది కనుక అది మాయ. ఇక్కడ లేని మాయను తొలగించే ప్రయత్నము ఎలాంటిదో కూడా ఆలోచించాలి.

చీకటిని ఏమి చేసి పోగొట్టగలం? వెలుగును ప్రసరింపచేయుట ఒక్కటే మార్గము. ఇదియే జ్ఞానము. జ్ఞానము కలిగితే అజ్ఞానము మిగలదు.

నీవు ఆత్మయే. స్వతఃసిద్ధమైన పరమాత్మ స్వరూపమే. ఈ సత్యము తెలియక మరుగుపడిన దశలో జ్ఞానమే ఏకైక శరణ్యము. ఆత్మకు సంబంధించిన అజ్ఞానమే సర్వ సమస్యలను సృష్టించినపుడు ఆత్మకు సంబంధించిన జ్ఞానమే దానికి సరియైన పరిష్కారము.

ఆత్మకు సంబంధించిన అజ్ఞానము తొలగాలి. ఆత్మకు సంబంధించిన జ్ఞానము కలగాలి. అంటే, ఆత్మ అంటే ఏమిటో, అనాత్మ అంటే ఏమిటో స్పష్టంగా తెలియాలి. ఈ విచక్షణ గురువు శాస్త్రమును అందించినపుడు కలుగుతుంది. అంతేకాదు. ఆత్మను ఆత్మగా, అనాత్మను అనాత్మగా తెలుసుకోవటంలో జ్ఞానము పూర్తిగా లభ్యం కాదు. అనాత్మ కూడా ఆత్మయే, కాని ఆత్మ అనాత్మ కాదు అని కూడా తెలిసి రావాలి.

పాము త్రాడు కన్నా అన్యము కాదు. కనుక పాము కూడా త్రాడే. కాని, త్రాడు మాత్రం ఎప్పుడూ పాము కాదు; కాలేదు.

అనంతమైన వస్తువు నుండి ఏదీ దూరం కాలేదు. కనుక, గోచరించునది ఏదైనను ఆత్మయే. కాని, ఆత్మ తన అనంతత్వమును త్యజించలేదు కనుక ఆత్మ ప్రత్యేకమైనదిగా భాసించలేదు.

యేన ప్రకాశతే విశ్వం యత్రైవ ప్రవిలీయతే
తద్బ్రహ్మ పరమం శాన్తం తద్బ్రహ్మాస్మి పరం పదమ్ ॥

"ఈ విశ్వమంతయు దేనిచేత ప్రకాశించుచున్నదో, దేనియందు లయించు చున్నదో, అట్టి శాంతరూపమైన, శ్రేష్ఠపదమైన బ్రహ్మమును నేనే" అన్నది పంచబ్రహ్మో పనిషత్తు.

సచ్చిదానంద రూపమైన బ్రహ్మము తెలియగానే అధ్యాస వలన ఏర్పడిన భ్రమ - సోపాధికమైనా, నిరుపాధికమైనా లేనిదే యగుచున్నది. భ్రమ ఉంటేనే కదా బాధించగలుగుతుంది. **అధ్యస్తస్య కుతః సత్యమ్** - కల్పిత వస్తువుకు సత్యత్వమెలా వస్తుంది? కనుక ఆత్మ జ్ఞానము కలిగినవాడు నిర్విశేష పరబ్రహ్మముగా శేషించుచున్నాడు.

ఇట్టి జ్ఞానము గురుబోధ ద్వారానే లభ్యమగుచున్నది. గురువు అంటే, కేవలం బోధించేవాడు అని మాత్రమే భావించకూడదు. శిష్యుని తనలాగ తయారుచేయువాడే గురువు. బంధముక్తులకు అతీతమైన మన స్వరూపమును బోధ ద్వారా మనం గ్రహించునట్లు చేయువాడే గురువు. అట్టి గురువులందరూ ఒక్కరే. వారందరిలో భాసించే జ్ఞానమూ ఒక్కటే.

వేదాంతం బాధలను తొలగిస్తుందా?

బాధలు ఎవరికైనా మోయలేని బరువులే. ఎవరి బ్రతుకును చూచినా ఈ ప్రపంచంలో బాధలే రాజ్యమేలుతున్నట్లు కనిపిస్తుంది. బాధలు పడటం ఎవరికీ ఇష్టం కాదు. బాధ అనేది సంతోషంగా భరించదగిందీ కాదు. బాధలొస్తే, ఎందుకనో అవి గుండెలవైపే పరుగులు తీస్తాయి. మరోచోట విశ్రమించేందుకు బాధలు ఇష్టపడవు.

బాధలకు చోటిచ్చి గుండెలు బరువెక్కుతాయి. రాపిడికి గురి అవుతాయి. ఆ రాపిడిలో గుండెల్లో మంటలు చెలరేగుతాయి. ఆ మంటలనుండి ఎగసిన పొగలు పైపైకి ప్రాకి మేఘాలుగా తయారవుతాయి. కళ్ళల్లో కాపురం పెడతాయి.

భరించలేక కంటి తలుపుల్ని మూసినా కలతల తలపులు కంటి తలుపుల్ని తీస్తాయి. అంతే. శోక మేఘాలు వర్షాలై కురుస్తాయి. అనాదినుండి అందరి బ్రతుకులు ఇలా కన్నీటివర్షంలో ముద్దముద్దగా తడిసినవే.

1. "ఈ బాధలు సృష్టిలోనే ఉన్నాయి. వీటిని దయామయుడైన భగవంతుడు ఎందుకు సృష్టించాడు?" అని కొందరు.

2. "బాధల్ని భగవంతుడు సృష్టించలేదు. భగవంతుడు ప్రపంచాన్ని సృష్టించాడు. పరితాపాన్ని సృష్టించలేదు. బాధల్ని, బరువుల్ని మనం కొనితెచ్చుకున్నాం. మనం చేసిన కర్మలయొక్క ఫలితాలే బాధలు" - అని మరికొందరు.

3. "బాధలనేవి మనం తెచ్చుకున్నవి కావు. పరులు సృష్టించినవి" - అని ఇంక కొందరు.

మొదటివారికి భగవంతుడు అర్థంకాలేదు. రెండవవారికి భగవంతునితో పాటు వారు కూడా వారికి అర్థం కాలేదు. మూడవవారికి ఏదీ అర్థంకాలేదు. ఎవరూ అర్థంకాలేదు.

బాధల్ని భగవంతుడు తయారుచేయలేదు. బాధ అనేది కర్మఫలాలు విధించే శిక్షా కాదు. మరొకరు పంచేందుకు బాధ ప్రసాదమూ కాదు.

మనమేమిటో, మనం జీవించే ప్రపంచ మెలాంటిదో ఏమాత్రం అర్థంకాక పోవటం చేతనే బాధలు తలెత్తుతాయి. అర్థమైతే తలదించుతాయి. ఇదీ సత్యం.

కనుకనే వేదాంతం బాధల్ని నివారించే ప్రయత్నం చేయదు. అలా చేయటం నిరుపయోగమని వేదాంతశాస్త్ర నిర్ణయము. వేదాంతం బాధల్ని పోగొట్టదు. కష్టాల్ని దూరం చేయలేదు. పరిస్థితుల్ని మార్చదు. మార్చే ప్రయత్నమూ చేయదు. మరేం చేస్తుంది? "సమస్తమైన బాధలనుండి, దుఃఖాలనుండి నీవు విడిపడే యున్నావు" - అనే సత్యాన్ని మన బుద్ధికి పట్టిస్తుంది. ఈ ఒక్కపని చేసేందుకే వుంది వేదాంతము.

పరిస్థితులు - పరితాపాలు

బాధలకు పరిస్థితులు కారణమని కొందరి అభిప్రాయము. అలాంటివారు ఏ పరిస్థితులలోను బాధలనుండి విముక్తిని పొందలేరు. కారణం, బాధ అనేది ఒక పరిస్థితి కాదు. సన్నివేశమూకాదు. అదొక ఆలోచనావిధానము.

శీతోష్ణములు:

బాహ్య ప్రపంచంలో వాతావరణముంది. శీతోష్ణాలున్నాయి. శీతోష్ణాలున్నాయే గాని వాటిలో సుఖదుఃఖాలు లేవు. శీతాకాలము చలిగా ఉంటుంది. అది సరిపడక వేసవి బాగుంటుం దనుకుంటాము. వేసవిలో వేడిని భరించలేము. వర్షాకాలం నయ మనుకుంటాము. వర్షాకాలంలో చలికాలమే మేలని భావిస్తాం. ఏ కాలం మనకు సానుకూలం?

కాలం మారుతూ ఉంటుంది. ఋతువులు మారుతూ ఉంటాయి. అవి అలా ఉంటేనే ఋతువులు. అవి వుండేది మనం అర్థం చేసుకునేందుకే గాని ఆవేదన చెందేందుకు కాదు. అవి అలా నడుస్తూ ఉంటాయి. వాటి మధ్యలో మనం అర్థం చేసుకుంటూ సాగిపోవాలి. మారేవి మారుతూ ఉంటాయి. ఆగమంటే ఆగవు. వాటిని అధిగమించనవసరం లేదు. అర్థం చేసుకుంటూ పోతే చాలు. ఆనందయాత్ర సాగించవచ్చు. అంతేకాదు. దృక్పథాన్ని మార్చుకుంటే దృశ్య ప్రపంచం యొక్క ప్రభావమే మారిపోతుంది.

బాంధవ్యాలు:

సంబంధాలు లేకుండా జీవించటం మనిషికి సాధ్యం కాదు. ఈ ప్రపంచంలో ఏ బాంధవ్యమైనా రాపిడినే సృష్టిస్తుంది. గుండెను బండబారేలా చేస్తుంది. దేనితో సంబంధం ఏర్పరచుకున్నా, ఎవరితో సంబంధం పెట్టుకున్నా అది మనకన్నా వేరయ్యే ఉంటుంది. వేరైన దేదైనా ఒకరోజు మన బ్రతుకులో ఆనందాన్ని ఏరి పారేస్తుంది. దూరమై దగా చేస్తుంది. అదృశ్యమై ఆవేదనను ముందుంచుతుంది. లేదా పరిణామం చెంది పరితాపాన్ని సృష్టిస్తుంది. ఎప్పుడు ఏమౌతుందో ఎవరికీ అర్థంకానిది బాంధవ్యం. ఏ బాంధవ్యమైనా అర్థమైతే ఇంతే!

ప్రేమించిన దానిని పాడు గాకుండా కాపాడుకోలేము. ప్రాణం కన్నా మిన్నగా ప్రేమించిన వారు ఆశల్ని వమ్ము చేసి కఠినంగా ప్రవర్తించినా, దూరంగా పయనమైనా "ఇలా మోసపోయేందుకే ప్రేమించానేమో" అనుకుంటామేగాని, ఇందులో వారి పాత్రకన్నా మన పొరపాటే ప్రధానమైందని గ్రహించలేము. ఎండమావులు ఎవరిని మోసం చేస్తాయి? అవి ఎండమావులని తెలియని వారినే. అర్థం చేసుకో.

ఫలానా వ్యక్తి మంచివాడు అని భావిస్తావు. అతని చేత వంచింపబడి నపుడు "అలాంటి మంచివాడు ఇలా వంచించాడా? నమ్మలేకపోతున్నాను" - అంటావు. ఇక్కడ నమ్మక మెందుకు? వాస్తవాన్ని అనుభవిస్తూ నమ్మకాన్ని గూర్చి ఎందుకు మాట్లాడతావు? ఇక్కడ నీకు ఒక నిప్పులాంటి నిజం అర్థం కావాలి.

నిన్ను వంచించిన వ్యక్తి మోసగాడని ముందే తెలిస్తే, నీవు మోసపోతావా? ఇప్పుడు చెప్పు. నిన్ను మోసం చేసింది అతనా? లేక అతనికి సంబంధించిన నీ అజ్ఞానమా? ఈ ప్రపంచంలో మనం చాలా పరిమిత జ్ఞానంతో ఉన్నాం. ఈ కారణంగా ఎన్నో బాధల్ని అనుభవిస్తున్నాం.

మరి వంచించినవాడు కుంచుకుపోడా? అంటావా, అది వేరే విషయం. నేను చర్చించేది కర్మఫలాల విషయం కాదు. నీ స్వయంకృత అపరాధాన్ని గురించి. నిప్పుపట్టుకున్న వాడిచేయి కాలుతుందని నేను వేరుగా చెప్పనవసరం లేదు. ఇది ఎవరూ నివారించలేని సత్యం. వంచించడానికి కావలసింది కుటిలత్వమే గాని జ్ఞానం కాదు. ధర్మం కాదు. మానవత్వమూ కాదు. వంచించి తాత్కాలికంగా లబ్ధిని పొందామనే దొక్కటే కుటిలుడికి తెలుసు. దాని ఫలితంగా తనతోపాటు తనను నమ్ముకున్న వాళ్ళు కూడ ఒకనాడు కళ్ళల్లో కుళాయిలు నింపుకుంటారని పాపికి తెలియదు. తాను వంచించగలిగానని భావిస్తాడేగాని, అలా తనచేత వంచింపబడిన వ్యక్తి తనను ఎంత గొప్పగా నమ్మగలిగితే తాను వంచించగలిగాడో ఆలోచించలేడు. ఆలోచించే సంస్కారం లేకపోవచ్చు. కాని "ఒక మంచి వ్యక్తిని నమ్మించి వంచించాను" అనే స్పృహను ఆంతర్యం నుండి తుడిచి వేసుకోలేడు. దానికి ఒక జన్మ సరిపోదు. గొప్ప బరువును, భారాన్ని బ్రతుకంతా గుండె కెత్తుకొనే తిరగాలి.

ఇదంతా వంచించినవాడి భావిపురాణం. కాని, నీవు వంచింపబడటానికి నీ అజ్ఞానమే కారణము అని నీవు గ్రహించటమే ఇక్కడ కేంద్ర విషయం.

దేహబాధలు - మరణం

దేహము పాంచభౌతికము. ప్రపంచము కూడా పాంచభౌతికమే. కనుక భౌతిక బాధలు దేహానికి తప్పవు. శీతోష్ణాల నుండి కొంత వరకు మనం దేహాన్ని రక్షించు కోగలము. కాని దేహము పరిణామశీలము. నిరంతరం మార్పు చెందుతూ ఉంటుంది. ఇందులో మన ప్రమేయం, ప్రవేశం ఉండనే ఉండదు. అది దేహ ధర్మము. అందుకనే, మనిషి మరణించినపుడు దేహధర్మ మొందినాడు అంటుంటారు పెద్దలు. మార్పులు, మరణాలు చాలా బాధాకరంగా ఉంటాయి. గాలివాన చెట్లను ఊపినట్లు, శోకాలు మనస్సుల్ని కుదిపేస్తాయి. శోకమనేది దేహబాధలవల్ల, మరణాలవల్లనే రాదు. వాటిని మనం సరిగ అర్థం చేసుకోలేక పోవటం వల్ల, దుఃఖాన్ని తెచ్చి పెట్టే మార్గంలో ఆలోచిం చటం వల్ల బాధలు కలుగుతాయి. ఆలోచనా సరళిలో మార్పురాగలిగితే బాధలు మాయమవుతాయి.

మార్పు ఏదైనా బాధాకరమే. అనారోగ్యమనేది దేహంలో మార్పు. అలాగే మృత్యువు కూడా మార్పు. కనుకనే రోగాలు, మరణాలు దుఃఖరూపాలుగా తెలుస్తాయి.

వీటిని మనం అర్థంచేసుకోవాలి. ఇవి ఒక విధంగా చెప్పాలంటే పరిమితాలు. దోషాలు. వీటిని తొలగించుకోలేము. తెలుసుకోవటం కూడా తొలగించుకొనేందుకు

కాదు. తటస్థ వైఖరితో జీవించేందుకు. అవగాహనతో ఉదాసీన వైఖరిని అలవరచు కొనేందుకు.

ముసలితనం కూడా మార్పే. వృద్ధాప్యం బాధాకరం. రాకుండా నివారించు కోగలమా? వచ్చిన తరువాత అంతా అసౌకర్యంగానే ఉంటుంది. అసౌకర్యంతో మరో కొంతకాలం జీవించా లనుకోవటంలో ఔచిత్య మేముంది? ఇంకా కొంతకాలం బ్రతకాలి అని వృద్ధులు కూడా భావిస్తూ ఉంటారు. దేహానికి మంచిరోజులు పోయాయని, వంచింపబడే రోజులే మిగిలి ఉన్నాయని గ్రహించలేరు. జీవకణాలన్నీ ధ్వంసమై పోతున్నా, ఎండిపోయిన చెట్టు చిగురించి పండుతుందేమోనని పగటి కలలు కంటూ ఉంటారు.

ఈ పరిస్థితి దేహానికి ప్రాప్తించటానికి వృద్ధాప్యమే అవసరం లేదు. వ్యాధులు యువకుల్ని కూడా వదిలిపెట్టవు. బాధలు బాలురను కూడా విడిచిపెట్టవు. కొందరికి యౌవనమే వృద్ధాప్యమై మిగుల్తుంది. ఇవన్నీ అనివార్యాలు. దేహధర్మాలు. కాలం దేనినైనా కబళిస్తుంది. దేహం కూడా కాలాధీనమే!

ఇదంతా వేదాంత అవగాహనయే. ఇవన్నీ వేదాంతం మనకు అర్థమయ్యేలా చేస్తుంది. ఉన్నకాలం, మనకున్న కాలం మనకు వినియోగపడితే చాలు. అలా వినియోగించుకొనే శక్తి ఉంటే కాలం కారిపోయిందని ఒకనాడు చింతించవలసిన అవసర ముండదు.

ఇక్కడ ఒక్క విషయాన్ని జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. కాలం వేరు. వ్యక్తి కాలం వేరు. కాలం ఎప్పుడూ ఉంటుంది. వ్యక్తి కొంతకాలమే ఉంటాడు. ఆ కాలమే తనది. తన కాలం కారిపోతే తానే నష్టపోతాడు. కాలాన్ని సద్వినియోగం చేసుకున్న వాడికి కాలం కారిపోయిందనే బాధ ఉండదు. ఎందుకో తెలుసా? కాలమంతా తనదికాదు. తనకాలమే తనది. అది సద్వినియోగమయితే, సంతృప్తి మిగుల్తుంది.

జీవితం అంటే తెలిసినవానికే కాలం విలువ తెలుస్తుంది. కాలం ముందు తలవంచే భిక్షగానివలె కాకుండా, కాలాన్ని శాసించే ప్రభువుగా వేదాంతం మనల్ని తీర్చి దిద్దుతుంది.

లాభనష్టాలు

ఈ ప్రపంచంలో లాభమేదో, నష్టమేదో ఎవరికీ అంతుపట్టదు. లాభాలు ఉంటే ఉండొచ్చు. నష్టాలు తెలియని లాభాలు లేనేలేవు. పొందేది లాభమయితే, పోగొట్టుకొనేది నష్టం. జీవితంలో ఏది పొందినా మనం కాలంలోనే పొందుతాము. అవి కాలంలోనే కారిపోతాయి. ఒకనాడు లాభాలుగా వెలిగి మరోనాడు నష్టాలుగా ఆరిపోతాయి.

"ఇవి నాకున్నాయి. ఇవి నావికావు" అనే సత్య వాక్యాలు మనస్సులో స్థిరపడిననాడే మనిషికి శాంతి. ఈ అవగాహన జీవితం యొక్క రూపురేఖల్నే మార్చేస్తుంది. మనకు సంపద ఉంది అనుకుందాం. సంపద నాకుంది. అంటే తాత్కాలికంగా కొంతకాలం ఈ సంపద నావద్ద ఉంటుంది అని అర్థం. ఆ తరువాత ఉండదు. ఎందుకని? ఈ సంపద రాకముందు నావద్ద లేదు. ఒకనాడు ఉండబోదు. ఒకవేళ ఉండినా మనం ఉండకపోవచ్చు.

ఉన్నపుడు ఉన్నవేకాని మనవికావు అనుకోవడంవల్ల వాటిని సద్వినియోగం చేస్తామేగాని, లాభాలుగా పరిగణించము. ఎలాగో ఓనాడు దూరమయ్యేవే నని తెలుసు కనుక ఆనాడు ఏనాడైనా కావచ్చు. నేడే కావచ్చు. పోయేవే అనే జ్ఞాన మున్నందున వాటిని నష్టాలుగా గుర్తించము. ఈ అవగాహనతో వేదాంతం మనల్ని సుఖదుఃఖాలకు, లాభ నష్టాలకు అతీతంగా కూర్చోబెడుతుంది.

మానావమానాలు

బంగారు వర్తకుడు ఆభరణాన్ని మదింపు వేయునట్లు జీవితంలో తారసపడే సన్నివేశాలను మదింపువేసే శక్తి మనస్సుకు లేనపుడు అట్టి మనస్సు మానావమానాల మధ్య చెదిరిపోతూ ఉంటుంది.

మనల్ని ఇతరులు గౌరవించాలని ఆశిస్తాం. అలా జరిగితే తృప్తిచెందుతాం. అలాగే, ఇతరులు అగౌరవంగా చూడకూడదు అనుకుంటాం. ఒకవేళ వారు అవమానిస్తే అసంతృప్తికి, ఆవేదనకు గురి అవుతాం.

ఇతరులకు కూడా మనస్సుంది. అదికూడా మారిపోతూ ఉంటుంది. పరుల అభిప్రాయాలు మాకుల నీడల వంటివి. కారణాలు ఏవి అయినా, వారి మనస్సులు మారవచ్చు. ఏమాత్రం అవగాహనలేని మనస్సులయితే నిష్కారణంగా కూడా మారు తాయి.

పరుల అభిప్రాయాలతో తృప్తి చెందేటట్లయితే, వారి అభిప్రాయాలు భిన్నంగా మారినపుడు అసంతృప్తిని అనుభవించేందుకు కూడా సిద్ధంగా ఉండాలి. మరి వారి అభిప్రాయాలు ఎప్పుడు మారుతాయి? ఇప్పుడే కూడా మారవచ్చు.

అంతేకాదు. ఒకరు మనల్ని గౌరవించాలని భావించటంలోనే మనమీద మనకు గౌరవం లేదని స్పష్టమవుతోంది. అలాగే మనపై మనకు గౌరవ మున్నపుడు ఇతరులు అవమానించినా మన మనస్సు ఆవేదన చెందదు. ఒక గొప్ప సంగీత విద్వాంసుని కచ్చేరిలో పిచ్చివాడొకడు లేచి అరిస్తే అది అతనికి అవమానమా? కాదు. అసౌకర్యం. అవమానానికి, అసౌకర్యానికి తేడా తెలియకపోతే శృతి చెడింది అని అర్థము.

మానావమానాల్లో పొంగి కృంగటానికి ఏమీలేదు. మనస్సు సమభావాన్ని తయారుచేసుకోవాలి. నీలో లేనిది, తమలో ఉన్నది చూచి అజ్ఞానులు పరిహసిస్తే అది నీకెన్నడూ అవమానం కాదు. కాలేదు. ఒకవేళ నీలో ఉన్న ఔన్నత్యాన్ని గుర్తించి ఎవరైనా గౌరవిస్తే పొంగిపోనవసరంలేదు. ఎందుకో తెలుసా? నీ ఔన్నత్యం వెనుక ఎందరో వున్నారు. కారణాలెన్నో ఉన్నాయి. ఈ గొప్పతనం వారందరిదీనూ. "ఇది తెలిసి సమభావంతో జీవించు" అంటుంది వేదాంతం.

సర్వస్య సద్భావ నాస్తు

తిమిరంలో తేజం

"యోగీభవ" - నాయనా! యోగివికా! యోగమనగా కలయిక అని అర్థము. ఈ ప్రపంచంలో కూడికల తరువాత తీసివేతలే అనేది మన అనుభవం. యోగము కూడా అలాంటి కూడికే అయితే అది కూడా కాలంలో అదృశ్యమై అశాంతినే పంచుతుంది.

"అప్రాప్తస్య ప్రాపణం యోగః" లేని దానిని పొందడం యోగమని ఒక అర్థము. లేనిది అంటే ఎప్పుడూ లేనిది అని భావం. ఎప్పుడూ లేనిది ఒక కాలంలో ఉండినా అది లేనిదియే. అట్టి దానిని పొందడంలో తప్పులేదు. కానీ దానివలన శాంతి లభించలేదు అంటే మాత్రం అది పెద్ద తప్పే.

లేని దానిని పొందడము అనే యోగంలో సంతృప్తి లేనపుడు, పోనీ ఉన్నదానిని వదలించుకొంటే ఎలా ఉంటుంది? అలాగే ఊహించాడు పతంజలి మహర్షి. **"యోగః చిత్తవృత్తి నిరోధః"** చిత్తవృత్తులను నిరోధించడమే యోగము అని భాష్యం చెప్పాడు. ఇక్కడ వాస్తవానికి కూడబెట్టేదంటూ ఉండదు. అంతా ఊడగొట్టేదియే. భయంకరంగా దిగిపోయిన ఊడల్ని పెకలించి పారవేయడమే. అడ్డుగోడలను తొలగించడమే.

రత్న ఖచితమై, ఇంద్రభవనంలా శోభించే ఒకానొక మేడలోని సౌందర్యాన్ని వీక్షించాలని అరుదెంచిన వ్యక్తి, గుమ్మం దాటి లోనికి వెళ్ళకుండా, వసారాలో ప్రదర్శింప బడిన అనిత్య సౌందర్యాలను వీక్షిస్తూ ఉండిపోతే ఏమి సాధించినట్లు?

వాటిని దాటిపోవాలి. అనిత్యమైన వృత్తులను అధిగమించి సాగాలి. 'ఇదం' వృత్తుల నుండి పూర్ణంగా విడిపోవాలి. నీవు అనే ఆకాశంలో "అహం వృత్తి" నిన్ను స్పృశించకుండా మేఘంలా సాగిపోవాలి. మేఘాలు లేని వినీలాకాశంలా 'అహం' వృత్తి అనెడి మేఘసరము అదృశ్యమైన దశలో గోచరించే అనంతత్వాన్ని నీవు అమాంతం అనుభవించాలి. కాదు; అది నీవై శోభించాలి. అది వృత్తి రహిత స్థితి కాదు. వృత్తి కూడా విలీనమైన స్థితి. అది కేవలం సంకల్పాలు, శబ్దాలు అణగిన స్థితియే కాదు; సంకల్ప రహిత నిశ్శబ్ద సంగీతం ప్రవాహంలా సాగే నిత్యోత్సవం.

ఆంతర్య సౌధంలోకి ప్రవేశించిన వారికే ఈ వైభవం అవగతమవుతుంది. ప్రవేశం పేరుతో కేవలం వసారాలో పచార్లు చేసేవారికి వెలుగు చిక్కదు. చీకటిపోదు.

బాగా గ్రంథములను అధ్యయనం చేసి, ఎవరెవరో చెబుతున్న ఏవేవో ధ్యాన పద్ధతులను ఆచరించి విసుగుచెందిన ఒక వ్యక్తి ఇటీవల నన్ను కలిశాడు.

మా ఇరువురి మధ్య ధ్యానానికి సంబంధించిన అనేక విషయాలు చర్చనీయాంశము లయ్యాయి.

"ధ్యానము మీద నాకు విశ్వాసము సన్నగిల్లిపోతోంది. ఇక ధ్యానాన్ని సాగించ దలచుకో లేదు స్వామిజీ" అన్నాడు.

"ఎందుకని అలా?" అని నేను ప్రశ్నించాను.

"ఏమీ లేదు. ఎంతకాలం చేసినా కళ్ళు మూసుకోగానే చీకటి తప్ప మరేమీ కనిపించడం లేదు" అన్నాడు.

"మంచిది. చూడండి. కళ్ళు మూయగనే చీకటి కనిపిస్తోంది అంటున్నారు. మరి ఆ చీకటి ఎవరికి తెలుస్తోంది?" అన్నాను నేను.

"నాకే" అని వెంటనే అనేశాడు ఆ ధ్యానయోగి. నేను ఆ విషయాన్ని విస్తృతం చేసుకొంటూ పోయాను.

"చూడండి. లోపల చీకటి ఉందన్నారు. చీకటి ఉన్నట్లు చీకటికి తెలుసా? లేక చీకటి ఉంది అని చీకటి చెప్పగలదా? కనుక నీలో చీకటే కాదు. చీకటిని తెలుసుకొనే నీవూ ఉన్నావు. అదే వెలుగు. దానిని నీవు ఏ పేరుతో పిలుచుకుంటావో నీ ఇష్టం. ఆ వెలుగు పెరుగుతూ ఉంటే, చీకట్లు అదృశ్యమౌతాయి".

"అంతేకాదు, చీకటిని నీవు తెలుసుకున్నట్లు వెలుగును కూడా వీక్షిస్తామను కుంటావేమో! ఆ వెలుగు చీకటిలాగా నీకు వేరుగా లేదు. నిజం చెప్పాలంటే అదే నీవు.

"ధ్యానంలో నీవు దర్శించేది నిన్నే. నీకన్నా అన్యమైన దేదియు లేకుండా ఉండి పోవడమే, నిండిపోవడమే ధ్యానం" అన్నాను నేను.

అతడు నా సమాధానంతో తృప్తి చెందినట్లు అగుపించాడు. మళ్ళీ కొన్ని రోజుల తరువాత నన్ను కలిసి "ఇప్పుడు ధ్యానం బాగా జరుగుతోంది స్వామిజీ. మీ మాటలు నాకు మంత్రాల్లా పనిచేశాయి" అన్నాడు.

"మరి చీకటి ఎలా ఉంది?" అన్నాను. "ప్రస్తుతం లేదు" అన్నాడు. "మళ్ళీ రాకుండా చూసుకో" అన్నాను.

అతనే కాదు. మనం కూడా చీకటికి దూరంగా ఉండాలి.

"తమసోమా జ్యోతిర్గమయ" అనేది మన నిత్య ప్రార్థన కావాలి.

నాట్య దీపం

జీవితమొక నాటకరంగం

నిజానికది జీవులకు రణరంగం.

ఇప్పటికి లేచిన అలలెన్నో! పడిన తెరలెన్నో! ఆడిన ఆటలే. పాడిన పాటలే.

కాళ్ళు గంతులేసినా కళ్ళకు గంతలు తప్పలేదు.

చేతులు ఒంపులు తిరిగినా చేతములో సొంపులు రాలేదు.

అన్నీ వాడిపోయిన ముఖాలే.

అందరూ ఓడిపోయిన మనుష్యులే.

సంసారాఖ్య విశాల నాటకగృహే సర్వాణి రూపాణ్యహో
ధృత్వాధోముఖ యోనిజా యవనికా నిర్వృత్య నిర్గత్య చ
సర్వజ్ఞస్య దయాకరస్య తవ దేవాగ్రే చిరాన్నృత్యతః
శ్రాంత స్యాపి మమాల మిత్యుచిత వాగేకైవ విశ్రాణనమ్ ॥

హే పరమేశ్వరా! ఈ సంసారము ఒక విశాలమైన నాటకశాల. ఈ శాలలో ఒక దాని వెంట మరొకటిగా ఎన్నో వేషాలను సాగించాను. మాతృగర్భమనే ఆహార్యశాలలో ఈ వేషాలను ధరించి యోనిద్వారమనే తెరను తొలగించుకొని, ప్రపంచ రంగస్థలిపై ప్రవేశించి నీ ముందు నా వేషములను ప్రదర్శిస్తున్నాను. నీవు సర్వజ్ఞుడవు. దయామయుడవు. జగదేక పాలకుడవు. నా వేషములకు మెచ్చి నన్ను సత్కరింపగలవు. అట్టి త్యాగము నీకుంది. కాని, వాటిని కోరే ఆశ నాకు ఇపుడు లేదు. చిరకాలము నుండి బహువేషములను ధరించి, ఆడి ఆడి అలసిపోయినాను. విసుగు చెందియున్నాను. ఈ ఆటను విరమించేందుకు నీ అనుమతిని అర్థిస్తున్నాను"; అని ఎవరో తెలియదు గాని పరమాత్మనిలా ప్రార్థించాడు.

ఆద్యంతములు గల నాటకం ఎప్పుడైనా ముగిసేదే. ముంచేదే.

బాధను ఉంచనిది, బ్రతుకును ముంచనిది నాటకదీప మొక్కటే.

అదే సాక్షీ చైతన్యము. అదే పరంజ్యోతి.

ఉపకారి

అరణ్యంలో అన్నీ వృక్షాలే.

అంతఃకరణలో అన్నీ వృత్తులే. ఇవే సంకల్పాలు. ఆలోచనలు.

నదిలో ఇంతవరకు ఎంత నీరు దొర్లిందో చెప్పలేము. మనసులో ఇంతవరకు ఎన్ని సంకల్పాలు కదిలాయో కూడా చెప్పలేము.

గతంలో వేలాది ఆలోచనల్ని కదిలించాము. భవిష్యత్తులో ఎన్నో కదిలించ బోతాము. వర్తమానంలో ఎన్నిటినో పట్టుకొని యున్నాము.

ఈ ఆలోచనలలో మనకు ఏ ఆలోచన ఉపకారి?

మన మనసులో కదిలేవే కనుక అన్నీ ఉపకారులుగనే కనిపిస్తాయి. విశ్లేషించి చూస్తే అన్నీ అపకారం చేసేవే.

పాప చింతనం మంచిది కాదు అనేది ఒక ఆలోచన. ఈ ఆలోచన ఉపకారిగనే కనిపిస్తుంది. దోష నిర్మూలనకు ఉపాయంగా గోచరిస్తుంది. కాని, అలా పాపచింతనం తొలగించుకోవాలని గాఢంగా ఆలోచించడములో తెలియకుండానే పాప స్పృహ పెరిగి, పాపాచరణమునకు దారితీసి అపాయాన్ని కలిగిస్తుంది అనే సత్యాన్ని ఊహించడం అందరికీ సాధ్యం కాదు.

ఇంతకీ మనకు ఉపకరించే ఆలోచన ఏది?

శ్రేయస్సుకు సహకరించే సంకల్పం ఏది?

మన మనస్సులో కదిలే వేలాది సంకల్పాలలో మన శ్రేయస్సుకు ఉపకరించేది, సహకరించేది ఒక్కటే. అదియే సత్సంకల్పం. అంటే, 'సత్' పదార్థానికి సంబంధించిన సంకల్పం. పరమాత్మకు సంబంధించిన సంకల్పం.

చెడును తొలగించుకోవాలనే ఆలోచనలో ఉన్నదంతా చెడుపే.

మంచిని పెంచుకోవాలనే ఆలోచనలో జరిగేదంతా మంచియే.

చెడును గూర్చి ఏ విధంగా ఆలోచించినా మనకు చెడే జరుగుతుంది. మంచిని గూర్చి ఆలోచించాలి. సబ్బు రాసుకుంటూ ఉంటే మురికి తానంతటదే జారిపోతుంది. పరమాత్మనే చింతిస్తూ ఉంటే పాపాలు వాటంతటవే పారిపోతాయి.

వేలాది దుష్టసంకల్పాలను అంతం చేసేది ఒక్క సత్సంకల్పమే.

చితిని రగిలించే కొరవి ఒక్కటే.

ముందుగా కొరవి ఒక్కటే కాలుతుంది. ఆ తరువాత చితిని కాల్చుతుంది. కాలిన కొరవి శవంతో సహా కాష్ఠముల నన్నిటినీ దగ్ధం చేస్తుంది. అన్నిటిని భస్మం చేసి తాను కూడా భస్మమైపోతుంది. చివరికి విభూతియే మిగుల్తుంది. శివ రూపమై భాసిస్తుంది.

కొరవిలాగే మనస్సులో జ్ఞానవృత్తి కదులుతుంది. అది మిగిలిన సమస్త సంకల్పాలను దగ్ధం చేసి తాను కూడా లేకుండా పోతుంది. ఆ తరువాత శేషించేది నిర్విశేషమే. అదియే భగవద్విభూతి. కొరవితో వెనుకనుండి చితిని రగిలించడములో కూడా అర్థం, పరమార్థం అదియే. వెనుక ఆచరించిన కర్మలయొక్క సంచిత మంతయూ ఒక్క జ్ఞానవృత్తితో దగ్ధమైపోతూ ఉంది.

ఈ జ్ఞానవృత్తి ప్రమాణం ద్వారా లభిస్తుంది.

బ్రహ్మవిత్ ఆప్నోతి పరం

అన్నప్పుడు బ్రహ్మకు సంబంధించిన జ్ఞానము కలిగితే సర్వోత్కృష్టమైన స్థితి ఏర్పడుతుందని భావము. అంటే బ్రహ్మమునకు సంబంధించిన అజ్ఞానము ఉన్నట్లు శాస్త్రం అంగీకరిస్తూ ఉంది. అజ్ఞానము తొలగేందుకు జ్ఞానం కావాలి. అదియే జ్ఞానవృత్తి.

శాస్త్రము ప్రమాణముగా అందినపుడు **"అభేద జ్ఞానవృత్తి"** కదులుతుంది. దీనినే శ్రీశంకరాచార్య స్వామి **"ఏక భావ అవగాహినీ వృత్తి"** అన్నారు.

ఈ వృత్తి ద్వారా అజ్ఞానము నిర్మూలించబడుతుంది. ఇది కూడా ప్రక్రియయే. ప్రమాణమందించిన ప్రక్రియయే.

అజ్ఞానమును అంగీకరించుట అధ్యారోపము కాగా, జ్ఞానము ద్వారా అపవాదము జరిగింది. కనుక అధ్యారోప అపవాద ప్రక్రియయే ఇక్కడ కూడా శోభిస్తూ ఉంది. జీవికి క్షోభ తీరేది, జీవన శోభ పెరిగేది ఇక్కడే.

వాగ్దానంలో పుచ్చుకున్నవాడికే తాత్కాలిక తృప్తి. ప్రేమ దానంలో ఇచ్చిపుచ్చుకున్నవా రిద్దరికీ తృప్తి కలుగుతుంది. వాగ్దానం ఫలించినపుడే ఆనందం. ప్రేమ దానం అలా సమయాల కొరకు నిరీక్షించదు. వెంటనే ఉభయులకు ఫలితాన్నిస్తుంది. తృప్తి నిస్తుంది. శాంతి నిస్తుంది.

వాడని పూలు

మహాత్ములలోని గొప్పతనమే మనం వారిని ప్రేమించేలా చేస్తుంది. కనుక, మహాత్ముల్ని ఎవ్వరైనా ప్రేమించగలరు.

కానీ, పాపిని ప్రేమించడం వెనుక ఉండేది మన గొప్పతనమే. మనం గొప్పవాళ్ళం కాలేకపోతే చిన్నవారిని ప్రేమించలేము. చిన్నవారికి పెద్ద అర్హత లుండవు. పెద్ద మనసు గలవారు ప్రేమించినపుడు చిన్నవారు కూడా పెద్దవారైనట్లు తృప్తిచెందుతారు. ఇక్కడే తరతమ భేదాలు అంతరిస్తాయి. ఈ పని చేసేందుకే **"వేదాంతం"** నిలిచి ఉంది. మనలో తప్పులు లేవా? దోషాలు లేవా? స్వార్థం లేదా? తొందరపాటు లేదా? కాఠిన్యం లేదా? కపటము లేదా? పరిశీలించి చూస్తే ఉన్నవన్నీ అవే నేమో! అలాగని మనల్ని మనం ద్వేషించుకుంటున్నామా? మనల్ని మనం ప్రేమించుకోవడం మానేస్తున్నామా? ఇతరులు మనలాంటివారు కారా? దీనిని వంటపట్టించుకొని సహనభావం ఏర్పరచుకుంటే అందరినీ అవ్యాజంగా ప్రేమించగలం. ఈ ప్రేమను నేర్పేందుకే **"వేదాంతం"** శోభిస్తోంది. నిన్ను, నన్ను, అందరినీ పరమాత్మ నిర్వ్యాజంగా ప్రేమించడం లేదా? మనలో ఏమి చూసి పరమాత్మ మనల్ని ప్రేమిస్తున్నాడు? కారణాలను వెదికితే మనకు పట్టెడన్నం కూడా పెట్టడు అనేది అక్షరసత్యం. దోసెడు నీళ్ళు కూడా పోయడు అనేది అక్షరాలా సత్యం.

పూచిన మల్లెలపై వీచిన గాలులు సౌరభాన్ని దోచుకుంటాయి. దాచుకొంటాయి. ఎందుకో తెలుసా? నీకు దానం చేసేందుకు.

మనసులో భావ మొగ్గలు విరబూయాలి. ప్రేమగాలులు జ్ఞాన సౌరభాన్ని వెద జల్లాలి. మనసులో మల్లెలు పూసేది, వెన్నెల కాసేది అప్పుడే.

Man is a saint when inspired and a criminal when compelled.

"భవ్యమైన ప్రేరణ లభించినపుడు మనిషి మహాత్ముడు కావచ్చు. ప్రతికూల వాతావరణంలో పాపి కావచ్చు", అన్నారు డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్.

ఇది గాలిబ్రతుకు.

ఎన్నాళ్ళు తోడున్నా, జాలి లేకుండా మోసం చేసేదే గాలి.

ప్రేమలో కపటముండదు. కపట మెరుగని ప్రేమ కల్ల లాడదు.

దీపం కాంతికి దూరం కాదు. చంద్రుడు చంద్రికను విడిచిపోడు. సూర్యుడు వెలుగుకు వేరు కాడు. మనం ప్రేమను మానలేము.

ఇది సత్యం...... ఇదే దైవం..... ఇదే జ్ఞానం.

భోజన కాలంలో ఆపోశన పట్టే సమయాన సర్వప్రాణుల నుద్దేశించి ఒక మంత్రాన్ని మంగళకరంగా పలుకుతున్నాం.

అమృతాపిధాన మసి రౌరవే పుణ్య నిలయే పద్మార్బుద నివాసినాం

అర్థినాం ఉదకం దత్తం అక్షయ్య ముపతిష్ఠతు ॥

భుజించిన ఆహారానికి ఆచ్ఛాదనము (అపిధానం) అయిన జలము రౌరవాది నరకాల్లో ఉన్నవాళ్ళందరికి కూడా అందాలని, వారు కూడా తృప్తి చెందాలని పరితపించిన మహితాత్ములు మన పూర్వీకులు.

దేశోఽయం క్షోభ రహితః - దేశమంతా క్షోభ లేకుండా ఉండాలి.

సర్వః సర్వత్ర నన్దతు - నేను ఆనందించినట్లే అందరూ అన్నిచోట్ల ఆనందించాలి అని ప్రార్థించిన మహర్షుల రక్తం మనలో ఇంకా గడ్డ కట్టలేదు.

మైత్రీ మశేష భూతాని పుష్యన్తు సకలే జనే - సర్వభూతముల యెడ మైత్రీభావంతో ఉండేలా అనుగ్రహించమని ప్రార్థించారు మన పెద్దలు.

ఆ ప్రార్థనా కుసుమాలు వాడేవి కావు. మనం వాటిని వీడకుండా ఉంటే చాలు.

ఈ క్షణం నుండి,

పరుల దోషాలు మనకొద్దు. అవి మనలో కూడా ఉన్నాయి.

మనలో దోషాలున్నాయని మనల్ని మనం నిరసించుకోవడం లేదు. ఇతరులు కూడా మనలాంటివారే.

గాలి అందరికీ సమానంగా వీచినట్లు, మనం అందరినీ ఒకేలా ప్రేమిస్తాం.

అవగాహన మనందరికి ఒకేసారి ఏర్పడింది. ప్రేమించడం కూడా ఒకేసారి ఏకకాలంలో ప్రారంభిస్తాం. ప్రారంభించండి. ఇదే సమయం. ఎవరికి వారుగా ఏర్పరచుకోవాలి నియమం.

ఇది "**కదంబ ముకుళ న్యాయము**"..........

కడిమి చెట్టులోని మొగ్గలన్నీ ఒకేసారి విరబూస్తాయి.

ప్రేమతో మన హృదయాలన్నీ ఒకేసారి విచ్చుకుంటున్నాయి.

పరిమళాలు ప్రపంచాన్ని పలకరించనీ; సురభిళాలు ప్రపంచంలో చెలాయించనీ.

నింగి నేల కలిసి ఉంటే నిత్యము కళ్యాణము.

నది అంబోధి కలిసిపోతే సత్యమే తోరణము.

తారాడి తరించాలి

సత్యం నేత్రాలకు కనిపించదు. కానీ, నేత్రాలకు కనిపించే ప్రతి దృశ్యములో సత్యం దాగి ఉంది.

నామరూపాలు సత్యం కావు. కానీ, నామరూపాలు గోచరించుటకు ఆధార మైనది, అధిష్ఠానమైనది సత్యమే.

ఏ శరీరమూ నిత్యము కాదు. కానీ, నిత్యమైనది ఆలంబనము కావటం చేతనే శరీరాలు గోచరిస్తున్నాయి.

నీలో ఉన్నది, నాలో ఉన్నది, మరొకరిలో ఉన్నది అంతా సత్యమే. సత్యం ఎన్నడైనా శివమే. సత్యం దూరమైతే ఎవరైనా శవమే.

శవం కాకముందు శరీరంలో శివం ఉంది. ఎప్పుడుంది? ఇప్పుడే ఉంది. ఎక్కడుంది? ఇక్కడే ఉంది. ఇక్కడే ఉంది కనుక ఇప్పుడే దర్శించాలి.

అత్ర బ్రహ్మ సమశ్నుతే

"బ్రహ్మమును ఇక్కడే పొందాలి" అన్నది వేదము.

అనడం, వినడం బాగానే ఉంటుంది. వంటబట్టేటప్పుడే అడుగంటుతుంది.

"పొందాలి" అన్నప్పుడు ఉన్నదానినా? లేనిదానినా? ఉన్నదానిని పొందవలసిన అవసరం లేదు. లేనిదానిని ఎలాగూ పొందలేము. ఇక పొందడమనే దేమిటి?

ఉండినది ఉంటూ, ఉన్నట్లు తెలియనపుడే పొందడమనేది సరిపోతుంది. ఇక్కడ వాస్తవానికి ప్రత్యేకముగా పొందడ మనేది లేదు. ఉన్నదానిని ఉన్నట్లు తెలుసుకోవడమే. మరి, తెలుసుకొనేవా డెవరు? లేదని నిర్ణయించుకున్నవాడే కదూ? ఈ నిర్ణయంలో తనకు తానుగా ఎలా ప్రయత్నించి పొందగలడు?

యత్తు స్వతః అప్రాప్తం తచ్ఛాస్త్రేణ బోధితవ్యం

'తనకు తానుగా పొందలేని దానిని శాస్త్రబోధ ద్వారా గ్రహించాలి' అని శంకర భాష్యము.

గహనమై, గుహ్యమై, మనోవాగాతీతమైన సత్యమును నిర్దేశించుటకు శాస్త్రము అనేక పద్ధతులను, ప్రక్రియలను అందించింది. వానిలో "**అరుంధతీ దర్శన న్యాయము**" ఒకటి. హిందూ వివాహ వైభవములో శోభిల్లే కార్యక్రమాలలో అరుంధతీ దర్శనము ఒకటి. వివాహము కాగానే నూతన వధూవరులచే రాత్రిపూట ఆకాశంలో భాసించే అరుంధతీ నక్షత్రమును దర్శింప చేస్తారు.

అరుంధతీ నక్షత్రము సూక్ష్మాతి సూక్ష్మమైనది. దానిని గుర్తించడం చాలా కష్టం. దానిని దర్శించిన పురోహితుడు వధూవరులచే దర్శింపచేస్తాడు.

ఆకాశంలో దివ్యంగా ప్రకాశించే ఒక తారను ఆధారం చేసుకొని, దాని నుండి మెల్లగా చరిస్తూ సప్తర్షి మండలమును గుర్తింప చేస్తాడు. ఆ సప్తర్షి మండలములో సూక్ష్మమైన వసిష్ఠ నక్షత్రాన్ని గుర్తింప చేస్తాడు. వసిష్ఠ నక్షత్రానికి సన్నిహితంగా సూక్ష్మాతి సూక్ష్మంగా వెలిగే అరుంధతిని దర్శింపచేస్తాడు. దీనినే **అరుంధతీ దర్శన న్యాయము** అంటారు. తెలిసిన దానిని ముట్టుకుంటూ తెలియని దానిని పట్టుకొనే పద్ధతి. వ్యక్తమైన దానిని గుర్తిస్తూ అవ్యక్తమైన దానిని గ్రహించే ప్రక్రియ.

అరుంధతిని దర్శించడానికి అరుంధతి కాని వాటిని గుర్తిస్తూ పోవడం జరిగింది. అరుంధతిని దర్శించగనే కానివన్నీ కానట్లే పోయాయి. అరుంధతికన్నా అన్యమైనవన్నీ నిరాకరించబడ్డాయి.

అరుంధతిని దర్శించక మునుపు ఆ తారను, ఈ తారను స్మరిస్తూ, విస్మరిస్తూ రావడంలో ఉపయోగ మేమిటి? వాటి ఉపయోగము లేకపోయినా నీవు అరుంధతిని దర్శించుటకు అవి ఉపకరిస్తాయి. సహకరిస్తాయి.

వధూవరులకు కనిపించని అరుంధతిని పురోహితుడు చూడగలడు.

అస్మాకం అప్రత్యక్ష మపి చిరంతనానాం ప్రత్యక్షమ్

"మనకు స్పష్టము గాని సత్యము మన పూర్వీకులకు సుస్పష్టము" అన్నారు భాష్యంలో శ్రీ శంకరులు.

తాను దర్శించిన అరుంధతిని ఒక ప్రత్యేక పద్ధతి ద్వారా పురోహితుడు తెలిపినట్లు, మహర్షులు కూడా కొన్ని ప్రక్రియలను, పద్ధతులను ప్రవేశపెట్టి ఆత్మ దర్శనం చేయిస్తారు.

ఈ పద్ధతులు, ప్రక్రియలు అన్నీ శాస్త్రాల్లో నిక్షిప్తమై ఉన్నాయి. సత్యదర్శనానికి శాస్త్రములు ప్రమాణాలై సహకరిస్తాయి.

అరుంధతిని దర్శించిన తరువాత అన్యమైనవన్నీ నిరాకరింపబడినట్లు సత్యదర్శనంలో మరొకటి అనేది మిగలదు.

జ్ఞాతే ద్వైతం న విద్యతే

"తెలుసుకున్నచో ద్వైతం లేనే లేదు".

ఆధునిక ఖగోళశాస్త్ర పరిశోధనలో వసిష్ఠ అరుంధతీ నక్షత్రాలు రెండు కావని, ఒకటే అని నిర్ణయించడం జరిగింది. ఒకే తార రెండుగా గోచరిస్తున్నదని వారి అభిప్రాయము. ద్రష్ట, దృశ్యము అనేవి రెండుగా తెలుస్తున్నా వాస్తవానికి అవి ఒకటే గాని రెండు కావు అనేది ఉపనిషత్తుల నిర్ణయము కూడా.

క్వ బద్ధః క్వ చ వా ముక్తః స్వస్వరూపేఽహ మద్వయే

"బద్ధు డెక్కడున్నాడు? ముక్తు డెక్కడున్నాడు? నేను అద్వయస్వరూపుడను", అని జనక మహారాజు పొందిన స్వరూపానుభూతి అందరికీ ఏదో ఒనాడు అనివార్యంగా ప్రాప్తించే విభూతి. అరుంధతీ దర్శన న్యాయంద్వారా అందుకొనే హారతి.

విత్తులోనే చెట్టు

ఆకులో పచ్చదనం..... ఆదిత్యునిలో వెచ్చదనం....... మల్లెలో కమ్మదనం... తేనెలో తియ్యదనం.....ఏమిటని? ఎవరిదని? ఎంతగా ప్రశ్నించినా, మరెంతగా పరిశీలించినా వేరువేరుగా తెలిసే వీటన్నిటిలో వేరుగాని దేదో ఉందని, ఈ విశ్వము వెనుక వైభవము అదేనని తేలిపోతుంది.

ఈ ప్రపంచ మేమిటో తెలుసుకోవాలని ప్రయత్నించిన వారందరు ఎంతో తెలుసుకున్నా, తెలుసుకుంటున్నా, తెలిసింది మాత్రం 'ఇంతే' అనే నిరాశలో పడ్డారనేది మాత్రం నిజం. విశ్వాన్ని గ్రహించడ మంటే విశ్వాత్మను గ్రహించడమే అనే సత్యం తెలిసినపుడే ప్రయత్నాలు ఫలిస్తాయి.

మారేది విశ్వం...... మారనిది విశ్వాత్మ. మారే దానిని తెలుసుకుంటూ పోవడమే తెలివి అయితే, అలా తెలుసుకొనే తెలివి కూడా మారిపోతూ జారిపోతూ జాడ లేకుండా పోతుంది. నేడు అందరిలోను తెలిసో, తెలియకో ఇదే జరిగిపోతూ ఉంది. నీడలు నిలబడుతున్నాయి. నిజాలు జారిపోతున్నాయి. అందుకే ఉపనిషత్తు,

అహోను చిత్రం యత్సత్యం బ్రహ్మా తద్విస్మృతం నృణామ్

"ఆహాఁ .... ఏమి ఆశ్చర్యము! సత్యమైన దానినే జనులు మరచిపోయారు కదా!" అన్నది. ప్రపంచాన్ని తెలుసుకోవాలని మానవులు చేసే ఈ భగీరథ ప్రయత్నంలో చిక్కకుండా ప్రపంచం జారిపోవడానికి కారణమేమిటి? ఏమీ లేదు. దానికి కారణం ఒక్కటే. ప్రపంచం యొక్క అర్థం ప్రపంచంలో లేకపోవడమే.

ప్రపంచం ఎలాగైనా తెలియనీ, ఎవరికి తెలుస్తూ ఉంది? అని ప్రశ్నించినపుడు - 'నీకే' అని మాత్రం నీవు అంగీకరించక తప్పదు. ఎవరెవరి ప్రపంచం వారివారికి తెలుస్తూ ఉంది. ఒకరి విషయం ఇక్కడ అనవసరం. అది నీకు ఎలాగూ అర్థం కాదు. ఎందుకంటే, వారూ ప్రపంచంలో ఉన్నవారే. ప్రపంచం ఎప్పుడు అర్థం కావడం లేదో, అందులోని వారే కనుక వారు కూడా అర్థం కారనే సత్యాన్ని వేరుగా చెప్పనవసరం లేదు.

నీవు ప్రపంచాన్ని తెలుసుకుంటున్నావు. ప్రపంచ మేమిటో ప్రపంచం చెప్పడం లేదు. నీవు చెబుతున్నావు. కనుక ప్రపంచం యొక్క అర్థం నీలో ఉందేగాని ప్రపంచంలో లేదు. ప్రపంచము యొక్క జ్ఞానం నీకు ఎలా కలిగింది? అది నీవు కాకపోతే, దానికి సంబంధించిన జ్ఞానము నీకు ఎలా కలుగుతుంది? విశ్వాన్ని తెలుసుకోవాలని భావించే వాడు విశ్వంలోనే ఉన్నాడు. విశ్వానికి వేరుగా లేడు.

విశ్వంలో అనుక్షణము ఎన్నో మారుతున్నా, మరణిస్తున్నా విశ్వం మాత్రం కొన సాగుతూనే ఉంది. ఈ మారని తత్త్వం విశ్వంలో ఏమిటి? అదే విశ్వాత్మ. మార్పులకు అతీతమైన తీర్పు. మన దేహంలో అనేక అవయవా లున్నాయి. అవన్నీ మార్పు చెందుతూ ఉన్నాయి. కానీ ఆత్మ మారడం లేదు. అంగాలు మనలో ఎన్నో, కాని ఆత్మ ఒక్కటే. అంగాలన్నీ ఉన్నా ఆత్మ లేకుంటే శవమే. ఆత్మ ఉంటే అంగవిహీనమైనా శివమే.

వ్యక్తిలో ఆత్మలాంటిదే విశ్వంలో విశ్వాత్మ. మన దేహంలో ఆత్మ లేని దెక్కడ? అయితే, ఈ విశ్వంలో విశ్వాత్మ లేని దెక్కడ? విశ్వాత్మ విశ్వమంతటా ఉంది. అదే సత్యమైతే విశ్వంలో ఉన్న నీవు విశ్వాత్మకన్నా అన్యంగా ఎలా ఉండగలవు? నీ దేహంలోని అంగం నీకు దూరంగా ఉండగలదా? విశ్వాత్మయే వ్యక్తి ఆత్మగా ఉంది.

స వా అయమాత్మా సర్వేషాం భూతానాం అధిపతిః

"సమస్త ప్రాణులకు అధిపతిగా తెలిసే విశ్వాత్మయే ఈ ఆత్మ (జీవాత్మ)గా తెలుస్తూ ఉంది" అన్నది ఉపనిషత్తు.

ఇదే సత్యమైతే, అలాంటప్పుడు శ్రమించి విశ్వాత్మను తెలుసుకోవడం కన్నను సున్నితంగా వ్యక్తి ఆత్మను తెలుసుకుంటే సరిపోతుంది కదా? అవును. సరిపోతుంది. కాదు; సరిపడి ఉంటుంది. దీనినే **స్థాలీపులాక న్యాయము** అంటారు.

వంట చేసుకొనే పాత్రను **"స్థాలి"** అంటారు. **'పులాకము'** అంటే మెతుకు అని అర్థం. వంట పాత్రలో బియ్యం ఉంచి పొయ్యిమీద వంట చేసేటప్పుడు బియ్యం ఉడికినట్లేనా? లేదా? అనే సందేహం కలిగితే వెంటనే పాత్రలోని అన్నములో ఒక్క మెతుకును పట్టుకొని చూస్తారు. అది ఉడికి ఉంటే పాత్రలోని బియ్యము అంతయూ ఉడికిందని అర్థం. లేనిచో అంతయూ ఉడక లేదని భావం. దీనినే **స్థాలీపులాక న్యాయము** అంటారు. అలాగే వ్యక్తి యొక్క ఆత్మను గ్రహిస్తే విశ్వాత్మను గ్రహించినట్లే అవుతుంది. వ్యక్తిలో ఉన్నదే విశ్వంలో ఉంది. విశ్వంలో ఉన్నదే వ్యక్తిలో ఉంది. ప్రతి వ్యక్తి తనలో తానే ఒక ప్రపంచం.

స్వాత్మానుభూతిలో విశ్వాత్మానుభూతి కలుగుతూ ఉంది. విశ్వాత్మ అనుభూతిగా అందినపుడు విశ్వం అనుభవానికి దూరం కాలేదు. ఇప్పుడు అర్థమైంది కదూ! విశ్వాన్ని గ్రహించడమంటే విశ్వాత్మను గ్రహించడం. విశ్వాత్మను గ్రహించడ మంటే స్వాత్మను సందర్శించడం.

ప్రపంచాన్ని తెలుసుకోవాలని భావించడం తప్పు కాదు. కానీ అలా తెలుసుకోవాలంటే ముందుగా మనల్ని మనం తెలుసుకోవాలి అనేది తెలియకపోతే మాత్రం ప్రపంచం ఎప్పుడూ తెలియనిది గానే తేలిపోతుంది.

ఇక్కడే మన దృష్టిని ఒక్కసారిగా మరొక కోణంలోకి త్రిప్పారు మన మహర్షులు. బాహ్యం నుండి అంతరంగానికి ప్రయాణం కట్టించారు. నీవు అర్థం చేసుకోవాలని ఆరాటపడే ప్రపంచం బయట లేదని **"నిజాంతర్గతం"** అని నిరూపించారు.

ప్రపంచాన్ని తెలుసుకోవడానికి ప్రతిదానిని పరిశీలించి పరీక్షించ నవసరం లేదని, **'స్థాలీపులాక న్యాయం'**గా నిన్ను నీవు తెలుసుకుంటే సరిపోతుందని, అప్పుడు నీవు అన్వేషించే విశ్వము నీకన్నా అన్యంగాదని, మాయచే బాహ్యంలో ఉన్నట్లు తెలుస్తున్నా, మహిమగా ఆంతర్యంలో ఉన్నదే నని నీకు ప్రత్యక్షంగా తెలిసిపోతుందని మహర్షులు ప్రవచించారు.

స ఆత్మా తత్త్వమసి

"అదియే ఆత్మ. అదియే నీవు" అని ఛాందోగ్యోపనిషత్తు చారపథాన్ని నిర్మించింది. సత్యపథాన్ని నిరూపించింది.

ఓం తత్ సత్

తెగే వరకు లాగాలి

ఎంతెంత దూరం?...... కొస కొస దూరం....... ఇంకెంత దూరం?......కొస కొస దూరం....... మరెంత దూరం?..... కొస కొస దూరం.

దారిలో దప్పికతో నీరసిస్తున్న వ్యక్తిని మరికొంత దూరము నడిపిస్తే గాని జలాశయము కనిపించదు. నడువలేక డస్సిపోతున్న వ్యక్తికి అదిగో - అదిగదిగో అని మృగతృష్ణను చూపి, తృష్ణ తీరుతుందనే ఆశతో ముందుకు నడిపించడం, నిజానికి నీరున్న చోటికి చేరగనే అతని దప్పికను తీర్చడం అనే యుక్తిని **'సౌరాంభికా న్యాయము'** అంటారు. ఇది ఆశావాదానికి సోపానము.

'ఇంకెంత కాలం తినాలి ఈ చేదుమందు?" అని రోగి. 'ఈ ఒక్క రోజే. ఈ ఒక్కపూటే' అంటూ రోజూ రోగి చేత మందు మ్రింగించి, ఆరోగ్యవంతుని చేసి మందును ఆపేసే వైద్యుడు అనుసరించేది సౌరాంభికా న్యాయము.

మాఘమాసానికి మీ బ్రతుకుల్లో మేఘాలు చెదిరిపోతాయి. నిరాశ చెందకండి అని జ్యోతిష్కుడు మానవులను ఆశాపథంలో నడిపించడం సౌరాంభికా న్యాయము.

జలాశయము కనిపించగనే ఇంతవరకు నడిపించిన వాడే నడకను ఆపుతాడు. ఇంతవరకు చెప్పింది, చూపింది సత్యానికి దారే గాని సత్యము కాదని అంగీకరిస్తాడు. ఆరోగ్యం సరిపడగనే మందును ఆపేయమని వైద్యుడే చెబుతాడు. "అవును-కాదు" అనే ఈ విశిష్ట ప్రక్రియలో 'అవును' అని నిర్ణయించినా, 'కాదు' అని నిరాకరించినా ప్రయాణం మాత్రము లక్ష్యము వైపు సాగుతూనే ఉంటుంది.

ప్రాగాత్మజ్ఞానాత్ ప్రవృత్త్యుపపత్తేః

"ఆత్మజ్ఞానము జాగృత మగుటకు ముందుగా కర్మాచరణము సహజము" అన్నారు బృహదారణ్యకోపనిష ద్భాష్యంలో శ్రీ శంకరాచార్య స్వామి.

శైశవదశలోనే తండ్రికి దూరమై, తండ్రి ఎలా ఉంటాడో తెలియని వానికి 'ఇతడే మీ నాన్న' అని ఒక చిత్రపటాన్ని చూపితే, అతడు భావోద్వేగంతో ఊగిపోవచ్చు. ఆ చిత్రము తండ్రిని చూపెడుతున్నదే గాని తండ్రి కాదు; కాలేదు. కాని, ఆ చిత్రములో తండ్రిని గుర్తించిన వ్యక్తి ఏదో ఓనాడు ఈ ప్రపంచంలో తండ్రి కనిపిస్తే వెంటనే గుర్తు పట్టేయగలడు అని నిస్సందేహంగా చెప్పవచ్చు.

సనాతన ధర్మంలో విగ్రహారాధన అలాగే ఆవిష్కరింపబడింది. అది కూడా సౌరాంభికా న్యాయమే. **బ్రహ్మాదృష్టిః ఉత్కర్షాత్.** విగ్రహంలో బ్రహ్మభావనను కలిగియుండు. ఫోటోలో కలిగిన తండ్రి భావన తండ్రిని గుర్తించుటకు దోహద పడుతుంది. విగ్రహంలో ఏర్పడిన పరమాత్మ భావన విశ్వంలో విశ్వనాథుని దర్శించుటకు సహకరిస్తుంది. కనుకనే రాయిని రప్పను, మేనును మ్రానును, పుట్టను గుట్టను, మట్టిని నీటిని భగవత్స్వరూపంగా వర్ణించుకుంటూ నడిచే సనాతన ధర్మము సత్యదర్శనం జరిగే సమ

యంలో అన్నిటికి ఒక్కసారిగ తెర దించుతుంది. సాకారము ద్వారా నిరాకారములో ప్రవేశించే ప్రక్రియ సౌరాంభికాన్యాయమే.

'ఇతి' అంటూ ఒకచోటికి చేర్చి, ఆ తరువాత 'నేతి' అంటూ నిరాకరించి ముమ్మందుకు నడిపే ముందుచూపు సనాతన ధర్మానికి ప్రత్యేకం. తటస్థంలో తల దూర్చి స్వరూపంగా అలరారు వైభవం దాని వైశిష్ట్యం. అధ్యారోపాన్ని ముందు నిలిపి, ఆ తరువాత దానిని అపవాదంతో నలిపేసే సూక్ష్మబోధ ఋషులు అనుసరించే సున్నితమైన మార్గము.

స్థూల సౌరాంభికా న్యాయాత్ తత్ర చిత్తం ప్రవర్తయేత్

"స్థూల సౌరాంభికా న్యాయమున ప్రవర్తించి నిర్విశేషమును గుర్తించాలి" అని శాస్త్ర ప్రమాణము. ఈ మార్గములోనే ముముక్షువుల ప్రయాణము.

ఎంత విశిష్టమైనది అయినా మార్గంలో స్థిరంగా మకాం పెట్టడం శోచనీయం. ఇక్కడే ప్రాచ్య పాశ్చాత్యాలు ఉత్తర దక్షిణములుగా గోచరిస్తాయి. సనాతన ధర్మము దేనినీ గర్హించదు. బలహీనతలను గుర్తించి ముందుకు నడిపిస్తుంది.

వ్యావహారికము పారమార్థికమును దర్శించలేదనే 'ఇమ్మాన్యుయెల్ కాంట్' వాదనను వేదాంతము భుజం తడుతుంది. కాని, పారమార్థిక సత్యదర్శన శుభ సమయాన వ్యావహారిక సత్యమునకు అర్థమే లేదని త్రోసిపుచ్చి కాంట్‌తో విభేదిస్తుంది.

సృష్టి స్థితి లయాదులను సౌరాంభికా న్యాయమున వివరించే సమయాన 'హెగెల్స్'తో వేదాంతము కలిసి నడిచినట్లే ఉంటుంది. కాని, ఏ ప్రక్రియకు అవకాశ మివ్వని పరమార్థ నిరూపణములో వేదాంతము విభేదిస్తూ తన మార్గంలో తాను నిర్ద్వంద్వంగా సాగిపోతుంది. నడకలో సరిపడి, పడిపోగానే వెనుజూడకుండా ముందుకు సాగడం ధర్మవైభవము. ధర్మరాజు ప్రాభవము.

'విషయ చైతన్యము'ను వివరించి, విశ్లేషించి, చివరగ సౌరాంభికా న్యాయమున 'విషయ చైతన్యము'ను నిర్దేశించడం మహాత్ముల మార్గము. అసమాన పాండిత్యముతో అలరారే మహాత్ములు సామాన్యుల స్థాయికి ఇలా దిగి అపవర్గ మార్గమును చూపడం ప్రేమ కార్యం.

వర్షరూపంలో క్రిందికి జారే మేఘము యొక్క ప్రేమకార్యము. పండిన ఫలమును తనలో నిలుపుకోలేక త్యజించే తరువుతల్లి కృపాకార్యము.

నిరాశాజీవులు ఏనాడైనా ఈ ప్రపంచంలో నిర్భాగ్యులే. నిస్సారనిర్వీర్య సంతతికి వారసులే. అగచాట్లు ఎదురవుతున్నా ఆసక్తితో ముందుకు నడిచేవారు సౌరాంభికా న్యాయ మార్గంలో చరించి తరిస్తారు. గమ్యాన్ని చేరి మార్గాన్ని మరచిపోతారు. అన్యాయ మయ్యేందుకు సిద్ధపడిన అప్రయోజకులకు ఏ న్యాయమూ రుచించదు.

అన్యాయాలను, అసత్యాలను తొలగించి ధర్మాలను, సత్యాలను ఆవిష్కరించుటకు అందల మెక్కిన న్యాయమార్గాలు సర్వజనులకు మార్గదీపికలై శోభించుగావుత!

హుళక్కి

సహజం చల్లదనం పచ్చిగడ్డిలో.

అసహజం కాదు వెచ్చదనం చిచ్చుబుడ్డిలో.

నీడలు పయనానికి కాలేవు ఓడలు. నిజాలే ఎన్నడైనా చెడని మేడలు. ఆయువు బేటరీ ఖర్చయిపోతే ఆటోమాటిక్ గుండె ఆగిపోతుంది. ఇది నిజం. చేదు, తీపి అనే విశేషణాలు ముందుకురికితే అది మనోనైజం.

Starvation amidst plenties - 'అన్నిటి మధ్య ఆకలి బ్రతికుంది' అనేది ఆంగ్ల సామెత. "అంగట్లో అన్నీ ఉన్నాయి. అల్లుని నోట్లో" అనేది ఆంధ్రం అందించే చేయూత. "ఈ పరిమిత మనుగడను నేను భరించలేను. నాకు విముక్తి కావాలి. ముక్తి రావాలి. దానికై భక్తి చేస్తాను. భగవచ్ఛక్తి నాకు తోడుగా ఉంటుంది;" ఇలాంటి వాక్యాల్ని తరచుగా సాధకులు అనడం, మనం వినడం జరుగుతూ ఉంటుంది.

నాకు బంధం తొలగాలి అనేవారే గాని అసలు నాకు బంధమనేది ఒకటుందా? అని తమను తాము ప్రశ్నించుకొనేవా రెందరు?

కో౽హం కథ మిదం చేతి సంసార మల మాతతమ్?

నేనెవరు? ఈ సంసార మాలిన్యము నాకు ఎలా తగులుకొనినది? అని విచారించ మన్నది ఉపనిషత్తు.

"నాకు ముక్తి కావాలి" అన్నప్పుడే నీవు బంధంలో ఉన్నట్లు నీవే అంగీకరిస్తున్నావు. ఇదే వాస్తవమైతే, ఇక జీవికి ముక్తే లేదు. ఒకవేళ లేని ముక్తి వచ్చినా ఒకనాడు లేకుండా పోయేదే గాని నిలిచి ఉండేది కాదు.

కలిగేది ఏదైనా కనుమరుగయ్యేదే. ముక్తి కూడా అంతే. ముక్తి అనేది క్రొత్తగా పొందదగింది కాదు. అది సహజస్థితి. 'నేను బద్ధుడను' అనే భావన నుండి విడిపోవడమే విముక్తి. అదే మోక్షము.

బంధ మనేది భావన. మోక్షము అనేది కూడా భావనే. ఈ రెండూ మనస్సుకు సంబంధించినవి. మనోగతమైన ఈ భావాలు ఉన్నంతవరకు మోక్షము ఎలా సిద్ధిస్తుంది?

మనసైవ ఇన్ద్రజాల శ్రీర్జగతి ప్రవితన్యతే
యావ దేత త్సంభవతి తావ న్మోక్షో న విద్యతే

"ప్రపంచమనే ఈ గారడి అంతయు మనస్సు చేతనే విస్తరించి ఉంది. మనో భావాలు ఎంతవరకు ఉంటాయో అంతవరకు మోక్షము సిద్ధించదు" అని స్పష్టంగా నిర్ణయించి చెప్పింది ఉపనిషత్తు.

మోక్షము ఇప్పుడు లేనిదని నిర్ణయించడము వలన అప్పుడు కలుగుతుందేమో నని భావించి, ఇక్కడ నుండి అక్కడికి చేరేందుకు మార్గాల్ని అన్వేషించడము జరుగు తోంది. మార్గాల్ని మలుపులు త్రిప్పడం, గమ్యాల వైపు గమనాన్ని సాగించడం అనే వంకర దారుల్లో నడిపించటం కాకుండా, సర్వ మార్గాలకు, సమస్త గమ్యాలకు అధిష్ఠానంగా

భాసించే సత్యమును దర్శించడమే ఉపనిషత్తులు తమ అసమాన బోధగా వినిపిస్తున్నాయి. అమృతమయము, ఆనంద స్వరూపము అయిన మోక్షము నీకు లేనిది కాదు. లేనిది అని భావించడమే బంధము. ఇది ఎవరో తగిలించింది కాదు. మనమే తల కెత్తుకున్నది. కొని తెచ్చుకున్నది. ఒక్క మాటలో చెప్పాలంటే ఇది **శుక నళికా న్యాయము.**

పక్షులను పట్టుకోవాలని ఒక బోయవాడు అరణ్యానికి వెళ్ళాడు. అక్కడ చిలుకలు చాలా కనిపించాయి. ఒక గిలకను తయారు చేసి దానిని ఒక చెట్టుపై ఉంచాడు. దాని ప్రక్కనే కొంత ధాన్యాన్ని, కొన్ని కాయల్ని ఉంచాడు.

చిలుక ఒకటి వచ్చింది. ఆహారాన్ని గ్రహించేందుకు గిలకపై వాలింది. అంతే. గిలక తిరగడం మొదలైంది. చిలుక భయపడిపోయింది. పతన భయాన్ని ఊహించి గిలకను వాటేసుకుంది. మాటున ఉన్న బోయవాడు ఇదే వాటమనుకొని చిలుకను పట్టి బుట్టలో వేసుకున్నాడు.

ఇది **శుక నళికా న్యాయము.** చిలుక శక్తితోనే గిలక తిరిగింది. గిలకను వదలి వెళ్ళేందుకు చిలుకకు రెక్కలున్నాయి. కానీ, ఏం లాభం? ప్రమ (జ్ఞానం) లేనందున ప్రమాదంలో చిక్కుకుపోయింది. పట్టుకున్న దానిని వదిల్తే సరిపోయి ఉండేది. సరిపడి ఉండేది. సరి కాలేక ఉరికి గురియైంది.

లేని బంధాన్ని చిలుక ఊహించుకుంది. బంధాన్ని ఊహించడం చేత మోక్షాన్ని పొందాలని తపించింది. బంధం భావనే అని తెలిస్తే, మోక్షము కూడా భావనగానే మిగుల్తుంది. ఇప్పుడు చేయవలసింది బంధాన్ని విడవడం కాదు; మోక్షాన్ని కూడా విడవడం.

వాసనాం సంపరిత్యజ్య మోక్షార్థిత్వ మపి త్యజ

"బంధవాసనలను పూర్ణంగా త్యజించి, మోక్ష వాంఛను కూడా పరిత్యజించు" అనెడి ఉపనిషద్వాణి ఈ సత్యమునే ప్రవచిస్తున్నది.

నిత్యసుఖము కేవలం బంధాలకు అతీతమైనదే కాదు. ముక్తికి కూడా అతీతమే నని గ్రహించాలి.

బంధ ముక్త్యతీతం పరం సుఖమ్ విందతీహ జీవస్తు దైవికః ॥

"మహోత్కృష్టమైన సుఖము బంధమునకు, మోక్షమునకు అతీతమైనది. దైవ లక్షణములు గలవాడు అట్టి స్థితిని ఇక్కడే, ఇప్పుడే పొందుచున్నాడు" అని ఉపనిషద్వాణిని ప్రతిధ్వనింప చేసింది ఉపదేశసార గ్రంథములో భగవాన్ శ్రీ రమణ వాణి.

గిల గిల తన్నుకొను గతి నీకు యెందుకే
గిలక నిక విడువవే చిలుకా!
గిరులను దాటి, సిరులను పొంద
నీ కడ్డు నిలిచిన దెవరె చిలుకా!
గుట్టుగా యెగిరిపో చిలుకా!
ముందు గట్టెక్కిపోవే చిలుకా!

హుష్.....కాకి

ఆశించినా సుఖం లభించదు. నిరాకరించినా దుఃఖం దూరం కాదు.

సత్యము నిత్యమైనందున పరిణామము నెరుగదు. మార్పు తెలియని స్వరూపంలో దుఃఖము అనూహ్యము.

అసత్యము అనిత్యమైనందున అది మనుగడ నెరుగదు. అలాంటిది నీకు దుఃఖాన్ని పంచలేదు. మరి దుఃఖ మెలా ప్రాప్తించింది?

సత్యాసత్య వివేకము లోపించడము వలననే దుఃఖం సంభవమైంది. ఇదియే అజ్ఞానము.

అజ్ఞానే నావృతం జ్ఞానం తేన ముహ్యన్తి జన్తవః ॥

"జ్ఞానము అజ్ఞానముచే కప్పబడి యున్నందున జీవులు మోహానికి గురియగుచున్నారు" అని గీతాచార్యుని ప్రబోధము.

స్వరూపానుభూతికి అజ్ఞానమే ప్రతిబంధకము. అజ్ఞానము సృష్టించే దుఃఖము నుండి విడిపడాలంటే జ్ఞానము కావాలి. జ్ఞానము వలన అజ్ఞానము తొలగించబడుతుంది. స్వరూపము స్వతఃసిద్ధమై భాసిస్తూ ఉంటుంది.

ఇక్కడ కావలసింది అజ్ఞానమును తొలగించే ప్రమాణమే గాని ఆత్మను ప్రకాశింప చేసే ప్రయత్నము కాదు.

ప్రమాణము ద్వారా జ్ఞానము సిద్ధిస్తుంది. ఈ జ్ఞానము అపరోక్షమే గాని పరోక్షము కాదు. పారిజాతాలు నా ముందే ఉన్నాయి. కాని, అవి పారిజాతాలు అని నాకు తెలియదు. ఇక్కడ నాకు జ్ఞానం కావాలి. "ఇవి పారిజాతాలు" అనే జ్ఞానం కావాలి. అయితే, ఈ జ్ఞానం మాత్రం ప్రత్యక్షమే గాని పరోక్షము కాదు. పారిజాతాలకు సంబంధించిన అజ్ఞానము "ఇవి పారిజాతాలు" అని తెలియడం వల్ల తొలగిపోతోంది.

అలాగే ఆత్మ ఎప్పుడూ ఉంది. అది సాధ్యవస్తువు కాదు. సిద్ధవస్తువు. నాకు కావలసింది ఆత్మ కాదు. అజ్ఞానమును నివృత్తి చేసే జ్ఞానవృత్తి. జ్ఞానవృత్తి అజ్ఞానవృత్తిని తొలగించి తానూ అంతర్హిత మవుతుంది. ఇది ప్రమాణము యొక్క ప్రభావము. బోధయొక్క వైభవము.

రెండవ దానిని ఆత్మ అంగీకరించదు. కనుకనే ఆత్మ అద్వయమైంది. ఇది స్వరూపమే గాని దర్శనము కాదు. ఆత్మను దర్శించే వారెవరు? అలా ఎవరైనా ఉండినట్లు, లేదా ఉన్నట్లు మనం నిర్ణయిస్తే మాత్రం అతని చేత తెలియబడేది లేదా దర్శింపబడేది ఆత్మ కాదని నిర్ణయించవలసి వస్తుంది. రెండు లేని ఆత్మలో ద్వైతాన్ని చూపించలేము.

మరి, ఈ సృష్టి ఏమిటి?

రెండవ దానికి మనుగడ లేని సత్యస్వరూపంలో సృష్టిని ఊహించను సాధ్యపడదు. దీనిని మిథ్యగా గ్రహించుటే సత్యము.

జగత్తు మిథ్యయే. కాని ఇది కూడా సత్యమే నేమో! పరమాత్మకన్నా వేరుగా మిథ్య ఉందని అంగీకరిస్తే పరమాత్మ పరిమితుడుగా, పరిణామిగా మిగిలిపోతాడు. కనుక,

మిథ్య కూడా సత్యమే

కాని, సత్యం మిథ్య కాదు.

సర్పము రజ్జువే గాని రజ్జువు మాత్రం సర్పం కాదు. కాలేదు. ఇది అపరోక్ష జ్ఞానము.

రజ్జువుకు సర్పముతో సంబంధము లేకపోయినను అజ్ఞానదశలో మోహింపబడిన జీవులకు సంబంధము ఉన్నట్లే తెలుస్తూ ఉంది. దీనినే "అధ్యస్త" సంబంధ మంటారు. ఇది తటస్థము. కనుక సృష్టి వివరణము తటస్థ లక్షణము ద్వారానే వివరించబడుతుంది. దీనికి చక్కని సోదాహరణమే **శాఖాచంద్ర న్యాయము.**

ఒక ఇంటి మీద కాకి కూర్చొని ఉంది. ఇల్లు తెలియుటకు కాకి సహకరించ వచ్చు. కాని, కాకి ఇంటిలో భాగము కాదు. కనుక, ఇంటిని గ్రహించగనే కాకి అవసరం తీరిపోతుంది. కాకికి ఇంటితో ఏవిధమైన సంబంధము లేకపోయినా ఉన్నట్లు తెలుస్తూ ఉంది. ఇది అధ్యస్త సంబంధము.

సృష్టిని గూర్చి ఎప్పుడు, ఎక్కడ శాస్త్రములో ప్రవచించినా **యతోవా ఇమాని భూతాని జాయన్తే....** "ఈ సమస్త భూతజాలము ఎక్కడి నుండి కదలివచ్చిందో, ఎక్కడ కదులుతున్నదో, ఎక్కడ కనుమరు గవుతున్నదో" అంటూ ప్రారంభించడం జరుగుతుంది. ఇది తటస్థ లక్షణము.

'సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ' అనేది స్వరూప లక్షణము.

తాటస్థ్యా దాస్పదం స్వం గమయతి పరమం బ్రహ్మ శాఖేవ చంద్రమ్. తటస్థ సంబంధముచే (తాటస్థ్యాత్) తన అధిష్ఠానమగు (స్వం ఆస్పదం) పరబ్రహ్మమును (పరమం బ్రహ్మ) కొమ్మ (శాఖ) చంద్రుని వలె(చంద్రమివ) సూచిస్తున్నది (గమయతి).

ఆకాశంలో చంద్రవంక కనిపించ నపుడు దానిని దర్శించినవాడు వృక్షశాఖను ఆధారంగా చేసుకొని సూచించడం జరుగుతుంది. చంద్రుని దర్శించుటకు చెట్టుకొమ్మ ఉపకరించినా, సహకరించినా వాస్తవానికి కొమ్మకు చంద్రునితో సంబంధము లేదు. ఒకవేళ ఉన్నట్లు అంగీకరిస్తే అది తటస్థ సంబంధము లేదా అధ్యస్త సంబంధ మవుతుంది.

చంద్రుని దర్శించిన తరువాత, ఇంటిపై నున్న కాకి వలె, వృక్షశాఖ కూడా నిరుపయోగమే అవుతుంది.

సృష్టి స్థితి లయాదులు బ్రహ్మలక్షణములు కాకపోయినా తటస్థ లక్షణము ద్వారా పరమాత్మను గ్రహించవచ్చు. ఈ లక్షణము స్వరూప జ్ఞానము కొరకే గాని సృష్టి వివరణమునకు మాత్రము కాదు. ఇదే శాఖాచంద్ర న్యాయము.

ఉపాధిభేదంతో మిథ్యాజ్ఞానము ఏర్పడింది. ఉపాధిని ఆత్మకన్నా వేరని భావిస్తే ఉపాధి సత్యమవుతుంది. ఇక్కడే అసత్యమైన జగత్తు సత్యంగా భాసిస్తోంది. ఇది "అహం భావన".

ఈ అహంభావన తటస్థ లక్షణము ద్వారా తొలగింపబడితే 'అహం' స్వరూపంగా ప్రకాశిస్తుంది. ఉన్నది ఎప్పుడూ ఉంది **(యదస్తి తత్ సత్యం).** దానికి నామరూపాలతో ఏవిధమైన సంబంధం లేదు.

అది కేవలం అస్తి (ఉన్నది).

వస్త్రం చిరిగి ఉంది.

చిరిగిన వస్త్రం ఉంది. 'ఉంది' అనేది దేనితోనూ సంబంధము లేకుండా ఏకమై భాసిస్తోంది. అదే స్వరూపము. తటస్థము ద్వారా తటస్థించే కూటస్థము.

పైకి ఎక్కలేక పోవచ్చు. క్రిందికి దిగకుండా చూసుకోవాలి. కనీసం ఉన్నచోట ఉండేందుకైనా దృఢ ప్రయత్నం చేయాలి.ఉన్నచోట నిశ్చలంగా ఉంటే, మున్ముందు ప్రయత్నించి పైకి పోయే అవకాశం ఉంటుంది. అవగాహన లోపించి రెండు మెట్లు క్రిందికి దిగితే, ఆ తరువాత ఎక్కాలి అనుకున్నప్పుడు ముందుగా ఎక్కవలసినవి దిగిన మెట్లే. అవి దాటితేనే అభివృద్ధి.

కరిగిన కల

తృప్తినిచ్చే వాటితో సంతృప్తి చెందనివాడు ఈ లోకంలో భక్తుడు. తృప్తి తెలియనివా రెవరున్నారు ఈ ప్రపంచంలో? తృప్తితో తృప్తిపడిన వారు మాత్రం ఎంద రున్నారు? అసంతృప్తిని అందించే, ముందుంచే తృప్తి ఒక తృప్తియేనా? కావచ్చు. అది ఒక తృప్తియే గాని వేరొక తృప్తి అవసరంలేదనే సంతృప్తి మాత్రం కాదు.

ఇల్లు లేదనే అసంతృప్తి ఇల్లు కట్టుకున్న తరువాత పోవచ్చు. కానీ, "ఇల్లు ఉంది అనే తృప్తి నాకు ఉంది" అనే తృప్తిలో కూడా మనిషి ఎక్కువ కాలం ఉండలేడు. అలా తృప్తిగా ఉన్నానని చెప్పే సమయంలో కూడా, ఇంకా ఏఏ విషయాలలో తృప్తిగా ఉన్నారో చెప్పండి? అని కనుక అతణ్ణి మనం మాట్లాడించ గలిగితే, కొన్ని చెప్పిన తరువాత హఠాత్తుగ ఒక అసంతృప్తిలో చిక్కుకుపోతాడు. ఇంతకీ చెప్పొచ్చే దేమిటంటే ఈ లోకంలో 1. తృప్తి లేనివారు 2. ఉన్న తృప్తిని పోగొట్టుకొనేవారు ఉన్నారే గాని, నిత్యతృప్తితో ఉండేవారు లేరు.

ప్రతి మనిషికి చాలా అవసరాలు తీరాలి. చాలా విషయాలు కొలిక్కిరావాలి. ఒకటి పరిష్కారమైతే దానికి సంబంధించిన తృప్తి ఏర్పడినప్పుడు కూడా; అపరిష్కృతంగా ఉండే వాటికి సంబంధించిన అసంతృప్తి హృదయంలో ఒకవైపు తిష్ఠవేసే ఉంటుంది. ఇంకా ఏమి తృప్తి?

ఇది కేవలం ఆలోచనా పద్ధతి వల్ల ఏర్పడదు. పరిస్థితికి అనుగుణంగ ప్రవర్తనను మార్చుకోవడంలో కూడా రాదు. పరిశీలనా దృక్పథంతో జాగ్రత్తగా వీక్షించాలి.

తృప్తి చుట్టంలా వచ్చిపోతూ ఉంది. అసంతృప్తి అర్ధాంగిలా కలిసి కాపురం చేస్తోంది. అసంతృప్తిని పోగొట్టుకోవాలని అందరూ శ్రమిస్తున్నారు. అసంతృప్తి పోయినా మరొక దానివల్ల తిరిగి వస్తుంది. అసంతృప్తికి కారణమేమిటో అది పోవాలి.

'నేను ఇలా ఉండాలి' - అని యత్నించినంత వరకు కష్టాల్లో కూరుకుపోవడమే. వీటినన్నిటిని విడిచి, **'నేను ఇలా ఉన్నాను'** అని నీవు గ్రహించినపుడే నీకు నిత్యతృప్తి లభిస్తుంది.

మరొక దానిని ఆశ్రయించుకొని ఉన్నంతవరకు, మరొక దానిపై ఆధారపడి సంతసించినంత వరకు తృప్తి లభించవచ్చునేమో గాని నిత్యతృప్తి లభించదు. భాగ్యవంతుడికి ఈ ప్రపంచంలో నీరసించే తృప్తి ఉంది. కాని, భక్తుడు నిత్యతృప్తుడు. ఎందుకో తెలుసా? అతడు నిరాశ్రయుడు.

సంపదను నేను ఉదహరించాను. అంతే. అది కేవలం ఉపలక్షణం. ప్రపంచంలో తృప్తిని పంచేవన్నీ కూడా నీరసించేవే. ఇలా తెలిసిన తరువాత అవన్నీ దోసపండు

తొగను వదలినట్లు మనసుకు దూరంగా పోతాయి. అవి అలా దూరం కావడానికి నీకు వాటి మీద అయిష్టత ఉండి కాదు; వాటి అవసరం లేకపోవడం చేత.

జీవితంలో పరమ పురుషార్థ నిశ్చయం జరిగి, అవసరమైంది ఏదో తెలిసివస్తే ప్రవర్తనలో పరిపక్వత వస్తుంది. మారిపోయే తృప్తుల విషయంలో వైముఖ్యత ఉంటుంది.

ఒకటి కావాలన్నా, మరొకటి వద్దన్నా నీ సుఖం నీ మీద ఆధారపడి లేదని తెలుస్తోంది. మరొకదానిపై ఆధారపడి ఉండే సుఖము నీది ఎప్పుడూ కాదు. దేనిలో అయితే నిత్యతృప్తి లేదో దురదృష్టవశాత్తు దానికే లేని విలువ ఆరోపించబడింది. లేని సౌందర్యాన్ని పులమడం జరిగింది. దీనినే "శోభనాధ్యాస" అంటారు. బ్రతుకులో సుఖాన్ని దూరం చేసేది ఇదే.

అర్థం చేసుకో. ఉండేవాటిలో, ఊడేవాటిలో తృప్తి ఉండినా నిత్యతృప్తి ఉండదు. ఎప్పుడూ ఉండేవాడివి, ఎప్పుడూ ఊడనివాడివి నీవే కనుక నీలోనే నిత్యతృప్తి ఉంది. ఇది తెలిస్తే నీవు సదా సంతుష్టుడవై ఉంటావు. ప్రపంచంలో ఎక్కడున్నా దానికి వేరుగా ఉండవు. మొదటిది సంతృప్తి. రెండవది యోగం.

సంతుష్ట స్సతతం యోగీ

ఇవి భక్తుని లక్షణాలు 1. సంతృప్తిగా ఉండడం 2. యోగిగా ఉండడం. మొదటిది స్వరూపం, రెండవది ప్రవర్తన. ఈ రెండింటికి మధ్య 'సతతం' ఉంది. అది రెంటికీ సంబంధించింది. సదా సంతృప్తి. సదా యోగం.

శాస్త్రంలో ఈ ప్రక్రియను **"కాకాక్షి న్యాయము"** అంటారు. కాకి యొక్క నేత్రద్వొన్నెలో కాకి యొక్క కన్ను కదలదు. కాని అది చూడటానికి తల త్రిప్పినపుడు కన్ను ఒకవైపు నుండి మరొక వైపునకు గోలీలాగ వెళ్ళినట్లు తెలుస్తుంది. ఇక్కడ కూడా రెండు పదాలకు మధ్యచేరిన ఒక పదం యొక్క ప్రభావం అటు దానిమీద, ఇటు దీని మీద పడి ఆ రెండిటిని మార్పు చేస్తుంది. సతతం **"సంతుష్టః"** అనే పదముతో చేరి **"నిత్య సంతుష్టః"** అవుతుంది. 'యోగి' అనే పదముతో మిళితమై **'నిత్యయోగి'**గా మార్పు చెందుతుంది. ఇదే **కాకాక్షి న్యాయం.**

స్వరూపానుభూతిని పొంది సర్వులూ నిత్యసంతుష్టులై, నిత్యయోగులై రాణించెదరు గాక!

సర్వేజనాః సుఖినో భవన్తు!

సూర్యగ్రహణము *

సూర్యునికైనా తప్పేలా లేదు ఒకనాడు గ్రహణం పోటు. లేనిదానిని ఉన్నట్లు చూడడం మనిషి మనసులో ఒక అలవాటు.

నాలుగువందల రెట్లు పెద్దవాడిని అందులో ఒక వంతు చిన్నవాడా మూసేది? వాస్తవానికి గ్రహణంలో జరిగిందేమిటి? సూర్యునికి మూతపెట్టడమా? మనసుకి మోత ఎత్తడమా? దూరాలు సత్యానికి ద్వారాలు మూస్తే, కాలాలు సంకెళ్ళను విడగొడుతాయా?

నిశ్చితమైన న్యూటన్ ప్రపంచం నుండి విడిపడి, దేశకాలాదులు అధిష్ఠానంగా తెలిసే ఐన్‌స్టీన్ వ్యవహారిక జగత్తులో మనం అడుగుపెట్టి యున్నాం. విజ్ఞానశాస్త్రం తత్త్వశాస్త్రంగా, శాస్త్రవేత్త తత్త్వవేత్తగా మారుతున్న దశవైపు మనం ప్రయాణం చేస్తున్నాం.

దేశం లేని, కాలం తెలియని ప్రపంచాన్ని మనం ఊహించలేము. దేశకాలాదుల్ని అర్థం చేసుకుంటే ప్రపంచమేమిటో తప్పక తెలియాలి. దేశకాలాదులు వాస్తవానికి మానసిక భావనలే. ఆలోచనే వాటికి పునాది. కనుక దేశకాలాదులు మనో ప్రపంచానికి సంబంధించి ఉన్నాయి. మనసుకు తెలిసే దేశకాలాదులలో వ్యవహారిక మనుగడయే గాని పారమార్థిక సత్యము తెలిసే అవకాశం లేదు.

మనసుకు తెలిసే దేశము(Space) ఎప్పుడూ ఒకేలా తెలియదు. మనోస్థితిని బట్టి దేశ గతి మారుతూ ఉంటుంది. ఇష్టములేని ప్రదేశము ఇంద్రభవనమైనా ఇరుకుగానే ఉంటుంది. నచ్చితే చాలు. పూరిగుడిసెలో ముల్లోకాలు సర్దుకొని కూర్చుంటాయి. దేశములో తెలిసే ఈ మార్పు వాస్తవానికి మనసులోని మార్పే. ఇది మరో ప్రపంచం కాదు. మనోప్రపంచం.

కాలగతి కూడా అంతే. కాలము(Time) కూడా మనోకల్పనయే. క్షణాలు యుగాలు కావు. కాలేవు. కానీ మనసులో అవుతున్నాయి. అలాగే రోజులు క్షణాల్లా దొర్లిపోతున్నాయి. ఇదంతా కూడా మనోప్రపంచమే.

అయితే వ్యష్టికి తెలిసే విశ్వము వ్యక్తిగతమైనపుడు, ఎవరి ప్రపంచము వారిదే అనాలి. అదే వాస్తవమైతే సమిష్టిలో సామాన్య సంఘటనలు ఎలా నడుస్తున్నాయో ఊహించడానికి మనసు చాలా శ్రమించాల్సి వుంటుంది.

వ్యక్తి మనసు నుండి దేశకాలాదులు ఉత్పన్నం కావచ్చు. బాహ్యంలో భిన్నత్వాన్ని ఎలా అవగతం చేసుకోవాలి? వ్యక్తి నుండి కదిలే దేశకాలాదుల్ని సమిష్టి దేశకాలాదులతో

* 1995 అక్టోబర్‌లో సంభవించిన సూర్యగ్రహణం సందర్భమున పూజ్య స్వామీజీ అనుగ్రహించిన వ్యాసం.

సమన్వయం చేసినపుడు, బాహ్యంలోని సమిష్టి దేశకాలాదుల్ని ఊహించే సమిష్టి మనసు ఉండాలి. దానిలో అన్ని మనసులున్నాయి. అవి సృష్టించే దేశకాలాదులూ దాగి ఉన్నాయి.

వ్యష్టి నుండి కదిలిన దేశకాలాదులు జీవసృష్టి కాగా, సమిష్టి నుండి కదిలిన దేశకాలాదులు ఈశ్వరసృష్టిగా తెలుస్తున్నాయి. మొదటిది అవిద్య కాగా, రెండవది మాయ అని నిర్ణయించింది వేదాంత శాస్త్రము.

శాస్త్ర ప్రతిపాదితమైన ఈ అద్భుత సత్యాన్ని జీవితానుభవం నుండి చూద్దాం. స్వప్నాలు రోజూ మనం కంటున్నాం. స్వప్నంలో తెలిసే దేశము దేశమూ కాదని, కాలము కాలమూ కాదని మనకు తెలుసు. అయినా దేశకాలాదులు తెలుస్తున్నాయి. ఇవి ఎక్కడున్నాయి? ఎవరికి తెలిశాయి? మనసుకే కదూ! ఇప్పుడు ఒక నిర్ణయం చేయక తప్పడం లేదు కదూ! స్వప్న ప్రపంచం కూడా మనో ప్రపంచమే గాని మరో ప్రపంచం కాదని.

మనసుకి తెలిసిన స్వప్న ప్రపంచం నిత్యం కానపుడు అదే మనసులో కదిలే జాగ్రత్ప్రపంచము ఎలా సత్యమవుతుంది? మేలుకున్నవాడు మనసులోని స్వప్న ప్రపంచంతో విడిపడతాడు. జ్ఞానాన్ని పొందినవాడు మనసులోని జాగ్రత్ప్రపంచం నుండి జారిపోతాడు. అయితే ఈ దశలో పారిపోయిం దెవరు? మాయ. అజ్ఞానం. అంతే.

పారి పారి నీరు ఆవిరైపోయినట్లు, మారి మారి మాయ అదృశ్యమైపోయింది. మాయలమారిగా మాయమైంది. మనిషికి పట్టిన గ్రహణం తొలగింది. దేశకాలాదుల అగ్రహణము అదృశ్యమైంది. మనుగడలోని అన్యథా గ్రహణము అంతరించింది. ఉన్నది మిగిలింది. ఆత్మగా వెలిగింది. నిత్యమై, శుద్ధమై, ముక్తమై భాసించింది.

మరి, ఇంతవరకు ఉన్నట్లుండిన మాయ సృష్టించిన మనసు ఆత్మను కలుషితం చేయలేదా? అనే శంక వస్తోంది కదూ! కలలోని వర్షం నిన్ను ఎంత తడిపింది? స్వప్నంలో లేచిన మంటలు ఎవరిని కాల్చాయి? అసత్య జ్ఞానము చూసేది కాదు. చేసేది లేదు.

నహి మిథ్యాజ్ఞానం పరమార్థవస్తు దూషయతుం సమర్థమ్ ॥

"మాయ ఎన్నడూ మహిమను మలినం చేయలేదు" అని శంకర భాష్యము.

గ్రహణం విడిపోయింది. అంటే పట్టినట్లేనా? పట్టకుండానే, ముట్టకుండానే విడిపోవడం మాయ.

సూర్యునికి, భూమి నుండి చూచేవానికి మధ్య చంద్రుడు చేరినపుడు సూర్యుడు కనిపించడు. దానిని సూర్యగ్రహణం అంటున్నాం. చంద్రుడు సూర్యుని ఎలా మూయగలడు? చంద్రుని కన్నా వందల రెట్లు దూరంలో సూర్యుడు ఉండడము, చూచేవాడు అతిచిన్నవాడు కావడం వల్ల, చంద్రుడు సూర్యుని కప్పినట్లు, మూసినట్లు తెలుస్తోంది.

చంద్రుడు చూచేవాని దృష్టిని అడ్డగించాడే గాని సూర్యుని మూయలేదు. చంద్రుని ఛాయకు దూరంగా మనం కదిలితే సూర్యుని ప్రత్యక్షంగా దర్శించవచ్చు. గ్రహణంలో జరిగిందంతా అగ్రహణమే. **(non - apprehension of the reality)** **మనసో చంద్రమాః.** మనసుకు చంద్రుడు అధిష్ఠాన దేవత. నీకూ సూర్యునికి మధ్య నిలిచిన చంద్రుడు సూర్యదర్శనాన్ని నిరోధించినట్లు, నీకు, ఆత్మకు మధ్య నిలిచిన మనసు ఆత్మదర్శనాన్ని నిరోధించింది.

ఛాయ తొలగితే సూర్యదర్శనం. మాయ తొలగితే స్వాత్మ దర్శనం.

సమావృణోత్యావృతి శక్తిరేషా

తమోమయీ రాహు రివార్కబింబమ్ ॥

"అజ్ఞాన స్వరూపమైన ఆవరణ శక్తి సూర్యబింబమును గ్రహణము (రాహువు) పట్టినట్లు ఆత్మను ఆవరించియున్నది" అని ఆదిశంకరులు.

"ఇది నాది" అనుకుంటే, అది దూరమైన నాడు "నాది పోయింది" అనుకోవటం జరుగుతుంది. 'నాది' అనుకోకపోతే పోయిన రోజు "అది" పోయింది అవుతుందే గాని "నాది పోయింది"గా ఉండదు. మనం గ్రహించని దానిని మన నుండి ఎవ్వరూ గ్రహించలేరు.

ఉండేవి ఉంటాయి. మనవిగా ఉండ నవసరం లేదు. మనవి అయితే మనల్ని విడిచిపెట్టి ఎందుకు వెళ్తాయి? ఉన్నవన్నీ మనవి కానవసరం లేదు. మనకు జ్వరముంది. తలనొప్పి ఉంది. అజీర్ణము ఉంది. అజ్ఞానము ఉంది. ఇవన్నీ పోకుండా మనకే ఉండాలా? మన వద్దే ఉండాలా?

యద్భావం తద్భవతి

నాటి ఊహలే నేటి ఊరేగింపులు.

నేటి కూర్పులే రేపటి నిట్టూర్పులు.

అభిలాష ఆలోచనను కదిలిస్తుంది. ఆలోచన కర్మల్ని ఆరబోస్తుంది. కర్మలు ఫలాలను ముందుంచుతాయి. వాసనలు విస్తరిస్తాయి. ఈలోగా బ్రతుకు అస్తమిస్తుంది. మరో జన్మ ఎదురు చూస్తూ ఉంటుంది.

ఆలోచించకుండా మనిషి ఉండలేడు. ఆలోచించడం అందరికీ సులభం. ఆలోచనను చూడటం కొందరికే సాధ్యం. ఆలోచనను అవలోకించలేనివారు ముఖ్యంగా ఆధ్యాత్మిక మార్గంలో అభివృద్ధిని సాధించలేరు.

చేసే వృత్తులన్నీ చేయించే మనోవృత్తులపై ఆధారపడి ఉంటాయి. మనోవృత్తులన్నీ **'అహం'** వృత్తిపై ఆధారపడి ఉంటాయి. వృత్తులన్నీ మరుగయినా **'అహం'** వృత్తి మెరుస్తూనే ఉంటుంది. ఈ **'అహం'** వృత్తిని ప్రకాశింపచేయునది **'అహం'** చైతన్యము. **'అహం'** వృత్తి మిగిలి యున్నంతవరకు నీలో జ్ఞానాభిలాష ఉంటుంది. **'అహం'** వృత్తి నశించి **అహం** చైతన్యము నీవని తెలిస్తే నీలో జ్ఞానాభిలాష కూడా స్ఫురించదు. నీవే జ్ఞానమై ఉంటావు.

అహమస్మీతి నిశ్చిత్య వీతశోకో భవేన్మునిః

'అహం' చైతన్యము తానే అనెడి నిశ్చయము కలిగిన మననశీలుడు దుఃఖము నుండి విడిపడుచున్నాడు అన్నది రుద్రహృదయోపనిషత్తు.

అయితే, అన్ని వృత్తులకు ఆధారమైన 'అహం' వృత్తి నశించినట్లు 'అహం' వృత్తికి ఆధారమైన 'అహం' చైతన్యము కూడా నశించవచ్చును కదా? అనే సందేహము రావచ్చు.

'అహం' చైతన్యము నశించదు. వచ్చిందే పోతుంది. పుట్టిందే నశిస్తుంది. 'అహం' వృత్తి కదిలింది. కనుక కరిగిపోయింది. 'అహం' చైతన్యం పుట్టింది కాదు. కనుక నశించదు. అది వచ్చిందీ లేదు; కనుక పోయేదీ ఉండదు.

ఏతద్ధ్యేవాక్షరం బ్రహ్మ ఏతద్ధ్యేవాక్షరం పరమ్

"నశించనిది ఏదియో అదియే బ్రహ్మము. అదియే అన్నిటికంటెను ఉత్తమము" అన్నది కఠోపనిషత్తు.

అన్ని వృత్తులను కదిలించే 'అహం' వృత్తికి ఆధారమైన **'అహం'** చైతన్యము ఉన్నదే అయినా తెలియకున్నది అని అంగీకరించాలి. ఇది తెలిస్తే, మన సమస్యేమిటో మనకు బోధపడిందని అర్థము. సమస్య అర్థం కానంతవరకే అది సమస్య. సమస్య అవగతమైతే

ఇక సమస్యే లేదు. ఇలా సమస్యను లేకుండా చేసుకోవాలి, చూచుకోవాలి గాని పరిష్కార రూపంలో సమస్యకు పునర్జన్మను ప్రసాదించకూడదు.

'సర్పం' అనెడి **'అహం'** వృత్తిని ఆధారం చేసుకొని **"భయభ్రాంతు"** లనెడి **"ఇదం"** వృత్తులు కదులుతున్నాయి. **"రజ్జు"** జ్ఞానంతో సర్పభ్రాంతి నశించగా శోకాదులు కనుమరుగవుతున్నాయి.

'అహం' చైతన్యము సదాత్మ స్వరూపము. అది ఎప్పుడూ లేకుండా లేదు. రజ్జువు సర్పంగా తెలిసినట్లు **'అహం'** స్వరూపము **'అహం'** వృత్తిగా గోచరించి సంసారాన్ని సృష్టిస్తుంది. జ్ఞానము కలిగిన దశలో కూడా అహం ఉంటుందే గాని పోదు. అయితే ఈ **'అహం'** అహం వృత్తిగా కాక **'అహం'** చైతన్యంగా శోభిస్తుంది. కనుక **'అహం'** బ్రహ్మము అని నిర్ణయించాలే గాని **'అహం'** భావనగా నిశ్చయించకూడదు.

అహంబ్రహ్మేతి నిశ్చిత్య అహంభావం పరిత్యజ

'అహం' బ్రహ్మమేనని నిశ్చయించి, **'అహం'** భావనను త్యజించు అన్నది **తేజోబిందూపనిషత్తు.**

"అహం" భావనను త్యజించాలి. కానీ, అదే సమస్తము అనుకోకూడదు. తాను **'అహం'** చైతన్యమే అనే జ్ఞానం కలగాలి.

'అహం' చైతన్యమునకు సంబంధించిన జ్ఞానం అద్వయం. రెండు లేనిది, రెండు కానిది. కనుక 'అహం' భావనను ప్రత్యేకించడం 'అహం' స్వరూప చైతన్యానికి సాధ్యపడదు.

కనుక **'అహం'** భావన మిథ్యారూపము. **'అహం'** భావన ప్రత్యేకతల నుండి విడిపడి **'అహం'** స్వరూపముగా తెలియాలి. దీనికి స్వరూపధ్యానమే ఏకైక మార్గము. ఇదియే **భ్రమర కీటక న్యాయము.**

ఒక సాధారణ కీటకమును భ్రమరము బంధించి తెచ్చి, ఒక గూటిలోనో, చెట్టు తొఱ్ఱలోనో ఉంచి, దాని చుట్టూ ఝుంకారము చేస్తూ తిరుగుతుందట. భ్రమరాన్ని చూచి భ్రమించిన కీటకము భ్రమరాన్ని గూర్చే భావిస్తూ తత్ఫలితంగా తానూ భ్రమరంగా మారిపోతుందట. ఇదియే **భ్రమర కీటక న్యాయము.**

అలాగే **'ఇదం'** వృత్తులకు ఆధారమైన **'అహం'** భావన సదా **'అహం'** చైతన్యమునే స్మరించుట చేత తాను భావన నుండి విడిపడి స్వరూపానుభూతిలో నిలిచిపోతుంది. ఇదియే పరమార్థము. పరమానంద స్వరూపము.

జ్ఞాత్వా స్వం ప్రత్యగాత్మానం బుద్ధి తద్వృత్తి సాక్షిణమ్

సోఽహ మిత్యేవ తద్వృత్త్యా స్వాన్యత్రాత్మమతిం త్యజేత్ ॥

బుద్ధికిని, దాని వృత్తులకును ఆధారమై, సాక్షియై యున్న తన ప్రత్యగాత్మను తెలుసుకొనినవాడు "నేనే ఆత్మను" అని నిశ్చయించుకొని, ఆత్మ కంటెను వేరైన విషయముల యందు సత్యాత్మ దృష్టిని విడనాడాలి" అన్నది అధ్యాత్మోపనిషత్తు.

'అహం' భావన నుండి విడిపడిన నీవు ఈవిధంగా **'అహం'** చైతన్యానివి. ఆనంద స్వరూపుడవు. పూర్ణుడవు. అస్తమించని వాడవు. మరొక దానిపై ఆధారపడని వాడవు. అనంతుడవు. సచ్చిత్స్వరూపుడవు.

'అహం' భావనను పోగొట్టుకోవాలి. ఇదే ధ్యానం. ఇదే తపస్సు. ఇదే యోగం. "నేను తపస్సు చేస్తున్నాను. ధ్యానం చేస్తున్నాను" అనే భావన కూడా భస్మమైపోతే, దానిని ఒంటికి రాసుకొని శోభించేవాడు భస్మభూషితాంగుడైన భవానీశంకరుడు. శివుడు. మంగళస్వరూపుడు.

కీటకము భ్రమర మవుతుందో కాదో అది వేరే విషయం. కీడు తెలిసిన వారందరు భ్రమర కీటక న్యాయాన్ని ఆధారం చేసుకొని బ్రాహ్మీస్థితిని పొంది తరించాలి.

అసంగోఽహ మసంగోఽహ మసంగోఽహం పునః పునః

సచ్చిదానంద రూపోఽహ మహ మేవాహ మవ్యయః

"నేను అసంగుడను. ముమ్మాటికీ అసంగుడను. సచ్చిదానంద రూపుడను. నేను నేనే. నేను అవ్యయుడను" అని శ్రీ శంకరాచార్య స్వామి "బ్రహ్మజ్ఞానావళీమాల". అందరూ ఈ మాలను ధరించి శోభించాలి. సద్గురుదేవుని కృప సర్వులపై సదా ప్రసరించు గాక!

పిల్లలు మేలుకొని ఉన్నా ఏదీ అర్థం చేసుకోలేరు. నిద్రపోతే పెద్దలకు ఏదీ అర్థం కాదు. పెరిగితే పిల్లలు తెలుసుకుంటారు. మేలుకుంటే పెద్దలు గ్రహిస్తారు. ఇదే జాగరణ. జ్ఞాన జాగరణ. జ్ఞానంలోనే ఏదైనా తెలిసేది. కనుక ఏది ఉంది - ఏది లేదు, ఎవరు ఉన్నారు - ఎవరు లేరు అనేది ముఖ్యం కాదు. జ్ఞానం ఉందా, లేదా అనేదే ప్రధానం.

గురుగోవిందులు

ఆషాఢంలో ఆచార్యుని సేవ, శ్రావణంలో ఆదిదేవుని సేవ - ఒక మాసం గడువులో గురుగోవిందుల సేవాభాగ్యం నిజానికి భక్తులకు, ముముక్షువులకు వరప్రసాదమనే చెప్పాలి.

మొదట గురుపూర్ణిమ; తరువాత కృష్ణాష్టమి. ముందు గురువు లభిస్తాడు; తరువాత గోవిందుడు అనుగ్రహిస్తాడు. ఈ మధ్యకాలం ఒక్క నెల మాత్రమే. గురు దేవుడు, ఆదిదేవుడు ఇరువురూ ఒక్కరేయని దాని భావమా?

ఆషాఢంలో ఆచార్యుని సేవనం - శ్రావణంలో శ్యామనాథుని దర్శనం - ఇది జరిగితే బ్రతుకంతా భద్రమే. అందుకేనేమో భాద్రపదంలో విఘ్ననాయకుని అర్చన! ఆ తరువాత అంతా విజయమేనని సూచిస్తూ ఆశ్వయుజంలో విజయదశమి. విజయాన్ని సాధించిన సాధకులు మోక్షసామ్రాజ్యాన్నధిష్ఠించి శోభిస్తారు. ఇది మామూలు వెలుగు కాదు. జ్ఞాన వెలుగు. జ్ఞానదీపం...... అదియే కార్తీకంలో దీపావళి.

ముముక్షువు లందరూ సాధనకు ప్రాముఖ్యత నివ్వాలి. సంశయ కెరటాల మధ్య జీవననౌక తారుమారు గాకుండా చూసుకోవాలి. క్రొత్త బాటలు అన్వేషించడం మాని నడకలో క్రొత్తదనాన్ని తయారుచేసుకోవాలి.

కొందరు ధ్యానం నేర్పమంటే ధ్యానం నేర్పాను. ఇంకెక్కడో సులభంగా ధ్యానాన్ని నేర్పుతారని విని అక్కడి కెళ్ళారు. నాలుగు రోజులు తికమకపడి వచ్చారు. "స్వామీ! మీరు నేర్పిన ధ్యానం శాంతి నిచ్చింది. అక్కడ అంతా అయోమయం" అంటారు. ఈ మాటలు విని పొంగిపోయే స్వల్పబుద్ధి నా కుందని.

గురువును అనుసరించడం, గోవిందుని అనుస్మరించడం అంత సులభమైన పని కాదు. గురువును అనుసరించడం అంటే గురువుకు శరణాగతులు కావడం అని భావం. ఇక్కడ స్వేచ్ఛ హరింపబడుతున్నదని వాగుడుకాయల పలవరింపు. క్రమజీవనం లోనే నిజమైన స్వేచ్ఛ ఉన్నదని గ్రహించే సంస్కారం ఎందరి కుంటుంది?

భగవంతు డొక్కడే. అట్టి భగవంతుని జూపే గురుదేవుడు కూడా ఒక్కడే. "అనేకమంది గురువులను స్వీకరించవచ్చా?" అని చాలామంది నన్ను ప్రశ్నిస్తూ ఉంటారు. ఈ విషయంలో నాకు స్థిరమైన అభిప్రాయాలున్నాయి. ఇక్కడ నేను రాజీపడను; పడలేను.

గురువు ఒక్కడే ఉండాలి. ఒక్క గురువునే అనుసరించాలి. అనేక గృహాల ముందు నిలబడి యాచించి ఆకలి తీర్చుకోవడం బిచ్చగాని లక్షణం. అమ్మనడిగి ఆకలి తీర్చుకోవడం బిడ్డ లక్షణం. గురుబిడ్డలు బిచ్చగాళ్ళు కాకూడదు.

నా ఆశ్రమంలో ఉండాలని, నా శిష్యులుగా పడి ఉండాలని భావించి వచ్చే వారికి నేను ఒకే విషయం చెబుతూ ఉంటాను. "బాబూ! ఈ పడిగాపుల వల్ల బ్రతుకులో వడగాడ్పులు తొలగవు. నేను నీకు క్రొత్త కావచ్చు. గురువులు నీకు క్రొత్తగాదు. అనేక మందిని చూసి నా దగ్గరకి వచ్చావు. నన్ను చూసి మరొకరి దగ్గరికి చేర్తావు. గురువుల వద్ద ఉండేందుకు అలవాటు పడ్డావు. క్రొత్త గురువు వద్ద పాత గురువుల్ని నిందించేందుకు సిద్ధపడ్డావు. ఇలా ఎంతకాలం తిరుగుతావు? తిరిగి తిరిగి ఏం వంట బట్టించుకున్నావు? "తిరిగే రాతికి పాచి పట్టదు" అనే నానుడికి నూతన అర్థాన్ని ఇస్తున్నావు. అంతే. నీకు కావలసింది ఆచార్యుడు కాదు. అనుసరించే బుద్ధి. అది లేనినాడు ఆచార్యుడు ఉండి ఉపయోగం లేదు".

ఇక్కడ నా భావం స్పష్టంగా, స్వచ్ఛంగా ఉంది. తొందరపడి అపార్థాన్ని సృష్టించు కోకండి. నేను చెప్పింది "అనుసరించమని" - నన్ను అనుసరించమని కాదు.

అర్థమైనదా! ఇకనైనా అనుసరిద్దామా! కానీ ఒక్కమాట! నీవు గురువు ననుసరించా లంటే, ఆశ్రయించాలంటే, నీ మనస్సును అనుసరించడం మానేయాలి సుమా! అప్పుడే అది శరణాగతి అవుతుంది.

మాటలో బాట, బాటలో మాట - ఇదియే గురుదేవుని మార్గం.

ఇక ఎవరి బాట వారిది.

'భగవత్ప్రీత్యర్థం' కర్మ చేయాలి. నేను ఏ కర్మ చేస్తే భగవంతునికి ప్రీతి? ఏది అప్రీతి? నేను కర్మ చేస్తే, ఆ కర్మ ఫలితం నాకు వస్తుంది గాని పరమాత్మకు ఎలా పోతుంది? ఒకరు భోంచేస్తే మరొకరికి ఆకలి తీరు తుందా?

పైగా, నా కర్మఫలం పరమాత్మకు ఎందుకు? నాకు కర్మఫలాన్ని ఇచ్చేది కూడా తానే కదా! అనంతుడైన పరమాత్మను నా కర్మఫలం తృప్తి పరుస్తుందా?

రాగద్వేషాలు లేకుండా, పరమాత్మను దర్శించి కర్మలాచరిస్తే నేను ప్రశాంతతను పొందుతాను. ఇది నాకు కలిగే ప్రీతి. తృప్తి. సంతృప్తి. ఇది అర్థంగాక పోవటం చేతనే పరమాత్మతో కూడా బేరాలు సాగిస్తున్నాం.

చావుతో చదరంగం

ఓ చావూ! నా రాతను కూడా చదువు.
ఇది చావు చదువు కాదులే. చదువు - చావు! అంతే.
నీవు లేని చోటు లేదు.
నీవు దాటని గీటూ లేదు.
లోటులేని నీవు చేరువైతే చాలు. మరుక్షణం నుండి "లేట్" అవుతారు ఎవరైనా.
నీవు వెలిగిన మరుక్షణం చీకట్లే జీవితం
నిన్ను చూచిన ఆ క్షణం అందరికీ భయం........భయం.
లేదు జాలి నీకు పసితనంపై
లేదు మోజు నీకు పడుచుతనంపై
లేదు సానుభూతి ముసలితనంపై
భీతి భీతి అంతా
బూదియే చివరికి అంతా........
చంపుతానంటాడు వాడు...... చచ్చానంటాడు వీడు.
ఇంతకీ ఎవడా యముడు? ఎంతకీ తెలిసిరాడు.
పోయేనాడు ఏదీ వెంబడి రాదట
వచ్చేనాడు ఏది వెంట వచ్చిందని?
రాకపోకలు ఎలా ఉన్నా, ఓ చావూ!
ఏవీ మనవిగా కలిసిరావు......
తోడు తాను, నీడ నీవూ
ఇదియేనా సత్యం? ఓ చావూ!
Heaven's light for ever shines
Earth's shadows fly.......... మళ్ళీ చెప్పనా! షెల్లీ మాటలు.
వెలుగులే అక్కడ మేడలు
నీడలే ఇక్కడ నిజాలు..... అంతేనా!
రవిని రాల్చేస్తావు
కవిని కూల్చేస్తావు
రాజుల్ని ఎగరగొట్టి
గాజుల్ని పగులగొట్టి
ఏమి సాధించలేదు నువ్వు?
ఏమి సాధించినట్లు చావు?
అన్ని చోట్ల నీవే. అన్ని చోట్ల చావే.

పాలిచ్చేది ఆవు. పాలించేది చావు.
ఆవురావురు మంటూ ఆరగిస్తుంది చావు.
కావు - కావు అంటూ కాకిలా అరచినా
కాటికి పంపునే గాని కనికరించదు చావు.
అందరితో ఆడుతావు
అందరితో పాడుతావు
మా పాట్లు ఎలా ఉన్నా
ఒక మాటైనా అనవు నీవు
మా మాటైనా వినవు, చావూ!
బ్రతుకొక చదరంగమని వాళ్ళు....
కాదు కాదు నాటక రంగమని వీళ్ళు....
జీవితము క్రీడారంగమని నేను
తప్ప దేనాటికైనా రణరంగమని నీవు -
అయితే కానీ,
రంగరంగ వైభవంగా సాగనీ రణం
ఈ విధంగా నైనా తీరనీ ఋణం...... రానీ మరణం,
మరణాన్ని చూసి నాకు లేదు భయం
కానీ తెలియడం లేదు ఎవరిదో జయం -
ఓ చావూ! నీవు మాయవు!
ఓ చావూ! నేను మహిమను!
నే నున్నచోట నీవు లేవు
నే ననే దానికి లేదు చావు
నీవూ నేనూ కలిసే దెలా?
నాతో నీవు కలబడే దెలా!
వెలుగున్న చోట రాదు చీకటి - చీకటున్న చోట లేదు వెలుగు!
వెలుగుచీకట్ల వింత పోరాటం - చూసేందుకు ఎక్కడ కవాటం?
తెలిసిందిలే ఓ చావూ!
తెలివి ఉందిలే పో! పో! నీవు
సత్యానికి దగ్గరే నీవు
నేనే ఆ సత్యమని తెలుసా! చావు!
అడుగువేసి చెప్పనా కవి గుండెతో
ముడిపడి చెప్పనా ముని మాటతో
పాటపాడి చెప్పనా గాయకుని గళంతో

అయితే విను! ఓ చావూ! నువ్వు నన్ను తాకలేవు.

Sweet is sleep, death is better;

But it is best never to have been born.

తియ్యనిది నిద్ర, అంతకన్నా తియ్యనిది చావు;
పుట్టుక లేకుండుటయే మేలు అన్నిటికన్నా -
చాలు ఏ నాటికైనా........
ఆ నాటికే నా పయనం
వల్లకాటికే నీ గమనం.....
ఉండదు నా నుండి వేడికోలు. ఇదే నాకు నీతో వీడుకోలు.

మోక్షప్రియా!

ఎందుకు అలా వస్త్రంతో కప్పుకొంటున్నావు? అది గాయమా? వ్రణమా? ఉండనీ. ఏమైంది? ఎందుకు దాపరికం? పుండును దాచుకోగలవు. బాధను దాచుకోగలవా! దోచుకొనే క్షణం కొరకు మృత్యువు కాచుకొని ఉంది. దాచుకొని నీవు సాధించే దేముంది? ఖండఖండాలుగా కాటిలో విడిపోయే కాయాన్ని వస్త్రఖండంతో కప్పుకొని పొందే దేముంది? పోయే దేదైనా అది లేనిదియే. పోయేవాటిని పట్టుకొని పడిపోకు. బంధించే పంజరాన్ని ప్రేమించకు. ఒకనాడు లేకుండా పోయేదానిని నేడు కూడా లేనట్లే భావించు. గోడకు వ్రేలాడే వస్త్రంలా సంభావించు.

దేహాత్మ భావమే ఈ ప్రపంచంలో నిన్ను దీనునిగా మార్చింది. యాచకునిగా తీర్చింది. తప్పు జరిగిపోయింది. దిద్దుకుంటే సరిపోతుంది. దేహబలము ఒక బలము కాదు. దైవబలమే బలము.

దేహ భావనను దైవ భావనలో విలీనం కానీ. బలిపీఠాన్ని సమీపించు. అహంకారాన్ని బలిగానీ. అది బలి కాదు. బలం. బలిలోనే బలం ఉంది. దేహ భావన బలిపీఠం వద్ద అదృశ్యమైతే, ఆలయంలో అచ్యుతుడు ప్రత్యక్షమవుతాడు. హృదయ మందిరంలో కేశవుడు కొలువై తీరుతాడు.

ఆనందంగా కొలువు. కోరికల నైవేద్యాన్ని మాత్రం పెట్టకు. మన సుఖాలు, మన విజయాలు మన వైభవాలు ప్రపంచ విజయాలపై ఆధారపడి లేవు. ఈ సత్యాన్ని ఎన్నడూ మరువకు.

ప్రపంచంలో వైభవాలు లేవు. అన్నీ విడ్డూరాలే; విపత్తులే. అదంతా అయోమయ గారడి. వినోదాన్ని ప్రదర్శించి విషాదాన్ని ప్రసాదించే అంగడి. ఇక్కడ ప్రదర్శింపబడే మనోహర దృశ్యాలు గగనంలో తేలియాడుతూ క్షణంలో అదృశ్యమయ్యే మేఘమాలికలు. ఉరుముతూ, తరుముతూ భయపెట్టే విభ్రమ పిశాచాలు. దారుణ హాహాకారాలను వినిపించి, వికృత స్వరాలతో బేజారెత్తించే సంధ్యాభూతాలు.

నా మాట విను.

నీ మనసును ఆత్మ సరోవరంలో తోసేయ్. మునిగితే మునగనీ. తేలితే తేలనీ. మునిగితే ముప్పు రాదు. తేలితే తప్పు లేదు.
కాలేది కాయం. పోయేది ప్రాణం.
కాయంలో ప్రాణం నిలవదు. ప్రాణం కాయాన్ని నిలపదు.
కాయం నిన్ను ముట్టలేదు. కనుక గాయం నీకు లేదు.
ప్రాణం నిన్ను పట్టలేదు. కనుక అపాయం నీకు రానేరాదు.
కాయాలు, కల్పాలు నీలో కల్పితాలు.
కాయకల్ప చికిత్సలు నీకు విడ్డూరాలు.
ఆత్మ సామ్రాజ్యంలో నీవు అజేయుడవు. పరాజయ మెరుగని పరాత్పరుడవు.
నిన్ను తెలిసిన నీవు కోరదగింది ఏమున్నది ఈ ప్రపంచంలో!
త్వరపడు. దారిలో పడు. గిరిధారి దారిలో పడు.
నిజాన్ని తెలుసుకో. నీవే నిజం - ఇదొక్కటే నిజం.
నిజమైన ఆత్మకన్నా వేరుగా దేనిని వీక్షించినా అది నీకు తప్పక దూరమవుతుంది.
అన్నీ ఆత్మరూపాలే. ఆత్మ స్వరూపాలే.
ఇదే సత్యదర్శనం.
ఇది జరగాలి. లేదా, నేడు నీవు వేటిని వెంబడిస్తున్నావో అవి ఓనాడు నిన్ను తరిమి తరిమి కొడుతాయి. గాయాలు చేస్తాయి. గాయాల్ని కప్పుకున్నా బాధను కప్పుకోలేవు. తప్పుకోలేవు.
గాయాలు కాని చోటు
కాయాలు లేని చోటు
మాయలు చేరని చోటు
ఛాయలు పడని చోటు
చేరిపో. మహిమలున్న చోటికి జారిపో.

"యథా మా వో మృత్యుః పరివ్యథాః!

'చావు బాధించలేని చోటు అది'.
ఇప్పుడు చూడు.
మాయలు అంతరించాయి. మహిమలు ఆరంభమయ్యాయి.
ఇంతవరకు నిన్ను కొన్ని ఆకర్షించాయి.
ఇప్పుడు అన్నిటినీ అయస్కాంతంలా నీవు ఆకర్షిస్తున్నావు.
అన్నీ నీవై ఉన్నావు. అందుకే అందరికీ నీవు "ఆకర్షణ" అయ్యావు.
జ్ఞాన భాస్కరా!
మాయా మేఘాన్ని నెట్టేయి
అజ్ఞాన తిమిరాలను తరిమేయి
అనిత్య వెలుగుల్ని అస్తమించనీ
నిత్య వెలుగుల్ని ఉదయించనీ.

నూతనం-వేతనం *

నూతన సంవత్సరం..... నూతన సంవత్సరం....... నూతన సంవత్సరం

శుభాకాంక్షలు .... శుభాకాంక్షలు.

కుప్పలుగా వచ్చిపడిన బొమ్మల ఉత్తరాలను ముందుంచుకోగానే ఏవో ఏవో భావాలు తోసుకుంటూ ముందుకు వస్తున్నాయి. మీతో పంచుకుందా మనిపిస్తోంది.

నూతన సంవత్సరం వచ్చిందా? అంటే, పాత సంవత్సరం పోయిందనే కదూ! దానికి ముగింపు జరిగినట్లే కదూ! నిజమే మరి. ఆరంభమున్న దానికి అంతం లేకుండా ఎలా ఉంటుంది?

బాగుంది. మరి ఈ ఆరంభ నాశాలు ఎక్కడ స్ఫురిస్తున్నాయి? కాలంలోనే కదూ! అన్నీ కాలంలోనే జరిగేటప్పుడు దేనికి ఏది ఆరంభం? ఏది ఎక్కడ ఆరంభం? అలా వెతుక్కుంటూ పోతే సంవత్సరానికి కాదు; ఈ సంవత్సరాలు తెలిసే సృష్టికి ఆరంభ మెక్కడో ఆలోచించాల్సి ఉంటుంది.

అంటే, గతంలో ఎక్కడో, ఎప్పుడో జరిగి ఉండాలి అని ముందు అంగీకరించాలి. అదే వాస్తవమైతే ఒక కాలంలో సృష్టి జరిగి ఉండాలి అనేది సత్యం కావాలి. ఇదే సత్యమైతే ఆ సృష్టి ఎలా జరిగింది? పరమాత్మ వల్లనే కదూ? ఇది కూడా సత్యమే అయితే, సృష్టి అనేది కాలంలో జరిగింది కనుక పరమాత్మ కాలంలో నిలబడి సృష్టించి ఉండాలి. కాలానికి పరిమితమైనవాడు భగవంతుడు కాలేడు. భగవంతుడు కాలాతీతుడని మనమే పలుకుతున్నాం.

పరమాత్మకన్నా దేశకాలాదులు అన్యంగా ఉన్నప్పుడే పరమాత్మ సృష్టిని ప్రత్యేకంగా చేయగలడు. పరమాత్మకు అనంతత్వము లేనపుడే ఈ విధంగా సృష్టి జరుగగలదు. దీనిని అంగీకరిస్తే సృష్టి అసంభవ మవుతుంది.

ఇంతకీ, సృష్టిగా తెలుస్తున్న ఈ ప్రపంచము దేశకాలాదుల యందే తెలుస్తున్నది. ఈ రెండింటిని మరచి ప్రపంచాన్ని చూడలేము. మానవుని మనుగడను ఊహించలేము.

బాహ్య మనేది దేశకాలాదుల వల్లనే అనుభవానికి అందుతున్నది. అవి లేనిచో బాహ్యమనేది ఉండదు. బాహ్యమనేది లేకపోతే ప్రపంచము గోచరించదు. అయితే, ఇక్కడ ఒక సందేహము. బాహ్యంలో ఉన్నట్లు గోచరించినంత మాత్రాన వాస్తవంగా అవి బాహ్యంలో ఉన్నట్లేనా? లేక, ఉన్నట్లుగా తెలుస్తున్నవా? చూచే వ్యక్తికి, చూడబడే విషయానికి మధ్య గల అంతరమే బాహ్యమనేది ఉన్నట్లు నిర్ణయిస్తుంది. అయితే విషయానికి విషయికి మధ్య జ్ఞానము ఎలా కలుగుచున్నది? దేశకాలాదుల వల్ల జ్ఞానము కలుగుతుందా?

ఇప్పుడు ఆలోచించండి. ద్రష్టకు దృశ్యం విషయంలో జ్ఞానమెలా కలుగుతున్నది? ముక్కు వాసన చూడగలదు కాని, వాసనకు సంబంధించిన జ్ఞానమును పొందగలదా?

* 1996 నూతన సంవత్సర సందేశం

మనసంటారా? మనసెక్కడుంది? ఎక్కడైనా ఉండనీ. బాహ్యంలో మాత్రం లేదు. మనసు ఆంతర్యంలో ఉండి బాహ్యంలో లేనపుడు బాహ్యానికి సంబంధించిన జ్ఞానము మనస్సు కెలా కలుగుతుంది? మీరున్నట్లు నాకు తెలుస్తోంది. అలాగే నన్ను మీరు చూస్తున్నారు కనుక నేనున్నట్లు మీకు తెలుస్తోంది. నాకన్నా వేరుగా మీరు, మీకన్నా వేరుగా నేను ఉన్నట్లయితే నాకు సంబంధించిన జ్ఞానము మీకు ఉండదు. మీకు సంబంధించిన జ్ఞానము నాకు ఉండదు.

ఇది ప్రజ్ఞ. నేనే ప్రజ్ఞ. అదే చైతన్యము. అన్నీ తెలియడానికి చైతన్యమే ఆధారము. నాకు జ్ఞానమున్నట్లు నాకు తెలుసు. కొన్ని విషయాలలో నాకు అజ్ఞాన మున్నట్లు కూడా తెలుసు. నా మనసులోని భావాలు, ఆవేశాలు, జ్ఞాపకాలు - అలా ఎన్నో తెలుస్తుంటాయి. దేశకాలాదులు కూడా అలాంటివే. అవి నీ సంకల్పానికన్నా వేరు కావు. దేశకాలాదులుగా తెలిసేది కూడా మనసే.

దేశ కాలాభిధానేన రామ సంకల్ప ఏవహి

కథ్యతే తద్వశా ద్యస్మాత్ దేశకాలౌ స్థితిం గతౌ ॥

"రామా! దేశ కాలాదుల పేరుతో తెలియునది కూడా సంకల్పమే. ఎందుచేతనంటే, ఈ దేశకాలాదులు సంకల్పము వల్లనే నిలిచి ఉన్నాయి" అని యోగవాసిష్ఠంలో వసిష్ఠుడు రామునికి బోధించాడు.

చైతన్యం వల్ల అన్నీ తెలుస్తున్నాయి.

ఏవీ తెలియక పోయినా చైతన్య ముంటుంది.

నేను చైతన్యాన్ని. ఇది తెలిస్తే అంతా నాలోనే. కాదు; నేనే. ఇప్పుడు ఆలోచిద్దాం. వచ్చిందేమిటి? పోయిందేమిటి? కొత్త ఎక్కడ? పాత ఏది? కాలమేమిటి? దేశ మెక్కడ? దేశకాలాదులు లేని చైతన్యంలో నూతనత్వమేమిటి? శుభాకాంక్ష లెవరికి?

అశుభముంటే శుభాన్ని కాంక్షించాలి.

అంతా శుభమే. ఆకాంక్షలు లేవు. నిరీక్షణలు ఉండవు.

సంబంధాలు, వ్యవహారాలు వ్యావహారిక మనుగడ లోనివే. చైతన్యము సంబంధాల పరిధిలోకి రాదు. పారమార్థిక సత్తా స్వరూపము ఆచార వ్యవహారాలకు అతీతము.

నహి మిథ్యాజ్ఞానం పరమార్థవస్తు దూషయతుం సమర్థమ్;

అవిద్యా క్షేత్రజ్ఞస్య న కించిత్కర్తుం

"మాయా ప్రపంచ జ్ఞానము పరమార్థ వస్తువును కలుషితం చేయలేదు. క్షేత్రజ్ఞుని అవిద్య కొద్దికూడా అంటలేదు" అని శ్రీశంకర భగవచ్ఛరణులు గీతాభాష్యంలో తెలుపుతారు.

కనుక, శుభం శుభమే. అది మారేది కాదు. కనుక కోరేది ఉండదు.

ఇక్కడ శుభాన్ని కాంక్షించడం కాదు.

శుభాన్ని వీక్షించడం. అంతే.

చైతన్యగాన లహరి

పల్లవి: నా కవితే కోవెల
నా పూజకు తరలిరా ॥ నా కవితే ॥

అనుపల్లవి:
వచ్చే దారిని తెలిపితే
నా ఎదను అడుగుకు పరిచెద ॥ నా కవితే ॥

చరణములు:

1. ఆశే కోవెల దీపము - నీ
రూపే దానికి ప్రాణము
చూపే వరకు మారదు
నిను చూడక అది ఆరదు ॥ నా కవితే ॥

2. మధుర మధుర భావనలే
నీ సేవలో పువ్వులు
నా గుండెలో గుసగుసలు
వినిపించును గుడి గంటలు ॥ నా కవితే ॥

3. అణు వణువున కోవెల తలుపే
అనుక్షణము నీ వలపే
నీ మీదే నా రాగము
నీ మాటకే నా తాళము ॥ నా కవితే ॥

4. మూతబడదు గుడి తలుపు
అది నా కంటి చూపు
గుడిలో నీ రూపు కరువైతే
మిగిలే దిక కనుమూతే ॥ నా కవితే ॥



సాధన సౌరభం

ఇందులో...



కర్తవ్యం

భగవంతుడు ప్రపంచాన్ని సృష్టించాడు. పరితాపాన్ని సృష్టించలేదు. బ్రతుకు నిచ్చాడే కాని బాధలను ఇవ్వలేదు. బాధలను మనిషి సృష్టించుకున్నాడు. బరువులను తయారు చేసుకొని ప్రశస్తమైన మానవజన్మను శోకమయం చేసుకున్నాడు. ప్రపంచం సత్యమని భ్రమించి, నిత్యుడైన పరమాత్మను మరచి, దోషాలకు నిలయమై తోషాలకు దూరుడయ్యాడు.

ఈ ప్రపంచం గిజిగాని గూడు లాంటిది. గింజుకుంటూ, గుంజుకుంటూ ఎంత కాలమీ గుంజాటన? గిజగిజ లాడుతూ గిలగిల తన్నుకుంటూ ఎవరి కొరకీ ప్రతి ఘటన? అస్తమించడానికే సూర్యుడు ఉదయిస్తున్నాడు. క్షీణించడానికే చంద్రుడు ప్రకాశిస్తున్నాడు. ఆగిపోవడానికే ఆలాపన కదులుతున్నది. మూగబోవుటకే మాట పలికింది. ఆలోచించు.

వేటగాడి సంగీతానికి మైమరచిన లేడి బ్రతుకులో ఓడిపోయింది. గాలంలో దాగిన ఇంద్రజాలం అర్థంగాక చేప చచ్చిపోయింది. రూపలావణ్యం చూసి దీపం చెంతకు పరుగు పెట్టే మిడుత శవంగా మిగిలిపోయింది. బ్రతుకు గారడిలో మోసపోయిన జీవి వల్లకాటికి కదిలిపోతున్నాడు.

తామరాకుపై నీటిబొట్లు నిలుస్తాయి. ప్రకాశిస్తాయి. పరవశిస్తాయి. ఆణి ముత్యాల్లా గోచరిస్తాయి. గాలి వీస్తుంది. పత్రం చలిస్తుంది. మురిసే బిందువులు ఒరిగిపోతాయి. నీటిలో రాలిపోతాయి.

బ్రతుకులోని సంపదలన్నీ నీటి బిందువులే అని మరువకు. కాలపవనాలు వీచగానే కనుమరు గవుతాయని తెలుసుకో. అసత్యవస్తువు ఎప్పుడూ నీకు అండకాదు. లేనిది లేమివి లేకుండా చేయలేదు.

పగిలేది కుండ......

వాడేది దండ......

పగలకుండా కుండను ఆపగలవా?

వాడకుండా దండను నిలుపగలవా?

చెండులా దొర్లిపోకు.

కొండలా నిలిచి చూడు.

రాత్రి గడిచింది. ఉదయం తెలిసింది. సూర్యుని కిరణజాలం దేహాన్ని ఉడికి స్తున్నది. బడబాగ్నివలె ఒకనాడు చితిలో రగిలే శరీరానికి ప్రాప్తించే దుస్థితికి అద్దం

పట్టినట్లు ఎండ దేహాన్ని మండిస్తున్నది. ప్రతిరోజు చీకటిలో లయించినట్లు మానవ జీవితం శ్మశానంలో అంతరిస్తుందని కదిలే కాలం సందేశం అందిస్తున్నది. యౌవనం మూడునాళ్ళు. ముచ్చట తీరేలోగా మూలజేరే మాయావి యౌవనం.

వెళ్ళిన రోజులు మళ్ళీరావు. మరలిపోయిన మనుగడ తిరిగిరాదు. ప్రవాహం నీటిని సముద్రానికి చేర్చినట్లు కాలం బ్రతుకును వల్లకాటికి చేర్చుతుంది. కాలరూప సుడిగుండంలో ప్రపంచమే తారుమారవుతున్నది. తల్లడిల్లుతున్నది. తరిగిపోతున్నది. అంతరించిపోతున్నది. నీటిలోని తరంగం కదిలేది ఎంతసేపు? కనుమరుగయ్యే దెంత సేపు?

మట్టికుండపై మోహమెందుకు? మలినదేహంపై మమత లెందుకు? పక్షికి, చల్లిన నూకలు గోచరిస్తాయే కాని పన్నిన వల తెలిసిరాదు. క్షణికమైన విషయానందానికి జీవుడు ఆకర్షింపబడుతాడే గాని దానిని అంటి ఉన్న అనంత దుఃఖాన్ని చూడలేడు. వలలో చిక్కిన తర్వాత ఎంత గుంజుకున్నా పక్షి విడుదల కాలేదు. సంసారమనే వలలో చిక్కిన జీవి పరిస్థితి కూడా అంతే.

ఈ సత్యం గ్రహించిన వ్యక్తి పశ్చాత్తాపంతో కుమిలిపోక తప్పదు. పొరపాట్లు అదృశ్యం కావాలంటే పశ్చాత్తాపం కదలాలి. అదే ప్రాయశ్చిత్త మవుతుంది. నిష్కృతిని అందిస్తుంది. పరిష్కృతిని ముందుంచుతుంది. పశ్చాత్తాపంతో కూడిన ప్రార్థనలే పర మాత్మ పవిత్రపాదాలను చేరుతాయి. స్పందన లేని ప్రార్థనలు ప్రతిస్పందనను ఎలా దర్శిస్తాయి? ఆర్తి లేని భక్తి ఆర్తనాదాన్ని ఆదిదేవుడు ఆలకించడు.

చేత కాలేదని చింతించకు. చేయూత నిమ్మని పరమాత్మను ప్రార్థించు.

పరమాత్మ కొరకు పరితపించే వారు ధన్యజీవులు. వేదనలకు స్వస్తి చెప్పు. బ్రతుకునే నివేదనగా మార్చుకో.

బలహీనతలను ప్రక్కకు నెట్టేయి. పరవశించి భగవన్నామాన్ని గానంచేయి. ఆ పారవశ్యంలో పల్లవి కదలనీ! ఆ పల్లవికి స్పందించిన సదాశివుని మంగళ చరణాలు ఆశీర్వాద పల్లకీలో కదలి ముందుకు రానీ! ప్రేమవల్లరి జాలువారి హృదిలో అల్లరి చేస్తూ దివ్యోన్మాదం కలిగించే కమలనేత్రుడితో ప్రయాణం సాగించు. అది ఆద్యంతా లెరుగని ప్రయాణం. అలసట తెలియని యానం. కదలిక అర్థంగాని గమనం.

అది ప్రశాంత వసంత యామిని.

ప్రేమవెన్నెల సోమధారగా వర్షించే పున్నమి.

పురాకృత పునాదులు కదలిపోగా పురాతన వైభవంతో సనాతన అంబారీలో ఊరేగే నిత్యానంద వాహిని.

సాధన సౌందర్యం

కంటికి గోచరిస్తున్న ఒక రూపాన్ని చూడటం మనస్సుకు ఇష్టం లేకపోతే వెంటనే కళ్ళు ప్రక్కకు తిరుగుతాయి. చూపు మారుతుంది. కాని, ఇష్టం లేని అనేక రూపాలు, కష్టాన్ని కలిగించే అనేక విషయాలు మనస్సులో గోచరించినపుడు మనస్సు ఏం చేయగలుగుతుంది? ఏమీ చేయలేదు, బాధపడటం తప్ప. వ్యథ చెందటం తప్ప.

ఇష్టం లేదు కనుక గిట్టని వాళ్ళతో భాషించకుండా ఉండవచ్చు. అలాగని, వారిని గూర్చిన భావాలు బుద్ధిలో కదలకుండా ఆపగలమా? మనస్సులోని మర్మర ధ్వనుల్ని నిలపగలమా?

బాహ్యం ఉంది. ఆంతర్యానికి బాహ్యంలో లేదు.

మనస్సులో కోపం పుడుతుంది. అంతే, కళ్ళు ఎరుపెక్కుతాయి. శ్వాసలు పరుగు లెత్తుతాయి. పెదవులు చలిస్తూ ఉంటాయి. దేహం ఊగుతుంది. చెమటలు పోస్తాయి. మనస్సులో కారణాన్ని పెట్టుకొని దేహ స్థాయిలో కార్యాలను ఆపగలమా?

మనం చేసే పూజ ఎవరి కొరకు? భగవంతుని కొరకు. మనం కీర్తించేది ఎవరిని? భగవంతుణ్ణి. సరే, బావుంది. మన పూజలు, కీర్తనలు పరమాత్మకు అవసరమా? వాటి వల్ల ఆయనకు ఏం లాభం? అనంతుడైన పరమాత్మకు మన సాధనల వలన ఒరిగేదేమిటి? తరిగే దేమిటి? ఏమీ లేదు. మన మనస్సులో భక్తి ఉంది. భావ శుద్ధి ఉంది. అది అర్చన కీర్తనాదుల ద్వారా వ్యక్త మవుతోంది. ఇదంతా **"స్వాంత స్సుఖాయ"**. మన తృప్తి కొరకే.

ఆంతర్యం ఉంది. బాహ్యానికి అభ్యంతరం కాదు.

చందనం ముఖాన పెట్టుకొని అద్దం ముందు నిలబడతాం. ఆకాశంలో చంద్రుని లాగ ముఖాన శోభించే చందనాన్ని చూసుకొని హాయిగా మనసు చల్లబడుతుంది.

అద్దంలో బాహ్యంగా కనిపించే చందనపు బొట్టు అద్దంలో లేదు. బాహ్యంలో ఉన్నట్లు కనిపించేది, వాస్తవానికి ఉన్నది మన ముఖం పైనే. అలా ఉన్నట్లు తెలిసేది మాత్రం ముఖం మీద కాదు, మనస్సులో.

అద్దంలో బొట్టు అందంగా లేకుండా బొద్దుగా ఉందనుకోండి. మనవైపు చూస్తున్నాడు కదా అని అద్దం బొట్టును సరిచేయగలదా? సైజ్ చేయగలదా?

బాహ్యం ఉంటుంది. అంతర్యమే శోభించాలి.

ముఖాన బొట్టు అందంగా ఉంది. అద్దం మురికిగా ఉంది. అందమైన చందనపు బొట్టు అందంగా కనిపించటం లేదు. అందం లేదు అనిపిస్తుంది కనుక మనస్సు ఆనందాన్ని జారేసుకుంది. అనవసరంగా పారేసుకుంది. మళ్ళీ మళ్ళీ ముఖాన్ని శుద్ధి చేసుకొని నూతనంగా చందనం దిద్దుకున్నంత మాత్రాన అద్దంలో క్రొత్త అందాలు చిగురించవు. పాత రోతలు పోవు.

అద్దంపై నున్న మురికిని శుద్ధి చేయాలి. ఆ తరువాత బుద్ధి ఆనందంతో పండుతుంది. అద్దంపై నున్న మురికిని శుద్ధి చేయటానికి సుద్దలాంటి మురికినే ఉపయోగించవచ్చు. ఏది ఉపయోగించామనేది ప్రశ్న కాదు. శుద్ధి జరిగిందా? లేదా? అనేదే విషయం.

ఆంతర్యం శోభించాలి. బాహ్యంలోనే అది ప్రతిఫలించాలి.

బాహ్యంలో ఆచారము

ఆసక్తి లేకపోతే ఆచారాన్ని ఆపుకోవచ్చు. విచారాన్ని ఆ నెపంతో ఆపలేము. వాస్తవం చెప్పాలంటే మనం ఆంతర్యంలో సాగించే విచారమంతా ఆసక్తిదాయకమే అని చెప్పలేము. ఆసక్తి లేనివి, అశాంతి నిచ్చేవి ఎన్నో మన మనస్సులో నిరంతరం కదులుతున్నాయి. అదుపు లేకుండా ఊరేగుతున్నాయి. పొదుపు లేకుండా పెరిగిపోతున్నాయి.

ఆంతర్యంలో విచారము

మనో వ్యాపారమే విచారము. ఈ వ్యాపారంలో సరుకు ఉత్పత్తి ఆంతర్యంలోనే. అమ్మకమే బాహ్యంలో. సరుకు నాణ్యతను, శక్తిని బట్టే అమ్మకము. ఈ రెండూ సరిగా సాగితేనే ఆ తరువాత వినియోగము.

మనస్సులో విచారము భగ్నమైతే, బాహ్యంలో కర్మలు బంధాలవుతాయి. బాధలుగా మిగుల్తాయి. ప్రతిబంధకాలుగా నిలుస్తాయి.

పిచ్చివాళ్ళు ఏది చేసినా, ఏదో జరుగుతుంది. ఏమీ చేయకుండా వారు నిమ్మళంగా ఉండటం కూడా మున్ముందు కనిపించే ఉపద్రవానికి సంకేతమే.

పిచ్చివాని ప్రవర్తన మరుక్షణం ఎలా ఉంటుందో ఎవ్వరూ చెప్పలేరు. ఎవరికీ అర్థం కాదు కనుక చెప్పలేరు. ఇంతకీ, పిచ్చివాడి కన్నా అర్థమైందా? లేనే లేదు. కానే కాదు. అర్థమైతే అతడు పిచ్చివాడు ఎలా అవుతాడు?

తన మనస్సు తనకు అర్థం కాని వాడు పిచ్చివాడు. తన మనస్సుపై అధికారాన్ని సాగించలేనివాడు పిచ్చివాడు.

ధర్మాసనం

ఆలోచించే సామర్థ్యం ఉండాలి. అవసరమైతే ఆలోచించకుండా మనస్సును ఆపగలిగే స్థైర్యం కూడా ఉండాలి. ఈ రెండూ పిచ్చివానికి ఉండవు. ఉండే అవకాశం లేదు.

మామూలు మనిషికి ఉండాలి. సాధకునికి ఉండి తీరాలి.

ఉన్న ఉద్యోగం పోయింది.

పోయిన ఆరోగ్యం తిరిగి రాలేదు.

ఉంటాడనుకొన్న వ్యక్తి శాశ్వతంగా పోయాడు.

ఇవన్నీ మార్పులు. మనస్సు తీర్పు ఏమిటి?

అయ్యో! అయ్యో...... కుర్రో! మొర్రో....... అంతా, చిర్రు బుర్రే! ఇలాంటి బుర్ర తొట్ట అని నేను అనను గాని సమస్యల్ని అర్థం చేసుకోవటంలో కుర్రేనని ఖచ్చితంగా చెప్పగలను.

పోవడానికి ఉన్నది పోయింది.

పోవడానికే పోయింది కనుక రాలేదు.

ఉండటానికి లేదు కనుక పోయాడు.

ఇది న్యాయవాది తర్కం కాదు. న్యాయాధిపతి శాసనం.

న్యాయవాదికి రాగద్వేషాలు ఉండొచ్చు. ఇష్టాయిష్టా లుండొచ్చు.

రాగద్వేషాల ఊబినుండి దూరమైనవాడే న్యాయాధిపతి.

అందుకే,

కేసు నెగ్గినా, నెగ్గకపోయినా న్యాయవాదికి ఘర్షణ ఉండొచ్చు.

ముద్దాయికి మరణదండన విధించినా న్యాయమూర్తికి సంఘర్షణ ఉండదు.

ధర్మ శాసనం

పోయేవి పోతాయి

ఉండేవి ఉంటాయి. - నీవు కలత చెందకు అని బుద్ధికి ఆదేశాన్నిస్తే దానిని సందేశంగా భావించి బుద్ధి బుద్ధిగా ఉండగలిగితే ఇక ఘర్షణ ఎవరికి? బుద్ధి బుద్ధిగా ఉంది కనుక బుద్ధికి కాదు. అలాంటి బుద్ధిగల మనిషికి అసలు కానే కాదు.

సమతూకం

శుద్ధ బుద్ధి గలవాడు లేదా, శుద్ధ బుద్ధి కొరకు ప్రయత్నించువాడు సాధకుడు. సాధకుడు ఆచారవంతుడు. విచారవంతుడు కానివాడు ఆచారవంతుడు కాలేడు. ఆచార విచారాలలో సమతూక మెరిగినవాడు, సమతుల్యంగా చరించేవాడు సాధకుడు.

బాహ్యంలో ఆచారం బహిరంగ సాధన.

ఆంతర్యంలో విచారం అంతరంగ సాధన.

యజ్ఞము, పూజ, దానము, సంకీర్తనము, సేవ - ఇవన్నీ బహిరంగాలు.

ధ్యానము, మననము, స్మరణము, విచారము - ఇవన్నీ అంతరంగాలు.

సామగ్రి, ధనము, జనము, కాలము, దేశము - ఇవి బహిరంగ సాధనకు సహకారాలు.

ప్రశాంతత, అహింస, సత్యము, నిరహంకారత - ఇవి అంతరంగ సాధనకు సహకారాలు.

ఆకారం అవశ్యం. సహకారం అనివార్యం.

సాధకుడు కొన్ని రూపాలు చూడకూడదు - ఇది బహిరంగ సాధన.

చూసినా మనస్సు వాటిని నిలుపుకోకూడదు - ఇది అంతరంగ సాధన.

కొన్ని శబ్దాలను సాధకుడు వినకూడదు - ఇది బహిరంగ సాధన.

వినినా మనస్సు వాటిని నిలుపుకోకూడదు - ఇది అంతరంగ సాధన.

బాహ్యంలో చలన ముంది.

ఆంతర్యంలో సంచలనం లేదు.

ఇది రాగం లేని స్థితి....... ద్వేషం రాలేని పరిస్థితి.

లేని రాగం తెచ్చే దేముంటుంది?

రాలేని ద్వేషం కొనితెచ్చే దేముంటుంది?

రాగద్వేషాలు లేని కర్మలో అప్రియ మేది? అశాంతి ఎక్కడిది?

దైవ దర్శనం

అడవుల్లో ఉన్నాడే గాని ధర్మరాజు ఆపదల్లో లేడు.

ధనం లేనివాడే గాని కుచేలుడు పేదవాడు కాడు.

భోగాలకు అయోధ్య

బాధలకు అరణ్యం - అయినా,

అరణ్యవాసి యైన రాముడు అయోధ్యావాసియే.

అంపశయ్యపై పవ్వళించియున్నా,

కాపురమున్న కొంప కూలిపోతున్నా,

కునుకు లేకుండా

కన్నీటి చినుకు రాలకుండా

శాంతి తల్పముపై శయనించిన శంతన సుతుడు, శాంతమూర్తి భీష్ముడే.

బాహ్య చలనాలు కదిలించలేని

ఆంతర్య సంచలనాలు కరిగించలేని

ఏకదశలో

ఏకాదశిలో

శాంతిరూపుడై, కాంతిరూపుడై శోభించిన భీష్ముడు సాధకుడే.

ఉత్తరాయణంలో తాను సాధ్యమే.

సాధకులందరు భీష్ములే.

పాల మనసు

ఆధ్యాత్మికంగా ప్రగతిని సాధించాలంటే ముందుగా మనల్ని మనం శుద్ధి చేసుకోవాలి. మనస్సును పవిత్రం చేసుకోవాలి. అనుచితమైన అలవాట్లను దూరం చేసుకోవాలి. సుగుణాలను వృద్ధి చేసుకోవాలి.

అందాన్ని వీక్షించడము అందరికీ ఆనందమే. అంద మెక్కడుంది? అందరిలోనూ ఉంది. కల్లోల కెరటాలను అధిగమించి పయనిస్తే ప్రశాంత ఉదధి దర్శనమిస్తుంది. దేహమనోబుద్ధులను దాటి నడక సాగిస్తే సౌందర్య సార సర్వస్వం అనుభవానికి అందుతుంది.

అందాన్ని ఎవరు ఏవగించుకుంటారు? ఆనందాన్ని ఎవరు ద్వేషిస్తారు? అందరిలో ఉన్నది సౌందర్యమేనని, సౌకుమార్యమేనని తెలిసినపుడు నీవు ఎవరినీ ద్వేషించలేవు. బాధించలేవు. ద్వేషభావము దుఃఖానికి హేతువవుతుంది. సాధకా! ఎవరినీ ద్వేషించకు.

మంచిది. నీవు ఎవరినీ ద్వేషించుటలేదు. నీలాగే ఊయి ఎవరినీ ద్వేషించుటలేదు. చెట్టు ఎవరినీ దూషించుట లేదు. మరి నీవు ఊయిలాగా, చెట్టులాగా జీవిస్తావా? మరైతే పరమాత్మ మనోబుద్ధులను నీ కెందుకు ప్రసాదించినట్లు?

ద్వేషపరులు దోషులు. దానవులు. కనుక ద్వేషాన్ని దూరం చేసుకోవాలి. మనం మానవులం. ప్రేమించే శక్తి ఉన్నవాళ్ళం. ఆ పని చేస్తున్నామా? లేదా? ఆలోచించుకోవాలి. "ప్రేమరహిత హృదయము భయంకర శ్మశానము"; అన్నాడు కబీర్‌దాస్.

సర్వులలో సర్వేశ్వరుని దర్శించాలి. అప్పుడే సర్వులను మనం ప్రేమించగలము. వ్యక్తిని చూచే అలవాటు ప్రమాదము. వాసుదేవుని దర్శించే అనుభూతి ప్రమోదము. ఒకవేళ వ్యక్తిలో వాసుదేవుని చూడలేకపోతే ఫరవాలేదు. వ్యక్తిలో తెలియని వాస్తవాన్ని ఊహలో దర్శించటం అలవాటు చేసుకోవాలి. నేటి పాపికి రేపు పుణ్యాత్ముడయ్యే అవకాశముంది. ఈ సత్యం తెలిస్తే ఆ వ్యక్తిపై మనకు గౌరవ మేర్పడుతుంది. నేటి పాపికి, ఒకనాటి పుణ్యాత్మునికి మధ్య నిలిచియున్నది కాలమేనని గ్రహిస్తాము. కాలము ఊహాజనితమే నని తెలియగానే కాఠిన్యమంతా కరిగిపోతుంది.

మనస్సులోని భావాలే దేహం ద్వారా కర్మలుగా వ్యక్తమవుతూ ఉంటాయి. ఏ విషయంలోను పూర్తిగా మంచి నిండదు. పూర్తిగా చెడు ఉండదు. మంచిచెడులు మనోకల్పితాలు. ప్రతి మనిషి తన దృక్కోణం నుండి తనకు తాను మంచిగానే కనబడుతూ ఉంటాడు. మంచిచెడులను ఏకరువు పెట్టుకుంటూ జీవిస్తే బ్రతుకులో శాంతి మిగలదు. సుఖం నిలువదు. మన ఆలోచనలను వడిపే చైతన్యదీప్తి మనస్సులో ఎక్కువ కాలము స్ఫూర్తివంతమై నిలిచినపుడు అట్టి మనస్సులో విలువైన ఊహలు, విశాల భావాలు కదుల్తాయి. మనసులో అజ్ఞానాంధకారము దట్ట మైనపుడు మన ఊహలు, భావాలు సంకుచిత మవుతాయి.

విశాలహృదయం కలవారిలో ద్వేషాలుండవు. దోషాలుండవు. ద్రోహాలుండవు. మోసాలుండవు. దుష్టవృత్తులు గల మనస్సు సదా మనకు శత్రువే. దొంగలు లేనిచోట హాయిగా జీవించవచ్చు. దోమలు లేనిచోట ప్రశాంతంగా నిద్రించవచ్చు. దోషవృత్తులు లేని హృదయం క్షీరసాగరమే. అట్టి హృదయాన్ని పొందగలిగితే మనమూ శాంతాకారమే అవుతాము.

సోమరితనాన్ని పోగొట్టుకోవాలి. సదా హరినామామృత పానం చేసే సదలవాటును కలిగియుండాలి. బురద అంటుకోగానే శుద్ధి చేసుకుంటాం. అలాగే మనస్సులో ద్వేష భావాలు స్ఫురించగానే భగవన్నామంతో మనస్సును శుద్ధి చేసుకోవాలి.

మనస్సును మందిరంగా మార్చుకోవాలి. దేవుడులేని గుడి దయ్యాల కొంప. మాధవుడు లేని మనస్సు మందిరమెలా అవుతుంది? మాధవుడు మనస్సులో ఉండాలంటే మాధవ నామామృతపానమే ఏకైక మార్గమని గ్రహించాలి. నామామృతం ప్రవహించే మనస్సులో ద్వేష విషం నిలువలేదు.

ద్వేష విషాన్ని క్షాళనం చేయాలి....... ప్రేమామృతాన్ని పానం చేయాలి.

ఏదైనా చేయాల్సిందే.......

ఏదీ చేయకుండా పొందగలిగేది మృత్యువొక్కటే.

గోవత్సము గోవును అనుసరిస్తుంది.
కర్మఫలం కర్తను వెంబడిస్తుంది.

విడిచిన బాణం వెనక్కి రమ్మంటే రాదు.
చేసినకర్మ ఫలాన్ని ఇవ్వకుండా పోదు.

పారిపోతే పాపాలు కరిగిపోవు.
చిత్తానికి అనుగుణంగా చట్టాలు మారవు.
జరిగేవి జరుగక మానవు.

మెల్లమెల్లగా,
పరమాత్మకు సమీపంగా జరగడం
మనసును సమీపానికి జరపడం
ఈరెండే
మనం చేసి చూడవలసినవి
చూసి చేయవలసినవి.

దారి క్రొత్తది కాదు

సత్యమనేది ఒకటుందా? భగవంతు డున్నట్లేనా? ఆత్మ సాక్షాత్కారము సాధ్యమా? సాధనలకు ఫలితం లభిస్తుందా?

ఇలాంటి ప్రశ్నల్ని మనసులో దొర్లించుకుంటూ అలసిపోవడంకన్నా ఒక విషయాన్ని సూటిగ ఆలోచిస్తే సరిపోతుంది. ఈ విధమైన ప్రశ్నలతో కూడిన అన్వేషణను గతంలో ఎవరైనా చేశారా? లేక, మనమే ప్రారంభిస్తున్నామా?

ఈ జిజ్ఞాస ఈనాటిది కాదు. ఈ అన్వేషణ నేడు ప్రారంభం కాలేదు. కొన్ని వేల సంవత్సరాల క్రితం ఈ పుణ్య భారతావనిలో మహర్షులు ప్రశ్నించడమే కాదు, సమాధానాలు పొంది తృప్తి చెందారు. సత్య దర్శనంతో సంతృప్తి చెందారు. సత్యాన్ని సాక్షాత్కరించుకొని సత్య స్వరూపులై భాసించారు.

మహర్షులు అంతటితో ఆగలేదు. సత్యదర్శనానికి చక్కని బాటలు నిర్మించారు. మహర్షుల మార్గాలు సిద్ధంగా ఉన్నాయి. చూడు, ఒక్క విషయాన్ని పరిశీలించి మరీ చూడు. సులభమైన బాటలు నీవు నడవడానికి సిద్ధంగా ఉండగా వాటిని విస్మరించి నీ బాటను నీవు నిర్మించుకోవలసిన అవసరముందా?

అర్థరహితమైన ఊహలు, చేష్టలు బ్రతుకులో పరమార్థాన్ని దించలేవు. పరమాత్మను పూర్ణంగా విశ్వసించనంత వరకు లోకము నిన్ను ఏడిపించుట మానదు. పరమాత్మను విశ్వసించుటలో నీకు పరమాత్మ సంబంధమైన జ్ఞానము లభిస్తుంది. పరమాత్మశక్తి నీలో నిక్షిప్తమవుతుంది. ఆ శక్తితోనే సర్వత్ర నీవు పరమాత్మను దర్శించగలవు.

ఇదంతా మన జీవితములో జరుగక పోవడానికి కారణం పరమాత్మ లేక కాదు. పరమాత్మను పొందాలనే దృఢ సంకల్పం మనకు లేకపోవడం చేతనే బ్రతుకంతా అయోమయంగా ఉంది.

పరమాత్మ విషయంలో దృఢ విశ్వాసం లేకపోవడానికి కారణ మేమిటి? చెబుతాను. ప్రపంచం నుండి గౌరవాలు పొందాలని, సన్మానాలు పొందాలని, సుఖాలు చేదుకోవాలని ఆలోచించే పిచ్చి మనసు మన దగ్గర ఉండటమే కారణము.

ప్రపంచం నుండి మన్ననలను మనసు అభిలషించవచ్చు. అలా అభిలషించే మనసుకు దాని శక్తి ఏమిటో, సామర్థ్య మెలాంటిదో అవగతమై ఉన్నదా? పోనీ, ఎవరి నుండి నీవు మన్ననల్ని ఆశిస్తున్నావో వారికి వారిని గూర్చి అవగతమై ఉన్నదా? నీ వెవరో తెలియని నిన్ను, తామెవరో తెలియని లోకులు గుర్తించి, గౌరవిస్తే ఒరిగే దేమిటి? ఇలాంటి పిచ్చి ఆలోచనలతో కాలాన్ని నెట్టుకుంటూ పోయి ఒకనాడు నేలపై ఒరిగిపోవడం తప్ప.

లోకంలో చరించడం తప్పు కాదు. లోకంలో పడి లోకేశ్వరుని మరచిపోవడం తప్పు. ఆకలికి ఆహారాన్ని గ్రహించడం తప్పు కాదు; పైగా తప్పదు కూడా. కానీ భోజనంతో పారవశ్యాన్ని పొందాలని, తన్మయత్వం చెందాలని ప్రయత్నించడం దోషం.

మనసు ఒక దొంగ పశువు. క్రొత్త ప్రదేశములో అన్ని సౌకర్యాలుండినా కట్లు త్రెంచుకొని పారిపోయేందుకే సిద్ధపడుతుంది. పూర్వ వాసనలు వర్తమానాన్ని సుఖంగా సాగనివ్వవు.

అలవాటైతే పారిపోవడాలు, జారిపోవడాలు ఉండవు. అభ్యాస మయ్యేంతవరకే ఏ బాధయినా! ఆధ్యాత్మిక మార్గంలో అభ్యాసయోగి అనుగ్రహపాత్రుడే. ఈ విషయంలో సందేహము అవసరం లేదు.

అభ్యాస యోగయుక్తేన చేతసా నాన్యగామినా
పరమం పురుషం దివ్యం యాతి పార్థానుచింతయన్

"అర్జునా! అభ్యాస యోగమును అవలంబించి, ఇతర విషయముల మీదికి వెళ్ళని మనస్సుతో భగవంతుని మరల మరల స్మరించు మనుజుడు శ్రేష్ఠుడైన ఆ పరమపురుషుని తప్పక పొందగలడు" అని శ్రీకృష్ణ పరమాత్మ భగవద్గీత - అక్షర పరబ్రహ్మ యోగములో తెలిపినాడు.

సాధ్య సాధనములను ఏకం చేసిన శ్లోకమిది. సాధ్యము బాధలకి, బోధలకి అతీతమైన స్థితి. సాధనలోనే బోధయినా; బాధయినా.

సాధకుని సాధన దశలో అసంతృప్తి ఉండకూడదు. పరమాత్మను ధ్యానించే వానికి అసంతృప్తి ఎలా ఉంటుంది? ఇక అవసరాలు అంటారా? మనకు యోగ్యమైనవి పరమాత్మ అడగకుండానే ఇస్తాడు. ఏవయినా మనకు లభ్యం కాకపోతే, అవి మనకు అమంగళం కనుకనే పరమాత్మ ప్రసాదించలేదు అని అర్థం చేసుకోవాలి.

ఇలా ప్రతి విషయంలో పరమాత్మ అదృశ్య హస్తాన్ని దర్శిస్తూ జీవించడమే తపస్సు. చూడు. ఇలా తపోదీక్షలో రమించడం, ధ్యాననేత్రాలతో సృష్టిని వీక్షిస్తూ జీవించడం భగవద్దర్శనం కాదా!

చేస్తూ చూడడం.
చూస్తూ చేయడం.
ఇదే చైతన్యం.
జీవన చైతన్యం.
చైతన్య జీవనం.

పరిపక్వత

మనం ఆశించింది జరగాలి అనుకుంటాము. మనం ఇష్టపడనిది జరుగకూడదు అని భావిస్తాము. కాని, నిజ జీవితంలో జరగాలి అనుకున్నది జరుగకపోవడమే గాక జరుగకూడదు అనుకున్నది జరిగిపోతూ ఉంటుంది. ఇలాంటి సమయాల్లోనే హోరుగాలికి చెట్లు చలించినట్లు మనస్సు కదలిపోతుంది. రాగద్వేషాలతో ఊగిపోతుంది. తనకున్న కొద్దిపాటి ప్రశాంత ఫలాలను కూడా రాల్చేసుకుంటుంది.

ప్రయత్నం ద్వారా మనం కొన్ని చేయగలం. ప్రయత్నించినా కొన్ని చేయలేము. ఇవి వాస్తవాలు. వీటిని యథాతథంగా అంగీకరిస్తే మనస్సు కుదుటపడుతుంది. సమస్యలు సమసిపోతాయి.

పిల్లల్ని తల్లిదండ్రులు పెంచుతారు. విద్యలో ఉంచుతారు. విత్తాన్ని పంచుతారు. కాని, ఇన్ని చేసినా తాము చెప్పినట్లు పెళ్ళి చేసుకోలేదని ఏదో అయిపోతారు. తాము చేయమన్న ఉద్యోగం చేయలేదంటారు. ఇవన్నీ మనసులను కుదిపేస్తూ ఉంటాయి. వారికీ శాంతి ఉండదు. చుట్టూ ఉన్నవాళ్ళకి అశాంతి తప్పదు.

బిడ్డలకు విద్యాబుద్ధులు చెప్పించడం, వారిని పెంచడం తల్లిదండ్రుల బాధ్యత. కాని, పెద్దవాళ్ళైన తరువాత బిడ్డలు తమ మాట వినలేదని చింతించడం కొనితెచ్చుకున్న భారం. మీ బాధ్యతను మీరు నిర్వర్తించారు. చాలు. బిడ్డల్ని శాసించే స్థాయికి వెళ్ళ నవసరం లేదు. వాళ్ళ బ్రతుకుల్ని వాళ్ళు ఆలోచించుకోనివ్వండి. ఒకవేళ వాళ్ళు ఆలోచించలేరు అనే సందేహమే కనుక తల్లిదండ్రులైన మీకు ఉంటే, వాళ్ళని ఆలోచనా పరులుగా పెంచలేని మీ అశక్తతని, బాధ్యతారాహిత్యాన్ని అంగీకరిస్తే సరిపోతుంది. మనసు తేలిక పడుతుంది.

గురువుల వద్ద శిష్యులుండొచ్చు. తాను ఆశించిన విధంగా శిష్యుడు ఎదగలేక పోతున్నాడనో, లేదా అందుకు భిన్నంగా పతనమవుతున్నాడనో గురువు చింతించడం మొదలు పెడితే దాని వల్ల గురువుకు ఏదీరాదు, నిద్ర కూడా.

గురువు చెప్పడం వరకే చేయాలి. శిష్యుడు వినకపోతే అది అతని విషయం. ఎవరు ఎవరికీ సంబంధించిలేరు ఈ ప్రపంచంలో. ఎవరి జీవితాన్ని వారే తయారు చేసుకోవాలి. ఒకరు మరొకరికి సహకరించవచ్చు. అంతమాత్రాన సంకోచవ్యాకోచాలతో గుండెను పిండుకోనవసరం లేదు.

“నేను నాకున్న జ్ఞానాన్ని పంచాను. పంచుతున్నాను. అతని ప్రయత్నలోపం, ప్రారబ్ధరూపం అవరోధా లవుతున్నాయి. దానికి నాకు బాధెందుకు? నేను వాటిని అర్థం చేసుకుంటాను” అని భావించి స్థిమితపడగలిగితే గురువు గుండె నిముషానికి 72 సార్లు చక్కగా ఆడుతుంది.

శిష్యుడైనవాడు ఇలా ఉంటే తనకు చెడ్డపేరు వస్తుందని, సంస్థపేరు చెడిపోతుందని, నలుగురు ఎనిమిది విధాల అనుకుంటారని ఆలోచిస్తూ పోయే గురువు శాంతిగా ఉండలేడు. మరొకరి అభిప్రాయాలపై, నిర్ణయాలపై ఆధారపడి సుఖించాలనుకొనేవాడు ఎప్పుడూ దుఃఖానికి దూరం కాలేడు. అలాంటి ఆవేదనాపరుడు ఆచార్యుడు కాలేడు. ఉన్నది ఉన్నట్లు సంతోషంగా అంగీకరిస్తేనే జీవితం ఆనందంగా, అమృతమయంగా సాగుతుంది.

వర్తమానంలో మనం మార్చడానికి వీలులేని రీతిలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించడం కాకుండా వాటిని అర్థం చేసుకొంటూ, అంగీకరిస్తూ జీవించడం సాధకులు అలవరచుకోవాలి. కలతపడే మనస్సు సాధన చేయలేదనే సత్యాన్ని మరువకూడదు.

గతంలో చేసిన అనేక తప్పులు నేడు మనల్ని క్రుంగదీస్తుంటాయి. ఇవి కూడా ప్రశాంతంగా జీవించడానికి అవరోధాలే.

“నేను అనవసరంగా వారిని బాధించాను. నేను ఫలానా విషయంలో మూర్ఖత్వంతో అధర్మంగా ప్రవర్తించాను. అవన్నీ పాపాలని, నా లోపాలే నని ఇప్పుడు నాకు తెలుస్తున్నాయి. ఈ జ్ఞానం అప్పుడు ఉండుంటే అలా చేసేవాణ్ణి కాను. అది తప్పని నాకు ఎవ్వరూ చెప్పలేదు” - ఇలా ఆలోచిస్తూ చాలామంది కుమిలిపోతూ ఉంటారు.

ముముక్షువులారా! వాస్తవాన్ని పట్టిస్తాను. శ్రద్ధగా వినండి. గతం గతించి పోయింది. ఇప్పుడు చింతించినంత మాత్రాన జరిగిపోయింది తిరిగి సరిపడదు. గతించి పోయిందని మరచి పోగలుగుతున్నామా? అదే జరిగితే, ఇక ఏ సంఘర్షణా మిగలదు. మరువలేము. అలాగని చేదు జ్ఞాపకాలతో జీవించలేము. అలాంటి వాటిని హృత్పూర్వకంగా అంగీకరిస్తే సరిపోతుంది.

జ్ఞానము లేనందున నేను అలా ప్రవర్తించాను. జ్ఞానము లేకపోవడము దోషమేమో గాని నేను దోషిని కాను. దోషినైతే నేడు ఎన్నో మంచి పనులు చేసి ఇందరికి సంతోషాన్నెలా కలిగిస్తాను? నన్ను నన్నుగా నేను చూసుకోవాలి. ఇది అవగాహన.

నా దోషానికి నేనే అకర్తనని తేలినపుడు, ఇతరులు నా విషయంలో కర్తలెలా అవుతారు? కనుక ఇతరుల దోషాల్ని కూడా నేను పట్టించుకో నవసరం లేదు. జరిగింది కలగా మరచి, జ్ఞాన జాగరణలో నిలిచి వీక్షించడమే నా కర్తవ్యం.

ఇదంతా ఎందుకు చెబుతున్నానో తెలుసా?

సంకల్పించినంత మాత్రాన మనం సాధన చేయలేము. సాధన చేసే పరిపక్వత మనస్సుకు రావాలి. అప్పుడే సాధన సాగుతుంది. మనస్సు పరిపక్వమైతే సాధన చేయకుండా ఉండాలన్నా ఉండలేము.

సాధకులారా! రాగద్వేషాలను తటస్థపరచండి. జీవితంలో అనివార్యాలను గుర్తించి అంగీకరించండి. ఉండేవి ఉంటే ఉండనివ్వండి. పోయేవి పోతే పోనివ్వండి. ఉండటానికి వచ్చినవి పొమ్మన్నా పోవు. పోవటానికి వచ్చినవి ఉండమన్నా ఉండవు.

నీలో నీవు నీతో ఉంటేనే నిర్మలం. నిరంజనం. నిత్యం.

ఓం....... ఓం........ ఓం........

ఉద్ధరే దాత్మనాత్మానం

తనను తానే ఉద్ధరించుకోవాలి. నిన్ను నీవే ఉద్ధరించుకోవాలి. ఆమెను ఆమే ఉద్ధరించుకోవాలి. అతనిని అతనే ఉద్ధరించుకోవాలి. తమను తాము ఉద్ధరించుకొనే ప్రయత్నంలో మునగని వారిని తేల్చేవా రెవ్వరూ ఉండరు.

ఈ అవగాహన ఇప్పటిది కాదు. ఉపనిషత్తుల నుండి ఊడిపడి ఊరేగిన అద్భుత భావన. భగవద్గీతలో మారుమ్రోగే నేపథ్య అలికిడి. ఎందరో మహాత్ములు తమ ఆచరణలో దర్శించి, తృప్తి చెంది, సమాజాన్ని జాగృతం చేసిన అనుష్ఠాన భావన.

"నిన్ను నీవు ఉద్ధరించుకో"...... ఆహాఁ..... ఎంత చక్కటి భావన! ఇది అర్థం కావాలంటే వ్యక్తిలో తీవ్ర తపన ఉండాలి. కొన్ని వేల సంవత్సరాలుగా ఈ పలుకు ప్రతిధ్వనిస్తున్నా, ప్రతిచర్యలతో జీవించే మానవాళి ప్రతిఫలాన్ని అందుకోలేక నిరాశ చెందుతోంది. మహాత్ముల పలుకుల్ని మనోజనిత సందేశాలుగా భావించేవారు ప్రగతిని సాధించలేరు. ఈ కారణంగానే "ఉద్ధరే దాత్మనాత్మానం" అనే ఈ ప్రగతిశీల ప్రబోధం ఆశించినంత ఫలితాన్ని ఇవ్వలేకపోయింది. ఇదొక సూక్తిగా మిగిలిపోయిందే గాని బ్రతుకులో స్ఫూర్తిని దించలేకపోయింది. బుద్ధిలోని చక్కని ఆలోచనగా దీనిని గ్రహిస్తున్నారే గాని బ్రతుకులోని అవసరంగా గుర్తించలేకపోతున్నారు.

"ఉద్ధరే దాత్మనాత్మానం"....... అవును మరి! నిన్ను నీవు ఉద్ధరించుకోకపోతే మరెవరు ఉద్ధరిస్తారు? నీ ఉన్నతి నీకన్నా ఇతరులకు ఎలా అవసరమవుతుంది? నీ ఉన్నతికి నీవు పాటుపడాలి. వారి ఉన్నతిని తెలిసి వారు శ్రమించాలి. అందరి ఉన్నతి ఒకచోట చేరితే అదే అభ్యున్నతి.

నా ప్రగతికి నేనే ఎందుకు ప్రయత్నించాలి? ఇతరులు ఎందుకు ప్రయత్నించ కూడదు? అని నీవు ప్రశ్నించవచ్చు. అలా కాకుండా ఇతరులు ఎందుకు ప్రయత్నించాలి? అని నిన్ను నీవు ప్రశ్నించుకున్నప్పుడు కొన్ని ఆసక్తికరమైన సత్యాలు నీ ముందు నిలుస్తాయి.

మనం ప్రగతిని ఎందుకు కాంక్షిస్తున్నాం? పతనమై ఉన్నాం కనుక. అయితే, ఈ పతనానికి కారణమెవరు? ఎవరి వంచనకు గురియై మనం పతనమయ్యామో ఆలోచించాలి.

Who has deceived thee, so often as thyself?

"నీకన్నా నిన్ను సర్వదా వంచించిన వారు ఎవరున్నారు?" అని సూటిగా ప్రశ్నించాడు బెంజమిన్ ఫ్రాంక్లిన్.

మనల్ని మోసగించుకున్నది మనమే. మనల్ని వంచించుకున్నది మనమే. ఇతరుల చేతలకన్నా మన చిత్తమే మనల్ని మోసం చేసింది. మనసు చెప్పినట్లు నడిచామే కాని ఇలా ఎందుకు నడవాలి - అని ఏనాడైనా ప్రశ్నించామా? వెళ్ళమన్న చోటికి వెళ్ళామే కాని, ఎందుకు వెళ్ళాలి అని అడిగామా?

బంట్రోతు ఉద్యోగం చేశాం. బాధల్ని కొనితెచ్చుకున్నాం. కంట్రోల్ చేసే శక్తి లేక బ్రతుకుపై పెట్రోలు పోసి అంటించుకున్నాం. ఎక్కడ చూచినా, ఎవరిని చూచినా ఇదే పరిస్థితి. అజ్ఞాన మంటల్ని రగిలించుకొనేవారే గాని, విజ్ఞాన పంటను పండించుకొనే వారు లేరు.

ఇదంతా మన చేతుల్తో మనం చేసుకున్నది. ఎవరో చేయూత నివ్వలేదని రోదించడం ఏమాత్రం సబబు? నిజం చెప్పాలంటే ఇది మరొక విధమైన వంచన. అర్థమయ్యేలా చెప్పాలంటే గోరుచుట్టుపై రోకలిపోటు.

స్వతంత్ర జీవనాన్ని మనం అభిలషించవచ్చు. కాని మనం యాంత్రికంగా జీవిస్తున్నాము అనే సత్యాన్ని కాదనగలమా? గుడ్డి గుఱ్ఱంలా పరిభ్రమిస్తున్నా మనే విషయాన్ని నిరాకరించగలమా? మనం ఏం చేస్తున్నామో, ఎక్కడికి పోతున్నామో మనం ఆలోచిస్తున్నామా? కోరికలు అనే గుఱ్ఱాలపై స్వారి చేస్తున్న రౌతులుగా మిగులుతున్నామే గాని, ఆశ అనే ఎద్దుకు నిగ్రహమనే ముక్కుత్రాడును బిగించి క్షేత్రాన్ని కదిలించే రైతులుగా తయారయ్యామా?

మన ఆలోచన లెటు నడుస్తున్నాయో, మన ఆంతర్యపు లోతుల్లో ఏ మార్మిక వాసనలు చోటు చేసుకొని ఉన్నాయో, బాహ్యంలో మనం ఆచరించే కర్మల ఫలితాలు ఎలా ఉంటాయో మనకు తెలుసా? ఇవన్నీ అర్థం కాకుండా ప్రగతి ఎలా సాధ్యమవుతుంది?

అవును. అర్థం చేసుకోవాలి. ఆ ప్రయత్నంలోనే శాస్త్రాలు వింటున్నాం. గురువులను ఆశ్రయిస్తున్నాం. సద్బోధలను ఆలకిస్తున్నాం. బావుంది. మరి వాటి ఫలితా లేమిటి? ఫలితాలే అంది ఉంటే, ప్రగతి ముందు ఉన్నట్లే. ప్రగతి ఉన్నచోట పతన మెలా ఉంటుంది? పతనమే లేనపుడు "నిన్ను నీవు ఉద్ధరించుకో" అనే మాటకు అర్థమేమిటి?

పతనాన్ని ఈ దశలో లేదని చెప్పలేము. అయితే 'ప్రబోధాల ప్రభావ మేమిటి?' అనేదే మనకు అర్థం కావాలి. ఇది అవగాహనకు సంబంధించిన విషయం. కానీ ఇక్కడ మనం ఒక సత్యాన్ని మరువలేము. అవగాహన ఆశల అడుగులకు మడుగు లొత్తుతుంది అనే జీవన సత్యాన్ని నిరాకరించలేము.

ప్రబోధాలు అవగాహనను అందిస్తాయి. కాని ఆంతర్యం నుండి ప్రలోభాలు విజృంభించినపుడు అవగాహనలు తట్టుకొని నిలుస్తున్నాయా? నిలవకపోతే ఫరవాలేదు.

ప్రలోభాలను నిండుగ, దండిగ నిలబెట్టే ప్రయత్నం కూడా చేస్తున్నాయి. ఈ దశలో ఆశలు యజమాను లౌతున్నాయి, అవగాహనలు చాకిరి చేస్తున్నాయి.

అవగాహనల్ని మరచిపోతున్నాం. ఆశల్ని జ్ఞాపకం పెట్టుకుంటున్నాం. ఆశల చేతిలో అవగాహనలు పనిముట్లుగా మారిపోతున్నాయి. ప్రలోభాల చేతిలో ప్రబోధాలు నలిగిపోతున్నాయి.

ఇప్పుడు అర్థమయిందా? మన అవగాహనలు, మన విచక్షణలు, మన తర్కాలు, మన అభ్యుదయ మార్గాలు, మన ఆదర్శాలు అన్నీ మన ఆంతరంగిక మనోజాడ్యాలకు ఊపు నిస్తున్నాయి. బ్రతుకు రూపునే మార్చేస్తున్నాయి.

చూశారా? ఒకరి ప్రయత్నం వల్ల మనం ఉద్ధరించబడగలము - అంటారా? కూలిపోతున్న మెట్లను సరిచేసుకోకుండా మెట్లపై మేడ కట్టాలనుకొనే వ్యక్తి సాధించే దేమిటో ఊహించడం కష్టమా? మన ఆంతర్యంలో కదులుతున్న, రగులుతున్న పతనాన్ని సరిచేసుకోకుండా బాహ్యంలో ఏదో చేసి మాత్రం ఏమి సాధించగలం?

చెట్టు ఎక్కినవాడే దిగాలి. ఆకలున్నవాడే తినాలి. పతనమైనవాడే ప్రగతిని సాధించాలి. ఇది ఔషధ సేవనం లాంటిది. ఎవరి రోగానికి వారే మందు తినాలి. ఎవరిని వారే ఉద్ధరించుకోవాలి.

ఉద్ధరే దాత్మనాత్మానం

అని అందుకే ఎలుగెత్తి చాటాల్సివచ్చింది వెలుగును దర్శించిన మహర్షులు.

అయితే ఈ మార్గంలో ప్రయత్నాలు జరుగుతున్నాయా? లేదు. ఎందుకని? అది కూడా ఆలోచిద్దాం. కానివ్వండి.

ఆశల తోరణాలతో, కోరికల వర్ణ చిత్రాలతో మన ఆంతర్యం అలంకరించబడి ఉంది. ఆంతర్యంలోని వాంఛా రాగానికి అనుగుణంగానే బాహ్యంలో కర్మలు జరుగుతాయి. దోషాలు లోపల మెదుల్తున్నాయి. దోషపూరిత కర్మలు బాహ్యంలో కదుల్తున్నాయి. వీటిని ఆపుకోలేము. అలాగని స్వేచ్ఛగా కొనసాగించలేము. కనుక కనిపించే కర్మలలో దోషాలు అగుపించకుండా దాచుకొనేందుకు ప్రయత్నిస్తాం. అందుకనే

"False face must hide what the false heart doth know".

"చెడు మనసుకు తెలిసిన దానిని చెడిన ముఖం దాచక తప్పదు" అన్నాడు షేక్స్పియర్.

చూశారా! మనల్ని వంచించేందుకు మరొకరు అవసరమా? మనకు మనం పగవారుగా మిగిలిపోయాం. మనకు మనం శత్రువులుగా మారిపోయాం. ఒక చేత్తో

ఖడ్గాన్ని పట్టుకొని వేరొక చేతిని ఖండించుకుంటున్నాం. ఒక కంటిని పొడుచుకొని, ఆ దుర్భర దృశ్యాన్ని రెండవ కంటితో చూస్తున్నాం. ఇదంతా ఎంత తేలికగా చేసుకు పోతున్నాం!

"Nothing is so easy as to deceive one's self, for what we wish, we readily believe".

"మనం ఆశించే వాటినే విశ్వసించే వారమై ఉన్నాం కనుక మనల్ని మనం వంచించుకోవడంకన్నా తేలికైన పని మరొకటుండదు" అని డెమొస్తనీస్ అభిప్రాయపడ్డాడు.

ఇది అర్థమైతే, బ్రతుకు తేలికపడినట్లే. ముందు మనల్ని మనం అర్థం చేసుకోవాలి. తరువాత ప్రపంచము, ప్రజలు, వారి ప్రవర్తనలూను.

సరే బావుంది. ఇంతకీ ప్రస్తుతం మనలో మనల్ని అర్థం చేసుకొనేదెవరు? మన మనసే. అది సరే. ఇంతకీ ఏ మనసు? దోషపూరితమైన మనసేనా? ఆ మనసుతో అర్థం చేసుకొని మాత్రం సాధించే దేముంటుంది? దోష బుద్ధికి దోషాలు తప్ప ఏం తెలుస్తాయి? దోషాలు తొలగిన అంతఃకరణలోనే కొద్దోగొప్పో అవగాహన చిగురించే అవకాశాలుంటాయి.

దోషాలతో విజృంభించే మనసును నిగ్రహించాలి. మనసును శుద్ధి చేయడం వల్లనే అది సాధ్యమవుతుంది. ప్రస్తుతం మన మనసు మలినమై ఉంది కనుకనే మనం దానిని నిగ్రహించలేకపోతున్నాం.

శుద్ధిని కోల్పోయిన మనసును మరీ అశుద్ధం చేసే విధంగా మనం బాహ్యంలో కర్మలను ఆరేసుకుంటూపోతే, ఆంతర్యంలోని అజ్ఞాన తడి ఆరదు. అలాగని ఆంతరంగిక శుద్ధి లేకుండా మనసును నిగ్రహించే ప్రయత్నం చేస్తే అదీ అనర్థానికే దారి తీస్తుంది. కనుక ఇక్కడ మనం ఒక ప్రక్రియను ఆలంబనంగా గ్రహించాలి. అదే శుద్ధి కార్యక్రమము.

The purer the mind, the easier it is to control. Purity of the mind must be insisted upon if you would control it.

"మనసు శుద్ధిపడితే మనసు తేలికగా నిగ్రహింపబడుతుంది. మనసును నిగ్రహించాలని నీవు భావిస్తే, బుద్ధిని శుద్ధి చేసుకొనే యత్నం తీవ్రతరం కావాలి" అన్నారు స్వామి వివేకానంద.

ముకుందుని అనుగ్రహంతో మనో శనిగ్రహాన్ని నిరోధించే ప్రయత్నమే ఈ "నిగ్రహం".

ఏది అనుకూలం? ఏది ప్రతికూలం?

మన ఆలోచనలకు అనుగుణంగా అన్నీ సాగుతూ వుంటే మనం తృప్తిగా ఉంటాం. ఇదే జీవితమైతే ఇక తృప్తి అనే దానిని జీవించియుండగా చూడలేమేమో!

మనం లేచేసరికి అందరూ నిద్ర లేచి ఉండాలి. ఎవ్వరు లేవక పోయినా ముందుగా మనలో కోపం మేల్కొంటుంది. టాప్ త్రిప్పుతాం. నీళ్ళు రావు. మోటారు వేద్దామంటే కరెంటు ఉండదు. టూత్ పేస్ట్ తెచ్చిపెట్టమంటే మరుపుకు మారుపేరైన కుమారుడు తెచ్చిపెట్టలేదు.

ఇంతలో భార్య సీరియస్‌గా కనపడుతుంది. అంతే. "ఈ కొంపలో అన్నీ ఏడుపు ముఖాలే. ఈ వేడుకే సరిపోయింది నా బ్రతుకంతా" అంటూ చిటపటలు.

ఒకవేళ భార్య నవ్వుతూ కనిపించిందనుకోండి. "నా బాధలు నీకు నవ్వులాటలుగా ఉన్నాయా?" అంటూ కటకటలు.

తరువాత అల్పాహారం. అందులో ఏదైనా లేకపోవచ్చు. మరేదైనా ఉండొచ్చు. లేనిది ఉప్పు కావచ్చు. ఉన్నది, చచ్చిపడి ఉన్నది ఈగ కావచ్చు. ఆ క్షణంలో టేబుల్ తబలాయే!

ఆఫీసు కెళ్తే, అందరూ నాకు అనుకూలంగా మసలుకోవాలి. ఎదుటి వ్యక్తిలో నవ్వు లేదని, మనలో ఉన్న నవ్వును పారేసుకుంటాం. ఎవడో విష్ చేయకపోతే మన తృప్తి హుష్...కాకి.

"కడుపు చల్లబడితే కళ్ళు పైకిపోతాయి. పెద్ద చిన్న, మంచి చెడు అన్నీ పాడైపోయాయి;" అంటూ భయంకర ప్రసంగాలు. ఏం చేద్దాం! ఎవరైనా, ఎప్పుడైనా క్షణంలో మనల్ని అశాంతిలో పడేయగలరు. ఇంకెక్కడి తృప్తి? ఇంకేమి సంతృప్తి!

ఈ విధంగా కళ్ళెములు అన్యులకిచ్చి, మనం తృప్తిగా ఎలా ముందుకు పోగలం? రోజంతా ప్రపంచమే మనల్ని శాసిస్తోంది. ఇంకెక్కడి సుఖం?

బయట ఏదీ అనుకూలం కాదు. లోపల అన్నీ ప్రతికూలమే. ఇక శూలాలెందుకు పొడవటానికి?

తృప్తి చెందాలంటే, సుఖపడాలంటే ఒకటే మార్గం ఉంది. ఏదో మారటం వల్ల, ఎవరో మారటం వల్ల మనకు సుఖం రాదు. మనం మారితేనే మనకు సుఖం.

మనకు అనుగుణంగా ఏదీ జరగకపోయినా, ఆ పరిస్థితిని అర్థం చేసుకొని, మనం అనుగుణంగా జీవించగలిగితే - ఆ తరువాత తృప్తి మనల్ని విడిచిపోయేందుకు సాహసించదు.

ఏది ఎందుకు జరుగుచున్నదో అర్థంగాని మన పరిమిత బుద్ధిని సాక్షిగా ఉంచగలిగితే, కుక్షిలో కలత ఉండదు. అక్షిలో సమత చెడదు.

అన్నీ అనుకూలంగా జరగవు. అలాగని ప్రతిదీ ప్రతికూలంగా ఉండదు. ఏవి ఎలా ఉండాలో అలా ఉంటాయి. ఎవరు ఎలా ఉండగలరో అలాగే ఉండగలరు.

నీవెలా ఉండాలో నీవు నిర్ణయించుకోవాలి. "భగవంతుడు నాకు ఇలాంటి బ్రతుకిచ్చాడు. ఇలాంటి మనసిచ్చాడు. ఇలాంటి మనిషి నిచ్చాడు" అని ఫిర్యాదులు చేయటం మర్యాదలనిపించుకోవు.

వేణువులు తయారు చేసేవాడు మనకు వాటిని ఇస్తాడు. ఊదవలసింది మనమే. "ఏముంది ఈ వెదురులో? అంతా బోలే. అన్నీ కలుగులే"; ఇలా చెప్పుకొంటూ పోవటం రాగం కాదు.

బోలు కాకుండా డోలులాగా ఉంటే బహుశా మోగితే మోగవచ్చు. ఆ మోత డోలు వాద్య మవుతుందే గాని, వేణునాద మవుతుందా? మార్కెట్ లాభాల నాశించి గోడౌన్‌లలో బస్తాలు నింపినట్లు, బోలు లేకుండా వేణువు నిండా కోవా నింపితే ఇక అది వేణువవుతుందా?

రాగం ఊదేందుకు బోలే మేలు. సరిగమలు తొంగి చూడాలంటే కలుగులే కిటికీలు. ప్రతి క్షణము ఏముంది? ఏముంది? అని చిందులేయటం కాదు. ఏమీ లేనందుకు తృప్తిగా ఉండటం నేర్చుకోవాలి.

కరువు ఉంటే తృప్తా? క్యాన్సరు ఉంటే తృప్తా! కొన్ని లేకపోవటమే మంచిది. ఏవి ఉండాలో, ఏవి ఊడాలో కూడా అర్థంగాని అయోమయం మన ప్రయాణం. వాటికి సాక్షిగా జీవించటమే మనం అలవరచుకోదగిన సుగుణం.

జనానికి దూరం కమ్మని, జగత్తుకు దూరం కమ్మని నేను చెప్పటం లేదు. ఆ బరువంతా నీ భుజాల కెత్తుకోవద్దంటున్నాను. ఒకవేళ ఇష్టపడి ఎత్తుకున్నా ఎంతో దూరం మోయలేవు అంటున్నాను.

మనం సాధననే ప్రధానంగా కలిగిన సాధకులం. మనం పట్టించుకోవలసింది పరమాత్మనే కాని ప్రపంచాన్ని కాదు.

భగవంతుడు మనకు మంచి మనస్సు నిచ్చాడు. వేణువు నుపయోగించినట్లు దానిని ఉపయోగించుకోవాలి. లేదా, ఖాళీగా అలా ఉండనివ్వాలి. ఏవేవో నింపుకొనే ప్రయత్నం చేయకూడదు. నింపుకోవటం తేలికే. పంపుకోవటం అంత తేలికైన పని కాదు. ఉంచుకోవలసినవి ఉంచుకోవాలి. త్రెంచుకోవలసినవి త్రెంచుకోవాలి.

నిన్ను నడిపే శక్తిని నీ వద్దే ఉండనీ. ప్రపంచం చేతిలో కళ్ళెమునుంచి బ్రతుకును ఖాళీ పళ్ళెముగా మార్చుకోవద్దు.

మితమే హితము

మితము స్థిమితాన్ని అందిస్తుంది. మితమే హితమును ప్రసాదిస్తుంది. మితిమీరి జీవిస్తే దు:ఖము తప్పదు. అతి ఎప్పుడూ అనర్థాన్నే తెచ్చిపెడుతుంది.

జీవించటానికి ఆహారము అవసరము. అది కూడా మితంగానే ఉండాలి. విశ్రాంతికి నిద్ర అవసరము. అతిగా నిద్రించువాడు సోమరిపోతు అవుతాడే గాని సాధకుడు కాలేడు.

సాధకునికి భాషణమే భూషణము. తియ్యని పలుకులు గలవాడే లోకపూజ్యుడు. మనం ఇతరులకు ఎంతైనా సహాయమును అందించవచ్చు. కానీ మన పలుకులో తియ్యదనము లోపిస్తే అది ఉప్పులేని పప్పులాగా ఉంటుంది. కూరలేకుండా అన్నము వడ్డించినట్లు ఉంటుంది. అతివాగుడుకు అలవాటు పడ్డవారు అసత్యవాదులవుతారు. సమాజంలో చులకనై పోతారు. మితంగా, మధురంగా మాట్లాడేవారు సర్వులకు ప్రేమ పాత్రులై భాసిస్తారు. మధురమైన వాక్కు వరం లాంటిది. అతివాగుడు శాపం వంటిది.

సాధకుడు మితంగా భుజించాలి. గాలి ప్రవేశించేందుకు కూడా ఖాళీ లేకుండా కొందరు పొట్టలు నింపుకుంటారు. పెట్టేవాళ్ళకు ప్రేముంటే ఇక చెప్పనవసరము లేదు. వారు బాధలు పెట్టేవారుగా మిగిలిపోతారు. ఇంక కొంచెము తినగలము అనెడి ఆలోచన ఉండగనే భుజించుట మానేయాలి. ఈ సుగుణాన్ని అలవరచుకొన్న సాధకుడే సాధనలో కొనసాగగలడు. కొన్ని రోజులు ఉప్పు, కారము తగ్గించి తింటూ ఉంటే అతిగా భుజించు వారు కూడా మితముగా భుజించి హితమెరిగి జీవించగలరు. అలాగని కొందరు దీర్ఘ ఉపవాసాలు చేసి వాడిన తోటకూరలాగా, చిలుకుకు తగిలించిన చొక్కాలాగా వ్రేలాడు తుంటారు. ఇది మరీ చాదస్తం. ఆకలితో జీవించడమే ఆధ్యాత్మిక జీవనమైతే మన దేశములో సగము జనాభా సాధకులే అవుతారు. అతి ఎప్పుడూ వర్జించ దగినదే గాని వరించదగినది కాదు.

ఆదాయాన్ని బట్టి మితంగా ఖర్చు పెట్టుకోవాలి. ఖర్చును క్రమబద్ధం చేయాలి. అధిక వ్యయానికి అలవాటు పడినవారు అప్పుల నాశ్రయించి ముప్పును కొనితెచ్చు కుంటారు. అలాగని దారుణంగా దోచడము, దాతృత్వము లేకుండా దాచడము కూడా సమంజసము కాదు. మంచి అలవాట్లను కలిగి, మితవ్యయము ననుసరిస్తూ, అతి వ్యయము లేకుండా జీవించాలి. శీలవంతులను శ్రీనివాసుడే కాపాడుతాడు.

అతిగా ఆలోచించడము కూడా అనర్థమే. కొందరు ప్రతి చిన్న విషయానికి పెద్దగా ఆలోచిస్తూ ఉంటారు. కొందరు ఎదురుపడే ప్రతి వ్యక్తిని గూర్చి, విషయాన్ని గూర్చి తీవ్రంగా ఆలోచిస్తూ ఉంటారు. ఇది వాస్తవానికి ఆచరించదగిన విధి కాదు; ఆవరించిన మానసిక వ్యాధి. అవసరమైన విషయాలే అంత:కరణలో కదలాలి. సత్యమైన

విషయాలే మననములో కొనసాగాలి. అనవసర, అప్రస్తుత ఆలోచనలను అరికట్ట గలిగినపుడే సాధనలోని మాధుర్యమును చవిచూడగలం.

స్నేహము మంచిదే. అతిస్నేహము మంచిది కాదు. స్నేహితుని ఎక్కువగా ప్రేమించాలి. తక్కువగా కలిసి తిరగాలి. భావప్రాధాన్యమే గాని భౌతిక సంపర్కము అనవసరము. తిరుగుడులో విరుగుడు ఎదురౌతుంది. మనుగడ భారమై నిలుస్తుంది.

సాధకుడు సత్యసంధుడై యుండాలి. ఏది ఇచ్చినా ఫరవాలేదు. కానీ మాట ఇచ్చేటప్పుడు ఆలోచించి మరీ ఇవ్వాలి. మాట నిలిచినపుడే మనిషి నిలుస్తాడు. మాట పడితే మనిషి పతనమౌతాడు. మాట చెడితే బాట చెడుతుంది. బాట చెడితే బ్రతుకే పాడౌతుంది. చేయగలిగితేనే చెప్పాలి. చెప్పిన దానిని చేసి చూపించాలి. మితమైన వాగ్దానాలే హితకరం. అతిగా వరాలిస్తే భస్మాసురులే ఎదురౌతారు.

మితములోనే స్థిమిత ముంది. హితము దాగిఉంది. ఉచితరీతిలో చరించు వారు ఉన్నతు లౌతారు. సముచితపంథాలో నడక సాగించువారు సముజ్జ్వల జీవనముతో శోభిస్తారు. అందుచేతనే శ్రీకృష్ణ పరమాత్మ భగవద్గీతలో

యుక్తాహార విహారస్య యుక్తచేష్టస్య కర్మసు
యుక్త స్వప్నావబోధస్య యోగో భవతి దు:ఖహా

"మితమైన ఆహారవిహారములు, మితమైన నిద్ర, మెలుకువ గలవానికి ఉచిత రీతిన కర్మలయందు చరించువానికి ఈ యోగము దు:ఖహరము అగుచున్నది" అన్నారు.

తప్పు చేసింది అప్పుడు
ముప్పు వచ్చింది ఇప్పుడు

ఆపదలు ఎప్పుడైనా రావచ్చు.
ఆ వచ్చేది ఇప్పుడే కావచ్చు.

బ్రతుకు సదా ఆపదలోనే ఉంది అనేది సత్యం.

ఆదుకోవలసినవాడు, గోవిందుడే.
చేదుకోవలసినవాడు, గోపాలుడే.

ఆపద్బాంధవుని ఆశ్రయిస్తే
ఇక్కట్లు తీరుతాయి.
చీకట్లు తొలగుతాయి.

వేదన లేని సాధన

సాధకునికి సదుపాయాలు అవసరమా? అనుకూల వాతావరణము అవశ్యమా? బాధలు బరువులుగా మిగులుతాయా? బాధ్యతలు భారమై ఉంటాయా? ఆలోచించండి.

అవసరమైన కార్యముపై నీవు గ్రామాంతరము వెళ్తావు. కానీ ఇంటివద్ద అత్యంత అవసరమైన కార్యము నీ కొరకు వేచియున్నదని తంతి వచ్చింది. ఉన్నపళంగా బయలు దేరుతావు. సమయానికి వాహనాలు లేవు. ఆ సమయానికి ఏ వాహనము లభిస్తే దానిలో ప్రయాణం చేస్తావు. సౌకర్యాలు ఉండవు. పైగా అసౌకర్యంగా ఉంటుంది. అయినా పట్టించుకోవు. అది లారీయైనా, ఎద్దుబండి అయినా బాధలేదు. నిలబడి ప్రయాణం చేసేందుకు కూడా మనం వెనుకాడము.

సాధకుని పరిస్థితి అలాంటిదే. ప్రపంచంలో కర్మానుభవానికి జీవి కాలుమోపాడు. పుణ్యము తోడై భగవంతుని చేరమని శాస్త్రము తంతి సమాచారమును అందించింది. సాధకుడు నిజగృహానికి వెనుదిరిగాడు. పరంధామము వైపు నడక సాగించాడు. పరిస్థితి క్లిష్టమైనదే. సదుపాయాలు, సౌకర్యాలు ఉన్నవా? లేవా? అని ఆలోచించే అవకాశ మివ్వని ప్రయాణమది. గమ్యం చేరడమే ముఖ్యం. కనుక సాధకు డెప్పుడూ లభించిన దానితో తృప్తి చెందేవాడై యుండాలి.

అవసర ముంది గనుక నిలబడియైనా ప్రయాణం చేసేందుకు మనం సిద్ధపడ తాము. కొంతదూరము ప్రయాణము చేసేసరికి ఎవరో ఒకరు సర్దుకొని కూర్చోడానికి మనకు స్థలాన్ని కేటాయిస్తారు. మరొకరు కాఫీకప్పు నందిస్తారు. కాలంలో అన్నీ కలిసివస్తాయి. సాధకులైన వారంతా ప్రారంభములో అనేక బాధలతో జీవనగాథల నారంభించినవారే. కృషిలో పండి వారు ఋషులయ్యారు. ఆ తరువాత వారి అవసరాలన్నీ పరమాత్మే తీర్చాడు.

ప్రయాణం చేయడము ముఖ్యం గాని కూర్చున్న స్థలం కాదు గదూ! గమ్యం చేరగానే స్థలాన్ని త్యజించక తప్పదు. ప్రయాణంలో మనము ఆక్రమించిన స్థలము ఎలా మనది కాదో అలాగే ఇల్లు, పొలము, ధనము, జనము కూడా మనవి కావని, మనవారు కారని గ్రహించి, వాటి మధ్య ఆనందంగా జీవించేవాడే సాధకుడు.

సుఖదుఃఖాలు మనోకల్పితాలు. ఈ సత్యం తెలిసి సాధకుడు సమస్థితిలో జీవించడం నేర్చుకోవాలి. రాత్రింబవళ్ళకు సూర్యుడు కారణంగా తెలిసినా చీకటి వెలుగులు భూమిపై నున్నవారికే గాని సూర్యునిలో రాత్రింబవళ్ళు తెలియవు. అలాగే సాధకుని స్థాయిలో ద్వంద్వాలు సమసిపోవాలి.

"బాధలు చుట్టుముట్టి నపుడు నేను చస్తాను" అని కొందరు అంటూ ఉంటారు. ఇదియే అజ్ఞానము. చావు మన చేతిలో ఉన్నదా? మనం అనుకొని మరణించడానికి మనం అనుకొనే పుట్టామా? అజ్ఞానము అయోమయంగా పలికిస్తూ ఉంటుంది.

మనం సాధకులం. పరమాత్మ చట్టాలకు తలవంచి జీవించటం నేర్చుకోవాలి. సంకుచితమైన స్వభావాన్ని త్యజించి, దివ్యత్వాన్ని సాధించాలి. స్వర్గనరకాలు ఇక్కడే ఉన్నాయి. నేను చేస్తున్నాననే భావన కదలగానే నరకం ఎదుట నిలుస్తుంది. చేయించే వాడున్నాడని అర్థం కాగానే స్వర్గం ముందు కనిపిస్తుంది.

సాధకులు ఇంద్రియాలకు ప్రభువులే గాని దాసులు కారు. ఇచ్చేవారే గాని పుచ్చు కొనేవారు కారు. నేను, నాది యనెడి అహంకార మమకారములకు స్వస్తి చెప్పి, శాంతి యుత జీవనమును సాగించువారే సాధకులు.

వెన్నుని చేతిలో వేణువువలె సాధకులు జీవనరాగాన్ని ఆలపించాలి. వాణీ హస్త ముల లోని వీణవలె విజ్ఞాన శబ్దాలను పలకాలి. నాగభూషణుని మోసే నందీశ్వరుని వలె మస్తకము జ్ఞానసంపదను మోయాలి. తనను త్రిప్పే మూషికము మాతంగవదనుని ముందు చిన్నదై తిన్నగా యున్నట్లు, మనల్ని నడిపే కోరిక చిన్నదైపోవాలి. విస్తృతం గాకుండా తిన్నగా ఉండాలి.

ప్రయత్నిద్దాం. ప్రయత్నశీలురకు ప్రగతి దూరం కాదు.

దేహము ఒక ఓటికుండ
ఏనాడైనా బ్రద్దలయ్యేదే.

మనసొక పిచ్చిముండ
ఎప్పుడైనా వీధిన పడేదే.

అభిమానంతో కాలుతుంది దేహం
అహంకారంతో కాగుతుంది చిత్తం.

ఇంతని చెప్పగలమా చచ్చే తనువును.
అంతని చెప్పగలమా చంపే మనస్సును.
ఎంతని చెప్పగలము జీవి దుఃఖాన్ని?

పరమాత్మ అనుగ్రహాన్ని పొందితే,
కష్టం కరిగిపోతుంది.
దుఃఖం పారిపోతుంది.
చావు చచ్చిపోతుంది.
మనం,
బ్రతికి పోతాం. భగవంతునిలో బ్రతికి ఉంటాం.

నమ్రతే నాణ్యత

ప్రపంచము ఒక ఎండమావి యని బాగుగా తెలుసుకొని ఆ తరువాత ప్రపంచములో నిర్భయముగా చరించాలి. జగత్తులోని సుందర దృశ్యములన్నియూ మాయా స్వరూపములని మరచిపోకూడదు. పరమాత్మను మరచిపోతే ప్రపంచమే పరమాత్మగా మిగులుతుంది. నీవు భక్తుడవై ప్రపంచాన్ని పూజిస్తుంటావు. సమస్త దుఃఖములకు ఈ పూజయే కారణమని మరువకు.

అనర్థదాయకమైన ఈ అనిత్య పూజతో అనేక జన్మలు వ్యర్థమైనాయి. నేడు నీకు జిజ్ఞాస కలిగింది. గురువు లభించాడు. ఇక దృష్టిని పరమాత్మ వైపునకే మరలించు. జగత్పిత నీ తండ్రి అయితే నీకు ఇక వెలితి ఎక్కడిది?

ఆశించిన వారందరూ అభివృద్ధిని సాధించలేరు. ఆశ ఒక్కటే చాలదు. అవకాశాలు కూడా రావాలి. అవకాశా లెప్పుడొస్తాయి? ఏమో?....ఎవరికి తెలుసు? ఎలా చెప్పగలము? వాటి రాక తెలియదు గనుక వచ్చినప్పుడు మనము గుర్తించక పోవచ్చు కూడా. మనం గుర్తించ లేదని అవి ఆగుతాయా? వచ్చినట్లే వచ్చి వెళ్ళిపోతాయి. వెళ్ళినవి తిరిగి వస్తాయని చెప్పలేము. కనుక అవకాశాల కొరకు ఎదురుచూడటము గాకుండా అవకాశాలను మనము తయారు చేసుకోవాలి. వాటి చిరునామాను తెలుసుకోవాలి. వెళ్ళి తలుపు తట్టాలి. పిలుపునివ్వాలి. వలపు విప్పాలి. బ్రతుకును మలుపు త్రిప్పాలి.

ప్రాణతుల్యమైన మిత్రులు, బంధువులు వారి మనసు తెలిపిన కొన్ని కారణాలను ఆధారం చేసుకొని మనకు దూరమౌతూ ఉంటారు. అలాంటి సందర్భాలలో మనం చాలా కృంగిపోతూ ఉంటాము. మనుషులు దూరమైనా దూరము కాలేని మమతలు మనల్ని చుట్టుముట్టి బాధిస్తూ ఉంటాయి. చూడు. ఇవి బాధపడవలసిన విషయాలా? ఆలోచించు. ఈ ప్రపంచములోని మమతలన్నీ ఇలాగే కనుమరుగైపోతా యని ఎందుకు గ్రహించవు? భగవంతుని బాంధవ్యమే స్థిరమైనది యని ఎందుకు గుర్తించవు? గుర్తించి గ్రహించావా! అయితే గ్రహణం వీడినట్లే. అగ్రహణము తొలగినట్లే. అన్యధాగ్రహణము అదృశ్యమైనట్లే. భగవానుని అనుగ్రహము ప్రాప్తించినట్లే. బోధలో బాధలు కనుమరుగైనట్లే.

ప్రయత్నశీలునకే అవరోధాలు అధికము. స్థిరచిత్తముతో ధీరులమై మెలగాలి. అవరోధము గోచరించినప్పుడు మనలో ఇంకా లోపాలు మిగిలి ఉన్నాయని తెలుసుకోవాలి. ఈ అవరోధాలకు అన్యులు తాత్కాలికంగా కారణములుగా తెలియవచ్చు. అంత మాత్రాన వాళ్ళను నిందించపనిలేదు. ఇది రెండవ అపరాధమై నిలుస్తుంది. మన విధికి మనమే కర్తలము. మన బాధలకు మన మనస్సే కారణము.

ప్రశాంతముగా జీవించే సదలవాటును అలవరచుకోవాలి. సహనమును కలిగి యుండాలి. పరిస్థితులు ప్రతికూలం కాగానే పలవరిస్తూ ప్రతిచర్యతో స్పందించకూడదు.

అవగాహనను పెంచుకోవాలి. వైరుధ్యములను విధాత మన బ్రతుకులో ఎందుకు ప్రవేశ పెడుతున్నాడో ప్రశాంతముగా అవలోకించి అర్థం చేసుకోవాలి.

మన బ్రతుకుల్లో ఏదైనా జరుగవచ్చు. మన మనస్సుల్లో ఏదీ జరుగకుండా చూసుకోవాలి. పరిస్థితులు ఎప్పుడూ ఒకే విధంగా ఉండవు. కానీ వాటితో పాటు మన ప్రవర్తన మారకూడదు. మన సాధన కుంటుపడకూడదు. ఎప్పుడూ అంతఃకరణ శుద్ధి కొరకే కర్మ లాచరించాలి. అశాంతి ఎదురైనపుడు వ్యథ చెందకుండా భగవానునికి మొరపెట్టుకోవాలి. పూర్ణహృదయంతో ధ్యానించాలి. అశాంతి అదృశ్యమై పూర్ణశాంతి మిగులుతుంది. మన సుఖాన్ని అందరూ పంచుకొంటారు. మన దుఃఖాన్ని భగవానుడే తొలగించగలడు.

"నేను" అనే అహంకారము మనలో అహర్నిశలు అవిశ్రాంతముగా పని చేస్తున్నది. బాధలన్నీ దాని మాయలే. సమస్యలన్నీ అది చిత్రించినవియే. అహంకారము అనర్థ దాయకము. అది అజ్ఞానమునకు అనుంగు బిడ్డ. అహంకారికి ఆత్మజ్ఞానము లభించదు. కాలిలోని ముల్లును తీసుకొనుటకు వంగక తప్పదు. తలవంచని వానికి బాధలు తొలగవు. అదియే నమ్రత. బ్రతుకులోని నాణ్యత.

తల్లిని చుట్టేది బిడ్డ
బిడ్డకు పెట్టేది తల్లి.

అడిగి పెట్టించుకొని నమలాలి గాని
సంకోచంతో నీళ్ళు నమలడ మెందుకు?

అడిగి తింటే లేదు తప్పు
అడుక్కు తింటేనే చాలా తప్పు.

అడిగేది అమ్మనే కదూ?
అమ్మను గన్న అమ్మనే కదూ?
ఇక సిగ్గెందుకు?
తగ్గకుండా అడిగివేయటమే.
సిగ్గు సిగ్గుపడేలా గీపెట్టడమే.
ముక్తిని ప్రసాదించమని మొరపెట్టుకోవడమే.

జ్ఞానశుద్ధి

జ్ఞానము రెండు విధాలు: 1. ప్రపంచ జ్ఞానము 2. పారమార్థిక జ్ఞానము. పారమార్థిక జ్ఞానము స్వచ్ఛమైనది. ప్రపంచ జ్ఞానము అశుద్ధమైనది. సరస్వతీదేవి జ్ఞానము పారమార్థికమైనది అయినందున అది శుద్ధమైనది. స్వచ్ఛమైనది. అమలమైనది. ఈ కారణం చేత శారదాదేవి అమల కమలాధివాసిని అని స్తుతించబడింది.

రెండవ వస్తువును ఆశ్రయించినది ఏదయినా అశుద్ధమే. ఈ అశుద్ధము బాహ్యములోను, ఆంతర్యంలోను గోచరించినపుడు మనలో స్వచ్ఛత లోపిస్తుంది.

మనం ధరించిన గుడ్డలు మలినమవుతాయి. మన చర్మము మట్టిచేత మలిన పడుతుంది. బాహ్యంలో చరించడం వలన నోరు, ముక్కు, చెవులు అన్నీ మలినపడుతూ ఉంటాయి. ఈ మాలిన్యాన్ని అరికట్టేందుకు దేహాన్ని కప్పుకోవడమే గాక, దానిని తొలగించుకొనేందుకు స్నానాదుల నాచరిస్తాము.

ఏది పట్టుకున్నా, దేనిని ముట్టుకున్నా అశుద్ధమే. కనుక సూక్ష్మ దృష్టితో చరిస్తూ ఉంటాము. అనివార్య మైనపుడు శుద్ధికర్మను ఆచరిస్తూ ఉంటాము. ఉండకూడనిది అశుద్ధము. అలాంటిది ఉన్నదని తెలియగనే దానిని తొలగించే ప్రయత్నం చేస్తూ ఉంటాము. ఇదంతా బాహ్యశుద్ధి. దీని విషయంలో సర్వులూ ఏకీభవిస్తారు.

రెండవది అంతఃశుద్ధి. ఇది ఆంతరంగిక శుభ్రత. ఇది చాలా విశిష్టమైనది. అందరికీ తేలికగా మ్రింగుడు పడనిది. ఇది మనసుకు సంబంధించింది. దీని విషయంలో జాగ్రత్తపడడం సర్వులకూ సాధ్యం కాదు.

దేహమాలిన్యాన్ని శుద్ధి చేసుకొన్నట్లే, మనో మాలిన్యాన్ని కూడా శుద్ధి చేసుకోవాలి. దేహానికి మాలిన్యం అంటినట్లు దేహానికి తెలియదు. దానిని మనసు తెలుసుకుంటుంది. కానీ తనకు మాలిన్యం అంటినట్లు మనసు గుర్తించదు. గ్రహించదు. ఇక్కడే అంతశ్శుద్ధికి అవరోధము ఏర్పడుతుంది. ఇతరుల దోషాలు గుర్తించడం అందరికీ సాధ్యమే. తమ దోషాలు గుర్తించడమే కష్టం.

దేహాన్ని అంటిన మలినం దేహారోగ్యాన్ని పాడుచేస్తుంది. మనసు నంటుకున్న మాలిన్యం మనసు యొక్క ప్రశాంతతను భగ్నం చేస్తుంది. ముందు అశుద్ధాన్ని గుర్తించాలి. ఆ తరువాతే దానిని నిర్మూలించడం జరుగుతుంది.

కామక్రోధాలు, రాగద్వేషాలు, ఈర్ష్యాసూయలు, మానావమానాలు, జయాపజయాలు, సుఖదుఃఖాలు - ఇవన్నీ మనసును కలుషితం చేసే మాలిన్యాలే - మనశ్శాంతిని భగ్నం చేసే అవరోధాలే.

వీటిని మనసునుండి దూరం చేసినపుడే మనసు శుద్ధిపడుతుంది. మనసులో అవగాహన పెరుగుతూ ఉంటే మనసులోని అశుద్ధం కరిగిపోతూ ఉంటుంది.

ఒక వ్యక్తి మనలను నిందించినపుడు, నిష్కారణంగా బాధించినపుడు మనకు బాధ కలుగుతుంది. ఆ బాధ విస్తృతమయ్యే కొలది ద్వేషంగా పరిణమిస్తుంది. వెంటనే క్రోధం జనిస్తుంది. దాని ఫలితంగా అకృత్యాలు సాగినా ఆశ్చర్యపడవలసిన పనిలేదు. క్రోధానికి చేతలు చేతులే గాని, చిత్తము చెవులు ఉండవు.

నిందించిన వ్యక్తిలో ద్వేషం పుట్టింది. కానీ ఆ పుట్టిన ద్వేషం మనలో పెరుగుతున్నదని మనం గుర్తించము. ఆ పెరిగే ద్వేషము మనలో ఎంతగా అశాంతిని పెంచుతుందో కూడా ఊహించలేము. ఎదుటి వ్యక్తిలో ద్వేషం ఉండొచ్చు. అది అతనిలో ఉండడం వల్ల మనకు అశాంతి రాలేదు. దానిని మనం గుర్తించడం వల్ల వచ్చింది. గౌరవించి అందల మెక్కించడం వల్ల వచ్చింది.

క్రోధంతో ఎదుటి వ్యక్తి మనసు మలిన పడితే దానిని ద్వేష రూపంలో మనం స్వీకరించి మన మనసును మలినం చేసుకొంటున్నాము.

ఇక్కడ ఒక్క విషయాన్ని గమనించాలి. దేహానికి మలినం అంటితే వెంటనే కడిగేసుకుంటున్నాం. మనసుకు అంటిన ఈ మలినాన్ని శుద్ధి చేసుకొంటున్నామా? దేహం విషయంలో నిత్యమూ జాగరూకులమై ఉన్నాము. మాలిన్యాన్ని క్షణం ఉంచుకోవడం లేదు. మనసు విషయంలో కూడా అలాగే ఉండాలి. దేహమున్నంత వరకు ఆరోగ్యాన్ని వాంఛించే వారు దేహాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలి. మనసున్నంత వరకు ప్రశాంతతను ఆశించేవారు మనసును శుచిగా ఉంచుకోవాలి.

స్వదేహ మలనిర్మోక్షో మృజ్జలాభ్యాం

మట్టితోను, జలముతోను దేహమాలిన్యాన్ని తొలగించుకుంటాము.

అహం శుద్ధ ఇతి జ్ఞానం శౌచ మాహు ర్మనీషిణః

"నేను శుద్ధుడను అనెడి జ్ఞానము శౌచమని బుద్ధిమంతులు పలికారు" అన్నది ఉపనిషత్తు.

రెండవ వస్తువును ఆశించడం రాగమయితే, రెండవ దానిని నిషేధించడం ద్వేషమవుతుంది. ఈ రెండూ అశుద్ధాలే. అశౌచాలే.

ఎదుటి వ్యక్తిలో గోచరించిన దోషం మనలో ద్వేషానికి నాంది పలికింది. ఆ వ్యక్తిలో దోషాలేనా ఉండేది? సుగుణాలు లేవా? వాటిని గుర్తించగనే ఆ వ్యక్తిపై ఇంతవరకు ఉన్న ద్వేషము అదృశ్యమై ప్రేమ పుట్టుకొస్తుంది. ప్రేమ మనసులో కదలడమే శౌచము. ద్వేష పంకాన్ని ప్రేమ జలముతో కడిగేసుకోవాలి. మనసును అరిషడ్వర్గాలు ఆశ్రయించకపోతే మనసు నిర్మలంగా ఉంటుంది.

ఎవరిలోనో దోషాలున్నాయని దిగులు చెందడమెందుకు? ఆవేశపడట మెందుకు? ఆ దోషాలు మనలో లేనందుకు భగవంతునికి కృతజ్ఞతలు తెలుపుకోవాలి. భగవతికి ఋణపడి ఉండాలి.

అందరూ అందరికీ ఇష్టులు కాలేరు. అందరూ అందరినీ అన్ని సమయాలలో ఆదరించలేరు. ఇవన్నీ అభిప్రాయాలు. భావాలు. మబ్బులా కదలిపోతూ ఉంటాయి. వాటిని అలా పోనీ. మిగిలింది నిర్మలమైన, నిర్విశేషమైన ఆకాశమే కదూ! అది అంబరము. అశుద్ధము నెరుగనిది.

నీవూ శుద్ధమే. ఉండకూడనివి ఊడిపడితే పడనీ. అవి వచ్చాయి. కనుక పోతాయి. స్వచ్ఛత ఎప్పుడూ ఉంటుంది. శౌచము సదా ప్రకాశిస్తూ ఉంటుంది. అదియే జ్ఞానము.

ఆవు బ్రతుకుతుంది. అర్చన చేయలేదు.
కుక్కలు బ్రతుకుతాయి. కీర్తనము చేయలేవు.
దున్నలు బ్రతుకుతాయి. ధ్యానం చేయలేవు.
జంతువులు బ్రతుకుతాయి. జపాలు చేయలేవు.

మనుషులు కూడా బ్రతుకుతారు.
జంతువులు చేయలేని వెన్నో చేస్తారు.

మాయలు చేస్తారు. మోసాలు చేస్తారు.
నేరాలు చేస్తారు. హత్యలు చేస్తారు.
దోపిడీలు చేస్తారు. దగాలు చేస్తారు.
పాపం చేస్తారు. మరెన్నో చేస్తారు.

పవిత్ర కార్యాలు జంతువులు చేయలేవు.
పాపకార్యాలు దుష్టులే చేయగలరు.

పుణ్యకార్యాలు
దైవ కార్యాలు
యజ్ఞ కార్యాలు పావనాత్ములే చేయగలరు.
పరమాత్మ కృపకు నోచుకున్న పుణ్యాత్ములే
చేయగలరు.

బంధాలు - సంబంధాలు

సంబంధాలు లేకుండా ప్రపంచంలో జీవించలేము. ఏ సంబంధమైనా ఘర్షణకే ఆహ్వానం పలుకుతుంది. ప్రపంచం దోషపూరితంగా ఉంది. విషమత్వంతో వికటాట్ట హాసం చేస్తోంది అంటాము. నిజమే. దోషం ప్రపంచంలో లేకపోతే పరమాత్మలో ఉంటుందా? దోష ముంటేనే అది ప్రపంచము. నిర్దోషమైతే, సమమైతే అది బ్రహ్మ స్వరూపము **(నిర్దోషం హి సమం బ్రహ్మ - భగవద్గీత 5అ - 19వ శ్లోకం).**

ప్రపంచంలో ఉన్నది, ప్రపంచంలో కనిపిస్తూ ఉన్నది, ప్రపంచంలో కనిపించకుండా ఉన్నది - ఇలా ముక్కోణంలో తెలిసే ప్రపంచానికి సంబంధించిన అవగాహన ఏర్పడనంత వరకు ప్రపంచంలో మనకు ఘర్షణ తప్పదు.

1. ప్రపంచంలో ఉన్నది:-

ప్రపంచంలో ఏముంది? ఎవరున్నారు? కుండలో ఏముంది? మట్టే ఉంది. ప్రపంచంలో ఉండే దెవరు? పరమాత్మే. ఇది సత్యం. పారమార్థిక సత్యం. జ్ఞానుల బుద్ధిలో వెలిగే సత్యదీపం.

2. ప్రపంచంలో కనిపిస్తూ ఉన్నది :-

అంతా దోషంగానే కనిపిస్తూ ఉంది. ఎవరిని చూచినా దోషమే. ఏది చూచినా దోషమే. ఏది ఎలా ఉంది? ఎవరెలా ఉన్నారు? అనేది మనకు కావాలి. 'కావాలి' అంటే, నేను అనుకున్న రీతిలో ఉండటం కావాలి అని అర్థము. అలా ఎవరూ ఉండరు, ఉండలేరు కనుక మనకు ఎవరూ నచ్చరు.

3. ప్రపంచంలో కనిపించకుండా ఉన్నది:-

ప్రతి మనిషిలో కొద్దో గొప్పో మంచి ఉంది; ధర్మం ఉంది; దానం ఉంది; త్యాగం ఉంది; ప్రేమ ఉంది. మనం ఆశించిన మోతాదులో ఉండకపోవచ్చు. ఉండవలసినంత ఉంది. అయినా ఇతరుల విషయంలో ఆశించటానికి మన పాత్ర ఏమిటి? ప్రవేశం ఏపాటిది? ఇది అర్థం కాకపోవటంచేత ఉన్న మంచి కూడా మన బుద్ధికి పట్టకుండా ఉంది. దౌర్భాగ్యపు ప్రతిపక్షంలా భీష్మించుకుంటోంది.

ఇతరులలో ఉన్న మంచిని, సౌజన్యాన్ని అవలోకించటం సాధకులమైన మనం అలవరచుకోవాలి. చెడును, దౌర్జన్యాన్ని దర్శించి సాధించేదేమీ ఉండదు కనుక ఆ అలవాటును త్యజించాలి.

"స్వామిజీ! చెడునే చూడటం చాలా కాలంగా అలవాటైపోయింది. ఉన్నపళంగా మారిపోవాలంటే సాధ్యపడే విషయమేనా? మార్పు అంత సులభమా? * **"మారిన దెవరు? మార్చేదెవరు? మార్పు మనిషికి సాధ్యమా! మనసా!"** అని పాడింది కూడా మీరే కదా?"

---

* (ఇది పూజ్య స్వామీజీ చైతన్యగానం-4 క్యాసెట్‌లో పాడిన పాట)

అవును. మార్పు కష్టమే. చెడును అదేపనిగా దర్శించే మహానుభావుల్ని చెడును దర్శించవద్దని నేను చెప్పటం లేదు. అలవాట్లు తేలికగా మారవని నాకు బాగాతెలుసు. చెడునే చూడండి. ఫరవాలేదు. కాకపోతే, ఇతరులలో చూడటం కాకుండా మనలో ఏ చెడుందో భూతద్దం ఉపయోగించి మరీ చూడండి అంటున్నాను.

ప్రయోజనం ఏమిటి? ఎంతో ఉంది. ఇతరులలో చెడు ఉందో, లేదో అది వేరే విషయం. వారిలో చెడును దర్శించటం వల్ల మనకు ఒరిగేదేమీ లేదు. చెడును చూచే సమయంలో మన మనస్సులో చెడు మాత్రమే ఉంది అనే సత్యాన్ని మనం మరచి పోకూడదు. మనస్సులో అలా క్షణక్షణానికి ప్రవేశిస్తున్న చెడును చెడిపేసు కోవాలంటే జన్మలే సరిపోవు అనే సత్యాన్ని కూడా మనం బుద్ధికి పట్టించాలి.

అలా గాకుండా, చెడునే దర్శించే అలవాటున్న పుణ్యానికి ఆ చూచేదేదో మనలోనే చూసుకుంటే, కొంత కాలానికి మనలోని చెడు ఏదైనా ఉంటే అది తప్పకుండా చెడిపోతుందని మాత్రం నేను ఢంకాబ్రమోగించి చెప్పగలను.

మనలోని మంచిని, ఇతరులలోని చెడును మాత్రమే దర్శించి అధిక ప్రసంగం చేయటం అలవరచుకొంటే, కొంత కాలానికి మనలోని మంచి మంచులా కరిగిపోవటమే గాక, మవలోని చెడు గుట్టలుగా పేరుకుపోయే అవకాశముంది. ఇది అక్షర సత్యం.

కట్టెలోని అగ్ని కట్టెనే దహింప చేస్తుంది. ఎవరిలో చెడున్నా, అది ఉన్నవారికే కీడు. అనవసరంగా దానిని గూర్చి చర్చించి, ఆ చెత్తను నెత్తి కెత్తుకుంటే గుండెకు భారమే కాని బుద్ధి తేలికపడదు.

ఇతరులలో అసుర గుణాలు ఉంటే ఉండనివ్వండి. వారిలో దైవ గుణాలు కూడా ఉంటాయి. వెతికితే కనిపిస్తాయి. దైవ గుణాలను దర్శించట మంటే దైవాన్ని దర్శించటమే అని అర్థము. దైవాన్ని దర్శించే బుద్ధిలో దైవమే ఉంటుంది. దైవం కొలువైయున్న బుద్ధి దేవాలయంగా భాసిస్తుంది.

మంచిని చూస్తూ, మంచిని వింటూ, మంచిని యోచిస్తూ, మంచిని పలుకుతూ, మంచిగా జీవిస్తూ బ్రతుకును గుడిగా తీర్చుకుందామా? లేక, చెడును చూస్తూ, చెడును వింటూ, చెడును ఆలోచిస్తూ, చెడును మాట్లాడుతూ, చెడుగా జీవిస్తూ బ్రతుకును దెయ్యాల కొంపగా మార్చుకుందామా?

ఈ ప్రశ్నలకు ఎవరికి వారే సమాధానం చెప్పుకోవాలి. ఇవి శేషప్రశ్నలుగా మిగలకూడదు. నిర్విశేష వైభవం వైపుకు నడిపించే మార్గగాములు కావాలి. **అస్తు.**

పట్టువిడుపులు

జీవితము గొప్ప పరిశోధనా కేంద్రము. సాధకుడు పరిశోధకుడు లేదా శాస్త్రజ్ఞుడు, సాధనే పరిశోధన.

పరిశ్రమయే పరిశోధనకు పునాది.

ఘనకార్యములన్నీ పట్టుదలతోనే సాధించబడ్డాయి. ఆధ్యాత్మిక సాధకులు పట్టు దల గలవారై యుండాలి. పట్టుబట్టి సాధించగలవారై యుండాలి. ఇక్కడే కార్యకర్తలు మూడు విధాలుగా విభజింపబడుతారు.

ప్రారభ్యతే న ఖలు విఘ్న భయేన నీచైః
ప్రారభ్య విఘ్న విహతా విరమన్తి మధ్యాః
విఘ్నైః పునః పునరపి ప్రతిహన్య మానాః
ప్రారబ్ధ ముత్తమగుణా న పరిత్యజన్తి!!

ఆటంకము లెదురౌతాయని అధములు అసలు కార్యములనే ఆరంభించరు. మధ్యము లైనవారు కార్యములను ప్రారంభిస్తారు, కానీ ఆటంకములు రాగానే విరమిస్తారు. ఉత్తము లైనవారు కార్యమును చేపట్టి ఎన్ని అడ్డంకులు, అవాంతరములు ఎదురైనను పట్టుదలతో సాధిస్తారు.

సాధకులు ఉత్తములై యుండాలి. అప్పుడే పట్టుదలతో సాధించగలరు. పట్టుదల ఉండాలి. కానీ అది ఉడుముపట్టులా మూర్ఖంగా ఉండకూడదు. పట్టువిడుపులు తెలిసి జీవించువారే అజ్ఞాన పట్టునుండి విడిపడి తరిస్తారు.

భగవంతుని విషయంలో పట్టుదలతో చరించు సాధకుడు మనస్సుపై పట్టును కలిగియుండాలి. నీవు మనస్సును పట్టుకోవాలి అంటే ఇంతవరకు తాను పట్టుకొని యున్న వాటిని మనసు వదలగలగాలి.

ఆలయానికి మనం వెళ్ళగలం. కానీ అర్చించే మనసు మనతో కూడా రావాలి. అప్పుడే ఆలయానికి వెళ్ళిన ఫలం దక్కుతుంది.

ఆశ్రమానికి మనం పోవచ్చు. గురువును సమీపించవచ్చు. ఆరాధనా భావం లేనపుడు, ఆశ్రయస్థానం మరొకటైనపుడు ఆశ్రమాలు కూడా శ్రమలనే పంచుతాయి.

కాశికి వెళ్ళడం మంచిదే. కానీ చంకన పిల్లి ఉండటం మంచిదిగాదు. కాశికి వెళ్ళడానికి పిల్లి అంతరాయం కాదు. కానీ విశ్వనాథుని వీక్షించుటకు అవరోధం.

కొందరు ఉత్సాహంతో తీర్థక్షేత్రాలకు వెళ్తారు. నిరుత్సాహంతో తిరిగి వస్తారు. మరికొందరు ఉరకలేస్తూ ఆశ్రమాలకు పరుగులెత్తుతారు. నిస్పృహతో నిష్క్రమిస్తూ ఉంటారు.

నిష్క్రమణలో నిరవధిక సుఖం లభించాలంటే ప్రవేశము పవిత్రంగా ఉండాలి. ఉన్నట్లే అనిపిస్తుంది. పరిశోధనలలో నిజానిజాలు గోచరిస్తాయి. కనుకనే సాధకుడు పరిశోధకుడై ఉండాలి.

ప్రవేశ సమయాన మనస్సు పట్టుకొన్నవాటిని విడిపించుకోవాలి. ఆ విడుపులోనే నిజమైన పట్టు దొరుకుతుంది. పట్టు దొరికితే బ్రతుకు గట్టున పడ్డట్లే.

పవిత్ర స్థలాలకు వెళ్ళేటప్పుడు అహంకారాన్ని, దర్పాన్ని, స్వార్థాన్ని త్యజించి వెళ్ళాలి. నమ్రతను, అవగాహనను, త్యాగాన్ని నింపుకొని వెళ్ళాలి. రాజు సింహాసనము పైనే ఆసీను డౌతాడు. భగవంతుడు పవిత్ర హృదయంలోనే వసిస్తాడు. బాహ్యంలో ఏదో సాధించాలనే తపనకన్నా తనను తాను శోధించి, నిజానిజాలను వీక్షించగలిగిన వారే సాధకులవుతారు.

దాహం ఉన్నవారు వాంఛించేది నీటినే. సాధకులైనవారు ఆశించేది పరమాత్మనే. అన్యమైన వాటిని ఆశించే మనసుకు భగవంతుని అవసరం ఉన్నదా? ఆలోచించండి.

మచ్చిక తెలియని పిచ్చి మనసు పచ్చి కురుపులాంటిది. సూదులతో గ్రుచ్చి నట్లే ఉంటుంది ఆ బాధ. ప్రేమ అనే ఔషధముతో ఈ వ్రణమును నయం చేసుకోవాలి. అప్పుడే మనిషికి ఊరట లభిస్తుంది. మనుగడకు స్ఫూర్తి ప్రాప్తిస్తుంది.

ఇతరులు ఎలా ఉండాలని భావిస్తున్నామో మనం అలా ఉన్నామా?

నీవు సుఖపడు. కానీ ఆ సుఖం ఇతరులకు కూడా ఉండాలని యోచించావా?

నీ దుఃఖాన్ని ఇతరులు పంచుకోవాలి. మరి వారి దుఃఖాన్ని నీవు పంచుకోగలవా?

నీ నుండి ఏది కదుల్తుందో అదే నీకు కలుగుతుంది. పట్టుదలతో జీవించాలి. పట్టువిడుపులు తెలిసి తరించాలి.

ఎదురు చూచేవాడు నరుడు.
యెదను చూచేవాడు నారాయణుడు.

కళ్ళు కాయలు కాయటం ముఖ్యం కాదు
పుణ్యం పండటమే ప్రధానం.

వంక లెన్నున్నా
జంకు లేకుండా
భక్తి తీర్థంలో గ్రుంకు లిడువారికి
ముక్తి ముందు నిలుస్తుంది.
ముకుందుడు ముందుండి నడిపిస్తాడు.

బుద్ధి దీపం

సముద్రుడు రత్నగర్భుడు అని తెలిసి నదులు సాగరమువైపు పరుగులు తీస్తున్నాయి. ఇది జ్ఞానము. జ్ఞానస్ఫూర్తితో కర్మలు శోభాయమానంగా ప్రకాశిస్తాయి. అందుకే, నదులు కునుకు తీయవు. విశ్రాంతి నెరుగవు. అలసట వాటికి అర్థం కాదు. వేగము అహర్నిశలు ఒకేలా ఉంటుంది. కనుకనే బాహ్యానికి స్వచ్ఛంగా కనిపిస్తాయి. ఆంతర్యంలో చల్లగా ఉంటాయి.

ముముక్షువు కూడా పద్మనాభుని జ్ఞాన వైభవమును గుర్తించి జీవించాలి. అప్పుడే తన ఆచరణము అద్భుతంగా శోభిస్తుంది. అలసటలు, అశక్తతలు, ఆవేదనలు అదృశ్య మవుతాయి. సదా వెలితి తెలియని వెలుగులో ప్రకాశించే భాగ్యము సిద్ధిస్తుంది. బాహ్యములో వికాసము, ఆంతర్యములో విజ్ఞానము తొణికిసలాడుతూ ఉంటాయి.

జ్ఞానకర్మలను ముముక్షువు విభజించలేడు. భక్తి అనే త్రాడుతో వాటిని ఒకటిగ చేర్చి చరించడం అలవరచుకోవాలి. హృదయంలో జ్ఞానస్ఫూర్తి ఉద్దీప్త మైనపుడు ఆ వెలుగులో కర్మలను ఆరబోసుకొంటూ పోవాలి. అలాగే మనసును కర్మస్ఫూర్తి ప్రేరేపించ గనే ఆ బాటలో జ్ఞానమును వెలిగించుకుంటూ సాగాలి. ఇవి పరస్పరము ఏకమై నడుస్తూ ఉండాలి. అన్యోన్యాశ్రయత్వంతో ప్రకాశిస్తూ పోవాలి.

నీటిలో ఈదే నావలమీద ఒకొక్కసారి బండ్లను తెస్తూ ఉంటారు. అలాగే నేల మీద నడచే బండ్లమీద నావలను మోయిస్తూ ఉంటారు. అన్యోన్యాశ్రయత్వం జీవనా ధార మని మరచిపోకూడదు. అపవర్గ మార్గములో (మోక్ష మార్గములో) చరించే ముముక్షు వులు కూడా జ్ఞానకర్మలు అవిరోధములని మహాత్ములను అనుకరిస్తూ చిందులు వేయ కుండా, వాటి అన్యోన్యాశ్రయత్వమును సమన్వయ పరచుకొని సమచిత్తంతో వర్తించడం అలవరచుకోవాలి.

కర్మలలో జ్ఞానము కలిసినపుడు అహంకారము తలెత్తే అవకాశముండదు. జ్ఞాన రహిత కర్మలలో అహంకారమే ప్రధాన భూమికను పోషిస్తూ ఉంటుంది. క్షణక్షణానికి 'నేను' అనే అగ్నిశిఖలు లేస్తూనే ఉంటాయి. మనసును దహించివేస్తూనే ఉంటాయి.

నిరహంకారి తప్పు చేసినా సరిచేసుకోగలడు. సమాజము అతనిని అర్థం చేసుకొని సానుభూతి చూపుతుంది. పరమాత్మ క్షమించి మరొక అవకాశ మిస్తాడు. అహంకారికి తప్పు చేయడమే తెలుసు. సరిచేసుకోవడం అతనికి చేతకాదు; సరిచేయడం మరొకరికి కూడా సాధ్యం కాదు. కనుక అహంకారిని సమాజం ప్రేమించదు. పరమాత్మ క్షమించడు.

ముముక్షువులు నిరహంకారులై మెలగాలి. అట్టివారు పొరపాటున గాని, ప్రారబ్ధ వశాత్తు గాని దోషాలకు గురియైనా పతనం కారు. ప్రగతిని జారవిడుచుకోరు. సర్వులూ

వారిని గౌరవిస్తారే గాని గర్హించరు. పిల్లవాడు తప్పటడుగులు వేసి జారిపడినపుడు అతనిని ఎత్తుకొని ముద్దెట్టుకుంటారే గాని క్రిందపడినాడని నిందించరు. అహంకారము లేకపోవడమే పిల్లవాడు ప్రేమలు అందుకోవడం వెనుక దాగియున్న రహస్యము.

Spiritual work does not tire a person as selfish, worldly work does.

"ప్రాపంచిక కర్మలు మనిషిని అలసటకు గురిచేయునట్లు ఆధ్యాత్మిక కార్యాలు చేయవు" అన్నారు స్వామి వివేకానంద.

ఆధ్యాత్మిక సాధకులు తృప్తికి దూరం కారు. ఆనందానికి దూరం కారు. నిరహం కారతయే వారి ఔన్నత్యము. అట్టి ఉత్కృష్ట సాధకుల హృదయాలలో జ్ఞాన దీపమును ఉంచుతానని భగవంతుడు ప్రతిజ్ఞ చేశాడు.

తేషాం సతత యుక్తానాం భజతాం ప్రీతి పూర్వకమ్
దదామి బుద్ధియోగం తం యేన మా ముపయాన్తి తే

'నిరంతరము యోగముతో కూడి, ప్రీతితో నన్ను సేవించువారికి నన్ను పొందగల బుద్ధి యోగమును నేను ప్రసాదిస్తున్నాను' అని శ్రీకృష్ణ పరమాత్మ భగవద్గీత-విభూతి యోగంలో తెలిపారు.

చీకటిలో పయనించలేని బాటసారికి మరొక వ్యక్తి దీపాన్ని వెలిగించి ఇస్తాడు. ఆ దీపాన్ని వెంటపెట్టుకొని, పట్టుకొని బాటసారి వెళ్తాడు. అంతేగాని దీపాన్ని ఇచ్చినవాడు కూడా వెళ్ళనవసరం లేదు. గురువు గాని, గోవిందుడు గాని బుద్ధి దీపాన్ని వెలిగిస్తారు. ఆ తరువాత నడువవలసిన బాధ్యత, దీపం ఆరకుండా కాపాడుకోవలసిన భారము సాధకునిపైనే ఉంటుంది.

గురువు బుద్ధిలో వెలిగించిన దీపాన్ని పాడుచేసేది, ఆర్పివేసేది అహంకారమే. మారనిది సత్యము. అదియే ఆత్మ. మారేది ఏదయినా అసత్యమే. అనిత్యమే. అహం కారము పరిణామశీలము. కనుక అనిత్యము. అనిత్యమైన అహంకార వాయువుచేత జ్ఞానదీపం ఆరకుండా చూసుకోవాలి.

'నా మాట వాళ్ళు వినడం లేదు. వీళ్ళు వినడం లేదు' అని అహంకారి ఊగిపోతూ ఉంటాడు. ఓ పిచ్చి అహంకారీ! నేను సూటిగ ఒక ప్రశ్న అడుగుతాను. ఇంతకీ, నీ మనసు నీ మాట వింటోందా? ఇంట గెలిచి రచ్చ గెలువు. లోన ఊగులాడుతూ బయట ఊరేగడం సాధ్యమయ్యే పని కాదు. మన మనసే మన మాట విననపుడు ఎవరో మన మాట ఎందుకు వింటారు? అది కూడా గాక, వాళ్ళకి మనకుమల్లే మనసుంది. నీవు నీ మనసుకు ఎలా లొంగి యున్నావో, వాళ్ళు వారి మనసులకు దాసులై యున్నారు. వారి మనసిచ్చే ఆజ్ఞలను వారు పాటిస్తారు గాని నీ మాటలు ఎందుకు వింటారు? శని

గొట్టే ఊహలకన్నా పనికొచ్చే ఆలోచనలు చేయడం అలవరచుకోవాలి. అప్పుడే జీవితం ప్రశాంతంగా సాగుతుంది.

సత్యమేవ జయతే అని ధర్మజ్ఞులే పలుకగలరు. సత్యసంధులే పలుకగలరు. ఎందుకంటే అది వారికే అనుభవ రూపంగా ఉంది. సత్యస్వరూపము వారికే అనుభూతిగా ఉంది.

శ్రమ ఏవ జయతే అని పలకడానికి సత్యసంధులు, ధర్మజ్ఞులు అవసరం లేదు. దొంగలు, దగాకోరులు సరిపోతారు. దొంగతనాలు, మోసాలు వారు శ్రమతోనే సాధించారు. అవి వారికి అనుభవ రూపాలు.

నినాదాలన్నీ సునాదాలు కావు. పనులన్నీ పూజలు కాలేవు. కర్మలన్నీ అర్చనలు కావాలంటే అది జ్ఞానంతోనే సాధ్యం. ప్రేమతోనే సాధ్యం.

ముముక్షువులారా! మనందరము శ్రమించి అజ్ఞానచీకట్లు ముసురుకున్న ప్రపంచాన్ని చుట్టూ తయారు చేసుకున్నాం. ఇల్లు చక్కదిద్దే పని మనమీదే ఉంది. దీపాన్ని వెలిగించుకోవలసిన బాధ్యత మన పైనే ఉంది. ఇదంతా జ్ఞాన సముపార్జనలోనే సాధ్యమవుతుంది. అహంకారము లేకుండా ఈశ్వరార్పణ బుద్ధితో కర్మలను ఆచరించుటలోనే సిద్ధిస్తుంది.

కూలబడేది మన కృషి
కూర్చోబెట్టేది అతని కృప.

ఏడుపు మనది.
వేడుక అతనిది.

ఆగ్రహాలు, నిగ్రహాలు మనవి
అనుగ్రహాలన్నీ అతనివి.

మనసు మనది
మహిమ అతనిది.

భక్తి బరువుల్ని లెక్కచేయదు.
బాధల్ని పట్టించుకోదు.

పూర్ణభక్తిలో వెలితి ఉండదు.
పూర్ణజ్ఞానంలో వెలుగు చెదరదు.

ప్రేమకు భారం తెలియదు

నూనె తలకు రాసుకొని సీసాకు మూతపెట్టడం మరచిపోతూ ఉంటారు కొందరు. స్నానాలగదికి వెళ్ళేముందు లైట్ వేసుకొని, తిరిగి వచ్చిన తరువాత స్విచ్ ఆఫ్ చేయటం మరచిపోతారు మరికొందరు. ఇక, కళ్ళజోళ్ళు మరిచిపోయేవారు, చేతిగుడ్డలు పడేసుకొనే వారు అయితే లెక్కకు అందని సంఖ్యలో ఉంటారు.

రోజూ ఇలా జరుగుతూ ఉండినా, అప్పటికి అదే క్రొత్త అన్నట్లు ఉంటుంది. ఇది అలవాటు సృష్టించిన దుస్థితియో, లేదా అయోమయం కల్పించిన పరిస్థితియో అనేది వేరే విషయం. కాని, మనకే నచ్చని ఈ విషయం నుండి విడిపడటానికి చాలాకాలం పడుతుంది.

సామాన్య విషయాలే ఇలా ఉన్నాయి. ఒక్క క్షణాన ఎవరో వచ్చి **"తత్త్వమసి"** నీవే బ్రహ్మము అనగానే జీవత్వము జారిపోతుందా? ఆంతర్యం నుండి పారిపోతుందా? ఇదేమన్నా గారడివిద్యనా? చాలాకాలం ఒక గాడిలో పడి ప్రయాణం చేస్తేగాని భ్రమ తొలగదు. ప్రమ కలగదు. బహుకాల సంస్కారాలు బహుకాల సాధనల వల్లనే పోతాయి.

నీవు బ్రహ్మమే. ప్రతిబంధకాలు ఎవరివి? నీవు సృష్టించుకున్నవే. వాటిని అలాగే ఉంచుకొని, బ్రహ్మంగా ఊరేగాలంటే సాధ్యమా? ఆలోచన ఒక్కటే సరిపోదు. ఆచరణ కూడా ఉండాలి. బహిరంగ సాధనతో పాటు అంతరంగ సాధన కూడా సాగుతూ ఉండాలి.

"నాకు అంతా తెలుస్తూనే ఉంది. శాస్త్రం అర్థం అవుతూనే ఉంది. కాని మనస్సు భగవంతుని మీద క్షణం నిలవటం లేదు. ప్రతిక్షణం పరుగులే" ఇవీ ఫిర్యాదులు.

మనస్సు పరుగు లెత్తుతూ ఉంది అనేది వాస్తవమే. కాని, మనస్సు భగవంతునికి దూరంగా పరుగు లెత్తుతూ ఉంది అనేది సత్యం కాదు. ఎంత దూరం పరుగు లెత్తినా మనస్సు చైతన్యానికి దూరంగా పరుగు లెత్తలేదు. చైతన్యం ఎవరో కాదు. భగవంతుడే. అనంతుడైన భగవంతునికి మనస్సు దూరంగా వెళ్ళలేదు అనే సత్యం వంటపడితేనే శాస్త్రం అర్థమయిందని నిశ్చయం.

ఇంత సుస్పష్టంగా, స్వచ్ఛంగా కనిపిస్తున్న సత్యం నిజ జీవితంలోకి, నిత్య జీవితం లోకి రావటం ఎంత దుర్లభంగా ఉందో చూశారా? పామరులు సరే, శాస్త్రాధ్యయనం చేసిన పండితులూ అలాగే అంటున్నారు. సాధకులు అలాగే మాట్లాడుతున్నారు. సన్యాసులు కూడా అలాగే ఆలోచిస్తున్నారు.

రోజూ అలవాటుగా మరచిపోయే విషయాల్లాగా, పరమాత్మను స్మరిస్తూనే ఉన్నాం. విస్మరిస్తూనే ఉన్నాం. అనాదిగా అంటిపెట్టుకొని వస్తున్న అనాచారాలు క్షణాల్లో పండుటాకులు రాలినట్లు రాలవు. దూది ముక్కల్లా దురదృష్టాలు గాలిలోకి ఎగిరిపోవు.

క్షణక్షణాన్ని వినియోగించుకోవాలి. ప్రతి క్షణాన్ని పవిత్రంగా కాపాడుకోవాలి. బాహ్యంలో ఏది జరుగుతున్నా ఆంతర్యంలో స్మరణ సాగుతూ ఉండాలి. ఇష్టాయిష్టాలను ప్రక్కన పెట్టాలి. ధర్మాధర్మాలను అర్థం చేసుకొంటూ నడక సాగించాలి. నీకు ఇష్టమైన దని అధర్మాన్ని చేయకూడదు. నీకు అయిష్టమని ధర్మాన్ని త్యజించకూడదు. యుద్ధం భయంకరమే. అయినా అందులో ధర్మం ప్రవేశించి ఉంది. అందుకనే "అర్జునా! యుద్ధానికి సిద్ధపడు" అన్నాడు శ్రీకృష్ణుడు.

యుద్ధం కురుక్షేత్రానికే పరిమితం కాదు. అర్జునుడికే సంబంధించింది కాదు. జీవికి జీవన సమరం తప్పదు. అనివార్యాలను తొలగించలేము. అవగాహనను చిగురింప చేసుకోవాలి. సమరం బాహ్యంలో సాగుతూనే ఉండాలి. సాధన ఆంతర్యంలో కొన సాగుతూనే ఉండాలి.

తస్మాత్ సర్వేషు కాలేషు మా మనుస్మర యుధ్యచ

"సదా నన్నే స్మరిస్తూ యుద్ధం చెయ్యి" అని అద్భుతమైన పవిత్ర సాధనను గీతలో తెలిపాడు పరమాత్మ.

ఆత్మబంధువులారా! ఆలకించింది చాలు అని నేను అనను. ఆలపించేవాళ్ళం బ్రతికే ఉన్నాం. ఆలకించకుండా మీరు ఎలా ఉంటారు? ఆలకిస్తూ ఆచరిద్దాం. ఆచరిస్తూ ఆలకిద్దాం. ఇదే మన తక్షణ కర్తవ్యం.

సాధనలన్నీ పవిత్రములే. అవన్నీ జ్ఞానానికి సంబంధించినవి. ఒంటరిగా ఉంటే, లేదా సమయం దొరికితే ధ్యానం చేద్దాం. కీర్తన సాగిద్దాం. లేదా, పరమాత్మను గురించి ఆలోచిద్దాం.

ఇతరులను కలిస్తే భగవద్విషయాలు ముచ్చటించుకుందాం. భగవత్సేవలో నిమగ్న మవుదాం. సాధనలు బరువుల్ని దించుతాయి. సాధనను ఒక బరువుగా, బాధగా సాగించకండి. సాధన ప్రేమకార్యం. **ప్రేమైవ కార్యం.**

సాధనలో ప్రయత్న ముంది అని భావించినంత వరకు సాధన జరగదు. సాధనలో ప్రేమ ఉంది, స్వాత్మానుభూతి ఉంది అనే సత్యం అర్థమైతే, అనుక్షణం సాధనే శ్వాసగా మారుతుంది. ఆశగా మారుతుంది.

అద్దం చూసుకోవాలంటే అందరికీ హాయిగానే ఉంటుంది. అదీ పని అనిపిస్తూ ఉందా? భారంగా ఉందా? ఆనందంగా ఉంది. ఎందుకని? అద్దం నీకు ఎవరినో చూపించటం లేదు; నిన్నే నీకు చూపెడుతూ ఉంది.

సాధన కూడా అంతే. సాధనలో నీకు గోచరించే దెవరు? నీ ధ్యానంలోని మూర్తి ఎవరిది? ఎవరిదీ కాదు. అవును. అందుకే అది పరమాత్మది. నీ పూజల్లోని మంగళమూర్తి ఎవరు? నీవు కీర్తించే నామం ఎవరిది? నీ కళ్ళముందున్న ప్రపంచంలో పాలలో వెన్నలా ఎవరున్నారు? ఇంకెవరు? వెన్నముద్దల కృష్ణుడే!

కృష్ణుణ్ణి దర్శించటం పని అవుతుందా? ప్రేమ అవుతుందా? కృష్ణునితో భాషించటం తలభారమా? కలిసి తిరగటం కష్టమా? ప్రేమ ఎప్పుడూ బాధించదు. బాధించేది ఎన్నడూ ప్రేమ కాలేదు.

సాధన ప్రేమ. సాధ్యము ప్రేమ. సాధకుడు ప్రేమ. కనుక ప్రేమే భక్తి. ప్రేమ లోనే ఉంది భక్తి. అదే పరాభక్తి. కనుకనే, అర్జునా! నా భక్తుడివికా! **(మద్భక్తో భవ!)** అని భగవద్గీతలో రెండుసార్లు చెప్పాడు పరమాత్మ. భగవద్గీత పూర్వార్థాన్ని సమాప్తి చేస్తూ తొమ్మిదవ అధ్యాయంలో ఒకసారి చెప్పాడు. ఉత్తరార్థంలో గీతని సమాప్తి చేస్తూ పద్దెనిమిదవ అధ్యాయంలో మరొకసారి చెప్పాడు. పునఃపునః చెప్పాడంటే దాని ప్రాశస్త్యము, ప్రభావము ఎలాంటిదో అర్థం చేసుకొని, "భగవాన్! నీ మాటనే వింటాం. ఈ క్షణం నుండి నీ బాటలోనే పయనిస్తాం!" **(కరిష్యే వచనం తవ)** అని అందరము ఈ అందమైన వాక్యాన్ని అర్జునుడు పలికినట్లు పలుకుదాం!

ఓం.....ఓం........ఓం..........

భగవాన్!
అందరూ పాపాల పుట్టలే.
దోషాల కట్టలే.
మోసాల గుట్టలే.
మోహాల బుట్టలే.

మావన్నీ పాపాలే.
మేమందరము నీ పాపలే.

దీపంలో వత్తి వేసి వెలిగించకపోయినా,
కళ్ళల్లో వత్తు లేసుకొని ఎదురుచూస్తున్నాం.

పాపాలు పట్టించుకోకు.
పాపలను నెట్టేయకు
కనుపాపవై గుట్టుగా మాలో నిలిచిపో.
రమణీయంగా మాలో వెలిగిపో!

మేను ప్రపంచానికి - మనస్సు పరమాత్మకి

అవసరాలు పెరుగుతూ తరుగుతూ ఉంటే, వాటితోపాటు పాపపుణ్యాలు, శోక హర్షాలు కూడా పెరుగుతూ తరుగుతూ ఉంటాయి. అవసరాలను ఎంతగా తగ్గించు కుంటూ ఉంటే సుఖం అంతగా పెరుగుతూ ఉంటుంది.

అయితే, కొన్ని అవసరాలు, అలవాట్లు సమాజపరంగా చూచినపుడు అనివార్యం అనిపిస్తాయి. కానీ వాటి వెనుక మ్రింగుడు పడని కొన్ని చేదు అనుభవాలు కూడా దాగి ఉన్నాయనే సత్యాన్ని మరువలేము.

సమాజపరంగా ఏదో కొంత ప్రగతి సాధింపబడుతుంది కదా అని రాజీపడి జీవించ డానికి ప్రయత్నిస్తే, తద్వారా ఏర్పడే పరిణామాలు వ్యక్తి శాంతినే భగ్నం చేస్తాయి. ఎంతో స్ఫూర్తితో నీవు పరుగు లెత్తుతున్నా అవగాహన కొరవడిన అహంకార పూరిత దుర్బల సమాజం అడుగడుగుకీ నీవు కదలలేని మడుగులను సృష్టిస్తుంది. నీ సాధనను వక్రింపచేస్తుంది.

వస్తువుల్ని, విషయాల్ని చూచేవారు మానవులు. భావాన్ని చూచేవాడు భగవంతుడు. సాధన పవిత్రమైంది. పవిత్రతకు, త్యాగానికి, ప్రేమకు అర్థం తెలియని ప్రపంచంలో సాధకుడు ఏనాడైనా ఒంటరివాడే.

ఈ విషయాన్ని కేవలం సాధకుల కొరకే వ్రాస్తున్నాను. అర్థం చేసుకోవడంలో వేగాన్ని తగ్గించుకోవడం శ్రేయస్కరమని భావిస్తున్నాను.

ఏ వ్యవస్థలోనైనా వ్యవహారాన్ని దూరంగా ఉంచలేము. వ్యవహారాన్ని పరిశుద్ధంగా, పవిత్రంగా ఉంచుకోగలిగితే భక్తి చిగురిస్తుంది. దంభము, అహంకారము చోటు చేసు కున్న వ్యవహారంలో భక్తి క్షీణిస్తుంది. వ్యవహారం అపరిశుద్ధ మవుతుంది. ఇదంతా పరిశీలిస్తేనే తెలుస్తుంది. కానీ, వీటి వెనుక జీవితం అడుగంటి పోతూ ఉంది అనే సత్యం మాత్రం ఎవరికీ అంతుపట్టదు.

సాధన అభ్యాసంలో లేనివారు ఏదో తెలిసిపోయినట్లు గాలికి ఊగే అవిశ చెట్టు లాగా అహంకారంతో లోలోన ఊగిపోతూ ఉంటారు. అనుభవం లేని వ్యక్తులు తమ పరిమిత మనోపాత్రతో ప్రపంచాన్ని కొలవబోతే వారికి ఏది అందినా అది వారి మనసే అయి ఉంటుంది.

సాధకా! సాగిపో!

ఈ ప్రపంచంలో లభించే ప్రేమలలో అల్పాధిక భేదములతో స్వార్థమే ఉంది. స్వచ్ఛమైన ప్రేమలు, సేవలు కుందేటి కొమ్ములై భాసిస్తున్నాయి. ఈ పవిత్ర సనాతన ధర్మ సంస్కృతిలో భార్యాభర్తలమధ్య, స్వామి భృత్యుల మధ్య, స్నేహితుల మధ్య, గురుశిష్యుల మధ్య, బంధువుల మధ్య, ఇరుగుపొరుగు మధ్య గతంలో దివ్యంగా శోభించిన

పవిత్ర బాంధవ్యాలు నేడు కాగడాలు పెట్టి వెతికినా కనిపించడం లేదు. అహంకార తెడ్డు కదిలించే విచిత్ర చలనాలు జీవన నౌకను ఎటువైపు నడిపిస్తాయో అంతర్ముఖులైన వారికే అవగతం కావడం లేదు.

సాధకా!

నీ దారిన నీవు సాగిపో! మనశ్శాంతిని భగ్నం చేసే విషయాలను, వ్యక్తులను మనసులో మరుగవనీ. నీకు, పరమాత్మకు మధ్య నిలిచేవా రెవరైనా నీవు మరచిపోవలసిన వారే.

ఉదార స్వభావుడు, ఆధార స్వరూపుడు పరమాత్మ ఒక్కడే. నిన్ను గూర్చి బాగా తెలిసినవాడు. నీ బాగు తెలిసినవాడు. ఏదైనా సరే, పరమాత్మకే వినిపించు. శంఖము నీ వద్ద ఉండవచ్చు. చెవిటి ప్రపంచానికి వినిపించడానికి ఎంత ప్రాణ వాయువును ఖర్చు చేస్తావు?

సేవలను విస్మరించి, సాధనలోనే కొనసాగమని నేను సలహా నిస్తున్నట్లు భావించకు. అది కూడా దురవగాహనే అవుతుంది.

సేవలను వదలనవసరం లేదు. వాటి మధ్య సాధన వక్రించకుండా చూసుకోవాలి. నీళ్ళల్లో దిగడమా, దిగకపోవడమా అనే ఆలోచన ఈ దశలో లేదు. కాళ్ళు ఆడిస్తూ, చేతులు జాడిస్తూ తీరం చేరాలేగాని, కాళ్ళు కట్టేసుకొని, చేతులు పట్టేసుకొని మునిగిపోకూడదు అనేదే నేడు మన ముందున్న కర్తవ్యం.

బాధించే సమాజానికి సేవలు అందిస్తూ సాగిపో! బాధను నివారించే భగవంతునితో కలిసి జీవించు.

మేను ప్రపంచానికి, మనసు పరమాత్మకి.

జరిగేవి జరిగిపోతూ వుంటాయి. ప్రారబ్ధాలు ఆడించే తోలు బొమ్మలాటలో నీవు పాలు పంచుకోకు. కూటస్థుని హృదయంలో నింపుకొని తటస్థంగా ఉండిపో.

ఎవరు ఎలా ప్రవర్తించినా అదంతా భగవానుని సంకల్పమేనని సరిపెట్టుకో. నీవు సరిపడి వుంటావు. మనసును పురిపెట్టుకోకుండా హాయిగా, తృప్తిగా ఉంటావు.

నీ చుట్టూ చెత్త ఉంది. నీకు చిత్తముంది. దానిపైన ఉత్తమోత్తముడైన పరమాత్మ ఉన్నాడు.

ఆలోచించుకో. నీ చిత్తము చెత్తకా! చిద్రూపుడైన పరమాత్మకా?

చెత్తను చూడకు!

చిత్తమును చిత్తచోరునికి సమర్పించు; ఆ తరువాత,

అంతా చిద్విలాసమే, చిన్మయానందమే.

రెండు మాటలు

"అణకువ - అధికారం"

ఈ రెండు పదాలు అందరికీ తెలిసిన జంటపదాలు. వంటబట్టని ఈ జంట-బ్రతుకు పంటనే పాడుచేస్తుంది.

నే చెప్పేదే వినాలి. చేయాలి. ఇది **అధికారం.**

వారు చెప్పేదీ విందాం. వీలుంటే చేద్దాం. ఇది **అణకువ.**

"నా మాటే వేదం" అని వెర్రితనంతో విర్రవీగడం "అధికారం" పట్టించుకున్న పైత్యం. "సునాదం సర్వులకు సొత్తు" అని సౌజన్యంతో సరళంగా ప్రేమించడం "అణకువ" అలవరచుకున్న సుగుణం.

అధికారం చలాయించడం అందరికీ ఇష్టం. అణకువతో జీవించడం కొందరికి కష్టం. చెప్పాలనే దురదే గాని వినాలనే సరదా ఉండదు.

మొదట విధేయత నేర్చుకోవాలి. వినయంతో వినడం అలవరచుకోవాలి. ఆ తరువాత ఆదేశించే హక్కు దానంతటదే వస్తుంది.

సేవకచిత్తంతో జీవించువాడు ప్రభుబుద్ధిని సంతరించుకుంటాడు.

"ప్రభుజీ తుమ్ స్వామీ హమ్ దాసా"

"ప్రభూ! నీవు స్వామివి. నేను దాసుణ్ణి" అంటాడు రైదాసు.

ఆజ్ఞలిచ్చేవాడు ప్రభువు. ఆచరించేవాడు సేవకుడు.

ఈ భావంతో భక్తుడు భగవంతుని సమీపిస్తాడు. ఆ తరువాత భక్తుడు సంకల్పించినదంతా పరమాత్మ చేసిపెట్టూ పోతాడు.

విధేయతలో, ప్రేమలో, భక్తిలో అంత శక్తి ఉంది.

భార్య భర్త చెప్పినట్లు విని భర్తను తృప్తిపరుస్తుంది. ఆ తరువాత భార్య ఎలా చెప్తే భర్త అలా చేస్తాడు.

గురువును తృప్తిపరచేలా శిష్యుడు జీవిస్తాడు. ఆ తరువాత శిష్యుని మాటను గురువు గుర్తిస్తాడు.

అధికారంతో వ్యక్తుల్ని లొంగదీసుకోవడం పశుత్వం.

ప్రేమతో వ్యక్తుల్ని లోబరచుకోవడం మానవత్వం. కాదు,...... దైవత్వం.

శిలలతో, కంటకాలతో కూడిన అధికార బాటలో వ్యక్తి సుఖించలేడు. విశాలాకాశంలో ఆటంకమెరుగని అణకువ మార్గంలో మనిషి ఆనందిస్తాడు.

ఇంకా బాగా తెలియాలంటే - ఇటు తిరగాలి.

మన అణకువను పాడుచేసిందెవరు? మన నమ్రతను కాలరాచిం దెవరు? ఎదుటి వాని అధికారం మన అణకువను పాడు చేస్తుంది. ఎదుటి వ్యక్తి దౌర్జన్యం మన సౌజన్యాన్ని మంట కలుపుతుంది, అనేదే కదూ నీ ఆలోచన!

ఈ ప్రపంచంలో ఎందరో జీవిస్తున్నారు. ఎవరి ఆటలు వారు ఆడుతున్నారు. ఆ వికారాల్ని చూసి మన ఆకారాల్ని ఎందుకు పోగొట్టుకోవాలి? విచిత్ర ప్రపంచంలో వికారాలు కూడా ఆకారాలే.

బహువికృతంగా కనిపించే దారుణమైన రూపాన్ని చిత్రకారుడు గీశాడు. అది చాలా భయంకరంగా ఉంది. ఉండనీ. ఏమైంది? అది బొమ్మని నీకు తెలుసు. అనిత్యమని తెలుసు. బొమ్మ దారుణంగా గోచరిస్తున్నా చిత్రకారుని కౌశల్యానికి మనం ముగ్ధులమవుతున్నామా? లేదా?

భావనాపటిమ ఉండాలేగాని భగవంతుడు బహువిధాలుగా గోచరిస్తాడు. భిన్న ప్రవృత్తులతో తైతక్కలాడే వ్యక్తులున్న ఈ లోకంలో అభిన్నుడైన అచ్యుతుని దర్శించే అలవాటు చేసుకోవాలి. దానికి అణకువయే రాజమార్గం. రాణించే మార్గం. రాజిల్లే మార్గం. విరాజిల్లే మార్గం.

భక్తి ఎన్నడూ ఓడిపోదు.
భక్తు డెన్నడూ ఓటమి నెరుగడు.

మేఘం వర్షించిన జలం భూమిని చేరుతుంది.
భక్తుని హృదయ ధ్యానం పరమాత్మను కదిలిస్తుంది.

రూపాలన్నీ తనవే
నామాలన్నీ అతనివే

భగవాన్!
నీ నామాలే నేను నేర్చిన ఓనమాలు
నీ రూపాలే నాకు తెలిసిన ఆనవాలు.

మతి ఇలా ఉందని నాకు తెలుసు.
గతి ఎలా ఉంటుందో నీకే తెలుసు.









జీవన శకటం

సాధన నిత్యప్రవాహం కావాలి. నిర్మల సజాతీయ వృత్తి ప్రవాహం కావాలి. సాధనల వలన భగవంతుని సాధిస్తాము అని కొందరు ఏదో ఏదో చేస్తూ ఉంటే; పరమాత్మ సచ్చిదానంద స్వరూపము అయినందున సాధనల ద్వారా పొందబడేవాడు కాడు కనుక ఏదీ చేయనవసరం లేదని మరి కొందరు చింతిస్తూ ఉంటారు. వీరిరువురికి అంతంతే తెలుసు.

సాధనలు మనల్ని పరమాత్మ వద్దకు తీసుకొని పోవని, సాధనలు బుద్ధిని శుద్ధి పరిస్తే, ఆ బుద్ధి పరమాత్మ మన వద్దకు చేరేందుకు అనువైన నిలయంగా మారుతుందని, అట్టి ఆలయంలాంటి అంతఃకరణలో బోధ అనే పవిత్ర కార్యం ద్వారా ఆచార్యుడు అనంతుని ప్రతిష్ఠిస్తాడని గ్రహించిన వారికే సత్యమార్గము సుపరిచితము.

ఏ మార్గంలో అడుగు పెట్టినా పయనించేందుకే. సాధన కూడా ప్రయాణమే. సాధకా! నీదీ ప్రయాణమే. నీవు అనుకున్న గమ్యంవైపు సాగుతున్నావో లేదో ఆలోచించుకో. ఇష్టమున్నా లేకపోయినా బండి గమ్యంలో ఆగిన క్షణాన కలిసి ప్రయాణం చేసిన వారిని విడిచిపెట్టక తప్పదు. ఈ సత్యాన్ని మనసులో సదా నింపుకో. మరపు రాకుండా చూసుకో. ఏ ప్రయాణికునితో కూడా అతిస్నేహం వద్దు. మితమే హితం. హితమే సముచితం. మనస్సు మోయలేనంత లగేజికూడా మంచిది కాదు.

మాదీ ప్రయాణమే. మా బోగీలో కూడా చాలామంది మాతో ప్రయాణం చేస్తున్నారు. మధ్యలో వచ్చే స్టేషనులలో కొందరు ఎక్కుతున్నారు. అలాగే కొందరు దిగిపోతున్నారు. బండి మాత్రం సాగుతూనే ఉంది.

మా శకట మొక పుష్పకము. ఎందరికైనా తావుంటుంది. ఎవరికైనా తావుంటుంది. అన్నీ లభిస్తాయి. కాని, రద్దీ ఎక్కువగా ఉంటుంది. చాలావరకు తగ్గిస్తున్నాం. నిఘా కూడా ఎక్కువైంది. దోపిడీలకు, దొంగతనాలకు కాలం చెల్లింది. ఒక మంచి కూడలిలో ఆగింది నేడు మన బండి. రద్దీగల కూడలి. కాలుష్యం ఎక్కువగా ఉంటుందేమోనని భావించాం. కాని పచ్చికలో నిలబడి హాయిగా చల్లని గాలిని పీల్చుకున్నంత సుఖంగా ఉంది.

తృప్తి - అసంతృప్తి ఈ రెండు విషయాలను శ్రద్ధతో అర్థం చేసుకొని జీవించటం అలవరచుకోవాలి. ధర్మంగా చరించాలని భావిస్తే సరిపోదు. అధర్మంగా చరిస్తే జీవితంలో ఏర్పడే ప్రమాద మేమిటో మనిషికి తెలిసి రావాలి. ఇది చాలా ముఖ్యమైన విషయం.

హంతకుణ్ణి కారాగారంలో బంధిస్తారు. అది అతనికి శిక్ష. అబద్ధాలు పలికే వాడికి శిక్ష ఏమిటి? అతని మాటల్ని సమాజంలో ఎవ్వరూ నమ్మరు. అంతకు మించిన శిక్ష మనిషికి ఏముంది?

మోసం చేసి ధనార్జన చేయొచ్చు. ప్రజల దృష్టిని ఆకర్షించే దుస్తుల్లో, భవంతులలో, వాహనాలలో కనిపించవచ్చు. కానీ చూచే వారి కళ్ళకు అవేవీ కనిపించవు. వీటన్నిటిలో మోసగాడు కులుకుతున్నాడు అనే చూస్తారు. ఇంతకు మించి మోసగానికి మరణ మేముంటుంది?

తృప్తి నివ్వలేని ధనమెందుకు? జీవిత మెందుకు? ఈ ప్రపంచం సృష్టి. ఇది చట్టాలతో నడుస్తూ ఉంది. పరమాత్మ చూపులు ప్రతి క్షణము అందరి మీద ఉన్నాయి. చేతులు కాల్చుకోవటానికి క్షణం చాలు. ఆ తరువాత బాధను రోజుల తరబడి అనుభవించాలి.

ఉన్నది సుఖాన్నివ్వదు. తృప్తిగా మనగలిగితేనే సుఖం. చేదు అనుభవాల మధ్య చిత్తం సుఖించలేదు. ఈనాడు మనమున్న స్థితిలో ఉండటానికి మనం అర్హులమా? ఇదంతా పరమాత్మ కృప.

ఉన్నదానితో తృప్తి పడి, తృప్తిగా జీవించగలిగితేనే మూన్నాళ్ళ జీవితం ముచ్చటగా ముగుస్తుంది. లేదా అలజడులతో, ఆవేదనలతో కుక్కలు చింపిన విస్తరైపోతుంది. ఇవే బ్రతుకులో శాపాలు.

అదుపు తప్పితే కుదుపు తప్పదు.
పొదుపు కుదిరితే చెడుపు ఉండదు.

మితమే ఎన్నడైనా హితం.
అతిలేని కార్యమే సముచితం.

చిన్నవి పెద్దవి చేసుకొని చిన్నబోయేకన్నా
పెద్దవి కూడా చిన్నవేననే పెద్దమనస్సుతో
వచ్చేవాటిని వలచక
రానివాటికి వగచక
వెన్నెలలాగ చల్లగా శోభించటమే సాధన.

దైవ బలం

భావాన్ని అందించేవాడు గురువు. స్వభావాన్ని మార్చుకోవలసినవాడు శిష్యుడు. భావాలు అందించడం గురువుల పని. స్వభావాలు మార్చుకోలేకపోతే అది శిష్యుల శని.

స్వభావాలు అంత సులభంగా, సత్వరంగా చక్కబడవు. అందుకే సత్కర్మానుష్ఠానము. గొప్ప గొప్ప పాపాలతో తయారైన సంస్కారాలు కొద్ది కొద్ది పుణ్యాలతో పోవు. కనుకనే ప్రతిక్షణము పుణ్యకార్యరతులై ఉండేందుకు సాధకులు యత్నించాలి.

పుణ్యకార్యాలు ఆచరించాలి అని ఉండినా, అట్టి భావానికి రూపమిచ్చే కార్య రంగం కూడా మనకు సిద్ధించాలి. ఒడ్డుకు చేరేవన్నీ నత్తగుల్లలే నన్నట్లు, 'సేవ' పేరుతో దాణా మేసే కూటాలలో చేరిపోతే, ఆ తరువాత 'పుట్టుక' లుంటాయేమో గాని గతులు మిగలవు. అడుగడుగుకీ గోతులే అడ్డుగా నిలుస్తాయి.

సత్కర్మల నాచరించి, పుణ్య ఫలము నార్జించి, అంతరంగమును శుద్ధి చేసుకొనేందుకు చక్కని కర్మరంగాన్ని సాధకుల కొరకు తయారుచేయుటకే మహాత్ములు, గురువులు పవిత్ర కార్యాలను నిర్వహిస్తారు.

ఉవ్వెత్తున పొంగి వచ్చిన వరద ప్రవాహము భూతలమును శుద్ధి చేసినట్లు, పెద్దలు రూపొందించే కార్యక్రమాలు వ్యక్తులలో కూరుకుపోయిన కశ్మలాలను, వ్యవస్థలో పేరుకుపోయిన కల్మషాలను దూరంగా పట్టుకొని పోతాయి. అలాంటి కార్యక్రమాలు సంప్రాప్తించినపుడు వాటిని అవగాహనతో ఉపయోగించుకొని పుణ్యాన్ని సంపాదించు కోవాలి. అంతేగాని, అక్కడ కూడా 'నా కోడి కూయడం వల్లనే తెల్లవారుతోంది' అని అహంకారాన్ని పెంచుకుంటే, పుణ్యం జారిపోవడమే గాక క్రొత్త పాపము వచ్చి చేరిపోతుంది.

జీవితము ఆషామాషీ కాదు. దానికి తీరమెక్కడో అర్థం కాదు. ప్రయాణమేమో అంతు లేనిది. ప్రయత్నమేమో సులభం కానిది. అసమర్థతలను, అశక్తతలను అలంకరించుకొని అవధి చేరలేము. పరమావధి చూడలేము.

ఓ బలహీనతల్లారా! మీరింకా బలహీనపడండి. ఓ బలమా! నీవు ఇంకా బలంగా మారాలి. దైవబలంగా తీరాలి. ఈ సమాజంలో దుర్జనులు సజ్జనులు కావాలి. సజ్జనులు సాధువులుగా మారాలి. సాధువులు సమదర్శన యోగులై శోభించాలి.

ఇదంతా మనం చూడాలి. కాని, దాని కొరకు మనము ఎంతో చేయాలి. రుచి చూడడానికి అందరూ సిద్ధమే. వంట చేసేందుకు కూడా సిద్ధం కావాలి. చేసేవారే చూడగలరు. సేవ చేసేవారే ఫలితాన్ని చూడగలరు. భక్తి చేసేవారే భగవంతుని చూడగలరు. పరమాత్మను వరించేవారే బ్రతుకులో తరించగలరు.

వాసుదేవుని వైభవమును దర్శించే పవిత్ర కార్యాలలో వ్యాపార సరళిని ఉపయోగ పెట్టకండి. వైభవ కార్యాలలో వైమనస్యాలు శాపాల్లా పరిణమిస్తాయి.

గతించిన దానిని రాత్రిలా మాసిపోనీ. వచ్చే దానిని ఉదయంలా ఊరేగనీ. లేచిన అల పడిపోవడం సహజం. భగవంతుని పవిత్రకార్యంలో పైకిలేచిన మనసులు పతనం కావడం అసంభవం. ప్రయత్నశీలురు ప్రగతికి దూరం కారు. మంచి తనంతో, మనిషి తనంతో మాధవసేవలో రమించాలి. ప్రేమతో, పవిత్రతతో పరమాత్మ కార్యాలలో చరించాలి. ఇది చాలు. అల్పబుద్ధుల్ని, అహంకారాన్ని ఆరు నెలలు దూరంగా ఉంచ గలిగితే, ఏ సాధకుడైనా అక్షయసంపదను అందుకుంటాడు.

తన అసమాన ప్రజ్ఞా ప్రవచనాలను చెవులప్పగించి వినేందుకు యావత్ప్రపంచము ఎదురు చూస్తున్నా, గోపబాలుర వచ్చీరాని మాటలను ఆలకించేందుకు ప్రేమతో, ఆసక్తితో నిరీక్షించిన శ్రీకృష్ణుడు మన కైవర్తకుడు. అతడు నడిపే నావకు ఎప్పుడూ తూటు పడదు. లోటు లేదు. ఆ నావ ఎప్పుడైనా ఉన్నతమైన త్రోవలోనే పయనిస్తుంది. ఇంకా ఆలోచన ఎందుకు?

ఎక్కాలనే ఉంది స్వామిజీ! కాని,

నో.....నో.....నో...... 'కాని' అనేది బ్రతుకు నావకు ఎన్నడూ కాదు చుక్కాని. ఎంత చేసినా 'ఇంకా కానీ....ఇంకా కానీ' అంటూ దూసుకుపోవాలే గాని, 'కాని' అని కామా పెట్టి ఆగకూడదు. 'కామ' పోతే బ్రతుకులో కామధేనువు లభించినట్లే.

ముకుంద నామముతో ముందుకు పోవడమే ఈనాడు మన ముందున్న కార్యము. వెన్నముద్దల వేణుగోపాలుడు మన కోసం వేచియున్నాడు. ముందుకెళ్తే నీ కొక ముద్ద. అది మామూలు వెన్నముద్ద కాదు. వెన్నుని అమృతహస్తముల నుండి నీవు అందుకో బోయేది వెన్నముద్ద కాదు; మోక్ష సుధ.

అన్నీ సరిపడగనే సాధన ప్రారంభిస్తాము అనుకోవటం సరియైన అవగాహన కాదు. ముందు ప్రారంభిస్తే మున్ముందు అన్నీ సరిపడతాయి. గుఱ్ఱం కదిల్తే చాలు, బండి తనంతటదే కదుల్తుంది. చేస్తేనే ఏదైనా చూసేది. రుచి చూడాలన్నా వంట చేస్తేనే. ఆచరణ లేని ఆలోచనలు జడత్వాన్ని పెంచుతాయి.

వివేక చంద్రిక

ఒకటి ఒకప్పుడు నీకు ఇష్టం కావచ్చు. మరొకప్పుడు అది ఇష్టం లేకపోవచ్చు. ఆ స్థానంలో వేరొకటి ఇష్ట మనిపించవచ్చు. కాని, నీకు నీవు ఎప్పుడూ ఇష్టం కాకుండా లేవు.

నీవు ఆశించేది అంతం కలిగినదైతే దానిని పొంది సాధించేదంటూ ఉండదు. ఒకవేళ అది అనంతమే అయితే అట్టి దానిని అర్థం చేసుకోవాలి లేదా గుర్తించాలి గాని పొందాలని ప్రయత్నిస్తే మాత్రం అది ఫలించే కోరిక కాకుండా మిగిలిపోతుంది.

సుఖం అనే వస్తువొకటి ఈ ప్రపంచంలో ఉన్నట్లయితే అందరూ ఆ వస్తువు వెనుకే పరుగులెత్తేవారు. ఒక్కొక్కరు ఒక్కొక్క వస్తువు వెంటపడి తిరుగుతున్నారంటే సుఖం వాటిలో లేదని చెప్పకనే తెలిసిపోతుంది.

ఈ ప్రపంచంలో సుఖాన్వేషులందరూ దుఃఖభాగులుగనే మిగిలిపోయారు. మిగిలి పోతున్నారు. శ్రమించి సుఖాన్ని పొందినా అది క్షణంలో పోతుంది. సుఖాన్నిచ్చే ఇష్ట వస్తువు దగ్గరే ఉండినా సుఖం కనిపించనంత దూరానికి జారిపోతూ ఉంది.

సుఖపడాలని ప్రయత్నించినంత వరకు నీవు సుఖపడలేవు. నీవే సుఖమని నీకు తెలిసినపుడే నీవు సుఖపడతావు.

ఇది పొందదగినది కాదు; తెలియదగినది. వివేకం లోపించటంచేత బ్రతుకంతా విడ్డూరంగా మారిపోతోంది. వివేకము లేని సాధనలు బ్రతుకులోని వికారాలను తొలగించలేవు.

సంసారమనేది భార్యాబిడ్డలతో తయారయ్యేది కాదు. వివేకం లేకపోవుటచేత సంసారము తయారవుతుంది. వివేకం లోపిస్తే సన్యాసులు కూడా సంసారులే. ఇదే భ్రాంతి లేక మాయ.

ఆత్మ సత్యము. జగత్తు మిథ్య. వివేకం లేనివారికి ఒకదాని లక్షణాలు మరొకదాని యందు ఆరోపించబడుతాయి. ఆత్మ లక్షణాలు జగత్తులో ఆరోపించబడుతాయి. అందుచేత ప్రపంచము సత్య మనిపిస్తుంది. ఇదియే జగత్సత్యత్వ భ్రాంతి. అంటే, ప్రపంచమే సత్యము అనెడి భ్రాంతి. అలాగే జగత్తు లక్షణాలు ఆత్మయందు ఆరోపించడము జరుగుతుంది. అపుడు తాను మార్పు చెందేవాడుగా, కర్తగా, భోక్తగా, నశించేవాడుగా తెలుస్తూ ఉంటాడు. ఇది జీవభ్రాంతి. ఇలా ఒకదాని లక్షణాలు మరొకదాని యందు ఆరోపించటమే అన్యోన్యాధ్యాస(**Mutual super- imposition**)

ఎక్కువ మంది ముముక్షువులలో నేడు లేనిది వివేకము. వివేకము అంటే ఆత్మానాత్మ వివేకము అని అర్థము. వివేకము లేకపోవటము అలా ఉంచి, తమకు

వివేకము లేదనే సత్యాన్ని అంగీకరించలేక పోవడము చాలా ప్రమాదకరమైన విషయము. లేనిదానిని లేనట్లు అంగీకరించినపుడే దానిని పొందే ప్రయత్నం చేయగలము.

అంగీకరించలేని బలహీనులు జ్ఞానము దగ్గరయినా వారు అందుకోలేని నిస్సహాయ స్థితిలో మిగిలిపోతారు.

వివేకము లేనపుడు వైరాగ్యముండదు. అందుచేత అనిత్యాలే సుఖస్థానాలుగా తెలుస్తాయి. ఆత్మకన్నా మరొకటి విలువైనదిగా తెలుస్తుంది. పూర్ణమైన ఆత్మకన్నా విశిష్టమైనది ఏది ఉంటుంది? అనే ఆలోచన రాదు. ఆత్మకన్నా అన్యమైనది ఏదయినా అపరిపూర్ణమే కనుక వాటిని సాధించి సుఖించే దేముంటుంది? అనే ప్రశ్న ఉదయించదు. కారణమేమిటో తెలుసా! ఆత్మానాత్మ వివేకం లేకపోవుటయే.

"స్వామీజీ! ఇటీవల నాలో నిరాశ ఎక్కువ అవుతోంది. భక్తి సన్నగిల్లుతోంది. ఆలయానికెళ్ళి దండం పెట్టాలనికూడా అనిపించటం లేదు. ఎక్కడికో జారిపోతున్నాను" అని ఇటీవల ఒక అమ్మగారు నాతో అన్నారు.

ఆమె ఉత్తమురాలు. పైగా సేవాజీవనానికి అలవాటుపడిన మహిళ. కాని, ఆమె పలుకులకు నా మనస్సు ఏ మాత్రం చలించలేదు. నిజమే. ఆమె పరిస్థితిలో నేనున్నా అంతేనేమో! సేవాకార్యాలలో ఆ తల్లి కూరుకుపోయిందే గాని వివేకాన్ని పెంచుకోలేదు. అధ్యయనం చేయమన్నా చేయలేదు. సాధనలు మానేసింది. సేవే చాలనుకుంది. ఫలితం నేడు శుష్కమస్తిష్కురాలైంది. శూన్య హృదయురాలైంది. వివేకం లోపిస్తే కార్యాలన్నీ వికారాన్నే దించుతాయి. పైగా "పూర్వము బాగా భక్తి చేసేదాన్ని" అంటుంది. ఇది చాలా విడ్డూరమైన విషయము. ఇప్పుడే ఆ తల్లికి వివేకము లేదు. పూర్వమెలా ఉండి ఉంటుంది? కలిగిన వివేకము ఎలా కారిపోతుంది? గతంలో కూడా వివేకం లేకుండానే భక్తి చేసింది. అప్పటికి ఇప్పటికి తేడా ఏమిటో తెలుసా? అప్పుడు, ఇప్పుడు కూడా వివేకం లేదు. అప్పుడు లేనిది ఉన్నట్లు తెలిసింది. అందుకని మనసు ఘర్షణకు గురికాలేదు. ఇప్పుడు ప్రవచనాలు వింటూ ఉంది కనుక లేనిది లేనట్లు తెలిసింది. ఘర్షణ మొదలైంది. అంతే.

ఆవేదనలను, ఘర్షణలను, అశాంతిని ఎవ్వరూ ఆశించరు. అవి ఆశింపదగినవి కావని అందరికీ తెలుసు. అయినా అందరూ వాటికి గురవుతున్నారు. దారిని వీడి నడిచే వారికి కంటకముల బాధ తప్పదు. దారి తప్పి ఆలోచించేవారికి కష్టాలు తప్పవు. ఏది ఆలోచించాలి, ఏది ఆలోచించకూడదు అనేది కూడా వివేకము. వివేకము లేని బ్రతుకులలో వికాసముదయించదు. సాధన జీవితంలో ప్రధానమైనదే. కాని వివేకమును వృద్ధి చేసుకోవటమే మన తక్షణ కర్తవ్యం. వివేకం లేకుండా సాధనలు శోభించవు.

ఆనంద విహారం

చెట్టు కాయను విడువదు. కాయ చెట్టును వదలదు. కాయ పండు కానంత వరకే ఈ సంబంధము. పక్వానికి రాగానే, ఫలంగా మారగానే కాయకు చెట్టుతో సంబంధం తెగిపోతుంది. కాని, ఆ స్థితి వచ్చినంత వరకు కాయ చెట్టును అంటిపెట్టుకొనే ఉండాలి. అలా అంటిపెట్టుకొని ఉంటూ, తనలో తాను పక్వత చెందడంలోనే కాయ పండుగా మారి విముక్తిని పొందుతుంది.

అంతవరకు కాయలో వగరు, పులుపు, చేదు లాంటివి అనివార్యాలు. అనివార్యా లుండేది అధిగమించుటకే గాని ఆవేదన చెందేందుకు కాదు. అనివార్యాలు అభివృద్ధికి సోపానాలు కావాలే కాని అవరోధాలకు పునాదులు కాకూడదు.

"నాలో స్వార్థం ఉంది. ఈర్ష్య ఉంది. అసూయ ఉంది. లోభత్వం ఉంది. అహంకారం ఉంది" .... అని చింతించ నవసరం లేదు. అవి క్రమంగా పరివర్తన చెందేలా జీవించడం నేర్చుకోవాలి. దుర్గుణాలను వదలించుకోవాలి అనే ప్రయత్నంకన్నా సద్గుణాలను ప్రోగుచేసుకోవాలనే ప్రయత్నంలోనే మనిషి మనీషిగా మారుతాడు. సుగుణ వంతుడై, సుగుణాలు ఉన్నట్లు కూడా తెలియనినాడు మనీషి మహర్షి అవుతాడు.

అంతరేక్షణను, ఆత్మావలోకనమును అందించుటచేత, ముందుంచుట చేత వేదాంత విద్య మానవునిలో పరివర్తనను కలిగించి, పరిపూర్ణతను ప్రసాదిస్తుంది. ఈ జ్ఞానముతోనే వ్యక్తి శక్తివంతు డవుతాడు.

ఆత్మనా విందతే వీర్యం

"ఆత్మను తెలుసుకోవడం వల్ల మానవుడు అనంతశక్తిని పొందుతాడు" అన్నది కేనోపనిషత్తు. ఈ దివ్యశక్తిని ఆశించే శిష్యుడు గురువును ఆశ్రయిస్తాడు. ఈ అనంత శక్తిని అభిలషించే గురువు శిష్యునికి బోధిస్తాడు.

సహవీర్యం కరవావహై

"ఇరువురమూ శక్తిని పొందెదము గాక!" అని గురుశిష్యు లిరువురు శాంతి మంత్ర మును పఠించి స్వాధ్యాయమును ప్రారంభించడం మనకు సంప్రదాయం ప్రసాదించిన ఆచారము. పొయ్యిమీద బియ్యం ఉడుకుతూ ఉడుకుతూ ఒక దశలో మెత్తబడి అన్నంగా మారుతుంది. నీకు ఆహారంగా తయారై శక్తిని అందిస్తుంది.

ఉడికే బియ్యంతో పాటు మనం ఉడకనవసరం లేదు. సాక్షిగా వీక్షిస్తుంటే చాలు. మంటను గమనిస్తూ ఉంటే సరిపోతుంది. ఆ మాత్రం ప్రయత్నంతో వంట సరిపడుతుంది.

ఆంతర్యంలో అవగాహనను పెంచుకోవాలి. సుగుణాలను వృద్ధి చేసుకోవాలి. సద్భావాలను చలింపచేయాలి. అవి వాటి పనిని అవి చేసుకుంటూ పోతాయి. అవరోధాలు కలిగించకుండా అవలోకించడం నేర్చుకుంటే సరిపోతుంది. ఒక దశలో మనసులో 'మంచి' మల్లెలు విరబూస్తాయి. శాంతి గాలులు వీచే ఆ హృదయ వాటికలో ఆనంద విహారం చేయవచ్చు. అది అలుపెరుగని ఆనందం. శ్రమ తెలియని శాంతి. అదంతా అలా, అలా జరిగిపోతుంది. అలలను, అలజడులను సృష్టించే నైపుణ్యాన్ని మరచిపోగలిగితే మనసులో మధుమాసం ప్రవేశిస్తుంది.

మనలో భావవైరుధ్యం లేకుండా చూసుకోవాలి. భావ సారూప్యంలో భాసించడం నేర్చుకోవాలి. పెద్దపెద్ద ఆలోచనలతో అలసిపోవడం చాలా చిన్నవాళ్ళకు కూడా అలవాటై పోయింది. ఏదో జరిగిపోవాలని, అది కూడా క్షణంలోనే జరిగిపోవాలని పరితపించడం పరిపాటైపోయింది. ఒక దీపాన్ని మనం వెలిగిస్తాము. అది వెలుగుతూ ఉంటుంది. తనతో పాటు మరెన్ని దీపాలు వెలుగుతున్నాయి? అని ఆలోచించదు. చీకటినంతా నిర్మూలించడం తనకు సాధ్యం కాదేమో? అని సంశయించదు. ఉన్నంతలో ఉత్సాహంగా ఊరేగుతుంది. తన శక్తిని తాను ఖర్చుపెడుతున్నాననే సంతృప్తితో వెలుగుతుంది. అధికారంతోనే పని చేస్తుంది. ఫలితాలపై ఆధిపత్యాన్ని మరచి జీవిస్తుంది. దీపంగా వెలగలేకపోతే ఏ జీవితమైనా శాపంగానే పరిణమిస్తుంది.

చెట్టు వేళ్ళకు నీళ్ళు పోయడంలో చెట్టు సంతటినీ తడపడమే అవుతుందనే సత్యాన్ని మరువకండి.

అన్ని పనులు ఒక్క పనిలోనే ఇమిడి ఉన్నాయి. అన్ని ఆశలు ఒక్క ఆశయంలో ఒదిగిపోతున్నాయి. అన్ని కర్మలు ఒక్క జ్ఞానంలో విలీనమవుతున్నాయి.

ఆలస్యానికి ఇది సమయం కాదు. అలసత్వానికి ఇది కాలం కాదు. ఉత్సాహంతో పరుగు లెత్తడమే మన ముందున్న కార్యం. నిరుత్సాహం తెలియకుండా నిలబడడమే మన తక్షణ కర్తవ్యం. భగవానుని జై కొడుతూ ఓడలా సాగిపోవడమే మనకు మిగిలిన ఏకైక కార్యము.

మనసును ఖాళీ చేస్తే మనసు ఖాళీ అవుతుందేమో గాని మనిషికి సుఖం రాదు. మనస్సు ఎగిరి పడుతున్నా, తాను ఖాళీగా, శాంతంగా ఉన్నట్లు తెలిస్తేనే సుఖం. సముద్రాన్ని వీక్షించటానికి అలలు అవరోధాలు కావు. ఈ సత్యం అర్థమైతే, అలల పొంగులు అధికంగా సౌందర్యాన్ని, ఆనందాన్ని అందించినా ఆశ్చర్యపడ నవసరం లేదు.

మంచి రోజులు

"స్వామీ! నాకు మంచిరోజులెప్పుడొస్తాయి?" అని ఒక భక్తుడు నన్ను ప్రశ్నించాడు.

"మంచిరోజు లెలాఉంటాయి?" అని నేను తిరిగి ప్రశ్నించాను.

"బాధలు లేకుండా-బరువులు తెలియకుండా హాయిగా, తృప్తిగా జీవించే రోజులు" అన్నాడా భక్తుడు.

"బాధలు, బరువులు మోసేదెవరు?" అన్నాను.

"మనసే కదా స్వామీ?" అన్నాడు.

"అంతే కదా బాబూ! ఒకవైపు బాధలను గుర్తిస్తూ, బరువులను దర్శిస్తూ వాటిని మోసేందుకే మనసు అలవాటుపడింది. ఈ క్షణాన మంచిని చేయలేని మనసు ఎప్పుడు మంచిరోజులు వస్తాయా అని ఎదురుచూస్తూ ఉంటుంది", అని ప్రారంభించి ఆయనకి వివరణ నిస్తూ నేను మననంలో పడ్డాను.

ఈ క్షణాన పవిత్రంగా భగవంతుని ధ్యానించడం ప్రారంభిస్తే మంచిరోజులు ఇప్పుడే ప్రారంభమయ్యాయని భావము. పలవరించడం మాని ప్రవర్తించడం అలవరచుకోవాలి.

జీవితాన్ని తన నుండి వేరు చేసికొని ప్రత్యేకంగా అర్థం చేసుకోవాలని సాధకుడు భావించకూడదు. నీతో కలిపి జీవితాన్ని అర్థం చేసుకున్నప్పుడే నీకు సత్యం తెలుస్తుంది.

తానెవరో తనకు తెలియని వాడు జీవితాన్ని అర్థం చేసుకోలేడు. ప్రపంచాన్ని దర్శించలేడు.

త్రాగుబోతుకు ప్రపంచం ఉన్నదున్నట్లు తెలియదు. అర్థం కాదు. పిచ్చివాడు కూడా అంతే. ఎందుకని? వారిరువురు తమను తాము తెలుసుకోలేని స్థితిలో యున్నారు.

సాధకుడైన వాడు ప్రతిక్షణము తనను తాను అవలోకించుకొనే అభ్యాసమును కలిగియుండాలి.

నేను ఉపన్యాసాలు ఆరంభించిన ప్రారంభరోజుల్లో ఒకనాడు నాకొక దుర్భర సమస్య ఎదురైంది. నేను వెళ్ళి కన్నీళ్ళతో భగవానుని విగ్రహం ముందు నిలబడ్డాను. చేతులు జోడించి నమస్కరించాను. నా సమస్యను పరమాత్మ ముందు ఉంచేందుకు సిద్ధమయ్యాను.

నా మనస్సులో మెరుపులాగా ఒక ప్రశ్న మెదిలింది. నేను ఇక్కడికి రాక పూర్వమే నా సమస్య భగవానునికి తెలుసు కదా? మరి నేను చెప్పడమేమిటి? అంతే. సాగిలబడి నమస్కరించాను. "తండ్రీ! నీ చూపులకు నేను దూరంగా లేను. చూసేవాడివి నీవే. దయ చూపేవాడివి నీవే. నీకన్నీ తెలుసు"; తిరిగి వచ్చేశాను. ఇంటికి చేరేలోగా ఆ దుర్భర సమస్య నీటిమీద వ్రాతలాగా మిగిలింది. ఆనాటినుండి నా సమస్య లేవీ నేను పరమాత్మకు వినిపించలేదు.

ఏదో చేయాలి అని ఆరాటపడేకన్నా ఏం చేయాలి? ఎందుకు చేయాలి? ఎలా చేయాలి? అని విమర్శించుకొని ఆచరించే సాధకునికి చిక్కులు ఎదురు నిలువవు.

మంచి చేయడానికి ప్రారంభించినపుడే మంచిరోజులు వస్తాయి. ఈ మాత్రం విశ్వాసం కలిగితే చాలు. మన హృదయంలో భక్తిని భగవంతుడే కదుపుతాడు. కుదుపు లేకుండా, అదుపు తప్పకుండా ముందుకు నడుపుతాడు. తానే ప్రేరణ కలిగిస్తాడు. తానే సాధనను నడిపిస్తాడు. తానే ఫలితాలను ప్రసాదిస్తాడు. మరి మనం చేసేదేమిటి? ఏమీలేదు. మనం చేయవలసిందల్లా అహంకారం తలెత్తకుండా చూసుకోవడమే. మమకార సుడిగుండంలో పడకుండా జాగ్రత్తపడటమే.

చెత్తను పారవేసినట్లు ఈ దేహాన్ని ఒకనాడు విసిరివేయాల్సి వుండగా దేనికి అహంకారం? దేనిపై మమకారం?

రాయి తగిలి కాలికి గాయమైంది. కత్తితో ఆ గాయాన్ని కొట్టుటవలన గాయం నయమవుతుందా? అజ్ఞాన గాయానికి అహంకార కత్తిపోటు కూడా అలాంటిదే.

అచ్యుతుని ఆశ్రయించుటయే చక్కని ఔషధము. అనంతుని ఆరాధించుటలో సర్వం సమకూరుతుంది.

ఏదో చేయాలి అంటుంది ఎద
చేసేందుకు ఏదయినా ఉంటే గదా!

అంతా ఇచ్చేయాలి అంటుంది మనసు
ఇచ్చేందుకు ఏది మిగిలుందో ఎవరికి
తెలుసు.

పిలవకపోయినా వస్తుంది కోపం
అదేదో పిలిచినట్లు వస్తుంది పాపం.

చేసిన పనులే.
చూసిన రుచులే.

నేడు కొత్త. రేపు పాత.
మరునాడు ఉండదు పత్తా.

చెత్తే కదా ఇప్పటికి చూసిందంతా
పరమాత్మే అంతటికి నిజమైన సత్తా

చేదు తీపి - తీపి చేదు

రోగము ముదిరినపుడు రోగి చేరవలసింది వైద్యశాలకే గాని స్వీట్ స్టాల్‌కి కాదు. వైద్యశాలలో ధనం ఖర్చవుతుంది. మందు లభిస్తుంది. స్వీట్‌స్టాల్‌లో కూడా డబ్బు వ్యయమవుతుంది. అయితే స్వీట్స్ లభిస్తాయి.

రెండుచోట్ల ధనం వ్యయమవుతుంది. ఒకచోట చేదుమందు లభిస్తే, మరొక చోట తీపి పదార్థాలు లభిస్తాయి.

మందు తినడానికి ఎవ్వరూ ముందుకు రారు. స్వీట్స్ తినడానికి అందరూ సిద్ధమే. రోగులు కూడా.

తీపి పదార్థాలు రోగి ప్రాణాల్ని తోడేస్తుంటే, చేదు మందులు చేయూతనిచ్చి రక్షిస్తున్నాయి. ప్రాణాలు పోస్తున్నాయి.

తీపిలో ఎంత చేదు? చేదులో ఎంత తీపి?

బ్రహ్మ ముహూర్తాన దుప్పటిని తలదాకా లాగి, కాళ్ళతో తన్నిపట్టుకొని ఒదిగి పోవడం అందరికీ సాధ్యం.

చివుక్కున లేచి, స్నానమాచరించి, భగవంతుని ధ్యానించడం ఎందరికి సాధ్యం?

నిద్రించడం రోగి తీపితినడం లాంటిది. సాధన చేయడం మందు తినడమే. ఏం చేద్దాం? మంచి రుచించదు. రుచులు, అభిరుచులు ప్రక్కన పెట్టి, సురుచిర మేఘశ్యామునికై ఆనందంతో శ్రమించువారే ధన్యజీవులవుతారు.

ఉద్యోగినం పురుష ముపైతి లక్ష్మీః

"కార్యోన్ముఖుడైన పురుష సింహాన్నే లక్ష్మి వరిస్తుంది" అని ఆర్యోక్తి. మన ప్రయత్నం అవసరం లేకనే మనల్ని సమీపించేవాడు యముడు. తీవ్ర ప్రయత్నం చేస్తేగాని లభించనివాడు శివుడు.

ఆడబిడ్డను ఎంత గారాబంగా పెంచినా అత్తవారింటికి పంపక తప్పదు. దేహాన్ని ఎంతగా పోషించినా శ్మశాన దుమ్ములో కలపక తప్పదు. ఇప్పుడు చెప్పండి. మన మనసును ఎవరికిస్తాం?

దేహానికా? దైవానికా?

ధన్య జీవనం

స్వల్పమైన, అల్పమైన సుఖాలను త్యాగం చేస్తే, అధికమైన, అద్భుతమైన ఆనందాలను అనుభవించవచ్చు.

వదలడం కొందరికి కష్టంగా ఉంటుంది. ఉంచుకోవడం మరికొందరికి కష్టంగా ఉంటుంది.

ఎన్ని వున్నా, ఎందరున్నా - ఏమీ గాకుండా, ఎవరికీ చెందకుండా ఉండేవారు ధన్యజీవులు.

జయము కలిగిందని పొంగిపోవడం సబబే. కానీ అపజయము చవిచూసిన వ్యక్తి యొక్క ద్వేషానికి దూరం కాలేము అనే సత్యాన్ని మరువకూడదు. జయించిన వానికన్నా జయాపజయాలను సమానంగా భావించి త్యజించిన వానిని ద్వేషాలు అంటవు. దోషాలు చేరవు.

శత్రువు నిన్ను బాధించవచ్చు. అసూయాపరులు నిన్ను హింసించవచ్చు. ఈర్ష్య గలవారు నిన్ను ఇక్కట్లకు గురిచేయవచ్చు. కానీ దారితప్పిన నీ మనస్సు అందరికన్నా ఎక్కువగా నిన్ను బాధిస్తుంది. దుఃఖానికి గురిచేస్తుంది.

లేవండి. నిద్రలేవండి. రాత్రి ఎలాగూ గడచిపోయింది. పగలు కూడా పొద్దైతే ఎలా? యుగాలు నిద్రించాము. నిజాలు గ్రహించే దెప్పుడు?

మనం ప్రయాణంలో ఉన్నామని చాలామందికి తెలియదు. తెలిస్తే మోకాళ్ళు ముడుచుకొని కూర్చోలేరు. నీవు నడచినా, కూర్చున్నా, ఎలావున్నా కాలానికి నష్టం లేదు. నీవు కలిసి రాలేదని కాలం ఆగదు. తన ప్రయాణాన్ని ఆపుకోదు.

చెట్టును అంటిపెట్టుకొని నెమ్మదిగా, క్షేమంగా ప్రాకడం తీగకలవాటు. తొందర పాటుతో క్షణం విశ్రాంతి కూడా లేకుండా కొమ్మలపై దుమకడం కోతి కలవాటు. నిలకడ గల చెట్టు ఎవరిని పట్టించుకుంటుంది? ఎవరి చిత్తమెలా వుంటే అలా వారు చరిస్తుంటారు.

తీగలా మనసు సౌకుమార్యాన్ని సంతరించుకోవాలి. తీగ ఓపికతో చెట్టును ఆశ్రయించుకొని ప్రాకునట్లు, మనం సహనశీలురమై సాధనలో సాగిపోవాలి.

రోగి వైద్యుని సమీపించి ఔషధమును స్వీకరించవచ్చు. లేదా ఫలహారశాల కెళ్ళి తృప్తిగా ఆరగించవచ్చు. మందువల్ల ఆరోగ్యము చేకూరుతుంది. మితిమీరి భుజించడం వల్ల దేహారోగ్యము మరీ పాడైపోతుంది.

కానీ, ఆరోగ్యాన్ని ప్రసాదించే ఔషధం చేదుగా ఉండొచ్చు. ఆరోగ్యాన్ని క్రుంగదీసే మిఠాయిలు తీయగా, రుచిగా ఉండొచ్చు. తన మనుగడకు ఏది మంచిదో రోగి నిర్ణయించుకోవాలి.

కష్టాలొచ్చినప్పుడు కన్నీళ్ళు కార్చడం అందరికీ తెలుసు. కానీ గత జన్మలలో ఆచరించిన పాపాలకు ఫలితాలే ఈ కన్నీళ్ళని ఎందరికి తెలుసు? అది తెలిస్తే బ్రతుకు ధన్యమౌతుంది. కన్నీళ్ళు కమనీయంగా గోచరిస్తాయి.

"తండ్రీ! నా పాపాలు కష్టాల్ని అందిస్తే, నీ కృప కన్నీళ్ళని ప్రసాదించింది. కష్టాల్ని తలచుకొని దుఃఖించడంకన్నా కన్నీళ్ళతో నీ పాదాలను కడిగి తృప్తిచెందే భాగ్యం కలిగి నందుకు పొంగిపోతున్నాను. కన్నీళ్ళున్నది ఇందుకని ఇప్పుడే తెలిసింది".

బోధలు లభించిన వానిని బాధలు ముట్టలేవు. అవగాహన లేనివాడు సాధనలో చరించలేడు. వెలుగు నాశించిన వారందరు వెలుగును దర్శించే ముందు వెతలను దర్శించిన వారే. స్పృశించిన వారే.

దూరప్రయాణము చేయు వ్యక్తి శక్తిమంతుడై యుండాలి. ధైర్యశాలియై ఉండాలి. చీపురుపుల్లతో త్రాచుపామును చంపాలనుకోవడం అవివేకం. దుడ్డుకర్రతో కొట్టడమే దొడ్డబుద్ధి గలవాని లక్షణం.

పిరికివానికి ముక్తిలేదు అన్నది కఠోపనిషత్తు. ఋషి పుత్రులారా! పిరికితనాన్ని పారద్రోలండి. సాధనలో ఉద్యమించండి. బుద్ధిలో ఉత్సాహముంటే బాట కష్టమనిపించదు. మాట నమ్మిన వారికి మూట అందకపోదు. కోట చిక్కకపోదు.

పాట నాలపిస్తూ బాటలో చరిస్తే వేట ఆగినట్లే, వెలుగు చిక్కినట్లే, చేజిక్కినట్లే. ప్రయత్నించండి.

భక్తి అనేది
సంతలో దొరికే వస్తువు కాదు.
కూలికి ఏడ్చేది కాదు.
మెప్పుకై కులికేది కాదు.
గొప్పకై పలికేది కాదు.

హృదయంలో ప్రేమ లేనపుడు భక్తి కార్యాలలో దిగినా
ఈతరానివాడు బావిలో దూకినట్లే ఉంటుంది.

కడుపులో లేనిది
కౌగిలించుకొంటే వస్తుందా? అనేది సామెత.
మెదడుకు మేత.

కరదీపిక

ఈ ప్రపంచంలో ఎవరయినా మరొకరి కొరకు వేచియున్నట్లు నీవు భ్రమిస్తున్నావా? జాగ్రత్త! ఇది చాలా ప్రమాదకరమైన విషయం. జీవితం ఒంటరి ప్రయాణము. ఇక్కడ ఎవరి ఆటలు వాళ్ళు ఆడుతున్నారు. ఎవరి మార్గాన వాళ్ళు వెళ్తున్నారు.

కాలం ఎవ్వరినీ కనికరించదు. కాలం నమిలి, చప్పరించి మ్రింగని వస్తువు ప్రపంచంలో లేదు. జీవితం కర్పూరం లాగా కంటిముందే కరిగిపోతూ వుంది. ఉన్న వాస్తవాన్ని చూడాలి. లేని అంధత్వాన్ని ఆపాదించుకోవడం దురదృష్టకరం.

అదృష్టం లేదని, కలసిరాలేదని విలపించడం వెర్రితనం. అదృష్టదేవత ఎలా ఉంటుందో, ఎక్కడుంటుందో బహుశ నీకు తెలియక పోవచ్చు. ఆమెను నేను చూశాను. చాలాసార్లు కరచాలనం చేశాను. ఆమె గుట్టంతా నాకు తెలిసిపోయింది.

ఆశించిన వాణ్ణి మోసం చేస్తుంది. నిరాకరించిన వాడి నీడలో అంతిమశ్వాస వరకు పడివుంటుంది. ఎవరైనా చక్రవర్తిని ఆశ్రయిస్తారు కాని బిచ్చగాడ్ని, బానిసను ఎవరు ఆశ్రయిస్తారు?

ఎవరీ ప్రపంచంలో చక్రవర్తి? బ్రతుకు తీరు తెలిసి తేరుకున్నవాడే. తీరం చేరిన వాడే. అట్టివాడు బిచ్చగానివలె స్వల్పమైన సుఖాల వెంట పరుగెత్తడు. బానిసవలె అల్పమైన విషయాల వెంటపడడు.

కళ్ళు తెరచి చూడు. రోజంతా నీచుట్టూ ఏమి జరుగుతూ వుందో, నీలో ఏమి జరుగుతూ వుందో

పని, పని, పని........... పరుగు, పరుగు, పరుగు.

ఎంత శ్రమ? ఎంత ఆలోచన? ఎంత కాలం? ఇదంతా దేనికొరకు?

చేతులు నోటిదగ్గరకు చేరేందుకు, రెప్పలు కంటిపై వాలేందుకు కూడా సమయం లేకుండా శ్రమిస్తున్నావు. ఇదంతా నీవు ఆలోచించడం లేదు కనుక నీకు తెలియకపోవచ్చు.

కానీ, ఒక్క విషయం - కాదు, సత్యం..... ఒక్క సత్యం నీకు బాగా తెలుసు.

ఈ డబ్బు, ఈ సంపాదన, ఇలా శ్రమించి గడించినదంతా ఒకరోజు ఇక్కడే ముట్టచెప్పి వెళ్ళాలి.

మరి ఈ శ్రమంతా దేనికి పడ్డట్లు? శ్రమించి ఏమి సాధించినట్లు?

పానీ కేరా బుద్బుద ఇస్ మానుష కీ జాత్
దేఖత హీ ఛిప జాయగే జ్యోం తారా ప్రభాత్!

"ఈ దేహాలు నీటిబుడగల వంటివి. నిలకడ లేనివి. వీటికొరకు పరితపించడం తోనే బ్రతుకంతా సరిపోతోంది. తెల్లవారితే తారలుంటాయా! కాలంలో ఈ దేహాల పరిస్థితి కూడా అంతే" అంటాడు కబీర్‌దాస్.

శ్రమ పడవచ్చు. ఆలోచనలు చేయవచ్చు. కాలం వెచ్చించవచ్చు. కానీ దేని కొరకు? ఇక్కడే మన విచక్షణ పనిచేయాలి. మాసిపోని, మారిపోని సుఖం కొరకు మనం శ్రమించలేమా? పారిపోని, ఆరిపోని దీపాన్ని వెలిగించుకొనుటకు పరిశ్ర మించలేమా?

కరదీపికలా ముందు నడచేదాన్ని పారేసి, చీకటిలో వెనుకబడి నశించేదాన్ని ప్రేమిస్తావా! పట్టుకుంటావా!

చేసింది, చూసింది మరచిపో. భవిష్యత్తుకు బాటను నిర్మించుకో. ఎప్పుడైనా జీవితం పోరాటమే. ధీరత్వానికి విజయం తప్పదు. పిరికితనానికి ఎన్నడైనా పతనమే.

కష్టాలకు నేను జడవను. అవి నాకన్నా వేరుగా ఉంటేకదా నేను జడవాలి? అవి నా నేస్తాలు. నన్ను అనుసరించే సేవకులు.

సుఖానుభూతిలో 'ఇక్కడ' అనేది ఉంటుందే గాని 'అక్కడ' అనేది ఉండదు. 'ఇప్పుడు' అనేది ఉంటుందే గాని 'అప్పుడు' అనేది ఉండదు.

పదవి వస్తే "ఇప్పుడు పదవిలో ఉన్నాను" అంటాము.

ధనం వస్తే "ఇప్పుడు ధనవంతుణ్ణి" అంటాము.

ఆరోగ్యంగా ఉంటే, "ఇప్పుడు ఆరోగ్యంగా ఉన్నాను" అంటాము.

పోటీలో గెలిస్తే, "ఇప్పుడు గెలిచాను. ఆనందంగా ఉంది" అంటాము.

సుఖం ఎప్పుడు కలిగినా, అది 'ఇప్పుడు'గానే తెలుస్తూ ఉంది. అలాంటప్పుడు సుఖపడేందుకు "ఇప్పుడు" ఎప్పుడు వస్తుందా? అని నిరీక్షించడంకన్నా, "ఇప్పుడు" ఇక్కడే, ఇప్పుడే ఉంది కనుక వెంటనే సుఖపడితే అడ్డు నిలిచేవా రెవరు?

నవతకు పిలుపు *

నూతన సంవత్సరం. ఈ మాట నూతనమా! క్రొత్త సంవత్సరం వచ్చింది అనే మాట క్రొత్తది కాదు. బ్రతుకులో చేతనత్వం రానంత వరకు సంవత్సరానికి నూతనత్వం రాదు.

ఇది పాతకు, రోతకు వీడ్కోలు పలికే సంవత్సరం. నవతకు, సమతకు ఆహ్వానం పలికే సంవత్సరం. హృదయ కవాటాలు తెరిచే సంవత్సరం. ఇంద్రియ ద్వారాలు మూసే సంవత్సరం. స్వార్థాన్ని తరిమికొట్టే సంవత్సరం. త్యాగాన్ని వెతికి పట్టే సంవత్సరం. "పాత"ని వెనక్కి నెట్టి 'క్రొత్త'ను ముందు నిలిపే సంవత్సరం. అందమైన సంవత్సరం. కావాలి ఇది ఆధ్యాత్మిక వత్సరం.

మన మందరము వేణువులు కావాలి. వెన్నుని చేతిలో వేణువులు కావాలి. దానవులు విలయతాండవం చేస్తున్న సమాజంలో జీవనరాగాల్ని వీనుల విందుగా వినిపించే వేణువులు కావాలి. మాధవుని గుర్తుచేసే మానవులు కావాలి.

"పురాణ పురుషా! పుణ్యశ్లోకా! పలికించుకో నీ పాటను" అని వేణువులా మనం ఖాళీయై నిలవాలి. అయితే మనం ఏమి చేయాలి? మనం చేయవలసిందల్లా ఒక్కటే. ఏది మనం చేసినా, ఏది మన ద్వారా జరిగినా దానికి కర్త కృష్ణుడేనని, దేనిని చేయలేక పోయినా, మన ద్వారా ఏది జరగకపోయినా అదంతా శ్రీకృష్ణుని సంకల్పమేనని, చాలు. ఇది చేయగలిగితే అన్నీ చేసినట్లే.

నరునిది బొమ్మలాట. నారాయణునిది నవ్వులాట. ప్రతి చిన్న విషయానికి ప్రపంచం వైపు చూడడం మనకు అలవాటైపోయింది. ఏ కష్టమొచ్చినా తరుణోపాయానికి వ్యక్తులను వెదకడం మనకు అభ్యాసమై పోయింది. ఇలా చూచి చూచి, వెదికి వెదికి నీరసించి, నేత్రాల్లో నీళ్ళు నిలిచిన సమయాన, నారాయణుడు వెనుక నిలబడి మనల్ని చూచి నవ్వుతుంటాడు.

ఆనందము కావాలంటూ దుఃఖాన్ని ఆలింగనం చేసుకొనేవారిని చూచి ఎవరయితే మాత్రం నవ్వక ఏంచేస్తారు? **"ఆనందో బ్రహ్మేతి"** ఆనందము భగవంతుని స్వరూపము. నీకు ఆనందం కావాలా? అయితే పరమాత్మనే ఆశ్రయించు. **"తపో బ్రహ్మేతి"** తపస్సే బ్రహ్మము. పరమాత్మకై తపించు. పరితపించు. పరమాత్మను నీ తపస్సు కదిలించగలిగితే నీవు తరించిపోతావు.

"వేదాంతం వినేందుకే" ...... ఇదే వాస్తవమైతే మన హృదయాలలో శని ప్రవేశించాడని అర్థం. తినింది ఎలా వంటబట్టాలో వినింది కూడా వంటబట్టాలి. ఆచరణలో శ్రీ చరణాలు లభిస్తాయి. వంటబట్టని శ్రవణము వ్యాధిగా పరిణమిస్తుంది అన్నారు వివేకానంద స్వామి.

* 1996 నూతన సంవత్సర సందేశము

With them hearing new things grows into a kind of disease, a sort of religious drink-mania. They want to hear new things just by way of getting a temporary nervous excitement. Religion is with these people a sort of intellectual opium-eating and there it ends.

"కొందరికి క్రొత్త విషయాల్ని వినడం అనేది ఒక జబ్బుగా, మత సంబంధమైన మత్తు పానీయంగా తయారైంది. తాత్కాలిక నాడీస్పందన నాశించి అట్టివారు రోజూ వేదాంతాన్ని వింటూ వుంటారు. నల్లమందు తినువారి వలె వేదాంతాన్ని విలాసంగా విని విడిచేస్తుంటారు".

ఇది ఎంత ప్రమాదమో మనం బాగా ఆలోచించాలి. ఇదొక పూడిక తెలియని అగాధాన్ని స్పృశించే ప్రయత్నం. తాను కూర్చొనియున్న వృక్ష శాఖను ఛేదించే యత్నం.

ప్రయత్నశీలురు ప్రమాదాల నెరుగరు. విశ్వాసము ఇంతవరకు ఎవ్వరినీ వమ్ము చేయలేదు. వృథాగా కాలాన్ని ఖర్చు పెట్టేవారికి లాభాలు మిగలవు. అన్నీ నష్టాలే.

కానివ్వండి. నారాయణుని మనసారా ప్రార్థిస్తాం. నామాన్ని ఆశ్రయిద్దాం. రాత్రింబవళ్ళను ఏకం చేద్దాం. 'ఏక్ నిరంజన్' ఎలాగో ప్రత్యక్షంగా అనుభవానికి తెచ్చుకుందాం.

"నామమే కదూ!" అని నానుడు మాటల్ని పలకడం కొందరికి అలవాటైన జబ్బు. నామం తేలికే. నామం పలకడం తేలిక కాదు. సమయమున్నా గోళ్ళు కొరికేవారు కనిపిస్తారే గాని గోవిందుని కీర్తించేవారు అగుపించరు. అందుకే,

సామీప్య మందరికీ సంకీర్తనం

సామాన్యమా విష్ణు సంకీర్తనం....అన్నారు తాళ్ళపాక అన్నమాచార్యులు.

ఎవరెవరు ఏమేమి అన్నారనేది కాదు. మనము ఏవేవి విన్నామనేదీ కాదు. విన్నది వంటబట్టించుకుంటున్నామా అనేదే ఈ నూతన సంవత్సరంలో వినూత్న అవగాహన.

కాలాన్ని మనం వినియోగించుకొంటే వైకుంఠం మన దగ్గరకు వస్తుంది.
మనల్ని కాలం వినియోగించుకొంటే వల్లకాటికి మనం దగ్గరవుతాము.
కాలహరణమా?
కాలంలో స్మరణమా? అది తేలితే,
ఆ తరువాత మునగడమా? తేలడమా? అనేది తేటతెల్లమవుతుంది.

ప్రవర్తన - పరివర్తన

ఏ మనిషైనా పరిస్థితులలోనే జీవిస్తూ ఉంటాడు. పరిస్థితులు అందరికీ ఉంటాయి, ఎప్పుడూ ఉంటాయి. కాని పరిస్థితులు ఎప్పుడూ ఒకేలాగ ఉండవు, మార్పు చెందుతూ ఉంటాయి. ఒక మనిషి మనతో ఎప్పుడూ ఒకేవిధంగా ప్రవర్తిస్తాడని చెప్పలేము. ఋతువులు మారుతూ ఉంటే బాహ్యంలో వాతావరణం మారినట్లు, ఎదుటి వ్యక్తి స్వభావాన్ని బట్టి అతని ప్రవర్తన మారుతూ ఉంటుంది. దానియొక్క ప్రభావం మన మీద పడుతూ ఉంటుంది. ఈ మారుతున్న పరిస్థితులే మనకు అసౌకర్యం. కాబట్టి ఈ మారుతున్నటువంటి పరిస్థితుల్ని నేనెలా అర్థం చేసుకోవాలి? వాటి మధ్య నేనెలా చరించాలి అనేదే మన ముందున్న ప్రశ్న.

పరిస్థితుల్ని అర్థం చేసుకోవడంలో నేను ఉన్నదానిని చూస్తున్నానా, లేక నాలో ఉన్న దానిని చూస్తున్నానా అనేది ప్రధానమైన విషయం. నాలో ఉన్నదానిని చూస్తే అది దృక్పథం. ఉన్నదానిని ఉన్నట్లుగా చూడటం సత్యపథం. అంటే రాగద్వేషాల రంగుటద్దాలలో నుండి చూడటం దృక్పథం. రాగద్వేష రహితంగా చూడటం సత్యపథం. కాబట్టి పరిస్థితులు మనిషికి సమస్యగా మారేది అవి అర్థం కానపుడే. సమస్య అర్థం కానపుడే మనిషి పరిష్కారానికై వెదుకుతాడు. పరిష్కారం ఎప్పుడు కూడ క్రొత్త సమస్యల్నే సృష్టిస్తుంది.

అవగాహన సమస్యని అదృశ్యం చేస్తుంది. పరిస్థితి ఎప్పుడైతే ఉన్నదున్నట్లుగా అర్థమౌతుందో అప్పుడు ఏ పరిస్థితిలో ఏం చేయాలి, ఎందుకు చేయాలి, ఎలా చేయాలి, ఎప్పుడు చేయాలి అనేది మనకు సుస్పష్టంగా అర్థమౌతుంది. దీనినే యుక్త చేష్ట అంటాము.

యుక్తాహార విహారస్య యుక్త చేష్టస్య కర్మసు
యుక్త స్వప్నావ బోధస్య యోగో భవతి దుఃఖహా ॥ (భగవద్గీత 6అ-17శ్లో)

'మితమైన ఆహార విహారములు, మితమైన నిద్రయు, మెలకువయు గలవానికి, కర్మలయందు ఉచితరీతిన చరించువానికి ఈ యోగము దుఃఖమును పోగొట్టును'. కాబట్టి యుక్త చేష్ట అనేది కూడా యోగమే. ఈ యోగం దుఃఖాన్ని హరిస్తూ ఉంది. యుక్త చేష్ట ఎప్పుడైతే అలవడుతుందో పరిస్థితులు మారినా వాటివల్ల మనకు దుఃఖం కలగదు.

యుక్త చేష్ట ఎలా సాధ్యం?

జడం, చేతనం, సచేతనం. ఈ ప్రపంచంలో ఏది చూసినా ఈ మూడింటిలో ఒక దానికి చెందినదై ఉంటుంది. ప్రాణం లేనివి జడం. ఉదాహరణకు యంత్రం. యంత్రం నడిపితే నడువగలదే గాని తనకు తానుగా నడవలేదు. కాబట్టి యంత్రానిది వర్తనం. ప్రాణ మున్నవి చేతనమైనవి, పశుపక్ష్యాదులు. కానీ వీటికి జ్ఞానం లేదు కనుక

కేవలం సహజాతాలతో చరిస్తూ ఉంటాయి. ఆలోచించి నడవలేవు. వీటిది కొంత వర్తన, కొంత ప్రవర్తన. మనిషికి ప్రాణమే కాక జ్ఞానం కూడా ఉంది కనుక అతడు సచేతనం, అతనిది కేవలం ప్రవర్తన.

మనిషికి జ్ఞాన ముంది, స్ఫూర్తి ఉంది, శక్తి ఉంది, యుక్తి ఉంది, ఓర్పు ఉంది, తీర్పు ఉంది - ఇవన్నీ ఉన్నాయి కాని పరిమితంగా ఉన్నాయి. శక్తులైతే పరిమితంగా ఉన్నాయి కాని వాటిని ఉపయోగించుకునే స్వేచ్ఛ అతనికి ఉంది. ఈ స్వేచ్ఛను ఎప్పుడు ఎలా వినియోగించుకుంటాడు అనే దానిని ఆధారం చేసుకొని ప్రవర్తన పరివర్తన వైపు తిరుగుతుంది. కాబట్టి పరిస్థితులు మారడంవల్ల దుఃఖమైతే, ఆ మారే పరిస్థితుల్లోనే ప్రవర్తన పరివర్తన వైపు మరలితే సుఖం. కాబట్టి వ్యక్తి తాను ఉన్న పరిస్థితిని ఉన్న దున్నట్లుగా అర్థం చేసుకోవడం, ఆ తరువాత ఆ పరిస్థితికి అనుగుణంగా, అంటే ఏం చేయాలో, ఎందుకు చేయాలో, ఎలా చేయాలో, ఎప్పుడు చేయాలో సుస్పష్టంగా ఎరిగి చేయడమే యుక్త చేష్ట. యుక్త చేష్ట ద్వారానే ప్రవర్తనలో పరివర్తన తొంగి చూస్తుంది. పరివర్తన వచ్చినప్పుడే మారుతున్న పరిస్థితుల మధ్య మనిషికి సుఖం.

ప్రవర్తన పరివర్తనగా మారేదెప్పుడు?

రాగద్వేషాలు మనిషికి ప్రబల శత్రువులు అన్నది భగవద్గీత.

ఇంద్రియస్యేంద్రియ స్యార్థే రాగద్వేషౌ వ్యవస్థితౌ
తయోర్న వశ మాగచ్ఛే త్తౌహ్యస్య పరిపంథినౌ ॥ (భగవద్గీత 3అ - 34 శ్లో)

'ఇంద్రియములకు, ఇంద్రియ విషయములకు మధ్య రాగద్వేషములు చోటుచేసుకొని యున్నవి. వాటికి ఎవరును వశపడకూడదు. రాగద్వేషములు వ్యక్తికి ప్రబల శత్రువులు'.

రాగద్వేషాలు లేకుండా పరిస్థితుల్ని అర్థం చేసుకున్నప్పుడే దృక్పథం సత్యపథంగా మారుతుంది. సత్యపథంలోనే యుక్త చేష్ట సాధ్యపడి ప్రవర్తన పరివర్తన వైపుకు నడుస్తుంది. పరమాత్మ రాగద్వేషాలను శత్రువులుగా పేర్కొన్నాడు. ఎందుకని? సత్యమార్గంలో చరించేవారిని అవి అడ్డగిస్తూ ఉన్నాయి కనుక. పరిస్థితుల్ని అర్థం చేసుకోవడంలో సత్య పథాన్ని కాకుండా దృక్పథాన్ని అందిస్తూ ఉన్నాయి కనుక. అయితే రాగద్వేషాలను నిర్మూలించడం అసాధ్యం. ఎందుకని? అవి అనాదిగ మనసును పెనవేసుకొని ఉన్నాయి కనుక.

పరివర్తన వస్తే సమస్యలు ఉండవా?

మనిషిలో వచ్చిన పరివర్తన వల్ల ప్రపంచం మారదు, పరిస్థితులు మారవు, వ్యక్తులు మారరు, సమస్యలు పోవు. మరి ఏం జరుగుతుంది? మనిషిలో వచ్చిన పరివర్తన వల్ల సమస్యలు ఉంటాయి కానీ వాటిని అర్థం చేసుకుంటాడు కనుక వ్యక్తి బాధపడడు. రాగద్వేషాలు కలిగి ఉంటాడు కానీ వాటికి వశపడడు. ఏ మనిషిమీద రాగముండదు. ఎవరి మీద ద్వేషముండదు. ఇక్కడ నుండి జరిగేదంతా యుక్తచేష్టయే.

రాగద్వేష వియుక్తైస్తు విషయా నింద్రియై శ్చరన్
ఆత్మ వశ్యై ర్విధేయాత్మా ప్రసాద మధిగచ్ఛతి ॥ (భగవద్గీత 2అ - 64శ్లో)

'రాగద్వేష రహితుడై, తనకు వశమైన ఇంద్రియములచేత విషయములందు ప్రవర్తించుచున్నను యోగయుక్తుడు ప్రశాంతతను పొందుచున్నాడు' అని స్థితప్రజ్ఞ వైభవం.

రాగద్వేషాలు తటస్థపడితే కోరలు తీసిన పాములాగా అవి మనలను బాధించవు. రాగద్వేషాలు తటస్థపడినపుడే మనిషి నడుపబడకుండా జ్ఞానంతో నడిచేవాడు అవుతాడు. నడుపబడేవాడు అర్జునుడు. నడిపేవాడు శ్రీకృష్ణుడు. అందుకే ఆయన విజయ సారథి, పార్థసారథి. రాగద్వేషాలు తటస్థపడినపుడే దృక్పథం సత్యపథంగా మారి మనిషి ప్రవర్తన పరివర్తనకు దారి తీస్తుంది.

వారం రోజుల్లో మృత్యువు రాబోతుంది అని తెలిసిన పరీక్షిత్తు విషాదంతో కుమిలిపోయాడు. శుకబ్రహ్మను ఆశ్రయించాడు. గంగాతీరంలో ఆసీనుడై శుకబ్రహ్మ నుండి భాగవతాన్ని విన్నాడు. దుఃఖాన్ని దూరం చేసుకొని ఆనందభరితుడయ్యాడు. మరణాన్ని ఉత్సవంగా మార్చుకున్నాడు.

నేను వారం రోజుల్లో మరణిస్తాను అని వ్యథ చెందటం ప్రవర్తన కాగా, నేను ఏడు రోజులు బ్రతుకుతాను అని ఆనందించటం పరివర్తన అయింది. ఇదే జ్ఞానంయొక్క వైభవం. బాధలనేవి బాహ్యంలో లేవు. అవన్నీ బాహ్యంలోకి మన మనసు ప్రసరింపచేసే భావ కిరణాలు. కాబట్టి బాధలు కేవలం ఆరోపితాలు. దృక్పథం మనలను ఆరోపణ వైపుకు నడిపిస్తే సత్యపథం మనలను స్వరూపంలోకి మరలిస్తుంది.

ఎవరు ఎలా ఉన్నారు? ఎలా ఉంటున్నారు? అనేది మనకు అర్థ మవుతూ ఉంది. ఎవరైనా కానివ్వండి వారు అలా ఉండటానికి కారణా లున్నాయా? లేవా? అనేదే ముఖ్యం. అది మంచి కారణమా? చెడు కార ణమా? అనేది అసందర్భం.

కారణాలు ఉండి కార్యాలు వ్యక్తమయ్యేటప్పుడు కారణాలు అర్థమైతే (కనీసం ఉన్నాయనే సత్యం అర్థమైనా), ఆ తరువాత కార్యాలు ఇబ్బంది పెట్టవు. కార్యాలు మనకు అవరోధంగా ఉన్నా, వాటిని ఆచరించే వ్యక్తులు మనకు అర్థమై ఉంటారు కనుక కార్యాల ప్రభావం మన మనస్సుపై పెద్దగా ఉండదు. అంతేకాదు, అట్టి కార్యాలను ఆచరించినవారిపై మనకు ద్వేషం పొడసూపదు సరిగదా, వల్లమాలిన సానుభూతి పుట్టుకొస్తుంది.

ఎద సౌందర్యం

నా కళ్ళు నావే. నాకన్నా అవి వేరు కావు. నేను నేరుగా చూడాలంటే నేరుగా చూడగలను. ప్రక్కకు చూడాలంటే ప్రక్కకు చూడగలను. పైకి చూడాలంటే పైకి చూడగలను. క్రిందికి చూడాలంటే క్రిందికి చూడగలను. లేదా, చూడకుండా ఉండాలనుకుంటే కళ్ళు మూసుకోగలను.

నా కళ్ళు నాకన్నా వేరుగావు అని భావించినట్లే, మనకు కావలసినవారు మన కన్నా వేరు కారని భావిస్తూ ఉంటాం. అంతేకాదు, భాషిస్తూ ఉంటాం. ప్రవర్తిస్తూ ఉంటాం.

ఇది భావించినంత సులభమైన పని కాదు. నా కళ్ళతో చూడటం లేదా చూడక పోవటం లేదా మరోలా చూడటం **(కర్తుం శక్యం, అకర్తుం శక్యం, అన్యథావా కర్తుం శక్యం)** కేవలం నామీదనే ఆధారపడి ఉంది. మన కళ్ళను మనం త్రిప్పినట్లు, ఇతరుల కళ్ళను, మనస్సుల్ని మనం త్రిప్పలేము. మన కళ్ళు చూచినట్లు ఇతరుల కళ్ళు చూడకపోవచ్చు. మన మనస్సుకు అనుగుణంగా అందరి మనస్సులు అన్ని వేళల ఆడుతాయని భావించటం పొరపాటే అవుతుంది.

ఇతడు నా స్నేహితుడు. ప్రాణ మిత్రుడు. మాది ఒకే ప్రాణం; ఒకే మాట; అంటూ ఉంటారు. అతడు నాకు మిత్రుడు అనే దొక్కటే కొంతవరకు సత్యము. మిగిలిన మాటలన్నీ నీటిమూటలే.

ఇరువురికి ఒకే ప్రాణం ఉండదు. అదే నిజమైతే, ఒకరు కన్నుమూస్తే, మరొకరు కన్నీరు ఎలా కారుస్తారు? స్నేహితుడికి అప్పుంటే హృదయమున్న మిత్రుడు తీర్చవచ్చు. అలాగని బట్టతల వస్తే, బుట్టతల వాడు పంచుకోలేడు. పంచిపెట్టలేడు. లేని దానిని తెగ ఊహించుకొని, లేని బాధల్ని కొని తెచ్చుకోవటంకన్నా, ఉన్న దానిని ఉన్నట్లు అర్థం చేసుకుంటే ఉనికి చెడదు. పనికి చేటుండదు.

స్నేహితులెలాగో, భార్యాభర్తలు, అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ళు, తల్లిబిడ్డలు, ఎవ్వరైనా అంతే. ఎవరు ఎవరికొరకైనా జీవించవచ్చు. అంత మాత్రాన ఎవరు ఎవరూ కాలేరు.

"మాది ఒకే మాట. మావి రెండు శరీరాలే కాని ప్రాణం ఒక్కటే. మాలో భేదాలు రావు. నెవర్" - ఇలాంటి మాటలు మాట్లాడినవా రందరు గతంలో చెమటకన్నా ఎక్కువగా కన్నీరే కార్చారు. ఈ విషయంలో వర్తమానం ప్రత్యేకంగా లేదు. భవిష్యత్తు ఉండబోదు.

ఇక్కడ లోతైన విషయ మొకటుంది. "మేమిరువురము ఒక్కటే" అనే వారికి వారిరువురు ఒకటి కాదని తెలియదంటారా? బాగా తెలుసు. అలా ఉంటే బాగుండు ననేది వారి ఆశ.

ఆశ తప్పని నేను అనను. ఫలించని ఆశల్ని ఆశిస్తూపోతే ఎదురయ్యేది నిరాశలే అనేది వాస్తవము అంటున్నాను. ఇరువురు ఒక్కరెలా అవుతారు? భౌతికంగా కారు; మానసికంగా కానేలేరు. తాత్త్వికంగా కాగలరు. అదొక ప్రత్యేకమైన అవగాహన. అక్కడ కూడా ఇరువురు ఒక్కటయ్యేది లేనేలేదు. ఉన్నదొక్కటే అని తెలియటమే.

"మిత్రమా! మన మెప్పుడూ ఒకేలా ఉండాలి. విడిపోకూడదు". అని ఎందుకు అంటుంటారో తెలుసా! ఎప్పుడైనా విడిపోవచ్చు అనే భయం ఉండటం చేతనే. ఎప్పుడూ ముడిపడి ఉండలేము అనే సత్యం తెలియుట చేతనే.

విడిపోయే అవకాశం ఉంది కనుక విడిపోకుండా ఉండేందుకు ఎదుటి వ్యక్తిని మానసికంగా సిద్ధం చేయటమే పై అభ్యర్థన వెనుక దాగియున్న ఆంతర్యం.

ఈ ప్రపంచంలో వ్యక్తంగానో, అవ్యక్తంగానో ప్రతి ఒక్కరు మరొకరి మనస్సును సిద్ధం చేసే ప్రయత్నంలోనే ఉంటారు. మనం ఇతరుల మనస్సులను త్రిప్పే ప్రయత్నం చేస్తూ ఉన్నట్లు, ఇతరులు మనల్ని త్రిప్పే ప్రయత్నంలో ముమ్మరంగా ఉంటారు. ఇదొక "టగ్ ఆఫ్ వార్". మరి ఈ త్రాడు ఎంతకాలం లాగాలి? ఎంతకాలం లాగినా, ఏదో ఓ కాలంలో పుటుక్కున తెగిపోయేదే.

కనుక, 'విడిపోకూడదు' అనే నిర్ణయంకన్నా "విడి వుండవచ్చు" అనే నిదానమే బ్రతుకులో ప్రధానము.

ప్రతి మనిషికి స్వాభిమానం ఉంది. ప్రతి వ్యక్తికి స్వబుద్ధి ఉంది. ప్రతి జీవికి స్వేచ్ఛా స్వాతంత్ర్యములున్నాయి. ఎవరిని ఎవరూ నిగ్రహించలేరు. నియమించలేరు. నిర్ణయించలేరు.


వివేకం గల వ్యక్తి మరొక వ్యక్తికి వివేకాన్ని కల్పించే ప్రయత్నం చేయవచ్చు. జ్ఞానము బుద్ధినుండి బుద్ధికి అందుతుంది. అలా ప్రయత్నం చేయవచ్చు. విఫలమైతే విషాదానికి గురి కాకూడదు.

ఒకరి బుద్ధి మరొకరి బుద్ధిలో జ్ఞానాన్ని నింపవచ్చు. నింపలేకపోవచ్చు. పెట్టేవారికే కాదు పట్టేవారికి కూడా చేతులుండాలి. ఒక చేతిని ఎంత ఊపినా ఉపయోగం ఉండదు. అంటే, చేతిని ఊపకూడదని నా ఉద్దేశ్యం కాదు. చిత్తం ఊగిపోకుండా చూసుకోవాలి అనేదే నా అభిమతం.

ఎవరెవరిలో ఏదేది చూడాలని మనం భావిస్తామో దానిని క్షుణ్ణంగా మనలో చూసుకొని ఆనందించటమే ఎద సౌందర్యం. ఎద పండాలే గాని ఎదుటివారు నిండినా, నిండకపోయినా మనకొచ్చే దండగ ఏమీ ఉండదు. అంతా పండుగే. కనిపించేదంతా కన్నులకు పండుగే.

భక్తి వైభవము

ఇందులో...



ఉన్నవన్నీ ఉమాపతివే

గృహానికి నీవు యజమానివి. విశ్వానికి పరమాత్మ యజమాని. గృహం విశ్వం లోనిదే. విశ్వానికి వేరు కానిదే. అలాంటప్పుడు గృహం కూడా భగవంతునిదే. నీవు అద్దెకు ఉంటున్నావు. అంతే.

అద్దెకు ఉండేవాడు ఇంటిని, ఇంటిలోని సౌకర్యాలను వినియోగించుకుంటాడు. అలా చేయడంలో తప్పులేదు, 'ఇది నాది' అనుకుంటేనే బాధ. ఆ క్షణం నుండే దుఃఖము ప్రారంభమవుతుంది.

యజమాని ఇల్లు అద్దెకిచ్చినట్లు పరమాత్మ మనకు సమస్తాన్ని ప్రసాదించాడు. ఇల్లిచ్చాడు. ఒళ్ళిచ్చాడు. కళ్ళిచ్చాడు. కాళ్ళిచ్చాడు. భార్యనిచ్చాడు. భర్త నిచ్చాడు. బిడ్డల్ని అనుగ్రహించాడు. ఆహారాన్నిచ్చాడు. పానీయాన్నిచ్చాడు. ఆస్తులిచ్చాడు. ఆత్మీయుల్ని ఇచ్చాడు. ప్రకృతినిచ్చాడు. ప్రాణాన్నిచ్చాడు.

ఇవన్నీ నీకే. కాని, అవి నీవి కావు. బండి రాలేదని ప్లాట్‌ఫారం మీద కుర్చీలో కూర్చొని నిరీక్షిస్తున్నాం. బండి వచ్చింది. లేచి వెళ్ళి బండినెక్కాం. ఇంతవరకు మనం కూర్చున్న కుర్చీని త్యజించి వెళ్ళాం. ఎందుకని? అది మనది కాదు. సర్కారు వారిది. వస్తువు ప్రభుత్వానిది. వినియోగం మనది.

బండి పోతూఉంది. ప్రక్కన కూర్చున్న వారి చేతిలో పత్రిక ఉంది. అడిగి తీసుకున్నాం. చదువుకున్నాం. విషయాలు తెలుసుకున్నాం. స్టేషను వచ్చింది. వారి పత్రికను వారికిచ్చి దిగిపోతాం. పేపరు ప్రక్కవారిది. వినియోగం మనది.

ఈ ప్రపంచంలో అంతా వినియోగమే. విని అర్థం చేసుకో. ఈ సత్యం వంటబడితే బ్రతుకే నైవేద్యమవుతుంది. ఏది లభించినా ప్రసాదంగా భాసిస్తుంది.

బండి రాలేదని కుర్చీలో కూర్చుని నిరీక్షిస్తున్న మనం కాఫీ త్రాగటానికి లేచి వెడుతూ, "ఏమండీ! నా కుర్చీ చూస్తూ ఉండండి" అని చెప్పి వెళ్తాము. అంటే, మళ్ళీ వచ్చి వినియోగించుకుంటామని అర్థం. అక్కడ "నా కుర్చీ" అని పలికామేగాని ఆ కుర్చీ మనది కాదని, సర్కారు వారిదని ఇతరులకు తెలిసినా తెలియకపోయినా, మనకు మాత్రం స్పష్టంగా తెలుసు. "నా కుర్చీ" అనేది గౌణమే కాని సత్యం కాదు.

అన్నీ అంతే. కుర్చీలో కూర్చొని బండి వచ్చిన క్షణాన నాది కాదని కుర్చీని వదలి లేచి వెళ్ళినట్లు, మృత్యువు ఆసన్నమైన క్షణాన సమస్తాన్ని వదలి ప్రయాణం సాగించాలి.

అద్దె ఇంటిని ఆనందంగా వదలినట్లు, కుర్చీని ప్లాట్ ఫారమ్ పైనే వదలి బండెక్కి నట్లు, బండిలో పేపరు చదివి బండి దిగేముందు అది ఎవరిదో వారికిచ్చినట్లు-, ఈ ప్రపంచంలో మనకున్నవన్నీ పరమాత్మవే కనుక అతడు ఏ క్షణాన తిరిగి ఇవ్వమని అడిగినా ఆలోచించకుండా హాయిగా తిరిగి అప్పగించడానికి ఎప్పుడూ సంసిద్ధంగా ఉండాలి. ఇలా ఉండేవాడే భక్తుడు. భగవంతునికి ప్రియుడు.

ఈ సత్యాలన్నీ స్ఫటికం లాగ చక్కగా తెలుస్తూ ఉండినా 'నాది' అనే మమకారాన్ని మనిషి వదలలేడు. మమకారం చర్చించినంత తేలికగా పోదు. అహంకారం ఉన్నంత వరకు మమకారం దూరం కాదు.

కనుకనే, ఈ ప్రపంచంలో జీవించి యున్నంతకాలం ఏదో కొంత త్యాగం చేస్తూ పోవాలి. దానం చేస్తూఉండాలి. ఇవి చేయటంలో ప్రధానమైన విషయం 'సేవ' కాదు అనే సత్యాన్ని అందరూ గ్రహించలేరు. సేవ రెండవ విషయం.

తన కున్నవన్నీ పరమాత్మవే యని గ్రహించి, పొరపాటున అజ్ఞానంతో తనవి అనుకున్న వాటిని కాదని నిర్ణయించుకోవడమే వాటిని అవసరమైన వారికి ఇవ్వటంలో ఉండే అవగాహన. ఇక్కడ జరిగేది ఎవరికో దానంచేయటం కాదు; మన మెవరిమో, ఏమిటో తెలియకుండా బ్రతకటానికి పునాది వేసిన అహంకారాన్ని తుది మొదలు దహనం చేయటమే.

ఇలా చేయటానికి మనకు విశ్వాసం దృఢంగా ఉండాలి. ఒక్క విశ్వాసము సరిపోదు. రెండు విశ్వాసాలుండాలి. **(1)** ఇక్కడ నాకున్నవన్నీ నావి కావు అనే విశ్వాసం **(2)** ఉన్నవన్నీ ఉమాపతివేననే దృఢవిశ్వాసం.

నేను ఈ ప్రపంచ పవిత్రాలయంలో పూజారిని. అన్నిటినీ సమర్పించేందుకే ఇక్కడ నేనున్నాను. సమర్పణలో తిరిగి నాకు లభించేది ప్రసాదము. అదే ప్రశాంతత. అదే పవిత్రత.

ఇక ఇలా జీవిద్దాము. నూతన జీవితాన్ని ప్రారంభిద్దాం. నిత్య నూతనంగా శోభించేందుకు సిద్ధపడదాం.

వంటలెన్నో తయారవుతున్నాయి. అయినా ఆకలిమంటలు తీరటం లేదు. అది వంటవాని తప్పు కాదు. వడ్డించేవాని తప్పు కాదు. తినడానికి అలవాటు పడనపుడు ఎన్ని వంటలు చేసి ఏమి ప్రయోజనం?

మస్తకాలు సిద్ధపడక పోతే పుస్తకాలు చేసేది ఏమీ ఉండదు. బుద్ధి శుద్ధిపడకపోతే బోధలు రుచించవు. రుచించినా ఫలితాలను ప్రసాదించవు.

మార్పును అందరూ వాంఛిస్తారు. మారేందుకు ఎవ్వరూ సిద్ధపడరు. అవును. మార్పు చాలా బాధాకరమైనది. అందుచేతనే మారాలనుకున్నా మనుషులు మారలేకపోతారు.

ఎవరు ఎవరినీ మార్చవలసిన పని లేదు. మహిమలో తాను వెలుగుతూ ఉంటే, మార్పులు రాదలచుకుంటే వస్తాయి. రాకూడదనుకుంటే విశ్రాంతి తీసుకుంటాయి. ఈ అవగాహన రాగలిగితే గొప్ప మార్పు వచ్చినట్లే.

విజయ సంకేతం

జీవితమొక భయంకర సమరము. ఈ సంగ్రామము నేడు ప్రారంభమైనది కాదు. అనేక వేల జన్మల నుండి సాగుతూ ఉన్నదే. మనలోని భక్తిభావాలకు, విషయ పిపాసకు మధ్య అనాదిగా యుద్ధము జరుగుతూనే ఉంది. భక్తి జయించిన నాడే బ్రతుకు ధన్యమవుతుంది. భగవత్కృప లభించినప్పుడే భక్తికి విజయము లభిస్తుంది.

భగవంతుడు దయాసాగరుడు. ఆయన సర్వవ్యాపి. ఇది నిజమో! కాదో! అనుభవములో దర్శించుటయే సాధన.

ఆహారమును ఆరగించే పని నీది. దానిని జీర్ణము చేయుపని భగవంతునిది. **"పచామ్యన్నం చతుర్విధం"** నీవు భుజించే నాలుగు రకములైన పదార్థములను జఠరాగ్ని రూపంలో తానే పచనము చేస్తూఉన్నట్లు పరమాత్మ గీతలో తెలిపియున్నాడు.

అలాగే జీవిత సమరంలో పోరాడే పని మనది. గెలిపించే పని అతనిది. గెలుపు మనమీదే ఆధారపడి యున్నదని మనం భావించుటయే కొన్ని వేల జన్మలలో మన ఓటమికి కారణమైంది. గెలిపించే వాని వైభవమును స్మరిస్తూ పోరాడటం అలవరచుకోవాలి. విజయము మనల్ని వరిస్తుంది.

"నేను చాలాకాలంగా సాధన చేస్తూ ఉన్నాను. భగవత్కృప నాకు లభించలేదు. నా బాధలు తీరడం లేదు. కష్టాలు కరగడం లేదు" అని వాపోవటం శుద్ధ మూర్ఖత్వము. నేడు మనం చేసే సాధనలు మనకు గోచరిస్తున్నాయి గాని అనేక జన్మలలో మనం ఆచరించిన పాపాలు మనకు తెలియవు. బాధలు మిగిలున్నాయంటే ఇంకా సాధన చేయవలసియున్నదని భావము. శత్రుశేషము మిగిలియున్నంత వరకు విజయము లభించలేదనే అర్థము.

ఎంతగా శ్రమించినా, ఆర్జించినా, అన్యుల నుండి సాయమును పొందినా మనం సుఖించలేము. మన దోషములను తొలగించువాడు, మనకు తోషమును ప్రసాదించువాడు భగవానుడొక్కడే.

పరమాత్మను విశ్వసించుట అనేది లోకులు భావించినంత తేలికైన పని కాదు. విశ్వాసము విలువ మాటలకందనిది. అదొక కవచధారణ వంటిది. నిర్భయమును, నిర్మలత్వమును ప్రసాదించునది భగవంతునిపై నీకున్న విశ్వాసమే.

మన భారాన్నంతా భగవానునికి అర్పించాలి. జగన్నాథుడైన పరమాత్మను పూర్ణ విశ్వాసముతో ఆశ్రయించాలి. విశ్వామిత్రుని యాగశాలముందు కోదండమును ధరించి నిలిచినట్లు మన జీవితంలో రాముడు ప్రవేశిస్తాడు. భగవంతునిపై భారము నుంచి చరించడమంటే శ్రీకృష్ణుని బ్రతకు బండిలో కూర్చోబెట్టుకోవడమని అర్థము.

"రక్షస్యతీతి విశ్వాసః". 'భగవానుడు నన్ను రక్షించును' అనెడి విశ్వాసము మనల్ని ఉద్ధరిస్తుంది. పరమాత్మ నిజముగా నన్ను రక్షించునా? అనెడి సంశయము అధోగతిని కల్పిస్తుంది.

ప్రపంచములో కీర్తిప్రతిష్ఠలు ఉండవచ్చు. ధనము ఉండవచ్చు. దుఃఖమును పోగొట్టలేకపోతే అవి వుండి ఏమి ప్రయోజనము? దుఃఖమును పోగొట్టువాడు, అనంత సుఖమును ప్రసాదించువాడు పరమాత్మ ఒక్కడే.

నమ్మి చెడినవారు లేరు. నమ్మక సుఖించినవారూ లేరు. ప్రారబ్ధాలు ప్రబల శత్రువులై నిలిచి ఉన్నాయి. పురుషార్థమునే మిత్రుడుగా చేసికొని, అవిశ్రాంత పోరాటమును సాగించి, భగవత్కృపతో విజయమును సాధించాలి. ఇదొక్కటే సాధకుల కర్తవ్యము.

యాచనా చాతుర్యం

శ్లో॥ భిక్షాం దేహి గృహాణ కీదృశ మభి ప్రేతం ప్రతిజ్ఞా దృఢా
బాఢం పృచ్ఛ హిమాచలం న గృహిణీం భిక్షాం వ్రతీ పృచ్ఛతి
త ద్భిక్షు స్తనయా మియం త్రినయనా యత్తా ప్రతిజ్ఞా మృషే
త్యంతశ్ఛద్మ పరీక్షితాచలవధూఽ భావాయ తుభ్యం నమః॥

భావము:- **శివ:-** అమ్మా! నాకు భిక్ష పెట్టు.

మేనాదేవి :- నీకు ఎలాంటి భిక్ష ఇష్టమో అడిగి తీసుకో.

శివ:- నాకు దృఢమైన ప్రతిజ్ఞ భిక్షగా కావాలి.

మేనాదేవి :- మంచిది. అయితే నా భర్తయైన హిమవంతునే అడుగు. ఎందుకంటే స్నాతక బ్రహ్మచారి ఇలాంటి భిక్షము అవసరమైనచో యజమానిని అడగాలే కాని ఇల్లాలిని అడగరాదు.

శివ:- అలా అయితే, నీ కుమార్తె పార్వతిని భిక్ష మడుగుతాను.

మేనాదేవి:- ఆమె ముక్కంటికి నిర్ణయమై యున్నది.

ఈ విధముగా పార్వతి తల్లియగు మేనాదేవిచేత పార్వతి తనకు భార్య కాబోతున్నదని పలికించిన కపటోక్తుల శివునకు నమస్కారము.

పార్వతిని భిక్ష అడుగుతాను అనుటలో భిక్ష పెట్టమని పార్వతిని అడుగుతాను అని ఒక అర్థము. పార్వతినే భిక్షగా అడుగుతాను అని మరియొక అర్థము. పార్వతి పూర్ణ భక్తి స్వరూపము. పరమశివుడు ఆదిభిక్షువు. భక్తుల హృదయముల యందలి భక్తిని భిక్షగా గ్రహించటం తనకు చాలాఇష్టము.

భగవత్కృప

ఈ విశ్వంలో ఎన్నో సంస్థలు గతంలో ఆవిర్భవించాయి. అలాగే అంతరించాయి కూడా. ఎందుకో తెలుసా! అవి సంబంధాలతో రూపుదిద్దుకున్నాయి కనుక. సంస్థల వలె వ్యవస్థలు కూడా ఎన్నో పుట్టుకొచ్చాయి. అవి కూడా పుట్టగొడుగుల వలె గిట్టినవే గాని గట్టిగ నిలద్రొక్కుకొని నిలబడలేక పోయాయి. పరిమితమైన వ్యక్తులు నిర్మించినవే కనుక పతనాన్ని చూడక తప్పలేదు.

రాజ్యాలు రాలిపోయాయి. కుటుంబాలు కూలిపోయాయి. మరణం తెలియని మనుగడ ఎలాంటిదో మానవాళికి అర్థం కాలేదు. ప్రపంచంలో అన్నీ మారిపోయేవే. జారిపోయేవే. మారని, మార్పులేని స్వరూపము ఒక్కటే. అదే పరమాత్మ. అతడే భగవంతుడు. భగవంతుని పొందేందుకు చేయు ప్రయత్నమే భక్తి.

ప్రపంచంలో అన్నీ నశించిపోవచ్చు. భక్తి నశించదు. క్షయ మెరుగదు. భక్తికి లోటు తెలియదు. వెలితి అర్థం కాదు. నిత్యసుఖమును భక్తి ప్రసాదిస్తుంది. పరమ శాంతిని అనుగ్రహిస్తుంది. నారదుని మాటల్లో చెప్పాలంటే భక్తి అమృత స్వరూపము.

సర్వదా సర్వభావేన నిశ్చింతైః భగవానేవ భజనీయః

"చింతలన్నీ వదలి సదా హృత్పూర్వకంగా పరమాత్మనే సేవించాలి" అని నారద మహర్షి భక్తిసూత్ర ప్రబోధము.

పరమాత్మను సర్వదా సేవించు భక్తులు పరమాత్మ కృపను శీఘ్రముగా పొందుతారు. తనను ధ్యానించు భక్తులకు తన స్వరూపమును పరమాత్మ ప్రేమతో తెలియపరుస్తాడు **(నిజస్వరూప బోధకమ్).**

ప్రహ్లాదుని ఉద్ధరించుటకు స్తంభం నుండి వ్యక్తమయ్యాడు. మీరాను రక్షించే ప్రయత్నంలో విశ్వరూపుడైన పరమాత్మ విషపు గిన్నెలో ఇమిడిపోయాడు. అర్జునుని భక్తికి చలించి విశ్వరూపముతో దర్శనమిచ్చాడు.

స కీర్త్యమానః శీఘ్రమే వావిర్భవతి అనుభావయతి చ భక్తాన్

"భక్తి శ్రద్ధలతో పరమాత్మను కీర్తించువారికి శీఘ్రముగా భగవానుడు ప్రసన్నుడై ఆత్మజ్ఞానమును ప్రసాదిస్తాడు".

సంతతం చిన్తయేఽనంత మంతకాలే విశేషతః

"అనంతుడైన పరమాత్మను సంతతము చింతిస్తాను. మరణకాలమున విశేషంగా స్మరిస్తాను" అన్నారు శ్రీ మధ్వాచార్యులు.

స్మరించే భక్తులను, అనుస్మరించే భక్తులను కృప జూపి రక్షించే కరుణామయుడు భగవంతుడు. కనుకనే దీనదయాళుడైన భగవానుడు కృపాకరుడు **(కృపా- ఆకరమ్).**

ఈ సందర్భములో **దయ - కృప** అనే పదాలను జాగ్రత్తగా పరిశీలించి అర్థం చేసుకోవాలి. "బాబూ! దయపెట్టండి" అని ఆర్తుడైన బిచ్చగాడు అర్థిస్తాడు. అతని ఆర్తిని జూచి చలించి ఒకానొక వ్యక్తి దయతో సాయం చేస్తాడు. ఉద్యోగాన్ని అర్థించే

టప్పుడు, ఆర్థిక సహాయాన్ని కోరేటప్పుడు, బాధల నుండి విముక్తిని వాంఛించేటప్పుడు "దయ పెట్టండి" అంటాం.

దయ పెట్టండి - కృప చూడండి, ఇది వాక్య ప్రయోగము. అడిగితే పెట్టేది దయ. అర్థించకపోయినా చూపేది కృప. ఈ తేడాను సునిశితంగా, సున్నితంగా అర్థం చేసుకోవాలి.

భార్య ఇంటిపనులన్నీ నిర్వహిస్తూ ఉంటుంది. భర్తకు సేవ చేస్తూ ఉంటుంది. గృహాన్ని, బిడ్డల్ని శుద్ధిగా, బుద్ధిగా తీర్చిదిద్దుతూ ఉంటుంది. తనకు మిగిలినా, మిగలకపోయినా భర్త, బిడ్డలు తృప్తిగా భుజించేలా చూస్తుంది. **'సర్వదా సర్వభావేన'** గృహ సౌఖ్యమే తన సౌఖ్యంగా భావించి జీవిస్తూ ఉంటుంది. తనకు 'అది కావాలి - ఇది కావాలి' అని భర్తను అడగదు.

కాని, ఒకరోజు-చీరలతో, నగల పెట్టెతో భర్త ఇంటికి వస్తాడు. భార్యను పిలిచి ప్రేమతో ఆమె చేతిలో ఉంచుతాడు. ఆమె ఇలా ఎప్పుడూ ఊహించలేదు. ఆశ్చర్యపోతుంది. భర్తవంక చూస్తుంది. "ఎందుకివన్నీ" అన్నట్లు. "నీవు అడిగావని తీసుకురాలేదు. నేను సంతోషపడి తెచ్చాను. కట్టుకో. పెట్టుకో" అంటాడు. భర్త ప్రేమను గాంచి ఇల్లాలి నేత్రాలు చెమ్మగిల్లుతాయి. ఇది భర్త భార్యపై దయ పెట్టడంకాదు. కృప చూడడం. దయ కృతజ్ఞతను నింపుతుంది. కృప ప్రేమామృతంతో తడుపుతుంది.

సరే, అదలా ఉంచండి. మరొక కోణంలో చూద్దాం. పరీక్షలు దగ్గరయ్యాయని అబ్బాయి ఓ మూల కూర్చొని చదువుతూ ఉంటాడు. అతని దృష్టి అంతా చదువు మీదే ఉంటుంది. పరీక్షలపైనే ఉంటుంది. స్నానం చేయాలనేది మరచిపోతాడు. అన్నం కూడా జ్ఞాపకం రాదు.

'బాబూ! లే! బువ్వ దిని ఆ తరువాత చదువుదువు గాని' అని బలవంతంగా లేపి తల్లి అన్నం పెడుతుంది. ఇక్కడ 'ఆకలి' అని పిల్లవాడు అర్థించడం లేదు. బిడ్డ ఆకలిని చూసి తల్లి పెడుతోంది. ఇది దయ పెట్టడం కాదు. కృప చూడడం. బిడ్డ చెయ్యవలసిన పనిని బిడ్డ చేస్తుంటే అభ్యర్థనకై ఎదురు చూడకుండా తల్లి తన పనిని తాను నిర్వహిస్తుంది. భక్తుడు తాను చేయవలసిన పనిని తాను త్రికరణశుద్ధిగ చేస్తే భగవంతుడు ప్రార్థించకపోయినా ప్రసాదమును అందిస్తాడు. కృపజూపి రక్షిస్తాడు. ఇదే ఉత్కృష్టమైన శరణాగతి.

తమేవ శరణం గచ్ఛ సర్వభావేన భారత
తత్ప్రసాదా త్పరాం శాన్తిం స్థానం ప్రాప్స్యసి శాశ్వతమ్ ॥

"అర్జునా! సర్వభావములచే అట్టి పరమాత్మనే శరణుపొందు. అతని అనుగ్రహము చేత ఉత్తమమైన శాంతిని, శాశ్వతమైన ముక్తిని పొందుతావు" అని శ్రీకృష్ణ పరమాత్మ భగవద్గీత - మోక్ష సన్న్యాస యోగములో తెలిపారు.

కనుక నిజభక్తులైన వారు దయకంటెను, కృపకే ఎక్కువ ప్రాధాన్యత నివ్వాలి. పరమాత్మ వద్ద బిచ్చగాళ్ళ వలె కాక బిడ్డలవలె మెలగాలి. బిడ్డలై మిగలాలి.

పాప పరిహారం

పంటలు పండించాలనే ప్రయత్నములో మనం పెట్టే బాధలను భూమాత సహనంతో భరిస్తూ ఉంది. పండ్లను అందించాలనే సంకల్పముతో పూలు ఆనందంగా రాలిపోతున్నాయి. పాలనివ్వాలనే ఉద్దేశ్యముతో ఆవులు గడ్డి మేస్తున్నాయి. వానలు కురిసేందుకు మబ్బులు దూరంగా పయనిస్తున్నాయి. మనోబుద్ధులున్న మానవుడు ఈనాటికి చేసిందేమిటి?

పుణ్యము ఇసుమంతైనను లేదు. బ్రతుకంతా పాపపు కసువే. అనుభవించకుండా నశించనిది ఏదియో అదియే పాపము. పుణ్యఫలమును "కృష్ణార్పణం" చేయవచ్చు. పాపఫలమును మనమే అనుభవించాలి. అయినా మానవుడు పాప కర్మాచరణమును మానుట లేదు.

'మానవుడు' అనే పదానికి మహాత్ములు అనేక అర్థాలు తెలిపియున్నారు. "మా" అంటే మాయను, "న" అంటే అంటకుండ, "వ" అంటే వర్తించువాడు అని కూడ చెప్పియున్నారు.

అనేక జన్మలలో అసంఖ్యాకములైన దురితములను ఆచరించిన దోషానికి నేడు దుర్గతిని అనుభవించుచున్నాము. అయినా దుష్టకర్మలను మానవులు మానలేకయున్నారు.

"మానవా! ఈ పాడు కర్మలు మానవా! మానలేవా!" కనుక, మానవా! అనగానే ఇకనైనను దుష్కర్మలను మానవా! అనే హెచ్చరిక వినిపిస్తూనే ఉంది.

పరితపిస్తున్నావా? పశ్చాత్తాపముతో కుమిలిపోతున్నావా? భయపడకు. భగవానుని అభయహస్తము నిన్ను రక్షిస్తుంది. గీతామాత అమర సందేశము నిన్ను బుజ్జగిస్తుంది. విను,

అపి చేత్సుదురాచారో భజతే మా మనన్యభాక్
సాధురేవ స మంతవ్య స్సమ్య గ్వ్యవసితో హి సః

"దురాచారవంతుడైనను, అనన్య భక్తికలవాడై నన్ను భజించునేని, స్థిరచిత్తము గలవాడైన అతడు సాధువేయని యెంచబడును" అని భగవద్గీత - రాజవిద్యా రాజగుహ్య యోగములో భగవానుడు తెలిపియున్నాడు.

గతంలో ఆచరించిన పాపకర్మల యొక్క ఫలితాలు ప్రారబ్ధ రూపంలో పర్వతముల వలె ఎదుట నిలిచి దాట నశక్యమై ఉన్నాయి. అడ్డుగోడవలె అవరోధాలై యున్నాయి.

ప్రతిరోజు మనం తెలిసో, తెలియకో, వాక్కు ద్వారా గాని, కర్మల ద్వారా గాని, ఆలోచనల ద్వారా గాని అనేక పాపాలు చేస్తూ ఉంటాము. చేయదగినవి చేయక కొన్ని పాపాలు, చేయకూడనివి చేసి మరికొన్ని పాపాలు ప్రోగుచేసుకొంటూ ఉంటాము.

నేడు చేసే పాపాలు చాలా తక్కువగానే తెలుస్తున్నా ఈనాటి పాపాలకు ప్రేరణలుగా, పునాదులుగా ఉన్న పాపాలు మాత్రం పర్వత రూపాలుగా ఉంటాయి. పాతవి ప్రక్షాళనం కాకపోగా క్రొత్తవి తోడుగా చేరిపోతున్నాయి. ఈ పాపాల నుండి విడిపడి అంతఃకరణ శుద్ధి పొందటానికి భక్తి ఉపకరిస్తుంది. నామము సహకరిస్తుంది. పూజ మనస్సును శుద్ధి చేస్తుంది. జపము పాపనాశానికి దోహదం చేస్తుంది. భక్తియుత కార్యాలు పాపులను పరిశుద్ధం చేసి పవిత్రులుగా మార్చుతాయి.

చెట్లు పండ్లు ఇస్తాయి. ఇది కర్మే గాని, పుణ్యకర్మ కాదు. నదులు నీళ్ళిస్తాయి. ఆవులు పాలిస్తాయి. మొక్కలు పూలు ఇస్తాయి. భూమి బంగారాన్నిస్తుంది. ఇవన్నీ పరోపకారాలే. అయితే, ఈ పరోపకారాలన్నీ కర్మలే. వీటికి పుణ్యఫలం రాదు. ఇవన్నీ ప్రకృతిలో సాగుతున్న కర్మలే గాని, సంకల్పించి చేసినవి కావు. కనుక, ఈ కర్మలకు దృష్ట ఫలమే లేదు. ఇక పుణ్యఫలమనే అదృష్టం ఎలా ప్రాప్తిస్తుంది?

బంగారు ఇవ్వటం వలన భూమికి పుణ్యం రానపుడు, భూమి కంపించి వేలాది మందిని పొట్టన బెట్టుకున్నా, లక్షలాది మందిని నిరాశ్రయుల్ని చేసినా పాపం మాత్రం ఎలా వస్తుంది?

పాలిచ్చిన ఆవుకు పుణ్యఫలం లేనపుడు, పాలు పితికేవాణ్ణి తన్నితే ఆవుకు పాపం ఎలా వస్తుంది?

మనిషి విషయం వేరు. స్వేచ్ఛ ఉండి, ఆలోచించి కర్మ లాచరిస్తాడు కనుక అతడు కర్మాధికారి. **(కర్మణ్యే వాధికారస్తే).** పాలిచ్చినా ఆవుకు పుణ్యం రాదు. స్వర్ణ మిచ్చినా భూమికి సద్గతి లేదు. కాని, మనిషి సత్కర్మ లాచరిస్తే సత్ఫలితాలను అందుకుంటాడు. ఇక, ఆలస్యమెందుకు?

శరణాగతి

సాధన కర్మరూపంగా తెలిసినా వాస్తవానికి అది భావరూపమే. కర్మకు పూర్ణాహుతి ఉంది. కానీ భావానికి పూర్ణాహుతి ఎక్కడ? భావరూపమైన సాధనకు శరణాగతియే పూర్ణాహుతి. పూర్ణాహుతి జరిగిన పిదప ఇక కర్మ లేదు. శరణాగతి జరిగితే ఆ తరువాత కర్త మిగలడు.

మరణగతి తెలియని స్మరణస్థితియే శరణాగతి.

సాధన సౌలభ్యము తెలిసినవారికి సాధ్యవస్తువు లభిస్తుంది. చరించే నేర్పు అలవడితే తరించే మార్పు అగుపిస్తుంది. సాధన ప్రగతి వేదనలవలన రాదు. వేడుకొంటే రాదు. కాలప్రమేయముతో కదలదు. కనికరిస్తే కలుగుతుంది. దైవము కరుణ జూపితే మిగులుతుంది.

మన ఆచరణయే మనకు ఆవేదనలను అందిస్తూ ఉంది. పరమాత్మ అపార కృపతో ఆవేదనలను ఆరాధనలుగా మార్చుకోవాలి. భక్తుడు ప్రతి సన్నివేశములో పరమాత్మ హస్తమును దర్శింపగలడు.

పరమాత్మ పవిత్ర కరమును మనము పట్టుకొనగలమా? ఆ దివ్యాత్ముని పవిత్ర సంకల్పమును మనము కనిపెట్టగలమా? పరిమిత మనస్సుకు అపరిమితమైన శక్తి ఎలా అవగతమవుతుంది? కనుక బుద్ధిని పరమాత్మకు సమర్పించి, అలా సమర్పించినట్లు కూడా తెలియని దివ్యానందములో మైమరచిపోవాలి. అదియే నిజమైన శరణాగతి.

భగవానునికి శరణాగతులమైన తరువాత మనలో "నేను-నాది" అనేవి ఎలా మిగులుతాయి? "నేను భగవానునకు శరణాగతుడను" అని పలికే మనస్సు ఎక్కడ నిలిచి ఆ మాట అంటున్నది? శరణాగతి జరిగిన తరువాత ప్రత్యేకమైన ఉనికి ఎలా నిలుస్తుంది? శరణాగతిని గూర్చి ప్రవచించే "అహం" మిగిలియున్నంత వరకు శరణాగతి ఎక్కడ జరిగింది?

'నేను పరమాత్మకు శరణాగతుడను. అయిననూ నాకు బాధలు తీరుటలేదు' అని సాధకులు పలుకుతూ ఉంటారు. నీవు భగవానునకు పూర్ణ శరణాగతుడ వైనచో ఆ తరువాత ఈ బాధలను గుర్తించుచున్న దెవరు? ద్వైతము తెలిసినంతవరకు పూర్ణశరణాగతి జరుగలే దనియే భావించాలి.

శరణాగతి జరిగిందంటే మనస్సు ఆశించదు. ఇంద్రియాలు ఆక్రోశింపవు. బుద్ధి ప్రశ్నించదు. చిత్తము చలించదు. అహంకారము అగుపించదు. హృదయము తపించదు. ద్వంద్వములు తెలియని ఆ సమస్థితిలో విషమగతులు అర్థంకావు. కనుక శరణాగతి మార్గమే కాదు. గమ్యము కూడా.

శరణాగతిలో ముఖ్యంగా మూడు విషయాలను జ్ఞాపక ముంచుకోవాలి. (1) పరమాత్మ సత్యము. అన్యమైన దంతయు అశాశ్వతము (2) పరమాత్మ కరుణా సముద్రుడు. సరియైన సమయంలో భక్తుల బాధలను నివృత్తి చేసి ఉద్ధరిస్తాడు. (3) సర్వకర్మములు ఆయన దివ్యకృప వలననే సాగిపోతున్నాయి.

మొదటి లక్షణము శరణాగతిని ధ్రువపరుస్తుంది. స్థిరపరుస్తుంది. రెండవ లక్షణము ఆందోళనలను, ఆవేదనలను అంతమొందించి చిత్తమును శివునియందు నిలుపుతుంది. మూడవ లక్షణము వ్యక్తిని నిరంతరము పూర్ణశాంతిలో ఓలలాడునట్లు చేస్తుంది.

శరణాగతియే సర్వులకు గతి లేక గమ్యము. సమస్త యోగములయొక్క గతి కూడా శరణాగతియే.

గతి తెలిసి, మతి నిలిపి, చితి రగిలేలోగా పతిని దర్శించాలి. కరుణను పొందాలి. తరుణము జారిపోకూడదు. ప్రయత్నించు.

శరణాగతియే జీవికి పూర్ణాహుతి.

మనకు ఏది లేదు ఎంత లేదు అనేది అనవసరం. మనకు ఉన్న శక్తిని మనం ఉపయోగొపెట్టుకొంటున్నామా? కుంటివారు ఎలాగూ నడవలేరు. నడవగలిగే శక్తి ఉన్న మనం నడుస్తున్నామా? ఆలోచించగలిగే శక్తి ఉండినా, ఆలోచిస్తున్నామా? చేయగలిగింది చేస్తున్నామా? చేయగలిగిందే చేయలేనపుడు ఇక చేయవలసింది ఏమి చేయగలుగుతాము?

ఉన్నది ఉన్నతిని పొందేది వినియోగములోనే. వినియోగానికి అనుకూల పరిస్థితుల్ని, కార్యాలను ఎవరి అభిరుచికి వారుగా సృష్టించుకోవాలి. ఆ తరువాత, ఆ దిశగా ప్రయాణాన్ని ఉత్సాహంతో సాగించాలి. అంతే. జీవితం ఆ క్షణం నుండే దివ్యంగా శోభిస్తుంది.

మనిషి - మహిమ

ఒక సుందరమైన విగ్రహాన్ని తయారుచేసిన శిల్పి అందంగా ఉండకపోవచ్చు. అరుదైన అందమైన శిల్పాన్ని తయారుచేసిన శిల్పి ఎంత సుందరుడో అని మనం భావించినా వాస్తవానికి అతడు అలా కాకుండా ఉన్నా మనం ఆశ్చర్యపడనవసరం లేదు. కాని, రమణీయమైన ఈ సృష్టిని తయారు చేసిన పరమాత్మ మాత్రం సుందరుడే, నిత్య సుందరుడే, సుందరేశ్వరుడే!

అందమైన విగ్రహాన్ని తయారుచేసిన శిల్పి అందంగా ఉండకపోవటానికి కారణం తాను తయారుచేసిన విగ్రహం తనకన్నా అన్యంగా ఉండటమే. విగ్రహం తయారు చేయడానికి నిమిత్త కారణం తానే అయినా ఉపాదానమైన రాయి తనకన్నా వేరుగా ఉంది. కాని, ఈ సృష్టికి అభిన్న నిమిత్త ఉపాదాన కారణం పరమాత్మే కనుక సృష్టిలో ఎక్కడ చూసినా భగవంతుడు లేకుండా పోయే అవకాశమే లేదు. కుండకు ఉపాదాన కారణమైన మన్ను కుండంతా ఎలాగైతే వ్యాపించి ఉందో, ఈ సృష్టికి ఉపాదాన కారణమైన పరమాత్మ ఈ సృష్టి అంతా నిండి ఉన్నాడు. మట్టికి దూరంగా ఏ కుండా లేదు. పరమాత్మకు దూరంగా ఈ సృష్టిలో ఏ వస్తువు గోచరించదు. కనుక ఎన్ని అందాలు ఈ సృష్టిలో గోచరిస్తూ ఉండినా ఈ అందాలన్నిటిలో అందం తానైఉన్నాడు. అందంలో అందంగా ఉన్నాడు, అందమై ఉన్నాడు. కనుక ప్రాణవాయువును వదలిపెట్టి దూరంగా మనిషి జీవించగలడేమో గాని పరమాత్మకు దూరంగా ఈ స్థావరజంగమాత్మకమైన ప్రపంచంలో ఏ ప్రాణీ జీవించలేదు.

ఈ సృష్టిలో ప్రతిది ప్రతిదానితో ముడిపడి ఉంది. ఆ పూర్ణత్వాన్ని దర్శించేందుకే ఈ ప్రపంచంలో మనం ఉన్నాము. ఎన్ని ప్రవచనాలు జరుగుతూ ఉండినా, ఎన్ని ప్రసంగాలు నడుస్తూ ఉండినా, భగవద్గీత ఐదువేల సంవత్సరాలు మనదగ్గరే ఉండినా, ఇంకా ముందు నుండి ఉపనిషత్తులు మనలను పెనవేసుకొని ఉండినా, ఈ సత్యం అర్థంగాక కాలం దొర్లిపోతూ ఉంది. శ్మశానం దగ్గరౌతూ ఉంది. ఇదొక దురదృష్టకరమైన విషయం.

ఈ సృష్టిలో నానాత్వం గోచరిస్తూ ఉండినా ఇక్కడ ఉన్నది ఏకత్వమే. అనేకం ఈ ప్రపంచంలో తెలుస్తూ ఉండినా ఆ అనేకాల్లో భేదం లేదు. భేదం లేదు కనుక అభిన్నమైనటువంటి స్థితి అఖండంగా ఉంది. అదే ఏకత్వం. అందుకే ఇది యూనివర్స్ **(uni-verse)**, కాదెన్నడూ మల్టీవర్స్ **(multi-verse)**.

సూర్యుడి చుట్టు భూమి తిరుగుతూ ఉంది. సౌరమండలమంతా ఒక అద్భుతమైన, ఉజ్జ్వలమైన తారావైపుకు కదిలిపోతూ ఉంది. ఇలా విశ్వాన్నంతా మనం పరిశీలించి చూస్తే, ఇంతవరకు అందినటువంటి విజ్ఞానశాస్త్ర పరిశోధనలను బట్టి ఏదో ఒక దాని మీద ఆధారపడి ఈ ప్రపంచంలో సమస్తము నడుస్తూ ఉంది అని మనకు అర్థమౌతూ

ఉంది. స్వతస్సిద్ధం కాకుండా మరొకదానిమీద ఆధారపడి ఉండేదానినే 'మిథ్య' అన్నది శాస్త్రం. అది అనిత్యం. ఆధారపడి ఉన్నది మిథ్య అయితే ఆధారంగా ఉండేది సత్యమై ఉండాలి. సత్యానికి పరీక్ష ఇక్కడే. నశించకుండా, మార్పుచెందకుండా ఉండి మరొకదాని మీద ఆధారపడకుండా ఉండేదే సత్యం. ఇటువంటి సత్యాన్ని పరిశోధించడానికి కళాశాలలు, విశ్వవిద్యాలయాలు ఎక్కడాలేవు. ఇది అసలు చర్చకే అందకుండా ఉండిపోయింది. మనం ఏది చర్చించినా అది అసత్యము, అనిత్యమే. సత్యమైన దానిని చర్చించడానికి ఇదమిద్ధంగా ఒక భూమిక లేదు. మతులకు మతాలకు అందని ఈ సత్యం కేవలం ఆర్షధర్మ వేదిక మీదనే చర్చింపబడింది. ఋషులు, సాధువులు మాత్రమే దీనిని చర్చించారు. అలా సత్యాన్ని గూర్చి చర్చించే వ్యక్తిని, వివరించే శక్తినే గురుః అంటాము. 'గు' అంటే అంధకారం, 'రు' అంటే పోగొట్టువాడు. అజ్ఞానాంధకారాన్ని పోగొట్టువాడు కనుక గురుః అన్నాము. నిత్యానికి అన్యంగా ఏదైతే ఈ ప్రపంచంలో గోచరిస్తూ ఉందో అదంతా అసత్య సందడి, అనిత్య అంగడి.

కాని, ఈ ప్రపంచంలో ప్రేమలు కదలడానికి అనిత్యమే కారణమేమో! దేహాలు అనిత్యం కనుకనే వ్యక్తుల మధ్య ప్రేమలు కదులుతూ ఉన్నాయి. రాళ్ళలాగా దేహాలు ఎప్పటికీ అలా పడి ఉంటే ఎవరిని ఎవరు ప్రేమించరేమో? హృదయ స్పందనతో ఒకరు మరొకరికొరకు పరితపించరేమో! కాబట్టి అందరూ అనిత్యమేనని ఒక వైపు తెలుస్తూ ఉండినా ఆ అనిత్యాల మధ్య అనుస్యూతంగా అర్థం కానటువంటి ప్రేమ ఒకటి కదులుతూ ఉంది.

ఒక కర్మాగారం నుంచి తయారై వచ్చిన వస్తువులన్నీ ఒకేవిధంగా ఉంటాయి. కాని, ఎందుకనో, ఒక్క పరమాత్మనుంచే అందరు ఆవిర్భవించినా అందరూ ఒకేవిధంగా లేరు. అందరి ముఖాలు ఒక విధంగా లేవు. అందరి మనస్సులు ఒక విధంగా లేవు. ఇదే భిన్నత్వంలో ఏకత్వం. ఈ ఏకత్వాన్ని గుర్తు చేసేందుకే భిన్నత్వముంది. నిత్యాన్ని గుర్తు చేసేందుకే అనిత్యాలు ఉన్నాయి. పరమప్రేమను గుర్తు చేసేందుకే అపరప్రేమలు కదులుతూ ఉన్నాయి. వీటన్నిటి వెనుక ఆధారభూతంగా పరమ సత్యముంది. మారేవన్నీ మారని సత్యాన్ని తెలియజేస్తూ ఉన్నాయి. అందుకే పరమ పవిత్రమైన ఈ సంస్కృతిలో ఎక్కడ ఏ వస్తువునూ పరమసత్యానికి వేరుచేసి చూడలేము. హింస చేయవద్దు అని చెప్పాల్సిన అవసరం ఈ సంస్కృతిలో లేదు. కారణం, ఇక్కడ ఉన్నదంతా అహింసే, అర్థం చేసుకోగలిగితే.

దేవీనవరాత్రుల సమయంలో ఆయుధపూజ జరిగిన తరువాత వాహనాలు కదిలి వస్తూ ఉంటే ఇవి వాహనాలా! వనితలా! అనిపిస్తాయి. పసుపుకుంకుమ పెట్టుకొని, అందంగా పూలు అలంకరించుకొని, ఇరువైపులా లోలకులా! అన్నట్లు నిమ్మ పండ్లను తగిలించుకొని నెమ్మదిగా, గున్న ఏనుగుల్లా లారీలు, ట్రక్కులు కదిలి వస్తూఉంటే హృదయముండి చూసేవారికి "ఎంత అందమైన పెళ్ళికూతురా!" అనిపిస్తుంది. కత్తిని పూజించేవాడొకడు, కొడవలిని పూజించేవాడొకడు, గొడ్డలిని పూజించే వాడొకడు,

యంత్రాన్ని పూజించే వాడొకడు. వీరంతా తాము బ్రతకడానికి ఆధారమైన వస్తువుల్ని గుర్తించి ఆరాధించగల సంస్కారం గలవాళ్ళు. ఈ సంస్కారం మన సంస్కృతి అందించిందే. అందుకే **'ప్రభాతే కరదర్శనం'** అంటూ నిద్ర లేస్తున్నాము. **'విష్ణుపత్నీ నమస్తుభ్యం పాదస్పర్శం క్షమస్వమే'** అంటూ, పశ్చాత్తాప హృదయంతో భూమిపై పాదం మోపుతున్నాం. ఇటువంటి పరమ పవిత్రమైన మంజుల భావాలు కదిలే సంస్కృతి ప్రపంచంలో ఎక్కడుంది? భూమి అభిన్న నిమిత్త ఉపాదాన కారణమైన పరమాత్మకన్నా అన్యంగా లేదు కనుక భూదేవికి నమస్కరిస్తున్నాము. నీరు, నిప్పు, గాలి అన్నిటినీ అలాగే ఆరాధిస్తున్నాము. ఇవన్నీ ఉన్నవి: నాకొరకే ఉన్నవి. వాటిని గుర్తించాల్సిన ధర్మం నాకుంది. ఇది, వ్యక్తిలో కలగవలసిన ఆధ్యాత్మిక స్పృహ **(spiritual awareness)**. పచ్చని చెట్లు నాకొరకు ఉన్నాయి, నదులు నాకొరకు ప్రవహిస్తున్నాయి, మేఘాలు నాకొరకు వర్షిస్తున్నాయి. నేను దేనికీ దూరంగా పోలేను. అన్నీ అన్నిటితో ముడిపడి ఉన్నాయి. అన్నీ అందరికోసం ఉన్నాయి. అవి నాకు ఉపకరిస్తున్నాయి. అందుకే నేను వాటిని ఆధారం చేసుకొని జీవించ గలుగుతున్నాను. సూర్యుడు వెలుగుతూ ఉంటే బాహ్య జగత్తుకు, నాకు కూడా వేడి, వెలుగు అందుతూ ఉన్నాయి. నాకు అందే ఆహారానికి సూర్యుని కాంతియే ఆధారమై ఉంది. సూర్యుడ్ని ఆకాశంలో ఉన్నతంగా చూసినపుడు చేతులెత్తి నమస్కరించడం నా సంస్కారం. 'నేను ఒక పూలమాల వేస్తే, నాలుగు పూలు విసిరితే అవి సూర్యుడ్ని చేరుతాయా? ఇక్కడ కాస్త జలాన్ని వదిలితే సూర్యుడికి అందుతుందా?' అని నీవు భావించవచ్చు. తప్పక అందుతుంది. ఎందుకని? ఆయన కిరణాలు ఎప్పుడైతే ప్రేమగా నిన్ను తాకుతున్నాయో నీ నుండి కదిలే భక్తి కిరణాలు కూడా పరమాత్మను చేరుతాయి. అవీ భావాలే కనుక. అందుకనే

నేలపై మనసు నేను, నింగిలో మహిమ నీవు

భాను డున్నది గగనమైనా పేద కమలము నోచుకోదా!

పాడినా నీ పాటలే మాటాడినా నీ మాటలే ॥

అని చైతన్య గానలహరి ఉవ్వెత్తున లేచింది.

ఎప్పుడైతే ఈ విధంగా ప్రపంచంలో ప్రతిదీ ప్రతిదానికోస ముందని, దీని వెనుక పరమాత్మ ముచ్చట ఉందని, పరమాత్మ యొక్క నిత్యత్వ ముందని గుర్తిస్తామో ఆ క్షణం నుంచి బ్రతుకు ఒక అందమైన మలుపు తిరుగుతుంది.

సృష్టిలో ఎక్కడ చూచినా ఒక స్పందన ఉంది. పరమపవిత్రమైన స్పందన. పువ్వు యొక్క అందంలో పరమాత్మ అందంగా ఎలా ఉన్నాడో, అందమై ఎలా ఉన్నాడో! అందాలలో అందంగా ఉండే పరమాత్మను అందంగా వీక్షించే అందమైన దృష్టి నాకుంటే అది పరమానందం. మొక్కల దగ్గరకు వెళ్ళి వాటి అందాన్ని నేను వీక్షిస్తూ ఉంటే నా కళ్ళలో అవి భగవంతుణ్ణి వెతుక్కుంటాయి.

యజ్ఞ జీవనం

ఒకరు పదిమంది కోసం బ్రతికే ప్రపంచమిది. పదిమందిలో ఒక్కడే తాండవించే ప్రపంచమిది. యజ్ఞం వల్లనే సృష్టికార్యం ప్రారంభమైంది కనుక సృష్టిలో ఎక్కడ చూచినా యజ్ఞజీవనమే ఉంది. సూర్యుడు ప్రకాశించడం, మేఘాలు వర్షించడం, నదులు ప్రవహించడం, చెట్లు చిగురించడం, పంటలు ఫలాలను అందించడం - ఇదంతా యజ్ఞ జీవనమే. స్వార్థం కోసం కాక పరార్థం కోసం జీవించడమే యజ్ఞం. సృష్టిలో ఎక్కడ చూచినా యజ్ఞ భావనయే ఉంది. సంకుచితమైన భావన మనిషి తయారు చేసుకున్నది.

దేవాన్ భావయతానేన తేదేవా భావయంతు వః

పరస్పరం భావయంతః శ్రేయః పరం అవాప్స్యథ ॥

'అర్జునా! యజ్ఞం ద్వారా దేవతలను సంభావించు, వారిని తృప్తిపరచు. వారు మిమ్మలను తృప్తిపరుస్తారు. ఒకరికొకరు ఈ విధంగా సహకరించుకుంటూ మోక్షాన్ని పొందెదరు గాక!' అని శ్రీకృష్ణ పరమాత్మ భగవద్గీతలో బోధిస్తాడు. ఇది యజ్ఞజీవనం. ఇలా ఇతరులతో సహకరించే సంస్కారం మనకు లేకపోవచ్చు, కాని ఇతరులను హింసించే అధికారం మాత్రం మనకు లేదు. సంస్కారవంతుడు ఎదుటి వ్యక్తితో మాట్లాడేటప్పుడు నోటికి చేయి అడ్డుపెట్టి మరీ మాట్లాడుతాడు. కారణం, తన నోటినుండి వచ్చే తుంపరలు అతనిపై పడితే అతడు మలిన పడతాడేమో అనే సంకోచంతో. ఎదుటి వ్యక్తితో మిళితమయ్యే అవకాశమైతే నీకుంది గాని అతనిని మలినపరచే హక్కు నీకు లేదు. అలాగే దగ్గేటప్పుడు మనలోని సూక్ష్మజీవులు ఇతరులను చేరుతాయేమో అనే భయంతో చేతి రుమాలును అడ్డు పెట్టుకొని మరీ దగ్గుతాము. నీవు బాగుంటే ఇతరులతో కలిసి తిరగవచ్చును గానీ నీవు అనారోగ్యంతో ఉంటే నీ అనారోగ్యాన్ని ఇతరులకు పంచే హక్కు నీకు లేదు. ఈ ధర్మాలను అర్థం చేసుకుని తదనుగుణంగా ఈ ప్రపంచంలో జీవించటం ఆరంభిస్తే బ్రతుకు ఎంతో హాయిగా సాగుతుంది. బుద్ధి ప్రసన్నమై తేలిక పడుతుంది.

ప్రపంచానికి అభిన్న నిమిత్త ఉపాదాన కారణం పరమాత్మ అయినప్పుడు ప్రపంచంలో పరమాత్మ లేనిదెక్కడ? పరమాత్మ కాని దేది? అన్నీ తన రూపాలే. ఈ ప్రపంచంలోని రూపాలు మిథ్యే కావచ్చు. అనిత్యమే కావచ్చు. కానీ రూపాలకు ఆధారమైన పరమాత్మ మాత్రం సత్యం, నిత్యం.

యతః ప్రవృత్తిర్భూతానాం యేన సర్వమిదం తతం

స్వకర్మణా తమభ్యర్చ్య సిద్ధిం విందతి మానవః ॥

'అర్జునా! సర్వభూతములకు ఆవిర్భావమేదో, ఈ సమస్త జగత్తు ఎవరిచేత పరివ్యాప్తమై ఉందో అటువంటి పరమాత్మను మానవుడు తన స్వకర్మచేత అర్చించి సిద్ధిని పొందుచున్నాడు'.

నిజానికి కర్మాచరణవల్ల సిద్ధిని పొందే అవకాశమే లేదు. అది కేవలం జ్ఞానం వల్లనే సాధ్యం. జ్ఞానం గురువు ద్వారానే లభ్యం. ఇక్కడ సిద్ధి అంటే కర్మ యోగం ద్వారా పొందబడే చిత్తశుద్ధి అని అర్థం. శుద్ధిపడిన అంతఃకరణలో గురువు ఇచ్చే జ్ఞానం నిలుస్తుంది, శిష్యుడు ముక్తిని పొందుతాడు అని అర్థం.

స్వకర్మలో ధర్మమే ప్రధానంగా ఉండాలి. ధర్మరూపంలో దైవమే ఉన్నాడు. ఏది ఎలా ఉండవలెనో అలా ఉండటం ధర్మం. దాన్ని మరోరకంగా, విచిత్రంగా, ఇష్టా యిష్టాలకు అనుగుణంగా తయారుచేసుకొని ప్రవర్తించటం అధర్మం. ధర్మాధర్మాలకు, ఇష్టాయిష్టాలకు మధ్యనే ఘర్షణ జరుగుతూ ఉంటుంది. నే నేదైతే అభిలషిస్తూ ఉన్నానో అది ధర్మం అయితే నాకు ఘర్షణ లేదు. నే నేదైతే ఇష్టపడటం లేదో అది అధర్మం అయితే నాకు ఘర్షణ లేదు.

నేను ఇష్టపడిన విషయం అధర్మమైతే, నేను ఇష్టపడని విషయం ధర్మమైతే, అప్పుడే నా జీవితంలో ఘర్షణ ప్రారంభమౌతుంది. జీవితంలో ఎన్ని బాధలు ఎదురైనా రాముడికి, ధర్మరాజుకి, అర్జునుడికి మనశ్శాంతి దూరం కాలేదు. కారణం, వాళ్ళ ఊహలకు, ధర్మానికి మధ్య వైరుధ్యం లేదు. వారు ఆశించింది ధర్మాన్ని, వారు నిరాకరించింది అధర్మాన్ని. అధర్మంగా చరించిన వ్యక్తిని చట్టం శిక్షించగలదో లేదో గాని ప్రాణం పోయేంతవరకు మనస్సు మనిషిని శిక్షిస్తూనే ఉంటుంది అనేది మాత్రం నిజం. మనిషి చట్టాన్ని తప్పించుకోగలడేమో గాని దైవాన్ని తప్పించుకోలేడు. కారణం, ధర్మరూపంలో ఉండేది దైవమే. కనుక ధర్మాచరణలో నీకు దైవ సహాయం అందుతూ ఉంది. ధర్మబద్ధంగా కర్మలాచరిస్తూ దైవాన్ని నీ వెప్పుడైతే ప్రార్థిస్తావో, ప్రార్థన అలౌకిక కర్మ గనుక దానికి అలౌకిక ఫలమైన దయ నీకు అందుతుంది. ప్రార్థన, పూజ, జపం, ధ్యానం, సంకీర్తన, స్వాధ్యాయం, ఇవన్నీ అలౌకిక కర్మలే. వీటన్నిటికి ఫలితం దయ. అదే గ్రేస్ అంటే.

పిల్లవాడు చదువుకొని పరీక్షరాయడం కర్మ. మార్కుల కోసం మేష్టారును ప్రాధేయపడటం - ప్రార్థన. ఈ ప్రార్థనకు ఫలితం మేష్టారు వేసేవి గ్రేస్ మార్క్స్. అదే మేష్టారు పిల్లవాడి మీద చూపే దయ(గ్రేస్). ఇదే సృష్టిలో కూడా ఉంది. నీ కృషిలో నీవు సాధించలేని వాటి విషయంలో భగవంతుడి కృపకై ప్రార్థిస్తున్నావు.

ఎప్పుడైతే జీవితమే ప్రార్థనా పూర్వకంగా, ఒక పూజగా మారిపోతుందో, ధర్మ రూపంలో దైవమే ఉన్నాడు గనుక నీకు తోడుగా అతనే ఉంటాడు. నీ అవసరాలన్నీ తన అవసరాలుగా తీరుస్తాడు.

అనన్యాశ్చింతయంతో మాం యే జనాః పర్యుపాసతే
తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్ ॥

'ఎవరు ఏకాగ్ర చిత్తముతో నన్నే స్మరించుచూ ఉపాసించుచుందురో, నాయందే మనస్సును స్థిరీకరించి యుండు అట్టివారల యోగక్షేమములను నేనే వహించుచుందును'.

ఎప్పుడైతే నీవు ధర్మాచరణలో ఉంటావో దైవ సహాయం అనుక్షణం, అన్ని దశలలోనూ, అన్ని కోణాలనుంచి నీకు అందుతూ ఉంటుంది. ఎటు చూచినా యజ్ఞ భావంతో ఈ ప్రపంచం నడుస్తూ ఉంది. నీ దేహంలో కూడా అన్ని అవయవాలు యజ్ఞభావం వల్లనే పరస్పరం సహకరించుకుంటూ నడుస్తూ ఉన్నాయి. కళ్ళలో ఉండే స్ఫూర్తి పరమాత్మదే. బాహ్యంలో ఉన్న ప్రకాశం పరమాత్మదే. ఏ పరమాత్మ ఉండటం వల్ల సూర్యుడు సూర్యుడుగా ఉన్నాడో అతడే నీలో '**శ్రోత్రస్య శ్రోత్రం, మనసో మనోయత్, వాచోహ వాచమ్, స ఉ ప్రాణస్య ప్రాణః, చక్షుషశ్చక్షుః**' అయి ఉన్నాడు. యేది ఉండడం వల్ల చెవి చెవిగా, కన్ను కన్నుగా, వాక్కు వాక్కుగా, మనస్సు మనస్సుగా ఉందో, వీటన్నిటిలో ఏ పరమాత్మ స్వరూపం దివ్యంగా ప్రకాశిస్తూ ఉందో, అనేకంగా ఈ సృష్టి గోచరిస్తూ ఉండినా ఈ భిన్నత్వంలో ఏకత్వం అఖండంగా ఎలా భాసిస్తూ ఉందో ఆ దివ్యాత్మని, ఆ పరమాత్మను '**స్వకర్మణా తమభ్యర్చ్య సిద్ధిం విందతి మానవః**', స్వకర్మచేత అర్చించి, మానవుడు సిద్ధిని పొందుతూ ఉన్నాడు.

ఈ అవగాహన నీకుండాలి. ఎందుకని? అర్థం చేసుకోగల మనసు నీకుంది కాని పశుపక్ష్యాదులకు లేదు కనుక. కలకాలం ఈ ప్రపంచంలో జీవించబోము. జీవించి ఉండగనే బ్రతుకును పండించుకోవాలి. హృదయాన్ని జ్ఞానంతో నింపుకోవాలి. నీ కోసం అన్ని తలుపులు తెరిచి ఉన్నాయి. నీవు గుడ్డివాడివైతే ఇతరులు చేయగలిగింది ఏమీ లేదు. నీకు వినిపించడానికే శాస్త్రాలు ఉన్నాయి. నీవు చెవిటివాడివైతే శాస్త్రాలు కూడా చేయగలిగింది ఏమీలేదు. నిన్ను నీవే ఉద్ధరించుకోవాలి. నిన్ను నీవే సుఖపెట్టు కోవాలి. నీవే సుఖపడలేక, ప్రపంచాన్ని ఉద్ధరిస్తాను అని అనుకోవడంకన్నా దౌర్భాగ్యమైన పరిస్థితి మరొకటి లేదు. ప్రతి ఒక్కరు ఆనందంగా జీవించేందుకు కావలసినటువంటి అనుకూల పరిస్థితుల్ని పరమాత్మ ఈ ప్రపంచంలో ఏర్పాటుచేసి ఉంచాడు. "ఇతరుల దృష్టిలో నేనెలా ఉన్నాను?" అని ఆలోచించకు. "భగవంతుడి దృష్టిలో ఎలా ఉన్నాను?" అని ఆలోచించు. నీలో నీవు నీవుగా జీవించడం చాలా తేలిక. ఇతరులను మెప్పించటం కోసం బ్రతకడం చాలాకష్టం. లేదు దానికి మించిన నష్టం. అందరి మనస్సులకు అనుగుణంగా నాట్యం చేయాలనుకోవడం వల్ల మనిషి ఎప్పుడు సుఖపడలేడు. ఎవరికి మన గురించి ఏ భావాలు ఉన్నాయో మనకు అనవసరం. మతి చెప్పినట్లు తైతక్క లాడటమా? లేక శ్రుతి చెప్పినట్లు జీవించటమా? మనిషి మనస్సులోకి ఎక్కటానికి యత్నించటమా? లేక, భగవంతుడ్ని నీ మనస్సులోకి దించుకోవడానికి ప్రయత్నించ టమా? ఆలోచించుకోండి. మీ మనస్సులతో మీరు ఆలోచించాలి. నా వంతు నేను చేయగలిగింది చేస్తాను. చేశాను. చేస్తున్నాను. ఇక మీదట ఇంకా ఎక్కువగా చేస్తాను. అవగాహనను తొందరగా పెంచుకోవాలి. లేకపోతే, అన్నీ అనర్థాలే ప్రాప్తిస్తాయి. మనకు ఉండవలసినవి ఉంటాయి. పోవలసినవి పోతాయి. ఈ రాకపోకల మధ్య అవగాహనను పెంచుకొని ఆనందంగా జీవించాలి.

ఆరని దీపం

ఓం క్రతో స్మర కృతం స్మర

"భగవంతా! నీకు నేను జ్ఞాపక ముండనీ. నేను చేసిన సేవ నీ స్మృతిలో మిగలనీ" అని ప్రార్థించాడు ఋషి. ఎంతటి ఉదాత్తమైన భావన! ఎంతటి పారవశ్య మిది! మనం పరమాత్మను స్మరించడం కాదు. పరమాత్మ మనల్ని మరచిపోకుండా ఉండాలి. అంటే, పరమాత్మకు విస్మృతి ఉందని కాదు. మన స్మృతి సదా మెదిలేలా మన భక్తి ఆ దివ్యాత్ముని క్షణక్షణానికి చలింపచేయాలని అర్థము. అప్పుడే పరమాత్మ కృప మనపై వర్షిస్తుంది. మోహం పారిపోతుంది. ముక్తి ముందుకొస్తుంది.

చిన్నచిన్న వాటిని ప్రేమించి బ్రతుకంతా చిన్నబుచ్చుకున్నాం. చేయి పుచ్చుకోమని పరమాత్మను అర్థించుటే నేడు మన ముందున్న కార్యము. ఇక్కడే మన ప్రేమలకు పూర్ణత్వము సిద్ధిస్తుంది. ప్రేమ పవిత్రమైంది. అది గంగలా ప్రవహించాలి. నెలవులు తప్పితే ప్రేమ కలువలు వాడిపోతాయి.

వేసవిలో అరణ్య ప్రాంతాల్లో మంటలు లేస్తాయి. ఆ సమయంలో వాయువు తోడుగా వీచిందంటే అగ్ని భయంకరంగా ప్రజ్వలిస్తుంది. కానీ అదే అగ్ని ఒక చిన్న దీపంగా వెలిగేటప్పుడు గాలి తోడైతే దీపం ఆరిపోతుంది. ప్రేమలు కూడా ఈ ప్రపంచంలో అంతే.

ప్రేమ చాలా పవిత్రమైనది. ప్రేమించకుండా ఏ మనిషి ఉండలేడు. ప్రతి మానవ హృదయంలో ప్రేముంది. కాకపోతే, మనము ఎవరిని ప్రేమిస్తున్నామో, ఎందుకొరకు ప్రేమిస్తున్నామో మనకు క్షుణ్ణంగా తెలిసిఉండాలి.

ప్రేమించటం తప్పు కాదు. ప్రేమలో దోషం లేదు. కాని, ఒకరికి ఇవ్వవలసిన ప్రేమను మరొకరికి ఇస్తే దానివలన ఇచ్చిన వారికి సుఖం ఉండదు. పుచ్చుకున్న వారికి కూడా ఉండదు.

ప్రేమలు పరమాత్మ వైపు నడిస్తే మనసు పవిత్రమై బ్రతుకు పండిపోతుంది. పుత్రదార గృహాదుల వైపు నడిస్తే మనసు పతనమై బ్రతుకు ఎండి, మండి, బండబారి పోతుంది. కనుక మోహాన్ని తొలగించి మోక్షాన్ని ప్రసాదించమని పరమాత్మను ప్రార్థించాలి. దీపంలో వత్తిలాగ ఈ ఒక్క ప్రార్థనే మన బ్రతుకులో మిగలాలి.

నేను గోరిన దొక్కటే నీలవర్ణ - చయ్యనను మోక్ష మిచ్చిన జాలు నాకు

అని నిజభక్తుని ఏకైక వాంఛను ప్రస్ఫుటంగా ప్రవచించింది నరసింహ శతకము.

రామం - నామం

అన్నమాట అంటే ధర్మ మన్నమాట. ధర్మ మన్న మాట ధరణిలో చెల్లు మూట. అన్నమాట ఉన్నమాట అయినప్పుడే అది రత్నాల మూట.

ఉన్నమాట సత్యం. అన్నమాట ధర్మం.

ఉన్నది రాముడొక్కడె - ఊరకె చెడిపోకె మనసా! అన్నాడు త్యాగరాజ స్వామి. ఉన్న రామయ్య అన్నమాట ఎరుగదు మారుమాట.

రామో ద్విర్నాభిభాషతే - రాముడు రెండు మాట లెరుగడని ఒకే మాటగా పలికాడు వాల్మీకి.

కానిమాటలు పలికే వారికి ఒక కాలంలో అన్న మాట మరో కాలంలో కాని మాట. వల్లగాని మాట. అనేదే ఇంతకాలం ఎందరి నుండో మనం విన్న మాట. వింటున్న మాట.

అన్న మాట మిన్న మాట కావాలి. మిన్నుముట్టే మాటై నిలవాలి. అప్పుడే అది గట్టి మాట. కాకపోతే వట్టిమాట. వట్టిమాటలు ఎప్పుడైనా ఓటికుండలే.

అన్నమాట నిలబెట్టుకోవాలి. నే నన్నమాట సదా నిలిచి ఉండాలి. ఔనన్న మాట ఎన్నడూ కాకూడదు కా దన్నమాట.

అన్నమాటను నిలుపుకోవాలని ఆ మార్గంలో ఎన్ని ఆపద లెదురైనా సహించి సత్యాన్ని దర్శించాలని పట్టుదలతో జీవించి, తన ఆదర్శవంతమైన జీవితము ద్వారా ధర్మమార్గంలో జీవించమని జనావళిచే 'అఆ' లు దిద్దించిన ధర్మాత్ముడు, దివ్యాత్ముడు శ్రీరాముడు. సర్వమానవులకు, సర్వకాలములకు, సమస్త దేశములకు ఆదర్శ ధర్మమూర్తి శ్రీరామచంద్రమూర్తి.

రామో రమన్తే యత్ర యోగినః - ఎవ్వరి యందు యోగులు రమింతురో అతడే రాముడు అని రామరహ స్యోపనిషత్.

రాముడు శరణాగత వత్సలుడు. ఆ దివ్యాత్ముని ఆశ్రయించిన రాయి రప్ప, కప్ప, తిప్ప, కోతి నాతి, నిప్పు, నీరు - అందరూ తరించిపోయారు.

భక్తజన సంరక్షణ దీక్షా కటాక్ష శుభోదయ వృద్ధ శ్రీహరిమ్

భక్తజనులను సంరక్షించుట అనే దీక్షను పూనినవాడు, శుభగుణములు సమృద్ధిగా గల శ్రీరామచంద్రుని సేవించుచున్నాను అన్నాడు రామాయణ చూర్ణికలో శ్రీ భద్రాచల రామదాసు.

మార్జాల మున్న ఇంటిలో పాడుచేసే మూషికా లుండవు. రాముడు ప్రవేశించిన హృదయంలో కాముడు ఉండలేడు. వైభవ మున్నచోట వికారా లుండవు. మనో వికారాలుండవు. కనుక మన మందరమూ మార్జాలాన్ని ఆశ్రయించాలి. పిల్లి మన తల్లి కావాలి. మనం పిల్లి పిల్లలం కావాలి. అప్పుడే పిల్లి తన పిల్లల్ని విడువనట్లు పరమాత్మ మనల్ని వదలకుండా ఉంటాడు. ఇదే శరణాగతభావము. శాస్త్ర పరిభాషలో చెప్పాలంటే "మార్జాల కిశోర న్యాయము".

మన హే వికారీ స్థిరతా నయేరే త్యాచే నిసంగే భ్రమతీ భలేరే

అపూర్వ కార్యా మనహే విటేనా తుజ వీణ రామా మజ కంఠ వేనా

"మనస్సు ఎప్పుడూ వికారమే. దానికి స్థిరత్వము లేదు. సంసారములో తెగ తిరుగుతూ ఉంది. చేయరాని పనులు చేస్తున్నది. అయినా దానికి ఏ మాత్రము లజ్జ లేదు. హే రామచంద్రా! నీవు లేనిదే నేను కడతేరలేను" అని ప్రార్థించాడు మరాఠీ భాషలో సమర్థ రామదాస స్వామి.

కామ శత్రువును జయించడానికి రామ కవచాన్ని ధరించాలి. క్రోధ శత్రువును నిరోధ స్వభావముతో ఓడించాలి. ఈ శక్తినంతా నామమే ఇస్తుంది. రామనామమే ఇస్తుంది.

లేని దానిని ఈ ప్రపంచంలో శ్రమించి పొందవచ్చు. పొందిన దానిని ఎంతో కాలం నిలుపుకోలేము. కష్టపడి పొందిన దానిని తేలికగా పోగొట్టుకున్నప్పుడు గుండె ఎవరికైనా బరువెక్కుతుంది. గుండె భారంతో బ్రతుకును ఈడ్చు కుంటూపోవటం అందరికీ సాధ్యపడే పని కాదు. పొందేవి ఏవయినా పోయేందుకే వస్తున్నాయని అవి రాకముందే గ్రహించగలిగితే, ఆ తరువాత అవి రాకపోయినా లేదా వచ్చి పోయినా బ్రతుకులో పెద్ద తేడాఉండదు.

ఫలప్రదం

బ్రతుకు బండి తన దారిన అది సాగిపోతోంది. జీవించినంత కాలం ఇక జీవించకపోవచ్చు. ఇక చేయబోయేది కూడా గతంలో చేసిందే. చూసిందే. ఈ తనువు ఈ ప్రపంచంలో ఎంతదాకా ఉంటుందో! ఉన్నంత దాకా ఎన్ని రోగాలు పరామర్శిస్తాయో! ఎన్ని కష్టాలు కుదిపేస్తాయో! గుండెను గుడ్డను పిండినట్లు పిండే దుర్భర దుఃఖాలు ఎన్ని జీవితంలో ప్రవేశిస్తాయో!

నాభుక్తం క్షీయతే కర్మ కల్పకోటి శతై రపి

"గతంలో చేసిన పనులు ఏదో ఒకనాడు అనుభవించక తప్పదు"

ఎందుకొచ్చిన ఆశ లివన్నీ? ఈ పేరాశలకు పరిధి ఎక్కడ? ఈ అత్యాశలకు అవధి ఎక్కడ? ఈ దురాశలకు అంతమెక్కడ? ఏమి తెచ్చామని బెంగ! మన దేముందని అపహరిస్తాడు దొంగ!

తల్లి గర్భము నుండి ధనము తే డెవ్వడు వెళ్ళిపోయెడి నాడు వెంటరాదు

లక్షాధికారైన లవణమన్నమెగాని మెఱుగు బంగారంబు మ్రింగబోడు

విత్తమార్జన జేసి విఱ్ఱవీగుటె కాని కూడ బెట్టిన సొమ్ము కుడువబోడు

పొందుగా మరుగైన భూమిలోపల బెట్టి దాన ధర్మము లేక దాచిదాచి

తుదకు దొంగల కిత్తురో దొరల కగునొ తేనె జుంటీగ లియ్యవా తెరువరులకు

భూషణవికాస శ్రీధర్మపుర నివాస దుష్టసంహార నరసింహ దురితదూర ॥

ఏదీ రాకపోవచ్చునేమో గాని, దుఃఖం మాత్రము జీవులను జన్మ జన్మలకి వెంబడిస్తూనే ఉంటుంది. బ్రతుకును ఎండగడుతూనే ఉంటుంది. ఈ విధంగా వేదనల మధ్య ఎండే బ్రతుకు, నిండే దెప్పుడు? పండే దెప్పుడు?

ఎండిన చెరువును ఎన్ని మంచుతుంపరులైతే నిండింప గలుగుతాయి? ఆ పని మేఘుడే చేయగలడు. ఎండిన బ్రతుకుల్ని పండించే కార్యమును శ్యాముడే చేయగలడు. నీలమేఘశ్యాముడే చేయగలడు. రామభద్రుడే చేయగలడు.

కష్టాలను, నష్టాలను తొలగించే పవిత్రనామం రామం. ఇప్పటికీ, అప్పటికీ, ఎప్పటికీ పనికొచ్చే భగవన్నామం. 'ఎప్పుడు?' అనే దానిని మరచి, 'ఇప్పుడే' అనే దానిని వలచి ఇక్కడే ప్రారంభిద్దాం. కానివ్వండి. కాణీ ఖర్చు లేకుండా కర్మలన్నీ ఖర్చయి పోతాయి. కైవల్యం మన సొత్తైపోతుంది.

విశ్వస్య కళ్యాణ మస్తు

నామ సాధన

నోరులేనివారు, ఊరులేనివారు ఉండొచ్చేమో గాని పేరులేనివా రుండరు. అందరికీ పేర్లు ఉంటాయి. నామకరణం జరగకపోయినా ఎవరో ఒకరు నామం పెడతారు. ఆ తరువాత ఆ నామంతో అందరూ పిలుస్తారు. పేరు అనేది పేరుకు మాత్రమే కాదు. అందులో ఎంతో శక్తి ఉంది. మనం ప్రాణతుల్యంగా ప్రేమించేవారి నామాన్ని ఎవరైనా పలికితే మనం ఆనందంతో చలించిపోతాం. అలాగే శత్రువు పేరును ఎవరైనా ప్రస్తావిస్తే వెంటనే కుంచుకుపోతాం. ఇదంతా ఏమిటి? నామమాత్రం అంటే సరిపోదు. పేరులో అంత శక్తి పేరుకుపోయి ఉంది.

ఈ విధంగా కొన్ని నామాలపై మనకు రాగముంది. మరికొన్ని నామాలపై ద్వేషముంది. రాగద్వేషాలు బ్రతుకును కుదిపేస్తాయి. ఈ బాధనుండి బయటపడాలి అంటే భగవన్నామాన్ని ఆశ్రయించటం ఒక్కటే మార్గం.

భగవన్నామం పరమ ప్రేమ రూపం. రాగద్వేషాల పరిధిలోకి అది రాదు. మనస్సును భగవన్నామం పవిత్రం చేస్తుంది. బుద్ధిలో ప్రశాంతతను దించుతుంది. శాంతిసాగరంలో ముంచేస్తుంది. అమృతత్వాన్ని ప్రసాదిస్తుంది. ఈ మహత్కార్యాన్ని సాధించే ప్రయత్నంలో అనామధేయునికి అనంతనామాలు ఏర్పడ్డాయి.

"నాయనా! శ్రద్ధగా చదువుకో! బుద్ధిగా మసలుకో. భవిష్యత్తులో గొప్ప పేరు తెచ్చుకోవాలి" అని బిడ్డలతో, చెబుతూ ఉంటారు తల్లిదండ్రులు. గొప్ప పేరు తెచ్చుకోవట మంటే ఏమిటో పసితనంలో ఏమి తెలుస్తుంది? పెరిగినపుడు తెలుస్తుంది. బుద్ధి పెరిగినపుడు అర్థమవుతుంది. గొప్పపేరు తెచ్చుకోవట మంటే భగవన్నామాన్ని సంపాదించుకోవటమే నని.

నామరూపాత్మకం హి ఇదం సర్వం

ఈ ప్రపంచమంతా నామరూపాత్మకమే. ప్రపంచంలోని నామరూపాలు మనలో రాగద్వేషాలను రెచ్చగొట్టి బ్రతుకును అనుక్షణం భగ్నం చేస్తూఉంటాయి. కాని, భగవద్రూపం, భగవన్నామం రాగద్వేషాల్ని అదృశ్యం చేసి, మనలో జ్ఞానాన్ని దింపుతాయి. అలౌకిక ఆనందాన్ని ప్రసాదిస్తాయి. రూపంకన్నా నామం మనస్సులో చక్కగా తిష్ట వేస్తుంది. అలా చూచినపుడు రూపం అనిత్యం, నామం నిత్యం అనాలి. మనిషి ప్రపంచంలో ఎంతోకాలం నిలవలేడు. కాని, పేరు ఎంతకాలమైనా ఉంటుంది. అలాంటపుడు భగవన్నామం యొక్క వైభవం ప్రత్యేకించి చెప్పాలా?

నామసాధన అద్భుతమైంది. విలువైనదే కాదు, సులువైనది కూడా. మనస్సున్న వారికే తెలుస్తుంది మంత్ర మహిమ. నామ సాధనకు సమయాలు లేవు. నియమాలు లేవు. ఎవరైనా చెయ్యొచ్చు. ఎక్కడైనా చెయ్యొచ్చు. వయోభేదము లేదు. లింగభేదము

లేదు. నామసాధనలో మరొకరి ప్రమేయం ఉండదు. ఇంకొకరి సహాయం, అవసరం ఉండదు. ఇది కేవలం భక్తునికి భగవంతునికి మధ్య నడిచే వ్యవహారం.

అస్య స్తుతి లక్షణస్య అర్చనస్య ఆధిక్య కిం కారణం? ఉచ్యతే, హింసాది పురుషాంతర ద్రవ్యాంతర దేశకాలాది నియమ అనపేక్షత్వం ఆధిక్యే కారణం, ఇతి.

"నామసాధనకు ధన మవసరం లేదు. జన మవసరం లేదు. దేశకాలాదులతో పనిలేదు. నియమ నిబంధనలతో అసలే పనిలేదు. నామసాధనలో హింస తలెత్తదు" అన్నారు భాష్యంలో శ్రీశంకరాచార్య స్వామి. అందుకనే నామసాధనను గొప్పయజ్ఞంగా అభివర్ణించారు గీతలో శ్రీకృష్ణ పరమాత్మ.

"యజ్ఞానాం జప యజ్ఞోస్మి"

యజ్ఞాలలో నేను జపయజ్ఞమును అన్నారు గీతలో. నామస్మరణ వలన భగవద్భక్తి వృద్ధి చెందుతుంది. భగవత్ప్రేమ లభిస్తుంది. భక్తివలన భగవత్కృప ప్రాప్తిస్తుంది. భగవత్కృప జ్ఞానాన్ని ప్రసాదించి, ముక్తిని సిద్ధింపచేస్తుంది.

"నాకు ఈరోజు భగవంతుని దయ లభించింది" అంటుంటారు అనుకున్నది జరిగితే. ఇక్కడే మానవుని పరిమిత జ్ఞానము అనంతుడైన పరమాత్మ విషయంలో చిన్న బోయింది.

ఈరోజునే పరమాత్మ దయ నీకు లభించిందా? తల్లి గర్భంలో ఉన్నప్పుడు లేదా? పెరిగేటప్పుడు లేదా? వివాహ మైనపుడు లేదా? సంతానం కలిగినపుడు లేదా? మొన్న లేదా? నిన్న లేదా? ఈరోజేనా ఉన్నది?

ఆయన దయ ఎప్పుడూ ఉండనే ఉంది. ఈ రోజు నీవు అనుకున్నది జరిగితే నీవు ఆయన దయను గుర్తిస్తూ ఉన్నావు. జరగటమే దయ కాదు; నిజం చెప్పాలంటే, జరిగినదానిని గుర్తించటమే దయ.

భవసాగరంలో భద్ర నౌక

భవసాగరము దుస్తరము. ప్రాణాలు నీటి అలలవలె చూస్తుండగనే మాయమవుతాయి. బాంధవ్యాలు రావి ఆకుల్లాగా చలించి పోతుంటాయి. సుఖాలు ఎండమావులై మోసగిస్తాయి. జీవితము గాలిలోని దీపము వలె అల్లాడుతూ ఉంటుంది. సంపదలన్నీ కురిసే మబ్బులే. వీటి మధ్య ఒక క్షణాన మెరిసే మెరుపే ఈ మానవ జీవితము.

ఆరంభాలన్నీ అంతాన్ని చూసేందుకే నడుస్తున్నాయి. మార్గమధ్యంలో వ్యాధులు, వృద్ధాప్యాలు. చూసేందుకు ఉపకరించే కళ్ళు ఎప్పుడూ చూడగలుగుతాయని చెప్ప లేము. ఈ సత్యమును వినడం ఈరోజు చెవులకు కష్టంగా ఉన్నా, రేపు వినాలనుకున్నా వినలేని అశక్తత చెవులకు దాపురించవచ్చు. తినడానికి లేదని కొన్ని రోజులు బాధపడితే, తినింది జీర్ణం కావడం లేదని మరికొన్ని రోజులు బాధపడవలసి వస్తుంది. ఎక్కువ దూరం నడవలేమని కాళ్ళు, సరిగ కనిపించడం లేదని కళ్ళు, వినిపించడం లేదని చెవులు, ఏదీ జ్ఞాపకముండుట లేదు అని మనస్సు, కూర్చుంటే నడుము నొప్పి, పడుకుంటే ప్రక్కనొప్పి, - పలికితే పంటినొప్పి, కులికితే తుంటినొప్పి - అన్నీ నొప్పులే. ఏమి చేసినా, ఎంత దుఃఖించినా తీరని అప్పులే. అందుకే,

రోత సంసార మేఁ జేయంజాల విరక్తుఁ జేయఁగదవే శ్రీకాళహస్తీశ్వరా!

అంటూ, చేయలేని సంసారము నుండి చేయూతనిచ్చి చేదుకోమని ధూర్జటి కవి శ్రీకాళహస్తీశ్వర శతకంలో పరమశివుని ప్రార్థించారు.

ఏ క్షణాన్నైనా చిరిగిపోయే అతుకే ఈ బ్రతుకు. అనేక జన్మలలో చావు దెబ్బలతో చితికి పోయిన ముతక బ్రతుకు. ఎంతకాలం ఈ ప్రపంచంలో ఊరేగినా మృత్యువు ఒకనాడు ఉతికి ఆరేయకపోదు. ఈలోగా పిచ్చెక్కిన కుక్కలాగా అటు ఇటు పరుగులెత్తి సాధించే దేముంటుంది?

వెఱ్ఱి కుక్కల భ్రమలన్ని విడచి నిన్ను
భజన జేసెడి వారికి బరమ సుఖము

అని తన హృదయ ప్రార్థనను శ్రీహరికి విన్నవించుకున్నాడు నరసింహ శతకంలో శేషప్పకవి.

భవ సాగరము ఎంత అగాధమైనను నావలో పయనించేవారు నాశమెరుగరు. భవ సాగరము దుస్తరమై, భయంకరమై యున్నను నారాయణ నావ నెక్కినవారు మునగరు. పైగా ముక్తులవుతారు.

పశ్చాత్తాపం

నీటితో నేల మెత్తబడుతుంది. కన్నీటితో హృదయసీమ మెత్తబడుతుంది. కష్టాలు, దుఃఖాలు, కఠోర కర్మఫలాలు తారసిల్లినపుడు మనసుకు పదునెక్కుతుంది. భావనా ప్రవాహం అడ్డు లేకుండా ప్రవహిస్తుంది.

లేమిలో లేనితనమే కాదు; మరేదో కూడా ఉంది. ఉన్నవారికి లేనిదేదో, లేనివారి కది ఉంది. నెలసరి స్వల్ప జీతాన్ని తీసుకొని ఒక పేదవాడు ఇంటికొస్తాడు. "దీపావళి రెండు రోజుల్లో వస్తూఉంది. నా జీతంలో నువ్వొక చీర కొనుక్కో" అంటాడు భార్యని. నాకెందుకండి. ఇంట్లో ఉండేదాన్ని. ఎవరు చూడొస్తారు! మీరు పదిమందిలో తిరిగే వారు. ఈసారికి మీరే ఒక జత బట్టలు తీసుకోండి" అంటుంది ఆమె తన భర్తతో. నీకంటే నీకంటూ ఇద్దరూ వాదించుకుంటారు. ఇక్కడ ఎంతో భావపుష్టి ఉంది. ప్రేమ పుష్టి ఉంది. ఆ తియ్యని వాదంలో ఏదో అవ్యక్త నాదంఉంది. లేకపోతే వాళ్ళిద్దరి కళ్ళు ఎందుకు చెమ్మగిల్లుతాయి?

బీరువాలనిండా బట్టలు కుక్కిన ఇంట్లో ఇలాంటి మధుర సన్నివేశాన్ని ఊహించ లేము. ఎవరికెన్ని బట్టలున్నాయో ఎవరికీ తెలీదు చాకలికి తప్ప. రుచి ఎలా వస్తుంది ఆకలుంటే తప్ప!

భక్తుని హృదయ సౌందర్యం బాధల్లో వ్యక్తమౌతుంది. బాల్యంలో తల్లిపై ఎనలేని ప్రేమ ఉంటుంది. పెరిగే కొద్దీ అది తగ్గిపోతూ ఉంటుంది. పైగా తల్లిలో మనకు నచ్చనివి చాలా కన్పిస్తాయి. పెరిగింది ఏమిటో! ఎందుకో! తేలికగా అర్థమయ్యే విషయం కాదది.

అంత ఎత్తు ఎదిగాక తల్లి అవసరం లేకపోవచ్చుగాని, దుర్భర చింతలు, దుఃఖాలు చుట్టుముట్టినపుడు మాత్రం ఆ తల్లి ఒడిలో తల పెట్టుకొని ఏడవాలనిపిస్తుంది. తెగిన ప్రేగు అతుక్కునే దిక్కడే. ఆ ఓదార్పు మరొకచోట రాదు. ఆ పలకరింపు మరో నోటి నుండి వినపడదు.

అంతే జగత్పిత విషయంలో కూడా. నోరిచ్చాడు - అన్నం పెట్టాడు. కళ్ళిచ్చాడు - సౌందర్యాలను సృష్టించిపెట్టాడు. చెవులిచ్చాడు - శ్రావ్యమైన శబ్దాల్ని వినిపించాడు. ప్రాణమిచ్చాడు, మనసిచ్చాడు, హృదయమిచ్చాడు, ప్రేమను పంచాడు. ఇంత చేసిన వాణ్ణి ప్రేమించేందుకు ముందు, వెనుక చూశాం. పలకరించేందుకు తీరిక లేదన్నాం. మాటిచ్చిన వాణ్ణి గూర్చి ఒక్కమాట చెప్పడానికి మన అంతస్తులు అడ్డొచ్చాయి. కళ్ళిచ్చిన వాణ్ణి చూచేందుకు కాళ్ళు కదలనంటాయి. చేతులిచ్చిన వాడికి రెండు చేతులను జోడించి నమస్కరించడానికి మన గౌరవాలు అడ్డుగోడలై నిలిచాయి. నేడు రౌరవాలు

చేరువయ్యాయని అతనిని తప్పు పడితే ఎలా? మన తప్పును మనం తెలుసుకోవాలి. పశ్చాత్తాపంతో కుమిలిపోవాలి. ప్రాయశ్చిత్తంగా కన్నీటిని పారించాలి. **'మేరే అవగుణ్ చిత్ న ధరో'** "నా అవగుణాలను మనసులో పెట్టుకోకు తండ్రీ!" అని ఆర్తితో అర్థించాలి. ప్రార్థించాలి.

పరమాత్మ సముడు. సమదర్శి. విషమత్వ మతనికి తెలియదు. సూర్యునికి వెలుగుతప్ప చీకట్లు తెలియవు. దయామయుడైన పరమాత్మకు ప్రేమ తప్ప దోషాలు అర్థం కావు. అతడు అందరిలో సముడై యున్నాడు.

సమం సర్వేషు భూతేషు తిష్ఠన్తం పరమేశ్వరమ్

అని పరమాత్మ సమస్థితిని అద్భుతంగా వర్ణించింది భగవద్గీత.

చేసినవన్నీ చెదిరిపోనీ. కానివన్నీ కాలిపోనీ. మాలిన్యాలన్నీ మండిపోనీ. మాయలన్నీ మాసిపోనీ. సముడు నిన్ను సమంగా చూసుకుంటాడు. తన పేరును తాను కాపాడుకుంటాడు.

పరుసవేది ఏది పట్టినా, ముట్టినా అది పసిడిగా మారుతుంది. లోహము ఉండే ప్రదేశము లోపభూయిష్టం కావచ్చు. బంగారుబుద్ధి ఎందుకు మారుతుంది? అగ్ని దేన్నైనా సమంగా దహింప చేస్తుంది. అందుకే పవిత్ర విభూతిగా వెలుగుతోంది. సమత్వం గలవారు వెలిగేవారే. వెలిగించేవారే. ఆర్పే బుద్ధి వారికుండదు. తీర్పే వారికి తెలియదు. పరమాత్మ కూడా అంతే. లేనిదంటూ ఉంటే ఆ దివ్యాత్ముని సమీపించని వానికే.

నదులన్నీ నీరే. కాలువలగుండా ప్రవహించేది కూడా నీరే. కొండల్లో కారినా, మైదానాల్లో మలుపు తిరిగినా నీరు నీరే. అది కాలువ నీరు; ఇది ఏటి నీరు అంటాము. ఎంతవరకు? పారావారంలో పడేవరకే. ఆ తరువాత అంతా కడలి నీరే. నామాలు కారిపోయాయి. రూపాలు కరిగిపోయాయి. భేదాలు సమసిపోయాయి. అభేదంగా, అఖండంగా అంబుధి అలరారుతోంది. ఇది సాగర పూర్ణత్వం. సమత్వం పరమాత్మ పరిపూర్ణత్వం.

అభేద దర్శనం జ్ఞానం

"అభేద దృష్టి కలిగియుండుటయే జ్ఞానము" అన్నది స్కందోపనిషత్తు.

నామ సుమం

సంతలో దొరికేవి వాడే పుష్పాలు. సంతుల హృదయాలలో వికసించేవి వాడని పుష్పాలు. నామ పుష్పాలు. భగవన్నామ సుమాలు.

తెలియని దానిని ప్రేమించలేము. ప్రియమున్న చోట ప్రేమను దాచలేము. పిలుపును ఆపలేము. సర్వులకు ఈ ప్రపంచంలో ప్రియతమము దైవమొక్కటే. అదే ప్రియం. దాని కొరకే అన్నీ ప్రియం. ఈ జ్ఞానం వంటబడితే మన హృదయాలలో పరమాత్మ రూపమే ఉంటుంది. నాలుకలపై భగవన్నామమే కదుల్తుంది.

మనం జపించే నామం, కీర్తించే నామం ఎవరిదో కాదు; పరమాత్మది. మనం అర్చించే రూపం మరెవరిదో కాదు; పరమాత్మది. నామం, మంత్రం, స్తోత్రం సాగుతూ ఉంటే, గాలినిచ్చే చెట్టును గాలి ఊపినట్లు, మన చలనానికి ఆధారమైన పరమాత్మ హృదయాన్ని కదిలించటం జరుగుతుంది. కనుకనే నామస్మరణము, ప్రార్థన, ఇత్యాదులు సామూహికంగా నిర్వహింపబడుతూ ఉంటాయి.

భక్తులైన పుణ్యాత్ములకు పారాయణ, ప్రార్థనాదులలో తమలోని భక్తి వర్థమానమవుతూ ఉంటుంది. జన్మాంతరాలలో కొందరికి భక్తి అలవడి ఉంటుంది. నేడు నామం చెవిని పడగానే జన్మాంతర సంస్కారము చలించి, ఏదో జ్ఞాపకమొచ్చినట్లు భగవద్భక్తి చిగుళ్ళు తొడుగుతుంది.

"రామనామ శ్రవణము వల్ల
నామరూపమె హృదయంబు నిండి
ప్రేమ పుట్ట సేయగలేదా ని
ష్కామ త్యాగరాజు సేయు నామ
స్మరణే సుఖము - శ్రీ రామనామ స్మరణే సుఖము
నరుడై పుట్టినందుకు రామనామ స్మరణే సుఖము"

అని ఒక కీర్తనలో శ్రీత్యాగరాజ స్వామి గానం చేశారు.

ప్రార్థన పవిత్రమైంది. అందులో శరణాగతి ఉంది. కనుకనే పరమాత్మనుండి కృప లభిస్తుంది. ఓదార్పు అందుతుంది. ప్రతికూల పరిస్థితులను, ప్రభావాలను సహించే ఓర్పు సహజమవుతుంది.

సంకీర్తనము, జపము వాచక కర్మలు. ధ్యానము, స్మరణము మానస కర్మలు. ఇవన్నీ లౌకిక కర్మలుకావు. కనుక లౌకిక ఫలితాలను ఒడిలో నింపుకోవు.

ఇవి అలౌకికం. పారమార్థికం. కనుక వీటికి అలౌకిక ఫలాలే అందుతాయి. అలాంటి అలౌకిక కర్మఫలం ఏదోకాదు. అదే దయ. పరమాత్మ కృప.

కృషి చేసేది మనవంతు. కృప చూపేది పరమాత్మ తంతు. ఈ విధమైన కృషియే నామ సాధన. నామస్మరణ. ప్రార్థన.

మరణంలో 'మద్భావం'

భక్తుడు మరణకాలములో కూడా పరమాత్మనే స్మరిస్తూ ఉంటాడు. కనుక యమునికి చిక్కడు. దక్కడు. బాగానే ఉంది. ఇక్కడ విషయాన్ని మరికొంత లోతుగా పరిశీలించాలి.

మరణ కాలంలో మనసు పరమాత్మను ఎలా చింతించ గలుగుతుంది? మరణ కాలంలో ప్రతి ఒక్కరికి బ్రతకాలనే ఒకే ఆశ ఉంటుంది. అంతేగాని, ఏదో ఏదో స్మరించాలని ఎందుకుంటుంది? ఒకవేళ ఆలోచిస్తే ఇంకొక మంచి వైద్యుడు కావాలనో, మంచి మందు పుచ్చుకోవాలనో ఉంటుంది. అంతేగాని పరమాత్మను ధ్యానించాలని అనిపిస్తుందా?

ఒకవేళ దేహము ఎలాగూ నిలువదని వైద్యులు ఖచ్చితంగా చెబితే, ఆ తరువాత ప్రాణతుల్యమైన సమీప బంధువులను చూడాలని ఉంటుంది. ఎందుకంటే, జీవించి యున్నప్పుడు మనస్సులో ఎవరయితే ఉంటారో మరణ కాలంలో కూడా వారే ఉంటారు.

పోనివ్వండి. బ్రతికి యున్నప్పుడు నిరంతరం నామసాధనే చేశాడని అనుకుందాం. అలాంటప్పుడు మరణకాలంలో "గోవింద - రామ" అని ఎందుకు పిలువలేడు?

పిలువవచ్చు. అంతమాత్రాన ఏం జరుగుతుంది? మనం పిలిచినంత మాత్రాన పరమాత్మ వస్తాడా? మరి, జీవిత కాలంలో ఇలా ఎన్నిసార్లు పిలువలేదు? అప్పుడొచ్చాడా? అప్పుడు రానివాడు ఇప్పుడు వస్తాడని మాత్రం నమ్మక మేమిటి?

చస్తూ పిలుస్తున్నాం కనుక తప్పక వస్తాడు, అంటారా? అంటే, చావడానికి భగవంతుణ్ణి పిలవాలా? లేక, పిలిచిన తరువాత ఇక ఉండటానికి వీలులేదా? ఇదే నిజమైతే బ్రతికున్నవాళ్ళు ఇక నామసాధన చేయమంటే చేస్తారా? తరించేందుకు చేయమంటే ఎవరైనా చేస్తారేమో గాని, అంతరించేందుకు భజన ఎవరు చేస్తారు?

లేదు; మరణ కాలంలో, అంటే పిలుచుటకు సాధ్యపడని సమయంలో పిలిచాం కనుక భగవంతుడు తప్పక వస్తాడు అంటారా? సరే. అలాగే ఒప్పుకుందాం. వస్తాడు. దానివల్ల ఏం జరుగుతుంది?

పోయేటప్పుడు చాలామంది చుట్టూ మూగుతారు. దూరాన ఉన్నవారందరూ వస్తారు. అలాగే పరమాత్మ కూడా వస్తాడు. అంత మాత్రాన పోయేవాడి పాస్‌పోర్టు రద్దవుతుందా?

మనం పోయేటప్పుడు మన చుట్టూ మూగిన బంధువులు బాధపడకుండా ఉంటే మనకు ఎలా ఉంటుంది? వాళ్ళు ఏడవకపోతే, పోయేప్రాణం ఎంతగా కొట్టుకుంటుంది? ప్రేమలన్నీ పూర్ణ రూపంలో కనిపించవలసింది మరణ సమయంలోనే గదా?

మనం ఇంతకాలం ప్రేమించినవాళ్ళు చివరి క్షణంలో మన కొరకు ఏడిస్తేనే పోయే మనకు ఊరట. ఇది వాస్తవం. అలా అయితే, అందరికన్నా మనం భగవంతుని జీవితంలో ఎక్కువగా ప్రేమించాం. కనుకనే మరణ సమయాన మహావిష్ణువు మన మంచం ప్రక్కన చేరాడు. ఇప్పుడు విష్ణుమూర్తి విలపించకపోతే మనకు ఎంత ఆవేదన కలుగుతుంది? ఒకవేళ విలపించాడనే అనుకుందాం. అప్పుడు ఆయన విష్ణుమూర్తి ఎలా అవుతాడు? నీలాగ, నాలాగ సామన్యుడవుతాడు.

విష్ణుమూర్తి ఆనంద మోహనుడు. ఎప్పుడూ మందహాసంతో ఉంటాడు. ఎప్పుడూ మందహాసమే కనుక మంచం ప్రక్కన కూడా నవ్వుతూనే నిలబడుతాడు. అప్పుడెలా ఉంటుంది? ఇంతగా ప్రేమించిన మనం జారిపోతుంటే కనీసం మొగమైనా చిట్లించక పోవడం, పైపెచ్చు ఆనందంగా ఉండటం పోయేవాడికి మనశ్శాంతి మిగుల్తుందా? అని.

ఆలోచించండి. మరణకాలంలో నీవు పిలిచినంత మాత్రాన, జీవించి యున్నప్పుడు పిలిస్తే రానివాడు, వస్తాడని నేను అనుకోను. పోనీ ఆయన రాకపోతే రాకపోయే! పిలిచేవాడైనా కళ్ళు మూసిన తరువాత కైలాసానికి పోకుండా ఉంటాడా, అంటారా? ఏమో, అదీ సందేహంగానే ఉంది.

మరణకాలంలో ఒక్కసారి "రామా! అనగానే వైకుంఠానికి చేరడం వాస్తవమైతే జీవించి యున్నప్పుడు "గోవిందా!" అని ఎన్నిసార్లు పిలవలేదు! వైకుంఠప్రాప్తి అప్పుడెందుకు కలుగలేదు? నామం చెప్పగానే, పరమాత్మను పిలవగానే నరులు మానవలోకంలో మరణించి నారాయణుని దగ్గరికి వెంటనే వెళ్ళిపోతారు అని అంటే ఆ తరువాత బ్రహ్మ ముహూర్తంలో భజనలుంటాయా? మరణించము అని క్షుణ్ణంగా తెలుసు కనుక భజనను లీడ్ చేసేవారు మైకు ముందుకు మేమంటే మేమని దూసుకొస్తారు గాని, లీడ్ చేసేవాడే ముందుగా పోవలసినవాడు అని తెలిస్తే, ఆ తరువాత లీడ్ ఎలాఉంటుంది? ఏ వైపుకు సాగుతుంది?

అంతకాలే చ మా మేవ స్మర న్ముక్త్వా కలేవరమ్
యః ప్రయాతి స మద్భావం యాతి నాస్త్యత్ర సంశయః

"మరణకాలము నందు ఎవడు నన్నే స్మరించుచు దేహమును త్యజించుచున్నాడో అతడు నిస్సందేహముగ నా స్వరూపమునే పొందుచున్నాడు" అన్నాడు భగవద్గీతలో శ్రీకృష్ణ పరమాత్మ.

ఇక్కడ 'ప్రయాతి', 'యాతి' అనే రెండు పదములను క్షుణ్ణంగా అర్థం చేసుకోవాలి. మరణానంతరము దేహము పంచభూతాలలో కలిసిపోతుంది. అంతే. కారణ దేహము అవిద్యారూపమే కనుక పరమాత్మను పొందే సమయములో సూక్ష్మదేహము కూడా లేనిదే అగుచున్నది. కనుక భక్తుడు దేహాన్ని విడిచి వెళ్ళేది లేదు. జీవించి యున్నప్పుడు కూడా దేహానికి అతడు అంటుకొని లేడు. కనుక మరణించిన తరువాత విడిచి వెళ్ళేవాడూ కాడు.

సః మద్భావం యాతి - అంటే 'అతడు నా స్వరూపమునే పొందుచున్నాడు' అని భావము. ఇక్కడ పొందడమంటే తెలుసుకోవడము అని అర్థము.

జీవించి యున్నంత కాలము స్వరూపమును తెలుసుకొని జీవించాడు. మరణ కాలంలో కూడా స్వరూపంలోనే జీవిస్తున్నాడు. మరణమనేది తనకు సంబంధించింది కాదు.

చివరగా విశ్లేషించుకుందాం. జీవితంలో ఏది గాఢంగా హృదయాన్ని పెనవేసు కొని ఉంటుందో, అదే మరణంలో కూడా తొంగి చూస్తుంది. మరణంలో రామస్మరణ జరగాలి అంటే జీవితంలో అది జీర్ణించుకొని పోవాలి.

'రామం' అనేది కేవలం నామమని భావించకూడదు. అది తత్త్వము అని తెలుసుకోవాలి. అప్పుడే రామతత్త్వం తెలుస్తుంది. అలా కానిచో అనేక నామాలలో రామం ఒక నామంగా మిగిలిపోతుంది. పారాయణాలు, పోరాటాలు ఉంటాయేగాని మోహం నశించదు. మోక్షం ప్రాప్తించదు.

గేయం గీతా నామ సహస్రం - గీతను, విష్ణుసహస్రనామాన్ని కీర్తించమనిన శ్రీ శంకర భగవత్పాదులు అమాయకుల్ని కూర్చోబెట్టి, వీధి బడిలో ఎక్కములు వల్లె వేయించినట్లు పారాయణాలు చేయించి పొద్దుపుచ్చుకోలేదు. గీతకు, విష్ణుసహస్ర నామానికి భాష్యాలు రచించారు. నామం చెప్పడం కాదు; నామ వైభవం తెలిసి చెప్పినపుడు నామం పలుకుతూ ఉంటే అంతటా నామియే గోచరిస్తూ ఉంటాడు. దీనినే **మద్భావం** అన్నారు శ్రీకృష్ణ పరమాత్మ. జీవించి యున్నప్పుడు 'మద్భావ'మే, మరణ సమయంలో కూడా 'మద్భావ'మే.

మన అభిప్రాయాలకు, మన భావాలకు ప్రాధాన్యత నిస్తూ ఆలోచించినంత కాలము మనకు ఇతరుల దోషాలే గోచరిస్తాయి. ఇతరులు ఆలోచించే కోణం నుండి మన ఆలోచనలను సాగించ గలిగితే వెంటనే మనకు మన దోషాలు కనిపిస్తాయి. ఇతరుల దోషాలు మనకు గోచరించినా వాటిని నివారించే శక్తి మనకు లేదు. కాని, మన దోషాలను పోగొట్టుకొనే అవకాశం మాత్రం మన చేతిలోనే ఉంది.

దీనులకు దిక్కు

జన్మించిన ప్రతి ఒక్కరు మరణించక తప్పదు. మరణమనేది ఒకనాడు ప్రాప్తించేది కాదు. ఒక క్షణాన లభించేది కాదు. దేహము అనునిత్యము మరణించుచునే యున్నది. పుట్టిన నాటినుండి క్షణక్షణము శరీరము చస్తూనే ఉంది. ఈ సత్యమును మన బుద్ధి అందుకోలేక పోతున్నది. చావడమనే ప్రక్రియ పొత్తికలనుండే ప్రారంభమైనది. మరణంతో సమాప్త మగుచున్నది.

మరణాన్ని చూసి సర్వులు భీతి చెందుచున్నారు. అంతరించే వాటికై వగచడం అలవాటుగా మారింది. వ్యసనంగా తయారైంది. సూర్యుడు అస్తమిస్తున్నాడు. అందరి గృహాలు అంధకార బంధుర మవుతున్నాయి. మరి ఎవరూ విలపించుట లేదు. ఎందుకని? 'ఉదయించిన సూర్యుడు అస్తమించక మానడు' అనే సత్యము అనుభవానికి అందుటచేత ఎవ్వరూ దుఃఖించుట లేదు. పైగా చీకట్లను చెదరగొట్టుటకు దీపములను వెలిగిస్తున్నారు.

పెరిగేది విరగక తప్పదు. వికసించింది వాడకపోదు. భవంతులు కూలిపోయాయి. దేహాలు రాలిపోతాయి.

జరిగేవి జరుగక మానవు. వాటిని ఆపాలని చేసే ప్రయత్నమే సర్వ దుఃఖములకు కారణమై యున్నది. కనుక జారిపోయే వాటిని పట్టుకొనే ప్రయత్నంకన్నా, దారిని దర్శించి దరిచేరడమే ఉత్తమము. గిరిధారిని విశ్వసించి శాంతితీరమును చేరడమే శ్రేయస్కరము.

త్వదన్యః శరణ్యః ప్రపన్నస్య నేతి ప్రసీద స్మరన్నేవ హన్యాస్తు దైన్యం
న చేత్తే భవే ద్భక్తవాత్సల్యహాని స్తతో మే దయాలో! సదా సన్నిధేహి ॥

"హే దయామయా! నీవుతప్ప నాకు మరొక శరణ్యము శూన్యము. నేను నిన్ను వీడి మరొకరిని ఆశ్రయించలేను. స్మరించినంత మాత్రాన నీవు దీనులను, దుర దృష్టవంతులను కరుణించి యున్నావు. నిన్ను నమ్మిన భక్తులను నీవు తృణీకరించవు. ఓ దయామయా! నన్ను కరుణింపుము". ఈ విధంగా పరమాత్మను ప్రార్థించి, జనన మరణ రూప సంసార సాగరమును దాటి తరింపుమని ఆదిశంకరులు శివభుజంగ స్తోత్రములో తెలుపుతారు.

ఇలవేలుపు

జీవితంలో ప్రతిఫలించని, ప్రతిబింబించని బుద్ధిలోని జ్ఞానము నిరుపయోగమైనది. ఒక విధంగా చెప్పాలంటే ప్రమాదభరితం కూడా. అసలు బుద్ధికెపట్టని విషయము ఆచరణలో కనిపించడ మనేది మాత్రం మరణ సదృశము. మౌఢ్యము.

దీపముండేది చీకటిని పారద్రోలేందుకు. నీరు ఉండేది దాహాన్ని తీర్చేందుకు. చీకటిని చెదరగొట్టలేని దీపం, దప్పికను తీర్చలేని జలం ఊరేగినా ఉపయోగ ముండదు.

ఆకలితో హోటల్‌లోకి ప్రవేశించిన వ్యక్తి డబ్బు చెల్లించి, ఆహారాన్ని భుజించి తృప్తితో బయటికి వస్తాడు. ఆలయంలో ప్రవేశించిన వ్యక్తి, ఫలపుష్పాదులు సమర్పించి, పరమాత్మను అర్చించి, ఆనందంతో వెలుపలికి రావాలి.

అలాగే, ధ్యానం చేసిన తరువాత సాధకుడు శాంతిమయుడు కావాలి.

శాస్త్రాన్ని అధ్యయనం చేసినవాడు జ్ఞానవంతుడు కావాలి.

సత్సంగాన్ని ఆశ్రయించినవాడు సాధకుడు కావాలి.

ఇలా జరుగనంతవరకు ఆ యా విషయాలకు సంబంధించిన జ్ఞానము లేదా విలువ వ్యక్తికి తెలిసిరాలేదని భావము.

జీర్ణంకాని ఆహారము బలము నివ్వకపోగా బాధతో, భారంతో మనిషిని కృంగ దీసినట్లు వంటబట్టని జ్ఞానము బుద్ధిని భారంతో నింపుతుంది. ఇలా భారమైన బుద్ధి బ్రతుకును భారంగా మార్చుతుంది.

జ్ఞానముంటే లాభంలేదు. జీర్ణంగాని ఆహారంలాగే పనిచేస్తుంది. జ్ఞానివద్ద ఉండినా లాభంలేదు. అంధుడు సుందరశిల్పం ముందున్నట్లే ఉంటుంది. ఆ జ్ఞానం నీది కావాలి. నీదైపోవాలి. నీవుగా శోభించాలి. అప్పుడే వెలుగు.

యోమాం సర్వేషు భూతేషు సంత మాత్మానం ఈశ్వరమ్
హిత్వార్చాం భజతే మౌఢ్యాత్ భస్మన్యేవ జుహోతి సః

“సర్వ భూతములయందు ఆత్మగా, పరమాత్మగా ప్రకాశించు నన్ను మూర్ఖంగా విస్మరించి, కేవలం ప్రతిమలలోనే అర్చించుటకు అలవాటు పడినవాడు నెయ్యిని బూడిదలో పోసినవానితో సమానము” అని శ్రీమద్భాగవతము - తృతీయ స్కంధమున కపిల భగవానుడు తన తల్లి దేవహూతికి హితంచెప్పాడు.

సర్వాత్మభావంతో సాగితే అది నిత్యార్చన, నిత్యస్మరణ, నిత్యసేవ, నిత్య కైంకర్యము.

నీకు శాంతిని ప్రసాదించలేని ధ్యానాన్ని ఆపేయ్. ధ్యానమేమిటో అర్థం చేసుకొనే ప్రయత్నం ప్రారంభించు.

పామరత్వాన్ని పారద్రోలుటలో శక్తిహీనమైతే ఆ పారాయణాన్ని తక్షణమే ఆపేయ్. నీవు పారాయణంచేసే విషయానికి సంబంధించిన తత్త్వాన్ని అవగాహన చేసుకో.

మహాత్ములు ఆలయాలలో ప్రవేశిస్తే పరమాత్మ ప్రతిమలనుండి తొంగిచూశాడు. పూరీక్షేత్రంలో ఎందరో భక్తులకు జగన్నాథుడు దర్శనమిచ్చాడు.

నిర్జీవ తరువునుండి వ్యక్తమైన వాడు సజీవ తనువులో తొంగిచూడలేడా!

నీ నుండి పరమాత్మ తొంగిచూడాలి. చూస్తాడు.

అయితే నీవు అడ్డుగోడలా నిలువకూడదు.

తలుపు మూసి కూర్చుంటే సూర్యుడు వెలుగుతున్నా చీకట్లు తప్పవు.

తలుపు తోసేయ్. తలపులు తీసేయ్.

ఇక అంతా వలపే. నీలో అంతా వేలుపే. అల ఆగింది కనుక, కల చెదిరింది కనుక ఇలలోకూడా వేలుపే. ఇలవేలుపే.

Religion is the manifestation of the Divinity already in man.

‘మనిషిలో స్వరూపంగా ఉన్న దివ్యత్వాన్ని వ్యక్తం చేయడమే మతం’ అన్నారు స్వామి వివేకానంద.

ఇది కేవలం వ్యక్తిగతమైన విషయంగా ప్రతి వ్యక్తీ గ్రహించాలి అంటాను నేను. సంస్థలు ఉండొచ్చు. వ్యవస్థలు ఉండొచ్చు. గురువులు ఉండొచ్చు. బోధలు ఉండొచ్చు. అయినా ఆ పరమసత్యాన్ని నీలో నీవు నీవుగా వ్యక్తమయ్యేలా నీవే ప్రయత్నించి సాధించాలి. ఇది సత్యం. సత్యం. ముమ్మాటికీ సత్యం.

ఈ ప్రయత్నం సాగనంతవరకు గురువుకు సమీపంలోఉన్నా నీకు నీవు దూరమవుతూనే ఉంటావు.

నీవు పూజ చేస్తున్నా నీ మనస్సు షికార్లు చేస్తూనేఉంటుంది.

లేవండి. సత్యావగాహనతో నిండిపోదాం. సత్యదర్శనంలో పండిపోదాం. సత్యరూపులై ఉండిపోదాం.

కృషి - కృప

ఉన్నవాళ్ళు ఎందరైనా ఉండొచ్చు. హాయిగా ఉన్నవాళ్ళు ఎందరున్నారీ ప్రపంచంలో? సంపదలున్నా, సుఖాలున్నా, మనసు శాంతిని కోల్పోయినపుడు మనుగడలో మాధుర్య మేముంటుంది? మదనపడుతూ, మనసును మరగబెట్టుకొంటూ కాలాన్ని నెట్టుకపోతూ ఏం సాధించాలని?

అనిత్యం ఖలు జీవితమ్

జీవితం శాశ్వతం కాదు. శ్మశానం పెద్ద దూరంలో లేదు. దూరమైనా, దగ్గరైనా కాలానికి కరుణ లేదు. కాలాలు, దూరాలు కనికరించవు. ఏదో ఓ క్షణాన కర్కశంగా ఈడ్చుకొని పోతాయి కాటికి.

దాచింది దగాచేయకపోదు. మూసిందంతా మోసం చేసేదే. పెరుగుట విరుగుటకే. కూడిక తరువాత తీసివేతయే. సంయోగాలన్నీ వియోగాలే. వినోదాలన్నీ విలాపాలే. సంబరాలన్నీ సంతాపాలే.

ఎంత ఈదినా కామానికి తృప్తి లేదు. ఎంత చేదినా లోభానికి భర్తీ తెలియదు. ఎంత ఖర్చుచేసినా క్రోధానికి నష్టం అర్థంకాదు.

తరాలు గడచిన ఈ జగన్నాటకంలో తల్లులెవరు? తనయులెవరు? తాతలెవరు? దాతలెవరు? చక్రాన్ని త్రిప్పాలనే ఆశ అందరికీ ఉంటుంది. తిరిగే చక్రాన్ని ఆపాలనే ఆతృత ఎందరికుంటుంది? చావు నా చేతిలో లేదు. మరి బ్రతుకు నా చేతిలో ఎలాఉంటుంది? లేనిది ఎలావస్తుంది?

ఇవన్నీ మానవ మస్తిష్కంలో మౌలిక ప్రశ్నలు. మనసులో ప్రశ్నలు పుట్టడం సహజం. ప్రశ్నలతో మనిషి చావడం అసహజం. ప్రపంచ జల్లెడతో కాలం నిర్వహించే వడపోతలో అందరూ కారిపోయేవారే. అలాగని ప్రశ్నలతో పారిపోకూడదు. జవాబులు జేబులో పెట్టుకొని జారిపోవాలి.

ఆలోచనలైతే బాగానే ఉన్నాయి. ఆచరణలో బాగు ఏమిటో తెలియాలి. అన్నీ కృషితోనే లభించవు. కృప తోడైతేనే కృషికి ఫలితం. ప్రయత్నాలన్నీ ఆ దృక్పథంలో ఆవైపే సాగాలి. అప్పుడే జీవితంలో పూర్ణత్వం శోభిస్తుంది.

దాగియున్నవాడు కనిపించడు. అతడు కొద్దిగా కదిలాడు అంటే తన మనుగడను వ్యక్తం చేసుకున్నట్లే. ఇంకేముంది. దొరికిపోయినట్లే.

పరమాత్మ కూడా అంతే. అతడు దాగినవాడు. అతడు కదలడమే దయ. పరమాత్మను కదిలించాలి. అదే భక్తి. దయామయుడైన పరమేశ్వరుని భక్తి కదిలిస్తుంది. ఆయన కదిలాడా! బ్రతుకు కడతేరిపోతుంది.

నిత్యార్చన

పూజలో ఏది సమర్పించినా దానిని అందుకోవలసింది భగవంతుడు. అందించ వలసింది భక్తుడు. అందించబడేది భక్తి.

విగ్రహారాధనలో అర్చకుడు పూజించేది విగ్రహాన్ని కాదు; భగవంతుని. స్థూలంగా విగ్రహాన్ని పూజిస్తూ ఉన్నట్లు కనిపించినా, అతని మనసులో భగవంతుడు ఉన్నాడు అనే విషయాన్ని విస్మరించలేము. దూరదేశంలో ఉన్న ఆత్మీయుని ఫోటోలో చూచినపుడు మన మనసులో నిలిచి ఉండేది ఆ ఆత్మీయుడే. ఆరాధనలో కూడా అంతే.

ఈ విషయాన్ని మరొక కోణంలో పరిశీలిద్దాం. అర్చన జరిగేసమయంలో మనసు అక్కడ లేకుండా పోయిందనుకోండి. ఎందుకు లేకుండా పోతుంది? అని ఎదురు ప్రశ్న వేయకండి. ఒకచోట నిలబడకుండా చరించేదాన్నే మనసు అంటారు. కనుక మనసు పూజలో లేకుండా పోవడం విశేషము కాదు. విషయము.

అలా మనసు మరొకచోట ఉండి విగ్రహము ముందు పూజ జరిగితే, పూజ జరుగవచ్చునేమో కాని అది మనసు లేని పూజ. బుద్ధిలేని పూజ. బుద్ధిలేని పూజలో భగవంతుడు లేడు. అక్కడ అంతా యాంత్రికమే. మంత్రము కూడా నాలుకమీద ఉందేకాని మనసులో లేదు.

మనసులో భక్తి ఎప్పుడు లేదో పూజాగదిలో ఉండేది మానవుడు కావచ్చు. కాని, భక్తుడు మాత్రం లేడు. చెరువే లేనపుడు నీళ్ళెక్కడివి? భక్తుడే లేనపుడు ఇక భక్తి ఏమిటి? భక్తి, భక్తుడు లేని పూజలో భగవంతుని పాత్ర ఏమిటి?

ఇప్పుడు అర్థం చేసుకోండి. మనం గంటసేపు పూజ చేసినా, జపం చేసినా మనసు ఉన్న నిముషాలే పూజావేళలు. మిగిలిన సమయంలో పూజలు లేవు. అన్నీ పచార్లే.

స్తోత్రం చేయవచ్చు. భగవంతుని స్తుతించడము అంత తేలికైన పని కాదు. భగవంతుని వైభవాన్ని కీర్తించడము అంటే భగవంతుని గూర్చి తెలిసి కీర్తించడము అని భావము. భగవంతుణ్ణి తెలుసుకోవడమంటే అతని అనంత స్వరూపాన్ని గ్రహించడము అని అర్థము. అనంతుడు అంతటా ఉంటాడు. అంతటా ఉండేవాణ్ణి ఎలా చూడడము? అంతటా ఉన్నవాణ్ణి వీక్షించడమనేది అంతటా వ్యాపించిన వానికే సాధ్యమవుతుంది. అంతటా వ్యాపించి యున్నవాడు ప్రత్యేకించి చూడడానికి ఎవరున్నారు? ఒకవేళ చూచినా తననే తాను చూచుకోవాలి. ఎలా? భక్తుడుగా కాదు. భగవంతుడుగా.

కనుక ఇక్కడ చూడటము కాదు; తెలుసుకోవడం. కనుక జ్ఞానము ప్రధానమైన విషయంగా తెలుస్తోంది. అనంతుడైన పరమాత్మను నీవు చూడలేవు. తెలుసుకోవాలి. అనంతుని అనంతునిగా తెలుసుకోవాలే గాని పరిమితుడుగా తెలుసుకుంటే ఉపయోగం లేదు.

పరిమితుడైన వానినుండి అనంతానందము లభ్యంకాదు. అంతం కలిగిన సుఖాల కొరకైతే భగవంతునే ఆశ్రయించనవసరం లేదు. అర్థం చేసుకోండి. పరమాత్మ విగ్రహానికే పరిమితమైతే, అతణ్ణి పూజించి నీవు సాధించేదేమీ ఉండదు. అంతటా ఉన్నాడని తెలిసి అతణ్ణి విగ్రహంలో చూస్తే తప్పులేదు. ఎందుకని? అంతటా ఉన్నవాడు విగ్రహంలో లేకుండా ఎలా ఉంటాడు? అంతటా భగవంతుడు ఉండటమంటే ఈ సృష్టిలో పరమాత్మ నిమిత్త ఉపాదాన కారణమైయున్నాడు. ఇది నీకు అర్థం కావాలి. అప్పుడే పరమాత్మ చిరునామా నీకు దొరుకుతుంది. అంతవరకు అన్నీ నామాలే. జ్ఞానం మాత్రం లేదు. జ్ఞానం లేనివానివద్ద వంద ఉంటే ఏమి? వేయి ఉంటే ఏమి? చిన్నబిడ్డ చేతిలోఉండే కరెన్సీనోటు పది రూపాయలైనా, వంద రూపాయలైనా ఒక్కటే. విలువ తెలియని వ్యక్తివద్ద ఏదున్నా భూషణంగా పనికొస్తుందేమో గాని భాషణానికి పనికిరాదు. చిన్నబిడ్డ అయిపోయె - విలువ ఎలాతెలుస్తుంది? పేరుముందే 'చిన్న' చేరిపోయె. ఇక, పెద్ద విషయాలెలా తెలుస్తాయి? చిన్న బుద్ధులు, చిన్న చిన్న బుద్ధులే ఉంటాయి.

కనుక పరమాత్మ ఏమిటో తెలియకుండా పరమాత్మను పూజిస్తే అది పరమాత్మ కెలాచేరుతుంది? చిరునామా వ్రాయకుండా ఉత్తరాన్ని తపాలాపెట్టెలో పడేసినట్లు, పరమాత్మ పవిత్ర చరణాలవద్ద పూలు పడేస్తే అవి అతనికి ఎలా అందుతాయి? చిరునామా ఉంటేనే ఉత్తరం చేరేది. భక్తి ఉంటేనే పూజ ఫలించేది.

పూజ కూడా పనే. భక్తి తోడైనపుడే అది అర్చన అవుతుంది. యోగమవుతుంది. అంతవరకు జరిగేవి పనులే కాని పూజలు కావు. ధ్యాసలే గాని ధ్యానాలు కావు. ధ్యానమంటేనే తెలియదు కనుక "ధ్యాసే ధ్యానము" అని కొందరు చిలుక పలుకులు పలుకు తుంటారు. చిలుక మాటలు ఉండేది విని నవ్వుకోనేందుకే గాని, విషయ గ్రహణానికి కాదు. "ధ్యాసే ధ్యానము" అంటూ ఇంపుగా సొంపుగా యతిప్రాసలు వాడామని వారు తృప్తి చెందవచ్చు. అక్కడ ప్రాసము ఉంటే ఉండొచ్చునేమో గాని యతి మాత్రం లేనట్లే. యతి గాలేని మతికి స్వరూపస్థితి తెలిసిరాదు. తెలియనపుడు పనులుంటాయే గాని పూజ లుండవు. తెలిసి చేసినపుడే భక్తి. కనుకనే భక్తిని స్వస్వరూపాను సంధానంగా నిర్వచించారు వివేక చూడామణి గ్రంథంలో శ్రీ శంకరాచార్య స్వామి.

జ్ఞానము కలిగితే ఆ వైపునకు ప్రేమ ప్రవహించకుండా ఉండలేదు. ఇంట్లోఉన్న బిడ్డకు ప్రేమతో తల్లి మిఠాయిలు పెడుతుంది. అతడు దూరదేశం వెళ్తే మిఠాయిలు పెట్టలేక పోవచ్చునేమోగాని ప్రేమించకుండా ఉండలేదు. ప్రేమతో కార్యాలు జరుగవచ్చు. కార్యాలు లేనంత మాత్రాన ప్రేమ ఇంకిపోదు.

పరమాత్మ జ్ఞానము నీకు కలిగితే నీ హృదయంలో ప్రేమ నిండుకుంటుంది. ఆ ప్రేమే భక్తి. అందుకే! **'సాత్వస్మిన్ పరమ ప్రేమరూపా'** అంటూ పరమాత్మ యందలి ఉత్కృష్టమైన ప్రేమను భక్తిగా నారదమహర్షి భక్తిసూత్రాలలో నిర్వచించారు.

సృష్టికి పరమాత్మ నిమిత్త ఉపాదాన కారణమని తెలిసినపుడు సృష్టిలో సృష్టికర్త వేరుగా లేడు. ఇప్పుడు నీ వెక్కడున్నావు? అతనికన్నా వేరుగా ఉంటేమాత్రం నీవు ఎలా

ఉన్నావో, ఏమై ఉన్నావో అది వేరే విషయం గాని పరమాత్మ ఉండడమనేది మాత్రం ప్రశ్నార్థకంగా మిగిలిపోతుంది.

సృష్టి రూపంలో పరమాత్మ ఉన్నప్పుడు నీవుగా ఉండేది కూడా అతడే. అతడే నీవుగా ఉండేటప్పుడు ఇక నీవేమిటి? కనుక నీవైనా ఉంటావు. లేదా అతడైనా ఉంటాడు. అలా నీవు అంగీకరించలేకపోతే అతడే నీవుగా గాని, లేదా నీవే అతడుగా గాని ఉంటారు. అంతేగాని నీవు, అతడు వేరువేరుగా ఉండి, పరస్పరము భేదించుకొంటూ, మనుగడను సాగించలేరు. కనుక నీవే అతడు. అతడే నీవు. ఇదే 'సోఽహం' మంత్రము.

'సోఽహం' మంత్రమయితే అది మననానికే ఉంది. మననం చేసేవాణ్ణి రక్షించేందుకే ఉంది. ఇది కూడా తెలియక నేను 'సోఽహం' జపం చేస్తున్నాను అంటారు. అది నామం కాదు జపించడానికి. సోహంలో సంధి ఉంది. సః అహం అనే రెండు పదాలు కలిపి 'సోఽహం' అయింది. 'సోఽహం' అంటే 'నేనే శివుణ్ణి' అని అర్థము. ఇది తెలుసుకోదగిందేగాని జపించదగింది కాదు. నీవు ప్రయత్నించి శివుడవు అయ్యేటట్లయితే 'సోఽహం' జపం చేయవచ్చు. ఇది సాధ్యం కాదు; సిద్ధం.

లడ్డు తియ్యగా ఉంటుంది. "నేను తియ్యగా ఉన్నాను. తియ్యగా ఉన్నాను" అని లడ్డు జపం చేయాలా? "నేను తీపిని" అని తెలుసుకుంటే సరిపోతుంది. లడ్డు జపం అవసరం లేదు. 'సోఽహం' కూడా అంతే.

ఇక్కడ అద్వైతాన్ని విమర్శించా లనుకొనేవారు సాగదీసి, కొండను త్రవ్వి గణపతిని కలవరపెడుతూ ఉంటారు. "చీమకు చక్కెరను తినడం ఆనందం. చీమే పంచదారగా మారిపోతే ఇక ఆనందాస్వాదన మేముంటుంది?" ఇది వారి పూర్వపక్షము.

చైతన్యంగా వెలగమని ఉపనిషత్తు చెబుతుంటే చీమగా, దోమగా ఉంటాను అనుకుంటే ఇక చేసే దేముంటుంది? జడమైన చక్కెరను సచ్చిదానంద స్వరూపంతో పోల్చినపుడే జరుగకూడనిదంతా జరిగిపోయింది. అదలా ఉంచండి. చక్కెరను తినడం. చీమకు ఆనందం. చక్కెర లేనపుడు ఆనందం పోయినట్లే కదూ? చీమ ఆనందం మరొకదాని మీద ఆధారపడి ఉన్నట్లే కదూ! అదే నిజమైతే, అది పరిమితానందమే కదూ! అదే వాస్తవమైతే, ఇక మోక్షమనే పదానికి అర్థమేమిటి?

జ్ఞానం లేనపుడు ఉన్మాదాలే ఉపనిషత్తుల్లా కనిపిస్తాయి. జ్ఞానం కలిగితే ఉన్నదొక్కటే అనుభూతిగా మిగులుతుంది. ఇప్పుడు అంతటా ఉన్న అనంత పద్మనాభుని విగ్రహంలో దర్శించి పూజిస్తే తప్పులేదు. పూజ చేయనంతమాత్రాన జ్ఞానమున్న హృదయంలో అర్చన లేదని చెప్పకూడదు. అక్కడ జరిగేది నిత్యార్చన. ఇక ప్రత్యేక పూజ లెలా ఉంటాయి? ప్రత్యేక ధ్యానాలెలా ఉంటాయి? నిత్యమూ ధ్యానమే. సదా ధ్యానమే.

స్వయం తత్పాదుకా నిమజ్జనం పరిపూర్ణ ధ్యానమ్

"తాను పరమాత్మ చరణములయందు విలీనమైనట్లు భావించుటయే పరిపూర్ణ ధ్యానము" అన్నది ఉపనిషత్తు. ఇది పూజ కాని పూజ. ధ్యానం కాని ధ్యానం.

రామనామ స్మరణం

కాయం కలకాలం నిలిచేది కాదు. సంపదలు శాశ్వతం కావు. భార్యాబిడ్డలు తోడురారు. కీర్తి మృతిని తప్పించలేదు. కనుకనే,

వెఱ్ఱికుక్కల భ్రమలన్ని విడచి నిన్నె భజన జేసెడి వారికి పరమసుఖము అన్నాడు శేషప్ప కవి.

అనేక పనుల్ని భుజాన వేసుకున్న ఏకైక అవయవము మానవ దేహంలో నాలుక. దానికి తినడమే కాదు; తిట్టడం కూడా తెలుసు. పలకడం తెలుసు; అబద్ధాలు అనర్గళంగా పలకడం తెలుసు. అగ్ని లేకుండా కొంపలు మండించే శక్తి, నీరు లేకుండానే ప్రపంచాన్ని ముంచే శక్తి నాలుకకే ఉంది. మంచి పలికి కోటలు నిర్మించేది, చెడు పలికి బాటలు నాశనం చేసేది అదే.

నాలుకను శుద్ధి చేసుకోవాలి. బుద్ధి నేర్పి, రామనామాన్ని ముద్దు ముద్దుగా పలికించాలి. నామామృతపానం వల్ల నాలుక దోషరహిత మవుతుంది. నరుని నాలుక నామం పలికే భాగ్యానికి నోచుకోకపోతే ఆ నాలుక వైశిష్ట్యమేమిటి? మనిషికీ నాలుకుంది. మృగానికీ ఉంది. తేడా ఏముంది?

శ్రీనాథు వర్ణించు జిహ్వ జిహ్వ

అని ప్రహ్లాద కుమారుని ప్రబోధము.

సా రసనా తే నయనే తావేవ కరౌ స ఏవ కృతకృత్యః

"భగవన్నామాన్ని పలికే నాలుకే నాలుక. భగవద్రూపమును దర్శించు కన్నులే కన్నులు. పరమాత్మను పూజించు కరములే కరములు. భగవత్స్మరణముగల నిత్యభక్తుడే కృతకృత్యుడు అన్నారు శ్రీశంకరాచార్య స్వామి.

జీవితములో మన మనుభవించిన అత్యున్నతమైన సుఖాలు, అతీతమైన దుఃఖాలు, అతీతమైన బాధలు ప్రయత్నం లేకుండా జ్ఞాపకమొస్తుంటాయి. పరమాత్మకన్నా మించిన సుఖము, ఆనందము ఎక్కడ లభిస్తుంది? ఈ విషయం మన బుద్ధికి అందితే భగవంతుడు సదా స్మృతిలో మెదుల్తాడు. కష్టం లేకుండా సదా జ్ఞాపకం చేసుకోగలం. పరమాత్మ స్మృతి పుటల్లో కదుల్తూ ఉంటే అంతా సుఖమే. అంతా ఆనందమే. అన్నీ పుణ్యాలే. కనుకనే సుఖాన్ని రామనామం వృద్ధి చేస్తుంది. పుణ్యాన్ని పెంచుతుంది.

రామనామం పుణ్యాన్ని, సుఖాన్ని వృద్ధి చేయడమేకాదు. పాపాన్ని, అశుభాన్ని క్షయింప చేస్తుంది. తిరిగి రాకుండాచేస్తుంది.

'రా' శబ్దోచ్చారణా దేవ ముఖాన్నిర్యాన్తి పాతకాః
పునః ప్రవేశ భీత్యా చ "మ"కారస్తు కవాటవత్ ॥

'రామ' అను పదంలో 'రా' అనే మొదటి అక్షరమును పలుకగనే లోపలున్న పాపములన్నీ బయటికి పోతున్నాయి. 'మ' అనే రెండవ అక్షరమును పలుకగనే పెదవులు రెండూ ఏకమగుటచేత పోయిన పాపాలు తిరిగి లోనికి రాలేకపోతున్నాయి. ఇది రామ మంత్రము నుచ్చరించుటలోని వైభవము.

సూర్యుడు ఉదయించనంత వరకే ప్రపంచంలో చీకట్లు ఉంటాయి. నామ భాస్కరుడు నాలుకపై నాట్యమాడనంత వరకే జీవితంలో ఇక్కట్లు ఉంటాయి. వచ్చిన బాధంతా ఆ రుచిని ఇంకా మనము అనుభవించకుండా ఉండుటయే.

నామం మాట రూపంలో నాలుక మీద నుండి దొర్లిపోతున్నదే గాని, స్థిరంగా నాలుకపై నిలువడం లేదు.

నామసాధనలో ముఖ్యంగా రెండు విషయాల్ని మరచిపోకూడదు. 1. సదా జరిగేలా చూసుకోవడం 2. భక్తి ప్రేమలతో ఉచ్చరించడం - ఈ రెండు విషయాల్ని పాటించగలిగితే నామసాధన ఫలాన్ని జీవితంలో చూడవచ్చు. ఇది సులభమైన మార్గము. సున్నితమైన మార్గము. సురక్షితమైన మార్గము. సుందరమైన మార్గము.

మనసు ఇష్టపడిన విషయాన్నే నాలుక మాట్లాడుతుంది. కనుక సదా మనసు భగవంతునిలో రమించేలా చూడగలిగితే నాలుక శ్రమ లేకుండా రామనామాన్ని ప్రేమతో పలుకుతుంది. కనుక మనోభృంగం పరమాత్మ పాదకమలముల చెంత నిలిచేలా సాధకులు ప్రయత్నించాలి.

రామచంద్ర చరణారవిందయో రంతరంగ చరభృంగ లీలయా
తత్ర సన్తి రసా శ్చతుర్విధా మాకరంద రస ఏవ పంకజే ॥

"ఓ మనోభ్రమరమా! రామచంద్రుని చరణములు అనే సరోజములలో తిరుగు. చూడు! అక్కడ చతుర్విధ పురుషార్థములనే నాలుగు రసాలున్నాయి. మామూలు పద్మమైతే తేనె ఒక్కటే ఉంటుంది".

ఈ సత్యాన్ని మనసు కెక్కించాలి. హృదయంలోకి దింపాలి. నాలుకపై నడిపించాలి. అప్పుడు బ్రతుకే నామమయ మవుతుంది. కల్మషాలు కరిగిపోతాయి. కాఠిన్యాలు కాలిపోతాయి. కష్టాలు కనుమరుగవుతాయి. కాంతులు కళ్ళముందు నిలుస్తాయి.

అన్ని మార్గాలకన్నా భక్తిమార్గం సులభమైంది. అందులో నామసాధన మరీ సులభమైంది. ప్రేమ అందరిలో సహజంగా ఉన్నందున ప్రేమ సంబంధమైన భక్తి సాధన అన్ని మార్గాలకన్నా సులభతరం.

ధనవంతులే యాగాలు చేయగలరు. యోగాలు కష్టతరమైనవి. ప్రమాదాలతో కూడినవి. జ్ఞానము అందరి బుర్రలకీ ఎక్కేది కాదు. భక్తి ప్రేమమయం కనుక పంచదారలా మధురంగా ఉంటుంది.

లడ్డు తింటే తియ్యగా ఉంటుంది. ఇది స్వయంప్రమాణము. అనుభవరూపం. దీనికి వేరే ప్రమాణం అవసరం లేదు. అలాగే నామసాధన. ప్రేమతో నామాన్ని కీర్తించగనే నామియైన నారాయణుడు హృదయంలో నిలుస్తాడు. ఇది కేవలం అనుభూతి. ఇక్కడ మరొక ప్రమాణ మవసరంలేదు.

కలలో ఎన్నో కనిపిస్తాయి. కనువిందు చేస్తాయి. హాయిని గొలుపుతూ తోడుంటాయి. అవి నీకున్నాయి. ఈ నిజాన్ని ఎవరూ కాదనడం లేదు. అవి నీవి అనుకుంటే మాత్రం 'కాదు' అని చెప్పవలసి ఉంటుంది.

ఈ ప్రపంచంలో ఏవీ మనవి కావు. చివరికి దేహంకూడా మనదికాదు. దేహం మనకు ఉపకరిస్తుంది. మనది కాదు. కనుకనే శ్మశానంలో తగలబడి పోతుంది.

అన్ని విషయాల్లోనూ అంతే. ఇది తెలిస్తే ఆశలు అదృశ్యమై, అవసరాలు మాత్రమే నిలుస్తాయి. అవి కూడా ఉంటాయేగాని మనసులో ఊరేగవు. ఇంట్లో ఆసీనులమైయున్నా మనసులో ఉదాసీనులుగనే ఉంటాం.

మాయలో పడి, మర్మమెరుగని దోషం వల్ల విషయ సుఖాలమధ్య వెంపర్లాడుతూ విసిగిపోతున్నాము. విషయాలనే గాజుపెంకుల్ని ప్రోగు చేసుకుంటూ రత్నాలను దారబోసుకుంటున్నాం. చింతామణిని త్యజించి గురువింద గింజల్ని ప్రేమిస్తున్నాం. ఈ పరిస్థితి శ్రేయోదాయకం కాదని, ప్రమాదభరితమని మహాత్ములు హెచ్చరిస్తున్నారు. సుఖపడాలనుకుంటే రామనామాన్ని ఆశ్రయించమంటున్నారు.

స్మరణే సుఖము - రామనామ ॥ స్మరణే ॥

నరుడై పుట్టినందుకు రామనామ ॥ స్మరణే ॥

రామనామ శ్రవణము వల్ల నామరూపమే హృదయంబు నిండి

ప్రేమ పుట్ట సేయగ లేదా నిష్కామ త్యాగరాజు సేయు నామ ॥ స్మరణే ॥

మనిషై పుట్టినందుకు సుఖప్రదమైన రామనామమును స్మరించుటయే శ్రేయము. రామనామ స్మరణము చేయువారి హృదయంలో సదా రామ రూపమే నిండిఉండి, దివ్యప్రేమను పుట్టిస్తూ ఉంటుంది. అదియే దివ్య సుఖము అని త్యాగరాజస్వామి అనుభవామృతాన్ని పంచిపెట్టారు.

విజయభేరి

తండ్రి ఆస్తి బిడ్డల వినియోగానికే. బిడ్డ లందరూ వినియోగించుకోవాలి. భగవంతుడు బంగారు తండ్రి. ఆయన వద్ద ఉన్నదంతా బంగారే. ఆ బంగారమంతా మనదే. కంగారు అనేది అసలు లేనే లేదు; అది ఉందని మనం ఆలోచిస్తే తప్పు.

పరమాత్మ మనల్ని ఐశ్వర్యవంతులుగా మలిచాడు. కాని, మనల్ని మనం బిచ్చగాళ్ళుగా తీర్చి దిద్దుకున్నాం. మనకు ఏదో లేదని అదేపనిగ ఆలోచించటానికి అలవాటుపడ్డాం. అవసరం లేనివాటిని, అందని వాటిని పొందాలని కలలు కనటం నిత్యకృత్యంగా మారిపోయింది. ఇక్కడే బంగారు బ్రతుకు కంగారుగా మారుతోంది. భయ నిలయంగా తయారవుతోంది.

మనస్సు ఉన్నందుకు మనిషి ఆలోచించాలి. బుద్ధి ఉన్నందుకు ఆందోళన చెందకుండా ఉండాలి. ఆందోళనకు గురయ్యే మనిషి శాంతిగా జీవించలేడు. ధ్యానంచేస్తే ప్రశాంతత వస్తుంది; నేను కాదనటం లేదు. కాని, ప్రశాంతత లేనిదే ధ్యానం సాగదు అనే సత్యం ధ్యానం చేస్తేగాని అర్థంకాదు.

పరిచయమైన మనిషి కనిపించగనే "నమస్తే" అంటాము. ఆ తరువాత మాట్లాడేదంతా సజావుగా ఉంటుంది. ప్రపంచం మనకు క్రొత్తది కాదు. పరిచయమైనదే. నిద్ర లేవగనే ఒక్క చిరునవ్వును చిందించగలిగితే చాలు. ఇక, ఆ రోజంతా హాయిగా కంగారు లేకుండా సాగిపోతుంది. బోధ ప్రారంభించేముందు శ్రీకృష్ణుడు నవ్వుతున్నట్లు కనిపించాడు **(ప్రహసన్నివ)**. బ్రతుకును కూడా మనం నవ్వుతో ప్రారంభించాలి అనేదే ఆయన అభిమతం, అభీష్టం, అభయప్రదానం.

ఓదార్చే శక్తి గలవారు ఈ ప్రపంచంలో ఎవ్వరూ లేరు. మనం బాధల్ని కొనితెచ్చుకొంటూ ఉంటే, ఇతరులు "తగుదునమ్మా" పాత్రను పోషిస్తున్నారు. మేడలే కూలిపోతాయి. పేకమేడలు ఎంతకాలం నిలుస్తాయి? ఆశల్ని ఎంతకాలం నిలుపుతాయి?

బాధలకు దూరం కావాలని ఆలోచిస్తాం. వాటిని దగ్గరకు తెచ్చుకున్నది మనమే అని గ్రహించము. పిలవకుంటే, అవి దూరంగానే ఉంటాయి. బాధలకన్నా వాటిని కొనితెచ్చుకొనే ఆలోచనా విధానమే చాలా భయంకరమైనది. ప్రమాదకరమైనది.

"ఇది నా దురదృష్టం" అనే వాక్యానికి మించిన దురదృష్ట వాక్యం మరొకటి ఉండదు అని నా అభిప్రాయం. ఈ వాక్యం ఒక్కటే అయినా, శాంతి నిలయానికి ఉన్న తలుపులన్నిటినీ మూసేస్తుంది. లేనిదానికన్నా, లేదనే భావనే బుద్ధిని క్రుంగదీస్తూ ఉంది. బ్రతుకును కూల్చేస్తూ ఉంది.

"ఇది లేదు - అది లేదు" అని నిద్రలో అనిపిస్తూ ఉందా? అందుకే నిద్ర హాయి. మెలకువలో కూడా లేనివి లేనట్లే లేకుండాపోతే, ఉన్న హాయి అంతా మనదే అవుతుంది. మనమే అవుతుంది.

ఏది దూరమైనా, ఎవరు దూరమైనా పరమాత్మ నీ దగ్గరే ఉన్నాడు. ఆయన సహకారం సదా నీకు అందుతూనే ఉంది. ఆయన కృపతోనే నీవు తిరుగుతున్నావు. ఆయన కృపతోనే నేను తింటున్నాను. క్షణక్షణము ఆయన దయ మనల్ని నడిపిస్తూనే ఉంది. లేకపోతే, మన శ్వాసలు కదుల్తాయా?

దురదృష్టం ఎక్కడుంది? ఇదంతా అర్థం కాకపోవటమే దురదృష్టం. భావదారిద్ర్యం ఉండాలే గాని భాగ్యమున్నా బిచ్చగాళ్ళే. భావ సౌందర్యం తోడుంటే లేనివాడు కూడా ఉన్నవాడే. హాయిగా ఉన్నవాడే. **(కౌపీనవన్తః ఖలు భాగ్యవన్తః).**

మన కూడా ఎవరున్నారు? పరమాత్మ తప్ప. మనతో సదా ఎవరు కలిసి ఉన్నారు? పరమాత్మ తప్ప. మరి, ఉన్నవాడు నిద్రపోతూ ఉన్నాడా? నిన్ను నిద్రపుచ్చేందుకు ఉన్నాడు. బాధలు సమీపించకుండా నిన్ను జోకొట్టి నిద్రపుచ్చేందుకు మేలుకొని యున్నాడు. లోపలే ఉండి కాపలా కాస్తూఉన్నాడు. కళ్ళెమును అప్పగించి కంగారు లేకుండా ఉండమంటున్నాడు. చూస్తూ ఉండగనే బ్రతుకు బండిని బంగారు బాటలో నడిపిస్తానంటున్నాడు.

లేనివాళ్ళను ఎవ్వరూ పిలవరు. ఉన్నవాళ్ళే అయినా పిలిస్తే గాని రారు. పరమాత్మ ఉన్నవాడే. పిలిస్తే పలుకుతూ వచ్చేవాడే. పిలిచే సంస్కారమే ఇప్పుడు మన బుద్ధికి పట్టాలి. ఇది అభ్యర్థన కాదు; ప్రార్థన.

మనమందరము మోక్షమార్గంలోనే ఉన్నాము. కాని, నడవకపోతే గమ్యాన్ని చేరలేము. నడిపేవాడు ఉన్నాడు. అయినా మనం నడవాలి. నడుస్తూ ఉంటే చాలు. ఇప్పుడు మనం కంగారులో ఉన్నాం. భయాలతో బ్రతుకుతున్నాం. నడుస్తూ ముందుకుపోతే భయాలకు, బాధలకు దూరమవుతాము. శాంతికి, సుఖానికి చేరువవుతాము. ఇది వాస్తవం కాకపోతే, 'వేదాంతం' అనే పదానికి అర్థమేలేదు. ఆ బాటలో నడిచేవారికి పరమార్థమే లేదు.

కాని, వేదాంతం ఎవ్వరినీ ఇంతవరకు వృథా చేయలేదు. వేదాంత మార్గంలో త్రికరణ శుద్ధితో నడచిన వారెవ్వరూ ఇంతవరకు వృథా కాలేదు. ఇదే నిజమైన జయం. విజయం. విజయదశమినాడు అందరము ఆనందంగా మ్రోగించవలసిన విజయదుందుభి.

మన్మనా భవ మద్భక్తో మద్యాజీ మాం నమస్కురు
మామే వైష్యసి సత్యం తే ప్రతిజానే ప్రియోఽసిమే॥

'నాయందు మనస్సు నుంచు. నా భక్తుడివి కా. నన్ను అర్చించు. నాకు నమస్కరించు. నన్నే పొందుతావు. నీవు నాకు ప్రియుడవు. అందుకే ఈ సత్యమును ప్రతిజ్ఞ చేసి చెబుతున్నాను' అని గీతలో విజయసారథి మ్రోగించిన విజయభేరి.

నామామృతం

అర్థం తెలియని బ్రతుకు, పరమార్థం వెంట నడవని బ్రతుకు ఎన్నడైనా వ్యర్థమే. ధనమున్నా, జనమున్నా, సంపదలున్నా, సంతానమున్నా పురుషార్థ నిశ్చయము లేక భక్తి లేనివారు ఈ ప్రపంచంలో వ్యర్థజీవులే. ఎన్ని ఆధిక్యాలున్నా అల్పులే. ఈ విషయంలో మీమాంస బయలుదేరి 'అల్పుడెవరు?' అని మన పూర్వీకులు చర్చను ప్రారంభించారట.

కేచి ద్వదన్తి ధనహీన జనో జఘన్యః

కేచి ద్వదన్తి కులహీన జనో జఘన్యః

వ్యాసో వద త్యఖిల వేద విశేష విజ్ఞో

నారాయణ స్మరణహీన జనో జఘన్యః

ధనహీనుడు అల్పుడు అన్నారు కొందరు. కులహీనుడు అల్పుడు అన్నారు మరికొందరు. నారాయణ నామస్మరణ చేయనివాడే లోకమున అల్పుడు అని సమస్త వేదార్థసారము నెరిగిన వ్యాసభగవానుడు పలికి తలెత్తిన మీమాంసను మాయంచేశారట.

జీవనది ప్రక్కనే కూర్చునిఉన్నా అంధుడికి దప్పిక తీరదు. గుడిగంటలు మ్రోగుతున్నా చెవిటివానికి గుడికెళ్ళాలి అనిపించదు. వేదనాభరిత జీవితాన్ని ఈ ప్రపంచంలో సాగిస్తున్న వారికి, నిరాశా దాహంతో నీరసించి పోతున్నవారికి ఎందుకో భగవన్నామామృత పానం చేసి తృప్తిగా, ఆనందంగా జీవించాలి అనిపించదు.

నదీజలాన్ని పానంచేసి దప్పిక దీర్చుకోవచ్చు. దానికి మూల్యం చెల్లించ నవసరం లేదు. శ్రమపడి పొందనవసరం లేదు. మనసుంటే సరిపోతుంది. మార్గం తెలిస్తే సరిపడుతుంది. కృష్ణ నామామృతం సదా ప్రవహిస్తూ ఉంది. నిరపాయమైన ఈ భక్తిమార్గంలో చరించకుండా తపించడ మెందుకో?

భగవన్నామము మనల్ని భగవంతునికి సమీపంగా పట్టుకెళ్తుంది. ఫలితం రాలేదని కొన్ని రోజులు జపించి వదిలేసేవారికి దాని వైభవం తెలియదు. నామముపై ప్రేముండేవారికి నామము మధురంగా ఉంటుంది. వెగటు తెలియని ఆ మాధుర్యాన్ని అనుభవించేకొద్దీ ఆనందం అధికమై పరమాత్మ దర్శనంకూడా ప్రాప్తిస్తుంది.

నామాన్ని ఆశ్రయించి నామిని ఆధారంగా గ్రహించి తరించిపోవాలి. నామం మనవద్ద ఉంటే నామికూడా ఉన్నట్లే. నామి ఉన్నచోట లేమి లేదు. భయాలు మిగలవు. శోకాలు మిగలవు. అంతా ఆనందమే. ఈ ఆనందం ఎక్కడనుండి వస్తుంది? మన ఆంతర్యం నుండే వస్తుంది. నామం అనే టాప్ త్రిప్పగానే నామి అయిన టాంకునుండి ఆనందం ప్రవహిస్తుంది. ఇది కేవలం మాట కాదు. మహాత్ముల హృదయ గహ్వరమునుండి బయల్వెడలిన అనుభవామృత ఊట.

పువ్వులా నవ్వాలి

మనస్సులో సూక్ష్మంగా ఉండే భావన స్థూలంగా వ్యక్తం కావటమే కర్మ. ఈ కర్మ మనస్సులోని భావనకన్నా వేరుకాదు. మనస్సులోని సంకల్పమే ఇది. భక్తి కూడా కర్మే. ఉదాహరణకు ఇల్లు కట్టుకోవటం (భవన నిర్మాణం). మనస్సులో భవన రూపం వుంది. దానిని బట్టి నిర్మాణం జరుగుతూ వుంటుంది. మధ్యలో వెళ్ళి మనం చూసుకుంటూ వుంటాం. మన మనస్సులోని రూపంగా అది వస్తూఉన్నదో లేదో అని పోల్చుకుంటూ ఉంటాం. భవనం పూర్తికాగానే వచ్చినవాళ్ళూ, చూసినవాళ్ళూ బాగా కట్టుకున్నారని అభినందించినా అంతకు పూర్వమే అది అలావస్తుందని మనకు తెలుసు; ఆ రూపం మన మనస్సులో ఉందికనుక. అలాగే మనస్సులోని భక్తిభావన భక్తికర్మగా వ్యక్తమవుతూ ఉంటుంది. ఒక అందమైన శిల్పంగా శిల ఆకృతి చెందినా ఆ శిల్పం మన భావనలో ఉంది. ఆంతర్యంలో ఉన్నదానిని స్థూల రూపంలో చూసుకోవటానికి కర్మ కదులుతుంది.

భక్తిలో మొదట **'సహేతుక సద్భావన'** ఉండాలి. ఇది సూక్ష్మరూపం. శిల్పి తన మనస్సులో ప్రతిమ రూపాన్ని భావన చేసుకోవటం లాంటిది. భావశుద్ధి కలవాడు చేస్తేనే కర్మ అందంగా ఉంటుంది. జ్ఞాని చేస్తే సద్భావపూరితంగా వుంటుంది కనుక అందంగా ఉంటుంది. భక్తి అనేది ఒక వైఖరి. భక్తియోగం అనేది లేదు. యోగాలు రెండే ఉన్నాయి. (1) **జ్ఞానయోగం** (సన్న్యాసులు అవలంబించేది) (2) **కర్మయోగం** (గృహస్థులకై చెప్పబడినది). గీతలో స్వామి కూడా చెప్పియున్నాడు. భగవంతుని కోసం కదిలింది కనుక కర్మ పూజ అవుతుంది. అందువల్ల యోగం అయింది. కర్తృత్వ భావన లేదు. కర్మ చేసేటప్పుడు అకర్త అనుకోవటం, అనుభవించే టప్పుడు 'అభోక్త' అనుకోవటం, కర్మఫలం ప్రసాదమని స్వీకరించటం జరుగుతుంది. **'ప్రసాదే సర్వ దుఃఖానాం హాని రస్యోప జాయతే'** అని గీతలో భగవానుడు చెప్పియున్నాడు. జ్ఞానానికీ, కర్మకీ రెండిటికీ భక్తి కావాలి. శాస్త్రపఠనంలో అధ్యయనంలో, మనన నిదిధ్యాసల్లో అన్నిచోట్లా భక్తి ఉంది.

భక్తి యోగి ఎలా ఉండాలి? ఏం చేయాలి? వాచక కర్మ, కాయక కర్మల్లో ఎలా ప్రవర్తించాలి? **'నిరాశీ ర్నిర్మమో భూత్వా...'**. సర్వకర్మలను భగవంతునికే సమర్పించి ఆశను, మమకారాన్నీ వదలి ఉండాలి. **'యదృచ్ఛా లాభ సన్తుష్టః'**. ప్రయత్నం లేకుండానే అయాచితంగా లభించిన దానితో సంతృప్తిని చెందిఉండాలి. వచ్చేదానిని ఎవరూ ఆపలేరు; లేనిదానిని ఎవరూ ఈయలేరు అనే ఎఱుక కలిగి ఉండాలి.

సహేతుక సద్భావన - అహైతుక భక్తి సాధన వైపు నడిపిస్తుంది. ఇది ఏ కోరికాలేని భక్తి సాధన. దీని వెనుక ఏ అపేక్షా ఉండదు. కల్పతరువు, కామధేనువు భోగాల.నిస్తాయి. కానీ మోక్షం ఈయలేవు. **'మోక్ష మిచ్ఛేత్ జనార్దనః'**. సంపద, సంస్కారం, మోక్షం ఇవన్నీ ఇస్తాడు భగవానుడు. భక్తిలో ఆశించటం కాదు; అర్హత కలిగి ఉండాలి.

భక్తిలో 'నేను' అనేది చేరితే సంసారం. సంసారిలో 'నువ్వు' (భగవానుడు) చేరితే అది భక్తి. సహేతుక సద్భావనతో అహైతుక భక్తి సాధనచేయగా 'ఫలితం నాదైనా ఉండేది నీ దగ్గరే భగవాన్' అనుకోవాలి. సత్కర్మ ఫలితం భగవంతుని వద్ద ఉంది. భగవానుడే సకాలంలో ఇస్తాడు. కర్మఫలం నీదే అయినా నీవు తీసుకోలేవు. భక్తిలో 'నేను చేస్తున్నాను' అనే అహంకారం తలెత్తితే సంసారి.

పరమాత్మ ఉంటేనే భక్తి. ఉన్నది ఒక్కటే హృదయం. అందులో ఉండవలసింది 'భగవానుడో', 'అహమో', మనమే నిర్ణయించుకోవాలి.

భక్తి సాధనలో 'నేను' ఎగిరిపోయింది. ఇపుడు దానికి రెండు పనులే ఉన్నాయి. **1. నిరీక్షణ 2. ఆహ్వానం.** భగవానుడు బుద్ధి పీఠంపైకి రావాలి. శబరి ఎదురు చూసింది కానీ 'లగ్నం' పెట్టలేదు. 'నిమగ్నం' అయిపోయింది. భగవానుడికోసం చేస్తున్నప్పుడే పరమాత్మ నీ దగ్గర ఉన్నాడు. ఆయన ప్రక్కనుంటే అంతా **'నిత్య కళ్యాణం పచ్చ తోరణమే'**. నిలబడి నిరీక్షిస్తున్నాయి చెట్లు, అందుకే అవి పచ్చగా ఉంటాయి ఎప్పుడూ. చెట్ల కొమ్మలు ఊగుతూ ఉంటాయి; అదే ఆహ్వానం!

రాయిలో ప్రతిబింబించే శక్తి వుంది కానీ పదును పెట్టాలి. నీళ్ళకి ప్రతిబింబింపజేసే లక్షణం ఉన్నా నీళ్ళు కదులుతూ ఉంటాయి, చిన్న రాయి తగిలినా. ఇవి రెండూ తమోగుణం, రజోగుణం. కానీ అద్దం ముందు నిలబడితే నీ రూపం సుస్పష్టం. ఇది శుద్ధ సత్త్వం. అద్దం ఏదీ తనలో వుంచుకోదు. ఏ రూపం ఎదుట నిలబడినా తాను కదలదు; తనకేదీ అంటదు.

ప్రపంచంలో సుఖమే వుంది. ఆనందమే వుంది. ఇది ఆనందాలయం. **'సద్బ్రహ్మ కార్యం సకలం సదైవ'**. దుఃఖం అనేది మనం చిత్రించుకున్నది. ప్రపంచంలో ధర్మాలే ఉన్నాయి. నీతి, నియతి, ఉన్నాయి. **అహైతుక భక్తి సాధన** జరిగే సమయంలో నువ్వు భగవద్విభూతివే. నిత్యశోభ, నిత్యానందమే!

అందం, శోభ అనేవి ప్రవర్తనలో ఉంటాయి; జీవితంలో వుంటాయి. నవ్వు వుండేవాడు నవ్విస్తాడు. నవ్వటం కూడా కళే! సంతోషంగా వుంటేనే నవ్వగలడు. ఆనందం భోజనమైతే నవ్వు త్రేపు లాంటిది. నవ్వటానికి కూడా పుణ్యం కావాలి.

ఈ ప్రపంచంలో ఎవరూ బలవంతులు కారు; ఎవరూ బలహీనులు కారు. శక్తివంతుడు, శక్తిహీనుడూ వ్యక్తి కాదు. బలవంతుడు బలవంతుడే అయితే బలహీనుడుగా కన్పించాల్సిన అవసరం లేదు.

కాలం బలవంతుడిని బలహీనుడిగా చేస్తుంది. కర్మఫలం అందటంవల్ల కాలంలో నిస్సహాయంగా నిలబడిపోతాడు. జైలులో నిర్బంధించబడిన ఉగ్రసేనుడు రాజ్యం

వస్తుందని ఊహించాడా? కంసుడి కంటే బలవంతుడు ప్రవేశించినపుడు ఉగ్రసేనుడు విడుదల అయ్యాడు. కాలానిదే పెద్ద పాత్ర. కాలానికే పెద్ద పీట.

గతాన్ని తుడిచిపెట్టాలంటే జీవితంలో వేదాంతం రావాలి. తాను 'అకర్త' అని తెలియాలి. గతాలు గబ్బిలాల్లాగా పట్టుకుని వ్రేలాడుతున్నాయి. వీటినుంచి విడిపడాలి. గతాన్ని తుడిచివేయాలి. అపుడు నిర్భయంగా ఉండగలవు. భయం వుంటే నిర్భయంగా ఎలా ఉండగలవు? భయం దేనిని గురించి? (1) మరణ భయానికి సంబంధించిన చింత (2) జీవన రక్షణకి సంబంధించిన చింత (3) రేపు ఎలా ఉంటుందో, ఏది ఎలా జరుగుతుందో అనే ఆలోచన.

దేనిని గురించి బాధపడాలన్నా కర్తృత్వం ఉంటేనే. ఎక్కడ ఏది జరిగినా పరమాత్మ కృపే. ఇంటిలో వుండేందుకు దేహం తెచ్చుకున్నాం కానీ ఇల్లు కట్టుకోవటానికి సంబంధించిన వస్తువుల్ని, వ్యక్తుల్ని మనం తెచ్చామా? అవన్నీ భగవంతుడే ఇచ్చాడు. నీవు డబ్బు ఇస్తే మనుషులు ఇల్లు కట్టారు. ఆ ధనాన్ని భగవంతుడు నీకు ఇచ్చాడు. ఇంటిలో ఉంటే కాదు బాధ; అది నాది అనుకుంటేనే బాధ. అహైతుక భక్తి సాధనలో వేదన లేదు. పరమాత్మ అక్కడ చేరివున్నాడు.

నువ్వు ఉన్నచోట ఆనందంగా ఉండలేకపోతే, ఆనందంగా వుండటానికి మరో చోటికి పోవాలి. ఇంతవరకూ జరిగిందా లేదా? ఆలోచించు. ఇంతకాలం జీవితంలో నీ కందినవన్నీ నీ వడిగితే వచ్చినవి కావు. ఇంతకాలం చూసినవాడు ఇక ముందు చూడలేడా? రేపు ఏం జరుగుతుంది? అని ఆలోచించకు. రేపటి గురించిన రూపం నీదగ్గర వుందా? మనిషి ఆలోచించాల్సి వస్తే ఒక్కదానిని గురించి ఆలోచించాలి. ఈ రోజు మన చేతిలో వుంది. ఈ రోజు చక్కగా గడిస్తే ప్రాణం పోయేది ఒక్క క్షణంలోనే కనుక ఆ క్షణాన్ని సద్వినియోగం చేసుకోవటం జరుగుతుంది.

మనిషి భయపడకూడనిది చావు ఒక్కటే. చావుని గూర్చి ఎవరికి తెలుసు? పోయినవాడు చెప్పాలి చావును గురించి. పోయినవాడు లేడు కనుక చెప్పలేడు. ఉన్నవాడు పోలేదు కనుక చెప్పటానికి ఆధారంలేదు. చావుకు కాలం ఎప్పుడో ఎవరికీ తెలియదు. తెలియక పోయినా వస్తుంది. చచ్చిన తరువాత చావు లేదు. చచ్చేంతవరకు బ్రతుకు వుంది. మృత్యువు రావటం, పోవటం ఒకే క్షణం, చావు క్షణంలో జరిగిపోతుంది. చావు అనివార్యం, నిశ్చయం. కానీ అది జరిగేది ఒక్కక్షణం. ఆ క్షణం ఏదని బ్రతికినంత కాలం ఆలోచించటమా? చావుతో మాట్లాడే అవకాశం ఉందా? ఎప్పుడు వస్తుందో తెలియదు; మాట్లాడే అవకాశం లేదు, సమయం అసలే లేదు. ఎందుకొచ్చినవి ఈ చావు ఆలోచనలు?

మరో కోణంలో చూస్తే, చావు ఒక్కక్షణంలో వచ్చేది కాదు. చావు మనం పుట్టినపుడే పుట్టింది. మనం పుట్టకముందే తల్లి గర్భంలోనే పుట్టింది. గర్భంలోనే మరణాలు సంభవిస్తున్నాయా లేదా? ఎక్కడ నుంచైనా చావు మనల్ని పట్టుకొని పోతుంది;

నిద్రలో కూడా ప్రక్కనే ఉంటుంది. మహానుభావులు జీవనది వంటివారు. భగవానుడు సముద్రం. నది సముద్రంలో కలిసే ఉన్నది. నీటికి రెండు లక్షణా లున్నాయి. 1. శుద్ధి చేయటం. 2. చల్లబరచటం (బాహ్యాభ్యంతరాలలో). బుద్ధిని శుద్ధి చేయటం, బ్రతుకుని చల్లబరచటం మహాత్ములు చేసే కార్యం. ఎంతటి మహత్కార్యాలు తననుండి జరిగినా అది తెలియనివాడు మహాత్ముడు.

ఒక సంత్ పురుషుడికి దేవతలు వరం ఇస్తామంటారు. సమీపించిన వ్యక్తుల వ్యాధులు పోగొట్టగల శక్తిని ప్రసాదించమంటావా? అంటారు. అది వైద్యులు చేయాల్సిన పని; తాను దానిని చేయలేను, అంటాడు ఆ మహాత్ముడు. పాపాత్ముల్ని మార్చే శక్తి నివ్వమంటావా? అంటే, అది మతప్రవక్తలు చేసేపని అంటాడు. మరి ఏమి ఇవ్వమంటావు? ఏదీ ఇవ్వకుండా మేము పోము అని అంటే, 'నా ద్వారా ఏ విధమైన మేలు జరిగినా (సమాజ అభ్యుదయం, వ్యక్తి వికాసం) అది నాకు మాత్రం తెలియకూడదు' అంటాడు. దేవదూతలు ఆ మహాత్ముడు నడుస్తూంటే అతని నీడ ఎవరి మీద పడితే వారి ఆపదలు పోతాయి అని సంకల్పించి వెళ్ళిపోతారు. ఆ క్షణం నుండి అందరూ అతని నీడను అనుసరిస్తూ ఉంటారు. ఆ మహాత్ముని ఎవరూ పట్టించుకోరు. అది ఆయనకు ఎంతో తృప్తినిస్తుంది. కాని, ఛాయను, మాయను అనుసరించటం కాదు; మహిమను పట్టుకోవాలి.

మనం దీపాల్ని పట్టుకొని తిరగటం కాదు; మనమే దీపాలుగా శోభించాలి. తనలో పరిమళం వుందని తెలియని పువ్వులా ప్రవర్తించాలి. పువ్వు ఎండలోనే వుంటుంది. కానీ స్పృశిస్తే చల్లగానే వుంటుంది. ముళ్ళ మధ్యవున్నా మృదువుగానే వుంటుంది. ఋతువు లన్నింటిలో, ఎండలో వున్నా, వర్షంలో వున్నా, చలిలో వున్నా పువ్వు సౌందర్యం చెడదు. పువ్వు పుట్టినపుడే పూజార్హం అయిపోయింది. ఇది యోగ్యత. పుట్టగానే అర్చన యోగ్యం అయిపోయింది. సౌందర్యం, సౌరభం పరమాత్మ పాదాలు చేరటం, అన్నీ ఒక్కరోజులోనే! పువ్వులకి మాటలు రావు; కానీ నవ్వటం వచ్చు. పువ్వు వికసించటమే నవ్వు.

నువ్వు మాట్లాడుతూ ఉండు. పరమాత్మ వింటాడు. అతను మాట్లాడుతూ ఉంటాడు; నువ్వు విను. మీరిద్దరూ మాట్లాడకండి; ఇద్దరూ వినండి. ఇద్దరూ మాట్లాడకండి. ఇద్దరూ వినకండి. ఇదే మోక్షం. ఇదే భూమానందం.

యత్ర నాన్యత్పశ్యతి నాన్యచ్ఛృణోతి నాన్య ద్విజానాతి స భూమా.

బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి

భక్తే అపార శక్తి

తప్పు చేయడం తప్పు కాదు. చేసిన తప్పును సరిదిద్దుకోకపోవడం తప్పు. ఒప్పు చేయకపోవడం తప్పు. అలా చేయలేకపోగా మరో విధంగా కప్పిపుచ్చాలని యత్నించడం ఏనాడైనా ముప్పే.

వట్టి చేతులతో, ఓటి చేతులతో ఈ ప్రపంచంలో ప్రవేశించి, ఆ తరువాత ప్రతిదానిని 'నాది-నాది' అని దోచుకోవడం , దాచుకోవడం మనిషి చేసిన పెద్ద తప్పు. 'నాది-నాది' అంటూ చేసిన తప్పును 'నీది-నీది' అని భగవంతునికి సమర్పించి సరిచేసుకోవాలి. ఇదే అర్పణ భావము. సమర్పణ భావము.

యో వేదాధ్యయనం యజ్ఞం దానాని వివిధాని చ

మదర్పణ ధియా కుర్యా త్స మే భక్త స్స మే ప్రియః

"వేదమును పఠించినా, యజ్ఞము నాచరించినా, దానము చేసినా నాకు సమర్పించు భక్తుడు నాకు ప్రియుడు" అన్నాడు పరమశివుడు.

అర్పణ భావముతో జీవించడం అర్చన అవుతుంది. పరమాత్మ తనకు దూరంగా లేడని భావించి అనుక్షణము పరమాత్మతో కలిసి జీవించడమే సమర్పణ భావమవుతుంది. పరమాత్మ నాలోఉన్నాడు. నా ముందున్నాడు. నా వెనుక ఉన్నాడు. అతడే నాకు రక్షకుడు. అతడి అనుగ్రహం ఉన్నంతవరకు నేను ఈ ప్రపంచంలో ఉంటాను. అతనికి తెలియకుండా నేను ఏదీ చేయలేను. నాద్వారా అతడే వ్యవహరిస్తున్నాడు. నాకు బుద్ధి నిచ్చింది తానే. దానిని శుద్ధి చేసేది తానే. అవకాశాలు చూపేది తానే. అవసరాలు తీర్చేది తానే. నాదంటూ ఇక్కడ ఏదీ లేదు. అంతా తనదే. అంతా తానే.

బిడ్డ పిలిచేది తల్లినే. ఏడ్చేది తల్లి కొరకే. లోభి ఆశించేది డబ్బునే. విలపించేది డబ్బుకొరకే. భక్తుడు పిలిచేది పరమాత్మనే. పరితపించేది పరమాత్మ కొరకే. భక్తునికి పరమాత్మకన్నా అన్యులెవరూ తెలిసిరారు. అతడికి అంతా భగవంతుడే. అన్నీ భగవంతుడే. అతడు చరించేది, జీవించేది భగవంతునికొరకే.

పరమాత్మే శక్తి. పరమాత్మే తనకు ముక్తి. పరమాత్మయందే తనకు అనురక్తి. చాతకపక్షి నీలిమేఘం పైనేదృష్టిని సారించి ఉంటుంది. సద్భక్తి పరాయణుడు నీలమేఘశ్యాముని మీదనే తన చూపుల్ని నిలిపి ఉంటాడు.

కర్మలవల్ల లభించే ఫలితాలు రాగద్వేషాల్ని పెంచుతాయే గాని ఆనందాన్ని ప్రసాదించవు అని తెలిసినవాడే భక్తుడు. అట్టివాడు ఏ కర్మను ఆచరించినా భగవత్ప్రీతి కొరకే చేస్తాడు. రాగద్వేషాల్ని త్యజించడం అంత సులభం కాదు. వాటికి వశపడకుండా జీవించాలి.

ప్రాతః స్మరణం

ఏదో జరిగిందని
ఏదేదో జరిగిపోయిందని
బాధల్లో యెద కుమిలిపోయిందని
తీపి చేదుగా మారిందని
తెలుపు నలుపైందని
ఆశాసౌధాలు పేకమేడలై కూలిపోయాయని - ఎంతోమంది ప్రొద్దుపోయే వేళ,
సద్దు మణగేవేళ గుండె భారంతో క్రుంగిపోతూ ఉంటే,
మంచులా కురిసే మంచిలో తడుస్తూ,
చిరుగాలులవలె చిరుచిరు నవ్వులు ఒలికిస్తూ
ఊగే మొక్కలవలె హృదయాన్ని ఊయల చేసుకొని
సమతను పంచే ఊహలలో తేలిపోతూ
మధ్యలో,
నిస్తరంగ జలధిలా నిర్వికల్పమై శోభిస్తూ
ఉషోదయంలో జ్ఞానోదయానికి శ్రీకారం చుట్టి - ఎందరో ధన్యజీవులు ప్రభాతవేళ
ఆనందంతో పొంగిపోతూ ఉంటారు.
కొందరి సంస్కారాలు సంతాపాల అంగడులైతే,
మరి కొందరి సంస్కారాలు సంబరాల సందడులు.
ప్రాతఃకాలం పవిత్రం
ప్రాతః స్మరణం పరమ పవిత్రం.
అజ్ఞాన రాతలను సమూలంగా తుడిపి
జ్ఞాన జలంతో హృదయాన్ని చల్లగా తడిపే
పవిత్ర జ్ఞాన తీర్థం ప్రాతఃస్మరణం.

ప్రార్థన పవిత్రమైంది. పవిత్రమైన ప్రార్థనను సాగించే మనస్సు ప్రశాంతంగా ఉండాలి. ప్రశాంతత కాలానికి సంబంధించింది కాదు. కాని, మానసిక ప్రశాంతతకు అనువైన కాలాన్ని గుర్తించాలంటే అది ప్రాతః కాలమే. ప్రభాత సమయమే. ఉదయ కాలమే. విశ్రమించిన నిన్నటి సంకల్ప అలజడి పునః విహరించేందుకు ప్రయాణము సాగించకముందే లభించే పవిత్ర సమయమే.

ప్రభాత వేళ

ఆకాశాన్ని ఆవరించిన చీకటి తెరలు మెల్లమెల్లగా తొలగుతూ ఉంటే, చల్లని మంచు బిందువులతో తడిసిన ప్రపంచముపై, తెల్లతెల్లని, నులివెచ్చని కిరణాలను ప్రసరింప చేసేందుకు ఆకాశంలో అర్క్కుడు ఉద్యమిస్తున్న పవిత్రవేళ,

ఆలాపన చేసే గాయకులు అప్రయత్నంగా తల లూపునట్లు, వాయునాదాన్ని వినిపిస్తూ వృక్షాలు మెల్లగా అటూ ఇటూ ఊగుతూ ఉంటే, నేపథ్య సంగీతంలాగ వేణునాదం వలె ఒకవైపు కోయిలల కుహూ కారాలు, తాళమా అన్నట్లు మధ్యమధ్యన మరోవైపు పక్షుల రెక్కల చప్పుళ్ళు, గానానికి పరవశించి నాట్యం చేస్తున్నట్లు వృక్షశాఖలూ - అంతేనా!

తలనిండా పువ్వులను తురుముకొని చేతులు చేతులు కలిపి ఆడుకొనే యువతుల లాగా, అటు ఇటు ఒకరు మరొకరిపై వాలుతున్నట్లు సహజంగా క్రీడిస్తున్న పూలమొక్కలు,

పైన నీలాకాశము, క్రింద పచ్చని గ్రాసము, మధ్యన మెల్లగా వీస్తున్న చిరుగాలులు, గాలి తాకిడికి పరవశించి చలిస్తున్న సరోవర జలాలు,

విరబూసిన మల్లెల ఘుమఘుమలు, విరజిమ్మబడుతున్న సంపెంగెల సౌరభాలు, సుప్రభాత సుస్వరాలమధ్య వినిపిస్తున్న గుడిగంటల సునాదాలు, నిర్మలమైన ఈ పూజా పవిత్ర వేళ,

రాత్రంతా రాజ్యమేలిన నలుపును సూర్యోదయము తెలుపుగా మార్చుకున్నట్లు, జన్మజన్మలుగ మన హృదయ సీమలను ఏకంగా పాలించిన అజ్ఞాన చీకట్లను జ్ఞానోదయంతో విజ్ఞాన వెలుగులుగా మార్చుకొనేందుకు,

ప్రభాత వేళకు మించిన పవిత్ర వేళ లేదు. లేదు. లేదు. కనుకనే,

ప్రాతః స్మరామి....... ప్రాతః కాలమున స్మరించుచున్నాను.

ప్రభాత వేళ సాగిన స్మరణము ప్రదోష కాలమువరకు విస్మరణము కలుగ కుండా ప్రకాశించే విధంగా ప్రదీపాన్ని ఉషస్సులోనే వెలిగించుకోవాలి. ఆ ప్రయత్నమే ప్రాతః స్మరణము.

నామ స్మరణం

భగవంతునితో సంబంధాన్ని పెట్టుకోవడానికి భగవన్నామానికి మించిన సులభమైన, శ్రేష్ఠమైన దారి మరొకటుండదు. నామాన్ని జపించిన క్షణం దివ్యక్షణం. ఎప్పుడు భగవన్నామాన్ని జపిస్తామో అప్పుడే భగవంతుని సన్నిధిలో మనం ఉన్నట్లు భావన కలుగుతుంది. హృదయం పారవశ్యంతో పరవళ్లు త్రొక్కుతుంది.

భగవన్నామం బంధాలను తొలగిస్తుంది. విశ్వప్రేమను మనసుకు పట్టిస్తుంది. నామం జరిగే ప్రదేశము పవిత్రతతో, ప్రశాంతతతో, ప్రమోదముతో నిండిపోతుంది. ప్రేమను, కాంతిని, శక్తిని, శాంతిని నామం ప్రసాదిస్తుంది.

దేవుడు లేని గుడిలాగా, పంతులు లేని బడిలాగా, శుద్ధిలేని బుద్ధిలాగా, నామం పలుకని నాలుక నిష్ప్రయోజనం. నిరుపయోగం. కనుకనే, **నామ్ జపన్ క్యోం ఛోడ్ దియా?** - నామజపం ఎందుకు విడిచావు? అనే ప్రశ్న ఉదయించింది. ఎన్నో వ్యర్థమైన వాటిని వదలని మనం పరమార్థాన్నే ఎందుకు వదలవలసి వచ్చింది? అనేది విస్మయ మొందించే విషయం.

1. ఆశకు అవరోధము కలిగినపుడు ఎదిరించే శక్తి లేకుంటే, ప్రతికూల వాతావరణము ఎదురైతే నిరాశ జనిస్తుంది. శక్తి ఉంటే, వాతావరణము అనుకూలంగా ఉంటే క్రోధం ఏర్పడుతుంది.

క్రోధం ఏర్పడినపుడు ఏది చేయాలి, ఏది చేయకూడదు అనే విచక్షణ మనిషికి మిగలదు. క్రోధంలో ముందు నిలిచేది తొందరపాటు. చివరికి మిగిలేది పశ్చాత్తాపం.

క్రోధాన్ని జయించడం సాధ్యంకాదు. క్రోధాన్ని జయించాలి అనుకొనేలోగా క్రోధం తాను చేయవలసిన పనిని బుద్ధిగా చేసి వెళ్తుంది. ఇంట్లో ఎవరికైనా కోపంవస్తే అది చూచి పెద్దవాళ్ళు అంటూ ఉంటారు. 'ఎందుకురా! అలా కోప్పడతావు? కాసేపు అలా వెళ్ళిరా! ముఖం తప్పిస్తే కోపం కారిపోతుంది" అంటుంటారు.

అది నిజమే. ఆ కోపిష్టి, వాళ్ళు చెప్పినట్లే విని అలా బయటికి వెళ్తాడు. అక్కడ స్నేహితులతో కలిసి మరచిపోతాడు. కోపం పోయినట్లే ఉంటుంది. తిరిగి మళ్ళీ ఇంటికి రాగానే కోపానికి కారణమైన వ్యక్తి కంటబడటం జరుగుతుంది. కారిపోయిన క్రోధం తిరిగి నిండిపోతుంది. అయితే ఇప్పుడు కోపకారణం గతంలో ఉన్నదే కాకపోవచ్చు. కాని, కోపానికి గురయ్యే వ్యక్తి మాత్రం మారడం జరుగదు. అతడు ముఖం తప్పిస్తే ఏం లాభం? కోపానికి కారణమైన ముఖం ఎదురుగా ఉంది.

ముఖాలు తప్పిస్తే క్రోధాలు మటుమాయం కావు. మనసులలో మార్పు వచ్చినపుడే అది సాధ్యపడుతుంది. అవగాహన లోపించడం చేత కోపం వస్తుంది. వివేకాన్ని

అలవరచుకుంటే సూర్యుని ముందు మంచుగడ్డలా క్రోధం కరిగిపోతుంది. వివేకాన్ని వృద్ధి చేసుకోవాలి. అవివేకాన్ని విడిచిపెట్టాలి. కాని, అది మనిషి చేయడు; నామజపాన్ని మాత్రం విడిచేస్తాడు. అయినదానికి కాని దానికి ఆలోచించకుండా అబద్ధాలు చెబుతుంటారు మనుష్యులు. అబద్ధాలు చెప్పడం మానరు. నామజపాన్ని వదిలేస్తారు.

2. జీవితంలో ఏది ముఖ్యమో మనిషికి తెలిసిరావాలి. నిజమైన అవసరాలేమిటో అర్థం కావాలి. అది తెలియనినాడు అవసరాలు అనుకున్నవి బ్రతుకునే అంతం చేయవచ్చు.

అనిత్యమైన జగత్తును నిత్యమని, నిత్యమైన పరమాత్మను అనిత్యమని భావించుటచేత వదలవలసిన దానిని పట్టుకోవడం, పట్టుకోవలసిన దానిని వదలటం జరుగుతుంది. ఇదే మాయ. ఈ మాయతోనే నిండియున్నందున ఇది మాయాప్రపంచం. మనిషికి మోజంతా మాయమిదనే. కనుకనే పరమాత్మను మంచినీళ్ళ ప్రాయంగా త్యజించడం జరిగింది. నామజపాన్ని విడిచివేయడం జరిగింది.

3. ఈ ప్రపంచంలో వైభవాలు, విశేషాలు అన్నీ చిల్లర విషయాలే. పూర్ణం కానిది చిల్లర. క్షణిక సుఖాలే గాని నిరవధిక సుఖం ఇక్కడ లభ్యంకాదు. అది అమూల్యమైనది. అద్భుతమైనది. అపూర్వమైనది. అమూల్యమైన ఆత్మ రత్నాన్ని త్యజించి చిల్లరపైసల వంటి విషయసుఖాలను మనిషి కౌగిలించుకొని యున్నాడు. విషంలాంటి విషయాల్ని విడిచిపెట్ట లేకున్నాడు గాని నామజపాన్ని మాత్రం పూర్తిగ విడిచిపెట్టేశాడు.

4. భగవంతుని స్మరించడం అంటే భగవంతుని వైభవాన్ని స్మరించడం అని అర్థము. ఈ సృష్టి అంతయు పరమాత్మ స్వరూపమే. ఇది అర్థమైతే సృష్టిలో ప్రతి ఒక్కరిని పరమాత్మ స్వరూపంగా దర్శించి ప్రేమించగలం. ఒక్కరిని హృత్పూర్వకంగా ప్రేమించినా, వారి ప్రేమను చూరగొనినా మనము ఎంతగానో పొంగిపోతాం. పరవశించి పోతాం. కాని, యావత్ప్రపంచాన్ని ప్రేమించగలిగినపుడు ఎంత ఆనందం ప్రాప్తిస్తుందో కదా! ఇది భగవంతుని స్మరించుట చేతనే సిద్ధిస్తుంది. అట్టి స్మరణను, నామజపాన్ని త్యజించడం మనిషికి పట్టిన దురదృష్టం.

5. త్యజించే లక్షణం మనిషి దగ్గర ఉంది కనుకనే పరమాత్మను త్యజించాడు. నామస్మరణను త్యజించాడు. ఈ త్యజించే గుణాన్ని వదలిపెట్ట నవసరంలేదు. వివేకంతో వినియోగించుకొంటే సరిపోతుంది. అన్నిటినీ వదలిపెట్టవచ్చు. అన్నీ తానైన వానిని విడువకూడదు. మరువకూడదు.

తనువు అశాశ్వతం. ధనం అస్థిరం. మనసు చంచలం. కాని, పరమాత్మ శాశ్వతం; స్థిరం; అచలం. నిత్యుడైన పరమాత్మకై అనిత్య విషయాల్ని భౌతికంగా త్యజించే అవకాశము లేకపోయినా, రాకపోయినా మనసుల్లో వాటిని తుడిచి వేయాలి.

తవ దాసోహం

ఎన్ని తెలుసుకున్నా తెలియనివి ఉన్నవనేదే మనసుకు బాగా తెలుస్తోంది. ఎన్ని అనుభవించినా, అనుభవించవలసినవి మిగిలి ఉన్నాయనే బుద్ధి చలించిపోతోంది. ఎంత సంపాదించినా, సంపాదించవలసింది ఇంకా ఏదో ఉందనే చిత్తము చిందులేస్తోంది. అయితేనేమి, ఇప్పటికి ఈ మాత్రం సాధించగలిగాను అని అహంకారం ఆవేశంతో ఊగిపోతుంది.

ఎన్ని ఉన్నా, ఎందరున్నా - ఏవీ, ఎవరూ తోడురారు అనే వివేకం మనిషికి రావడం లేదు. పైగా, నీడలన్నీ నిజాలుగా గోచరిస్తున్నాయి.

మరణంతో ముగిసిపోయే బాంధవ్యాలను పెనవేసుకొని మనిషి మురిసి పోతున్నాడు. కేవలం అవసరాలను మాత్రమే తీర్చి అసంతృప్తిని మిగిల్చిపోయే ధనాన్ని ప్రోగుచేసుకొనేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నాడు. చేసే ఉద్యోగంలో సమస్యల ఉద్వేగంతప్ప సుఖశాంతులు లేవని తెలుస్తున్నా, హోదాను మననం చేసుకుంటూ మరిగిపోతూ ఉంటాడు. 'తొండ పరుగు కంచె వరకే' అన్నట్లు ఈ అప్రస్తుత, అసందర్భ ప్రవర్తనలన్నీ తుదిశ్వాస వరకే. తెర పడిందా! మళ్ళీ నాటకం మొదలుకొస్తుంది. కాకపోతే, ప్రదేశము, కాలము, రంగస్థలము మారుతాయి. అంతే.

మాతా పితృ సహస్రాణి పుత్రదార శతాని చ
సంసారే ష్వనుభూతాని యాన్తి యాస్యన్తి చాపరే ॥

"గతంలో మనకు వేలమంది తల్లులుండేవారు, తండ్రులుండేవారు, పుత్రులుండే వారు, భార్యలుండేవారు. ఇలా ఉంది ఈ సంసార జీవనంలో మన అనుభూతి. ఇక రాబోయే జన్మలలో కూడా ఇలాగే ఉంటుంది" అని వ్యాసోక్తి.

విచిత్ర బంధాలు! విపర్యయ వ్యామోహాలు! కంటికి రెప్పల్లా బిడ్డల్ని కాపాడు కోవడం, చివరగా వారు అంటించే అగ్నిలో కాలి బూడిదైపోవడం. ఆస్తిపాస్తులంటూ క్షణం తీరికలేకుండా శ్రమించి సంపదను ప్రోగుచేయడం, ఆ ఆస్తుల కారణంగానే ఆత్మీయులనుకున్నవారు "మరణించినా మేము ముఖం చూడము" అని దూరంగా పారిపోవడం. ఎవరి విషయంలోనైనా ఇవి మామూలే. ఎన్నడైనా ఇవి వాడిపోయే పూలే.

ఇదంతా మాయాకార్యము. మాయలో ఉన్నంతవరకు ఈ వేదనలు తప్పవు. మాయను దూరంచేసి, మహిమను సమీపించిన వారికే బాధలు తీరుతాయి. బరువులు తగ్గుతాయి.

మాయా ఐసా ఢాకినీ ఖాయో సబ్ సంసార్
ఏక్ న ఖాయ్ కబీర్ జో రహ్యో రామ్ ఆధార్

'మాయ ఒక గొప్ప రాక్షసి. ప్రపంచాన్నంతా అమాంతం మింగేస్తుంది. కాని, రాముని ఆధారంగా పొందిన కబీరును మాత్రం మాయ కబళించ లేకపోయింది' అన్నాడు సంత్ కబీర్‌దాస్.

కనుక మాయాబంధాలు నిర్విరామంగా పంచే బాధల మర్మాలను గుర్తించి, మనసును భగవంతునియందు లగ్నంచేయాలి. ఇదియే శివభక్తి. ఇక్కడ 'నేను' నశిస్తుంది. అంతా 'తాను'గా మిగుల్తుంది. 'నాది' కారిపోయి, అంతా 'నీది'గా ఊరేగుతుంది.

గురునానక్ తండ్రిగారు ధాన్యం వ్యాపారం చేస్తూ ఉండేవారు. ఒకనాడు ఆయన పనిమీద వెళ్తూ నానక్‌ని దుకాణంలో ఉంచి వెళ్ళాడు. ధాన్యం కొనేందుకు వచ్చిన వ్యక్తి నుండి డబ్బు పుచ్చుకొని నానక్ ధాన్యం కొలవడం ప్రారంభించాడు.

-- ఏక్, దో, తీన్, చార్, పాంచ్..... తేరా. . ..

ఒకటి.. రెండు . . మూడు.. .నాలుగు. . . ఐదు . . అంటూ ధాన్యాన్ని కొలుస్తూ పదమూడు (తేరా) అన్నాడు. అంతే . . . ఇక 'తేరా . . . తేరా . . . తేరా' అంటూ ఉండిపోయాడు. 'తేరా' అంటే పదమూడు అని ఒక అర్థం, 'నీవాడను' అని కూడా మరొక అర్థం. ఆ ఒక్కమాట (తేరా) అన్ని మాటలకు తెర దించింది. హిందీలో 'తేరా' అంటాం. సంస్కృతంలో 'తవ' అంటాము.

తవ దాసోఽ హం - తవ దాసోఽ హం

తవ దాసోఽ హం . . . . దాశరథే - అంటూ నానక్ వలె భద్రాచల రామదాసు శ్రీరాముడికి దాసుడయ్యాడు.

నది ఎంత దూరం పయనించినా, ప్రయాణంలో ఎంతగా శ్రమించినా సముద్రములో కలిసే ముందు ప్రశాంతంగా, నిర్మలంగా, హాయిగా చలిస్తూ ఉంటుంది. నిత్య జీవితంలో మనం ఎంతగా అలసిపోయినా, పూజాగదిలోకి ప్రవేశించేటప్పుడు లేదా ధ్యానాసనం వద్దకు చేరేటప్పుడు సాగరుని కలిసే నదీమ తల్లిలా స్వచ్ఛంగా, ప్రసన్నంగా, ప్రశాంతంగా ఉండాలి. సాధన కర్మే అయినా, సాధనలో ప్రేమేగాని కర్మ లేదు.

కడుపు తీపి

"లాల పోసుకో తండ్రీ! బువ్వ తిను తల్లీ!" అని తల్లి బిడ్డల్ని పిలవడం వెనుక దాగియున్న కడుపుతీపి మనిషి మాటలకు అందేది కాదు. జన్మనిచ్చేవారు తల్లిదండ్రులు. కాని, తాను జన్మనిచ్చిన వారిని తల్లి, తండ్రి అని సంబోధించడం ప్రేమలో ఒక పరాకాష్ఠ

గర్భము దాల్చకపోయినా, శ్రమించి కన్నది కాకపోయినా, పురిటి స్నానాలు, నడికట్లు లేకపోయినా సదా సంతానాన్ని ప్రసవించే, ప్రసాదించే పరమాత్మను తల్లిగా సంబోధించడం పుణ్య భారతీయ సంస్కృతిలో భక్తి సాహిత్యం అనుగ్రహించిన, అందించిన అక్షయ సంపద. కాలికి దెబ్బ తగిలినా, కడుపుకు నొప్పి కలిగినా "అమ్మా!" అనడం, దుస్సాధ్యమైన కార్యాన్ని శ్రమించి సాధించినపుడు, జరగదేమో అనుకున్న మహత్కార్యము జరిగినపుడు "అ....మ్మ" అని కూర్చొని ఛాతీపై చేతులుంచుకోవడం ఒకరు నేర్పితే వచ్చింది కాదు. ఈ స్పందన బళ్ళల్లో, గుళ్ళల్లో నుండి తలవంచి తెచ్చుకున్నది కాదు. గుండె అంతరాంతరాల్లో ఎక్కడినుండో అప్రయత్నంగా కదిలి పైకి వస్తున్న అవ్యక్త ప్రేమ పొంగు.

గత జన్మలో ఒక తల్లి. ఈ జన్మలో మరొక తల్లి. తరించక చతికిలబడితే మళ్ళీ ఎత్తుకొనేందుకు రాబోయే జన్మలో వేరొక తల్లి. తల్లులు మారొచ్చు. కాని, వారందరిలో బిడ్డ కొరకు తల్లడిల్లే స్వభావం మాత్రం మారదు. అది ఎక్కడిది? అని అన్వేషణ ప్రారంభిస్తే, ఆ తరువాత కాలూనేది కైవల్యంలోనే. తల్లుల్ని గన్నతల్లి సన్నిధిలోనే. ఆ సన్నిధే పరమాత్మ సన్నిధి.

పరమాత్మ అందరికీ తల్లి. పాలవెల్లిలో పవ్వళించి బిడ్డల్ని చల్లగా చూచే కల్పవల్లి. జన్మ జన్మలకు వెంట నడిచే జనని. మాయాప్రపంచం వంచించి త్రాగించిన విషాన్ని విరుగుడు చేసే సంజీవని.

పరమాత్మది తీపి కడుపు. అందుకే ఆ దివ్యాత్మునిలో అంతా తీపినే చూస్తున్నాం. **"మధురాధిపతే రఖిలం మధురం"** అని మనసును కరిగించుకొంటూ పాడుతున్నాం. 'పాహి' అనగానే పరుగులెత్తి వచ్చి ప్రక్కన నిలిచే పరమాత్మ కడుపుతీపిని ఏమని వర్ణించాలి? అది వరాల కడుపు. ప్రేమ సరాల కడుపు. పాపులైనా సరే పశ్చాత్తాపంతో పిలిస్తే మారుపలికే పుణ్యాల కడుపు. సామాన్యులైనా తనను నమ్మిన వారిని అసమాన ప్రతిభావంతులుగా తీర్చిదిద్ది, వారిచేత అద్భుతకార్యాలను చేయించి శాశ్వత కీర్తిని ప్రసాదించే రత్నాల కడుపు.

బిడ్డకు జన్మనిచ్చిన తల్లిపై బిడ్డను పోషించే భారముంది. తల్లి పోషణలోనే శిశువు పెరుగుతుంది. అలాగే ఈ సృష్టిలోని జీవులందరికి జన్మప్రదాత భగవంతుడే. కనుక పోషకుడు తానే. బిడ్డపై తల్లికున్న ప్రేమ కూడా పరమాత్మ ప్రేమ నుండి అరువు తెచ్చుకున్నదే. సూర్యుని నుండి వెలుగుకిరణాలు ప్రసరించని దెపుడు? పరమాత్మ నుండి ప్రేమసుధ స్రవించని దెపుడు? ఈ సత్యం తెలియక అంతా తమ భుజాలపైనే

ఆధారపడి ఉందని జీవులు ఊగిపోతున్నారు. ఈ కారణంగానే జీవిత ఊయలలో జన్మమృత్యువుల అంచులవైపు సదా ఊగుతూ అలసిపోతున్నారు.

గూటిలోని పిల్లపక్షికి మేత తేవాలని గువ్వ గగనంలో ఎగిరి అరణ్యాలకు వెళ్తుంది. అది తన గూటికి ఎంత దూరమవుతూ ఉంటుందో మనసులో తన బిడ్డకు అంత దగ్గరవుతూ ఉంటుంది. బిడ్డ ఎలా ఉందోనని తల్లడిల్లుతూ ఉంటుంది. గువ్వగుండెలో ఈ ప్రేమను సృష్టించిన పరమాత్మ హృదయం ఎంత ప్రేమతో నిండియుందో చెప్పడం ఎవరికి సాధ్యం?

గ్రద్ద ఆకాశంలో ఎత్తున ఎగురుతూ ఉంటుంది. మధ్యలో క్రిందికి హఠాత్తుగా దిగి మళ్ళీ పైకి వెళ్తుంది. ఎందుకో తెలుసా? క్రింద తన బిడ్డ ఉంది. ఎలా ఉందోననే బెంగ. పక్షికే తన బిడ్డలపై ఇంత ప్రేమ ఉంటే పరమాత్మకు ఎంత ఉంటుంది తన సంతానంపై!

బిడ్డ ఊయలలో పడుకొని ఉంటుంది. తన అవసరాల్ని తాను పట్టించుకోదు. అందుచేత సదా చిరునవ్వును చిందిస్తూ ఉంటుంది. బిడ్డ అవసరాలన్నీ తల్లే పట్టించు కుంటుంది. ఏ సమయానికి నీళ్ళు పోయాలో, ఎప్పుడు పాలు పట్టించాలో తల్లి తెలిసి చేస్తుంది. కనుక బిడ్డ భారం లేకుండా జీవిస్తుంది. " చేసేది నేను" అనుకుంటే అశాంతి. "చేసేది నీవే" అనుకుంటే పరమశాంతి.

తల్లికి బిడ్డపై ఉండేది ప్రేమ. అది దయ కాదు. మా యజమాని నన్ను దయతో చూసుకుంటాడు అంటారు. వల్లమాలిన దయ యజమానికి సేవకునిపై ఎందుకొచ్చి పడింది? సేవకుని సేవలు యజమానికి తృప్తినిచ్చాయి కనుక. ఒకవేళ సేవలు అందకపోతే యజమాని దయతో చూస్తాడా? చూడనే చూడడు.

అలాంటి దయాగుణమా బిడ్డపై తల్లికుండేది? బిడ్డ నుండి ఏమి ఊహించి తల్లి దయ చూపింది? ఆమెకు ఏ ఆశలూ లేవు. బిడ్డనుండి తీరే ఏ అవసరాలూ లేవు. ఆమెదంతా నిస్వార్థ సేవ. కనుక అది దయ కాదు. ప్రేమ. అందుకొని అందించేది దయ. అందించి తృప్తిచెందేది ప్రేమ.

సత్యభామ కోరిందని పరమాత్మ సురలోకం వెళ్ళి పారిజాత పుష్పాన్ని తెచ్చి ఇస్తాడు. అది తెలిసి సురరాజైన ఇంద్రుడు శ్రీకృష్ణుని సమీపించి, "దేవా! భృత్యులము మేముండగా మీరే స్వయంగా వచ్చి పారిజాతాన్ని తీసుకొనివెళ్ళాలా! ఆజ్ఞాపిస్తే మహాభాగ్యంగా భావించి మేమే వచ్చి ఉండేవాళ్ళం. సురపారిజాతాన్ని మీ పాదాలవద్ద సమర్పించి ఉండేవాళ్ళం" అంటాడు.

"ఇంద్రా! అది నాపై మీకున్న ప్రేమ. సత్యభామపై నాకున్న ప్రేమ నాచేత ఆపని చేయించింది. చెబితే మీరు చేయరని కాదు. తెలిస్తే చేస్తారనే నేను తొందర పడ్డాను. ప్రేమ తానే చేస్తుంది. చేయించుకోదు" అంటాడు ప్రేమావతారమూర్తి. ఇది పరమాత్మ ప్రేమ హృదయం.

పరమాత్మను తల్లిగా స్వంతం చేసుకోవాలంటే ముందుగా మనము బిడ్డలుగా అర్హతను పొందాలి. అర్హతను పొందితే చాలు; బిడ్డలు తల్లికడనే ఉన్నట్లు మనం పరమాత్మ చెంతనే ఉంటాము.

కోతి ఈ చెట్టు మీద నుండి ఆ చెట్టు మీదకి, ఈ కొమ్మ పైనుండి ఆ కొమ్మ మీదికి దుముకుతూ ఉంటుంది. కాని, ఒంటరిగా కాదు. కోతిపిల్లను పొట్టకు కరిపించుకొనే. వీపుపై ఎక్కించుకొని దూకి ఉండవచ్చు గదా! కడుపుకే ఎందుకు కరిపించుకోవాలి? అది కడుపుతీపి. ఈ ప్రేమలకన్నా కోటిరెట్లు పరమాత్మకు తన సంతానంపై ప్రేమ ఉంటుంది.

భగవంతుని ప్రేమవర్షం మనల్ని ముంచెత్తినపుడు మనం భక్తి చేసి ఏమి ప్రయోజనం? ఆలయాలు తిరిగి అందుకొనే దేముంటుంది? తిరిపెమెత్తే బుద్ధి తీర్థ క్షేత్రాల్లో కూడా అదే చేస్తుంది కాని తపస్సు చేయదు. పరమాత్మ ప్రేమ కిరణాలు మనపై పడేలా మన జీవన విధానాన్ని సరిచేసుకోవాలి. అహంకారాన్ని త్యజించి, బిడ్డ తల్లిపై ఆధారపడినట్లు పరమాత్మ నాశ్రయించుకొని జీవించాలి. అప్పుడే పరమాత్మ కృప మనపై వర్షిస్తుంది. అది జరగనపుడు ఆరాధనకు అర్థం లేదు. పరమార్థం ఉండదు.

నా నొలియదిద్దరె నా నొలిదు ఫలవేను?

"దేవా! నీవు ప్రేమించనపుడు నేను ప్రేమించి ఫలమేమి?" అని విఠలుని ఒక కీర్తనలో ప్రశ్నించాడు భక్త శిఖామణి సంత్ పురందరదాసు.

మనం శ్వాసలు వదుల్తూ ఉంటాము. తిరిగి పీల్చుకుంటామనే నమ్మకంతోనే శ్వాసలను విడుస్తూ ఉంటాము. శ్వాసను తిరిగి పీల్చుకోలేమనే సందేహం ఉంటే అసలు శ్వాసనే విడువమేమో!

శ్వాసలను విడువటమే గాక తిరిగి పీల్చుకుంటాము అనేది మన అనుభవంలోనే ఉన్నా, తిరిగి పీల్చుకోలేక పోవచ్చు అనే సందేహానికి అవకాశం లేకపోలేదు. ఈ సత్యం తెలిస్తే, శ్వాసల మీద కాకుండా శ్వాసలను కదిలించే వానిపై విశ్వాసము పెరుగుతుంది. క్రమేపీ ఆ విశ్వాసమే భక్తియై శోభిస్తుంది.

"మధ్యే" మార్గం

ఇంటిలో దీపము నుంచితే ప్రకాశము ఇంటిలోనే ఉంటుంది. బయటికి పోదు. ఇంటి బయట దీపము నుంచితే ప్రకాశము బయటే ఉంటుంది. ఇంటి లోపలికి రాదు. కాని, ఇంటి కడప మీద దీపాన్ని ఉంచితే, అది బయట, లోపల ప్రకాశాన్ని విరజిమ్ము తుంది. దీనినే **"దేహలీ దీప న్యాయము"** అంటారు.

కడప మీద నున్న దీపము లోపల, బయట చీకటిని నశింపచేస్తుంది. అలాగే మన ఆంతర్యపు ఆలోచనలలో దాగియున్న చీకటిని, బాహ్య కర్మలలో విస్తరించియున్న అంధకారాన్ని, రెండిటిని అదృశ్యం చేయాలంటే, కడప మీద దీపము నుంచినట్లు నాలుక మీద నామాన్ని కదిలించాలి. నామదీపం వెలుగుతుంటే అవిద్యాంధకారము బాహ్యాభ్యంతరాలలో మటుమాయ మవుతుంది. ఇదే **దేహలీ దీప న్యాయము.**

ప్రకాశించడమే గాని తాను ప్రకాశిస్తున్నట్లు దీపానికి తెలియదు. చీకటిని అంతమొందించాలని తాను ప్రకాశించడం లేదు. తాను ప్రకాశిస్తూ ఉంటే చీకట్లు చెదిరిపోతున్నాయి. ఇది ప్రకాశానికి సంబంధించినదే గాని ప్రవర్తనకు సంబంధించింది కాదు. నామము కూడా ప్రకాశైక స్వరూపమే. అవిద్యను అంతమొందించే ప్రయత్నము నామస్మరణలో లేదు. నామము జరుగుతూ ఉంటుంది. అజ్ఞానము ఒరుగుతూ ఉంటుంది. ఇది కూడా ప్రకాశానికి సంబంధించినదే గాని ప్రవర్తనకు సంబంధించినది కాదు.

కడపమీద దీపంలాగా నాలుక మీద నామదీపం భాసిస్తుంది. నారాయణ దీపం కూడా నరహరి రూపంలో కడప మీదే ప్రత్యక్షమైంది. హిరణ్యకశిపుని కడప మీదనే వధించాడు నరహరి. హిరణ్యకశిపునికి అక్కడే విముక్తి. ప్రహ్లాదునికి అక్కడే ముక్తి. అజ్ఞానము అంతరించేది, జ్ఞానము భాసించేది మధ్యనే. ఇదే **దేహలీ దీప న్యాయము.**

మధ్యే మహాభారతమ్

జ్ఞానదీపమైన భగవద్గీత కూడా మహాభారతము మధ్యనే జాజ్వల్యమానమైంది. అందుకేనేమో

సేనయో రుభయో ర్మధ్యే రథం స్థాపయ మేచ్యుత

"రెండు సేనలమధ్య రథాన్ని ఉంచు, అచ్యుతా!" అని ప్రార్థించాడు పార్థుడు. తినింది, తినబోయేది అంతా అమృతంగా మారాలనేమో,

భోజన కాల మధ్యే.....

గోవింద నామస్మరణ చేస్తూ భక్తులు ఆహారాన్ని అమృతంగా మార్చుకుంటారు. "మధ్యే" మార్గమును మార్గదర్శకంగా భావిస్తారు మహితాత్ములు, మాననీయులు.

నాత్యశ్నతస్తు యోఽ గోస్తి న చైకాన్త మనశ్నతః
న చాతి స్వప్న శీలస్య జాగ్రతో నైవ చార్జున ॥

"అర్జునా! ఈ యోగము విశేషముగా తినువానికి, బొత్తిగా తినని వానికి, విశేషముగా నిద్రించువానికి, అసలే నిద్రించని వానికిని లేదు" అని శ్రీకృష్ణ పరమాత్మ గీతలో "మధ్యే" మార్గాన్ని సూచించారు.

బయట గాలివీస్తే బయట ఉంచిన దీపము ఆరిపోతుంది. లోపల గాలి వీస్తే లోపల ఉంచిన దీపము ఆరిపోతుంది. కడప మీద ఉంచిన దీపానికి ఆ ప్రమాదము లేదు. బయట గాలి అధికం కాగానే దీపాన్ని లోన ఉంచవచ్చు. లోన గాలి అధికమైతే కడపమీదనున్న దీపాన్ని బయట ఉంచవచ్చు. **దేహలీ దీప న్యాయంలో** ప్రమోదమేగాని ప్రమాదము లేదు.

బాహ్యంలో విషయవాసనా గాలులు వీచినపుడు అంతర్ముఖులమై నామస్మరణ చేయాలి. ఆంతర్యంలో ఆశాగాలులు వీచినపుడు నామస్మరణ చేస్తూ బాహ్యంలో కర్మల నాచరించాలి. ఈ విధంగా సాధకుడు నామదీపాన్ని ఆరకుండా కాపాడుకుంటూ ఉంటాడు. దివ్యమైన ఈ నామదీపాన్నే కాపలాగా ఉంచుకుంటాడు.

కాపలావాడు కూడా గుమ్మం వద్దే నిలుస్తాడు. అప్పుడే బాహ్యాభ్యంతరాలలో చోరుల్ని గుర్తించగలడు. **"దేహలీ దీప న్యాయము"** లాగ నాలుకపై నిలిచిన నామము కామక్రోధాది చోరుల్ని బాహ్యాభ్యంతరాలలో చరించకుండా చేస్తుంది.

దీపమును ఏ కడప మీద ఉంచినా ప్రకాశిస్తుంది. "ఇది పేదవాని కడప - ఇది ధనికుని కడప" అనే భేదం దీపానికి అర్థంకాదు. నామము ఎవరినైనా పవిత్రం చేస్తుంది. ప్రకాశవంతం చేస్తుంది. పాపపుణ్యాలను లెక్కించదు.

ఇది ఆరే దీపం కాదు; మారే దీపం కాలేదు.

ఇది అమరదీపం; అమృతదీపం.

నాశ మెరుగనిది నామం. నాశ మెరుగనివాడు నారాయణుడు. నామం ద్వారా నారాయణుని ఆశ్రయించిన నరుడు కూడా నాశ మెరుగడు. కనుకనే,

కౌన్తేయ ప్రతిజానీహి నమే భక్తః ప్రణశ్యతి

"అర్జునా! "నా భక్తుడు నశించడు" అని ప్రతిజ్ఞ చేసి చెప్పు" అన్నాడు గీతలో శ్రీకృష్ణ పరమాత్మ.

ఈ మాట అర్జునుడే కాదు; మన మందరమూ చెప్పాలి. అలు పెరుగకుండా చెప్పాలి. మనిషి మనిషికి చెప్పాలి. ఊరూరా చాటించాలి. ఇంటింటా మారు మ్రోగించాలి. ప్రతి కడప మీద వినిపించాలి. ఇదే **"దేహలీ దీప న్యాయము"**. మనందరి భాగ్యంగా లభించిన తాయము.

మంత్ర మహిమ

ఓం నమో భగవతే వాసుదేవాయ.

మహాభక్తుడైన ధ్రువ కుమారునికి ధ్రువస్థానమును ప్రసాదించిన మహామంత్రమిది. నారద మహర్షి అనుభవంలో దేదీప్యమానంగా ప్రకాశించిన మంత్రమిది. ముఖ్యంగా నా జీవితంలో ప్రగతికి, సేవకు, సంతృప్తికి కేంద్రశక్తి ఈ మంత్రము.

ఎందరికో స్ఫూర్తిని, దీప్తిని, శక్తిని ప్రసాదించిన ఈ మంత్రము అందరినీ అలాగే అనుగ్రహిస్తుందని విశ్వసించి బహుళ ప్రచారము గావించడం జరిగింది. అందరూ నామం చేస్తున్నారు. మంత్రాన్ని మననం చేస్తున్నారు. బాగుంది. ఈ మంత్ర జపంవల్ల ఆధ్యాత్మికంగా అభివృద్ధి గోచరిస్తున్నదా? ఆశించినంతగా ప్రగతి సాధింపబడు తున్నదా? ఈ ప్రశ్నలకు "అవును" అనే సమాధానం చాలా తక్కువమంది నుండి మాత్రమే లభిస్తుందని నాకు తెలుసు. తెలిసిన ఈ విషయాన్ని ప్రకటించేందుకు ఈ విషయాన్ని ప్రత్యేకంగా వ్రాయడం లేదు. ప్రగతి లేకపోవడానికి కారణాన్ని అన్వేషించేందుకే వ్రాస్తున్నాను.

ప్రగతి ఊహించినంతగా లేదనే అంగీకరిస్తాం. అయితే, ఈ విషయంలో ఎవర్ని తప్పు పట్టాలి? మంత్ర శక్తిని శంకిస్తామా? అదే నిజమైతే, ఇదే మంత్రము ఎన్నో జీవితాలకు మార్గగామి అయిందే? ఎందరో బ్రతుకుల్ని పరవశింప చేస్తున్నదే?

మంత్రము..... **"మననాత్ త్రాయతే ఇతి మంత్రః"** మననం చేసే వ్యక్తిని రక్షించేది మంత్రము. అయితే, మన వైఫల్యానికి మంత్రము కారణం కాదు. మనమే కారణము. మన మనసే కారణము.

1) మంత్రాన్ని మనం ఎంత కాలం చేస్తున్నాం?

2) ఎలా చేస్తున్నాం?

ఈ పై రెండు విషయాలపై మన ప్రగతి ఆధారపడి ఉంటుంది.

మంత్రము ద్వారా మాధవ చైతన్యంలో ఓలలాడాలని అభిలషించే మనము ప్రతి దినము విషయ ప్రపంచానికి కేటాయిస్తున్న కాలంలో పదవ వంతైనా మంత్ర జపానికి కేటాయిస్తున్నామా? వాస్తవం చెప్పాలంటే, విషయ ప్రపంచానికి కేటాయించే కాలంకన్నా ఎక్కువ సమయాన్ని మంత్ర జపానికి వినియోగించాలి. ఇంత సమయం మాకు ఎక్కడ లభిస్తుంది? అని మీరు ప్రశ్నిస్తారని నాకు తెలుసు. కర్మల మధ్య నామం ఎలా సాగిపోతూ ఉండాలో అనేక కోణాల్లో నుండి నేను మీకు తెలిపాను. గ్రంథాల్లో వ్రాశాను. సమయం అవరోధం కాదని మీకు తెలుసు. మనసులో సానుకూలం, శ్రద్ధ లేకపోవడమే అవరోధము. కనుక మంత్ర వైశిష్ట్యాన్ని దృష్టిలో ఉంచుకొని మంత్రజపము యొక్క కాలాన్ని బాగా పెంచాలి.

ఎలా చేస్తున్నాము? అనేది ఇక రెండవ విషయం. భక్తి ప్రేమలతో చేస్తున్నామా? యాంత్రికంగా చేస్తున్నామా? రెండవదే కనుక నిజమైతే మన ప్రగతి ఊహాకందని విషయం. టేపు రికార్డర్‌కి, క్యాసెట్‌కి మోక్షం వస్తేనే మనకు కూడా వచ్చేది.

భక్తి ప్రేమలతో చేసినపుడే మంత్రము మహిమను వ్యక్తం చేస్తుంది. ప్రాపంచిక విషయాల మీద, వస్తువుల మీద, వ్యక్తుల మీద మనకున్న ప్రేమకన్నా మంత్రము మీద ఎక్కువ ప్రేమ ఉందో లేదో ముఖ్యంగా ఎవరికి వారు బేరీజు వేసుకోవాలి. అశాశ్వతమైన విషయ ప్రపంచాన్ని అధికంగా ప్రేమించేవారు నామాన్ని లేదా మంత్రాన్ని అధికంగా ప్రేమించలేరు. ఈ ప్రపంచంలో మనం అత్యుత్తమ సుఖాలని భావించేవాటిని అనుభవించే ముందు ఎంతటి ఆసక్తి ఉంటుందో, అంతకన్నా ఎక్కువ ఆసక్తితో, ప్రేమతో మంత్ర జపం చేసినపుడే మంత్ర వైభవము మనిషిలోకి దిగుతుంది.

మంత్రము - మంత్ర అధిష్ఠాన దేవత వేరు వేరు కారు. మంత్రము - మహిమ ఎప్పుడూ వేరు కావు. మహిమను మనిషిలో ఉంచేదే మంత్రము. దించేదే మంత్రము.

బుద్ధిర్బలం యశోధైర్యం నిర్భయత్వ మరోగతా
అజాడ్యం వాక్పటుత్వం చ హనుమ త్స్మరణా ద్భవేత్ ॥

హనుమంతుని స్మరించగనే బుద్ధిబలం, దేహబలం, కీర్తి, ధైర్యము, నిర్భయత్వము, ఆరోగ్యము, చురుకుదనం, వాక్పటిమ లభిస్తాయి అంటారు.

నిజమే. మంత్రమూర్తి వైభవమే మంత్రంలో నిగూఢంగా ఉంటుంది. రామ భక్తులు ధర్మమూర్తులై శోభిస్తూ ఉంటారు. శివభక్తులు ధ్యానరూపులై ఉంటారు.

మరి, కృష్ణభక్తులు? వారు "ఓం నమో భగవతే వాసుదేవాయ" అనే మంత్రాన్ని నమ్ముకున్నవారు. జ్ఞానమూర్తులై ఉంటారు. ప్రేమరూపులై ఉంటారు. ఈ జ్ఞాన, ప్రేమల్ని పొందాలని అభిలషించేవారు "ఓం నమో భగవతే వాసుదేవాయ" అనే ఈ మహామంత్రాన్ని 1. ఎక్కువ కాలం దీక్షగా జపించాలి 2. భక్తి ప్రేమలతో చేయాలి. అప్పుడే మంత్ర వైభవాన్ని జీవితంలో దర్శించగలం.

నామ యోగులు, మంత్రయోగులు మరొక విషయాన్ని కూడా ముఖ్యంగా గుర్తుపెట్టుకోవాలి. ఏకాంతంలో మంత్రోచ్చారణ చేసినంత వరకు ఏ ఇబ్బంది ఉండదు. ప్రపంచంలో చరించేటప్పుడు ప్రారంభ సాధకులకు అవరోధాలు మెండుగా ఉంటాయి.

అనవసరమైన ప్రసంగాలను సాధకులు మానేయాలి. ఒకవేళ అన్యులు ప్రస్తావించినా ఉదాసీన వైఖరిని అవలంబించడం అలవరచుకోవాలి. మంత్రం ఆంతర్యంలో నిశ్శబ్దంగా నడుస్తూ ఉంది కనుక ఎవరిని చూసినా, వారి వ్యక్తిత్వమును గాకుండా వారిలోని వాసుదేవ చైతన్యాన్ని దర్శించడం నేర్చుకోవాలి. ఆ దర్శనం వెనుక ప్రేమ తొణికిసలాడుతూ ఉండాలి. ఈ ప్రపంచమంతా వాసుదేవుని వైభవమే అని భావించి నామామృతం నిండిన హృదయంతో వీక్షించడం ప్రారంభిస్తే "సర్వం వాసుదేవ మయం"గా గోచరిస్తుంది.

ఈ దశలో నీకు ఎవరు తటస్థపడినా నిజానికి వారు తటస్థ లక్షణానికి చెందిన వారే. స్వరూప లక్షణంగా వాసుదేవుడే నీకు వారిలో ప్రత్యక్ష మవుతాడు. నీలో ప్రశాంతత నిండుకుంటుంది. ప్రశాంత చిత్తముతో నీవు ఆచరించే కర్మలు నైవేద్యాలుగా నివేదింప బడుతాయి. ఫలితాలు ప్రసాదాలవుతాయి. పరమాత్మకన్నా అన్యంగా భాషించవలసిన విషయం నీకు మిగలదు. లౌకిక విషయాలలో నీవు మగ్నమైనా, మధ్యలో పరమాత్మ ముచ్చట్లు చోటు చేసుకొంటూ ఉంటాయి. ఈ విధంగా నామ సాధన, మంత్ర సాధన బ్రతుకును భవ్యంగా, భగవన్మయంగా మార్చుతుంది.

మంత్రాన్ని భక్తి ప్రేమలతో మననం చేయండి. మనసు పెట్టి మరీ చేయండి. మనసు లేకుండా పలికితే మంత్రం సిద్ధించదు. మనసును మాధవునిపై పెట్టి మంత్రాన్ని కొనసాగిస్తే, మనసు మాధవ చైతన్యంలో ఓలలాడుతుంది. పరమాత్మ శాంతస్వరూపుడు. మనసు మాధవునితో ఐక్యం కాగానే మనం కూడా శాంతిని అనుభవిస్తాము.

సజ్జనః శాంతి మాప్నుయాత్. సజ్జనులు శాంతిని పొందెదరుగాక!

"నేను తృప్తి లేని వాణ్ణి" అని భావించటం చేత, తృప్తి చెందేందుకు ఏవేవో పొందాలని ప్రయత్నిస్తున్నాం. పరితపిస్తూ ఉన్నాం.

"మనమే తృప్తి" అనే పరమసత్యం అర్థమైతే, తృప్తి పడేందుకు లేనివి రావాలని ఆశించము. ఉన్నవి పోవాలని ప్రయత్నించము.

తృప్తిని పొందాలనే భావన మన వద్ద ఉన్నదే గాని "నేనే తృప్తి" అనే జ్ఞానం లేదు. కనుక మన సమస్యల కన్నిటికీ ప్రబల కారణం జ్ఞానము లేకపోవటమే.

ప్రయత్నం చేయాలే గాని, పోని అజ్ఞానము లేదు; రాని జ్ఞానమూ లేదు. కనుకనే **"ఆచార్యవాన్ పురుషో వేద"** ఆచార్యుని పొందినవానికి జ్ఞానం లభిస్తుంది అన్నది వేదం.

శివ కేశవులు

భగవంతుడు ప్రేమ సాగరుడు. భక్తుడు ప్రేమమయుడు. భక్తి ప్రేమ స్వరూపము. ప్రేమరూపమైన భక్తిలో ద్వంద్వాలకు తావు లేదు. ప్రేమకు ద్వేషాలు తెలియవు. భేదాలు అర్థంకావు.

ప్రథమదశలో నున్న సాధకులు భేదాలను సులభంగా అధిగమించలేరు. శైశవమున దోగాడే శిశువుపరుగు పందెములో నిలబడలేదని నిందించడం భావ్యము కాదు.

కాలక్రమేణ దేహం దృఢంగా వృద్ధి చెందినపుడు వ్యక్తి పరుగులిడునట్లు, సాధకునిలో ప్రగతి చోటుచేసుకోగానే అభేదము అనుభవానికి అందుతుంది. అంతవరకు ద్వైతమే శరణ్యం.

ద్వైత భావనలో సాధన సాగడం తప్పు కాదు. ద్వేషభావాలతో హృదయాలను సంకుచితం చేసుకోవడం దోషం. అంతటితో ఆగినా ఫరవాలేదు. ఈ అజ్ఞాన కల్మషాన్ని ప్రచారం చేసి అనుయాయుల్ని మాయాకూపంలో దించడం మరీ శోచనీయం.

విప్రులు వివిధ నామాలతో పిలిచినా ఉన్న సద్రూప చైతన్యము ఒక్కటేనని వేదమాత ఘోషిస్తున్నది. గమ్యము నిరాకారము. మార్గము సాకారము. మార్గంలో చరించినపుడే గమ్యాన్ని చేరగలము. కానీ గమ్యం చేరే శుభసమయంలో మార్గాన్ని విస్మరించక తప్పదు.

సాకార మనిత్యమ్ నిత్యం నిరాకారమ్

"సాకారము అశాశ్వతమైనది. నిరాకారము శాశ్వతమైనది" అని ప్రవచించింది త్రిపాద్విభూతి మహానారాయణోపనిషత్తు.

ఒకే వ్యక్తి వేరువేరు దుస్తులతో శోభించునట్లు ఒకే పరమాత్మ భక్తుల సాధన సౌలభ్యం కొరకు అనేక రూపాలలో గోచరిస్తూ అనుగ్రహిస్తూ వుంటాడు. అంత మాత్రాన నామరూపాలను వాటేసుకొని బంధాలను అందాలుగా వర్ణించుకోవడం ఆంతర్యంలోని అజ్ఞానానికి ప్రతిబింబం.

అద్భుతమైన అభేద దర్శనాన్ని ఉపనిషత్తులు ఏకశ్రుతితో నిర్విరామంగా ప్రబోధిస్తూ ఉంటే బావిలోని కప్పల్లాగా భేద సులోచనాలను తగిలించుకొని కొందరు గతంలో శివకేశవ భేదాలను సమాజంలో తీవ్రంగా ప్రచారం చేశారు. హిందూ సంస్కృతీ వైభవంలో అదొక దురదృష్టకరమైన దశ.

కానీ, ఆ దుస్థితిని హిందూ సమాజం అధిగమించింది. దానికి తోడు ఆధునిక విజ్ఞాన శాస్త్రము, మనస్తత్వ శాస్త్రాలు ఊహించలేని ఎత్తుకు ఎగిరాయి. ఈ నేపథ్యంలో "శివకేశవ భేదాలు" అనే శైశవ క్రీడలకి శాశ్వతంగా తెరపడింది.

అయినా అమాయకుల్ని అనుయాయులుగా చేసుకొని నేడు కూడా "శివకేశవ భేదాల్ని" సమాజంలో సృష్టించి హిందూత్వానికి అంధత్వాన్ని ఆపాదించే ప్రయత్నంలో కొందరు కొనసాగుతూ ఉన్నారు.

అవిధేయత ఎంత ప్రమాదమో, అసత్య విషయాలయందు విధేయతను కనబరచడం కూడా అంతే ప్రమాదకరము. ప్రమాదాల నుండి బయటపడిన వారే ప్రమోదాన్ని పొందగలరు.

శివకేశవులలో రూపభేదమే గాని స్వరూప భేదము లేదు. తత్త్వభేదము లేదు. శివభక్తులైనా, విష్ణుభక్తులైనా ఈ సత్యాన్ని గ్రహించినపుడే ఆధ్యాత్మికంగా అభివృద్ధిని సాధించగలరు.

ఓ విష్ణుభక్తులారా! మీరు ప్రాణప్రదంగా విశ్వసించవలసిన విష్ణుపురాణము ఏమి చెబుతున్నదో ఆలకించండి.

మద్భక్త శ్శంకర ద్వేషీ మద్ద్వేషీ శంకర ప్రియః
తా ఉభౌ నరకం యాతో యావచ్చన్ద్ర దివాకరమ్ ॥

"శంకరుని ద్వేషించు నా భక్తుడు, నన్ను ద్వేషించు శివభక్తుడు - వీరిద్దరు సూర్యచంద్రులున్నంత వరకు నరకాన్ని వదలరు" అని విష్ణుదేవుడే స్వయంగా పలికాడు.

ఓ శివభక్తులారా! మీరు ప్రగాఢంగా విశ్వసించవలసిన స్కందోపనిషత్తు ఏమి చెబుతున్నదో వినండి.

శివాయ విష్ణురూపాయ శివరూపాయ విష్ణవే
శివస్య హృదయం విష్ణోః విష్ణోశ్చ హృదయం శివః ॥

"శివుడు విష్ణుస్వరూపుడు. విష్ణువు శివస్వరూపుడు. శివుని హృదయము విష్ణువు. విష్ణువు హృదయము శివుడు".

చూశారా! మనకు నిర్మలమైన హృదయముంటే శాస్త్రాలు బోధించే ఈ నిత్య సత్యాలు అవగతమవుతాయి. ఆంతర్యములోని భ్రమలు భేదాల్ని సృష్టిస్తాయి.

ఈ భ్రమలు, భ్రాంతులు ఈనాటివి కావు. **"అనాది సంసార విపరీత భ్రమాత్"** అన్నది ఉపనిషత్తు. భ్రమను తొలగించుకొని ప్రమను పెంపొందించుకోవాలి. భ్రాంతిని నిర్మూలించుకొని శాంతిని స్థిరపరచుకోవాలి. జ్ఞానాంజనము ద్వారా భేదభావ చత్వారాన్ని తొలగించుకోవాలి.

భేదదృష్టి విషమదృష్టి, ప్రమాదకర దృష్టి. అభేదదృష్టి అమృతదృష్టి, ప్రమోదకర దృష్టి. జ్ఞానమయ దృష్టి. సృష్టిని బ్రహ్మమయంగా దర్శింపచేసే దృష్టి.

సూర్యుడు జ్ఞాన ప్రదాత, వెలుగులను ప్రసాదించే దాత. ఆదిత్యుని చక్కగా అవలోకిస్తే మనకు సత్యం అనుభవానికి అందుతుంది. సమష్టితి ఆంతర్యంలో వెలుగు తుంది.

ఉదయే సవితా రక్తః రక్తశ్చాస్తమనే తథా
సంపత్తౌచ విపత్తౌచ మహతా మేకరూపతా ॥

ఉదయాస్తమయాలలో ఒకే రంగుతో ప్రకాశించి సూర్యుడు సమష్టితిని ప్రసారం చేస్తున్నాడు. ఆపదలలో, సంపదలలో ఒకే విధంగా చరిస్తూ మహాత్ములు తమ ప్రవర్తన ద్వారా సమత్వాన్ని ఆవిష్కరిస్తున్నారు. సాధకులమైన మనం శివకేశవ భేదాలను విస్మరించి, ఏకత్వాన్ని స్మరించి సమదర్శన యోగులై ప్రకాశించాలి.

అందుకేనేమో శివరాత్రి పోయిన ఆరు నెలలకు కృష్ణాష్టమి వస్తే, కృష్ణాష్టమి పోయిన ఆరు మాసాలకు శివరాత్రి వస్తుంది. ఒకే సంవత్సరములో బొమ్మ బొరుసుల్లాగా ఈ రెండు పర్వదినాలు గోచరిస్తూ నాణ్యమైన అద్వైత నాణెమును ప్రసాదిస్తున్నాయి.

ఆత్మబంధువులారా! అజ్ఞాన తోరణాలు ఎంతోకాలం ఉండవు. వాటిని పట్టుకొని వ్రేలాడ నవసరం లేదు. నామాలను దాటిపోండి. రూపాలను దూకిపోండి, నామరూపాలకు అతీతమైన పరబ్రహ్మను స్మరించి తరించండి.

శివకేశవ భేదం శాస్త్రసమ్మతం కాదు. సత్యసమ్మతం కాదు. మహర్షుల మార్గం కాదు. శివకేశవులలోని ఏకత్వాన్ని స్మరించి దర్శించండి. అభేద దర్శనముతో జీవితమును అమృతతుల్యంగా మార్చుకోండి.

'ఇది అలా ఉండాలి', 'అది ఇలా ఉండాలి' అని అభిలషించటం ప్రగతికి అంతరాయం కాదు. నేను అభిలషించినట్లు జరిగితే నేను తృప్తిగా ఉంటాను అనుకుంటే మాత్రం అభివృద్ధి ఉండదు సరికదా, అనుక్షణము అశాంతితో బ్రతుకవలసి వస్తుంది. మనం పొందవలసింది ఏమిటో, మనం కోరుతున్న దేమిటో స్పష్టంగా తెలిస్తేనే బ్రతుకు భవ్యంగా రాణిస్తుంది.

రామేశ్వరం

నలుపు తెలుపుకాదని అందరికి తెలుసు. తెలుపు నలుపు కాలేదని మరెందరికో తెలుసు. కాని, నలుపు తెలుపుల రంగు రహస్యాల వెనుక అవగతం కావలసింది కాంతియేనని ఎందరికి తెలుసు? అది తెలిసిన వారికి బుద్ధి నిండా శాంతియే. రాముడు శివుడు కాదని కొందరు, శివుడు రాముడు కాలేడని మరికొందరు. కాని, హరిహరుల రూప రహస్యాల వెనుక అర్థం కావలసింది శాంతియేనని తెలుసుకున్నది ఎందరు? ఎందరైనా, ఎవరైనా తెలుసుకున్న వారికి బ్రతుకు నిండా కాంతియే.

శివస్య హృదయం విష్ణో ర్విష్ణోశ్చ హృదయం శివః

అని సంధ్యావందనంలో చెబుతారు. కానీ ఇరువురి మధ్య భేదాన్ని సృష్టించి సంధిలో బందీలౌతారు.

దేహాలుండాలే గాని దేవతలకైనా సందేహాలు తప్పవేమో! రామేశ్వరం అనే పదం ఏ సమాసము అనే సందేహం దేవతలకు కలిగిందట. వెంటనే వారు బయలుదేరి వైకుంఠం వెళ్ళి విష్ణుమూర్తిని అర్థం చెప్పి సమాసాన్ని వివరించమని అడిగారట.

రామస్య ఈశ్వరః - రామునికి ప్రభువు అని అర్థం చెప్పాడట వైకుంఠుడు. దేవతలు ఈ సత్యాన్ని జీర్ణించుకోలేక సతమతమవుతూ "అదేమిటి? శివధనుస్సును విరిచిన రాముడు శివునికన్నా తక్కువవాడు ఎలా అవుతాడు?" అని తమలో తాము ప్రశ్నించుకొని రామేశ్వరం 'తత్పురుష సమాస' మని విష్ణుమూర్తి చెప్పిన సమాధానముతో ఏకీభవించక, అక్కడ నుండి మెల్లగా వెళ్ళి కైలాసంలో కాలు పెట్టారట. మహాదేవుని ప్రశ్నించారట.

రామః ఈశ్వరః యస్య సః రామేశ్వరః. రాముడే ప్రభువుగా గలవాడు రామేశ్వరుడు గాన ఇది 'బహుబ్రీహి సమాసము' అన్నాడు భద్రశివుడు. పరస్పర విరుద్ధంగా తెలుస్తున్న ఈ రెండిటిలో ఏది సత్యమో తెలుసుకుందామని బ్రహ్మలోకం వెళ్ళారట దేవతలు. విశ్లేషించమని విరించికి విన్నవించుకున్నారట.

రామశ్చ అసౌ ఈశ్వరశ్చ రామేశ్వరః అని బ్రహ్మదేవుడు చెప్పాడట. బలరాముడు అంటే బలు డొకడు, రాము డొకడు అని అర్థమా? ఇక్కడనూ అంతే. రామేశ్వరుడు అంటే రాము డొకడు, ఈశ్వరుడు ఒకడు అని కాదు. రాముడే ఈశ్వరుడు. ఈశ్వరుడే రాముడు. ఇది తత్పురుష సమాసమూ కాదు; బహుబ్రీహి సమాసమూ కాదు. ఇది 'కర్మధారయ సమాసము' అని చెప్పాడట. పుట్టించేవాడు ఎన్ని అర్థాలైనా పుట్టించగలడు అని ఎందరైనా అనవచ్చు. కాని, పుట్టని, గిట్టని తత్త్వం ఇందు నిండి ఉన్నదని అందరూ గ్రహించలేరు. ఈ అద్వైత భావ నాణెమునకు బొమ్మ బొరుసులే శివరామ స్వరూపం. వారే శివకేశవులు. హరిహరులు. రామలింగస్వాములు.

అజ్ఞానులు చూపిన భేదబాటలో పయనించి, సంశయ కంటకాల మధ్య చిక్కుకొనిన బాటసారికి సన్మార్గ బోధకులు లభించగనే ప్రయాణం సుగమమై, ప్రసిద్ధమైన బాట లభించునట్లు, గురువులమని చెప్పుకొంటూ, పండితులమని భుజా లెగుర వేసుకుంటూ సందేహ మూటలను తలపై కెత్తేవారు పెట్టిన బరువును దించగలిగేవాడు శివుడే. దక్షిణామూర్తి గురుదేవుడే.

చదువులు నేర్చిన పండితాధములు స్వేచ్ఛా భాషణ క్రీడలన్
వదరన్ సంశయ భీకరాటవుల ద్రోవల్దప్పి వర్తింపగా
మదన క్రోధ కిరాతులం దుగని భీమ ప్రాఢిచే దాకినం
జెదరుం జిత్తము చిత్తగింపగదవే శ్రీకాళ హస్తీశ్వరా!

అని నిజవిద్యకై నీలకంఠుని ప్రార్థించాడు ధూర్జటి మహాకవి.

మన భక్తి పరమాత్మ హృదయాన్ని ద్రవింపజేసేదై ఉండాలి. భక్తితో పరమేశ్వరుని చేరినవారు ముక్తిని పొంది తరిస్తారు. తాపమును పోగొట్టుకోవాలని ఒక వ్యక్తి గంగానదిలో దిగితే, అతని తాపముతో పాటు పాపము కూడా పోయినట్లు, భయాలతో గాని, బాధలతో గాని చెదిరిపోయిన నిస్సహాయ జీవులు ఆర్తితో భక్తులై పరమాత్మను సమీపిస్తారు. ఆ తరువాత ఆర్తి నశించి ముముక్షుత్వం అలవడుతుంది. భక్తి కుదురుతుంది. భక్తి జ్ఞానంలో విశ్రమిస్తుంది.

ఆశలున్నంతవరకు వృత్తులు తప్పవు. ప్రవృత్తులు తప్పవు. ఆశలుడిగిన క్షణాన అన్నీ ఆరాధనలే. అర్చనలే. ఉర్విపై ఊరేగింపులే. ఉజ్జయినీ మహాదేవాలయ గర్భగుడిలో జేగంటలే. మహేశ్వర సన్నిధిలో సంధ్యాసమయాన అర్చనాదులలో దిక్కులు పిక్కటిల్లేలా ధ్వనించే నగారాలే.

"మనసా! అలా కదిలిపో! మహేశ్వరునిలో కలిసిపో. మనో మేఘమా! హృదయాకాశంలో ఊరేగు. శివానంద సాగర జలముల నుండి గ్రహించిన భక్తి వాయువుచే బరువెక్కిపో. శివారాధనా సమయంలో మ్రోగే భజనలలో, భజంత్రీ నాదాలతో నీవూ సమశ్రుతితో గర్జించు. ఆనందామృతమును వర్షించు. కురిసి కురిసి అలసిపో. శివుని పాదాలచెంత ఒరిగిపో. అక్కడే శాశ్వతంగా కరిగిపో. కైవల్యంగా మిగిలిపో.......

అప్యన్యస్మిన్ జలధర మహాకాళ మాసాద్య కాలే
స్థాతవ్యం తే నయన విషయం యావదత్యేతి భానుః
కుర్వన్ సన్ధ్యా బలిపటహతాం శూలినః శ్లాఘనీయా
మామంద్రాణాం ఫల మవికలం లప్స్యసే గర్జితానామ్.

జలధర=మేఘుడా!, మహాకాళం=మహా కాళక్షేత్రమున, అన్యస్మిన్=ఇతరములైన, కాలే అపి=కాలముల యందును, ఆసాద్య =పొంది, తే=నీవు, స్థాతవ్యం=ఉండతగినది, యావత్=ఎంతవరకు, భానుః= సూర్యుడు, నయన విషయం=దృశ్య మార్గమును,

అత్యేతి=ఆక్రమించుచున్నాడో, శ్లాఘనీయాం=కొనియాడదగిన, శూలినః=ఈశ్వరుని యొక్క, సంధ్యా= సాయంసంధ్యవేళలో, బలి=పూజ యందు, పటహతాం=మ్రోగే నగారా అగుట, కుర్వన్ =చేయుచు, ఆమంద్రాణాం=మంద్ర స్వరమైన, గర్జితానాం =ఉరుముల యొక్క, అవికలం=వికలము గాని, ఫలం=ఫలమును, లప్స్యసే=పొందగలవు.

ఓ మేఘదూతా! ఉజ్జయినీ మహాకాళ క్షేత్రమునందు సాయంత్రము వరకు వేచియుండి సాయం సంధ్యాసమయాన మహాదేవునికి పూజ జరుగుచుండగా నీవు ఉరిమితే, నగారా వాయించినట్లు ఉంటుంది. నీకు కైవల్యసిద్ధి ప్రాప్తిస్తుంది.

ఊరేగే మేఘము ఉరములో ఉరుము లున్నందుకు ఉమానాథునికి ఉత్సాహంతో ఊడిగం చేయడంలోనే ఉత్కృష్టమైన ప్రయోజనం సిద్ధిస్తుంది అని మేఘసందేశములో కాళిదాస మహాకవి యక్షునిచేత మేఘునికి అక్షరార్చనను చేయిస్తాడు.

మనమూ అదే చేస్తాం. మహేశ్వర మార్గంలో పయనిద్దాం. ప్రణవ నాదంతో ఏకమై పరవశించిపోదాం. ప్రణవ రూపులమై వెలిగిపోదాం. పరమేశ్వర స్వరూపంగా మిగిలిపోదాం.

పిలిచింది రామం. పలికింది శివం. వినింది మంగళం. మిగిలింది శుభం.

పడుకున్నంత మాత్రాన నిద్ర వస్తుందని చెప్ప లేము. కాని, నిద్రపోవాలనుకుంటే మాత్రం పడు కొనియే తీరాలి. నిలబడితే నిద్ర రాదు.

నిద్రించాలని పడుకుంటాము. నిద్ర వచ్చినంత వరకు పడుకొని ఉంటాము. నిద్ర వచ్చేస్తుంది. ఆ తరువాత మన ప్రయత్నమేదీ ఉండదు. అంతా నిద్ర మహిమే.

ధ్యానం కూడా అంతే. కూర్చున్నంత మాత్రాన ధ్యానం సాగదు. కాని, ధ్యానానికి నీవు ఆసీనుడవు కావలసిందే. సమయాలు, నియమాలు పాటించవల సిందే. ధ్యానం సాగిందా ఆ తరువాత వైభవమంతా ధ్యానానిదే. నీవు నామమాత్రమే.

ఒలికిమిట్టలో ఓంకారేశ్వరుడు

బ్రతికి బట్ట కట్టలేనివారు చచ్చి స్వర్గాన్ని పొందుతారా? ఉండినపుడు సుఖపడనివారు ఊడిపోయి ఏమి సాధిస్తారు? కొన్ని దీపాలు అలా ఆరిపోవలసిందేనేమో!

కాకపోతే, ఈ మానవ దేహమునకు పట్టిన దుర్గతి ఏమిటి? బ్రతికినంత కాలము బండ బ్రతుకును ఈడ్చడమే గాని, బంధాన్ని తొలగించుకుంటా మనే ఆలోచనే స్ఫురించదు.

తిరిగి తిరిగి సంపాదించడము, తీరికగా కూర్చొని తిని తూగడమే గాని, తరించాలనే తలంపే రాదు. కాళ్ళున్నాయి; కాని, కోవెలకు చేరవు. చేతులున్నాయి; అయినా శివపూజ నెరుగవు. కళ్ళున్నాయి; ఏం లాభం? నీలకంఠుని దర్శించే భాగ్యానికి నోచుకోవు. చెవులున్నా చిదంబర లీలల్ని ఆలకించవు.

మనము చేయవలసింది చేయలేదని యముడు తనపనిని తాను మానుకుంటాడా? మాటేసి మరీ కాటేస్తాడు. ప్రాణం లేచిపోతుంది. దేహం నేల పడుతుంది.

చూచే రోజుల్లో ముఖం చూడనివారందరు అంత్యక్రియల్లో అండ జేరుతారు. దండిగ చితి పేర్చుతారు. కాలిపోతుంటే, కళ్ళు ఆర్పకుండా చూస్తూ ఉంటారు. అంతేకదూ? బ్రతికినపుడు బాగు తెలియని వారిని చచ్చిన తరువాత ఎవరు చేరదీస్తారు?

కాకిపిల్ల కాకికి ముద్దు! ఎవరు చేరదీయక పోయినా తన బిడ్డల్ని భగవంతుడు దూరం చేసుకుంటాడా? పాడైనారని బిడ్డల్ని తల్లిదండ్రులు పారేసుకుంటారా? అందుకేనేమో, ఎవరు ఏమనుకున్నా, ఎలా అనుకున్నా పట్టించుకోకుండా పరమశివుడు తన బిడ్డల్ని ఉద్ధరించేందుకు శ్మశానంలోనే కాపురముంటాడు. సర్వాంతర్యామియైనా తన బిడ్డల కొరకు ఒలికిమిట్టలో ఒదిగిపోతాడు.

దాయాదులు దగ్ధం చేసి వెళ్ళినా, బంధువులు బూదిగా మార్చి తమ దారిన తాము పోయినా దీనబాంధవుడైన నీలకంఠుడు శ్మశానంలో ఉండి, దేహములు కాలిపోయిన తరువాత చితాభస్మమును తన ఒంటికి రాసుకొని పోయినవారిని తనలో కలుపుకుంటాడు. ఎముకలను ఏరుకొని, మాలగా చేసికొని తన మెడలో అలంకరించు కుంటాడు. ఈ విధంగా పతనమైన బిడ్డను తల్లి ఎత్తుకొనునట్లు, మృతి చెందిన తన బిడ్డలను భూతనాథుడైన మహేశ్వరుడు ఎత్తుకొని తనలో ఐక్యం చేసుకుంటాడు.

కాని, ఎంత దురదృష్టం! మానవులకు ఇటువంటి మహావకాశాన్ని నా అన్నవారే దూరం చేస్తారు. శివుని దేహాన్ని ఎక్కకుండా ఎముకలను, శరీరమును ఆలింగనం చేసుకోకుండా బూడిదను ఒలికిమిట్ట నుండి తీసుకెళ్ళి నదుల్లో కలుపుతున్నారు. ఆహా! బంధుమిత్రాదులు ఇందుకా! చచ్చిన తరువాత కూడా మోసము చేసేటందుకా? ఈ సత్యాన్ని బిల్హణ కవి ఎంత చక్కగా చెబుతాడో చూడండి.

శ్మశానే భూతానాం పతి రితి విజానన్నపి జనో
నృణాం భస్మా న్యస్థీ న్యపి కిమపి తీర్థం గమయతి
భవద్దేహాశ్లేషం భవదపఘు నారోహణ మపి
స్వయం లబ్ధ్వాఽ ప్యేషాం సుకృత పరిపాకో న భవతి!

శ్మశానే=ఒలికిమిట్టలో, భూతానాం=భూతములకు, పతిః=నాథుడు, ఇతి=అని, విజానన్ అపి=తెలిసి కూడ, జనః=మానవుడు, నృణాం=మానవుల, భస్మాని=బూడిదను, అస్థీని అపి=అస్థులను కూడ, కిమపి=ఎందుచేతనో, తీర్థం=నదిని, గమ యతి=చేర్చు చున్నాడు, భవద్దేహ=నీ దేహము యొక్క, ఆశ్లేషం=ఆలింగనమును, భవదపఘున=నీ దేహమును, ఆరోహణమపి=ఎక్కుటను కూడ, స్వయం=స్వయముగా, లబ్ధ్వా అపి= పొంది కూడ, ఏషాం=వీరికి, సుకృత పరిపాకః=పుణ్యకర్మ పరిపాకము, న భవతి=కాదు.

భావము:- మరణించినవారి చితాభస్మమును తన ఒంటికి శివుడు పూసికొనుటచేత విగతజీవికి మంగళకరుడైన శివుని దేహమును ఆలింగనము చేసికొనుట సంభవిస్తుంది. గతించినవారి ఎముకలను శివుడు తన మెడలో మాలగా ధరించుటచేత పోయినవారికి శివుని దేహము నెక్కే భాగ్యము కలుగుతూ ఉంది. కాని, ఈ సత్యాన్ని గుర్తించలేని జనులు ఆ బూదిని, ఎముకలను తీసుకొని వెళ్ళి నదుల్లో కలిపి పోయినవారిని తిరిగి వచ్చేవారుగా చేస్తున్నారు. కైవల్యాన్ని ప్రసాదించేందుకు ఓంకారేశ్వరుడు ఒలికిమిట్టలో కాపురమున్నా, నమ్మినవాళ్ళు మోసం చేసి రాకపోకలకు బాటలు నిర్మిస్తున్నారు. ఆహా! ప్రారబ్ధాలు ఇలా ఉంటాయేమో!

కర్మ శ్రమతో కూడింది. అందుకే భారంగా ఉంటుంది. ప్రేమలో శ్రమ లేదు. అందుకే తేలికగా ఉండి, తేలిపోతూ ఉంటుంది.

బోధించటం కర్మ కాదు; ప్రేమ. అది పెట్టెను చూడటమనే కర్మ కాదు. అద్దాన్ని చూడటమనే ప్రేమ. చిరుగాలికి మెల్లగా ఊగే వరిపైరును చూచి నట్లు ఉంటుంది. మెల్లగా పారే నదితో కలిసి ఇసుక రేణువులు దొర్లుతున్నంత హాయిగా ఉంటుంది. అందుకే, బాధలు తెలియని బోధలు సునాయసంగా బాధల్ని దూర తీరాలకు తరలిస్తాయి.

జపమాల

పరమేశ్వరుని నామములో లేదా మంత్రములో అద్భుతమైన శక్తి నిబిడీకృతమై ఉంది. ఒక్కొక్క మంత్రములో అసంఖ్యాక శక్తులు నిండి ఉన్నాయి. మంత్ర జపమును శ్రద్ధాభక్తులతో చేయువారు మంత్రమయులై, మంత్రరూపులై ప్రకాశిస్తారు. మహిమాన్వితులై భాసిస్తారు.

యజ్ఞానాం జపయజ్ఞోఽస్మి

కనుకనే యజ్ఞములలో తనను జపయజ్ఞముగా గీతలో శ్రీకృష్ణ పరమాత్మ అభివర్ణించుకున్నారు.

జపము ఈ విధంగా భగవత్స్వరూప మైనందున భక్తులు శ్రద్ధతో గురుమంత్రాన్ని జపిస్తూ ఉంటారు. అది కూడా అక్షరలక్షలుగా నియమంతో ఆచరిస్తూ ఉంటారు.

అక్షరలక్షలు అంటే ఒక్కొక్క అక్షరానికి ఒక్కొక్క లక్ష జపమని అర్థము. ఉదాహరణకి 'పంచాక్షరి'ని తీసుకుందాం. అందులో ఐదు అక్షరములున్నాయి. అక్షరానికి లక్ష చొప్పున ఐదు లక్షల జపం నియమంగా, కొన్ని రోజులను నిర్ణయించుకొని నిర్విఘ్నంగా చేయడం అక్షర లక్ష జపం. జపధ్యానాదులు కర్మలుగా తెలుస్తున్నా అన్య కర్మలవలె నశించే స్వభావము వాటిలో లేదు. కనుక ఈ విధమైన జపసాధన అక్షర రూపమై అక్షరజప మైంది.

ఈ విధంగానే అష్టాక్షరీ అక్షరలక్ష జపంలో ఎనిమిది లక్షల జపము, ద్వాదశాక్షరీ అక్షరలక్ష జపంలో పన్నెండు లక్షల మంత్రజపమును నియమంగా సమయాల నెంచుకొని భక్తులు ఆచరిస్తారు.

జపానికి జపమాల ఉండాలి. దానినే **అక్షమాల** అంటారు. మనసులోని కష్టలను తొలగించి, బుద్ధికి శిక్షణ నిచ్చి, హృదయ గవాక్షమును తెరిచే ఈ అక్షమాల వాస్తవానికి అక్షయమాల.

అక్షమాల అంటే అ -క్ష మాల. అనగా '**అ**' నుండి '**క్ష**' వరకు గల అక్షర సంఖ్యను కలిగిన మాల. కనుక అక్షమాలలో యాభై పూసలు మరియు 'మేరు'తో కలిసి యాభై ఒకటి ఉంటాయి. ఇది వర్ణములచే తయారైన అక్షమాల. అక్షర రూపమైన అక్షమాల.

ఏ భాషయైనా అక్షరములతోనే నిండి ఉంటుంది. కనుకనే పిల్లలకు విద్య రావాలని త్రికరణశుద్ధితో భావించే ఉపాధ్యాయులు పూర్వము అక్షరాలు దిద్దించేవారు.

భాషలన్నిటిలో సాధారణంగా 'అ'తో అక్షరపంక్తి ప్రారంభము కావడం విశేషముగా భాసించే విషయం. గ్రీకు భాషలో ప్రథమాక్షరం '**అల్ఫా**'. అరబ్బీ భాషలో ప్రథమాక్షరము **అలీఫ్**. ఈ రెండింటిలోను **అల్** అనేది సమాన శబ్దము. సామాన్య శబ్దము. అన్ని భాషలు సంస్కృతము నుండే ఉత్పన్నమైనవి అని చెప్పడానికి ఇదొక ప్రముఖ తార్కాణము.

చిదంబరంలో నటరాజస్వామి ప్రదోషకాల తాండవము చేసినపుడు ఆయన మ్రోగించిన 'ఢక్క' నుండి చతుర్దశ శబ్దాలు బహిర్గతమయ్యాయి. వీటినే చతుర్దశ మహేశ్వర సూత్రాలు అంటారు. ఈ సూత్రాలను ఆధారం చేసికొని పాణిని వ్యాకరణ సూత్రాలను రచించగా, ఆ తరువాత పాణినీ సూత్రాలపై పతంజలి మహాభాష్యం రచించడం జరిగింది.

పదునాలుగు మహేశ్వర సూత్రాలు **హల్ ఇతి మహేశ్వర సూత్రాణి** అని సమాప్త మవుతాయి.

మహేశ్వర సూత్రాలలో ప్రారంభ సూత్రం **హయవరట్** శబ్దంతో కదుల్తుంది. చివరి సూత్రంలో చివరి శబ్దం **హల్**తో సమాప్తమవుతుంది. ఇలా హల్ తెలుస్తోంది. వ్యాకరణంలో **అలోఽన్త్యస్య** అనే వేరొక సూత్రము ఉంది. **(అలో అంత్యస్య).**

మహేశ్వర సూత్రాలలో మొదటిదైన **అఇఉణ్** లో **అ** మొదటి అక్షరము కాగా, చివరి సూత్రంలో చివరి శబ్దం ల్ అయింది. **(హల్).** ఈ విధంగా అల్ అనేది వ్యాకరణ శాస్త్రములో అక్షరాలకు ప్రతీకంగా శోభిస్తుంది. బీజరూపమై భాసిస్తోంది. తారక శబ్దమై తరలి వచ్చిన ఈ **అల్** తారక మంత్రమునకు అభిన్నమై **అలో రామచంద్రా** జనావళి నాలుకలపై నాట్యమాడుతోంది.

కనుక గ్రీకు భాషలోని 'అల్ఫ'గాని అరబ్బీ భాషలోని 'అలీఫ్' గాని సంస్కృతము లోని 'అల్' నుండి ఆవిర్భవించినవియే.

అక్షరాలలో 'అ' ఆద్యమైనందున ఆద్యపురుషుడు అ కారమును తన ఆకారముగా వర్ణించుకున్నాడు. **అక్షరాణాం అకారోస్మి** "అక్షరాలలో నేను అకారమును" అని గీతాచార్యుని ప్రకటనము. ఈ విధంగా 'అ' నుండి 'క్ష' వరకు గల అక్షరముల సంఖ్యతో ఏర్పడిన అక్షమాల అక్షర లక్షల జపానికి ఉపకరిస్తుంది. యాభై పూసలు గల మాల **(పంచాశత్)**ను అందుకే ఉపయోగిస్తారు.

అష్టోత్తర శతం మాలా తత్ర స్యాదుత్తమోత్తమా

'రామా! నూట ఎనిమిది పూసలుగల అక్షమాల ఉత్తమోత్తమమైనది. యాభై నాలుగు పూసలు గలది **(చతు: పంచాశతీ)** అయినా సరిపోతుంది.

'మేరు పూసను దాటకుండా అనులోమ మార్గంలో జపమాలను త్రిప్పాలి. స్ఫటిక మాలను జపానికి ఉపయోగించవచ్చు. రుద్రాక్షమాల గాని, పగడమాల గాని, తులసిమాల గాని, ఉసిరిక మాల గాని, ముత్యాలమాల గాని, మాణిక్యమాల గాని, మరకత మణి మాల గాని, వెండిపూసల మాలగాని, స్వర్ణపూసల మాలగాని - వీటిలో ఏదయినను జపానికి అక్షమాలగా ఉపయోగపడుతుంది.

కృపా విశేషం

పరమాత్మను తల్లిరూపంలో ఆరాధించడం కేవలం భారతీయ సంస్కృతిలోనే ఉంది. బిడ్డకు తల్లితో ఉండే సామీప్యం మరొకరితో ఉండదు. జీవికి అతి సన్నిహిత సంబంధం పరమాత్మతోనే అని ఈ సంబంధం ఋజువు చేస్తుంది. తల్లి బిడ్డను పెంచినట్లు జగన్మాత జగత్తును సంరక్షిస్తుంది. పవిత్రమైన భారతీయ సంస్కృతీ వృక్షంలో విరబూసిన ఈ దేవ్యుపాసనా భక్తి కమలం ఆ తరువాత పాశ్చాత్య దేశాలలో కూడా తన సుగంధాన్ని వెదజల్లింది.

The External feminine leads us on and on.

"అనంతమైన ఓ దేవి మనలను నడుపుకుపోతోంది" అన్నాడు గోథే.

ఆ శక్తియే కాళిదాసు వెనుక నిలిచింది. శ్రీ శంకరులకు ముందు నడిచింది. రామకృష్ణ హృదిలో కదిలింది. రామానుజం మదిలో మెదిలింది.

ఈ శతాబ్దపు తొలి రెండు దశాబ్దాల్లో గణనీయమైన గణితశాస్త్ర విద్వత్తులో గగన విహారం చేసిన మహనీయుడు శ్రీ శ్రీనివాస రామానుజం. జీవించిన కాలం 32 సంవత్సరాలే అయినా జాతి గర్వించదగిన వైభవంతో విరాజిల్లిన మహామేధావి. ఆర్ష సంస్కృతీ వైభవానికి మచ్చుతునక. బ్రహ్మగుప్త, భాస్కరాచార్య, పైథాగరస్ లాంటి మహనీయుల కోవకు చెందిన మహావ్యక్తి.

"ఒకటి తెలిస్తే అన్నీ తెలుస్తాయి. ఒకటి అనే అంకె వేసి దాని ప్రక్కన యాభై సున్నలు పెడితే చాలా పెద్ద మొత్త మవుతుంది. ఆ ఒకటి తీసివేస్తే సున్నలు విలువ లేకుండా పోతాయి. చాలా వాటికి ఆధారమైనది ఒక్కటే. మొదట ఒక్కటి. తరువాత ఎన్నో. మొదట భగవంతుడు. తరువాత జీవులు, జగత్తు" అన్నాడు రామానుజం.

1887వ సంవత్సరం డిసెంబరు 22వ తేది రామానుజం జన్మించాడు. 1914 -1919 మధ్య ఆయన సాగించిన గణితశాస్త్ర పరిశోధనలు ఇంగ్లండులోని కేంబ్రిడ్జ్ లైబ్రరీలో భద్రపరచబడి ఉన్నాయి. ప్రచురింపబడినవి 400 పుటలు మాత్రమే. అముద్రితాలు చాలా మిగిలిపోయాయట. రామాయణంపై కూడా రామానుజం పరిశోధనాత్మక వ్యాసాలు వ్రాశాడట. 1920వ సంవత్సరంలో ఆయన జగన్మాత సన్నిధిని చేరిపోయాడు.

మహామేధావులకు కూడా అంతుచిక్కని అద్భుతమైన మేధస్సు, ధీశక్తి శ్రీరామానుజం కి ఎలా ప్రాప్తించాయి? అంత చిన్న వయస్సులో అనూహ్యమైన గణిత సిద్ధాంతాలు ఆయన మస్తిష్కంలో ఎలా కదిలాయి?

జగన్మాత రామానుజం కలలో కనిపించి గణిత సిద్ధాంతాలను చెప్పేదట. ఆయన నిద్ర లేవగనే వాటిని వ్రాసుకొని వెంటనే సంవాదీకరణము సాగించేవాడట. ఈ సత్యాన్ని

రామానుజం భక్తితో తానే చెప్పుకున్నాడు. **(The Goddess of Namakkal inspired me with the formulae in dreams. On rising from bed, I would note down results and rapidly verify them).**

మద్రాసుకు దక్షిణంగా సేలం దగ్గర పెనింసుల అనేచోట జగన్మాత 'నమక్కళ్' అనే నామంతో శోభిస్తూ ఉంది. సంతానం లేక బాధపడిన శ్రీ రామానుజం తల్లిదండ్రులు పెనింసులకు వెళ్ళి అమ్మవారిని అర్చించారట. వారి పూజాఫలంగా రామానుజం జన్మించాడట.

బ్రతుకును ప్రసాదించడమే గాక భక్తుడైన రామానుజం బుద్ధిలో నిలిచి, భవ్యమైన గణిత పరిశోధనలకు భవాని శ్రీకారం చుట్టింది. భారతీయ దివ్య సంస్కృతీ వైభవాన్ని తిరిగి జాజ్వల్యమానం చేసింది.

పవిత్ర కార్యాలన్నీ పరమాత్మ కృపకు పాత్రులైన వారినుండే ఉద్యమిస్తాయి. భగవత్కృప లేనివారు కళ్యాణ కార్యాలను జగతిలో ఆవిష్కరించలేరు. రామానుజం విషయంలో తల్లియే తొలి గురువైంది. జగద్గురు వైన జగన్మాతే ఓనమాలు దిద్దించింది. ఆయన కీర్తిని ప్రపంచమంతా దీప్తిమంతం చేసింది. కనుకనే ఆరాధనా మూర్తులలో అమ్మకే పెద్దపీట వేసింది ఆర్షధర్మం.

ఉపాధ్యాయాత్ దశాచార్యః ఆచార్యణామ్ శతం పితా
సహస్రంతు పితం మాతా గౌరవేణాతిరిచ్యతే

"ఆరాధనా క్రమంలో ఉపాధ్యాయుని కంటె ఆచార్యుడు పదిరెట్లు శ్రేష్ఠుడు. ఆచార్యుని కంటే తండ్రి వందరెట్లు, తండ్రి కంటే తల్లి వెయ్యి రెట్లు శ్రేష్ఠము" అని మనుధర్మ శాస్త్రము. ధార్మిక మనుగడకు దివ్యాస్త్రము.


మనకు ఏవయినా ఉండనివ్వండి. ఇవి నావి అనే బుద్ధి లేకుంటే చాలు. మననుండి ఏవి పోయినా, ఆ పోయినవి నావి అనే బుద్ధి కూడా పోతే ఇక బాధ లుండవు.

'నావి' అనే బుద్ధి లేనపుడు ఏవి ఉన్నా అవి బ్రతుకులో ఉంటాయే గాని బుద్ధిలో ఉండవు. బుద్ధిలో లేనివి బ్రతుకులో ఉండినా, ఊడినా మనకు ఒరిగే దుండదు; తరిగేది ఉండదు.



ప్రార్థనా ప్రసూనాలు

ఇందులో...



వాణికి వారసుణ్ణి...వాసుదేవుని దాసుణ్ణి

సుందర మందహాస వదనా!

అది నీకే సరిపోయింది. సుందర వదనాలన్నీ మందహాసాన్ని చిందించగలవా! కరుణా సాగరా! నీ వైభవాలు సాగర పూర్ణాలు. ఓ క్షణాన నిండి, మరో క్షణాన ఎండే సరోవరాలు మేము.

నీ వదనాన్ని చూడాలని, నీ సదనాన్ని చేరాలని ముచ్చట పడింది ముక్కుపచ్చ లారని పూప వయస్సులో ఈ పిచ్చి మనస్సు. మొద్దు ఘటమని ఈసడించుకోక ముద్దుబిడ్డగా స్వీకరించి సుద్దులు నేర్పావు. బుద్ధిని దిద్దావు. బ్రతుకును సరిదిద్దావు.

తడబడే అడుగుల సవ్వడిలో తబలా పలుకులు పలికించావు. కూనిరాగాల వెనుక నిలిచి సంగీత స్వరాలు వినదించావు. గజ్జె కట్టించి గజిబిజి చేశావు.

నిన్ను కోరిన నన్ను నీవు కోరిన వారికిచ్చావు. కష్టాల్ని ఆరగిస్తూ సుఖాల్ని పంచమన్నావు.

తెలిసిన వెన్నో నేర్పాను తెలియని వారికి. చివరికి ఎవరికీ తెలియని వానిగా మిగిలిపోయాను.

పువ్వుకు బిరుదు నివ్వలేని వాణ్ణి
నవ్వుకు ఖరీదు కట్టలేని వాణ్ణి
నీ పదములకడ పడియున్న వాణ్ణి
కష్టాలు పడియున్న వాణ్ణి. కడగండ్లు నిండియున్న వాణ్ణి.
వాణికి వారసుణ్ణి. వాసుదేవా! నీ దాసుణ్ణి.
నా మాట కావాలి కొందరికి
నా పాట కావాలి మరి కొందరికి
నా బాట కావాలి ఇంకొందరికి
నేను ఎవరికి కావాలి?
ఎవరికీ కాని వాణ్ణి కనుకనే నీ వాణ్ణయ్యాను.

తండ్రీ!

ఏదీ కావాలనిపించదు నాకు
ఏదో కావాలని కోరదు నా మనస్సు
కాడిగట్టి నీరసిస్తున్న సనాతన ధర్మజ్యోతికి
నూనెగా నేను మిగిలితే చాలని
వత్తిగా నేను నిలిస్తే చాలునని
తపించడమే నా వృత్తి
పరితపించడమే నా ప్రవృత్తి
ప్రగతి నిరోధక సైంధవులు నా చూపును తట్టుకోలేరు.
ఈర్ష్యాసూయల రాబందుల రెక్కలు నా ప్రక్కన చలించవు.
నా సేవా జీవనది ఎండేది కాదు.
నా శంఖారావం మూగపోయేది కాదు.
నా సూక్తి వెనుక స్ఫూర్తివి నీవని
నా కీర్తి వెనుక దీప్తివి నీవని
తెలిసిన వారికే తెలుసు నేనెవరో!
తెలియని వారికి ఏమి తెలుసు నీవెవరో?
ఉల్లికి అలవాటు పడిన లోకానికి
మల్లెల వాసన పట్టదు. గిట్టదు.
మురికి గుంటలో ఈదులాడే మనసుకి
మానస సరోవర జలాలు రుచించవు
ఏదయితే నేమి?
కాకి గోల ఆగాలి
కోకిల పాట సాగాలి
ఇదే నీ ఉపదేశం.
అదే నాకు సందేశం.
అమృత సందేశం.
నా గూడు చినబోయే లోగా
నీ గుడిలో మణిదీపాన్ని వెలిగించాలి. అంతే.

అమ్మ ఒడి

ప్రభూ!

నాకు తోడుగా ఉన్న నిన్ను నీడలా వెంబడించానే గాని, నింగిలాంటి నీ వైభవాన్ని ఏనాడూ తొంగి చూడలేకపోయాను. నా ఊహల పందిరిలో నిన్ను కూర్చోబెట్టే ప్రయత్నం చేశానే గాని, యెద ఊయల నెక్కి ఊగుతున్న నీ సౌందర్యాన్ని నా ఊహలకి పట్టించలేకపోయాను.

నాకు నీ ప్రేమను పుష్కలంగా ప్రసాదించావు. అదేదో పంచేందుకు ఇచ్చావనుకున్నానే గాని, అందులో నిన్ను వ్యక్తం చేయమని భావించి అనుగ్రహించావని గ్రహించలేకపోయాను. నింగిని నేల పారేసుకొని, నేలను నింగికెత్తే ప్రయత్నంలో నిమగ్నమయ్యాను.

ఈ ప్రయత్నాలలో నాకేవో దగ్గరవుతాయని భావించానే గాని, నాకు నేను దూరమౌతానని ఊహించలేకపోయాను. ఊహలే కాదు, ఊపిరి ఆడని పరిస్థితిని తెచ్చుకున్నాను. ఇదంతా ఎవరో చేసింది కాదు. నేను చేసుకున్నదే. నైరాశ్యానికి ఆహ్వానం పలికింది నేనే. నేడు నాకది అనుకూలం కాకపోవచ్చు. కాని, అది ధర్మానికి ప్రతికూలం కాదు. ధర్మంతో దానికి వైరుధ్యం లేదు.

ప్రభూ! నీవేమిటో తెలియకనే ఇదంతా చేసుకున్నాను. తెలిసి ఉంటే నీ జ్ఞానంలో, నీ ప్రేమలో, నీ శక్తిలో నన్ను నేను చుట్టుకొని పడియుండే వాణ్ణి.

నిన్ను తొంగి చూడలేని నా అశక్తతను మనసారా అంగీకరిస్తున్నాను. కాని, తెలియకపోయినా నేను దేనికొరకైతే ప్రాకులాడానో, పరితపించానో అది నీవే, నీవేనని నీకే తెలుసు.

చిన్ని పాపాయి అమ్మను వెదుకుతూ నిచ్చెన నెక్కింది. కొన్ని సోపానా లెక్కింది. అలసిపోయింది. భయంతో చలించిపోయింది. పైకి పోవటంలో ఎంత ప్రమాదమో ఎక్కిన తరువాత గాని తెలియలేదు.

"అమ్మా! అమ్మా!" అని బిగ్గరగా రోదిస్తున్న ఏడుపులో "నే పట్టుకుంటాను. దూకేయ్" అనే అమ్మ మాటలు పాపకి వినిపించటం లేదు. తన అరుపే తనకు అవరోధమైంది. తన పలుకే తనకు ప్రతిబంధకమైంది. క్రింద అమ్మ పిలుస్తున్నా, అమ్మ కొరకు పాప పైకి ప్రాకుతూనే ఉంది. మరీ అశక్తురాలై అలసిపోయింది. చేతులు బలహీనపడ్డాయి. నిచ్చెనను వదిలేసింది. "అమ్మా" అంటూ పడిపోయింది.

బిడ్డ నేలపై పడలేదు. అమ్మ ఒడిలో పడింది. అజ్ఞానంలో తనను తాను శిక్షించుకొనేది పాప. శిక్షను తప్పించి రక్షణ నిచ్చేది తల్లి. అంతేనా ప్రభూ! నేను నీ పాపగా జారిపోనా! నీ ఒడిలో రాలిపోనా!

ఆశే

ప్రభూ!

ఏదో చూడాలని ఉంది.

ఏదో ఏదో వినాలని ఉంది.

తల్లి బిడ్డకు పాలు పట్టించినట్లు, వైద్యుడు రోగికి మందిచ్చే పసందైన రోజును చూడాలని ఉంది.

ఆలయంలో భక్తులు ప్రసాదాలు పంచునట్లు, వ్యాపారులు ప్రేమతో వాణిజ్యం చేస్తూ ఉంటే చూడాలని ఉంది.

బిడ్డల అవసరాలను తండ్రి తీర్చునట్లు ప్రజల అవసరాలను అడగకుండా తీర్చే ప్రభువు పాలించే రోజుల్ని చూడాలని ఉంది.

ప్రతి పైసకు విలువనిచ్చే లోభిలాగా, ప్రతి క్షణాన్ని వినియోగించుకొని అధ్యయనం చేసేముద్దుల విద్యార్థిని చూడాలని ఉంది.

గూటిలోని పెట్టను గుర్తు చేసుకుంటూ గుట్టల నెక్కుతున్న పుంజును, గుట్టల నెక్కే పుంజును గుండెల్లో దాచుకొని గూటిలో కదిలే పెట్టను కళ్యాణంగా చూడాలని ఉంది.

సాగరంలో చలించే ప్రతి అలలో జలమే ఉన్నట్లు పూజా మందిరంలో పలికే ప్రతి గొంతులో **"సర్వేజనాః సుఖినో భవన్తు"** అనే ప్రేమ పలుకును వినాలని ఉంది.

"ముసిరేది చీకటి; విరిసేది వెన్నెల. విడిపోతే ఎడబాటు; విడి ఉంటే యెదపోటు. ఎడబాటు విడిపోనీ. యెదపోటు పడిపోనీ. రెండు గాని ఒకటి ఉండిపోనీ; కాదు పోకుండా ఉండనీ. పండనీ" - అని వేదికలపై గర్జించే అద్వైత వేదాంత సింహ కిశోరాలను చూడాలని ఉంది.

గాలితో కలిసి గంతేయాలని ఉంది. ఆకాశంతో ఆడుకోవాలని ఉంది. నీటితో చేయి కలిపి నడవాలని ఉంది. భూమిని ప్రేమతో కౌగిలించుకోవాలని ఉంది. నిప్పులా నింగి కేగాలని ఉంది. వర్షంలా క్రిందికి జారాలని ఉంది.

ప్రభూ! ఇదంతా ఉంది. నాలో ఉంది. నేనుగా ఉంది.

శివా! నీవే ఉన్నవాడివి

అయం దానకాల స్త్వహం దానపాత్రం
భవానేవ దాతా త్వదన్యం న యాచే
భవద్భక్తి మేవ స్థిరాం దేహి మహ్యం
కృపాశీల! శంభో! కృతార్థోఽస్మి తస్మాత్ ॥

శంభో! ఇది దానమిచ్చుటకు తగిన సమయమైతే దానము గ్రహించు పాత్రుడను నేనే. నీవే దాతవు. నిన్ను తప్ప మరొకరిని నేను యాచించను. నాకు సుస్థిరమైన భక్తిని అనుగ్రహించు. హే దయామయా! దానివల్లనే నేను కృతార్థుడ నవుతాను.

శివా! ఉన్నవాడే పెట్టగలడు. లేనివాడు ఏమి పెట్టగలడు? ఈ ప్రపంచంలో ఉన్నవారంతా లేనివారే. ఒకనాడు లేకుండా పోయేవారే. కుండలా పగిలేవారే. కట్టెలా కాలేవారే.

పాడెకుండను చుట్టుకోవాలని ప్రతి ఇంటిముందు కాలసర్పం కాచుకోనుంది. చూచే కంటిపై చివరి రెప్ప వాలితే చూడాలని కాలుడు కులుకుతున్నాడు. పెనుతుఫాను ఏ క్షణాన ముంచుకొస్తుందో తెలియదు. చిల్లుల జల్లెడలో మిగిలేదేమిటో అర్థంకాదు.

కోకిల క్రొత్తది కావచ్చు. పాట పాతదే. మనుషులు క్రొత్తవారు కావచ్చు. బాటలు పాతవే. వల్లమాలినంత ఉంది. ఏం లాభం? వల్లకాటిని మరిపించలేక పోతుంది.

ఈ దారిద్ర్య జగత్తులో దానమిచ్చే శక్తి ఎవరికుంది? సంచితంతో రావడం, ప్రారబ్ధంతో రాటుదేలడం, ఆగామితో రాలిపోవడం - ఇంతేకదూ, తండ్రీ! అందరి పరిస్థితి.

సంసార మడుగులో కూరుకుపోయిన వారిని అడగలేను నేను దానం. చేయలేరు వారు ధర్మం. ఈ పరమసత్యాన్ని గ్రహించిన సమయమిది. అందుకే నిన్ను యాచిస్తున్నాను. దానకాలమని గుర్తుచేసి మరీ యాచిస్తున్నాను.

లేనివాడిని అడగడం లేదు. ఉన్నవాడివి నీవు. ఉన్నవాడివి నీవే. హృదయమున్న వాడివి. యాచకుణ్ణి తరిమివేస్తావా! అనుగ్రహించు తండ్రీ! ఆశీర్వదించు ప్రభూ!

మడులొద్దు, నీ అడుగులొత్తుతూ పడి ఉండనీ! మాన్యాలొద్దు. మననం సాగనీ. ధాన్యాలొద్దు. ధ్యానం కొనసాగనీ. భవనాలొద్దు. త్రిభువన పాలా! నీ పాలనలో మనుగడను సాగించనీ. కరిగే ధనమొద్దు. తరిగే జనమొద్దు. తరగని, కరగని భక్తి ధనాన్ని ప్రసాదించు. భద్రంగా దాచుకుంటాను. కామక్రోధాది చోరులు దోచుకోకుండా చూసుకుంటాను. చూసుకొంటూ ఉంటాను. నిన్ను చూసుకుంటూ ఉంటాను. ఒకనాడు నిన్ను చూసుకుంటూ పోతాను.

ముకుందునితో ముచ్చట్లు

పరమాత్మవైనా పసిబాలునివలె భువిలో చరించిన దేవా!
మానవుడే మాధవుడని చాటిచెప్పిన ఓ వాసుదేవా!

మానవునిలోని రాక్షసుని తరిమిన ప్రభో!
రాక్షసునిలో మానవుని తురిమిన విభో!

బ్రతుకు చెరసాల నుండి బయటపడే నేర్పును నేర్పిన కంసారీ!
ఎదురు చూచి చూచి పిలువలేకున్నాను నోటిలో తడి ఆరి!

మనసును మురళిగా తీర్చిన యదుబాలా!
మోము చూపవు నాపై ఈ బిగువేల?

త్రాడు దొరకలేదు యశోదకు నిను బంధించను రోటికి
పలుకు లేదు, పాట రాదు నిను కీర్తించను నా నోటికి

నిన్ను చూచి పొంగి పొంగి పారింది ఆనందంతో ఆ యమున
నీవు లేక కృంగి కృంగి నిలిచింది విషాదము నా మనమున!

"ఆరాధన చేసే రాధనురా!" అని పలకరించింది నిను ఆ రాధ
"నిరపరాధనురా!" అని పలవరిస్తోంది మాయలెరుగని నా యెద!

లక్షణములు లేక శిక్షణ నాశించి నీ దరిచేరినాను దయామయా!
శిక్షణ వదిలేసి శిక్షింపబూనితే రక్షించు వారెవరు కృపామయా!

కన్నది లేదు-అయినా అంటిమి "నాయనా!" అని కన్నయ్యా!
కనులు కలువలైనవి కృష్ణచంద్రుని కొరకు మమ్ము గన్న ఓ అయ్యా!

నీ వనే సాగరంలో ఎగిరిపడే అలలము దేవోత్తమా!
నిన్నెరుగక సంసారంలో కరిగిపోవు కలలము పురుషోత్తమా!

సిరులొద్దు సురులొద్దు మాకు సువర్ణ గిరులొద్దు
సిరిసిరి మువ్వల నీ పదములే మాకు ముద్దు ముద్దు!

భ్రమను త్రుంచి ప్రేమను పంచే ముద్దుల గోపాలా!
భక్తిని పెంచి ముక్తిని దించే వెన్నముద్దల గోపాలా!

సేవించే పూజావేళ నా మనసు పూవుగా మారేదెపుడు?
కనుమూసే తుదివేళ నా హృది నీలోకి జారేదెపుడు?

నీ రూపమును గాంచమని ప్రేమతో మాకు అందించావు కళ్ళు
చూడలేని అభాగ్యులమై నిరాశతో మేము చిందించాము కన్నీళ్ళు!

నలుపును వలచి నే తెరిచాను వలపుల పేటిక
నలిపి నలిపి నన్ను మరిచావు నీ కిదొక నాటిక

చాచే చేతులు పూచే పూలను తాకే దెప్పుడు?
కనులు చేతులై నీ పదకమలము చేరే దెప్పుడు?

వెలుగులకు వెలుగై వెలిగేటి నీవు నిజానికి వేల్పువే
చీకటి కన్నులతో నిను గాంచలేని నేను నేటికి నిట్టూర్పునే!

హృదయ గగనాన చల్లగా వెలిగేవు ఒక క్షణాన కృష్ణచంద్రమా!
గుర్తులు నిలుపక గుట్టుగా వెళ్లావు మరుక్షణాన నీకిది న్యాయమా!

రేపు లెన్నిపోయినా ముందు రాదేమి నీ రూపు మోహనాకారా!
మాపు లెన్ని గడిచినా నడచి రావేమి మా వైపు నవనీతచోరా!

ప్రేమ లూరెడి బావి నీవు సుగుణాల దీవి
సూర్యచంద్రులైనా నీ ముందు వెలగలేరు అదేమి?

కాయలు కాచినవి చేతులు రాసి రాసి
ఫలము లయ్యేదెపుడు కలము కలలు పండి

కట్టలేను పరంజ ఈ ప్రపంచ అపరంజి మేడకు
చెంగు చెంగున గంతులిడి అరుదెంతు నీ చల్లని నీడకు!

ఎన్నో రాత్రులు మేల్కొంటిని నిను మెప్పింప
ఎన్నో వేదిక లెక్కితిని నీ మహిమ చాటింప
ఎన్నెన్నో గుడులు తిరిగితిని నిను దర్శింప
ఇక తిరగలేక చతికిలబడితి నీవు కరుణింప!

గుండె చప్పుడు

ప్రభూ!

ఏవేవో కావాలని, వాటివల్ల జీవితం ఏదేదో అవుతుందని ఆశపడి, వాటిని ప్రసాదించమని నిన్ను అడుగుతూనే ఉన్నాను తొలినుండి. నీవు ఇస్తూనే ఉన్నావు ఇప్పటి దాకా.

ఇంతవరకు నేను అడిగి పుచ్చుకున్నదంతా ఖాళీ పాత్రయేనని, అందులో నా కంటూ ఏదీ లేదని ఇంతవరకు నేనూ గ్రహించలేక పోయాను. నీవు కూడా అనుగ్రహించి నాకీ నిజాన్ని చెప్పలేదు.

దేనిని సమీపించాలో సుస్పష్టంగా తెలియక పోవటంవల్ల, నిన్ను దూరం చేసుకుంటూనే నడిచాను. పగిలిపోతాయని తెలియక గాజు బొమ్మలపై మోజు పెంచుకున్నాను. వాటిని పొందేందుకే యత్నించాను. ప్రయత్నించాను. తీరా పొందితే, అవి గాజు బొమ్మలు కూడా కావని గాలి మేడలలో కులికిన ఊహాచిత్రాలని తేలింది. ఇక పగిలేందుకు ఏముంది? ఏమీ లేదు. అందుకని ఒక అడుగు ముందుకేసి నా గుండే పగిలిపోయింది.

గుండె పగలగానే బ్రతుకు బండబారి నట్లనిపించింది. ఇంతలో చెదిరి పడియున్న గుండె తునకలు నాపై కాంతి కిరణాలను విరజిమ్మాయి. అంతేకాదు. నాతో ఏదో గుసగుసలాడుతున్న ట్లనిపించింది.

తీరా వింటే ఆ పలుకులు గుండెవి కావు. నీవి. వాటినుండి నీ పలుకులు వినిపిస్తున్నాయి.

"నిన్ను సృష్టించింది నేను కానా? ఎందుకు సృష్టించానో నాకు తెలియదా? ఆరని దీప కాంతిలో నిన్ను నడిపేందుకు సర్వదా నేను సిద్ధంగా ఉన్నా, ఎందుకని నన్ను సదా దూరం చేసుకుంటూ పోతున్నావు? ఏమి సాధించావు? గుండెను పగులగొట్టుకున్నావు.

"పోనీలే. జరిగింది జరిగిపోయింది. గుండె పగిలితే పగలనీ. అతికేందుకు నేను వచ్చాను. కాదు, ఉన్నాను. ఇకనైనా దృష్టి మార్చుకో. చూపును మార్చుకో. చూసే రీతిని మార్చుకో.

"ఏమిటి? నన్ను చూస్తున్నావు. నన్ను చూడమని కాదు నే చెప్పింది; నా నుండి చూడమని", అన్నావు.

ప్రభూ! నీవు అన్నావు. నేను విన్నాను. వింటూనే ఉంటాను; కాదు, వింటూనే ఉన్నాను. ఉన్నాను. ఉన్నాను. ఉన్నాను. ఉన్నాను. ఉన్నాను. నేను ఉన్నాను. **అహమస్మి.**

విశ్వమంతా విభుని వైభవమే

ప్రభూ!

ఎంత పిలిచినా నీవు ఎందుకు రావడం లేదని ఆలోచించేవాణ్ణి. బాధపడేవాణ్ణి. వివరణ ఇచ్చుకోలేక వెలితితో విసిగిపోయేవాణ్ణి. అంతేగాని, నన్ను నేను రక్షించుకొనే ప్రయత్నంలో తలమునకలై ఉన్నందు వల్లనే నీవు ప్రవేశించేందుకు వెనుకాడినావని గుర్తించలేక పోయాను.

ఆశలు నన్నింకా వీడలేదు. వేడుకలు నన్ను విడిచి పెట్టలేదు. దేనినీ విడిచిపెట్ట లేని నేను నిన్ను ఎలా పట్టుకోగలను? నిన్ను తెలియని నాకు ఏది తెలిసినా అదంతా నా వైభవంగానే ఉంది. ఇక నీ వైభవాన్ని నేను ఎలా దర్శించగలను?

నీవు రావడం లేదని చింతిస్తానే గాని, నీ వంటూ వస్తే వైభవంగానే వస్తావని, ప్రభువులా ప్రవేశిస్తావని, ఆదేశాలిచ్చే వానిలా నిలుస్తావని నాకు అర్థమయితే గదూ? అప్పుడు కూడా నా వైభవమే వెలుగుతుందని భ్రమించే నాకు అప్పుడు రాబోయేది ఇప్పుడున్నదేననే సత్యం అవగత మవుతుందా?

నీవు వస్తే, ఇక్కట్లు తీరుతాయని, చీకట్లు తొలగుతాయని, శత్రువులు, నిస్సార మవుతారని భావిస్తానే గాని, ఇక్కట్లు అనేవి మనోకల్పితాలని, వెలుగు లేనితనమే చీకటని, శత్రుత్వ మనేది వాస్తవానికి లేనిదేనని నాకు తెలిసేదెప్పుడు? నీవు నన్ను చేరేందుకు, నీ రథము నా వైపు నడచి వచ్చేందుకు నిర్మించిన రహదారిలో ఇక్కట్లు కంకరయని, చీకట్లు సిమెంటు అని, శత్రువులు నల్లని తారు అని నాకు అవగతమైతే కదూ?

ఇప్పుడు తెలుస్తూ ఉంది. ఆశలన్నీ అడుగంటిన తరువాత అర్థమవుతూ ఉంది. బాధలు, భయాలు లేని ప్రపంచంలో నేను కాలిడ బోతున్నానని తెలుస్తూ ఉంది. గొప్ప ఆనందము నన్ను కౌగిలించుకొనేందుకు సిద్ధంగా ఉందని బోధపడుతూ ఉంది.

నన్ను నేను రక్షించుకొనే ప్రయత్నము చేసినంత సేపు అక్కడెక్కడ నిన్ను చూడలేక పోయాను. అన్ని ప్రయత్నాలు జారిపోయినపుడు నా హృదయంలో నీవు చేరిపోయినట్లు తెలిసింది. అన్నిటిని పోగొట్టుకోగానే నిన్ను పొందగలిగాను. కాని, ఒక విచిత్రం చెప్పనా? నీవు రాగానే నీతో పాటు పోయినవన్నీ మళ్ళీ తిరిగి వచ్చాయి. అయితే పూర్వంలాగ రాలేదు. అపూర్వంగా అరుదెంచాయి. ఒక్కమాటలో చెప్పాలంటే నీలాగే-వచ్చాయి. నీవుగానే వచ్చాయి.

ప్రేమ కార్యం

ప్రభూ!

నీకు చొక్కా కుట్టే శక్తి లేని దర్జీని అని సమర్పించుకుంటున్నాను అర్జీ.

నీవు చాలా తేలికైన వాడివి. కనుకనే పక్షులతో విహరిస్తుంటావు. చాలా బరువైనవాడివి.

కనుకనే కొండలా నిలబడి ఉంటావు

పెద్ద పాదం గలవాడివి. కనుక నీది గజ గమనం.

కదలలేవు. అయినా పాపల నవ్వుల్లో దోగాడుతూ ఉంటావు.

నీకు తెలిసిన ఏ భాషలూ మాకు రావు.

అందుకే ఎంత విన్నా అర్థం చేసుకోలేము.

నీవు మాకు ఎప్పుడూ దూరం కావు.

అయినా, ఎందుకో మేము నిన్ను దగ్గర ఉంచుకోలేము.

మా విలాపాలు నీకు విలాసాలుగా ఉన్నాయని,

మా వేదనలు నీకు వినోదాన్ని పంచాయని, - తెలియగానే మనస్సు ఎందుకో కుమిలి పోతుంది.

ఎటు పరుగెడుదా మనుకున్నా ముందుగనే నీవు ఆ తలుపులన్నీ మూసేస్తావు. ఏ దారి లేకుండా మేము కూలబడితే అన్ని దారులు నీవే కావాలనేది నీ ఆశ.

నీ ఆశ మాలో నిరాశను తరుముతుంది. ఇక మా ఆశ అంటావా? దానికెప్పుడూ దాగుడుమూతలే. ఎక్కడ కనిపిస్తుందో తెలియదు. ఎందుకు కనిపిస్తుందో తెలియదు.

అయినా నీవు తరుముతూనే ఉంటావు.

విరామం లేకుండా మా వెంట తిరుగుతూనే ఉంటావు.

ప్రభూ!

బిడ్డ కేకలేస్తుందని, కాళ్ళు కొట్టుకుంటూ విలపిస్తుందని తల్లి స్నానం చేయించటం మానుతుందా? అలాగని బిడ్డను అసహ్యించుకుంటుందా?

బిడ్డ పెద్దవుతూంటే తల్లి బోధించగలదు. బిడ్డగా ఉన్నప్పుడు ఏం చెప్పగలదు? 'నా ప్రేమ కార్యాన్ని అడ్డుకోకే' అని తల్లి చెబితే బిడ్డకు అర్థమవుతుందా?

ఏం చేయాలో తల్లికే తెలుసు. ఏడ్చినా, మొత్తుకున్నా తల్లి తాను చేయాల్సిన పని తప్పక చేసే తీరుతుంది.

ఎటొచ్చి, అర్థం చేసుకోవటానికే బిడ్డకు సమయం పడుతుంది. మేము నీ ప్రేమను అర్థం చేసుకొనే సమయమెప్పుడు తండ్రీ!

ఈ లోగా సమవర్తి సమీపించడు గదా!

నిరీక్షణయే నిచ్చెన

ప్రభూ!

నిన్ను దర్శించాలనేదే జీవితంలో ప్రధాన లక్ష్యంగా పెట్టుకొన్న నేను, అహర్నిశము నన్ను చూసుకోవటంలో నిన్ను క్షణం కూడా చూడలేకపోతున్నాను. నన్ను దాచుకొంటూ నిన్ను దోచుకోవటం సాధ్యం కాని పని అని ఇప్పటికే తెలుసుకున్నాను.

పొందటంలో లేని సుఖం పోగొట్టుకోవటంలో ఉందని గ్రహించాను. పట్టుకున్నది వదిలితే పట్టుకోవలసింది లభిస్తుందని అర్థం చేసుకున్నాను. నా కంటిని కప్పిన మూతలే నీ దాగుడుకు కారణమయ్యాయి. ఈ దాగుడు మూతలు ఆటే కావచ్చు. అయినా ఆడే శక్తి, ఆసక్తి నాకు లేవు.

అందాన్ని అర్థం చేసుకోవాలని, ఆస్వాదించాలని నేను ఉత్సాహపడటం లేదు. బంధాలను త్రెంచుకోవాలని కూడా నేను ప్రయత్నించటం లేదు. బంధాన్ని అర్థం చేసుకొనే ప్రయత్నములోనే నేనున్నాను. అర్థంగాని దానిని తొలగించే ప్రయత్నం కూడా వృథాయే నని నా అభిమతం.

మబ్బును కరిగించేయాలని, నీటిని మేఘం కార్చేస్తూ ఉంటే చూడాలని, లేదా ఆ జలాలలో తడవాలని నేను ఉబలాట పడటం లేదు. కదిలే మబ్బు ఎందుకు కరగటం లేదో అడిగి మరీ తెలుసుకొంటున్నాను. మబ్బుకు చేసిన జబ్బేమిటో పరీక్షించి చూస్తు న్నాను. వీచే గాలికి కదిలే మబ్బుకు కయ్యమెందు కొచ్చిందో సూక్ష్మంగా విశ్లేషిస్తున్నాను.

"నా బంధాన్ని నీ వెందుకు తొలగించవు?" అని ఏనాడైనా నేను నిన్ను అడిగానా? అర్థం లేని ఆశలు, ఫలితాలందని ప్రయత్నాలు నా మనస్సుకు పట్టవు. నా బుద్ధికి సరిపడవు. గొంతు ఆరిపోతున్నా ఆకాశాన్ని చూస్తూ అలా ఉండిపోతానే గాని ఎండమావుల వెంట పరుగులెత్తలేను.

తల్లి గర్భంలో ఒదిగి పడుకోనున్న పాప ప్రపంచంలో పడేందుకు ప్రయత్నించదు. శ్రమించదు; ఈ ప్రయత్నాలకి ఫలితాలుండవని పాపకి తెలుసు. బాధైనా, బరువైనా నవ మాసాలు ఓపికగా వేచి ఉండాల్సిందేనని తెలుసు.

ఇక్కడ చేయవలసింది ఏమీ లేదు. అంతా చూడవలసిందే. వేచి చూడవలసిందే. చేసుకోవలసిందేదీ లేదు. అర్థం చేసుకోవలసిం దొక్కటే ఉంది. అనివార్యాలు అర్థం చేసుకొనేందుకే ఉన్నాయని, హాయిగా అనుభవించేందుకే ఉన్నాయని గ్రహించటమే ఇక్కడ ప్రధానము. అదే నిదానము. పరమ నిధాన్ని చేరే విధానము.

దాగుడు మూతలు

ప్రభూ!

నాలో ఎవరో తిరుగుతూ ఉంటారు. పని చేస్తూఉంటారు. పలకరిస్తూ ఉంటారు. ఏదేదో చెబుతూ ఉంటారు.

పలికే గొంతులు మారుతూ ఉంటాయి. పిలిచే సంబోధనలు మారుతూ ఉంటాయి. పాడే స్వరాలు మారుతూ ఉంటాయి. ఇచ్చే వరాలు మారుతూ ఉంటాయి.

ఇంతకీ ఎవరా? అని చూస్తే అక్కడ ఎవ్వరూ లేరు. నీవే ఉన్నావు. "నీ భారాలు నేను మోయలేనా? అవి నాకు బరువులనుకోకు. బరువైన వాటిని తేలిక పరచటమే నా పని" అన్నావు.

అంతే కాదు. ఇంకా ఎన్నో, ఎన్నెన్నో అన్నావు.

"నీవు నాకు సమ్మతం కాదేమో అనే సంశయం నీలో ఉంది. నీ కార్యాల్లో నన్ను ఇతరులు స్పష్టంగా చూడలేక పోతున్నారనేదే నీ బాధ".

"నీ బాధ నాకు అర్థం కానిది కాదు. నీ బాధ సాగర రూపాన్ని దాల్చకూడదనేదే నా బాధ. ఇది నీకు అర్థం కావాలి".

"నీకు నేను తెలుస్తూ ఉంటే, నీవు నన్ను చూస్తూ ఉంటావు. నేత్రాలతో ప్రపంచాన్ని, మనో నేత్రంతో నన్ను చూస్తూ ఉంటావు. నాతో ఆనందిస్తూ ఉంటావు".

"నీ ద్వారా నేను వ్యక్తమైతే, అది ఇతరులు స్పష్టంగా చూస్తే, నిన్ను పొగుడుతారు. గుర్తించి గౌరవిస్తారు. అదంతా చూసి, నీవే అంతా చేసినట్లు నీవు ఏదో అయిపోతావు. అక్కడ నుండే నీ బ్రతుకు ఏదో అయిపోతుంది".

"నేడు పొగడ్తలు, గౌరవాలు స్వీకరించి తృప్తి చెందుతున్నావు. రేపు విమర్శలు, నిందలు కూడా నీవే భరించవలసి వస్తుంది".

"అందుకనే, నీలో పనిచేస్తూ, నీ ద్వారా వ్యక్తం కాకుండా ఉన్నాను. నాలో చేరిన నీవు, నీలో నన్ను బయట పెట్టకు" అన్నావు.

ప్రభూ!

ఇంతవరకు నేను నిన్ను వెతుకుతున్నానని భ్రమించాను. నీవే నన్ను వెతుకుతున్నావని ఇప్పుడు తెలిసింది. ప్రేమ అందుకోనే రూపంలో ఉన్నదని భావించానే గాని అందించే స్వరూపంలో ఉందని గ్రహించలేక పోయాను.

ఇప్పుడు గ్రహిస్తున్నాను ప్రభూ! గ్రహణం వీడిందేమో!

పరమాత్మ చిద్విలాసం

నేను నీ జీవితంలో ప్రవేశిస్తానని నీకు తెలుసా? నేను ఇచ్చింది ఏదైనా ఉంటే, అది నీవు అడగటం వలన జరిగిందా? నీవు నన్ను చేరేందుకు ఒకప్పుడు ప్రేమ రాగాన్ని ఆలపించింది నేను కాదా? చీకట్లో దీపాల ఆట ఆడటం నీకు తెలుసా?

నీ బుద్ధికి శ్రద్ధ లేదు. అందుకే నన్ను అర్థం చేసుకోవాలని అశ్రులు చాస్తోంది. ప్రేమ పని చేస్తుందే గాని పలవరించదు అనే చిన్న విషయాన్ని కూడా నీ చిన్న బుద్ధి గ్రహించలేక చిన్నబోతుంటే నేనేం చేయను? మేఘాలు కదులుతున్నాయని మార్తాండుడు కునుకు దీస్తాడా?

చూడు. నా ప్రయత్నం లేకుండా నీవు ప్రాకుతున్నావా? నా తోడు లేకుండా నీవు ఆడుకొంటున్నావా? నీతో పాటుగా నీలో నేను జీవిస్తున్నానని నీకు తెలియదా? అన్నీ ఎలా ఉండాలో అలా ఉంటున్నాయి. ఎలా జరగాలో అలా జరుగుతున్నాయి. నేను నీకు ఏమి ఇవ్వాలని అభిలషించానో దానిని అర్థం చేసుకొని అందుకునే అర్హతతో ఒకనాడు నీవు శోభిస్తావు. కాదు కాదు. ఆనందంతో పరవశిస్తావు. ఊగిపోతావు.


నాది జీతం తెలియని జీవితం. అందుకనే నీకు తెలియకుండా నీలో జీవిస్తాను. సూటిగా నిన్ను ఒక్కమాట అడగనా? నన్ను మరచి నీవు మనగలుగుతున్నావా? ఇలాగే ఉంటుంది నా నిర్వాకమంతా. నీవు గాని నీ నుండి నిన్ను వేరు చేయడమే నా వేడుకంతా. అందుకే అప్పుడప్పుడు నీ చుట్టూ చీకట్లు పరుస్తాను. ఇక్కట్లు పేర్చుతాను. గట్లు తెగినట్లు నీవు ఏదో అయిపోతుంటే నెమ్మదిగా ముచ్చట్లతో దిగుతాను. అలా నిన్ను గట్టున పడేస్తూ ఉంటాను.

పువ్వుకు అందాన్నిచ్చింది నేనే. అందుకే నన్ను చూస్తే పువ్వు సిగ్గుపడుతుంది. నదికి నవ్వు నేర్పింది నేనే. అందుకే నేను దగ్గరయితే చాలు. గలగల మంటుంది. గాలికి పాటలు నేర్పింది ఎవరనుకున్నావు? నేనే. కాకపోతే, నన్ను చూచి గాలి ఈల వేస్తుంటే నా గుండె ఎందుకు గోల చేస్తుంది? ఇవన్నీ నీకు అర్థం కావులే. కొన్ని అలా కాకపోవడమే మంచిది. అర్థం కావడం అర్థం కాకపోవడము రెండూ ఒకటేనని అర్థమయ్యే దశలో ఇక అర్థం (సగం) ఉండదు. అంతా పరమార్థమే.

చేసింది చాలు. చూసింది మేలు. చేసేదెవరో ఇక చూస్తూ పో. అప్పుడే నా కార్యాలు నీకు అర్థమవుతాయి. కాని, ఇవన్నీ నీకు అర్థం కాకముందే నాకు అర్థమవుతాయి. అందుకే నీకు అర్థమయ్యేలా నా అడుగుల్ని కదిలిస్తాను. తెలిసిందా? నీవు ఏమి చేయబోతావో నాకు తెలుసు. నీవు ఏమి చేయలేవో కూడా నాకు తెలుసు. ఇదంతా నీకు తెలియదు అనేది కూడా నాకు తెలుసు.

కర్మయోగము - ధర్మ జీవనము

ఇందులో...



పరమాత్మ సందడి

ప్రశస్తమైన మానవజన్మను పొంది, భగవంతుని పొందకుండా ఈ ప్రపంచం నుండి నిష్క్రమిస్తే ఎందుకు జన్మించినట్లు? ఎందుకు జీవించినట్లు? పాడుపడ్డ గృహముపలె మనకు, ఇతరులకు వినియోగపడకుండా బ్రతుకు అదృశ్యం కావలసిందేనా? మిడుత బ్రతుకు దీపము కొరకే నన్నట్లు మన బ్రతుకు శ్మశానానికేనా? పొలములో విత్తనములను పంట కొరకే చల్లుతాము. మనము జీవించునది కూడా బ్రహ్మ సాక్షాత్కారముకొరకే. ఇది మరువకూడదు.

మరపే మన పాలిటి మరణమై ఉంది. ఆలయానికి వెళ్ళాలని ఇంటి నుండి బయలుదేరుతాము. మార్గమధ్యంలో గోచరించే వింత దృశ్యాలను వీక్షిస్తూ నిలిచి పోతాము. మనం వచ్చిన పనిని మరచిపోతాము. తీరా మనకు జ్ఞాపకమొచ్చి వెళ్ళేసరికి ఆలయ తలుపులు మూసివేస్తారు. ఇలాగే ఉంది మన సాధన అంతా.

వాంఛలనే గబ్బిలములు మనస్సును పట్టుకొని వ్రేలాడుతుంటే మందిరాలను దర్శించి ఏమి సాధిస్తాము? మనస్సును ప్రక్షాళనం చేసుకోవాలి. అహంకార పంజరములో కూర్చొని పలికే పలుకులు కంఠశోషయే. సింహకిశోరమువలె అహంకార పంజరమును ఛేదించుకొని బయటపడాలి. పూర్ణ స్వరూపములో ప్రకాశించాలి.

రాతిబొమ్మలో చైతన్యమును దర్శించగలిగే మనం ప్రాణిలో ప్రేమను నింపలేమా? ప్రతి వ్యక్తిలో పరమాత్మను దర్శించే అలవాటును చేసుకోలేమా? ఏమిటీ! వారిలో లోపాలున్నవా? అవి వారి పాలిటి శాపాలు కావచ్చు. కానీ మన పాలిటి పాపాలు కాకూడదు. అంధకార బంధురమైన ఆకాశమును వెలుగులతో నింపుటకు ఆదిత్యుడు వెనుకాడుచున్నాడా? మురికి నీటిని తనలో సంగమించ వద్దని గంగానది అడ్డుచెబుతున్నదా? తృప్తి అనేది ప్రేమించడములో ఉంది. పలవరించడములో లేదు.

ప్రేమ ఒక గొప్ప ఆరాధన. దీనివలన సంకుచిత జీవనము మటుమాయ మౌతుంది. హృదయము విశాలమవుతుంది. సాధనలో అవరోధముల సంఖ్య బాగా తగ్గుతుంది. మనం సాధకుల మవుతాము.

సాధన ఆగిన క్షణాన కర్మయోగులం కావాలి. ఆగిన సాధన మళ్ళీ తెలియకుండా ఆరంభమవుతుంది. ధ్యానము ఏవిధమైన ప్రగతి నిస్తుందో కర్మ కూడా అలాంటి ప్రగతినే ఇస్తుంది. అహంకారమును త్యజించి, కర్మను కదిలించే స్థానమును మననం చేసుకొంటూ కర్మ నాచరించ గలిగితే ఆ కర్మ గొప్ప ధ్యానమౌతుంది.

బాధ్యతలను విస్మరించు వానిని భగవానుడు ఇష్టపడడు. "అంతా నీ భారమేనని పలికి కూర్చొనే సోమరి పరమాత్మకు దూరమే. "నాదేమీ లేదు" అని నిరంతరము శ్రమ తెలియక పరిశ్రమించువాడే పరమాత్మకు ప్రియుడు.

కర్మల నాచరించాలి. కానీ కర్మల కతీతమైన చైతన్యమే మన మనెడి భావనను సదా మనస్సులో కలిగియుండాలి. అప్పుడు కర్మలు బంధించవు పరిగదా కర్మల మధ్య భుజగశయనుడు శాంతాకారుడై యున్నట్లు మనం కూడా ప్రశాంతంగా జీవించగలం.

మన కర్మలలో అవగాహన తొంగి చూడాలి. దివ్యప్రేమ పెల్లుబికి రావాలి. పనుల మధ్య మునులై బ్రతకాలి. మాటల మధ్య మౌనం పాటించాలి. కర్మలతో కదులుతూ మనస్సును కదలకుండా నిలపాలి. సర్వకాల సర్వావస్థలయందు హృదయములోని పరమాత్మతో ఐక్యమై యుండాలి. అప్పుడు మనలో పరమాత్మ సందడి పెరుగుతుంది. పని మనదే అయినా పనితనము అతనిదై ఉంటుంది.

నీలో నిలిచి, నీ పనిని మలచి, నిన్ను లోపలికి పిలిచి, నీలో కలిసిపోయేందుకు సిద్ధంగా యున్న పరంజ్యోతిని క్షణకాలము కూడా మరువకు. మహాత్ముల మహావీయ కార్యముల వెనుక నిలిచియున్న నిగూఢరహస్య మిదియే. నీవూ ప్రయత్నించు.

తల్లిగర్భంలో ప్రవేశించిన బిడ్డ తల్లికి ఎంత ప్రియమోగదా! పరమాత్మలో ప్రవేశించిన మనము ఆయనకు ప్రియము కాకుండా ఉంటామా? ఇంకా ఆలోచిస్తున్నా వేమిటి? చిత్తము శివునిదైతే మనము ఆయనలో ఉన్నట్లేగదా! ఆలోచించడము, ఆవలించడము మానేయాలి. అవలోకించడము అలవరచుకోవాలి.

ఏదో ఒకటి, లేదా కొన్ని జీవితంలో సాధించగనే, విశ్వ విజేత అయినట్లు మనిషి ఊగిపోతూ ఉంటాడు. మనం జీవితంలో ఆశించి, శ్రమించి, సాధించలేకపోయినవి ఎన్నో కాసేపు విచారించుకుంటే, మన వైఫల్యాలకు మించినవి మరొకరికి ఉండవేమో అనిపిస్తుంది. ఏదో పొందటం, మరేదో పొందలేక పోవటం విజయం కాదు. ఏది పొందినా, పొందలేకపోయినా అశాంతిని పొందని మనస్సును కలిగియున్న వారే విశ్వ విజేతలు. అమూల్యమైన సంపదకు యజమానులు.

పట్టాలు తప్పని బండి

కర్మప్రపంచంలో మనము అవిశ్రాంతంగా పరుగులు తీస్తున్నాం. భావప్రపంచంలో మనం చరించగలుగుతున్నామా? ఎంతవరకు చరిస్తున్నాం? ఏ విధంగా చలిస్తున్నాం? భావ పుష్టి లేకుండా కర్మలకు పూర్ణత్వం కలుగదు.

తల్లి బిడ్డకు అన్నం పెట్టడం కర్మ. చేతులు అన్నం పెడుతూ ఉంటాయి. కానీ తన బిడ్డ తృప్తిగా భోంచేయాలని చిత్తము అల్లల్లాడుతూ ఉంటుంది. సరిగ తినకపోతే తల్లి నిరాశతో నలిగిపోతుంది. తృప్తిగా భోంచేస్తే తల్లి ఆనందంతో పరవశించి పోతుంది. కొన్ని సమయాలలో కళ్ళు తడిసిపోతాయి కూడా. ఇది భావజీవనం.

భావశుద్ధి లేకపోతే కర్మలకు విలువ లేదు. వెలుగు లేదు. ప్రేమలేని పలుకులో మాధుర్యముండదు. భక్తి లేని పూజ పత్రిచేటు. సేవ తెలియని కర్మ సత్ఫలితాల నివ్వదు.

పంచదార కలిసినపుడే పిండిలో మాధుర్యం నిండుతుంది. ప్రేమ నిండిన హృదయంతో కర్మ లాచరించడంలోనే బుద్ధి శుద్ధిపడుతుంది. పనివానికి జీతము ఇవ్వడము కర్మ. ఆ ఇచ్చే డబ్బు అతనికి ఉపయోగపడాలని, దాని వినియోగములో అతని జీవితం క్రొత్త వెలుగును సంతరించుకోవాలని భావించగలిగితే అది యజ్ఞకర్మ అవుతుంది.

కూలికి పనిచేయడం, కూలి ఇచ్చి పనిచేయించుకోవడంలోనే బ్రతుకులు కూలిపోతున్నాయి. ప్రేమతో పనిచేయడం, డబ్బుతో పాటు ప్రేమను కూడా పంచడంలోనే జీవితాలు శోభిస్తాయి. సమాజము అభ్యుదయాన్ని చూస్తుంది.

ప్రేమ తెలియని దాంపత్యాలు శుభ్రంగా పిల్లల్ని కనడానికి పనికొస్తాయి. ప్రేమ లోపించిన సేవాకార్యాలు పిచ్చివాడు వీధులు చిమ్మినట్లే ఉంటుంది. వాడు చిమ్మింది, చిమ్ముతున్నది తప్పు అని నేను అనడం లేదు. ఎత్తిపోసిన చెత్తతోపాటు మరికొంత మాలిన్యాన్ని జోడించి తిరిగి వాడు రోడ్డుమీద పడేస్తే, పూచీ నాదిమాత్రం కాదు. ఒకవేళ వీరోచితంగా దానిని తమ పూచీగా ఎవరైనా భావిస్తే, అది వారి విశాల దృక్పథం కావచ్చు. అలాగని అలా భావించినవారిని కూడా ఆ స్థితిలో పిచ్చివాడితో కలిపితే, వారిని తప్పుపడితే మాత్రం అది చాలా సంకుచితంగానే ఉంటుంది.

పువ్వు ఎవరో కాదు, తీగయొక్క నవ్వు. తీగలో దాగిన సౌకుమార్యమే పువ్వులో సౌరభంగా వ్యక్తమైంది. ప్రేమ నిండిన మనసుతో ఆచరిస్తే కర్మలు యజ్ఞస్వరూపాలుగా శోభిస్తాయి.

ఇంట గెలిస్తేనే రచ్చ గెలిచేది. మంట లేకుండా వంట తయారుకాదు. భావశుద్ధి లేకుండా సాగే కర్మలు తాత్కాలికంగా శోభించినా, శాశ్వతంగా మరుగున పడిపోతాయి. మలినపడిపోతాయి.

పేదవాడికి దానం చేయడానికి అలవాటుపడ్డ సమాజం ప్రగతిని చూడలేదు. పేదరికాన్ని నిర్మూలించే ప్రయత్నంలో దానం చేయగలిగిన రోజే సమాజంలో నిత్యకళ్యాణం ఆవిష్కరింపబడుతుంది.

తీర్థ ప్రసాదాల గాలంతో ధన మత్స్యములను చేదుకొనేందుకు అలవాటుపడిన సన్యాసులు ఒక్క జీవితాన్ని కూడా మార్చలేకపోతున్నారు అనే సత్యం అర్థం కానివాడు బుద్ధిహీను డొక్కడే. తాయెత్తులతో, తంత్రాలతో శోభించాలని తపన చెందే సాధువులచుట్టూ అంధకారమే పరిభ్రమిస్తున్నది అనే సత్యాన్ని చూడలేని వాడు అంధుడొక్కడే.

జ్ఞానం కలిగిన సాధువులు ప్రేమతో చేస్తున్న బోధలే సమాజాన్ని ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. ఉన్నత పథంలో నడుపుతున్నాయి. అనుయాయుల్ని సుఖ సంతోషాలలో ఓలలాడిస్తున్నాయి. జ్ఞానమనే ఆహారాన్ని భుజించి, ప్రేమ అనే జలాన్ని పానం చేసి, శాంతి అనే నిద్రలో పవ్వళించిన వారికి అజ్ఞానమనే ఆకలి ఉండదు. అశాంతిని కలిగించే స్వప్నాలు మిగలవు.

ఇంతకీ, నేను చెప్పాలనుకున్నది ఒక్కటే. మనమందరము వ్యక్తి వికాసానికి, సమాజ అభ్యుదయానికి శ్రమిస్తాం. పరిశ్రమిస్తాం. కాని, చేతులు చేతులు నలిపి కాదు; మనసులు మనసులు కలిపి; హృదయాలను హృదయాలతో పెనవేసి.

కర్మలలో ఏకమై బుద్ధిలో భేదించడం నీచం. బుద్ధిలో ఏకమై ఉంటాం. ఒకవేళ కర్మలలో భేదాలు ఉంటే ఉండనీ. వాటిని సరి చేసేందుకు బుద్ధి ఉండనే ఉంది.

మన సేవా శకటానికి ప్రేమయే పెట్రోలు. బుద్ధియే సారధి. ప్రారంభించండి. నేను గాడ్‌ను కాను. గార్డ్‌ను. విజిల్ వేస్తున్నాను. మీరు నడుపుకుపోండి. రైట్.... మనది రైట్‌పాత్. మన బండి పట్టాలు తప్పేది కాదు. మనం పుచ్చుకున్న పట్టాలు ఊడేవికావు; ఓడేవికావు. హాయిగా సాగిపోండి. అందరినీ ఎక్కించుకొని పొండి. నేను మీ వెనుక ఉంటాను. గార్డుగా నిలబడి ఉంటాను. పరిశీలిస్తూ ఉంటాను. అవసరమొస్తే సిద్ధంగా ఉంటాను. అలాగని పరాధీనతకు చోటివ్వకండి. నిన్ను నీవు ఉద్ధరించుకొనే ప్రయత్నమే నీకు సముచితం.

ఏకః ప్రజాయతే జంతుః! ఏక ఏవ ప్రలీయతే!

ఏకోను భుంక్తే సుకృతం!ఏక ఏవ తుదుష్కృతం!

"జీవి ఒంటరిగా పుట్టాడు; ఒంటరిగా మరణిస్తాడు; సత్ఫలితాలను ఒంటరిగా అనుభవిస్తాడు; దుష్ఫలితాలను ఒంటరిగా భరిస్తాడు."

అంతా ఏకమే. బుద్ధిలో కూడా ఏకత్వానికే చోటివ్వు. ఆ తరువాత, ఏకత్వాను భూతిలోనే ఓలలాడుతావు.

స్వీకారం - సమర్పణం

స్వీకరించుట - సమర్పించుట.......... ఈ రెండిటితోనే మన జీవితం నిండి ఉంటుంది. తల్లి పాలు స్వీకరించి బ్రతుకును ప్రారంభించింది మొదలుకొని, దేహాన్ని శ్మశానానికి అర్పించే వరకు మధ్యలో సాగేవన్నీ ఈ రెండే అయి ఉంటాయి. మొదటిది గ్రహించటమయితే, రెండవది అనుగ్రహించటము. సంగ్రహబుద్ధి జీవభావము. అనుగ్రహ బుద్ధి దైవస్వభావము. జీవత్వాన్ని దైవత్వంగా భావించవలసిన మనం సంగ్రహంలో కూడా అనుగ్రహమే ఉండేలాగ, నిండేలాగ ప్రయత్నం కొనసాగించాలి. ప్రవర్తనలో పరివర్తనను దర్శించాలి.

పరుల దుఃఖాన్ని గ్రహించటానికి, అర్హులకు ఉపకారం చేయటానికి బుద్ధి అవగాహనతో సిద్ధపడితే, ఆ క్షణం నుండే సంగ్రహంలో కూడా అనుగ్రహం తొంగి చూస్తూ ఉంటుంది.

ఇతరుల నుండి మనకు అందవలసింది ప్రారబ్ధ ప్రసాదమే కనుక అది అంది తీరుతుంది. మనం అందుకోవలసింది పురుషార్థ ఫలమై ఉంటుంది. దీనిని ప్రయత్నంతో పొందేందుకు నడుం బిగించాలి.

పరుల నుండి గ్రహించేది మనది కాదు. అది పరులకు ఉపకరించేటప్పుడు గ్రహింపవలసిన అవసరమూ లేదు. అది వారివద్దే ఉండొచ్చు. కాని, దుఃఖాన్ని ఎవరూ ఉంచుకోలేకపోతున్నారు. దానితో కలిసి జీవించలేకపోతున్నారు. ఈ ప్రతిబంధకాన్ని తొలగించి, వారి దుఃఖాన్ని గ్రహింపగలిగితే, పరుల బ్రతుకులు తేలికపడతాయి.

అయితే, పరుల ప్రతిబంధకాలను తొలగించి, ఆ తరువాత వాటిని మన ప్రగతికి అవరోధంగా పేర్చుకోకూడదు. ఇదే జరిగితే, మళ్ళీ పరదుఃఖహరమనే ప్రయత్నంలో ముందుకు పోయేందుకు దారి ఉండదు. పరులకు ఉపకరించని దుఃఖం మనకూ హితం కాదు. పరదుఃఖ హరము సముచిత కార్యము. పరదుఃఖానుభవము అనుచిత కార్యము.

దుఃఖమనేది ఒక వస్తువు కాదు. కనుక వస్తువును గ్రహించునట్లు, పరుల దుఃఖాన్ని గ్రహించలేము. దుఃఖమనేది ఆలోచనా విధానము. అదొక ప్రక్రియ. కనుక, అవగాహనతోనే అది తొలగుతుంది. ఈ విధమైన అవగాహనను అందించటంలో, వెలుగులో చీకటి అదృశ్యమైనట్లు, జ్ఞానంలో దుఃఖం దూరమవుతుంది. ఇదే స్వీకరించటం లేదా గ్రహించటం అంటే. వాస్తవానికి ఇక్కడ జరిగింది కూడా గ్రహించటమనే నేపథ్యంలో సాగిన అనుగ్రహమే.

దుఃఖపడే స్వభావ ముండేవారు దుఃఖపడకుండా ఉండలేరు. సంతలో వస్తువుల్ని ఎలా కొంటారో, ఇతరులతో ఏర్పరచుకొనే సంబంధాలలో దుఃఖాన్ని అలా ప్రోగుచేసుకుంటారు. ఇదంతా దురవగాహన. దుఃఖానికి దారి. అవగాహనతో ఈ దారిని మనం మార్చవచ్చు. అలా ప్రతిసారి మార్పు చేస్తూ పోయేందుకు సదా ఎవరు ఎవరికి తోడుగా ఉంటారు? పడకుండా చూచేందుకు సైకిల్ అభ్యసించే వానికి నేర్పించేవాడు తోడుగా పరుగెత్తవచ్చు. అది కొంత కాలమే జరుగుతుంది. తరువాత త్రొక్కేవాడి కాళ్ళే కదలాలి. పరుగెత్తే వాడి కాళ్ళు నిలిచిపోవాలి.

ఇతరుల కన్నీళ్ళు తుడవటం శ్రేయస్కరము. తుడిచేవాడికి రెండే చేతులు. కార్చే వారికి కళ్ళు ఎన్నని? ఎవరి కన్నీటిని వారు తుడుచుకొనేలా చేయగలిగితే, ఆ తరువాత కన్నీళ్ళు కనిపించవు. రోగం వచ్చిన తరువాత నయం చేసుకోవటం ఎంత ప్రధానమో, తిరిగి అది రాకుండా చూసుకోవటం అంత ప్రధానము. ఈ విషయంలో స్వయంకృతమే ముఖ్య భూమికను పోషించాలి.

ఇలా పరుల దుఃఖాన్ని స్వీకరించటం లేదా హరించటం జ్ఞానసంబంధమైన విషయం. జ్ఞానం పరమాత్మ రూపం. పరుల దుఃఖాన్ని పోగొట్టే సమయంలోనే ఈ సత్యాన్ని వారు గ్రహించేలా చూడాలి. ఇది చాలా సునిశితమైన విషయం. మనపై వారు కురిపించే కృతజ్ఞతా వర్షాన్ని మలుపుత్రిప్పి, ఆ ప్రేమ జలంతో పరమాత్మ చరణకమలాలను అర్చించేలా చూడాలి.

ఆ తరువాత దుఃఖమొస్తే, వారు నీ వద్దకు రారు. పరమాత్మ కోవెలకు కదుల్తారు. ప్రార్థిస్తారు. దుఃఖాన్ని దూరం చేయమని అర్థిస్తారు. నీవే శరణ్యమంటూ మొరపెట్టు కొంటారు. ఇంతకీ వారి ప్రార్థనలో ఆసక్తి స్థానం ఎవరిది? ఎవరికి? ఏమిటి?

వారి అనురక్తి లేదా ఆసక్తి లేదా భక్తి - పరమాత్మ మీద ఉందా? దుఃఖము నుండి విడిపడాలనే విషయం మీద ఉందా? పరమాత్మ మీద లేదు. పరమాత్మను వాడుకొనే ప్రయత్నంలో ఉన్నారు. ప్రపంచంలోనే బాధల్ని నివృత్తి చేసుకోవాలని అందరూ తమవంతు ప్రయత్నం లోపంలేకుండా చేస్తారు. అన్ని దారులు మూతపడినపుడు ఆలయం వైపుకు అడుగులు వేస్తారు. ఇదంతా ఆవేదన నుండి బయట పడేందుకు చేస్తారే గాని భగవంతుడు అవసరాలు తీర్చినా, తానుండేది అవసరాలు తీర్చేందుకే కాదని, తానే మనకు ప్రధానంగా అవసరమై యున్నాడని గ్రహించలేరు.

(1) పరుల దుఃఖమును హరించటం శ్రేష్ఠము. **(2)** ఇది కేవలం జ్ఞాన సంబంధమైన విషయం కనుక పరమాత్మను గుర్తించేలా చేయటము శ్రేష్ఠతరము. **(3)** పరమాత్మయే జీవితంలో అవసరమని గుర్తించేలా చూడటము, వాడుకలో సంతసించటం కాకుండా వేడుకలో సంతృప్తి పడేలా అవగాహనను కల్పించటం శ్రేష్ఠ తమము.

మనకు జీవితంలో ఉన్నవి, ప్రాప్తించేవి ప్రారబ్ధ ఫలాలు. ఉన్నవన్నీ మనకొఱకే. కాని, అవేవీ మనవి కావు. ఉన్నవన్నీ ఉమాపతివే. మనది అంతా వినియోగమే. విని ఆ తరువాత శ్రద్ధగా ఆచరించవలసిన యోగమే. కర్మయోగమే.

ఆలయంలో అర్చనానంతరము లభించేది ఏదైనా ప్రసాదమే. అది పువ్వే కావచ్చు. పండే కావచ్చు. మరొక వస్తువు కావచ్చు. ప్రసాదమనేది వస్తువు కాదు. భావన.

ప్రసాదమనే భావన సమర్పణ భావాన్ని ఆవిష్కరిస్తుంది. అందుకనే ఆలయంలో లభించిన ప్రసాదాన్ని అక్కడ మనకు కనిపించే వారితో పంచుకుంటాం. ప్రేమతో వితరణ చేస్తాం. పరమాత్మ ప్రసాదాన్ని పంచుకోకుండా ఆరగించలేము.

ఈ ప్రపంచంలో మనకు లభించేవన్నీ ప్రసాదాలే. అందుకని మనకు సరిపోగా మిగిలిన వాటిని ప్రసాద భావనతో పరులకు వినియోగపడేలా సమర్పిస్తాము. ఇవ్వడము వేరు, సమర్పించటము వేరు.

ఇవ్వటములో ఇచ్చేవాడు, పుచ్చుకొనేవాడు మాత్రమే ఉంటారు. సమర్పణలో మరొక వ్యక్తి ప్రవేశిస్తాడు. అతడే భగవంతుడు. ఆయన ఇచ్చేవాడిలో నిలిచి కర్తృత్వాన్ని లేకుండా చేస్తాడు. పుచ్చుకొనేవాడిలో నిలిచి కర్తృత్వాన్ని, భోక్తృత్వాన్ని లేకుండా చేస్తాడు.

ఇచ్చేందుకు మనం ఈ ప్రపంచానికి ఏమి తెచ్చాము? ఇచ్చే చేతుల్ని తప్ప. అవి కూడా పరమాత్మ కృపతోనే చలిస్తున్నాయి. చేతులు పడిపోయిన వారిని చూచినపుడు ఈ సత్యం మనస్సుకు స్పష్టమవుతుంది.

ఇచ్చేందుకు వస్తువుల్ని, ఇచ్చే చేతుల్ని, ఇవ్వాలనే చిత్తాన్ని అన్నిటినీ పరమాత్మే మనకు అనుగ్రహించాడు. ఇవన్నీ ప్రసాదాలే. వాటిని అలాగే వినియోగించుకోవాలి. ఇదే సమర్పణము.

సంగ్రహ బుద్ధి హృదయాన్ని సంకుచితంగా మార్చుతుంది. మనస్సులో ఘర్షణను సృష్టిస్తుంది. నది తనలోని జలాన్ని పంచుకుంటూ ప్రవహించినట్లు, మనిషి ప్రసాద వితరణలో తృప్తి చెందుతూ సాగిపోవాలి.

ఏదైనా ఇస్తే కర్మ. భక్తితో ఇస్తే కర్మయోగము. కర్మయోగము అంతఃకరణ శుద్ధికి, తద్వారా జ్ఞానానికి సహకరిస్తుంది. సమర్పణ భావము వలన బుద్ధి శుద్ధి పడుతుందా? బుద్ధి శుద్ధి పడిన వారికి సమర్పణ భావం కలుగుతుందా? ఇక్కడ అన్యోన్యాశ్రయత్వమే ఉంది. ఎలాగైనా జరుగవచ్చు. భక్తియే ఇక్కడ కేంద్ర విషయంగా తెలుస్తోంది. భక్తి కొరవడితే ఏదీ జరగదు. భక్తి ఉన్నప్పుడు ఎలాగైనా ప్రారంభం కావచ్చు. పవిత్ర హృదయం సమర్పిస్తుంది. అలా భక్తితో సమర్పించటంలో హృదయం పవిత్రమవుతుంది. భక్తి ఎంత ప్రధానమో భక్తి కార్యము కూడా అంతే ప్రధానము. భక్తి కార్యము ఎంత ప్రధానమో భక్తి భావము అంత ప్రధానము. భక్తి భావము లేకుండా భక్తి చేయటము సాధ్యపడదు.

ఈ జగత్తు ఈశ్వర నియామకము. ఈశ్వరాధీనంలో ఉంది. ఇక్కడ మనకు లభించేదంతా ప్రసాదమే. ఇదంతా జగత్తులోనే పొందాము. జగత్తులోనే విడిచిపెట్టి

వెళ్తాము. ఈ సత్యాన్ని బుద్ధిలో భావించి హృదయాన్ని భక్తి భావనతో నింపుకోవాలి. ఆ తరువాత భక్తితో సమర్పించాలి. ఇదే ఈశ్వరార్పణ బుద్ధి. సమర్పణ అనెడి పవిత్ర కార్యంలో పరమేశ్వరుడు ఏ క్షణాన కూడా మనకు దూరంగా లేడు. ఇదే సమర్పణలో ప్రాప్తిస్తున్న సమత్వము.

శబరి నుండి రాముడు ఫలాలను గ్రహించాడు. మోక్ష ఫలాన్ని అనుగ్రహించాడు. గజేంద్రుని నుండి పువ్వును గ్రహించాడు. బంధ విముక్తిని ప్రసాదించాడు. కుచేలుని నుండి అటుకులను పుచ్చుకున్నాడు. ఐశ్వర్యాలన్నీ ఇచ్చుకున్నాడు. పరమాత్మ గ్రహించాడంటే తిరిగి అనుగ్రహించాడని అర్థము.

భక్తితో మనం సమర్పించినపుడు అందుకొనే దెవరైనా వాస్తవానికి గ్రహించేది పరమాత్మయే. గ్రహించేవాడు పరమాత్మే కనుక మనకు ఆయన అనుగ్రహం తప్పక ప్రాప్తిస్తుంది.

అందుకే నిత్య పూజల్ని నిర్ణయించారు మహాత్ములు. పూజలో ఉన్నదంతా సమర్పణమే. "సమర్పయామి" అనకుండా పూజను సమాప్తి చేయలేము. ఈ సమర్పణమే జీవితంలో అనుక్షణము తొంగి చూస్తూఉంటుంది. కనుక భక్తునికి కర్మలు కూడా పూజలే. పరోక్ష పూజలు. ఇక్కడే పని పూజగా మారుతుంది. **(Work is worship)**

అందుకనే నీవు ఏ పని చేసినా "అర్జునా! **కురుష్వ మదర్పణం**" అని గీతలో భగవానుడు తెలిపాడు. అర్పణ భావంలో కర్త ఉన్నా లేనివాడే. అన్నిటినీ భక్తుడు చేస్తాడు. "**ఈశ్వరస్య భృత్యవత్ అహం కరోమి**" అనే భావనలో ఉంటాడు. సేవకుడు ఆచరించే కర్మలు సేవకుని కొరకు కాదు. యజమాని కొరకు.

ఈశ్వర ప్రీత్యర్థం కర్మలు జరిగేటప్పుడు మన కర్మలలో ఈశ్వరుడే ఉన్నాడు. ఈ సత్యాన్ని అవలోకించే వారిని కర్మలు బంధించవు. అందుచేత కర్మత్యాగము కాకుండా వారిలో ఫలత్యాగము గోచరిస్తూ ఉంటుంది. ఇదే సన్యాసానికి దారి తీస్తుంది. ఆత్మ జ్ఞానంవైపు నడిపిస్తుంది.

దుఃఖ కారణాల విషయంలో జాగ్రత్తగా ఉండగలిగితే, ప్రతిక్షణం సుఖిస్తూనే ఉంటాం. అలాగే, సుఖకారణాలను అన్వేషించకుండా సుఖించగలిగితే, మనమే సుఖమై ఉంటాం. మొదటిది కర్మయోగం వల్ల ప్రాప్తిస్తుంది. రెండవది జ్ఞానయోగం వల్ల సంప్రాప్తిస్తుంది.

కళ్యాణ పథం

భూమి సారవంత మైనపుడే బీజం మొలకెత్తుతుంది. భావన పవిత్రమైనపుడే కర్మకు పూర్ణత్వం సిద్ధిస్తుంది. హృదయం శుద్ధిపడినపుడే భక్తిజ్ఞానాలు శోభిస్తాయి. ప్రేరణ కలిగితేనే హృదయం స్పందిస్తుంది.

నేటి సమాజంలో అందరికీ ప్రేరణ కావాలి. జీవిత లక్ష్యానికి సంబంధించిన అవగాహన ఏర్పడాలి. కానీ ప్రేరేపించే వ్యక్తులు బాగా తగ్గిపోయారు.

చేపలు లేని సరస్సు శుభ్రంగా ఉండలేదు. స్ఫూర్తినిచ్చే వ్యక్తులు లేని సమాజం పవిత్రతకు నోచుకోదు.

నిశ్చలంగా ఉన్న నీటిపై గాలి వీచినపుడు అల కదులుతుంది. దాని చలనానికి మరొక అల కదుల్తుంది. అది తిరిగి మరొక అలను కదిలిస్తుంది. ఇలా ఒకదాని తరువాత మరొకటి కదులుతూ తీరాన్ని చేరడం జరుగుతుంది. దీనినే **వీచీ తరంగ న్యాయము** అంటారు. ఈ న్యాయాన్ని అనుసరించకపోతే నేటి సమాజమును అన్యాయం నుండి రక్షించడం కష్టం. అధర్మం నుండి మరలించడం దుస్సాధ్యం.

వెలిగే దీపము మరొక దీపాన్ని వెలిగించినట్లు పవిత్ర జీవనానికి నోచుకున్న పుణ్యాత్ములు మరి కొందరిని పవిత్రులుగా మార్చాలి. సంతృప్తి చెందిన వారు మరికొందరికి తృప్తిని పంచే కార్యంలో నిమగ్నం కావాలి.

అందము ఉంది. విద్య ఉంది. ఆర్థిక సంపద పుష్కలంగా ఉంది. పేరు ప్రఖ్యాతులు ఉన్నాయి. ఆయుషు లేకపోతే అన్నీ ఉండి ఏమి ప్రయోజనం?

ఆయుర్దాయానికి వ్యయమే గాని ఆదాయం తెలియదు. నదిలో ముందుకు పోయిన నీరు వెనుకకు మరలిరాదు. గతించిన ఆయుషు తిరిగి ప్రభవించదు.

ఉన్నంతలో ఉన్నతిని సాధించాలి. భావాలతో బ్రతుకును భవ్యంగా దిద్దుకోవాలి.

పరమాత్మ కొరకు మనం కనీసం పది నిముషాలైనా వెచ్చిస్తున్నామా? ఎంతసేపు ధ్యానిస్తున్నాం? ఎంత కాలం పూజిస్తున్నాం? ఎంత సమయం అధ్యయనానికి ఉపయోగిస్తున్నాం? ఏదో జరిగిపోతోంది. అదోలా నడచిపోతోంది. అంతా మారిపోతోంది. ఆయుషు కారిపోతోంది.

బ్రతుకును ప్రతిక్షణము భగవన్మయం చేసుకోవాలి. **"వీచీ తరంగ న్యాయము"**ను జీవితంలో ధ్యేయంగా పెట్టుకోవాలి.

ఆధ్యాత్మిక భావాలతో మీరు కొందరి హృదయాల్ని స్పృశించాలి. మీద్వారా కూడా మరి కొందరు ముముక్షువులు కావాలి. మీరు ఎలా స్ఫూర్తిని పొందారో వారికి తెలుపండి. మీ వద్ద ఉన్న పుస్తకాలను వారిచేత చదివించండి. తల్లి బిడ్డకు ఉగ్గుపాలను

పట్టించినట్లు ప్రేమతో వారి మనసులకు తాత్త్విక భావాలను పట్టించండి. ప్రయత్న శీలురకు ఈ ప్రపంచంలో అసాధ్యమంటూ ఏదీ లేదు. ఇది సత్యం. సత్యం. ముమ్మాటికీ సత్యం. ఇది నా ఆలోచన కాదు. అనుభవం.

చుట్టూ ఏవేవో ఉంటాయి. వాటిని పట్టించుకోకండి. అవన్నీ కాలప్రవాహంలో కొట్టుకుపోయే కల్మషాలు. కనుమరుగయ్యే కశ్మలాలు. మనది నిలిచి వెలిగే దీపం. మనసును మలచి, బుద్ధిని ఒలిచి, జీవితాన్ని జ్వలింపచేసే జ్ఞానదీపం.

పట్టుకొని నడవండి. పట్టుపట్టండి. ప్రగతిని ఆవిష్కరించిన వారుగా వెలిగిపోండి.

అన్నీ మనం చేయలేము. కానీ, మనం చేసేవన్నీ పరమాత్మను తృప్తి పరచేవిగా ఉండాలి.

మయి సర్వాణి కర్మాణి నాహం కర్తేతి సన్యస్య స్వతంత్రః
పరమేశ్వర ఏవ సర్వకర్తా నాహం కశ్చిద్ ఇతి నిశ్చిత్య

"నేను కర్తను కాను అని భావించి, సమస్త కర్మములను పరమాత్మకు సమర్పించాలి. సర్వమునకు కర్త పరమాత్మ అని భావించి జీవించాలి" అన్నాడు అభినవ గుప్తుడు.

ఈ భావన గుప్తంగా మనలో ఉండిపోవాలి. ఇదియే గుప్తధనం. అవసరాలను తీర్చేది, ఆనందాన్ని ఇచ్చేది ఇదే.

ఇది బంగారు బాట. భగవంతుని బాట.

పవిత్రమైన ఈ బాటలో మంచిమాటలే పరుపుల మూటలు.

మెత్తని బాటలో మెల్లగా నడవండి.

> మెచ్చిన దానిలో లేని సౌందర్యాన్ని చూడటం, నచ్చని దానిలో ఉన్న సౌందర్యాన్ని కూడా చూడలేకపోవటం ఎక్కువమందిలో స్వభావంగా గోచరిస్తూ ఉంటుంది. మొదటిది శోభనాధ్యాస కాగా, రెండవది అశోభనాధ్యాస. బ్రతుకులో శోభించాలి అనుకొనేవారికి, సుఖశాంతులతో జీవించాలని అభిప్రాయపడే వారికి ఈ రెండూ మంచివి కావు. ఉన్నదానిని ఉన్నట్లు గ్రహించువారే ఉన్నతిని సాధిస్తారు.

ఆరని వెలుగు *

నదిలో ముంచితే కుండ నిండుతుంది. సాధనలో మునిగితే మనిషి మనసు నిండుతుంది. ఆనందంతో నిండుతుంది. ప్రశాంతతలో పండుతుంది. కుండని నదిలో ముంచి పైకి తీస్తే కుండ నిండలేదనుకోండి, ఎక్కడో దోషముందని అర్థం. సాధనలో మునుగుతూ ఉండినా మనిషి సంతృప్తి చెందలేదనుకోండి ఎక్కడో లోపముందని అర్థం. లోపాలు, దోషాలు జీవితంలో ఉండటం అవరోధాలే కావచ్చు కాని అనివార్యాలు మాత్రం కావు. ఏదో జరుగుతుందని, ఎప్పుడో జరుగుతుందని నిరీక్షిస్తూ ఉండటం జీవితంలో అంత మంచిది కాదేమో అని భావించే వాళ్ళలో నేను ప్రథముణ్ణి. అంటే నిరీక్షించడం తప్పు అని నా అభిప్రాయం కాదు. వేచి ఉండటం దోషం అని నేననుకోవడం లేదు. పువ్వు అయ్యేంత వరకు మొగ్గ నిరీక్షించాలి. వర్షించే సమయం వచ్చే వరకు మేఘం నిరీక్షించాలి. నిరీక్షించడంలో తప్పులేదు. కానీ, ఎంతకాలం వేచిఉన్నా మొగ్గ వికసించనప్పుడు, ఎంత సమయం నిరీక్షించినా మేఘం వర్షించనప్పుడు ఆ రెండూ జీవితంలో ఓడిపోయాయేమో అనుకోవడంలో తప్పులేదు. కనుక సాధనలో మనం ఏది చేసినా, ఏది చూసినా సత్ఫలితాన్ని అందుకోలేకపోతే మాత్రం, వాటికి మనకు పెద్ద తేడా ఏమీ ఉండదు. మొగ్గలు వికసించకపోయినా, మేఘాలు వర్షించక పోయినా దోషం లేదు, కానీ మనోబుద్ధులున్న మానవుడు వాటిలాగే నిరీక్షిస్తూ ప్రతిఫలాన్ని అందుకోలేకపోతే మాత్రం చాలా దురదృష్టకరంగా జీవితం మారిపోతుంది. కనుక నేనేం చేయాలి? ఎలా చేయాలి? వీటి విషయంలో మనకొక పూర్ణమైన అవగాహన కావాలి. నేనున్న స్థితిలో పరమాత్మ చూస్తే ఎలా చూస్తాడు? నేనున్న స్థితిలో పరమాత్మ చేస్తే ఎలా చేస్తాడు? అనేది మనసులో పెట్టుకొని దానికి అనుగుణంగా మనం జీవించగలిగితే జీవితం ఏదో అయిపోతుంది. ఆ యేదో అయిపోయిన జీవితం మనకు యేదో అనూహ్యమైన ఫలితాన్ని, అమృతఫలాల్ని అందిస్తుంది.

'పరమాత్మ నా స్థితిలో ఉంటే ఏం చేస్తాడు? ఏం చూస్తాడు? ఎలా చేస్తాడు?' మన ఆలోచనలు ఇలా నడవాలి. కానీ మనం ఆలోచించేది, 'నేనెట్లా చూస్తాను?' అని. అలా ఆలోచించేది కూడా మనసే. మనస్సు ఎంత ఆలోచించినా దానికి మించి అది చూడలేదు. వ్యక్తి తన మనస్సులో ఏదైతే ఉందో దాన్నే చూస్తాడు కాని దానికి మించి చూసే అవకాశం లేదు. ఇక్కడే శాస్త్రం మనకు ఉపకరిస్తూ ఉంది. పరమాత్మయొక్క దివ్యమైన దృష్టి ఎలా ఉంటుందో, మనస్సు అందుకోలేని ఆ స్థితిని శాస్త్రం మన ముందు పరిచేస్తూ ఉంది. వెన్నెలలాగా ఆరబోస్తూ ఉంది.

'పరమాత్మ నా స్థానంలో ఉంటే ఎలా చూస్తాడు?' అనే ప్రశ్న వేసుకున్నప్పుడు ఒకే సమాధానం వస్తూ ఉంది. ఏమిటది అంటే, ఎలా అయినా చూడనీ, ఏదో లేకుండా చూస్తాడు. నా చూపులో ఉండేది ఏదో అది ఆయన చూపులో ఉండదు. ఏది ఉండటం వల్ల నా చూపులో దోషం తలెత్తుతూ ఉందో, లోపం తలెత్తుతూ ఉందో, ఒక అస్పష్టత గోచరిస్తూ ఉందో, ఏది ఉండటం వల్ల నా చూపులో ఇతరులు గూడా తృప్తి చెందలేక పోతున్నారో, నా చూపులో నేను నాకెలా అవరోధ మౌతూఉన్నానో, ఇతరులకు నాకూ మధ్య ఒక అగాధాన్ని ఎలా సృష్టిస్తూ ఉన్నానో - ఇవన్నీ ఉండవేమో! ఎందుకని? నాచూపులో ఉన్నది పరమాత్మ చూపులో ఉండదు. ఏమిటది? రాగద్వేషాలు. కనుక ఈ ప్రపంచాన్ని పరమాత్మ చూస్తే ఎలా చూస్తాడు? రాగద్వేషాలు లేకుండా చూస్తాడు. అదొక్కటి మనమూ చేయగలిగిన రోజు మనం ప్రపంచంలో ఎటున్నా ఫరవాలేదు, ఏంచేసినా ఫరవాలేదు, ఎక్కడ తిరిగినా ఫరవాలేదు, ఎలా ఉన్నా ఫరవాలేదు.

"రాగద్వేష వియుక్తైస్తు విషయాన్ ఇంద్రియైశ్చరన్
ఆత్మవశ్యై ర్విధేయాత్మా ప్రసాద మధిగచ్ఛతి"

"రాగద్వేషాల నుంచి పూర్ణంగా విడిపడిన వాడు ఈ బాహ్య విషయాల్లో చరిస్తూ ఉండినా తనను తాను నిగ్రహించుకొని, తన మనస్సును అధీనంలో ఉంచుకొని ఉన్నాడు కనుక ప్రశాంతతను పొందుతూ ఉన్నాడు" అన్నది భగవద్గీత. ఈ రాగద్వేషాలు మన జీవితాలనే కాకుండా ఇతరుల జీవితాలను కూడా పాడుచేస్తూ ఉన్నాయి. మనకే కాకుండా ప్రపంచంలో అందరికీ గుండె బరువుగా తయారౌతూ ఉన్నాయి. ఎవరికీ సుఖం లేకుండా చేస్తూ ఉన్నాయి. వీటివల్ల సాధించేది ఏమీలేదు. వీటియొక్క కోణం ఏవైపు తిరుగుతూ ఉందో చెప్పలేము. శాస్త్రం దగ్గరకు వెళ్ళినా ఈ రాగద్వేషాలే అడ్డుపడుతూ ఉన్నాయి. ఇదొక దురదృష్టకరమైన విషయం. గురువు చెప్పే జ్ఞానాన్ని అర్థం చేసుకోవడానికి కూడా ఈ రాగద్వేషాలే అడ్డుపడుతూ ఉన్నాయి. ఎంతోకాలంగా ప్రేమించిన వ్యక్తిని ద్వేషించడానికి, ఎంతో కాలంగా పెనవేసుకొని ఉన్న బంధాలను ఒక్కసారిగా విడగొట్టుకోవటానికి ఈ రాగద్వేషాలే కారణమౌతూఉన్నాయి.

"దృశ్యంతే హి పురుషాః రాగాది గౌరవాత్ శాస్త్రం అతిక్రామంతః" అంటారు శ్రీశంకరాచార్యుల వారు భాష్యంలో. కాబట్టి ఈ రాగద్వేషాల వల్ల వ్యక్తి ఎంతవరకు పోతూ ఉన్నాడు? **శాస్త్రం అతిక్రామంతః** శాస్త్రాన్ని గూడా ధిక్కరిస్తూ ఉన్నాడు. **'గురూనపి ధిక్కరోతి'** గురువును కూడా ధిక్కరిస్తూ ఉన్నాడు. **'దేవానపి ధిక్కరోతి'** - దేవతలను కూడా ధిక్కరిస్తూ ఉన్నాడు. కారణమేమిటి? తనలోని రాగద్వేషాలే. భగవంతుడు లేడు అనే నాస్తికుడికి ఏమిటి ఆధారం? వాడి మనస్సే! శాస్త్రమా? కానేకాదు. గురువును ధిక్కరించే వాని మనస్సులో ఉండేదేంటి? రాగద్వేషాలే. ఇంతకు మించి ఇంకేమి ఉన్నాయి?

ఎంత విలువైనదాని నైనా పోగొట్టుకోవడం చాలా తేలిక. ఆ పోగొట్టుకొన్న దానిని తిరిగి పొందుతామో లేదో! జీవితంలో ప్రతిక్షణం పోగొట్టుకోవటానికే అలవాటు పడితే రాబట్టుకొనే రోజులు ఎప్పుడుంటాయో చెప్పలేము. కాబట్టి 'నా పరిస్థితులలో పరమాత్మ ఉంటే జీవితాన్ని ఎలా చూస్తాడు? ప్రపంచాన్ని ఎలా చూస్తాడు?' రాగద్వేషాలు లేకుండా చూస్తాడు.

* (ఏప్రియల్ 25వ తేది సాయంత్రం హైదరాబాద్ ఆశ్రమంలో పూజ్య స్వామీజీ ప్రసంగాన్ని టేపు నుండి గ్రహించి అందిస్తున్నాము)

భగవంతుడు ఎలా చూస్తాడు? అనే మొదటి ప్రశ్నకు రాగద్వేషాలు లేకుండా చూస్తాడు అని సమాధానం అందింది. భగవంతుడు ఏం చేస్తాడు? అనే రెండవ ప్రశ్నకు 'లోక కళ్యాణం చేస్తాడు' అనేదే సమాధానం. వ్యక్తి కళ్యాణమా? లేక లోకకళ్యాణమా? ఏమో! నా పరిస్థితులలో గనుక పరమాత్మ ఉంటే వ్యక్తిగా తనను తాను ఎప్పుడూ వేరు చేసుకొనే ప్రయత్నం చేయడు. అలా చేసినరోజు తాను పరమాత్మ కాలేడు. రాగద్వేషాలు వ్యక్తిగతమైనవి. రాగద్వేషాలున్న జీవితం కూడా వ్యక్తిగతమైనది. ఇది మనం చాలా లోతుగా వెళ్ళి అర్థం చేసుకోవలసిన విషయం. మన సంస్కృతిలో 'వ్యక్తిగతం' అనేది అసలు ఊహించలేని విషయం.

'సూత్రేమణిగణా ఇవ' - ఒకే దారంలో మణులలాగా మనమందరం ముడిపడి ఉన్నాము. కాబట్టి అందరికీ జీవితం ఉంది. అందరి జీవితం ఒకే విధంగా ఉంది. జీవితం ఒక్కటే, చైతన్యం ఒక్కటే. దీనిని ముక్కలు ముక్కలుగా విడదీయలేము. పరమాత్మ ఎప్పుడూ ఈ సత్యానికి దూరంగా పోలేడు. దూరంగా పోయేవాడు పరమాత్మ కాలేడు. అందువల్ల ఏం చేసినా లోకకళ్యాణమే చేస్తాడు. కాబట్టి రాగద్వేషాలు లేనివాడు కనుక పరమాత్మ లోకకళ్యాణమే చేస్తాడు. మరి నేను చేసే వాటిలో అది జరుగుతూ ఉందా? దీనికి ధనం కావాలి, పలుకుబడి కావాలి, జనం కావాలి అని మీరనుకోవచ్చు. అవేవి అవసరం లేదు. **"సర్వేజనాః సుఖినో భవంతు"** అని దణ్ణం పెట్టడానికి ఏమి అవసరం? ఒక్కసారి పరమాత్మ ముందు నిలబడి అందరూ సుఖంగా ఉండాలి అని కోరుకోవడానికి ఏమి ఖర్చౌతుంది? దీనికి కావలసింది డబ్బు కాదు. మనస్సు. పరమాత్మ ముందు మనం దీపం వెలిగిస్తూ ఉంటే ఏం జరుగుతూ ఉందో తెలుసా? మనం వెలిగించే దీపం పరమాత్మకు అవసరం లేదు. కానీ అలా వెలిగించడంలో మనకు తెలియకుండానే మన హృదయంలో ఉన్న చీకట్లు దూరమౌతూ ఉన్నాయి. హృదయంలో ఒక దివ్యమైన వెలుగు వెలుగుతూ ఉంది. కాని ఈ సత్యాన్ని గుర్తించడానికి మనం కొద్దిగా పెరగవలసిన అవసరం ఉంది.

మనం చేసే ఆలోచనల వలన, పనుల వలన లోకకళ్యాణం జరుగుతూ ఉందా? అని ఆలోచించుకుంటూ పోవాలి. లోక కళ్యాణం జరిగితేనే వ్యక్తి కళ్యాణం. కారణం, వ్యక్తి లోకంకన్నా భిన్నంగా లేడు. పదిమందిని హింసించి ఒక వ్యక్తి సుఖపడలేడు. పదిమందిని బాధపెట్టి ఒక వ్యక్తి ఆనందంగా ఉండలేడు. పదిమందిని సుఖపెట్టడానికి కావలసిన మానసిక వనరులు వ్యక్తి దగ్గర ఉన్నాయి. కావలసింది సంస్కారం మాత్రమే. లేనిదానిని తయారు చేసుకోవచ్చు. తప్పులేదు. జీవితంలో లేని అలవాట్లను చాలా చేసుకొని ఉన్నాము. పుట్టుకతో అవన్నీ రాలేదు మనకు. సిగరెట్లు తాగడమనేది పుట్టినపుడు ఏ బిడ్డకు తెలుసు? మధ్యలో తయారు చేసుకున్నాడు. పుట్టగానే సినిమాకు పోవాలని ఎవరు అభిప్రాయపడ్డారు? హత్యలు చెయ్యాలని ఎవరనుకున్నారు? ఇవన్నీ వ్యక్తి మధ్యలో తయారు చేసుకున్నాడు. బరువులు నెత్తి కెక్కించుకోవడం చాలా తేలిక. కానీ జీవితాంతం వాటిని మోయడం చాలా కష్టం. కాబట్టి సంస్కారాన్ని సరిదిద్దుకునే కార్యక్రమాన్ని మనం చేపట్టాలి. 'నేను చూస్తున్నటువంటి చూపులో లోకకళ్యాణం ఉందా? పరమాత్మ లాగా నేనూ చూడగలుగుతున్నానా? నా కళ్ళలో గనుక పరమాత్మ కళ్ళు మిళితమైతే ప్రపంచాన్ని ఇలాగే చూస్తానా?' అని ఆలోచించాలి. కాబట్టి రాగద్వేషాలు లేకుండా ప్రపంచాన్ని చూడాలి. ఏం చేసినా లోకకళ్యాణం దృష్టిలో ఉంచుకొనే చేయాలి.

మన దేహం ద్వారా చేసే కాయక కర్మలో గాని, వాచక కర్మలో గాని, మానస కర్మలో గాని - ఎక్కడైనా సరే పరమాత్మ దేహం గనుక కదిలితే ఇలా కదులుతుందేమో, ఆయన వాక్కు మాట్లాడితే ఇలా మాట్లాడుతుందేమో, ఆయన మనస్సు ఆలోచిస్తే ఇలా ఆలోచిస్తుందేమో, అది నాలో ఆవిష్కరింపబడాలి అనే ఒక దివ్యమైన స్థితిని తయారు చేసుకున్నప్పుడే మనలో సాధన కదిలిందని అర్థం. లేకపోతే వర్షించని మేఘంలాగా, వికసించని మొగ్గలాగా జీవితం మిగిలి ఉందని అర్థం.

ఇటువంటి నిరీక్షణ సత్ఫలితాన్ని ఇస్తుందని నే ననుకోవడం లేదు. నేను చాలా బరువైన గుండెతో ఈ విషయం చెబుతూ ఉన్నాను. చాలామంది జీవితాలను చూచిన తరువాత వీటికిది పరిష్కారం కాదు అని చెబుతున్నాను. శాస్త్రానికి, సత్యానికి చాలా దూరంగా పోతూ ఉంది జీవితం. అలా దూరంగా ఎవరి జీవితాలను వారు తీసుకుపోవడానికి ఎవరూ ఎవరికీ అడ్డులేరు. కానీ బాధలు వస్తే మాత్రం, గడ్డు సమస్యలు జీవితంలో ఎదురైతే మాత్రం మనమే భరించాలి గాని వాటిని ఇంకొకరు మోసే అవకాశం ఉండదు.

కాబట్టి ఎప్పుడూ పరమాత్మలాగానే మనం చూడటానికి ప్రయత్నించాలి. ఉన్నదానిని ఉన్నట్లుగా చూస్తూ, యదార్థాన్ని గ్రహిస్తూ పోవడంలోనే సుఖం.

ఎంతమంది దుఃఖపడినా సరే నేనొక్కడిని సుఖపడితే చాలు; అనుకోవడం తప్పు. దాని ఫలితమేమిటో తెలుసా? ఆ ఒక్క వ్యక్తే దుఃఖపడేది. నేను సుఖపడడానికి మీరంతా దుఃఖపడ్డా ఫరవాలేదు అని ఈ రోజు నే ననుకుంటే రేపు దుఃఖమంతా నాదే అయి ఉంటుంది. ఇది జీవనసత్యం. ఇది కాలంలో తెలుస్తుంది. ఇప్పుడు తెలియదు. అందువల్ల లోకకళ్యాణంలోనే నా కళ్యాణముంది అనేది గుర్తించి లోకళ్యాణార్థం మన ఆలోచనలు, మాటలు, కర్మలు నడుస్తూ ఉండటం - ఇది ప్రధానమైనటువంటి విషయం:

ఇక మూడవ ప్రశ్న: నా స్థితిలో పరమాత్మ ఉంటే కర్మలు ఎలా చేస్తాడు? నేను, మీరు కూడా చాలా కార్యక్రమాలు చేస్తూ ఉన్నాము. నాతో పరమాత్మ గనుక చేయి కలిపితే, ఒక చేయి పరమాత్మది, ఒక చేయి నాదయితే, నా కార్యక్రమాలు ఎలా ఉంటాయో! ఎలా చేస్తాడో! చెప్పనా? ఎవ్వరినీ నొప్పించకుండా చేస్తాడు. కాయక, వాచక, మానస కర్మలలో పరమాత్మ ఎవ్వరిని నొప్పించడు కనుక, నేను కూడా నొప్పించకుండా ఉన్నానా లేదా? అని చూసుకోవడం అవసరం. నేను లోక కళ్యాణార్థం కర్మలు చేస్తూ ఉండినా ఇతరులను నొప్పించడమే గనుక తప్పనిసరి అయితే ఆ కర్మలు వదిలివేయడం మంచిది.

మన సేవల్లో ఎవరైనా దుఃఖపడేటట్లైతే, మన నిత్య జీవితంలో ఎవరైనా కష్టపడేటట్లైతే, మన ఆలోచనల్లో, మాటల్లో, చేతల్లో ఇతరుల హృదయాలు భగ్నపడే టట్లైతే అవి సత్కర్మల క్రిందికి రావు. పరమాత్మ చేసే కర్మలు కావవి. ఎందుకని? నొప్పించే పరిస్థితి పరమాత్మ ఎప్పుడూ కల్పించడు. తాను చేసే పనులు ఇతరులను నొప్పించకుండా చేస్తాడు.

ఇక చివరి ప్రశ్న: ఇవన్నీ చేసిన తరువాత పరమాత్మ ఎలా ఉంటాడు? అనంతమైన సహనంతో ఉంటాడు. నేను మంచి చేస్తూ ఉన్నా చెడు ఎదురౌతూ ఉంటుంది. కష్టాలు పడటానికి ఈ జీవితంలో తప్పులు చేయనక్కరలేదు. కానీ అవిమాత్రం ఒకప్పుడు చేసిన తప్పులే అయి ఉంటాయి. "ఈ రోజు నేను ఏ తప్పు చేయలేదండీ, నాకీ విధమైన కష్టం వచ్చింది, ఇది భరించలేని బాధ, నాకు రాదగింది కాదు, నా జీవితం అలాంటిది కాదు;" అంటూ ఉంటాము. నిజమే కావచ్చు. కాగడా పెట్టి వెతికినా ఎక్కడా దోషం కనిపించదు ఈరోజు. కానీ రాగూడని కష్టమే అయితే ఎందుకొస్తుంది? పరమాత్మ చట్టా లేమైపోయాయి? వాటి నెవరైన మార్పు చేశారా? అనవసరమైన ఫలితాలను ఇచ్చే శక్తి ఏదైనా ఉందా ప్రపంచంలో పరమాత్మ కన్నా భిన్నంగా? కాబట్టి రాగూడనిది ఎప్పుడూ రాదు. రాదగింది గనుకనే వచ్చింది. దానికి కారణాలు దగ్గరలో నాకు గోచరించక పోవచ్చు. కానీ చాలా దూరంగా నేనూహించలేని రీతుల్లో ఉన్నాయేమో! ఏ జన్మలో చేశానో! ఆ జన్మాంతర రహస్యాలను పరిమితమైన నా మనస్సు పట్టుకోలేదు. ఆ పుటల్లోకి వెళ్ళి వాటిని ఒలిచి ఒలిచి నా మనస్సు చూడలేదు. వాటిలో ఏవి నిగూఢంగా దాగి ఉన్నాయో నా బుద్ధికి అర్థమయ్యే అవకాశం లేదు. నా ముందు ఈరోజు ఫలితాలే ఉన్నాయి. ఈ ఫలితాలు పరమాత్మ యొక్క చట్టాలే. ఆయన అనుజ్ఞతో వచ్చినవే గనుక శిరసా, మనసా, వాచా వాటిని అంగీకరిస్తూ ఉన్నాను. భగవాన్! నీ ఆజ్ఞ లేకుండా ఏ ఫలితమూ రాదు. ఇది నేను భరించలేనిది. దుర్భరమైనది. కష్టమైనది. కాని ఇది నాకు అందుతున్నప్పుడు కూడా నీవే ఉన్నావు. ధర్మరూపంలో ఉండేవాడివి నువ్వే. కర్మల యొక్క ఫలితాలు ధర్మాలే. ఏ ధర్మాన్ని ఆధారం చేసుకొని ఈ కర్మకు ఫలితం వచ్చిందో ఆ ధర్మం కొనసాగే సమయంలో ధర్మరూపంలో ఉండేది నువ్వే. **(రామో విగ్రహవాన్ ధర్మః).** ధర్మానికి దూరంగా నేను పరుగెత్తలేను. నీ ధర్మం ముందు శిరసావహించడం కన్నా నేను చేయదగింది ఏదీ లేదు. ఫలితం నువ్విచ్చేది. నువ్విచ్చే ఫలితం నాకు ప్రసాదం. నువ్వందించేది నాకు దుఃఖమెట్లా అవుతుంది? కాబట్టి ఇది ప్రసాదం. దీనిని నేను మనస్ఫూర్తిగా అంగీకరిస్తున్నాను. అనంత సహనంతో అంగీకరిస్తున్నాను. దుర్భేద్యమైనా, దుర్భరమైనా భరిస్తాను. కష్టాలు ఎవరికి రాలేదు? ఏ దోషం చేశారని పాండవులు అరణ్యానికి వెళ్ళవలసి వచ్చింది? విషాన్ని మింగి మడుగులోకి భీముడు పడటానికి కారణం ఏమిటి? దుర్యోధనుడు తయారు చేసినటువంటి పథకమే కదూ? అది భీముడికేం తెలుసు? అలా ముందుగా ఊహించ డానికి అనువుగాని దానినే జీవితమంటారు. కేవలం నా ఊహలే కాదు. నా జీవితంలోని కర్మఫలాలు కూడా నన్ను ముడి వేసుకొని ఉన్నాయి. గత జన్మల్లో ఆచరించిన కర్మలు, వాటియొక్క ఫలితాలన్నీ పెనవేసుకొని ఉన్నాయి.

నా ప్రయత్నం మాత్రమే నాకు తెలుసు. ఫలితాలు నాకు తెలియడం లేదు. అందువల్ల ప్రాణ సమానంగా ప్రేమించిన భార్య బాధపెడుతూ ఉంది. ఒకప్పుడు గాఢంగా ప్రేమించిన భర్త నేడు తీవ్రంగా బాధపెడుతూ ఉన్నాడు. కడుపున పుట్టిన బిడ్డలు కర్కశంగా హింసిస్తూ ఉన్నారు. ఎవరి కడుపున మనము పుట్టామో వాళ్ళను మనం కష్టపెడుతూ ఉన్నాము. స్నేహితులనుకున్న వారు బాధపెడుతూ ఉన్నారు. గురువులు బాధపెడుతూ ఉన్నారు. శిష్యులు బాధపెడుతూ ఉన్నారు. ఏమిటిదంతా? దేనికొరకు ఇవన్నీ? ఇవన్నీ ఉండేది బాధ పడడానికి కాదు; బోధపడేలా మననుకు ఎక్కించుకోవటానికి, అర్థం చేసుకోవడానికి. ఆవేదన చెందడానికి కాదు. ఆవేదన చెంది సాధించేదేమీలేదు. కనుక పరమాత్మా! నీలాగా నేను చూడాలి. నువ్వు చేసినట్లుగా నేను కర్మలు చెయ్యాలి. నువ్వున్నట్లుగా నేనుండాలి. ఈ స్థితంతా నాకు ప్రసాదించు. రాగద్వేషాలు లేకుండా చూసే శక్తిని నా కివ్వు. ఆ విషయంలో నన్నుత్తీర్ణుణ్ణి కానీ. నానుంచి కదిలే ప్రతి కర్మ, ప్రతి వాక్కు, ప్రతి ఆలోచన లోకకళ్యాణార్థం సాగేలా నన్నాశీర్వదించు. ఎందుకని? వ్యక్తిగత జీవితం నాకు లేదు. ఇంకొక దానితో ముడిపడి ఉండకుండా నా జీవితం లేనే లేదు. సన్యాసం పుచ్చుకుంటే ఇప్పుడర్థమౌతూ ఉంది. వదిలింది ఏమిటో. ఈ రోజు ఎంతమందితో ముడిపడి ఉన్నాం? స్వామీజీ! స్వామీజీ! స్వామీజీ! అంటూ ఎంతమంది తిరుగుతూ ఉన్నారు? తొలగించుకున్నది ఎంతమందిని? తగిలించుకున్నది ఎంతమందిని? తొలగించుకున్నది ఐదుమందినో లేక పదిమందినో అయితే తగిలించుకున్నది లక్షలనా? చిన్న చిన్న సంసారాల్లోనే అల్లాడిపోతూ ఉంటే ఇంత పెద్ద సంసారంలో సుఖపడే అవకాశం ఉన్నదా? "భగవాన్! నీ చూపు నాకు రాకపోతే, నీలాగా నేను జీవించలేకపోతే నేను సుఖపడలేను. ఎవరి జీవితమైనా ఇంతే. ఆశ్రమమేముంది గోడలు కట్టుకోవటం తప్ప! ఆశ్రమాల్లో ఉండటమేమిటి, పెట్టెలు సర్దుకొని రావడం తప్ప! కానీ, ఆశ్రమంలో జీవించడమంటే ఒక క్రమశిక్షణకు అలవాటుపడాలి. మనస్సుకొచ్చిన ఆలోచనలన్నీ ఆచరిస్తూపోతే అది ఆశ్రమం కాదు. నోటికొచ్చిందంతా మాట్లాడుతూ ఉంటే అది సంతగోల అవుతుంది. నా ఇష్టప్రకారం నేను చరిస్తూ ఉంటే అది వ్యక్తిగత జీవితమవుతుంది. కాబట్టి ఆశ్రమంలో ఉన్నంత మాత్రాన సరికాదు. ఆశ్రమ జీవనం మనస్సుకు పట్టాలి. కాషాయం వేసుకుంటే కాదు. కాషాయ రంగు మనస్సుకు పట్టాలి, బుద్ధికి పట్టాలి. ఇవన్నీ వంటపట్టిన నాడు ఇళ్ళల్లో ఉండినా నష్టం లేదు. **'నివృత్తి రాగస్య గృహం తపోవనం'**. ఎవరి మనస్సులో అయితే రాగద్వేషాలు ఎగిరిపోయాయో వాళ్ళు ఉండే ఇళ్ళు ఇళ్ళుకావు. వాళ్ళు ఉండే గృహాలు గృహాలు కావు. అవి శాంతినిలయాలు, తపోవనాలు. రాగద్వేషాలు హృదయంలో ఎగిరిపోయినవారు గృహస్థాశ్రమంలో ఉన్నా వారుండేది సన్యాసాశ్రమమే. ఎందుకని? సన్యాసం అంటే వదలటం. వదలవలసింది రాగద్వేషాల్ని. సన్యాసి వాటిని వదిలిపెట్టినవాడై ఉండాలి. ఇటువంటి పరిస్థితిని నాకు కల్పించు భగవాన్! రాగద్వేషాలు లేకుండా నీలాగా చూసే శక్తిని నాకివ్వు - ఇది మొదటి విషయం.

లోకకళ్యాణార్థం కర్మలు జరగనీ - ఇది రెండవవిషయం. ఇంట్లోగానీ బయటగానీ ఇతరులను నొప్పించకుండా నన్ను కర్మలు చేయనీ. ఇది మూడవవిషయం. 'నావాళ్ళు' అని అనుకునేవారి మీద కూడా నాకు హక్కులేదు. అంతేకాదు, నా దేహం మీద కూడా నాకు హక్కులేదు. లోకకళ్యాణం పేరుతో నా దేహాన్ని శిథిలం చేసే హక్కు నాకు లేదు. లోకకళ్యాణం పేరుతో నా మనసును కష్టపెట్టే హక్కు కూడా నాకు లేదు. ఎందుకని? అది నేను కాదు. నాకు దేహముంది, దేహం నేను కాదు. నాకు మనసుంది, మనసు నేను కాదు. నేను కాని నిన్ను బాధపెట్టే హక్కు నాకెలాగైతే లేదో, నేనుకాని నా మనసును బాధపెట్టే హక్కు కూడా నాకు లేదు. నేను కాని నీ దేహాన్ని హింసించే హక్కు నాకెలాగైతే లేదో, నేను కాని నా దేహాన్ని హింసించే హక్కు కూడా నాకు లేదు. నీ దేహానికి నా దేహానికి - రెంటికి భిన్నమైనవాడిని నేను. నీ దేహం ఎలా వచ్చిందో నా దేహమూ అలాగే వచ్చింది. నీ దేహం ఎలా పోతుందో నా దేహమూ అలాగే పోతుంది. నీ దేహాన్ని నేను నిలపలేను. అలాగే ఎంత ప్రేమించినా నా దేహాన్ని పోకుండా నేనాపలేను. పట్టుకున్నా నిలవనివి, ఆపలేనివి ఎలాపోతే మాత్రం నేను చేయగలిగినది ఏమిటి, ప్రసాదంగా స్వీకరించడం తప్ప? కనుక భగవాన్! దారి తప్పడం దోషం కాదు. ప్రయాణం సుదీర్ఘమైంది. చాలా దూరప్రయాణ మిది. దారి తెలియదు. గమ్యం చేరాలనే ఆత్రుత మాత్రమే ఉంది. అంతదూర ప్రయాణంలో సాగేటప్పుడు, అనేక మలుపులు తిరుగుతూ, అనేక రహదారుల్లో ప్రయాణం చేసేటప్పుడు నేను ఎక్కడ దారి తప్పుతానో! అలా దారి తప్పడం తప్పా? దోషమా? దారి తప్పిన నేను తిరిగి దారిలోకి రావడానికి ప్రయత్నించక పోవడం దోషం. తండ్రీ! ఈ ప్రపంచంలో ఎవ్వరైనా ఏ తప్పైనా చేయవచ్చు. ఎందుకని? తప్పులకన్నా మేము ఏమి చెయ్యగలం? ఒప్పులు చేసే సామర్థ్యం మాకు ఎక్కడుంది? అనేక జన్మల్లో తప్పులు చేయడానికే అలవాటు పడ్డ మనిషి ఈ రోజు తప్పులు చేయకుండా ఎలా ఉంటాడు? తప్పు చేయడం తప్పుకాదు కానీ, ఆ తప్పు నుంచి విడిపడటానికి ప్రయత్నం చేయకపోవడం చాలా పెద్ద తప్పు. వీటికి సంబంధించిందే జ్ఞానం. ఇదే దూరమైతే అనేకమైన పనులు చేయడం వల్ల ఏమి ఉపయోగం? జ్ఞానరహితంగా చేసిన మౌఢ్యమైన కర్మల్లో నేనేం పొందుతాను? జ్ఞానం లేని కర్మల్లో ఏమున్నాయి రాగద్వేషాలు తప్ప? ఈర్ష్యాసూయలు తప్ప? తనను తాను పరిమితంగా ఊహించుకొని, ఇతరులను అపార్థం చేసుకోవడం తప్ప? కాబట్టి ఏం పొందాలి? ఎలా పొందాలి? ఎలా ఉండాలి? వీటికి సంబంధించిన అవగాహనే జ్ఞానం. ఈ జ్ఞానం కలిగిన తరువాత దానిని పొందేందుకు ఉత్సాహంతో ప్రయత్నించడం, నిరుత్సాహం లేకుండా జీవించడం. నిరంతర ప్రయత్నంలో నిరంతర తృప్తి - ఇదే కర్మయోగం. కాబట్టి ఏం పొందాలో తెలుసుకోవడం జ్ఞానం; దానిని పొందేందుకు ప్రయత్నించడం కర్మయోగం. ప్రసాద మనస్తత్వం, అహంకారం లేనటువంటి స్థితి, జీవితాన్ని అర్థం చేసుకుంటూ ముందుకు పోవడం - ఇదే కర్మ యోగము. కర్మయోగము, జ్ఞానము - ఈ రెండు నాలో ఉంటే ఇక పరమాత్మకు నాకు మధ్య దూరమేది?

ఈ దేహం క్షేత్రం. **'ఇదం శరీరం కౌన్తేయ క్షేత్రమి త్యభిధీయతే'.** ఈ దేహాన్ని క్షేత్రము అంటారు, పొలము కూడా క్షేత్రమే. అలాగే తీర్థక్షేత్రం. పాపాల్ని తీర్థ క్షేత్రాల్లో పోగొట్టుకొంటున్నాము. కావలసిన పంటలను పొలాల్లో పండించుకుంటున్నాము. దేహమనే ఈ క్షేత్రంలో పాపప్రక్షాళనం జరగాలి. పశ్చాత్తాపం కదలాలి. ఉన్నదానిని ఉన్నట్లుగా అంగీకరించే మనస్తత్వం కదలాలి.

పొలంలో పంటలను పండించుకున్నట్లే సుగుణ ఫలాలను ఈ దేహంలో తయారు చేసుకోవాలి. మోక్షఫలాలను పండించుకోవాలి. లోకకళ్యాణ మనే సత్కర్మల్ని మొక్కలుగా నాటాలి. నా పొలంలో నేను నాటకపోతే ఎవరు నాటుతారు? ఎవరికి అవసరముంది? ఎవరికి సమయముంది? నా ఇల్లు నేను శుభ్రపరచుకోకపోతే ఎవరు శుభ్రపరుస్తారు? నా ఇంటిని, నా ఒంటిని శుద్ధి చేసుకోవలసిన బాధ్యత నామీదే ఉన్నట్లు నా మనసును శుద్ధి చేసుకోవలసిన బాధ్యత కూడా నా మీదే ఉంది. ఈ జ్ఞానకర్మలు రెండూ ఒకే మనిషిలోకి రావాలి. అది తేజోవంతమైన రథం. నరనారాయణులు కూర్చున్న రథం. కృష్ణార్జునులు ఆసీనమై ఉన్న రథం. రథం ఒక్కటే, వ్యక్తులు ఇద్దరు. ఒకే రథంలో ముందు కృష్ణుడు, వెనుక అర్జునుడు. ముందు జ్ఞానం వెనుక కర్మయోగం. ఈ క్షేత్రంలో కూడా దారి చూపే జ్ఞానం ముందుండాలి. నడవడానికి సంసిద్ధంగా గాండీవం ధరించిన అర్జునుడిలాగా కర్మయోగం వెనుక ఉండాలి. చూపేవాడు ముందు, చూచేవాడు వెనుక; నడిపేవాడు ముందు, నడిచేవాడు వెనుక. సంజయుడు చివరిగా చెప్పిందిదే. 'ధృతరాష్ట్ర మహారాజా! ఈ క్షణంలో నా మనస్సులో ఒకే భావం కదులుతూ ఉంది. అదేమిటో తెలుసా?

యత్ర యోగేశ్వరః కృష్ణో యత్రపార్థో ధనుర్ధరః
తత్ర శ్రీ ర్విజయోభూతి ర్ధ్రువా నీతిర్మతిర్మమ

'ఎక్కడైతే యోగీశ్వరుడైన కృష్ణుడు, ధనుర్ధారి అయిన అర్జునుడు ఉంటారో అక్కడ, జ్ఞానము, విజయము, ఐశ్వర్యము, స్థిరమైన నీతి ఉంటాయి'. అదొక్కటే విజయం. మిగతాదంతా అపజయము. ఈ రోజు విజయంగా గోచరించేవన్నీ రేపు అపజయంగా తెలుస్తాయి. ఈ విజయాలన్నీ ఊసరవిల్లి లాగా రంగులు మారేవే. చాలామంది నీతిమంతులు ఉంటారు. పరిస్థితులు తారుమారైతే వాళ్ళ నీతులు గూడా నీరుగారి పోతుంటాయి. పరిస్థితులు అనుకూలంగా ఉన్నప్పుడు నీతులు, నిజాయితీలు, ధర్మాలు ఉండి పరిస్థితులు తారుమారైనప్పుడు అవి ఆవిరైపోతే అవేం ధర్మాలు? కాబట్టి ధ్రువమైన నీతి, చెదరని నీతి కావాలి. కాలంతోగాని, పరిస్థితులతో గాని, విషమ పరిస్థితులు ఎదురైనప్పుడు గానీ, ఏ నీతి, ఏ ధర్మమైతే చెదరకుండా ఉంటుందో, సుస్థిరంగా ఉంటుందో, అదే నీతి. అదే ధర్మం.

కాబట్టి కృష్ణార్జునులు ఇద్దరూ ఒకే చోటికి రావాలి. చూపేవాడు - చూచేవాడు, నడిపేవాడు - నడిచేవాడు, వినిపించేవాడు - వినేవాడు, అనుభవింప జేసేవాడు - అనుభవించేవాడు, ఆదుకొనేవాడు - ఆశీర్వాదాన్ని పొందేవాడు - ఇద్దరూ ఒకే బండి

ఎక్కాలి. ఆలోచింపచేసే జ్ఞానము అనే కృష్ణుడు లేనపుడు ఆచరించే అర్జునుడు ఉండినా సాధించేదేమీ ఉండదు.

"దుర్యోధనా! ఈ పాండవ సేన నాకొక లెక్కా? దీనిని ఒక్క క్షణంలో నేను మట్టుపెట్టగలను. నా శక్తి ఏమిటో నీకు తెలియదు" అన్నాడు భీష్ముడు. "మరి ఎందుకు చెయ్యవు తాత?" అని దుర్యోధనుడు అడిగితే, " ఆ రథంలో ముందు కూర్చుని ఉన్న వ్యక్తిని యుద్ధానికి రాకుండా చెయ్యి. ఆ తరువాత పాండవులు నేల రాలిపోతారో లేదో చూడు. పరమాత్మ అక్కడ ఉన్నంత వరకు నేనేమీ చేయలేను." అని సమాధానం ఇచ్చాడు భీష్ముడు. జ్ఞానం మనలో ఉన్నంత వరకు దుర్యోధనుల్లాంటి పరిస్థితులు యెదురు నిలిచినా అవి ఏమీ చేయలేవు. ఎందుకని? జ్ఞానం అనే యోగీశ్వరుడు మనవద్ద ఉన్నాడు. పరమాత్మ ఎప్పుడైతే తన ముందున్నాడో అర్జునుడు విజయు డయ్యాడు. పరమాత్మ లేనిచోట అతనికి అపజయమే ఎదురైంది. కాబట్టి కృష్ణార్జును లిద్దరూ మనలో ఉండాలి.

తేనెను చూచినప్పుడు తేనెలో పువ్వుల జాడలు వెతకలేము. ఈ తేనెలోని బొట్టు ఏ పువ్వులో నుంచి వచ్చింది అని ప్రశ్నిస్తే సమాధానం చెప్పలేము. అలాగే ఏ పాలలో ఏ గడ్డి సారముందో పట్టలేము. సమీకృతాహారం అయిన పాలను చూచినపుడు అవి అమృతంలాగా కనిపిస్తాయే గాని ఆ ఆవు ఏ గడ్డి తిన్నదో, ఇంకా ఏమేమి తిన్నదో, ఏమి తింటే ఆ పాలు తయారైనవో ఆ పదార్థాల అడుగుల్ని, జాడల్ని పాలల్లో పట్టలేము. కనుక పువ్వుల జాడలు తెలియని తేనె స్థితి అది. గడ్డి అడుగుల్ని పట్టుకోలేని పాలయొక్క పరిస్థితి అది. దానిని మనం పట్టుకోవాలి. మళ్ళీ విడిపోకుండా పట్టుకోవాలి.

పట్టుకొని వదిలిపెట్టేవి ఈ ప్రపంచంలో చాలా ఉన్నాయి. పట్టుకున్నప్పుడు అవి చేజిక్కినట్లే ఉంటాయి. దూరమైనప్పుడు గుండెలు పగిలిపోతూ ఉంటాయి. బాంధవ్యాలను పట్టుకున్నాం, ధనాన్ని పట్టుకున్నాం, పేరు ప్రఖ్యాతుల్ని పట్టుకున్నాం, ఆరోగ్యాన్ని పట్టుకున్నాం, ఆయుష్షును పట్టుకున్నాం. ఒక్కొక్కటి, ఒక్కొక్కటి, ఒక్కొక్కటిగా మోసంచేసిపోతూఉంటే మీరు పోయారా! మీరుపోయారా! మీరూ పోయారా! అంటూ వీడుకోలు పలుకుతూ ఉన్నాం. పోకుండా ఉండేది ఏదో దాన్ని వెతికి పట్టుకోవాలి.

పట్టుకొని పోగొట్టుకోవడం కాకుండా, పోగొట్టుకొని దుఃఖించడం కాకుండా, పట్టుకున్న దాన్ని నిలుపుకునే ప్రయత్నం చేయాలి. అలా కానిచో నిరీక్షిస్తూ వర్షించని మేఘాలే అవుతామో, వేచి ఉంటూ వికసించని మొగ్గలుగానే మిగులుతామో ఊహించలేము.

వెలిగించుకోవడం జరుగుతూ ఉంది. ఆరిపోవడం కూడా జరుగుతూనే ఉంది. పోగొట్టుకోకుండా పట్టుకునే పరిస్థితిని, వెలిగించుకొని కాపాడుకొనే కార్యాలను ఆవిష్కరించే కార్యక్రమానికి మనం నేడే శ్రీకారం చుట్టాలి.

ధర్మజ్యోతి

నీవు దెబ్బ తినకుండా ఇతరులను దెబ్బ కొట్టలేవు - ఇది అనివార్యమైన జీవ ధర్మం. నీ చేతితో ఎదుటి వ్యక్తి చెంపపై కొట్టినా, లేదా, నీ చేతితో నీరు తడిపి పిండిని పిసికినా, మరొక వ్యక్తి చెంపపై పడిన దెబ్బ, నుజ్జుగా మారిన పిండి నీకు కనిపిస్తాయే గాని ఈ మధ్యలో నీ చేతికి తగిలిన దెబ్బ, నీ అరచేతిలో నలిగిపోయిన మాంసకండరాలు నీకు గోచరించవు.

దురద ఉంటే ఉండొచ్చు. గోకడమే ప్రధాన మనిపించవచ్చు. అందుకు చెట్టు కాండమే ఆలంబనము కావచ్చు. గోకడం తీవ్రం కావడం వలన చెట్టు బెరడు కూడా కొంత ఊడిపోవచ్చు. కాని, ఈ కార్యంలో తన చర్మ మెంతగా చిట్లిపోయిందో గుర్తించగలిగితే, ఇక దానిని గేదె అని ఎవరూ పిలవరు.

సంఘర్షణకు గురి కాకుండా తప్పు చేయడం ఈ ప్రపంచంలో ఎవ్వరికీ సాధ్యం కాదు. ఆలోచించేవాడు, ఆచరించేవాడు వేరైనపుడు నీవు ఎవరితో కలిసి జీవించాలో నీకే అర్థం కాదు! ఎవరితో కలిసి జీవించినా, రెండవ వాడుగా మిగిలియున్న నీతో నీవు విడిపోయి ఉన్నావని మరొకరికి తెలియకపోవచ్చు. కాని, నీకు స్పష్టంగా తెలుసు. ఇదే వ్యక్తిత్వంలో సంఘర్షణ. ఇదే వ్యక్తిలో సమస్య.

సమస్యలతో, సంఘర్షణలతో కూడుకొన్న వ్యక్తి సమాజంలో సామరస్యంతో జీవించలేడు. సమన్వయం కుదరని కారణంగా సంయమనంతో బ్రతుకలేడు. ఇక్కడే జీవితం ముక్కలైనట్లు తెలుస్తూ ఉంటుంది. జీవి శిథిలమైనట్లు గోచరిస్తూ ఉంటుంది. ఆంతర్యంలో ఇలా భగ్నమైన వ్యక్తి విశ్వంలో ఏమి సాధిస్తాడు? ధనం సాధిస్తాడు. పదవులు సాధిస్తాడు. ఆస్తులు సంపాదిస్తాడు. అంతస్తులు పెంచుకుంటాడు. కాని, గుండె బరువును దించుకోలేడు. కన్నీటి చెరువుగా బ్రతుకును మార్చుకోకుండా ఉండ లేడు.

నీ సుఖం కొరకు ధనార్జన చేసుకొంటే తప్పు లేదు. కాని, అది మరొకరి సుఖాన్ని కాలరాచే టప్పుడు నీకు దానివలన సుఖం ప్రాప్తిస్తుందని భావించడం తెలియనితనమే అవుతుంది. నీవు వ్యక్తిగతంగా పెంచుకున్న లేదా ఉంచుకున్న విలువ మరొకరి జీవితంలో వెలితిని సృష్టిస్తే దానివలన అతని విషయం ఏమో గాని నీకు మాత్రం వెలుగు మిగలదు.

వ్యక్తిధర్మం సమాజధర్మంతో సంఘర్షణకు గురి కాకూడదు. అలాగే సామాజిక ధర్మం దేశధర్మంతో ఘర్షణకు దిగకూడదు. అలాగే దేశధర్మం విశ్వధర్మాలతో విభేదించ కూడదు. ఇది ఇలా జరుగనినాడు విశ్వము, విశ్వములో వసించే వ్యక్తి ఇరువురు సంఘర్షణకు గురి అవుతారు. కయ్య ముంటుందే గాని కళ్యాణ ముండదు.

దుర్యోధనుడికి రాజ్యం కావాలి. ధర్మరాజుకి రాజ్యం అవసరం లేదా? అదే వాస్తవమైతే 'కురుక్షేత్రం' అనే పేరు వినిపించి ఉండేదేనా? రాజ్యం ఇద్దరికీ కావాలి.

రాజ్యసుఖాలు ఇద్దరికీ కావాలి. అయితే ధర్మంతో సాధించాలంటాడు ధర్మరాజు. అధర్మంతో నైనా సరే, సాధించడమే ముఖ్య మంటాడు దుర్యోధనుడు. తనది అధర్మమైనా సరే, తన కొరకు ధర్మం చెడిపోయినా సరే, తాను సుఖించడమే ముఖ్యమనుకుంటాడు దుర్యోధనుడు. తమను కష్టాలు వరించినా, కన్నీరు ముంచినా, ధర్మం రక్షింపబడితే తాము బాధలకు గురి అయినా సిద్ధమే నంటాడు ధర్మరాజు.

అధర్మంతో చరించిన దుర్యోధనుడు తాత్కాలికంగా సుఖించినా దుర్గతిని పొంది శాశ్వతంగా అపకీర్తి పాలయ్యాడు.

ధర్మంతో చరించిన ధర్మరాజు తాత్కాలికంగా వ్యథ చెందినా సద్గతిని పొంది శాశ్వతంగా కీర్తిమంతుడై శోభించాడు.

ధర్మం తెలిస్తే సరిపోదు. అధర్మంగా చరిస్తే జీవితంలో తాను పోగొట్టుకొనే దేమిటో కూడా మనిషికి తెలిసిరావాలి. అప్పుడే జీవన రథచక్రాలు ధర్మ రహదారిపై దొర్లిపోతాయి.

జానామి ధర్మం న చ మే ప్రవృత్తిః జానా మ్యధర్మం న చ మే నివృత్తిః

"నాకు ధర్మం తెలుసు. కాని, దాని నెన్నడూ అనుసరించలేదు. నాకు అధర్మం తెలుసు. కాని, దాని నెన్నడూ విడిచి ఉండలేదు" - ఇది దుర్యోధన ఉవాచ.

ధర్మాధర్మాలు పుస్తకాల్లో ఉంటాయి. ధర్మరహస్యాలు మహాత్ముల మస్తకాల్లో శోభిస్తుంటాయి. కనుకనే మహాత్ములను ఆశ్రయించాలి. బోధను ఆలకించాలి. బుద్ధిని సరిదిద్దుకోవాలి. బ్రతుకును పరిమళింప చేసుకోవాలి.

ధర్మాన్ని అధిష్ఠానంగా భావించి జీవించే వారందరూ యుధిష్ఠిరులే. ధర్మరాజులే. అలా జీవించే శక్తిని ప్రసాదించే పవిత్రాత్ములందరూ గాంగేయులే. భీష్ములే.

కర్మఫలము ఏదైనా మనం తయారుచేసుకొనేదే. ప్రయత్నించి పొందేది మాత్రమే. కర్మ ప్రయత్నమైతే ప్రయత్న ఫలితమే కర్మఫలం. కర్మ తరువాతే ఫలం కనుక కర్మకు ముందు లేదు. అనుభవం తరువాత ఉండబోదు. అందుచేత కర్మఫలం అనిత్యము. ఇది అర్థమైతే, ఆ క్షణం నుండే కర్మలలో ఆవేశాలు అంతరించి అవగాహనలు చిగురించటం మొదలవుతుంది.

ధర్మ జీవనం

'నేను గాయపడాలి' అని ఎవ్వరూ కోరుకోరు. శారీరకంగా కాని, మానసికంగా కాని తనను మరొకరు గాయపరచటం ఎవ్వరూ అంగీకరించరు. తన సంపదను మరొకరు అపహరిస్తే భరించలేరు. తన విషయంలో మరొకరు అమానుషంగా ప్రవర్తిస్తే సహించలేరు. ఈ విషయంలో అందరము ఒకే విధంగా ఆలోచిస్తున్నాం.

'నేను సుఖపడాలి' అని అందరూ కోరుకుంటారు. నాకు తృప్తి కలిగేలా ఇతరులు ప్రవర్తించాలి అని వాంఛిస్తారు. ఇతరులు తమకు సహాయం చేయాలని భావిస్తారు. తనపట్ల అందరూ సౌజన్యంతో వ్యవహరించాలని అభిలషిస్తారు. ఈ విషయంలో కూడా అందరమూ ఒకే విధంగా ఆలోచిస్తున్నాం.

నేను గాయపడాలి అని మనమెలా అభిలషించమో, ఇతరులు కూడా బాధలను అభిలషించటం లేదు. నేను సుఖపడాలి అని మనమెలా కాంక్షిస్తున్నామో ఇతరులు కూడా అలాగే కోరుకుంటున్నారు.

మనకు ఏది జరిగితే మనం భరించలేమో దానిని ఇతరులు కూడా భరించలేరేమో? ఇతరులు మనపట్ల ఎలా ఉండాలని మనం కోరుకుంటున్నామో అలా మనం ఇతరుల పట్ల ప్రవర్తించాలి. ఇది ధర్మం. జయానికి మూలం.

ధర్మాన్ని బోధించటానికి శాస్త్రం అవసరం లేదు. ధర్మం మనిషికే తెలుసు. ప్రతి మనసుకీ తెలుసు. అలా నీకు తెలిసిన ధర్మాన్ని శాస్త్రం నిర్ణయిస్తూ వుంది. నీకు అస్పష్టంగా తెలిసిన విషయాన్ని స్పష్టంగా శాస్త్రం నిరూపిస్తూ ఉంది. అంతేకాదు. ఒకవేళ అధర్మాన్ని నీవు ఆచరిస్తే చట్టం నుండి తప్పించుకోవచ్చునేమో గాని ధర్మం నుండి, దైవం నుండి ఎలా తప్పించుకోలేవో కూడా విశదీకరిస్తుంది. ఇక్కడే శాస్త్రం ధర్మశాసనమై శోభిస్తోంది.

అధర్మంగా చరించాలని, అన్యాయంగా జీవించాలని ఎవ్వరి మనస్సు కూడా ఒప్పుకోదు. ఈ విషయంలో హంతకుడు కూడా మరోలా లేడు. మరి, తెలిసి మనిషి తప్పు ఎందుకు చేస్తాడు? అనుభవాల ఒత్తిడి చేత, గతం తగిలించిన సంకెళ్ళ నుండి విడిపడలేక.

గతం మంచిది కాకపోవచ్చు. అంతమాత్రాన వర్తమానంలో చీకటిలో ఎందుకు పరిభ్రమించాలి?. అజ్ఞానం చేత గతంలో మోసాలు చేసి ఉండొచ్చు. ద్రోహాలు చేసి ఉండొచ్చు. దానిని అంగీకరించాలి. నేడు అలాంటి దోషాలు కదలకుండా స్ఫూర్తిదాయకమైన ఆలోచనా విధానాన్ని అలవరచుకోవాలి.

యతో ధర్మః తతో జయః

'ధర్మమున్న చోట జయముంటుంది' అని మహాభారత సూక్తి. ఇదే మహాత్ములకు స్ఫూర్తి. 'అధర్మమున్న చోట అపజయ ముంటుంది' అనేది కూడా దానిలో అంతర్లీనంగా శోభించే దీప్తి.

సుఖించడ మనేది జీవన విధానం. ఆలోచనా సరళి. ఆచరణ వైభవం. మోసాలు, మాయలవల్ల అవసరం లేనివాటిని సంపాదించి ప్రక్కన పెట్టుకోవచ్చు. కాని, సుఖించ లేము.

హంతకులలో ఎక్కువ శాతం త్రాగుబోతులే. ఎందుకో తెలుసా? అన్నం తినకుండా బ్రతకలేరు. త్రాగకుంటే అన్నం తినలేరు. కారణం? వాళ్ళు తినే అన్నం రక్తంతో తడిసి ఉందని తెలియకుండా ఉండాలంటే వాళ్ళ కంటిపై పొరలు కప్పాలి. అది మత్తుపానీయానికే సాధ్యం.

తప్పు చేశాం; మోసం చేశాం; అనే ఆలోచనా తరంగాలు కదిలే మనస్సు ఎన్నడూ నిర్మల సరోవరం కాలేదు. గుండెల్లో గునపాలు దించుకొని ఫేస్ పౌడర్లతో కళకళలాడాలని భావించటంలో అర్థం లేదు. ఆనందముండదు. మోసాలు లేకుండా, ద్రోహాలు లేకుండా భగవంతుడు ప్రసాదించిన దానితో తృప్తిగా జీవించటంలో ఉన్న హాయి మరోలా యాతన పడటంలో లభించదు.

తప్పు చేయటం మనిషికి క్రొత్త కాదు. ఈ విషయంలో ధర్మరాజులెవ్వరూ లేరు. తప్పు చేయటం అందరికీ సహజమే. తప్పుడు ఆలోచనలు చేయటం, అర్థరహితమైన తర్కంతో కప్పిపుచ్చుకోవాలని ప్రయత్నించటం కూడా మనుషులకు మామూలే. కాని, వీటివల్ల అశాంతి పెరుగుతుందే గాని శాంతి లభించదు అనే సత్యాన్ని గ్రహించిన క్షణం నుండే బ్రతుకులో పరిణామం చూడవచ్చు. పరివర్తనను గాంచవచ్చు. మనస్సు తేలికపడేది ఇక్కడే. హృదయం చల్లబడేది ఇక్కడే.

ఇతరులను మోసం చేసి ఆంతరంగిక నేరబుద్ధితో ముఖాన ముడతలు పెంచుకొన్న వారితో, నేరాలకు బలియై మోయలేని గుండె భారంతో ముఖాన ముడతలు దించుకున్న వారితో నిండిన సమాజం కళ్యాణంతో శోభించలేదు.

ధర్మం అమృతము వంటిది. అది బ్రతుకుకు జీవం పోస్తుంది. అధర్మం విషం లాంటిది. అది బ్రతుకును అంతం చేస్తుంది.

ప్రారంభంలోనే గుర్తించబడితే 'క్యాన్సరు' వ్యాధిని నయం చేయవచ్చు అన్నారు ఇటీవల నాతో ఒక పెద్ద డాక్టరు. అదేమోగాని, అధర్మ జీవనాన్ని ప్రారంభంలోనే గుర్తించి ఎండగడితే ఆ తరువాత, కాదు కాదు; ఆ క్షణం నుండే బ్రతుకులో పండుగ తొంగి చూస్తుంది.

అధర్మంగా చరించటం అసమర్థత కాదు; దోషమూ కాదు. అధర్మజీవనాన్ని అంగీకరించలేని స్థితియే నిజమైన అసమర్థత, అసలైన దోషం.

అధర్మ ఊబిలో చిక్కుకొని ఆరాట పడటమా? అధర్మాన్ని అణచేందుకు పోరాటమును సాగించటమా? ఇది నిర్ణయం కావాలి. నిర్ణయం కాగానే, నిజమైన పోరాటము ప్రపంచంతో కాదని, మన మనస్సుతోనే నని మన ప్రవర్తనతోనే నని గుర్తించాలి. ఇదే జీవన సమరం. అట్టి జీవుల బ్రతుకే అమరం. అధర్మానికి చోటివ్వకండి. ధర్మజీవనంతో శోభించి శాంతించండి.

అనివార్యములు - అవగాహనలు

ఇందులో...

